N. GOPI SAHITHYAM – VASTHU RUPA VIVECHANA

A Thesis submitted to the UNIVERSITY OF HYDERABAD in partial fulfillment of the Degree of

Doctor of Philosophy

in

Telugu

by

Sri Latha

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad–500 046
Telangana State

June -2016

ఎన్. గోపి సాహిత్యం – వస్తు రూప వివేచన

పిహెచ్.డి. పట్టాకోసం

హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధనా వ్యాసం

పరిశోధన

శ్రీ లత

పర్యవేక్షణ

ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నా రాణి

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు – 500 046

తెలంగాణ రాష్ట్రం

జూన్ – 2016

CERTIFICATE

This is to certify that the Thesis entitled ***'N. Gopi Sahithyam – Vasthu Rupa Vivechana'*** submitted by ***Ms.Sri Latha*** bearing Regn. No. 11HTPH08 in partial fulfillment of the requirements for the award of **Doctor of Philosophy** in Telugu is a bonafide work carried out by her under my supervision and guidance.

The dissertation has not been submitted previously in part or in full to this or any other University or Institution for the award of any degree or diploma.

Prof. S. Saratjyothsna Rani
Research Supervisor

Head, Department of Telugu

Dean, School of Humanities

DECLARATION

I, **Sri Latha** hereby declare that this Thesis entitled ***'N. Gopi Sahithyam – Vasthu Rupa Vivechana'*** submitted by me under the guidance and supervision of **Prof. S. Saratjyothsna Rani** is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I do hereby agree that this can be deposited in Shodganga / Inflibnet.

Sri Latha
Regn. No. 11HTPH08

Date:

విషయసూచిక

కృతజ్ఞతలు vi

ముందుమాట viii

అధ్యాయం – 1

ఆచార్య ఎన్.గోపి – జీవిత రేఖలు 1–14

1.1 కుటుంబ నేపథ్యం

1.2 విద్యాభ్యాసం

1.3 వివాహం

1.4 ఉద్యోగ జీవితం

1.5 గోపిని ప్రభావితం చేసిన వ్యక్తులు, అంశాలు

1.6 రచనా వ్యాసంగం

1.7 గోపి రచనలు – వివిధ భాషల్లోకి పొందిన అనువాదాలు

1.8 అవార్డులు

అధ్యాయం – 2

గోపి కవిత్వం వస్తు, రూప వైవిధ్య పరిణామం 15–89

2.1 వస్తువు

2.2 రూపం

2.3 శిల్పం

2.4 శైలి

2.5 ప్రతీక

2.6 భావచిత్రం

2.7 ఆధునిక తెలుగు కవిత్వ వికాస పరిణామం

2.7.1 భావకవిత్వం

2.7.2 అభ్యుదయ కవిత్వం

2.7.3 దిగంబర కవిత్వం

2.7.4 విప్లవ కవిత్వం

2.7.5 దళిత కవిత్వం

2.7.6 స్త్రీవాద కవిత్వం

2.8 మానవతావాద కవిత్వం
2.9 స్మృతి కవిత్వం
2.10 వస్తు కవిత్వం
2.11 కవిత్వంపై కవిత్వం
2.12 తెలంగాణ ప్రాంతీయ కవిత్వం
2.13 ప్రపంచీకరణ కవిత్వం
2.14 ప్రకృతి కవిత్వం
2.15 దళిత చైతన్య కవిత్వం
2.16 అనుభూతి కవిత్వం
2.17 జలగీతం – దీర్ఘకావ్యం

అధ్యాయం – 3

నానీలు వస్తు విశ్లేషణ, ఒక విశిష్ట ప్రయోగం 90–119
3.1 నానీలు ఆవిర్భావం
3.2 నానీ రూపం
3.3 నానీలు పాదనియమం
3.4 నానీలు విశిష్టత
3.5 మినీ కవిత్వం
3.6 హైకూ
3.7 నానీలు పరిశీలన
3.7.1 మానవ సంబంధాలు
3.7.2 ప్రపంచీకరణ నానీలు
3.7.3 ఆశ – నిరాశ
3.7.4 ప్రాంతీయత
3.7.5 కులం
3.7.6 రాజకీయ నానీలు
3.7.7 స్త్రీ నానీలు
3.7.8 వర్షం/ నీటి నానీలు
3.7.9 ప్రకృతి/పచ్చదన నానీలు
3.7.10 శాంతి నానీలు

3.7.11 తాత్వికత నానీలు

3.7.12 కవిత్వంపై నానీలు

3.7.13 ఉద్యమనానీలు

3.7.14 అభ్యుదయ నానీలు

3.7.15 అమ్మపై నానీలు

అధ్యాయం – 4

యాత్రా చరిత్రకారుడిగా గోపి 120–149

4.1 యాత్ర నిర్వచనం

4.2 యాత్ర ప్రేరణ

4.3 యాత్రా ప్రయోజనం

4.4 యాత్రికుని లక్షణాలు

4.5 యాత్రల వర్గీకరణ

4.6 నేను చూసిన మారిషస్

4.6.1 భౌగోళిక స్వరూపం

4.6.2 భాష

4.6.3 ఆచార వ్యవహారాలు

4.6.4 ఆహారపు అలవాట్లు

4.6.5 వింతలు విశేషాలు

4.6.6 అంతర్జాతీయ సదస్సు విశేషాలు

4.7 నా సైప్రస్ యాత్ర

4.7.1 దుబాయ్ విశేషాలు

4.7.2 సైప్రస్ భౌగోళిక స్వరూపం

4.7.3 సైప్రస్ – సందర్శనా స్థలాలు

4.7.4 కాన్ఫరెన్స్ విశేషాలు

4.7.5 కవి హృదయం

4.8 అమెరికాలో తెలుగు యాత్ర

4.8.1 అమెరికన్ల మనస్తత్వం

4.8.2 అమెరికా విశేషాలు

4.8.3 అమెరికా రోడ్డు వ్యవస్థ

4.8.4 అమెరికా సందర్శన స్థలాలు
4.8.5 అమెరికాలో తెలుగు అభివృద్ధి – తెలుగు వారి కృషి
4.9 ఇంగ్లండ్ లో ఇరవై ఐదు రోజులు
4.9.1 రోడ్డు వ్యవస్థ
4.9.2 ఇంగ్లండ్ ప్రజల మనస్తత్వం
4.9.3 ఇంగ్లండ్ రచయితలు
4.9.4 వింతలు విశేషాలు
4.9.5 ఆక్స్ ఫర్డ్ – ఆణిముత్యాలు
4.10 జర్మనీలో కవితా యాత్ర
4.10.1 బెర్లిన్ నగర విశేషాలు
4.10.2 హ్యాంబర్గ్ నగర విశేషాలు

అధ్యాయం – 5

విమర్శకుడిగా గోపి 150–190
5.1 విమర్శ – నిర్వచనం
5.2 విమర్శకుడి లక్షణాలు
5.3 నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం
5.4 గవాక్షం
5.5 సాలోచన
5.6 వ్యాస కలశం

అధ్యాయం – 6

పరిశోధకుడిగా గోపి 191–239
6.1 పరిశోధన – వివరణ
6.2 ప్రజాకవి వేమన
6.3 వ్యాస నవమి
6.4 వేమన పద్యాలు పారిస్ ప్రతి
6.5 ఇతరాలు
6.5.1 అక్షరయానం (కాలమ్స్)

6.5.2 జ్ఞానదేవుడు (అనువాదం)

6.5.3 వ్యాఖ్యాత

ముగింపు 240–244

అనుబంధం 245–249

పరిశోధన ప్రధాన ఆకరాలు 250–251

ఉపయుక్త గ్రంథసూచి 252–255

కృతజ్ఞతలు

పి.హెచ్.డి. పరిశోధన చేయడానికి అవకాశం కల్పించిన హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయానికి ముందుగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

నా ఆసక్తిని గమనించి పరిశోధనాంశాన్ని సూచించి, తమ పర్యవేక్షణలో పరిశోధన చేయడానికి అవకాశం కల్పించి, ఎంతో సహృదయతతో ఆత్మీయంగా పలకరిస్తూ, పరిశోధనకు కావలసిన అమూల్యమైన సలహాలు, సూచనలు చేసి, సమయానికి నా పరిశోధనను పూర్తిచేయడానికి సహాయ సహకారాలు అందించిన పర్యవేక్షకురాలు ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణిగారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

నాకు పరిశోధన చేయడానికి అవకాశం ఇచ్చిన తెలుగు శాఖాధిపతి అధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

మాకు ఎం.ఏ నుండి పాఠాలు బోధించి పరిశోధనకు మార్గం చూపించిన అధ్యాపకులు ఆచార్య గడ్ల అరుణ కుమారి గారికి, ఆచార్య రేమిల్ల రామకృష్ణ శాస్త్రి గారికి, డా. పిల్లలమర్రి రాములుగారికి, డా. దార్ల వెంకటేశ్వరరావుగారికి, డా. పమ్మి పవన్ కుమార్ గారికి, డా. బాణాల భుజంగరెడ్డి గారికి, డా. డి. విజయలక్ష్మిగారికి, డా. డి. విజయకుమారిగారికి, పూర్వ అధ్యాపకులు ఆచార్య పరిమి రామనరసింహంగారికి, ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారికి, ఆచార్య ఎన్.ఎస్. రాజుగారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

నాకు సకాలంలో డి.టి.పి. చేసిచ్చిన శ్రీమతి రాధాకుమారి గారికి, బోధనేతర సిబ్బంది భవానీశంకర్ గారికి, మరియు రాంబాబు, గణేశ్ గారికి కృతజ్ఞతలు.

గొప్ప కవి, పరిశోధకుడు అయిన డా. ఎన్. గోపి గారు తనపై పరిశోధన చేస్తున్నానని చెప్పగానే ఎంతో బిజీగా ఉన్నా తన విలువైన సమయాన్ని కేటాయించి నా పరిశోధనకు అవసరమైన పుస్తకాలను, సూచనలను, సలహాలను ఇచ్చిన సహృదయులు డా. ఎన్. గోపి గారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. వారి ఇంటికి ఎప్పుడెళ్ళినా ఆప్యాయంగా పలకరించి, ఆత్మీయ ఆతిథ్యాన్నిచ్చిన ఎన్. అరుణ మేడమ్ గారికి కృతజ్ఞతలు. నా పరిశోధనకు

కావలసిన గ్రంథ సహాయాన్ని అందించిన ఇందిరాగాంధీ స్మారక గ్రంథాలయం, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం వారికి, ఆంధ్ర విశ్వవిద్యాలయం వారికి మరియు తెలుగు విశ్వవిద్యాలయం గ్రంథాలయం వారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

నేను పిహెచ్.డి. వరకు చదవడానికి ప్రోత్సాహాన్నిచ్చిన కుటుంబ సభ్యులకు మరియు నాకు సహాయ సహకారాలు అందించిన నా తోటి మిత్రులకు, అందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

శ్రీ లత

ముందుమాట

ఆధునిక తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియలలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న కవి, పరిశోధకుడు ఎన్. గోపి. ఆధునిక కవిత్వంపై నాకున్న అభిరుచి వల్ల పర్యవేక్షకురాలి సలహాతో గోపి సాహిత్యాన్ని పిహెచ్.డి. పరిశోధనకు తీసుకోవడం జరిగింది. ఈయన రచనలలో వివిధ కోణాలను పరిశీలించాలనే ఉద్దేశంతో పరిశోధనాంశంగా తీసుకున్నాను. గోపి రచనలలో తంగెడు పూలు, మైలురాయి, జలగీతం, నానీల లాంటి ఎం.ఫిల్ పరిశోధనలు, డా. ఎన్. గోపి రచనలు – పరిశీలన (1998) పిహెచ్.డి ఆంధ్ర విశ్వవిద్యాలయం వంటి పూర్వ పరిశోధనలు వెలువడినా ఏ ఇద్దరి వ్యక్తుల భావాలు, ఆలోచనలు, దృక్కోణాలు ఒకేలా ఉండవన్న భావనతో ఇప్పటి వరకు వెలువడిన మొత్తం సాహిత్యాన్ని పరిశోధనాంశంగా తీసుకున్నాను.

గోపి రచనలు ఇప్పటి వరకు 18 కవిత్వ సంపుటాలు, నానీలు, గోపి నానీలు పేరుతో రెండు నానీ సంపుటాలు వచ్చాయి. 5 యాత్రాచరిత్రలు, విమర్శ, పరిశోధన, వ్యాఖ్యాతగా రాసిన గ్రంథాలు, సాహిత్య సంస్కృతీ సంబంధమైన వ్యాసాలతో రాసిన కాలమ్స్ మొదలైనవి గోపిని వివిధ కోణాల్లో చూపిస్తాయి. ఇన్ని కోణాలను ఒక రచయితలో దర్శించవచ్చన్న ఆసక్తితో ఈ అంశాన్ని పరిశోధనకు ఎంచుకోవడం జరిగింది.

''ఎన్. గోపి సాహిత్యం – వస్తు రూప వివేచన'' అనే పరిశోధనాంశాన్ని మొత్తం ఆరు అధ్యాయాలుగా విభజించాను. మొదటి అధ్యాయం 'ఎన్. గోపి జీవితరేఖలు'లో ఆయన జీవితానికి సంబంధించిన వివిధ అంశాలైన కుటుంబ నేపథ్యం, విద్యాభ్యాసం, వివాహం, ఉద్యోగ జీవితం, ప్రభావితం చేసిన వ్యక్తులు, అంశాలు, రచనా వ్యాసంగం, పొందిన అవార్డులు, గోపి రచనలు వివిధ భాషల్లోకి పొందిన అనువాదాలను వివరించడం జరిగింది.

రెండవ అధ్యాయం ''గోపి కవిత్వం వస్తు రూప వైవిధ్య పరిణామం''లో వస్తువు, రూపం, శిల్పం, శైలి, ప్రతీక, భావచిత్రాల గురించి సూక్ష్మంగా వివరించి, ఆధునిక తెలుగు కవిత్వ వికాస పరిణామాలను వివరించడం జరిగింది. అందులో భాగంగా వచ్చిన భావ కవిత్వం, అభ్యుదయ,

దిగంబర, విప్లవ, దళిత, స్త్రీవాద కవిత్వాలను సూక్ష్మంగా సమీక్షించాను. గోపి కవిత్వంలో కనిపించే మానవతను, స్మృతి, వస్తు, తెలంగాణ ప్రాంతీయ చైతన్యం, ప్రపంచీకరణ, ప్రకృతి, దళిత, అనుభూతి మొదలైన కవిత్వ కోణాలను విశ్లేషించాను. ఆయన కవిత్వాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు ఆయన తీసుకున్న వస్తువులో వైవిధ్యమున్నట్లు గ్రహించాను. ఇలా ఎన్ని రకాల కోణాలున్న ఆయన కవిత్వంలో సామాజికాంశాలు మరియు మానవత్వమే ఎక్కువగా కనిపిస్తుంది.

మూడవ అధ్యాయం 'నానీలు వస్తు విశ్లేషణ, ఒక విశిష్ట ప్రయోగం'లో నానీల ఆవిర్భావం, వాటి విశిష్టతను చెప్తూ, నానీలలో ఉన్న వస్తు వైవిధ్యాన్ని చర్చించడం జరిగింది.

నాలుగవ అధ్యాయం 'యాత్రా చరిత్రకారుడిగా గోపి'లోయాత్ర నిర్వచనాన్ని ఇస్తూ యాత్ర ప్రేరణ, యాత్ర ప్రయోజనాలు, యాత్రికుని లక్షణాలను చెప్తూ రచయిత చేసిన అయిదు యాత్రల విశేషాలను చెప్పాను.

అయిదవ అధ్యాయం 'విమర్శకుడిగా గోపి'లో ఆయన రాసిన 'నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం', గవాక్షం, సాలోచన, వ్యాస కలశంలోని అంశాలను విమర్శనాత్మక దృష్టితో విశ్లేషించడం జరిగింది.

ఆరవ అధ్యాయం 'పరిశోధకుడిగా గోపి'. ఇందులో ఆయన పరిశోధన గ్రంథాలు అయిన ప్రజాకవి వేమన సిద్ధాంత గ్రంథాన్ని, వ్యాసనవమి, వేమన పద్యాల పారిస్ ప్రతులను పరిశీలనాత్మకంగా వివరించడం జరిగింది. ఇంకా ఇతరాలు అన్న విభాగంలో ఆయన అక్షరయానం పేరుతో రాసిన కాలమ్స్, జ్ఞానదేవుడు అనువాదం, వ్యాఖ్యాతగా ఆయన రాసిన వ్యాఖ్యాన పుస్తకాల వివరణలతో నా పరిశోధనకు ముగింపునిచ్చాను. చివరగా అనుబంధంలో కవి, రచయిత, పరిశోధకుడు అయిన గోపి ఇంటర్వ్యూను పొందుపరచడం జరిగింది.

★★★

మొదటి అధ్యాయం

ఆచార్య ఎన్. గోపి – జీవిత రేఖలు

అధ్యాయం – 1

ఆచార్య ఎన్. గోపి – జీవిత రేఖలు

1.1 కుటుంబ నేపథ్యం:

వర్తమాన తెలుగు సాహిత్యంలో ఎన్. గోపి ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ''మంచి మనిషి కాలేనివాడు మంచి కవి కాలేడు''. అనే మాటను నిజం చేస్తూ మానవత్వం పరిమళించే మంచి కవిత్వం రాశారు. కవిగా, విమర్శకుడిగా, వేమన్న పరిశోధకుడిగా, యాత్రాచరిత్రకారుడిగా, అనువాదకుడిగా, కాలమిస్టుగా ఎంతో సారస్వతాన్ని సృష్టించిన ఎన్. గోపి తెలంగాణ ప్రాంతం నల్గొండ జిల్లా భువనగిరిలో చేనేత కుటుంబంలో 25-6-1948లో నక్క లక్ష్మమ్మ, నక్క చెన్నయ్యలకు జన్మించారు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు.

వీరిలో గోపి పెద్ద అక్క ఆండాళమ్మకు 13వ సంవత్సరమే వివాహం జరిగింది కానీ ఆరు నెలలకే కొందరు దుర్మార్గుల దురాగతానికి బలైపోయింది. ఈమె వృత్తాంతాన్ని బల్ల గౌతమయ్య అనే స్థానిక కవి ''నక్క ఆండాళమ్మ ఉయ్యాల పాట'' పేరుతో ఒక పాటను రాశాడు. ఈ పాట ఇప్పటికీ తెలంగాణ పల్లెల్లో వినిపిస్తూనే ఉంది. గొప్ప కవీ, పరిశోధకుడు అయిన ఆరుద్రగారు కూడా తన ''సమగ్రాంధ సాహిత్యం''[1]లో నక్క ఆండాళమ్మ వృత్తాంతాన్ని రాశారు. డా. బండారు సుజాత శేఖర్ ''తెలంగాణ బతుకమ్మ పాటలు – పౌరాణిక, సామాజిక, సాంస్కృతిక భాషా పరిశీలన''[2] అనే పి.హెచ్.డి సిద్ధాంత వ్యాసంలో నక్క ఆండాళమ్మ కథను రాశారు. తెలంగాణ యక్షగాన, జానపద కవి చెర్విరాల భాగయ్య (13-3-1952) రాసిన ఈ రెండు పద్యాలు ఆండాళమ్మకు జరిగిన అన్యాయాన్ని గుర్తు చేస్తాయి.

''క్రూరులైనట్టి తురకల ఘోరకృత్య
 ములకు బలియయ్యు స్వర్గసీమలకు నేగు
 బాలికామణి నక్క ఆండాళు ఆత్మ
 శాంతికొరకయ్యి హరిని ప్రార్థింతు నేను''

---

[1] సమగ్రాంధ్ర సాహిత్యం (4 సంపుటి) – ఆరుద్ర – పేజి-898

[2] తెలంగాణ బతుకమ్మ పాటలు – పౌరాణిక, సామాజిక, సాంస్కృతిక భాషా పరిశీలన – డా. బండారు సుజాత శేఖర్ – పేజి-145

''న్యాయమె న్యాయంబగు, య
న్యాయమె యన్యాయమగును, యవనిలో మాయో
పాయములెంతకు జెల్లును
కాయము శాశ్వతముగాదు గర్వపడంగన్''[3]

అని చెబుతూ ఆండాళమ్మ బతికి లేకున్నా బతుకమ్మలో జీవించే ఉంటుంది అంటారు. ఇది గోపి కుటుంబ నేపథ్యం.

1.2 విద్యాభ్యాసం:

స్కూలు ఫైనల్ వరకు భువనగిరిలో చదివారు. ఇంజనీరింగ్ లో సీటు వచ్చినా కవిత్వం రాసే చేతులతో లెక్కలు చేయలేక బి.ఏ లో చేరి నిజామ్స్ గోల్డ్ మెడల్ ఆధారంగా నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్ పొందారు. ఎం.ఏ ఫలితాలు రాకముందే యునిసెఫ్ లో నాన్-ఫార్మల్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు ఆఫీసర్ గా మహబూబ్ నగర్ జిల్లాలో 50 గ్రామాలకు ఇన్ చార్జిగా పనిచేశారు. అప్పుడు ఆ జిల్లాలోని కరువు, పల్లెల దుస్థితిని చూసి ''అంగీ బరువయ్యింది, అన్నం వెగటయ్యింది'' కవిత రాశారు. ఉద్యోగం చేస్తూనే ''ప్రజాకవి వేమనపై'' పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. ఇది ప్రామాణిక పరిశోధనా గ్రంథంగా పేరు పొందింది. వీరి పరిశోధన ఫలితంగా వేమన గోపిగా మారడమే కాకుండా, తన ఇంటికి ''వేమన నిలయం'' అని పేరు పెట్టుకున్నాడు. గోపి మంచి చదువరి మాత్రమే కాదు. మిమిక్రీ కళాకారుడు కూడా. చదువుకునే రోజుల్లో స్వాగత, వీడ్కోలు పార్టీలు, హాస్టల్ డే ఉత్సవాల్లో తన మిమిక్రితో సహ విద్యార్థుల్నే కాక, ప్రొఫెసర్లను కూడా వినోదింపచేసేవాడు. వీరి మిమిక్రీలో తెలంగాణ యాస లోని ''సత్యనారాయణ వ్రత కథ'' ఎంతో ప్రసిద్ధి చెందింది. ప్రొ. భద్రిరాజు కృష్ణమూర్తిగారు తమ ఇంటికి పిలిపించుకొని మరీ వీరి మిమిక్రీని వినేవారంటే ఇంతకు మించిన అవార్డు, ఆనందం ఏముంటుంది.

1.3 వివాహం:

గోపిది కులాంతర వివాహం. వీరి శ్రీమతి పేరు అరుణ. ఈమె కూడా మంచి రచయిత్రి. 'మౌనమూ మాట్లాడుతుంది', 'పాటల చెట్టు', 'అమ్మ ఒక మనిషి' అనే కవితా సంపుటాలు, 'గుప్పెడు గింజలు' అనే నానీల సంపుటి రాశారు. సాంప్రదాయ కుటుంబం నుండి వచ్చిన

---

[3] వ్యాసకలశం – డా. ఎన్. గోపి – పేజి -17

అరుణ విద్యార్థి దశలోనే గోపిని ఇష్టపడి పెళ్ళి చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. కుమారుడు చైతన్య, కూతురు రచన.

1.4 ఉద్యోగ జీవితం:

ఎప్పుడూ చెదరని చిరునవ్వుతో సామాన్య పల్లెటూరి చిరుద్యోగిని పోలిన వ్యక్తి అంచెలంచెలుగా ఎదిగి వైస్ ఛాన్సలర్ స్థాయికి చేరుకోవడం అంటే దాని వెనుక ఎంతో కృషి ఉంటేనే గానీ సాధ్యంకాదు. యూనిసెఫ్ లో నాన్ ఫార్మల్ ఎద్యుకేషన్ ప్రాజెక్టు ఆఫీసరుగా మొదటి ఉద్యోగం చేశారు. హైదరాబాద్ లోని నానక్ రామ్ భగవాన్ దాస్ కళాశాలలో లెక్చరర్ గా 6 సంవత్సరాలు పని చేశారు. 1981 నుండి ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో లెక్చరర్ గా, రీడర్ గా, ప్రొఫెసర్ గా, పాఠ్య ప్రణాళికా సంఘం అధ్యక్షుడిగా (1992-94), తెలుగు శాఖాధిపతిగా (1994-96), అసిస్టెంట్ చీఫ్ వార్డెన్ గా (1989-90) పనిచేశారు, తెలుగు విశ్వవిద్యాలయానికి (పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం) వైస్ ఛాన్సలర్ గా (1992 - 2002) చేశారు. భారతదేశంలోనే అతి చిన్న వయస్సు గల వైస్ ఛాన్సలర్ గా (యంగెస్ట్ వైస్ ఛాన్సలర్ గా) పేరు పొందారు. అలాగే కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయాలకు ఇన్ చార్జి వైస్ ఛాన్సులర్ గా (2001) పనిచేశారు. పరిపాలనా విషయంలో ఖచ్చితమైన విలువలను పాటించారు. వి.సి పదవిలో ఉండి కూడా తన గురువు సినారె లాగా రచనా వ్యాసంగాన్ని కొనసాగించారు. ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పటికీ అధికార వ్యామోహం ఉండేది కాదు. ఆయన తరుచుగా 'పదవి మూడేళ్ళు – పెదవి నూరేళ్ళు' అనేవారు.

''ఒక కవికి పరిపాలనా పరమైన బాధ్యతలు అప్పగిస్తే ఎలా ఉంటుందో ముందుగా సినారె గారి దగ్గర చూశాను. తర్వాత గోపి గారి దగ్గర చూశాను. తాను మనస్సుతో ఆలోచించడం, ఎదుటి వాడి మనస్సు గురించి ఆలోచించడం ఇది చాలా స్పష్టంగా కన్పించేది వీరి పాలనా విధానంలో. సినారె గారి ఆర్ధ్రత రాజసంగా ఉండేది. వారిది శ్రీనాథుడి ఫక్కీ. గోపిగారి ఆర్ధ్రత దిగంబరంగా ఉండేది. వీరిది వేమన మార్గం కదా!'' అంటారు బేతవోలు రామబ్రహ్మంగారు. వీరికి తెలుగు విశ్వవిద్యాలయంతో 14 ఏళ్ళ అనుబంధం ఉంది.

పరిపాలకుడికి జా.గు – రా.గు (జాలిగుండె – రాతిగుండె) రెండూ ఉండాలని సినారె అంటూ ఉండేవారు. ఈ రెండూ గోపిగారిలో ఉన్నాయన్నారు బేతవోలు రామబ్రహ్మంగారు.''[4]

గోపిగారు రాష్ట్రస్థాయిలో వివిధ కమిటీలకు మెంబర్ గా కూడా పని చేశారు. ఇంటర్నేషనల్ తెలుగు టీచర్స్ అసోసియేషన్ కి ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా (1996), ఫీచర్ ఫిల్మ్ నంది అవార్డు కమిటీకి జ్యూరీ మెంబర్ గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున (1996) పని చేశారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమికి మెంబర్ గా (1984), తెలుగు విశ్వవిద్యాలయానికి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా (1999), కేంద్ర సాహిత్య అకాడమి న్యూఢిల్లీ అడ్వయిజరీ కమిటీకి మెంబర్ గా (2002-03), నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాకు మెంబర్ గా (2006) పనిచేశారు.

1.5 గోపిని ప్రభావితం చేసిన వ్యక్తులు, అంశాలు:

నిరక్షరాస్యుల కుటుంబంలో పుట్టి, తొలి తరం విద్యావంతుడైన గోపి చిన్న వయసులోనే గ్రంథ పఠనాభిలాషను పెంచుకొని మంచి స్నేహితులు, ఉత్తమ ఉపాధ్యాయుల సహవాసంతో తన కవితా వ్యక్తిత్వాన్ని మలుచుకున్నారు. ''నేను స్వాప్నిక కవిని కాదు. నా మట్టిలో పూచిన పువ్వులు నా కలలు. మట్టి వాసన నా కవిత్వంలో ప్రధాన గుణం. నీళ్ళు లేని మెట్ట ప్రాంతంలో పుట్టడం వల్ల రాతి గుట్టలే నా నేస్తాలు. వాటిలో నేను నదుల్ని దర్శించాను. కన్నీటి స్రవంతుల్ని అనుభవించాను. ఒక రకంగా ప్రతి కవి కవిత్వం అతని ఎమోషనల్ ఆటోబయోగ్రఫీ అయినట్లే నా కవిత్వం కూడా ఒక వ్యక్తిగత, సామాజిక సమ్మిళిత ప్రక్రియగా మారినట్లు నాకు అనిపిస్తుంది''[5] అంటారు. నిరక్షరాస్యుల రూపంలో ఉన్న మేధావులు కూడా నన్ను ప్రభావితం చేశారు. నా అకడమిక్ పదవులు నా కవిత్వానికి అడ్డురాలేదు. కవిత్వం వాటిని మనిషిలా నిర్వహించేందుకు తోడ్పడింది. కవిత్వం, పరిశోధనా రెండూ నాకు విరుద్ధాంశాలు కాలేదు. ఒక శ్రామికుడూ, ఒక మానవ ప్రేమికుడూ హాయిగా కలిసి పోయారని అన్నారు. గోపి 12వ ఏటనే కవిత్వాన్ని ప్రారంభించి పద్యాలు, గేయాలు రాశారు. వచన కవిత్వంలో అడుగుపెట్టి వెనక్కి తిరిగి చూసుకోలేదు. చిన్నప్పుడే గోపిని సినారె ఎంతో ప్రోత్సహించే వారు. వీరిద్దరి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగేవి. ఆ తర్వాత సినారె గోపికి కాలేజీలో పాఠాలు బోధించే

---

[4] అక్షర (గోపిషష్టిపూర్తి అభినందన సంచిక) – పేజి -45

[5] అక్షర (గోపిషష్టిపూర్తి అభినందన సంచిక) – పేజి -88

గురువయ్యారు. 1965లో 15వ ఏట తొలి కవిత రాశారు. అది మాత్రా ఛందస్సులో ఉన్న గేయం.

పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడు తెలుగు మాష్టారు రామదాసురావు ప్రోత్సాహంతో కవిత్వం రాయడానికి ప్రయత్నించారు. 'భారతి', 'కల గూరగంప' పత్రికల్లో గోపిగారి మొదటి వ్యాసం 'వచన కవిత్వం పద గుంభనం' అచ్చయ్యింది.

'రాసలీల' అనే గేయ సంపుటి గోపిని బాగా ఆకర్షించింది. దీని రచయిత దక్షిణ మధ్య రైల్వేలో ఉద్యోగి అయిన దేవరెడ్డి వెంకటరెడ్డి. ఈయన ఆశువుగా పద్యాలు చెప్పేవారు. పరిచయం పెరిగి పద్యాల్లో ఉత్తరాలు రాసుకునేవారు. ''అన్నా యెన్ని దినాలు రాలినవియో, అజ్ఞాన కాంతార మందిన్నాళ్లీ విధి'' అని గోపి రాస్తే, అందుకు జవాబుగా దేవరెడ్డి వెంకటరెడ్డిగారు–

''సలుపనయితి అతిథి సత్కారములు నీకు
మొన్న వచ్చినప్పుడు నన్ను చూడ
కార్య భారమందు కలత చెందిన కతన
గోపి నీ వొకింత కోపి గాకు''[6]

అని రాసుకుంటుండేవారు. గేయకవిత్వంపై సినారె ప్రభావం, పద్య కవిత్వంపై దేవరెడ్డి వెంకటరెడ్డి, దాశరథి, దువ్వూరి రామిరెడ్డి ప్రభావం ఉండేది. వచన కవిత్వమంతా నా గొంతే అన్నారు గోపి. నార్ల చిరంజీవి వంటి రచయితల బాల సాహిత్యం ఎక్కువగా ఆకర్షించింది. వీరు రాసిన 'శశీ' అనే శతకం హైదరాబాద్ నుండి వెలువడే 'నేత' వారపత్రిక (1967)లో వారం వారం అచ్చయ్యింది. నేత సంపాదకులు రామనర్సయ్య పద్యాలన్నీ పుస్తక రూపంలో రావాలని కోరితే, రసరమ్య పద్య కవి 'రసరాజు' గారు తమ సంపాదకత్వంలో వేస్తానని హామీ ఇచ్చారు అన్న విషయాన్ని తెలియజేశారు.

పల్లెటూరి వాతావరణం, బావులు, చెరువులు, కొండలు, అడవి పూలు, బతుకమ్మలు, తంగెడు పూలు వంటివి గోపిని ప్రభావితం చేశాయని ఆయన కవిత్వం చదివిన వారెవరికైనా

[6] అక్షర (గోపిషష్టిపూర్తి అభినందన సంచిక) – పేజి -57

అర్థం అవుతుంది. గోపికి తంగెడు పూలంటే ఎంతో ఇష్టం. అందుకే తొలి కవితా సంపుటికి 'తంగెడు పూలు' అని పేరు పెట్టారు. ఎన్ని కవితా సంపుటిలు చూసినా అందులో పల్లె నేపథ్యమే కన్పిస్తుంది. అందుకే అమెరికా వెళ్ళినప్పుడు షికాగోలోని 'సియర్స్ టవర్' కన్నా మా ఇంటి అరుగే ఓ బెత్తెడు ఎత్తున ఉంది అని రాశారు. నేనింతటి కవిని కావడానికి నా బాల్య మిత్రులు కారణమంటారు. సాహిత్య వాతావరణం అంతగా లేని మా ఊళ్ళో మిత్రులకు చాయ్ తాగిపించి నా పద్యాలు వినిపించేవాణ్ణి. వారికి కృతజ్ఞతలు చెప్పడం నా విధి అని గుర్తుచేసుకున్నారు.

గోపి తాను రాసిన కవితలను దగ్గరి మిత్రులకు వినిపించడం అలవాటు. ప్రథమ శ్రోత వీరి భార్య. నా కవిత్వంలో మూలాల్ని వెతుక్కోవడం కన్పిస్తుంది. దీనినే నేను 'సామాజిక వేదన' అంటాను. నేను పడిపోయిన వాడి మీద కవిత్వం రాస్తాను. విజయమే కాదు. ఓటమి కూడా నన్ను కదిలిస్తుంది. నేను ఎక్కువగా ప్రయాణాల్లో రాస్తుంటాను. బహుశా నానుంచి చెదిరిపోయిన నేను అప్పుడే నా దగ్గరకు వస్తాను. మొదటి వాక్యం తడబడుతుంది. మిగిలిన కవిత్వం దానంతట అదే వచ్చిపడుతుంది. అంటూ తాను కవిత్వం రాయడానికి ప్రేరణ కల్గించిన విషయాలు, వ్యక్తుల గురించి వివిధ సందర్భాలో పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

''కవితలు సంపుటిగా వేసేటప్పుడు ఎడిటింగ్ చేస్తాను. యువకవుల అభిప్రాయాలు తీసుకుంటాను. నాకు నచ్చిన పంక్తులు నిర్దాక్షిణ్యంగా తొలగించవలసి వచ్చినప్పుడు బాధపడతాను. కానీ పోయెం మెరుగౌతుందన్నప్పుడు ఆ బాధ మర్చిపోతాను. కవిత రాసిచ్చిన తర్వాత దాన్ని కాలానికి రాసిచ్చిన వీలునామాగా భావిస్తాను. కొన్నాళ్ళకు చదివినప్పుడు ఇది నాదేనా అనిపిస్తుంది.'' (కాలాన్ని నిద్రపోనివ్వను – కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు వచ్చినప్పుడు న్యూఢిల్లీలో రైటర్స్ మీట్ కార్యక్రమంలో చదివిన ప్రసంశ వ్యాసంలోనిది).

1.6 రచనా వ్యాసంగం:

గోపి కవిత్వం, పద్యం, పరిశోధన, విమర్శ, యాత్రాచరిత్రలు, అనువాదం మొదలైన ప్రక్రియలను స్పృశించారు. ఇప్పటివరకు 18 కవితా సంపుటాలను వెలువరించారు. స్వీయానుభూతి అందరి అనుభూతిగా మారితేనే కవిత్వమవుతుంది. స్వీయానుభూతిగానే మిగిలితే దానికి సార్వజనీనత రాదు. గాఢత, భావ తీవ్రత ఉత్తమ కవిత్వ లక్షణాలు. అందుకే

గోపి ''అనుభవాలను వ్యక్తం చేసే పెనుగులాటలో ఓడిపోయిన రక్తం గుర్తులు నా కవితలు'' అంటారు.

వీరు రచించిన కవితా సంపుటిలు–

- తంగెడు పూలు (1976)
- మైలు రాయి (1981)
- వంతెన (1993)
- కాలాన్ని నిద్రపోనివ్వను (1998). దీనికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు (2000) వచ్చింది.
- చుట్టకుదురు (2000)
- ఎండపొడ (2002)
- జలగీతం (2002)
- మరో ఆకాశం (2004)
- అక్షరాల్లో దగ్ధమై (2006)
- దీపం ఒక ఏకాంతం (2007)
- గోవాలో సముద్రం (2008)
- వానకడిగిన చీకటి (2009)
- మా ఊరు మహాకావ్యం (2010)
- రాతి కెరటాలు (2011)
- హృదయరశ్మి (2013)
- మళ్లీ విత్తనంలోకి (2014)
- పురి విప్పిన ఊపిరి (2015)

వంటి కవితా సంపుటాలు వెలవరించారు. వీరి షష్టిపూర్తి సందర్భంలో కవితా గ్రంథాలను 'గోపి కవిత్వం' పేరుతో మూడు సంపుటాలుగా వెలువరించారు.

'నానీ'లు (Epigrams) – EPIGRAMS పేరుతో గొప్ప వినూత్న కవితా ప్రక్రియను సృష్టించి 'నానీల నాన్న'గా పేరు పొందారు. వీరికి కవితా ప్రపూర్ణ, నానీల త్రివిక్రముడు అనే

బిరుదులున్నాయి. 1998లో నానీల సంపుటి, 2002లో గోపి నానీలు పేరుతో మరో సంపుటిని వెలువరించారు.

విమర్శ గ్రంథాలు:

వ్యాసనవమి (1986), గవాక్షం (1992), నిలువెత్తు వెలుగు సంతకం – సినారె వ్యక్తిత్వం (1992), సాలోచన (1998).

పరిశోధక గ్రంథాలు:

గోపి అయిదు సంవత్సరాల కృషి ఫలితం 'ప్రజాకవి వేమన' (1980) పి.హెచ్.డి సిద్ధాంత వ్యాసం. ఇది విశ్వవిద్యాలయ పరిశోధనలకు వన్నె తెచ్చిన పరిశోధనా గ్రంథం. ఒక పరిశోధనా అంశం ఇంటి పేరుగా రూపొందడం తెలుగు సాహిత్య పరిశోధనలో ఒక అపూర్వ ఘట్టం. వేమన పద్యాలు (పారిస్ ప్రతి) 1730 A.D 'పారిస్ నేషనల్ బిబ్లియోరికా'లో ఉన్న 1730 నాటి వేమన పద్యాల ప్రతిని 1981లో సేకరించారు. ఇది చాలా పాత ప్రతి. దీనిలో 368 వేమన పద్యాలున్నాయి. ఇంకా తొలి పరిశోధకులు (1998) లాంటి గ్రంథాలు రాశారు.

యాత్రా చరిత్రలు:

- నేను చూసిన మారిషస్ (1996)
- నా సైప్రస్ యాత్ర (2001)
- అమెరికాలో తెలుగు యాత్ర (2002)
- ఇంగ్లాండ్ లో ఇరవై అయిదు రోజులు (2004)
- జర్మనీలో కవితా యాత్ర (2015)

అనువాదం:

జ్ఞానదేవుడు (మరాఠీ గ్రంథం) 1982 తెలుగులోకి అనువాదం చేసి అనువాదకుడిగా పేరు పొందారు. తన్మయ ధూళి (2012) – Poetry translation from Oriya for Sahitya Academy, New Delhi – 2012 అనువాదం చేశారు. ఇంకా వేమన (1979), ప్రజాకవి వేమన (Monograph), తెలుగు వాచకం (VII Class text) 1982, అక్షరయానం (2006) విద్యా సాహిత్య, సంస్కృతీ సంబంధి వ్యాసాలు (Column Writing in India To-day), వేమన వెలుగులు (2012), పోతులూరి వీర బ్రహ్మం సమగ్ర రచనలు,

పాలమూరు మండల జానపద గేయాలు, వీరకాళికాంబశతకం, యాగంటి లక్ష్మప్ప వచనాలు వంటి అనేక రచనలు చేశారు.

27 మంది అనువాదకులు వీరి కవిత్వాన్ని అనువదించారు. వివిధ భాషలలో 30 గ్రంథాలు వెలువడ్డాయి. మనకు అనువాదకుల కొరత ఉంది. అయినా వీరి కవిత్వం వివిధ భాషల్లోకి అనువదించబడింది. అనువాదం వల్ల భాషా సంపద పెరిగి ఇతర భాషల వారికి మన రచనలు పరిచయమవుతాయి. వీరి రచనలు హిందీ, ఇంగ్లీష్ భాషల్లోకే కాక రష్యన్, పర్షియన్ వంటి అంతర్జాతీయ భాషల్లోకి కూడా వెళ్ళాయి.

1.7 గోపి రచనలు – వివిధ భాషల్లోకి పొందిన అనువాదాలు:

'జలగీతం'ను హిందీలోకి ప్రొ. పి. మాణిక్యాంబగారు అనువదించారు. ఈ అనువాదానికి భారత ప్రభుత్వం, మానవ వనరుల మంత్రిత్వశాఖ వారి ఉత్తమ అనువాద పురస్కారం లభించింది. ఇంగ్లీష్ లోకి ప్రొ. ఎమ్. శ్రీధర్, ప్రొ. అల్లాడి ఉమ అనువదించారు. కన్నడంలోకి డా. మార్కండాపురం శ్రీనివాస్, గుజరాతీలోకి శ్రీ రమణిక్ సోమేశ్వర్, పర్షియన్ లోకి అసీజుద్దీన్ ఉస్మానీ, మరాఠీలోకి డా. అనుపమా నిరంజన్ ఉజ్ గరే గారి భర్త కీ.శే. నిరంజన్ ఉజ్ గరేలు అనువదించారు.

కాలాన్ని నిద్రపోనివ్వను: ఆంగ్లంలోకి డా. జె. భాగ్యలక్ష్మి గారు 'ఐ విల్ నాట్ లెట్ టైమ్ స్లీప్' గా 2006లో అనువాదం చేశారు.

హిందీలోకి ఆర్. శాంత సుందరి (2006) – Samai ko Sone nahee dunga గా మలయాళంలో – ఎల్. ఆర్ స్వామి, కన్నడంలో డా. దివాకర్ల రాజేశ్వరి, గుజరాతీలో – శ్రీ రమణిక్ సోమేశ్వర్, అస్సామీలో శ్రీమతి పూర బిబోరా, హిందీ ఆధారంగా సింధీ భాషలోకి శ్రీ చంద్ దూబే, మరాఠీలో డా. కాంచన్ జట్కర్, Bodo లోకి – Arabindo vzir, నేపాలీలోకి – JIWAN Namdung, మైథిలీలో – Bidyanath Jha, కాశ్మీరీలో Azizi hajini, రాజస్థానీలోకి – Chandra Prakash Dewal, సంస్కృతంలో – Prof. C.SR. Krishna Murthy, ఉర్దూలోకి – Prof. Rahamat Yusuf Zai, తమిళంలో Siripi Bala Subramanyam, కొంకిణిలోకి – Ramesh B. Veluskar, పంజాబీలోకి Dr.

Vanitha, డోగ్రీలోకి – Sri Prakash Premi, Prakash Asram, ఇలా 20 భాషల్లోకి కాలాన్ని నిద్ర పోనివ్వను కవితా సంపుటి అనువదింపబడింది.

నానీలు:

హిందీ, మరాఠీ, గుజరాతీ, సంస్కృతం, తమిళం, కన్నడం, రష్యన్, ఉర్దూ భాషల్లోకి అనువదింపబడ్డాయి. హిందీలో 'నన్హేముక్తక్' గా P. Vijaya Raghava Reddy (2005), ఇంగ్లీష్ లో 'The little ones' (2006), రష్యన్ లో Prof. P.vinay Totwar (వినయ్ తోతావర్), మరాఠీలో 'Mukthak Manika' (2008)గా Suresh Ganga Khedkar, కన్నడంలో 'Nanna Ninnavu' (2008) గా Prof. Narayana Prasad, తమిళంలో – Dr. Nalimela Bhaskar, సంస్కృతంలో Dr. M. Vijaya Sree లు అనువదించారు.

గోపినానీలు:

ఈ పుస్తకాన్ని హిందీలోకి 'గోపీ కీ నానీ ముక్తక్' (2008) గా Prof. బి. సత్యనారాయణ, ఉర్దూలోకి 'Nanni Najme' గా 2008లో Dr. Fathima Begum, సింధీలోకి శ్రీ చంద్ దూబే 'నన్హాసా' పేరుతో అనువదించారు.

1.8 అవార్డులు:

కాలాన్ని నిద్రపోనివ్వని కవి. కాలంతో పాటు తాను పయనిస్తూ ఎన్నో ఉత్తమ రచనల్ని అందించారు. ఆ రచనలకు ఎన్నో అవార్డులు లభించాయి. నిరక్షరాస్యత, వెనకబాటు తనం, అంటరానితనం, ప్రాంతీయతత్వం వంటివి ఆయన కవిత్వంలో అక్కడక్కడా కన్పిస్తాయి. ఈయన కవిత్వంలో శ్రామికులు, కర్షకులు వంటి మట్టి మనుషులు ఉండి మానవీయాంశం ప్రధానంగా ఉంటుంది. అవార్డులు సృజనాత్మకతకు కొలమానాలు కావు. బహుమానాలు మాత్రమే. పురస్కారాల వల్ల రచయిత స్ఫూర్తిని పొంది మరింత ఉత్సాహంతో తమలోని సృజనను ఇంకా పదును పెట్టుకునే వీలుంది. అవార్డు ఒక మజిలీకి గుర్తింపు మాత్రమే అంటారు గోపి.

- 1978లో ఆంధ్ర మహిళా సభ వారి 'తంగెడు పూలు' గ్రంథానికి కృష్ణశాస్త్రి అవార్డు.
- 1982లో 'మైలురాయి' గ్రంథానికి ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు

- 1989లో తెలుగు యూనివర్సిటీ నుండి శ్రీమతి లక్ష్మీరమణ ఎండోమెంట్ అవార్డు
- 1990లో 'చిత్రదీపాలు'కు సినారె కవితా పురస్కారం
- 1991లో తెలుగు యూనివర్సిటీ 'చిత్రదీపాలు'కు ఉత్తమ కవిత్వ సంపుటికి ఇచ్చే అవార్డును అందించింది.
- 1994లో 'వంతెన' సంపుటికి అమలాపురం నుండి సరసం అవార్డు.
- 1995లో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు.
- 1995 ఉత్తమ వ్యాస సంపుటిగా 'గవాక్షం' ఎంపికైంది. దీనికి విజయనగరం నుండి విజయ భావన అవార్డు లభించింది.
- 1999 కురుగంటి సీతారామయ్య అవార్డు.
- 1999 జ్యోత్స్న కళాపీఠం వారి సుగుణమణి సాహిత్య అవార్డు.
- 1999 ఢిల్లీ తెలుగు అకాడమి అవార్డు.
- 1999 అరుంధతీ కాలసమితి వారి డా. దాశరథీ అవార్డు.
- 2000 సాహితీరత్న నీల జంగయ్య సాహిత్య అవార్డు.
- 2000 'కాలాన్ని నిద్రపోనివ్వను' కు కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు.
- 2001 తణుకు నుండి బాలగంగాధర తిలక్ అవార్డు.
- 2001(SAPNA) –Sri Annamacharya Project of North America, Chicago.
- 2002 సినారె కళాపీఠం పాలకొల్లు వారు అందజేసిన సినారె సాహితీ పురస్కారం.
- 2002 రాజమండ్రి నుండి ప్రతిభా వైజయంతిక పురస్కారం.
- 2004 ఇండియన్ హైకూక్లబ్, అనకాపల్లి వారు 'కవితా ప్రపూర్ణ' బిరుదు ఇచ్చారు.
- 2005 విజయనగరం, విజయ భావన నుండి 'అభినవ వేమన' అవార్డు.
- 2005 జాతీయ సాహిత్య పరిషత్ మెట్ పల్లి వారు 'నానీల త్రివిక్రముడు' బిరుదు ఇవ్వడం జరిగింది.
- 2006 ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ వారి నుండి ఉగాది విశిష్ట పురస్కారం.
- 2006 ఆంధ్ర సారస్వత సమితి, మచిలీపట్నం వారు 'నానీల నాన్న' బిరుదును.

- 2006 సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్, భీముని పట్నం ఆంధ్ర ప్రదేశ్ వారు అందజేసిన శివానంద ఎమినెంట్ సిటిజన్ అవార్డు.
- 2007 'జలగీతం'కు మాతృశ్రీ రాజహంస కృష్ణశాస్త్రి అవార్డు.
- 2009 తేజ ఆర్ట్ క్రియేషన్స్ ఆలేరు, నల్లగొండ జిల్లా, ఆంధ్రప్రదేశ్ వారు లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డు
- 2009 శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, హైదరాబాద్ వారు ఇచ్చిన దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారం.
- 2009 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కళారత్న' అవార్డు.
- 2011 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున 'బోయి భీమన్న' పురస్కారం లభించింది.

ఈ అవార్డులన్నీ గోపి సాహితీ జీవన యాత్రలో మైలురాళ్ళు. వీరు ఎన్ని రచనలు చేసినా, ఎన్ని పదవులు నిర్వహించినా, ఎన్ని హోదాలు పొందినా 'కవి' అనే మాటనే ఎక్కువగా ఇష్టపడతారు.

అందుకే–

''కలతలు ముసిరినప్పుడు
అమ్మ కుచ్చిళ్ళలో మొహం దాచుకున్నట్టు
నేను కవిత్వంలో దాక్కుంటాను'' (గోపి కవిత్వం–I – కాలాన్ని నిద్రపోనివ్వను: 274) అంటారు

ఇది గోపిగారి కవిత్వ కరచాలన స్పర్శ. వచన కవిత్వం సమకాలీన వస్తువును ప్రకటించడానికి, వర్ణించడానికి సరైన వాహకంగా ఉంటుంది.

ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ కూడా పరిశోధన చేసే విద్యార్థులకు పర్యవేక్షణ బాధ్యత వహించి ఎంతో మంది ఉత్తమ పరిశోధకులను వెలికితీశారు. వీరి పర్యవేక్షణలో డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి – ఆధునిక తెలుగు కవిత్వం తాత్త్విక నేపథ్యం (1990), డా. ఎస్వీ సత్యనారాయణ – తెలుగులో ఉద్యమ గీతాలు (1990), డా. మచ్చ హరిదాసు – తెలుగులో యాత్రా చరిత్రలు (1990) వంటి ఎన్నో పరిశోధనలను పరిశోధకులతో వెలికితీయించారు.

వీరి పర్యవేక్షణలో 13 ఎం.ఫిల్ పరిశోధనలు, 15 పిహెచ్.డి.లు వచ్చాయి. అంతేగాక పరిశోధకుల కోసం 'తెలుగు పరిశోధన' అనే త్రైమాసిక పరిశోధన పత్రికను 1987లో తీసుకురావడం జరిగింది.

గోపి తొలికవిత నాగమల్లారెడ్డిగారు సంకలనం చేసిన 'ఊయల' కవితా సంకలనంలో అచ్చయ్యింది. అది ఎనిమిదో తరగతిలో రాసింది.

''ఉండాలోయ్ ఉండాలోయ్
చల్లని నీళ్ళకు కూజా
పెళ్ళికి తప్పక బాజా
జడలో ఎర్రని రోజా''

తొమ్మిదవ తరగతి చదివేటప్పుడు ఉదయం నుండి సాయంత్రం వరకు ఒక్క రోజులోనే 'శశీ' అనే మకుటంతో రాసిన శతకంలోని కొన్ని పద్యాలు ఇవి – ఇంకా ప్రచురణకు రాలేదు.

ఉ. చుక్కల పూలు పూచినవి సుందరమైన మొగుళ్ళ వాటిలో
మక్కువ మీర కల్వ చెలి మాటికి మింటిని చూచుచుండె, కై
పెక్కిన కన్నులన్ ప్రియులకింపును గూర్చె నవోఢలల్లనన్
గుక్కను బట్టి కుర్రదు చకోర సఖా కనిపించరా శశీ!

ఉ. చందురమామ! నీవు విలసన్ మృదు చాంద్రియు ఐక్యమైనటుల్
డెందములన్ని యేకమగుటెప్పుడు, ఆ శుభవేల వచ్చునే
నందము చిందునే జగతి, నాకము అబ్బుర మంది చూచునే
నందన వాటి భూమి కభినందనలంపుట నిక్కమే శశీ!

ఉ. నిండుగనొక్కసారి కమనీయ ఘృంబల్ వెదజల్లి మాకు క
న్పండువసేసి, వేరొకటి బంధుర సాంద్రతమాల మాలికా
మండల మందుకృంగి కనుమాటయిపోతి, ఎంత వారికిన్
ఉండవె మోద ఖేదములు ఓర్పు వహించుట ముఖ్యమౌ శశీ!

ఉ. కౌగిలిలోన చీకటులు కాపురమున్ పొనరించుచుండ నీ
రాగమదెట్టిదో మృదవిలాస మనోజ్ఞవిభాసిత ప్రభా
భోగము గుర్తువీ పుడమి, పూజ్యుల లోపములెన్ని యుండినన్
దాగును, ప్రేమతో ప్రజకు నందము గూర్చిన యప్పుడే శశీ!

ఉ. మానుల చీరలొల్చి పవమాన బలమ్మున సంచరించు దు
ర్మానసుడైన శైశిరునమానుష చర్యల కృంగిపోతి, పూ
వానల వెప్పుడో కురియు వచ్చునటంచని నాదు జీవితో
ద్యానమునందు ఆశలకు ఆయువు పోయుచునుంటిరా శశీ!

కవిత్వం, పరిశోధన, సాహిత్య విమర్శకారుడిగా సుదీర్ఘ ప్రయాణం వీరిది. కవిత్వానికి ఏ ప్రక్రియతోనూ, ప్రవృత్తితోనూ, వృత్తితోను పొసగదని అంటారు. కాని ఏకాగ్రత దృష్టితో, సునిశిత తాత్త్వికతతో కవిత్వంతో పాటు పరిశోధనలో, సాహిత్య విమర్శలోనూ పరిణతి పొంది ప్రయాణాన్ని సాగిస్తున్న కవి గోపి.

★★★

రెండవ అధ్యాయం

గోపి కవిత్వం – వస్తు రూప వైవిధ్యం

అధ్యాయం – 2

గోపి కవిత్వం – వస్తు, రూప వైవిధ్య పరిణామం

కవిత్వం గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు వస్తు, రూపాలను గురించి చెప్పాల్సిన అవసరం ఉంటుంది.

2.1 వస్తువు:

వస్తువును ఆంగ్లంలో 'Content' అంటారు. రచయిత ఉద్దేశించిన మూల భావం వస్తువు. ''సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధాన భావాన్ని వస్తువు అనవచ్చు. రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చు.''[1]

ఒకానొక దృగ్విషయంలో ప్రత్యేకంగా, నియమబద్ధంగా ఉన్న మూలకాల, క్రమ విధానాల మొత్తం వస్తువు. మనిషి, మానవ సంబంధాలు, సామాజిక జీవితం దానిలోని సమస్త వైరుధ్యాలు వీటన్నింటి కళాత్మక ప్రతిఫలనం సాహిత్యంలో వస్తువు అవుతుంది. వస్తువు లక్షణాలను ఆచార్య శరత్ జ్యోత్స్నారాణిగారు తమ 'స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత వస్తువు, రూపం, శిల్పం' అనే గ్రంథంలో పేర్కొన్నారు. కవిత్వంలో అభివ్యక్తమయ్యే వస్తు లక్షణాలు:

1. ఒక భావనను తీసుకోవడం ప్రధానం. దీన్నే కొంతమంది ''ఇతివృత్తం'' అన్నారు.
2. తీసుకున్న భావన లౌకిక, అలౌకికమైన దానిలో ఏదైనా కావచ్చు.
3. వస్తువు కళాత్మకత పొందడానికి ఆధారమవటం.
4. కవి చెప్పదలచుకున్న ఆశయం ఉండటం
5. కవి చెప్పదలచుకున్న ఆశయం అనేక భావనలతో ఉండటం
6. ఒకే భావన తీసుకున్నా కవికీ కవికీ మధ్య భేదం కన్పిస్తుంటుంది.
7. చలనశీలమై కాలంతో పాటు కొత్త కొత్త వస్తువులు తయారవుతుండటం.
8. వస్తువు రూపంతో కలిసి ఉంటుంది. వీటి మధ్య వైరుధ్యం లక్షణమై పరస్పర విరుద్ధమైనా రెండు విడదీయరానివిగా ఉంటాయి.

[1] సాహిత్యంలో వస్తు శిల్పాలు – త్రిపురనేని మధుసూధనరావు – పేజి - 13

9. వస్తువుని రూపం, రూపాన్ని వస్తువు అధిగమించే స్థితి కవి అభివ్యక్తిని బట్టి కలుగుతుంది.

10. వస్తువు సరిగ్గా వ్యక్తం కావాలంటే సరైన ''రూపం'' ఉంటేనే సాధ్యమవుతుంది.

ఈ విధంగా వస్తువులో పది రకాలుగా వస్తు లక్షణాలను విడదీసి చూపారు.

వస్తువు గురించి ఎన్. గోపి తన ''చిత్రదీపాలు'' కవితాసంపుటిలో –

''వస్తువు దొరకనప్పుడు
కవిత్వం పస్తులుంటుంది
కళ్ళెదుటి వాస్తవం ఊహించనివ్వదు
ఉత్ప్రేక్షలు పల్టీలు కొడుతూ నేలకూలుతాయి.'' అంటారు.

ఆధునిక కవిత్వం వస్తు వైవిధ్యంతో పాటు రూప విశిష్టతను సంతరించుకుంది. వస్తువు, అభివ్యక్తిల ప్రాధాన్యత గురించి చర్చలు జరుగుతున్నాయి. వస్తువు ప్రాణమైతే రూపం దేహంగా భావించారు విమర్శకులు. కవితకు వస్తువెంత ముఖ్యమో, రూపమూ అంతే ముఖ్యమని పై మాటల వల్ల తెలుస్తుంది. వస్తువు శిల్పాన్ని సంతరించుకొని రూపాన్ని ధరిస్తుంది. అది ఏదో ఒక ప్రక్రియగా సజీవ రూపాన్ని కలిగి ఉంటుంది. వస్తువు, రూపం వేరు వేరుగా ఉండవు. వస్తువు పరిమాణం రూపాన్ని నిర్దేశిస్తుంది. వస్తువు నుండి రూపం ఉద్భవిస్తుంది కానీ రూపం నుండి వస్తువు జనించదనేది జగమెరిగిన సత్యం.

వస్తువు ఎలాంటిదైనా అంటే సామాన్యమైనా, అద్భుతమైనా, ఉదాత్తమైనా, కర్కశమైనా కవి చేతిలో కళాత్మకతను సంతరించుకుంటుంది. వస్తువును కవితాత్మకం చేయగలిగేది భాషే. గోపి అన్ని ప్రభావాలనీ చవిచూసి, అన్ని సాహిత్య రీతుల్ని అవగాహన చేసుకున్న సహృదయుడు. అలాంటి కవి రాసిన కవిత్వం ఎంతో భావుకతతో హృదయస్పర్శ కలిగి ఉంటుంది. తంగేడు పూల నుండి పురి విప్పిన ఊపిరి వరకు మొత్తం 18 కవితా సంపుటాలు వెలువరించారు. వీటిలో ''తంగేడు పూలు, మైలురాయి, జలనీతం'' లపై ఎం.ఫిల్ పరిశోధనలు జరిగాయి. వీటిని సూచనప్రాయంగా ప్రస్తావిస్తూ పరిశోధనా పరిధి దృష్ట్యా మినహాయింపును ఇస్తున్నాను. మిగతా కవిత్వంపై వస్తువైవిధ్య పరిశీలనకు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతుంది.

''గోపి వస్తు స్పృహ విలక్షణమైంది. కవిత్వంలో స్థాయీ భేదాలున్నట్లే వస్తువులో కూడా ఉండే అవకాశం ఉంది. వైవిధ్యభరితుడైన కవి చూపే వస్త్వాన్వేషణ కొత్త పుంతలు తొక్కుతుంది. పల్లె నుండి వస్తువు ఏరుకున్నా, నగరానుభవాన్ని కవిత్వీకరించిన, అంతర్జాతీయ సంఘటనలకు ప్రతిస్పందించినా తనదైన జీవనశైలిలోంచి కవిత్వం రాస్తారు.'' అని ఎండ్లూరి సుధాకర్ 1995 సెప్టెంబరు 18 ఆంధ్రజ్యోతి దినపత్రికలో గోపి కవిత్వం గురించి అభిప్రాయాన్ని వెల్లడించారు.

2.2 రూపం:

రూపాన్ని ఆంగ్లంలో ''FORM'' అంటారు. వ్యక్తీకరణ విధానమే రూపం. వస్తు, రూపాలకు సంఘర్షణ ఉంటుంది. సాహిత్య రూపాన్ని నిర్వచిస్తున్నాం కాబట్టి దీన్ని సాహిత్య రూపం (Literary Form) అంటారు. ఒక రచన యొక్క అంతర్గత సమీకరణ (Inter-Ornganisation), సుస్థిర నిర్మాణం (Structure) సాహిత్య రూపం అవుతుంది. ఆ రూపం వస్తువును ప్రత్యేక వ్యక్తీకరణ సాధనాల ద్వారా వెలిబుచ్చుతుంది.

కవితా వస్తువులో వచ్చిన మార్పు రూపం మార్పు చెందడానికి కారణమైనా సామాజిక సందర్భాల్లో అదే సంపూర్ణ నిర్ణయాంశం కాదు. ''రూపం వస్తువులలో రూపం కంటే వస్తువుకే ప్రాధాన్యం. వస్తువుని ఆకర్షకంగా బలమైన ముద్ర వేసేట్టు, ఆకట్టుకునేట్టు చెప్పేంత వరకే రూపానికి ప్రాధాన్యత''[2] వస్తువుకీ, రూపానికీ నేర్పుతో అనుసంధానం చేయగల కవి ఉత్తమ కవి. ఈ రూపం వస్తువును ప్రత్యేక వ్యక్తీకరణ సాధనాల ద్వారా వెలిబుచ్చుతుంది. పద్యం, గేయం, వచన కవిత్వం, పాట, కీర్తన, మినీ కవిత, హైకూ, నానీ, గజల్ మొదలైనవన్నీ కవిత్వ రూపంలో కన్పించే బాహ్యరూపాలు. కాలానుగుణంగా వస్తువుతోపాటు రూపంలోనూ మార్పు కనిపిస్తుంది. కవి వ్యక్తిగత భావ ప్రకటన ప్రతిభకు నిదర్శనాలు రూపం, ప్రక్రియ మరియు వస్తువు.

''విషయాన్ని లేదా వస్తువును కళాత్మకంగా వ్యక్తం చేసే విధానమే రూపం.''[3]

''కవి మనోగతమైన అనుభవం పఠిత హృదయంలో జాగృతం చేయగలిగిన లయాత్మకమైన భావాన్ని మోసుకొని వచ్చే వాక్య వృత్తుల చరణ విన్యాస రూపమే రూపం'' [4] రూపం గుణానికి సంబంధించింది

---

[2] ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు – కె.కె. రంగనాథాచార్యులు, పేజి-222.

[3] ఆధునిక సాహిత్యం వస్తు రూప వివేచన – ఎం. వీరభద్రయ్య, పేజి-11

రూపం లక్షణాలు:

1. వస్తువును ఆశ్రయించుకొని రూపం, రూపాన్ని ఆశ్రయించుకొని వస్తువు ఉంటుంది.
2. రెండూ అవిభాజ్యమైన సంబంధం కలిగి వైవిధ్య స్థితిలో ఉండి, ఒకదానిపై ఒకటి ఆధిక్యతను కలిగి ఉంటాయి.
3. రూపాన్ని బట్టి వస్తువు కొన్నిసార్లు, వస్తువుని బట్టి రూపం మరికొన్నిసార్లు పాఠకుల ఆకర్షణకు గురవుతుంది.
4. రూపం కొన్నిసార్లు ప్రక్రియగా పిలువబడుతుంది. కానీ ప్రక్రియరూపంగా కొన్నిసార్లు మాత్రమే అంగీకరించబడుతుంది.

2.3 శిల్పం:

ఆంగ్లంలో ''Technique'' అనే పదానికి సమానార్థకంగా శిల్పం అనే పదాన్ని తెలుగులో వాడుతున్నాం. ''ఏ వస్తువు ఏ రూపంలో వ్యక్తమవుతుందో ఆ రూపాన్ని శిల్పం అంటారు. ప్రక్రియ, భావ ప్రతిమలు భాషాశిల్పంలో ముఖ్యమైన భాగాలు. వీటిని శిల్పం''[5] అంటారు.

శిల్పం వ్యూహాత్మకమైంది. స్థూలంగా చెప్పాలంటే కావ్యాన్ని మలిచే పద్ధతిలో కవి చూపే ప్రతిభే శిల్పం. రచనలో చమత్కారం శిల్పం. కవి తాను దర్శించింది ఎలా చెప్పాలి? దేని తర్వాత ఏది చెప్పాలి? అనేది ఆలోచించి వాటిని ఆ విధంగా మలచడమే శిల్పం. ఎత్తుగడ, నడక, ముగింపు అనేవి శిల్పంలోని అంశాలు. తెలుగులో మొదటగా శిల్పం అనే పదాన్ని ఉపయోగించిన కవి తిక్కన. ''శిల్పమునం బారగుడు'' అని నిర్వచనోత్తర రామాయణావతారికలో చెప్పుకున్నాడు. శిల్పాన్ని నైపుణ్యంగా భావించవచ్చు. వస్తు, రూపం, శిల్పాలలో ఏది ముఖ్యమనే చర్చ సాహిత్యంలో నిరంతరం జరుగుతూనే ఉంటుంది. కొందరు కావ్యానికి మూడు ముఖ్యమని భావిస్తారు. కొందరు శిల్పమే గొప్పదని భావిస్తారు. ఏది ఏమైనప్పటికీ అందమైన వస్తువుకు మంచి రూపాన్నిచ్చి చక్కగా చెక్కితేనే అది పది కాలాలు నిలువగలుగుతుంది.

---

[4] మినీ కవిత్వం నిర్మాణ శిల్పం భావాభివ్యక్తి - చంద్రిక, పేజి-43

[5] సాహిత్యంలో వస్తు శిల్పాలు – త్రిపురనేని మధుసూధనరావు – పేజి - 27

2.4 శైలి (Style):

'Style' అనే పదానికి తెలుగులో సమానార్థకంగా 'శిల్పం' అనే పదాన్ని వాడుతున్నాం. శైలి అనే పదానికి శబ్దరత్నాకరం ''రచనాకౌశలముగల భాషాసౌష్టవము''[6] అనే అర్థాన్ని సూచించింది. రచయిత భాషను రూపొందించడంలో చూపే నేర్పు మీద శైలి ఆధారపడి ఉంటుంది. రూపం శైలి కాదు. రూపాంతర తేజస్సు శైలి. పైకి కన్పించకుండా లోతుగా, అంతర్గతంగా ఉండేది శైలి. వ్యక్తికి ప్రాణమెలాగో రచనకు శైలి కూడా అలాంటిది. కవి తాను తీసుకున్న వస్తువుకు, రూపానికీ సమన్వయం కల్పించడానికి తన భావాల స్పష్టతకోసం వాడే పదాల, వాక్యాల నిర్దిష్ట రూపకల్పన శైలి. మాటల, పదాలు, వాక్యప్రయోగాల ద్వారా రచయిత శైలి వ్యక్తమవుతుంది. అయితే అందరి రచయితల శైలి ఒకేలా ఉండదు. అనవసర పదజాలం వాడకుండా, సమగ్రంగా, సంగ్రహంగా, సంక్షిప్తంగా రాయడం వల్ల రచనలో వేగం వస్తుంది. శైలీశాస్త్రం పట్ల అవగాహన, పాండిత్యం ఉన్న వ్యక్తి ఆచార్య పరిమి రామనరసింహం గారు 'శైలీ శాస్త్రం – ఒక సమాలోచనం' అనే వ్యాసంలో – ''సాహిత్య విమర్శను శాస్త్రీయమైన పునాదుల మీద నిలిపే ప్రయత్నమే శైలీశాస్త్రం.'' అన్నారు. సాహిత్యంలోని విధాన విమర్శనే ఆధునికులు శైలీశాస్త్రం అంటున్నారు.

డా. యు.ఎ. నరసింహమూర్తి 'తెలుగు వచనశైలి' అనే గ్రంథంలో 32 శైలీ భేదాలను చెప్పారు. 'శీలం' నుంచి 'శైలి' పదం వచ్చిందని డా. నరసింహమూర్తిగారు అంగీకరించారు. ''శీలం అంటే బాహ్యమైన, వ్యక్తి సంబంధమైన నడవడి అనే అర్థం లోకంలో ఉన్నప్పటికీ రచనకు సంబంధించిన రీతి''[7] అని చెప్పవచ్చు. శైలి అంటే పరిశీలించే పద్ధతి Style, Technique పర్యాయపదాలుగా కన్పించినా, కళాత్మకంగా ఒక పని చేయడాన్ని 'Technique' అంటారు. 'Style' అనే పదం రాసే విధానాన్ని తెలుపుతుంది.

2.5 ప్రతీక (Symbol):

కవి చెప్పదలుచుకున్న అంశాన్ని ఒక సంకేతం ద్వారా సూచించడాన్ని ప్రతీక అంటారు. కవి ఒక వస్తువును చూసి అనుభూతి చెంది దాన్ని ఉన్నదున్నట్లుగా చెప్పడాన్ని ప్రతీక అంటారు. వివరణలతో పని లేకుండా అనుభూతి చెందినదాన్ని చెందినట్లుగానే వ్యక్తీకరించడానికి ప్రతీక ఉపకరిస్తుంది. ఆధునిక కవిత్వంలో ప్రతీకవాదం అత్యంత ప్రధానమైంది. ఇందులో

[6] ప్రజాకవి వేమన – డా. ఎన్. గోపి – పేజి - 306

[7] తెలుగు వచన శైలి – డా. యు.ఎ. నరసింహమూర్తి – పేజి - 1

ఊహలకంటే అనుభూతి ప్రధానంగా ఉంటుంది. సాధారణంగా ప్రతీకల వాడకం మూడు రకాలుగా ఉంటుంది. కవితలో అక్కడక్కడా ప్రతీకల్ని వాడుతూ సాగిపోయేది ఒకరకం. ఒక ప్రతీకను కవితనిండా చెప్పేది రెండో రకం. మూడోది అతి విస్తృతంగా భావాన్ని ధ్వనింపజేస్తూ, ప్రతీకలతో నింపి రాసేది. ''ఆధునిక కవిత్వానికి గొప్ప అభివ్యక్తి శిల్పంగా ప్రతీక రాణించింది. మనిషిలోని మౌలిక చైతన్యం సమగ్రతనందుకోవడానికి అనుభూతి తీవ్రతను పారదర్శకం చేయడానికి ప్రతీక గొప్ప సాధనమవుతుంది.''[8] కవి భౌతిక పునాది సమాజం కాబట్టి కవితా వస్తువును ఆ సమాజంలో నుండే తీసుకుంటాడు. ఆ వస్తువు ప్రతిఫలించడానికి ప్రకృతి, సమాజం, చరిత్రనుండి తన ప్రతీకల్ని ఎన్నుకుంటాడు.

''ఆచార్య ఎమ్. వీరభద్రయ్య ప్రతీకలకు తొమ్మిది లక్షణాలను''[9] సూచించారు. అవి: 1. ప్రాతినిథ్యం, 2. సంబంధాలు, 3. తత్త్వదర్శనం, 4. సంకేతికార్థం కాదు, 5. సామ్యసిద్ధి అతార్కికం 6. అర్థగూఢత స్పష్టతలు రెండు ఉంటాయి. 7. నిర్దిష్టార్థం లక్ష్యంగా ఉండదు, 8. రూఢి, 9. భావసూచన చేయగల్గడం.

2.6 భావచిత్రం (Imagery):

'ఇమేజరీ' అనే ఆంగ్లపదానికి భావచిత్రం అనే అర్థం వాడుతున్నాం. ''రచయిత చిత్రించదలుచుకున్న సమస్యను శక్తివంతంగా, సంగ్రహంగా, ధ్వనిమయంగా చెప్పడానికి తోడ్పడే శిల్పసాధనం భావచిత్రం''[10] ఒక వస్తువు లక్షణాన్ని, స్వభావాన్ని చెప్పడానికి వాటితో పోలికలున్న లేదా దగ్గరి సంబంధమున్న మరో వస్తువును వర్ణించడం లేదా సూచించడాన్ని 'భావచిత్రం' అంటారు. క్లుప్తత, వస్తువైవిధ్యం, తీవ్రత, భావోద్వేగం భావచిత్ర లక్షణాలు.

2.7 ఆధునిక తెలుగు కవిత్వ వికాస పరిణామం:

19వ శతాబ్దంలో తెలుగు సాహిత్యం సంప్రదాయ పోకడల్లో నడిచింది. కందుకూరి వీరేశలింగం గారి సంఘసంస్కరణోద్యమ ప్రభావంతో తెలుగునాట కొంత చైతన్యం కలిగింది. కందుకూరి ప్రారంభించిన గద్యం చిలకమర్తి, పానుగంటి, చలం వంటి వారి చేతుల్లో వికసించింది.

---

[8] సమకాలీన కవిత్వంలో ప్రతీకలు – భావచిత్రాలు – లంకా వెంకటేశ్వర్లు – పేజి – 23

[9] ఎన్. గోపి జలగీతం మానవీయ మహాకావ్యం (ఎం.ఫిల్.) – పేజి – 43

[10] సాహిత్యంలో చర్చనీయాంశాలు – జి.వి. సుబ్రహ్మణ్యం – పేజి 590

గిడుగు భాషా సంస్కరణ కూడా తెలుగు సాహిత్యాన్ని బాగా ప్రభావితం చేసింది. విశ్వవిద్యాలయాల స్థాపన, ఆంగ్లసాహిత్య ప్రభావంతో తెలుగులో కాల్పనిక సాహిత్యం ప్రవేశించింది. క్షుద్ర, మలిన, శృంగార ధోరణులపై నిరసనతో కాల్పనికోద్యమం ప్రారంభమయ్యింది. ఛందస్సు, భాష, భావ వ్యక్తీకరణలలో నవ్యతను సాధించిన కాల్పనిక సాహిత్య ధోరణి అంతకు ముందున్న వాటిపై తిరుగుబాటుగా వచ్చింది. కాల్పనిక సాహిత్యంపై తిరుగుబాటుగా అభ్యుదయం కవిత్వం వచ్చింది.

2.7.1 భావకవిత్వం:

19వ శతాబ్ది ప్రారంభంలో ఆంగ్లసాహిత్యంలో వచ్చిన కాల్పనిక కవిత్వం (Romantic Poetry) ప్రభావం భావకవిత్వంపై పడింది. రాయప్రోలు వారి కావ్యాలలో మొదటిసారిగా ''భావగీతం, భావపదం'' అనే పదాలను ఉపయోగించారు. ''భావకవిత్వమనే పదాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు ఆంధ్రపత్రిక సంపాదకులుగా ఉన్నప్పుడు సృష్టించారని డా. గిడుగు సీతాపతిగారు తమ History of Telugu Literature (Part-II)''[11] లో రాశారు. భావకవిత్వమును నిర్వచించిన వారిలో పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణలు ముఖ్యులు. ''కవియొక్క ఒక అవిస్పష్ట వాంఛాంకురము, ఒక అంతర్నిగూఢ తాపము, ఒక చిన్న కావ్యములో ఊదబడినచో''[12] అది భావకవిత్వం అని విశ్వనాథవారు నిర్వచించారు. కవికొండల వెంకటరావుగారు ''భావముయొక్క కవితాస్వభావము భావకవిత్వం''[13] అన్నారు. కట్టు, జుట్టు, నడకలో భావకవులు తమ ప్రత్యేకతను చూపారు. చెవుల మీదుగా వేలాడే జుట్టు, నడిమి పాపిట, కండువా, బెంగాలీ పద్ధతి లాల్చీ, అత్తరు పరిమళం, మెరిసే కళ్ళజోడు మొదలైనవి భావకవులను మిగిలిన కవులనుండి వేరుచేశాయి. భావకవిత్వ ప్రధాన లక్షణము అంతర్ముఖత్వం. బాహ్య సౌందర్యం కంటే ఆత్మ సౌందర్యానికే ప్రాధాన్యం. కవి తనకు కలిగిన కష్టసుఖాలను తన కవిత్వంలో వ్యక్తపరుస్తాడు.

భావకవులలో కృష్ణశాస్త్రిని ముఖ్యంగా పేర్కొనవచ్చు. అలాగే నండూరి సుబ్బారావు, రాయప్రోలు, విశ్వనాథ సత్యనారాయణ, దువ్వూరి రామిరెడ్డి, బసవరాజు అప్పారావు, వేదుల సత్యనారాయణ శాస్త్రి, నాయని సుబ్బారావు, పింగళి, కాటూరి, అడవి బాపిరాజు, తల్లావజ్ఝల

[11] ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయములు; ప్రయోగములు – సినారె – పేజి - 302

[12] ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయములు; ప్రయోగములు – సినారె – పేజి - 302

[13] ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయములు; ప్రయోగములు – సినారె – పేజి - 303

శివశంకరశాస్త్రి, తుమ్మల సీతారామమూర్తి మొదలైన కవులు భావకవిత్వం రాశారు. భావకవిత్వాన్ని సినారెగారు–

1. ప్రణయకవిత్వం (Love Poetry)
2. ప్రకృతి కవిత్వం (Nature Poetry)
3. భక్తి కవిత్వం (Mystic Poetry)
4. దేశభక్తి కవిత్వం (Patriotic Poetry)
5. సంఘసంస్కరణ కవిత్వం (Reformative Poetry)
6. స్మృతికావ్యాలు (Elegies) అని ఆరు రకాలుగా విభజించడం జరిగింది.

2.7.2 అభ్యుదయ కవిత్వోద్యమం:

అభ్యుదయ కవిత్వం స్వాతంత్ర్యానికి పూర్వమే ప్రారంభమైంది. 1934 నాటికే తెలుగు కవులు రైతుల స్థితిగతులపై కవిత్వం రాశారు. ఎన్.జి.రంగా 1934లో ''రైతు భజనావళి''ని వెలువరించారు. ''క్రాంతిగీతాలు'' అభ్యుదయ కవిత్వంలో వాస్తవిక దృక్పథాన్ని అనుసరిస్తూ చేసిన రచన.

పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు శ్రామిక వర్గాలను తమ గుప్పిట్లో పెట్టుకొని శ్రమదోపిడీ చేస్తున్నారు. ఈ శ్రామిక వర్గం శ్రేయస్సు కోరేదే అభ్యుదయ కవిత్వం. పీడించేవాళ్ళు, పీడింపబడేవాళ్ళూ లేని సమాజం రావాలని, పేద, ధనికులు అనే తారతమ్యాలు ఉండరాదని, ధనికస్వామ్యం పోవాలని కాంక్షించడమే అభ్యుదయం. శ్రీశ్రీ, రెంటాల గోపాలకృష్ణ, ఆరుద్ర, సోమసుందర్, కె.వి. రమణారెడ్డి, కుందుర్తి, గంగినేని వెంకటేశ్వరరావు, గజ్జెల మల్లారెడ్డి వంటి వారు అభ్యుదయ కవిత్వం రాశారు. అభ్యుదయ కవిత్వోద్యమ కాలంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన కవిత్వం అధికంగా వచ్చిందని చెప్పవచ్చు.

2.7.3 దిగంబర కవిత్వం:

1965లో ప్రారంభమైన దిగంబర కవిత్వోద్యమం 1965, 1966, 1968 సంవత్సరాలలో వరుసగా మూడు కవితా సంపుటాలను వెలువరించింది. దిగంబర కవిత్వం తెలుగు సాహిత్యరంగంలో చర్చలకు తెరలేపి సంచలనాన్ని కల్గించింది. దిగంబర కవులు ఆరు మంది వారి అసలు పేర్లతో కాకుండా మారుపేర్లతో ప్రసిద్ధి చెందారు. వారు–

నిఖిలేశ్వర్	– యాదవరెడ్డి
నగ్నముని	– మానేపల్లి హృషికేశ్వరరావు
చెరబండరాజు	– బద్ధం భాస్కరరెడ్డి
జ్వాలాముఖి	– వీర రాఘవాచార్యులు
మహా స్వప్న	– కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు
భైరవయ్య	– మన్ మోహన సహాయ్

వీరు ఆరుగురు తమ ఆవేశాన్ని, ఆలోచనలనూ, కసినీ ప్రభుత్వాలపై మరియు సమాజంపై అసహనాన్ని ప్రకటించడానికి తమ కవిత్వాన్ని ఒక ఆయుధంగా ఎంచుకొన్నారు. తమ కవిత్వాన్ని వచన కవిత్వం అనడం నచ్చదని, వీరు తమ కవితల్ని ''దిక్''లుగా పిలుచుకున్నారు. సంవత్సరాలు, ఋతువులు పేర్లు కొత్తగా సూచిస్తూ ఆధునిక కవిత్వానికి ''షాక్ ట్రీట్ మెంట్'' ఇచ్చారు. దిగంబర శకం కాలమానం–

సంవత్సరాలు ఆరు:– నగ్ననామ సంవత్సరం
నిఖిలేశ్వరనామ సంవత్సరం
జ్వాలాముఖి నామ సంవత్సరం
చెరబండ నామ సంవత్సరం
భైరవనామ సంవత్సరం
మహాస్వప్ననామ సంవత్సరం

ఋతువులు ఆరు:–

1. ఆశ ఋతువు 2, తపన ఋతువు 3. అ౦శు ఋతువు
4. మధిర ఋతువు 5. విరహ ఋతువు 6. విషాద ఋతువు

వారాలు ఆరు:–

1. స్నేహవారం 2. విశృంఖల వారం 3. క్రాంతి వారం
4. సృజన వారం 5. వికాస వారం 6. అనంతవారం

పై విధంగా తమకు మాత్రమే చెందినవిగా ప్రత్యేక సంవత్సరాలు, ఋతువులు, వారాలను విభజించుకొని,తమ కవిత్వాన్ని కూడా ఆరు సంపుటాలుగా వెల్లడించాలని భావించారు. కానీ మూడు సంపుటాలుగా వెలువరించి ఆగిపోయారు.

''నన్నయను నరేంద్రుని బొందలోనే
నిద్రపోనియ్యి
లేపకు......''

అంటూ నన్నయ నుంచి కుందుర్తి వరకూ ఏవీ జీవిత వాస్తవికతను పట్టుకోలేకపోయిన దుస్థితి ఏర్పడినప్పుడు వచ్చిన తిరుగుబాటు దిగంబర కవిత్వం.'' [14]

1960ల్లో అమెరికాలో ''బీద్ జనరేషన్'' అనే తిరుగుబాటు, ఇంగ్లాండులో ''యాంగ్రీ యంగ్ మాన్'' అనే తిరుగుబాటు, పశ్చిమబెంగాల్ లో ''హంగ్రీ యంగ్ మెన్'' అనే సాహిత్య ధోరణి తలెత్తింది. 1965 నాటికి మనరాష్ట్రంలోనే కాదు భారతదేశంలో రాజకీయ పరిస్థితులు, ప్రజల జీవన పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయి. నిరక్షరాస్యత, నిరుద్యోగం, దారిద్ర్యం, పరాధీనత, కుళ్ళు రాజకీయాలు, మత కలహాలు, సాహిత్య వ్యాపారం, సినిమా ప్రభావం వంటివి సాహిత్యంలో విశృంఖలత్వం ప్రబలడానికి కారణమయ్యాయి. ''సాహిత్యంలో మరో పక్క పద్య కవులు మళ్ళీ తమ కలాలకు పదును పెడుతున్నారు. ఇంకో పక్క ''రూపవాదం'' ప్రాముఖ్యం సంతరించుకుంటోంది.'' [15] ఇలాంటి పరిస్థితుల్లో దిగంబర కవులు తమ మూడు కవితా సంపుటాలను వెలువరించారు. ''1965 మే అర్ధరాత్రి 12 గంటలకు రిక్షావాలా నాంపల్లి పాండు చేత మొదటి కవితా సంపుటిని ఆవిష్కరింపచేశారు. 1966 డిసెంబర్ లో రెండవ కవితా సంపుటిని విజయవాడలో ఒక హోటల్ క్లీనరు చేత, 1968 జూన్ లో మూడవ కవితా సంపుటిని విశాఖపట్నంలో ఒక బిచ్చగత్తె యడమనూరి యశోధ చేత ఆవిష్కరింప చేశారు.''[16] దిగంబర కవుల గురించి శ్రీశ్రీ– ''దిగంబర కవులు తెలుగు సాహిత్యంలో ఒక కొత్త ఆశలు, చివుళ్ళు అన్నారు. వారు కాదు దిగంబరులు. వారి కవిత్వంలో దిగంబరత్వం కన్పిస్తుంది''

---

[14] తెలుగులో కవితా విప్లవాల స్వరూపం – వెల్చేరు నారాయణరావు –పేజి – 157-158

[15] తెలుగులో కవిత్వోద్యమము (2012) – తెలుగు అకాడమి – పేజి – 123.

[16] స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత వస్తువు, రూపం, శిల్పం – ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నా రాణి – పేజి -39.

అన్నారు. దిగంబర కవులు, వారి రచనల ఉద్దేశాలను, ఆశయాలను, లక్ష్యాలను, దిగంబర ఉద్యమ స్వరూప స్వభావాలను వారి కవితా సంకలనంలోనే చెప్పుకొన్నారు.

1. ''దిగంబర కవులు మేం మంచి కోసం, మనిషిలోని నిజమైన నిప్పులాంటి మనిషికోసం, కపటం లేని చిరునవ్వులు చిందే సమాజం కోసం అహోరాత్రులు అతని అగ్నిలో నడిచిన ఆత్మలలోనుండి పలుకుతున్నాం.
2. పదవికోసం, డబ్బుకోసం దేనికైనా తెగించే ఈ 'కుష్టువ్యవస్థ'ను నాశనం చెయ్యాలి.
3. మేం పుస్తకాల్లోంచి మాట్లాడదలుచుకోలేదు. అనుభవాల్లోంచి పలకదలుచుకున్నాం. మేం మేముగా మాట్లాడదలచుకున్నాం.''[17]

దిగంబర కవులు తమ ప్రస్థానాన్ని, ప్రయాణాన్ని 1965లో మొదలుపెట్టి 1968కే వదిలి పెట్టారు. స్వరూపాన్ని బట్టి మేం రాస్తున్న దానిని ''వచనకవిత'' అని మేం అనదలచుకోలేదు. అననివ్వదలచుకోలేదు.''[18] అని దిగంబర కవులు మొదటి సంపుటిలో ప్రకటించారు. కాబట్టే వీరు తమ కవితలను 'దిక్'లని పిలుచుకున్నారు. తాము వచన కవిత్వమే రాసినా, కవితా ప్రక్రియగా వచన కవిత్వం దారి లేని స్థితిలో పడిందని దిగంబర కవులే ముందుగా గుర్తించారు.

దిగంబర కవులు వస్తువులో కొత్తదనం, అభివ్యక్తిలో దురుసుతనం, ప్రయోగంలో పరుషదనాలు కలిపి రాసిన ఈ కవిత్వం హేళనలకూ, ఖండనలకూ తీవ్రంగా గురైంది. కవిత్వంలో అశ్లీలం, పరుషపదజాలం చూసిన ప్రజలు ఈ కవిత్వాన్ని తిరస్కరించడంతో వారు ఈ ఉద్యమానికి స్వస్తి పలుకవలసి వచ్చింది. దిగంబర కవుల కవిత్వాన్ని అనుసరించిన కవులు గానీ, హర్షించిన వారుగానీ లేరు. కాబట్టి ఇది సాహిత్యంలో ఉద్యమంగా కాక అలజడిగా మిగిలిపోయింది.

2.7.4 విప్లవ కవిత్వం:

మానవ చైతన్యంలో సాహిత్యం భాగం కావడంతో సమాజానికి, సాహిత్యానికి విడదీయరాని సంబంధం ఉంటుంది. సమాజంలో ఏర్పడే అవసరాలకు, మార్పులకు అనుగుణంగా సాహిత్యం కొత్తరూపాలను ఏర్పరుచుకుంటుంది. అందులో భాగంగా వచ్చిందే

[17] దిగంబర కవులు – రచయితలు – దిగంబర కవులు – పేజి -5.

[18] కవితా విప్లవాల స్వరూపం – వెల్చేరు నారాయణరావు – పేజి -158.

విప్లవ కవిత్వం. అభ్యుదయ కవిత్వం మార్క్సిస్టు నిబద్ధతను వదిలివేసిన తర్వాత దాని స్థానంలో విప్లవ కవిత్వం వచ్చింది. విప్లవం అనే మాటను ఇంగ్లీష్ లో ''Revolution'' అంటారు. ''విప్లవవాదం అంటే ప్రస్తుతం ఉన్న వ్యవస్థను బల ప్రయోగం ద్వారా మార్చాలనే రాజకీయ సిద్ధాంతానికి అనుకూలమైన సాహిత్య సిద్ధాంతం''[19] విప్లవ పోరాటాల్ని గూర్చి రాసిన కవిత్వమే విప్లవ కవిత్వం. ''విప్లవాన్ని సమర్థిస్తూ, విప్లవోద్యమ చరిత్రను ప్రతిఫలిస్తూ, విప్లవభావాలను ప్రచారం చేస్తూ రాసే సాహిత్యం విప్లవ సాహిత్యం, రాసే కవిత్వం విప్లవ కవిత్వం. అస్తిత్వంలో ఉన్న సామాజిక ధర్మాన్ని తోసిరాజని కొత్త ధర్మాన్ని స్థాపించడానికి జరిగే క్రియాకలాపమే విప్లవం''[20] అనే నిర్వచనాలున్నాయి.

విప్లవకవిత్వం 1970 నుండి 1980 వరకు తెలుగులో ఎక్కువగా రావడం జరిగింది. 1970లో విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. కమ్యూనిస్టులకు, ఇతరులకు భేదం ఉంటుంది. ఏ విషయాన్నయినా స్పృశించే తత్వం కమ్యూనిస్టులది. వీరు ప్రజల్లో చైతన్యాన్ని పెంచడానికి అన్ని అవకాశాలను వినియోగించుకుంటారు. సమాజాభివృద్ధికి అనుకూలంగా ఉండే వ్యక్తులతో ఈ సంఘాలు ఏర్పడుతాయి. విప్లవం కమ్యూనిస్టులు తెచ్చేది కాదు. ప్రజల ఆలోచనల్లో మార్పు వచ్చి వారే చైతన్యవంతులవ్వాలి. విప్లవకవిత్వం అభ్యుదయ వాదులు తమ భావాలను కవిత్వంలో వ్యక్తపరిచి అసమానతలను తొలగించి, సమానతను సాధించడానికి, విముక్తి పోరాట సాధనంగా తోడ్పడుతుంది. సామాన్యుల కోసం, పీడితులకోసం పుట్టే కవిత్వం విప్లవ కవిత్వం.

విప్లవ కవిత్వంలో వస్తువులుగా అడవి, నిప్పు, వెలుతురు, అగ్గి, ఎరుపు, తూరుపు, రక్తం, సముద్రం, తుపాకి, గొడ్డలి వంటి పదాలను ఉపయోగిస్తారు. ఇవన్నీ సమాజంలో విప్లవాగ్నులను ప్రేరేపించే కవితా వస్తువులు. విప్లవ కవిత్వంలో మొట్టమొదటి కవితా సంకలనం ''ఝుంఝుం''. శ్రీకాకుళ గిరిజన సాయుధ పోరాటంలో అమరులైన వారిని కీర్తిస్తూ వచ్చిన కవితా సంకలనం. ఈ సంపుటిలోని ''సైన్యంలో చేరకు' వంటి గీతాలు దేశ ద్రోహకరంగా ఉన్నాయని దీన్ని ప్రభుత్వం నిషేధించింది. ఆ తర్వాత ''మార్చ్, లే'' వంటి కవితా సంపుటాలు వెలువడ్డాయి. విప్లవ కవిత్వం వల్ల తెలుగు సాహిత్యంలో ''నక్సలైట్'' అనే పదం ప్రవేశించింది.

---

[19] ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు – సంపాదకుడు – కె.కె. రంగనాథాచార్యులు, పేజి -190

[20] తెలుగులో కవిత్వోద్యమాలు – తెలుగు అకాడమి – పేజి -151

సమాజంలో మానవ సంబంధాలను విప్లవీకరించడం, వారి పట్ల ప్రేమ, దేశం పట్ల భక్తి కల్గి ఉండడం, ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం, మరణించిన విప్లవకారులను గుర్తు చేసుకుంటూ, వారిని కీర్తిస్తూ కవిత్వం రాయడం, జాతీయ, అంతర్జాతీయ సంఘటనలకు ప్రతిస్పందనగా కవిత్వం రాయడం విప్లవ కవిత్వ లక్షణాలుగా చెప్పవచ్చు. విప్లవ కవులు కవిత్వం, పాట ద్వారా విప్లవ భావాలను వ్యాప్తి చేయడానికి ప్రయత్నించారు. విప్లవ కవిత్వం రాసిన వారిలో శ్రీశ్రీ, వరవరరావు, శివసాగర్, కె.జి. సత్యమూర్తి, సుబ్బారావు పాణిగ్రాహి, కె.వి. రమణారెడ్డి, గద్దర్, వంగపండు, నగ్నముని వంటి కవులు రాసిన కవిత్వం, గేయాలు ఉన్నాయి.

2.7.5 దళితవాద కవిత్వం:

భారతీయ సమాజం కుల, వర్ణ వ్యవస్థతో కూడుకొని ఉంది. సమాజంలో అణచివేతకు గురయ్యే అట్టడుగు వర్గాల వారి అభ్యున్నతిని కోరుకుంటూ వారిని చైతన్య పరిచేదే దళిత కవిత్వం. 'దళిత' అన్న పదానికి ఖండించబడింది, ఛేదించబడింది, చీల్చబడింది, వికసింపబడింది, విసిరివేయబడింది, సగము చేయబడింది అనే అర్థాన్ని నిఘంటువులు చూపిస్తున్నాయి.

''మనిషి మనుగడకు కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ నోచుకోని నిర్భాగ్యులు, ఊరికి దూరంగా ఉండి ఉనికి కోల్పోయిన వాళ్ళు, సభ్య ప్రపంచంలో సరైన సంబంధాలు లేనివాళ్ళు, నిత్యపీడితులు, అవమానాలకు, అత్యాచారాలకు గురవుతున్నవాళ్ళు. ఇలా ఎన్నో అంశాలతో అణగదొక్కబడిన వాళ్ళు అస్పృశ్యులు''[21] పంచములుగా పిలువబడే దళితులకు గాంధీజీ ''హరిజనులు'' అని పేరు పెట్టారు. అయితే 1920–30 నాటికి దళితులు హరిజన, పంచమ అనే పదాలను తిరస్కరించి తమని తాము ఆది ఆంధ్రులుగా పిలుచుకోవడం మొదలెట్టారు. ''సాంఘిక దోపిడీకి గురవుతున్న వాళ్ళు, అస్పృశ్యులుగా పరిగణింప బడుతున్నవారు, నీచ వృత్తులుగా భావించబడుతున్న వృత్తులు చేసుకుంటున్న వారు, శారీరక శ్రమపై ఆధారపడి బ్రతుకుతున్న వారిని 'దళితులు' ''[22] గా పిలుస్తున్నారు. తెలుగు కవిత్వంలో దళిత కవిత్వమంటే ఏంటో నిర్వచించడానికి 1995, జనవరిలో జి. లక్ష్మీనరసయ్య, త్రిపురనేని శ్రీనివాస్ ల సంపాదకత్వంలో 'చిక్కనవుతున్న పాట' వచ్చింది. దళితులు తమ ఆవేదనను,

---

[21] తెలుగు భాషా వైభవం. సంపాదకులు. మద్దాళి రఘురామ్. పేజి -83

[22] తెలుగుతో కవిత్వోద్యమాలు. పేజి -209

ఆర్తిని, తరతరాలుగా అనుభవించిన వివక్షతను, ఆర్థిక అణచివేతను, శ్రమదోపిడీని అనుభవించిన తీరును కవులు తమ కవిత్వంలో వ్యక్తపరిచారు. అలాంటి దళిత కవులలో సతీష్ చందర్, ఎండ్లూరి సుధాకర్, కొలకలూరి ఇనాక్, మాష్టార్జీ, మద్దూరి నగేష్ బాబు, పైడి తేరేష్ బాబు, కత్తి పద్మారావు, శిఖామణి, ఖాజా, చెరుకు సుధాకర్, ఖాదర్ మొహియుద్దీన్, జూలూరు గౌరీ శంకర్ వంటి కవులున్నారు.

ఈ విధంగా తెలుగు కవిత్వం భావ, అభ్యుదయ, దిగంబర, విప్లవ, స్త్రీ వాద, దళిత వాద కవిత్వాలుగానే గాక పైగంబర కవిత్వం, చేతనావర్త కవిత్వం, ముస్లింవాద కవిత్వం, బి.సి. కవిత్వం, మైనారిటీ, ప్రాంతీయ, అస్తిత్వవాద కవిత్వాలు వంటి కవిత్వోద్యమాలు ఎన్నో తెలుగు సాహిత్యంపై ప్రభావాన్ని చూపాయి.

2.7.6 స్త్రీ వాదం:

స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత్వంలో వచ్చిన వాదాల్లో స్త్రీ వాదం ఒకటి. దీన్ని ఆంగ్లంలో ''ఫెమినిజం'' (Feminism) అంటారు. దీనికి సమానార్థకంగా స్త్రీ విముక్తి, స్త్రీ స్వేచ్ఛా ఉద్యమం, స్త్రీ విమోచనోద్యమం అనేపేర్లు వాడుకలో ఉన్నాయి. కానీ వీటి తర్వాత వచ్చిన ''స్త్రీ వాదం'' అన్న పదమే ఈనాడు ప్రచారంలో ఉంది. ''సమాజంలోనూ, కుటుంబంలోనూ, పనిలోనూ స్త్రీలు గురవుతున్న అణచివేత, దోపిడీకి సంబంధించిన అవగాహన కలిగి ఉండి, ఈ పరిస్థితి మార్చడానికి స్త్రీలు, పురుషులు చేపట్టే చైతన్యవంతమైన కార్యక్రమం''[23] అని స్త్రీ వాదాన్ని ఫెమినిస్టు స్టడీ సర్కిల్ వారు నిర్వచించారు. సమానత్వం కోసం, హక్కుల కోసం స్త్రీలు చేస్తున్న ఉద్యమం స్త్రీవాదోద్యమం. 1980 తర్వాత స్త్రీ వాద కవిత్వం విస్తృతంగా వచ్చింది. కానీ 1972 లోనే ఓల్గా ''ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి'' అనే స్త్రీ వాద కవిత రాసింది. దీన్ని మొదటి స్త్రీ వాద కవితగా పేర్కొంటారు. 1975–85 కాలాన్ని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ మహిళా దశాబ్దంగా ప్రకటించింది. స్త్రీలు విద్యావంతులు కావడంతో వారి ఆలోచనలలో మార్పు వచ్చింది. పురుష భావజాలాన్ని, సిద్ధాంతాలను, కవితారీతులను అనుసరిస్తూ కవిత్వం రాయడం జరిగింది.

స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు తొలగిపోవాలని, స్త్రీలకు సాంఘిక, ఆర్థిక, రాజకీయంగా సమాన అవకాశాలు రావాలని రాసే కవిత్వం స్త్రీ వాద కవిత్వం. స్త్రీల సమస్యలపై

[23] తెలుగులో కవిత్వోద్యమం. పేజీ. 185.

స్త్రీలు మాత్రమే కాకుండా పురుషులు కూడా కవిత్వం రాశారు. ఈ సందర్భంలోనే 1993, అక్టోబర్ లో ''నీలిమేఘాలు'' అనే స్త్రీవాద కవితా సంకలనాన్ని వెలువరించారు. సంతానోత్పత్తి, లైంగిక వివక్ష, పురుషాధిపత్యం, వివాహ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ, స్త్రీ స్వేచ్ఛ, లింగ వివక్ష, స్త్రీ ఉనికి, సామాజిక వ్యవస్థ, సామాజిక పరిణామాలు వంటి అంశాలను వస్తువులుగా తీసుకొని కవిత్వం రాయడం జరిగింది. స్త్రీ వాద కవయిత్రులలో ఓల్గా, సావిత్రి, జయప్రభ, రేవతీదేవి, మందవరపు హైమావతి, విమల, కుప్పిలి పద్మ, మహెజబీన్, కె. వరలక్ష్మి, ఎస్. జయ, కొండెపూడి నిర్మల, మొక్కపాటి సుమతి, వాణీ రంగారావు, పాటిబండ్ల రజని, వసంత కన్నాభిరాన్, రజియా బేగం, ఘంటసాల నిర్మల, తుర్లపాటి రాజేశ్వరి, చిల్లర భవానీదేవి, బి. పద్మావతి వంటి మొదలైన కవయిత్రులు స్త్రీ వాద కవిత్వాన్ని రాసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

2.8 మానవతావాద కవిత్వం:

''మనిషిని మానవీకరించడంలో, వ్యక్తుల్ని సమూహం చేయడంలో, సమూహాల్ని చైతన్యవంతం చేయడంలో కవిత్వానిది ప్రథమస్థానం. జీవనదిలో నాటు పడవలా కవిత్వం ఓ భరోసా, ఓ ఓదార్పు.''[24] –సార్త్రే (ఫ్రెంచ్ ఫిలాసఫర్. సాహిత్యంలో 1964లో నోబెల్ ప్రైజ్ గెలుచుకున్నారు. అస్తిత్వవాదం, మానవత్వం గురించి చెప్పారు.)

ప్రకృతిలో మానవుడి ఔన్నత్యాన్ని ప్రత్యేకించి నిలిపేది మానవతావాదం. మనిషిని మనిషిగా పరిణమిస్తూ తన కార్యకలాపాలన్నింటికీ తన పనులే కారణమని విశ్వసించడం మానవతా వాదం మౌలికంగా మానవుడే అన్నింటికీ ప్రమాణమనేది మానవతా వాదం.''[25] ఏ వ్యక్తి మానవుని శ్రేయస్సునీ, సంక్షేమాన్నీ, అభివృద్ధినీ, అభ్యుదయాన్నీ కాంక్షిస్తాడో అతన్ని నిజమైన మానవతావాదిగా భావించవచ్చు. మానవత్వమున్న మనిషిలో సంకుచితత్వం ఉండదు. మనిషికీ, మనిషికీ మధ్య బంధం బలపడితేనే మానవత్వం చిగురిస్తుంది. ప్రార్థించే పెదవుల కన్న సాయం చేసే చేతులు మిన్న అన్న దానికి కట్టుబడితే అద్భుత సమాజాలు ఏర్పడుతాయి. అనుబంధాలు, అవి తెచ్చే ఆనందాలు పంచుకున్నకొద్దీ పెరుగుతాయి. అంతరాలను రూపుమాపి మనిషిని మనిషితో కలిపే దృక్పథమే మానవత కవిత లక్ష్యం. విచక్షణ

---

[24] సాహిత్య ప్రస్థానం (మాసపత్రిక) జులై, 2012 – సంపాదకుడు – తెలకపల్లి రవి – పేజి – 6.

[25] ఆధునిక తెలుగు కవిత్వంలో మానవతావాదం విభిన్న ధోరణులు – జి. అరుణకుమారి – పేజి – 1.

లేని జాలి చూపించడం మానవత్వం కాదు. మానవతావాది పీడిత ప్రజల బాధలు తొలగించడానికి మార్గాలు అన్వేషించాలి. అలాంటి వారిలో తెలుగులో వేమనను మొదటి మానవతావాదిగా చెప్పవచ్చు. విశ్వమానవతావాదం కుందుర్తి రచనల్లో పుష్కలంగా కన్పిస్తుంది.

''మళ్ళీ నరజన్మ ఎందుకంటే
మనుషులంటే యిష్టం నాకు
దేవుని కంటే మనిషి ఇష్టం''

నరుల్ని వదలి ఏనాడూ నా చూపు నక్షత్ర సంగీతాన్ని వినాలని ఆకాశంలోకి దూరలేదు.''[26]

మానవతావాదం గురించి సినారె చెప్పని కవితా సంకలనమంటూ లేదు.

''మనిషి నశించినా
నశించదు మానవత్వం
అదే ఈ లోకానికి మణి సోపానం
అనంతం వైపు దాని ప్రస్థానం''[27] అన్నారు.

మానవతావాదం పదం – పుట్టుక:

మానవతావాదాన్ని ఆంగ్లంలో ''Humanism'' అంటారు. ఈ పదం లాటిన్ భాషలోని "Humanitas" అనే పదం నుండి వచ్చింది. ''మానవుడే అన్నింటికీ మూలం (Man is measure of all things) అని క్రీ.పూ. 5వ శతాబ్దంలోనే పశ్చిమ యూరప్ లో ప్రతిపాదించిన గ్రీక్ దార్శనికుడు ''ప్రొటొగొరాస్'' మానవతావాదానికి మొట్టమొదటి ప్రవర్తకుడు''[28] ''Homomensura'' హోమోమెన్సుర అనే సిద్ధాంతం మానవుడే అన్నింటికి

26 అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు – సంపాదకత్వం – పేర్వారం జగన్నాథం – పేజి -194.

27 అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు – సంపాదకత్వం – పేర్వారం జగన్నాథం – పేజి -195.

28 ఆధునికాంధ్ర కవిత్వంలో మానవతావాదం – విశ్వంభర విలక్షణత (పిహెచ్.డి.) – డా. రావికంటి వసునందన్-పేజి-6

మూలమని చెబుతుంది. ఆక్స్ ఫర్డ్ కి చెందిన ఎఫ్.సి.యస్.షిల్లర్ (1750-1805) మొదటిసారిగా మానవతావాదం (Humanism) అనే పదాన్ని చెప్పారు.'' [29]

''మానవుని సర్వశక్తిమత్వాన్నీ, స్వాతంత్ర్యాన్నీ పరమప్రమాణంగా భావిస్తూ, అతని ధార్మిక, వైజ్ఞానిక, కళాత్మక, ఆధ్యాత్మిక రంగ వికాసానికీ, మానవాభ్యుదయానికీ, సంఘ శ్రేయస్సుకూ మానవ సామర్థ్యాన్నే మూలంగా ప్రసాదించే వాదం- మానవతావాదం.''[30]

సానుభూతి మానసిక గాయాల్ని మాన్పించే ఔషధం. దాన్ని చూపించడమే మానవత్వం. కరుణ స్వభావం, దయార్ద్ర హృదయం, సానుభూతి తత్వం ఈ మూడూ మానవత్వ ఋజువులు. మనిషి తత్వం మానవత్వం. మానవత్వాన్ని కోల్పోవడమంటే మనిషి తన సహజత్వాన్ని కోల్పోయి దూరమవుతున్నాడని అర్థం. మనం బ్రతుకుతూ మరొకరికి బ్రతుకునివ్వాలి అనేది మనిషిలోని మనిషితనానికి ప్రతీక. నేటి ఆధునికయుగంలో, ఉరుకులు పరుగుల జీవితంలో ముందేముందో, వెనక ఏం మిగిలిందో చూసుకోలేని తొందరపాటులో ఒకరికొకరు అనే భావన అడుగంటింది. అందుకే గోపిగారు ఒక కవిత్వంలో ఈ విధంగా అంటారు.

''నాగరికతను నింపుకొని
పరిగెత్తే లారీల కింద
మానవత్వానికి యాక్సిడెంట్లు తప్పవు''[31]

గోపి కవిత్వంలో అంతటా కన్పించే ఒక అంతస్సూత్రం మానవతావాదం. ఏ కవితలో ఏ వస్తువుని పరిశీలించినా అందులో చివరిగా మనల్ని తట్టేది మానవతావాదం. మానవతను గోపి తన కవితల్లో వ్యక్తిగత మూలాల నుండి చూస్తే స్నేహం, సౌజన్యం, సహనం, త్యాగం, నీతి మొదలుకొని సమిష్టి విలువలైన సమైక్యత, శాంతి, అహింస, సర్వమానవ సౌభ్రాతృత్వం వంటి ప్రపంచవ్యాప్త విలువల ద్వారా వ్యక్తం చేశారు. గోపి కవిత్వంలో మానవతావాదం సంపూర్ణ రూపంతో వెలువడింది. ఎన్నో భావాలను వాస్తవిక దృష్టితో వర్ణిస్తూ పాఠకులను ఆకర్షింప చేశారు.

---

[29] గోపి కవిత – మానవత – డా. గట్ల రవికుమార్ – పేజి – 5.

[30] ఆధునికాంధ్ర కవిత్వంలో మానవతావాదం – విశ్వంభర విలక్షణత (పిహెచ్.డి.) – డా. రావికంటి వసునందన్-పేజి-16

[31] గోపి కవిత్వం – I (వంతెన) – పేజి - 212

‘‘ప్రేమతో మొదలైన దారులన్నీ
ప్రేమనే చేరుకుంటాయి
మానవ మనోరథం
కరుణకు విహార స్థలం
ఇప్పుడు నా గుండె చప్పుళ్ళు
నేను నీవాడినే నీ వాడినే
అంటూ ధ్వనిస్తున్నాయి’’[32]

సర్వమానవ శాంతికి, ప్రేమకు కరుణే మూలాధారమని దాని ద్వారానే ప్రపంచం సుఖంగా ఉంటుందని చెబుతాడు. ‘ప్రేమ ఇచ్చిన ప్రేమ వచ్చును’ అన్నట్లుగా ప్రేమతో చేసే పనులు ఏవైనా తిరిగి ప్రేమనే అందిస్తుంది. మనుషుల మధ్య అంతరాల గోడల్ని కూలదోసి అందరూ ఒక్కటే అనడానికి ‘‘నేను నీవాడినే’’ అనేధ్వని చేత బలాన్ని చేకూర్చారు కవి.

మనుషుల మధ్య అంతరాల్ని తొలగించుకొని మాటలతో అందరినీ కలుపుకుపోవాలని మంచి మాటలే మానవత్వానికి మార్గాలని ‘‘నిశ్శబ్ద సంభాషణలు’’ అనే కవితలో

‘‘మాటలు కేవలం మాటలు కావు
మానవీయ మంత్రాలు’’[33]

అంటాడు. అందుకే ‘‘నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది’’ అన్నారు పెద్దలు.

‘‘యుద్ధం’’ అనే మరో కవితలో దేశ రాజధానిలో ‘నిర్భయ’ (2012, డిసెంబర్)పై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ దేశవ్యాప్తంగా జరిగిన నిరసనలకు కవి స్పందిస్తూ రాసిన కవిత మానవత్వాన్ని గుర్తు చేస్తుంది.

‘‘ఆమె కోసం
కోట్లాది మంది కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు
బహుశా దాని పేరు మానవత్వం

---

[32] హృదయరశ్మి – డా. ఎన్. గోపి – పేజి – 78.

[33] హృదయరశ్మి – డా. ఎన్. గోపి – పేజి – 91.

…   …   …   …
ఆమెకు తగిలిన గాయానికి
యావద్దేశం నొప్పితో మూల్గింది
బహుశా దానిపేరు మమకారం''[34]

ఆ రోజు జరిగిన సంఘటనకు స్పందించిన దేశ ప్రజలు తమ మానవత్వాన్ని చాటారని, ఆమెకు తగిలిన గాయానికి ప్రజలు కూడా ఆ నొప్పిని భరించారని, ఆమె వేదనను, బాధను తమ వేదనగా భావించారని చెప్తూ, ఆ స్పందించే గుణమే మమకారం అని అదే మానవత్వం స్వభావమని పేర్కొన్నాడు.

''వాఘా సరిహద్దు'' అనే కవితలో సరిహద్దుల మధ్య గస్తీ కాస్తున్న సైనికుల జీవితాలను, వారి అంతర్మథనాన్ని గురించి చెప్తూ ''మానవ జీవితాల మధ్య మొలిచిన ఉద్విగ్న రేఖను ఎప్పుడైనా చూశారా'' అంటూ దేశాల మధ్య ఉన్న అశాంతిని చూపుతూ, అది దేశాల మధ్య కాదు ప్రజల మధ్య అంటున్నాడు.

''బార్డర్ పైనే పుట్టాం మేం
బార్డర్ మాలో ప్రవహిస్తుంది
బార్డర్ మా జీవితం
బార్డర్ మా భయం
బార్డర్ మా సాహసం
బార్డర్ మా పోరాటం
దూర ప్రాంతాల్లో ఉన్న మీకు
మా అలజడి కేవలం మీకు వార్త
రెండు దేశాల్లోని
దొరల పుర్రెల్లో పుట్టిన బుద్ధి
బార్డర్ పై మంటలను రగిలిస్తుంది'' [35]

[34] హృదయరశ్మి – డా. ఎన్. గోపి – పేజి – 126.

[35] మా ఊరు మహాకావ్యం – డా. ఎన్. గోపి –పేజి -52

అని సరిహద్దు సైనికుల అవస్థలని, వారి దేశభక్తిని, వారి ప్రమేయం లేని పోరాటాన్ని మానవతా దృక్పథంతో అవగాహన చేసుకున్న కవి ప్రపంచశాంతిని ఆకాంక్షిస్తున్నాడు. ''బార్డర్'' అని చెప్పడంలో సైనికుల జననం, జీవితం, పోరాటం, సాహసం, భయం, అలజడులు అన్నీ అక్కడే అని చెప్తున్నాడు. ఇందులో అంతర్గతంగా యుద్ధవిముఖతను చూపడం జరిగింది.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షతో మాభూమి మాకు కావాలి. మా ఉద్యోగాలు మేం చేసుకోవాలి, మా ప్రాంతాన్ని మేమే పాలించుకుంటాం అనే నినాదాలతో ఎంతో స్థైర్యంతో ఉద్యమం చేసిన యువకులు, నాయకుల ఉద్రేకపు ప్రసంగాలతో ప్రభావితులై ఆత్మహత్యలు చేసుకొని ప్రాణత్యాగాలు చేసినవారిపై మానవతతో గోపి ''వద్దు బిడ్డా! చావొద్దు!'' అనే కవితలో–

''యువత కోసమే కదా ఉద్యమాలు
మరి నువ్వే లేనప్పుడు
తెలంగాణ వచ్చి మాత్రం ఏం లాభం?
... ...
నీ మరణం ఒక ఆర్తి
అది ఎవరికీ స్ఫూర్తి కాదు
చచ్చిపోతే వెంటనే చచ్చిపోతావు
బతికి ఉంటే నలుగురిని బతికిస్తావు
వద్దు బిడ్డా! చావొద్దు!''[36]

తెలంగాణది అస్తిత్వ అన్వేషణలోంచి వచ్చిన హక్కుల పోరాటం అనీ, యువత పోరాడి సాధించాలి కానీ చావుతో కాదనీ, చనిపోయిన వారిని తన బిడ్డలుగా భావిస్తూ మానవతా దృక్పథంతో ఆత్మహత్యలు వద్దని చెబుతున్నాడు. 'అంతర్గతం' అనే కవితలో మనిషి గురించి చెప్తూ–

''ప్రతి మనిషికీ
ఒక పరిమళం ఉంటుంది
మానవత
దాని సారాంశం అయినట్టు''[37]

[36] మా ఊరు మహాకావ్యం – డా. ఎన్. గోపి –పేజి -68

మనిషిలో ఏదో ఒక మంచి గుణం మానవత్వాన్ని చాటుతుందని, దాని వల్లనే అతడు మనిషి అవుతాడని అలాంటి మానవత్వం ప్రతి మనిషి కలిగి ఉండాలని పేర్కొంటున్నాడు.

''మనిషిని ముట్టుకుంటే తెలిసింది
మమత ఎంత కాంతివంతమో''[38]

మమతలు, అనుబంధాలు, అనురాగాలు, ఆప్యాయతలే మనిషిని మానవత్వంలో జీవించేలా చేస్తాయని, ఇవన్నీ మనిషికి మరో రూపాలని అంటున్నాడు.

గోపి కవిత్వంలో మానవతావాద స్పృహ ఉంటుంది. మానవత్వపు మౌలిక స్పందనలే గోపి కవిత్వానికి ఆధారం. అన్ని వాదాలు వెలవెలబోతున్న కాలంలో మానవతే మనిషికి ఆశ. గోపి కవిత్వంలో సాటి మనిషి పట్ల ఆర్ద్రత, ఆవేదన ఉంటాయి. అందుకే ''నా పద్యాలే నన్ను మనిషిగా మారుస్తాయి''[39] అంటారు.

''మనిషి పరిమళించటమే జీవితం
కాలపత్రం మీద
కాలాతీత సిరాతో రాసినప్పుడు
ఏర్పడిన చిత్రం పేరు
మనిషి''[40] అంటూ మనిషి నిర్వచనాన్ని ఇచ్చాడు.

కానీ కాలానికీ మనిషికీ ఒకటే తేడా. కాలం మారదు. మనిషి మారుతాడు. మానవీయత ఉట్టిపడే కవితగా ''ముసురులో ముసల్ది'' అనే కవితను ఉదహరించవచ్చు. ఇది శ్రీశ్రీ 'భిక్షువర్షీయసిని' పోలి ఉంటుంది. అనాథ అయిన ఓ ముసలమ్మ గాథ ఈ కవిత్వం. వర్షపు ముసురులో గజగజ వణుకుతూ సరైన బట్టలు లేక ఉండటానికి చోటు లేక ముడుచుకున్న కళ్లలో ప్రాణాలను బిగించుకొని ఆమె పడే బాధను కవి వర్ణించిన తీరు చూస్తే మానవత్వం ఉన్న మనిషెవరికైనా మనసు చలించక మానదు. ''అల్లవారి అందమైన మేడలో / వేడెక్కిన రేడియో

---

[37] మళ్లీ విత్తనంలోకి – డా. ఎన్. గోపి – పేజి -49

[38] రాతి కెరటాలు – డా. ఎన్. గోపి – పేజి – 3.

[39] గోపి కవిత్వం – I – పేజి - 280

[40] గోపి కవిత్వం – I – కాలాన్ని నిద్రపోనివ్వను - పేజి - 345

సంగీతం ముందు / వెచ్చని దుస్తుల్లో / నులివెచ్చని కలలు''[41] అంటూ కలవారికి ఉన్న సౌకర్యాలను తెలియజేస్తూ, ఆ చలిలో ముసలామె పడిన అవస్థలను చెప్పి ఏమిటీ వ్యత్యాసం? ఎందుకీ దుస్థితి? అంటూ ఆవేదన చెందుతాడు.

మరో కవితలో మానవ సంబంధాలు భ్రష్టపడుతున్నాయని, మానవత్వం ఉంది అనుకుంటాం కానీ కన్నీరు హృదయంలోంచి రానిదే మానవత్వం పరిమళించదని, హృదయంతో మనస్ఫూర్తిగా స్పందించే గుణం ఉండాలని చెప్తూ అదే మానవత్వం అంటారు. వంతెన లాగే మానవత్వం కూడా మనుషుల్ని కలిపే వారధి అన్నారు. ''మళ్ళీ మనం జన్మించాలంటే / విత్తనంలోకి వెళ్ళిరాక తప్పదు.''[42] మానవత్వం ఉన్న మనిషిగా బ్రతకాలంటే మళ్ళీ మనం మనిషిగా కొత్త జన్మ ఎత్తాలంటారు. నేటి ఆధునిక ప్రపంచంలో మనుషుల మధ్య నమ్మకాలు తగ్గిపోతున్నాయని, ఆశ నిరాశలకు అంతే లేకుండా పోయిందని, జీవితం అంతు పట్టని అగమ్యగోచరంగా తయారయ్యిందని, అన్నింటిని డబ్బుతోనే కొలిచే ధన సంస్కృతి వచ్చిందని, మనిషిని గురించి ఆలోచించే తీరిక, ఓపిక మరో మనిషికి లేకుండా పోయిందని, ఈ ధోరణులు మనుషుల్లో మానవత్వం నశించడానికి దారి తీస్తాయని హెచ్చరించడం జరిగింది. ''ఒక రకంగా జీవితం / సహజ రమ్య సంగీతం''[43] అని అలాంటి జీవితానికి మనిషి మానవత్వంతో మెలిగి సార్ధకత చేకూర్చాలని చెప్పడం జరిగింది.

ముంబయిలో ఉగ్రవాదుల దాడి జరిగినప్పుడు (నవంబర్ 26 నుండి 30, 2008) కలత చెంది మానవీయ దృష్టితో కవిత్వం రాశారు. ఉగ్రవాదులకు మానవత్వం అనేది ఉండదని, అసలు వారికేం కావాలో వారికే తెలియని స్థితిలో ఉన్నారని, వారికి ఒక నీతి అంటూ ఉండదని ఆగ్రహిస్తూ ''విధ్వంసం / మాంసం ముద్దల రూపంలో / పిశాచ తాండవం చేస్తుంది'', అంటూ అప్పటి దాడి జరిగిన తర్వాత స్థితిని వర్ణించారు. ఎవరి బాధలో వారుంటే రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం, శవరాజకీయాలు చేస్తూ అమానవీయంగా మొసలి కన్నీళ్ళు కారుస్తారని విమర్శించారు.

---

[41] గోపి కవిత్వం – I (తంగెడు పూలు) పేజి - 42

[42] మళ్లీ విత్తనంలోకి – డా. ఎన్. గోపి – పేజి - 10

[43] హృదయరశ్మి – డా. ఎన్. గోపి – పేజి - 66

సాధారణంగా సంఘజీవి అయిన మనిషి ఉరుకుల పరుగుల జీవితంలో స్వలాభం అనే స్వార్థంతో మరో మనిషిని పట్టించుకోవడం మానేశాడని, పైన గాంభీర్యం, లోపల వైషమ్యాలతో ఎవరితో కలవక ఒంటరి జీవితం గడుపుతూ ఓదార్చేవాడు కూడా లేని ఒంటరి జీవితానికి అలవాడు పడిపోయాడని నేటి పరిస్థితిని చెప్పడం జరిగింది. మన బాధలు, సుఖాలు, ఆనందం, ఆవేదన మొదలైన భావాలను పంచుకోవడానికి మనకు మనిషి కావాలని కానీ నేడు మనిషనే వాడు మాయమవుతున్నాడని ''ఇక్కడో మనిషి ఉండాలి ఏమయ్యాడు?'' అంటూ కవి ప్రశ్నిస్తాడు. నలభై సంవత్సరాల క్రితంనుండి కంప్యూటర్ల విన్యాసాల దాకా చాలా కాలం కలిసే ప్రయాణించామని ఈ మధ్యే మాయం అయ్యాడనడంలో టెక్నాలజీ మనుషుల్ని దూరం చేసిందని బాధపడ్డాడు. కదలికలూ, కవలికల్లోనే కాదు మానవ సంబంధాల్లో కూడా నిలువెత్తు నీడలు మొలిచాయని ''అతని చిరునామా తెలిస్తే తప్ప / నన్ను నేను చేరుకున్నట్టు కాదు''[44] అంటూ మానవత్వం ఉన్న మనిషి మాయమైన విధానాన్ని ఈ కవితలో పేర్కొన్నారు.

''నగరంలో ఎవరిని ప్రేమిద్దామన్నా
వారు వారినే ప్రేమించడంలో నిమగ్నమై ఉంటారు'' అంటూ మానవత్వం ఉన్న మనిషి జాడ కన్పించదంటారు. అందరూ ''ఎవరికి వారే యమునా తీరే'' అన్నట్లుగా ఉంటారు.

ఊరికి కావలి కాసే కావలి కార్ గురించి కూడా మానవత్వంతో కవిత రాశారు. ఇందులో ఊరికి, ఊరోళ్ళకు, కావలిగా ఉన్న కావలికార్ కు ''వీడికెవరండీ కావలి'' అంటూ వారి బాధల్ని కూడా పట్టించుకోవాలని సామాజిక బాధ్యత ఉన్న కవిగా స్పందిస్తారు.

మనుషుల మధ్య, మానవ సంబంధాలు, బంధుత్వాల మధ్య దూరాలు పెరిగి పోతున్నాయని, ప్రేమ, ఆప్యాయత అనే మాటల స్థానంలో అవసరం, స్వార్థం, ఈర్ష్య, ద్వేషం వంటివి ఎక్కువయ్యాయని ''మనుషుల్ని కలిపి కుట్టే దారం కోసం / ఏ పత్తి పువ్వుల్ని అర్థించను''[45] అంటూ దానికి చాలా సమయం పడుతుందని చెప్పకనే చెబుతున్నాడు. మనుషుల్లో ఉండే ద్వంద్వ ప్రవృత్తిని తెలుపుతూ, రెండు నాలుకల ధోరణి తగదని, మనిషిలోని రెండు ముఖాలను దర్శించిన కవిత 'ఒక్కని కోసం'. తనకు కావలసింది అంతర్ముఖులు,

---

[44] గోపి కవిత్వం – I (కాలాన్ని నిద్రపోనివ్వను) పేజి - 342

[45] గోపి కవిత్వం – I (కాలాన్ని నిద్రపోనివ్వను) పేజి - 305

లోపలొకటి, బయటొకటి ఉండే ద్విముఖులు కాదని మనకు కావల్సింది ఒక్కడే అని, అతడు పారదర్శకతతో, నిప్పులాంటి నిజమైన మనిషి, మానవత ప్రకాశించే ఋషిలాంటి మనిషి తోడు కావాలంటాడు. కానీ అలాంటి వారుండడం అరుదు అంటూ అసంతృప్తి పడుతాడు. టెక్నాలజీ పెరగడం వల్ల మనుషుల మధ్య ఆప్యాయతానురాగాలు తగ్గాయని ''చచ్చిపోతున్న ఉత్తరం'' కవితలో వర్ణిస్తాడు.

ఈ విధంగా ఈ కవితల్లో చూసినా మానవ సంబంధాలు ఉన్న కవితలే ఎక్కువగా కన్పిస్తాయి. గోపికి మట్టి వాసన ఎంత ఇష్టమో, మనుషులన్నా అంతే ఇష్టం అందుకే తన కవిత్వం మనుషులు, మానవ సంబంధాల చుట్టే తిరుగుతుంది. అలాంటి కవితే 'ఓ రాజయ్య కథ' కవిత మానవత్వం గురించే చెబుతుంది.

ప్రపంచీకరణ ప్రభావంతో వచ్చిన పారిశ్రామికీకరణ ప్రభావం వృత్తి కళాకారులకు ఏ విధంగా బతుకు దెరువు లేకుండా చేసిందో చెప్పి వారు వలస వెళ్ళడం లేదా ఆకలి చావులకు గురవడం లాంటి విషయాలను చెప్పడం జరిగింది. ఇక్కడ ఉపాధి లేక తెలంగాణ జిల్లాల నుండి బొంబాయి, షోలాపూర్ తదితర ప్రాంతాలకు వలస వెళ్ళే నేతన్నల జీవితాలను కళ్ళకు కట్టినట్లు హృదయ విదారకంగా, దయనీయంగా వర్ణించడం జరిగింది.

''అవి పట్టుచీరలు నేసిన అద్భుత హస్తాలనీ
బట్టపై బంగారు శిల్పాలు నాటిన
కళా విజయకేతనాలనీ మనకు తెలుసు
లోకాన్ని జలతారు ముసుగుల్తో కప్పిన వాడికి
దోతి చిరుగులెందుకున్నాయో'' [46] మనకు తెలుసంటాడు.

అగ్గిపెట్టెల్లో పట్టే చీరలను నేసే నైపుణ్యం ఉన్న మన నేతన్నల నేటి పరిస్థితిని చూసి ఎవరికైనా బాధ కలగక మానదు. కానీ మనకంటే బాగా ఆ బాధ–

''కళ్ళలోంచి ఎన్ని నదులు కారిపొయ్యాయో
అతని భుజమ్మీది ఆ నేత రుమాలు కెరుక!''[47] అంటారు.

[46] గోపి కవిత్వం – I (వంతెన) పేజి - 255

మన దేశంలో ఇలాంటి పరిస్థితి నేతన్నలకే కాదు అన్నం పెట్టే రైతుకు తినడానికి తిండి ఉండదు. నీడనిచ్చే ఇళ్ళు కట్టేవానికి గూడుండదు, మనకు బట్టలిచ్చే వాడికి కట్టుకోవడానికి గుడ్డ ఉండదు. మనిషి మనుగడకు కూడు, గూడు, గుడ్డ ప్రాథమికావసరాలని, అలాంటిది అవిచ్చే వారికే ఆ అవసరాలు తీరవని ఇది ఒక విచిత్ర పరిస్థితిలాంటిదని చెప్పడం జరిగింది.

2.9 స్మృతి కవిత్వం:

"Elegy" అనే ఆంగ్ల పదానికి తెలుగులో స్మృతిగీతాలు అని పేరు. ఎలిజీ ప్రధానంగా ఆంగ్ల సాహిత్యానికి చెందింది. ఎలిజీ మరణించిన వారి మీద రాసే శోక గీతం. "ఒక ప్రాణి మరణంవల్ల ఉద్విగ్నుడైన కవి తన హృదంతరంలో పరాకాష్ఠ పొందిన భావతీవ్రతని ఒక రచనలో ఇమిడ్చి చూపిస్తే అది స్మృతిగీతం"[48] మృతి చెందిన వారి వ్యక్తిత్వాన్ని, గుణగణాలను స్వభావాన్ని వర్ణిస్తూ చెప్పేది స్మృతి కవిత. "The Elegy is a lyrical expressive of melancholy of grief, in particular, when commemorative of dead friend"[49] (Encyclopedia Americans – Volume – 17)

1902లోనే వడ్డాది సుబ్బరాయ కవి రాసిన "సతీస్మృతి" తెలుగులో వచ్చిన తొలి స్మృతికావ్యం. ఈయనే "సుతస్మృతి" కూడా రాశారు. "తెలుగులో 1904లో ఆదినారాయణ మూర్తి ప్రేయసీ స్మృతి, డి. జగన్నాథరావు 1910లో మిత్రస్మృతి రాశారు. కానీ వీరు రాసిన ఈ రచనల్లో ప్రక్రియలో తప్ప కవిత్వంలో నవ్యత లేదు. నవ్య కవుల్లో మొట్ట మొదటి స్మృతికావ్యం రాసిన వారు రాయప్రోలు సుబ్బారావుగారు. గోపాలకృష్ణగోఖలే మరణవార్త వినగానే స్మృతికావ్యం రాశారు. తర్వాత బసవరాజు అప్పారావు, విశ్వనాథ సత్యనారాయణ, నాయని సుబ్బారావు మొదలైన వారు స్మృతికావ్యాలు రాశారు."[50] సినారె స్మృతి కావ్యాలను తన ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయములు : ప్రయోగములు అనే సిద్ధాంతగ్రంథంలో నాలుగు రకాలుగా విభజించారు. 1. దేశనాయకస్మృతి, 2. సతీస్మృతి, 3. సుతాదికస్మృతి, 4. ఆప్తస్మృతి. అరణ్యాల నుండి జనారణ్యాల వరకూ ఎక్కడ ఏ సమస్య తలెత్తినా బాలగోపాల్ తప్పనిసరిగా ఆ ప్రాంతానికి వెళ్ళి అధ్యయనం చేసి ప్రశ్నించేవాడు. గోపి మానవ హక్కుల

---

[47] గోపి కవిత్వం – I (వంతెన) పేజి - 255

[48] వ్యాస సంకలనాలు – వాడపల్లి లక్ష్మీనారాయణాచార్యులు – పేజి – 13.

[49] ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయములు, ప్రయోగములు – సినారె – పేజి - 473

[50] ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయములు, ప్రయోగములు – సినారె – పేజి - 451

ఉద్యమకారుడు బాలగోపాల్ మృతి చెందినప్పుడు (2009) ఆయన స్మృతిలో రాసిన కవిత ఇది–

''అడిగేవాడు ఒకడుండేవాడు
ఇప్పుడు లేడు
... ...
పౌర హక్కులకూ
మానవ హక్కులకూ మధ్య

సన్నని గీతను గుర్తించిన సులోచనుడు (అనడంలో పౌర హక్కుల సంఘం నుండి 1996లో బయటకొచ్చి మానవ హక్కుల వేదికను ఏర్పాటు చేయడం స్ఫురిస్తుంది.)

... ...
అతడు మేధోవనరు మాత్రమేకాదు
మానవీయ పవరు కూడా
అందుకే అతడు పోతే
మనం పోయినట్టుంది''[51]

అంటూ బాలగోపాల్ ని గుర్తు చేసుకుంటూ హక్కుల ప్రాధాన్యాన్ని, ప్రశ్నించే తత్వాన్ని, అతని కృషిని తెలిపాడు. చిత్రకారుడు, సినీదర్శకుడు అయిన ''బాపు'' (సత్తిరాజు వెంకట లక్ష్మీనారాయణ) మరణించినప్పుడు (2014) ఆయన గురించి 'మహోన్నతుడికి నివాళి' అనే కవితలో అతడి ప్రతిభను గుర్తించి, స్మరిస్తూ రాసిన స్మృతి కవిత ఇది.

''తెలుగు వాకిళ్ళలో
ముగ్గులాంటి వాడు బాపు
అతడు మాట్లాడడు
బొమ్మలే మాట్లాడుతాయి
... ...
రామున్ని ఎన్ని విధాలుగా దర్శించాడో!
... ...

[51] మా ఊరు మహాకావ్యం – డా. ఎన్. గోపి –పేజి -48

ఊపిరి తీగలుగా మార్చుకున్న
చిత్రకుంజమతడు
హృదయాల్లో వ్యాపించిన మధూళి
ఆ మహోన్నతుడికి నివాళి''[52]

బాపు గీసిన బొమ్మ తెలుగుదనానికి చిరునామాగా ఉంటుందని చెప్పడానికి తెలుగు వాకిళ్ళలో ముగ్గుగా అభివర్ణించాడు. బాపు గీసిన పల్లె పడుచు చిత్రాలు, రామాయణ గాథను తెలిపే బొమ్మలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. రామున్ని ఎన్ని విధాలుగా దర్శించాడో అనడంలో ఆయన దర్శకత్వం వహించిన సీతాకళ్యాణం (1976), సంపూర్ణ రామాయణం (1971), శ్రీరామాంజనేయ యుద్ధం (1974), శ్రీరామరాజ్యం (2011) వంటి చిత్రాలు గుర్తుకు వస్తాయి.

కవి తన అమ్మా నాన్నల్ని గుర్తు చేసుకుంటూ ఆనాటి అనుభూతుల్ని ''పాతఫోటో'' అన్న కవితలో పంచుకున్నాడు.

''నా పసితనంలో
మా తల్లిదండ్రులు
షోలాపూర్ లో తీసుకున్న ఫోటో ఇది''[53]

ప్రతి వ్యక్తికి తమ బాల్యానికి సంబంధించిన తీపి గుర్తులు ఉంటాయని చెబుతూ ఫోటో తీయించుకున్న సందర్భాన్ని గుర్తుచేసుకున్నాడు.

''ఈ ఫోటోలో
మా అమ్మనాన్నలు
శరీరాల్లోంచి విముక్తమైన
నీడల్లా ఉన్నారు.''[54]

---

[52] పురి విప్పిన ఊపిరి – డా. ఎన్. గోపి –పేజి -99

[53] పురి విప్పిన ఊపిరి – డా. ఎన్. గోపి –పేజి -11

[54] పురి విప్పిన ఊపిరి – డా. ఎన్. గోపి –పేజి 12

చనిపోయిన తన తల్లిదండ్రుల ఫొటోను చూస్తూ సర్వబంధాల నుండి విముక్తులయ్యారు అనడానికి ''శరీరాల్లోంచి విముక్తమైన నీడల్లా ఉన్నారు'' అంటారు. తల్లిదండ్రులపై ఎంతో మంది స్మృతికవితలు రాశారు. గోపి రాసిన కవితల్లో, జీవితపు ఆత్మీయ అనురాగాలు తొణికిసలాడి దేనికదే ప్రత్యేకమైందిగా కన్పిస్తుంది.

ప్రముఖ భాషావేత్త ''తెలుగువాక్యం'' రచయిత చేకూరి రామారావుగారు మృతి చెందినప్పుడు రాసిన కవిత–

''చేరాగారూ
మీరిక లేరంటే
ఆ ఖాళీలో
ఒక మహాశూన్యం ఆవరించింది''[55]

అంటూ ఆయన లేని లోటును గుర్తు చేసుకుంటున్నాడు.

ఉస్మానియాలో మీరు బోధించిన
వర్ణ సవర్ణాల పాఠాలు
... ...
దేహం సహకరించకున్నా
ఆర్ట్స్ కాలేజీ మెట్ల మీద
ఆగి ఆగి నడుస్తూనే ఉన్నారు''[56]

అంటూ ఆయనకు బోధన పట్ల ఉన్న ఇష్టాన్ని, దేహం సహకరించకపోయినా అనడంలో చివరి నిమిషం వరకు ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకుంటున్నారు.

'కార్గిల్' అనే కవితలో కార్గిల్ యుద్ధంలో మరణించిన సైనికుల స్మృతితో రాసిన కవిత. ఇండియా, పాకిస్తాన్ ల మధ్య 1999 మే మరియు జూలైలలో కాశ్మీర్ లోని కార్గిల్ వద్ద ఈ యుద్ధం జరిగింది. ఈ యుద్ధానికి 'ఆపరేషన్ విజయ్' అని పేరు పెట్టారు. ఈ యుద్ధంలో దాదాపు 527 మంది సైనికులు చనిపోయారు. వారిని స్మరించుకుంటూ బాధాతప్త

---

[55] పురి విప్పిన ఊపిరి – డా. ఎన్. గోపి –పేజి -75

[56] పురి విప్పిన ఊపిరి – డా. ఎన్. గోపి –పేజి 76

హృదయంతో రాసిన స్మృతి కవిత ఇది. ''స్నేహితుడిని ఆలింగనం చేసుకోవచ్చు/శత్రువునూ అర్థం చేసుకోవచ్చు/మైత్రిని నటించే ముష్కరుడే అర్థంకాడు''[57] అంటూ పాకిస్తాన్ తీరును దుయ్యబట్టారు. ఎరుపెక్కిన ఈ దేశ ప్రజల కళ్లన్నీ / నీ నొసట వీర తిలకాలై భాసిస్తాయి'' అనడంలో ఈ సంఘటనతో దేశ ప్రజల్లో ఆవేశం కలిగిందని, ''ఎరుపెక్కిన ఈ దేశ ప్రజలల్లో ఆవేశం పెల్లుబికిందని, ఎర్రబడ్డ ప్రజల కళ్లలోని ఎరుపు మీకు వీర తిలకంగా మారుతుందని ప్రజల్లో ఉన్న దేశభక్తిని చెప్తూ ఒళ్లు గగుర్పొడిచేలా వర్ణించారు. ఈ దేశ ప్రజలు నిర్భయంగా తిరుగుతూ, ప్రశాంతంగా గుండెలపై చేతులు వేసుకొని నిద్రపోతున్నారంటే కారణం మీ త్యాగమే. కాబట్టి కార్గిల్ వీరుడా! మా ఉద్రేకాలు, మా ఉద్వేగాలు, మా ఊపిరులు అన్నీ నీ క్షేమాన్నే కోరుతున్నాయి. అంటూ ''నీకూ మాకూ ఒకటే తేడా/నీది సాటిలేని పోరాటం/మాది క్షణక్షణ ఆరాటం''[58] అంటారు. నీది నిస్వర్థ జీవితం. మాది స్వార్థ జీవితం అనడం కవి ఉద్దేశం.

నటి 'తెలంగాణ శకుంతల' మరణించినప్పుడు రాసిన కవిత 'తెలంగాణా శకుంతల'. సినిమా వాళ్ళు చనిపోతే వారిని స్మరిస్తూ కొందరే అరుదుగా కవిత్వం రాస్తారు. కొన్ని వందల పాత్రల్ని పోషించిన ఆమె హఠాత్మరణం పొందినప్పుడు బాధపడుతూ రాశారు కవి. నీ ''పాత్రలన్నీ/నీ శవం చుట్టూ తిరుగుతున్నాయి/ఏ లాభం మృత్యువెప్పుడూ ఒంటరిదే''[59] అంటూ నీవు పోషించిన పాత్రలన్నీ నీ వెంట రావని పుట్టేటప్పుడు ఒంటరిగానే వస్తాం అలాగే మరణంలో మనకు తోడు ఎవరూ ఉండరంటూ జీవిత సత్యాన్ని చెప్పాడు. నీవు ఈ ప్రపంచంలో లేకపోయినా నీవు చేసిన గయ్యాలి పాత్రలు, అక్కా, చెల్లె, చిన్నమ్మ వంటి పాత్రలు ఎల్లప్పుడూ నిలిచిపోతాయి అన్నారు. గయ్యాలిరాలిగా నీవు నటించిన నటనను చూసిన మాకు నీవు వెళ్ళిపోతే ''ఎవరో మా వీధిని/హఠాత్తుగా ఖాళీ చేసినట్లు'' అనిపిస్తుందని బాధపడతాడు.

'మా అమ్మాయి' అని ప్రేమతో గోపి రెండు కవితలు రాశారు. ఒకటి 'కాలాన్ని నిద్రపోనివ్వను'' లోనిది. మరో కవిత 'వంతెన' కవితా సంపుటిలోది. రెండిటిలోనూ ఒకే శీర్షిక 'మా అమ్మాయి' తో స్మృతి కవితను రాశారు. గోపి కూతురు రచన డిసెంబర్ 21, 1996లో

---

[57] గోపి కవిత్వం – II (చుట్టకుదురు) డా. ఎన్. గోపి – పేజి - 165

[58] గోపి కవిత్వం – II (చుట్టకుదురు) డా. ఎన్. గోపి – పేజి - 166

[59] పురివిప్పిన ఊపిరి - డా. ఎన్. గోపి – పేజి - 67

మరణించింది. అప్పటి బాధను గుర్తు చేసుకొని అంతులేని దుఃఖంతో రాసిన కవితలు ఇవి. ''కలలా వచ్చింది/పీడకలలా వెళ్లిపోయింది.'' అంటూ ఆవేదన చెందారు.

''విజయాలే కాదు/వైఫల్యాలు కూడా జీవితంలో భాగమని నేర్పనందుకు/అనుభవించు నాన్నా''[60] అని నిర్ధాక్షిణ్యంగా వెళ్లిపోయిందని బాధపడ్డారు. తనకు తెలియదు తన మరణం క్షణమయితే, బ్రతికున్న మాకు ఆ మరణం క్షణ క్షణ నరకం అని అది చావుతో సమానమని, జీవచ్ఛవంలా బ్రతకడం లాంటిదని గుండెల్లో ఉన్న బాధను కవిత్వరూపంలో వెళ్ళగక్కారు. గోపిగారు రాసిన మా 'అమ్మాయి' కవితలను చూస్తే కవి బసవరాజు అప్పారావుగారు గుర్తుకొస్తారని ప్రముఖ విమర్శకుడు కడియాల రామ్మోహన రాయ్ 'గోపి సాహిత్య దర్శనం' (1998)లో పేర్కొన్నారు. అప్పారావుగారు కూడా తన కూతురైన 'మంగళ ప్రద' మరణించినపుడు గుండెలలో నుండి రక్తపు జీర అంటుకొని వచ్చిన రెండు గీతాలను రాశారని, ఇప్పుడు గోపి రాసిన కవితలు అలాంటివే అంటూ పోల్చి చెప్పారు. ''నేను బయటికి వెళ్ళేటప్పుడు/తను చిరునవ్వుతో వీడ్కోలు చెప్పకపోతే/నా విశాల ప్రపంచమంతా ఇరుకైపోతుంది''[61] అంటూ చెప్పడంలో తన లోకం, సర్వస్వం నా కూతురే అనీ, అలాంటి అమ్మాయి ఇప్పుడు మా మధ్య లేకపోవడం నరకప్రాయంగా ఉందంటూ ఆవేదన చెందాడు. ఇంతటి బాధను బలహీనులైతే భరించలేక వైరాగ్యంలోకి వెళతారు, అదే జీవిత సత్యం తెలిసిన మనిషి మృత్యు దుఃఖంలో నుంచే బతుకు సత్యాన్ని కవిత్వంగా ఆవిష్కరిస్తారు.

ప్రముఖ కవి, 'మోదుగపూలు' కవితా సంపుటిని రాసిన ఋక్నుద్దీన్ మరణాన్ని తలుచుకొని ఆయన స్మృతితో రాసిన కవిత 'ఋగ్వేదన' ''పాలెంనుండి/పాలమూరుదాకా/పాలమూరు నుండి/ప్రపంచ విశ్వవిద్యాలయం దాకా''[62] అంటూ ఋక్నుద్దీన్ జీవితాన్ని చెప్పడం జరిగింది. కొన్ని దశాబ్దాల పాటు ఈ కవితో కలిసి ఉద్యోగం చేశారని, తన కవిత్వాన్ని ఆరాధించిన వ్యక్తని, అనారోగ్యంగా ఉన్నప్పుడు పరామర్శకు వెళ్ళినప్పుడు ఆయన కళ్ళలోని వెలుగును మరిచిపోలేనంటూ స్మరించుకున్నారు.

[60] గోపి కవిత్వం – I - డా. ఎన్. గోపి – పేజి - 284

[61] గోపి కవిత్వం – I - డా. ఎన్. గోపి – పేజి - 232

[62] మళ్ళీ విత్తనంలోకి - డా. ఎన్. గోపి – పేజి - 102

ఇంకా స్మృతికవిత్వంలో భాగంగా బాల్యమిత్రుడైన ఎలిమినేటి మాధవరెడ్డి చనిపోయినప్పుడు, ఆచార్య తిరుమల మరణానికి, గోపి కవితలను 'గోపికే సౌ నజ్ మే' పేరుతో ఉర్దూలోకి అనువదించిన ఉర్దూ కవి ప్రొఫెసర్ గియాస్ మతీన్ స్మృతికవితను, గోకుల్ చాట్ బాంబు పేలుళ్ళలో మరణించిన వారిని స్మరించుకుంటూ మానవత్వంతో రాసిన కవిత, ప్రముఖ రచయిత్రి అయిన డా. హేమలతా లవణం మృతికి స్మృతిగా రాసిన కవిత, నాగభైరవ చనిపోయినప్పుడు రాసిన కవిత, హిందీ భాషా శాస్త్రవేత్త, అనువాదకుడు అయిన డా. పోలి విజయ రాఘవరెడ్డి చనిపోయినప్పుడు రాసిన కవిత, ప్రముఖ కవి గుడిహాళం రఘునాథం చనిపోయినప్పుడు, కులనిర్మూలన సంఘ ఉద్యమకారుడు డి.జి. రామారావు స్మృతిలో, గోపి తన అమ్మగారు మరణించినపుడు టెలిగ్రామ్ అందక ఆలస్యంగా అంత్యక్రియలకు హాజరై ఆ బాధను జీర్ణించుకోలేక చితిమంటల వేడిలో రాసిన 'అమ్మ' కవిత, దేవులపల్లి రామానుజరావు స్మృతిలో రాసిన కవితలు చాలా ఉన్నాయి. 'కాలాన్ని నిద్రపోనివ్వను' కవితా సంపుటిలో చాలా కవితల్లో గోపి వాళ్ళ అమ్మాయి మృత్యుజీర కన్పిస్తుంది. ఈ విధంగా గోపి కవిత్వ సంపుటాల్లో స్మృతికవిత్వం ఎక్కువగా కన్పిస్తుంది. ఇది కవిలోని బాధకు, ఆర్తికి, దుఃఖానికి, ఆవేదనలకు, మానవతకు ప్రతీకలుగా నిలుస్తాయి.

2.10 వస్తుకవిత్వం:

కవిత్వానికి వస్తురూపాలు రెండూ సమానమే. మనందరికీ పరిచయమున్న వస్తువులపై కవిత్వం రాసి దాని సహజ గుణాలు, ఉపయోగాలను వర్ణించడం ఇందులోని ప్రత్యేకత. కవి తాను చూసినదేదైనా, విన్నదేదైనా కవితాత్మకంగా తీర్చిదిద్దితే అది వస్తు కవిత్వం అవుతుంది. వస్తువు ముఖ్య ప్రయోజనం కవి సందేశాన్ని చదివేవారికి అందించడమే. ఆ వస్తువు రూపం, స్వభావం కళ్ళ ముందు కనబడేలా కవి రాసిన కొన్న కవితలు–

''కొబ్బరికాయ'' అనే కవితలో గోపి దాని స్వరూప, స్వభావాలను చెబుతూ అనుభూతి పొందుతాడు.

''కొబ్బరికాయ లోపలి
చీకటిలో ప్రవేశించి
వెలుతురు కలలను కనాలని ఉంది
కొబ్బరినీళ్ళ సముద్రంలో

చిట్టిపడవనై
అలల తల్పంపై ఊగాలని ఉంది''[63]

అంటూ కొబ్బరికాయ స్వరూపాన్ని, నిర్మాణాన్ని చెబుతూ ''చీకటిలో ప్రవేశించి వెలుతురు కలలను కనాలని ఉంది'' అనడంలో ప్రతికూలతలో కూడా అనుకూలతను వెతకడం కన్పిస్తుంది. దీనిలో నిరాశకు లోను కాకుండా ఆశతో జీవించాలనే అంతర్గత బోధన ఉంది.

''నారికేళం లాగే ముక్కంటినై
నరుల అకృత్యాలకు వ్యతిరేకంగా
రగిలి పోవాలని ఉంది''[64]

నారికేళాన్ని శివుడితో పోల్చాడు. కొబ్బరికాయకు మూడు కళ్ళు ఉంటాయి, శివుడూ త్రినేత్రుడే. కాబట్టి శివుడిలా అన్యాయాల్ని, అక్రమాల్ని కాలరాలుస్తూ మూడో కన్ను తెలవాలనుంది అంటారు.

''దండెం'' అనే మరో కవితలో–

''ఒకే ఒక్క బట్టల జత
ఆరేసినప్పుడు
దండెం విలువ తెలుసొచ్చింది
... ...
ముసురులో తడిసిన గాలిలో
రెండు వైపులా నిలబడ్డ మా చేతులే
దండెంగా మారి
ఉయ్యాలలూపి ఆరబెట్టేవి''[65]

రెండు వైపులా చిన్న కర్రల మధ్య తాడుతో ఉండేది దండెం. బట్టలు ఆరవేసుకోవడానికి దండెం వాడుతారు. ఒక్క జత బట్టలు ఆరేసినప్పుడు దండెం విలువ తెలిసింది అన్నప్పుడు

---

63 పురి విప్పిన ఊపిరి – డా. ఎన్. గోపి –పేజి -22.

64 పురి విప్పిన ఊపిరి – డా. ఎన్. గోపి –పేజి – 22.

65 మళ్లీ విత్తనంలోకి – డా. ఎన్.గోపి – పేజి – 41

పేదరికం గుర్తుకు వస్తుంది. బట్టలు ఆరబెట్టే పద్ధతిని చెప్తూ కవి తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నాడు.

''బొంతలూ దుప్పట్లూ బరువు
మోపినప్పుడు మాత్రం
మొయ్యలేక కూలబడేది
అయితే ముడి వేసుకొని
మళ్ళీ లేచి నిలబడేది''[66]

సమస్యలు, అపజయాలు ఎదురైనప్పుడు మనిషి కూడా వాటిని దాటుకొని, ఎదుర్కొని ధీటుగా నిలబడాలని చెప్పడానికి బరువుకు దండెం కూలబడితే మళ్ళీ ముడి వేస్తే లేచి నిలబడుతుందని చెబుతున్నాడు. ''అనుబంధాలను మోసే మానవీయ ధాతువు'' అని దండెంలో కూడా మానవీయ కోణాన్ని చూపుతాడు. కవిత్వాన్ని ఆస్వాదించే గుణం ఉండాలే కానీ ఎన్ని కోణాల్లో అయినా దర్శించవచ్చు అనడానికి ఈ కవితే నిదర్శనం.

''నిచ్చెన'' అన్న కవితలో మనోవికాసానికి, ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి చెప్పే అంశాలు కూడా ఉన్నాయి.

''ఒక్క మెట్టు విరిగినా
ఎక్కడం మానలేదు''

అనడంలో ఒక పనిని మొదలుపెట్టినప్పుడు పరాజయం ఎదురైనా వెనుదిరిగి చూడరాదని చెబుతాడు.

''నిచ్చెన మెట్లు
ఎనిమిదే కావచ్చు
కాని చుట్టూ
ఎన్నో జ్ఞాపకాలు''[67]

అంటూ నిచ్చెన రూపాన్ని దృశ్యగోచరం చేశాడు.

---

[66] మళ్లీ విత్తనంలోకి – డా. ఎన్.గోపి – పేజి – 42

[67] మళ్లీ విత్తనంలోకి – డా. ఎన్.గోపి – పేజి – 67

'గది' అనే వస్తు కవితలో గది నిర్మాణ స్వరూపాన్ని తెలియజేశాడు. ''కిటికీ/గోడలో జీవిస్తుంది/గోడ లేకుండా/దానికి అస్తిత్వం లేదు.''[68] అనడంలో గోడ వల్లనే కిటికీకి ఒక గుర్తింపు ఏర్పడిందని చెప్పడం కవి ఉద్దేశం. దీన్ని మన జీవితానికి అన్వయించుకుంటూ మనకంటూ ఏదో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉండాలంటారు. గోడ వల్లనే గది ఇరుకుగా ఉంటుందని కానీ చీకట్లో గోడ కనిపించనప్పుడు ఆ గదే విశాలంగా కనబడుతుందని, ఏదైనా మనం చూసే దృక్పథాన్ని బట్టే ఉంటుందని దానిలోని అంతరార్థాన్ని చెప్పడం జరిగింది.

'దారం' అనే కవితలో దారం మొదలు ఎక్కడో అర్థం కాదని దాని మూలాలను దూదిలో గానీ, ఆ దూదిని ఇచ్చే మట్టిలో గానీ వెతకాలి అప్పుడే దాని పుట్టుక తెలుస్తుందని, అలాగే మనిషి కూడా ఎంత ఎత్తుకు ఎదిగినా తాను వచ్చిన మూలాల్ని మర్చిపోకూడదన్న విషయాన్ని గుర్తుచేశాడు. దారం బహురూపాలని వేలికి చుడితే ఉంగరమవుతుందని, చెయ్యికి కడితే కంకణం అవుతుందని, మెడలో ముడి వేస్తే మంగళసూత్రమవుతుందని, అలాగే మనుషుల్లో కూడా అనేక రకాలుంటారని మనం ఏ దృష్టితో చూస్తే ఆ కోణంలో కనబడుతారనే విషయం అవగతం చేశారు. ''పుస్తకానికి గ్రంథమనే బిరుదు/దారం ప్రసాదించిన వరం'' అనడంలో 'గ్రంథం' అంటే ముడి వేయబడింది అనే అర్థం స్ఫురిస్తుంది. దారంతో ముడి వేస్తాం కాబట్టి ఆ ఘనత దారానిదేనని కవి భావన. చివరగా ''సూది వైపు కదిలే అనురాగం/విడిపోతున్న మనుషులను/చూపులతో కుట్టే మమకారం''[69] మనుషుల మధ్య దూరాలు పెరగకుండా దారం అనే మమకారంతో కలపాలని కవి ఉద్దేశం.

'పాత్రలు' అనే కవితలో ఇవి మన జీవితంలో భాగమయ్యాయని అవి మన కుటుంబసభ్యుల్లా కన్పిస్తాయంటాడు. మట్టి పాత్రలు పోయి దాని స్థానంలో వచ్చిన ప్లాస్టిక్, అల్యూమినియం, స్టీల్, ఇత్తడి పాత్రల భాగస్వామ్యాన్ని చెప్పారు. పగుళ్ళు వచ్చిన పాత్రలను అతికిస్తుంటే చెదిరిపోయిన జ్ఞాపకాలన్నీ ఒకచోట చేర్చినట్లుగా ఉంటుందంటూ నూతన భావనతో చెప్పిన విధం కొత్తగా ఉంది.

ఈ విధంగా వస్తుకవిత్వంలో వస్తువు స్వరూప, స్వభావాలే కాక మన జీవితానికి అన్వయించుకునే అనేక విషయాలు కూడా చెప్పడం విశేషం. చిలక్కొయ్య, లెటర్ బాక్స్, అంగి,

---

[68] పురివిప్పిన ఊపిరి – డా. ఎన్. గోపి – పేజి - 25

[69] పురివిప్పిన ఊపిరి – డా. ఎన్. గోపి – పేజి - 36

పిన్నీసు, జల్లెడ, కుర్చీ, గొడుగు, చెత్తబుట్ట, బలపం, జిందాతిలిస్మాత్ వంటి వాటినెన్నింటినో వస్తువులుగా తీసుకొని కవిత్వం రాయడాన్ని బట్టి చూస్తే 'కాదేది కవితకనర్హం' అన్న విషయం నిరూపితమవుతుంది. వస్తువు ఎలాంటి దైనా కవిత్వం రాయవచ్చేమో కాని ''వస్తువు లేకపోతే మాత్రం కవిత్వం పస్తులుంటుంది'' అంటారు.

2.11 కవిత్వంపై కవిత్వం:

నిర్వచనానికి లొంగని పదం కవిత్వం. ఈ పదం గురించి ఎందరో కవులు ఎన్నో రకాలుగా నిర్వచించారు. ''ఖాళీల్లో ఉన్న మౌనాన్ని శబ్దాలతో నింపకూడదు. మాట, మౌనాల మధ్య ఒకానొక సమతౌల్యాన్ని సాధించిన వాడే మంచి కవి. కవిత్వం కేవలం ఉద్యమాల వాహిక మాత్రమే కాదు. వాటి స్ఫూర్తికి వేదిక. ఇట్లా అనడం ఉద్యమాన్ని తక్కువ చేయడంకాదు. కానీ కవిత్వం జీవితం అంత పెద్దది. ఉద్యమం దానికి పూసిన అగ్నిపుష్పం. అంతర్ బహిర్ యుద్ధారావమే కవిత'' అంటారు గోపిగారు. (జీవితం ఒక ఉద్యమం – ఎస్. వి. సత్యనారాయణ కవితా సంకలనానికి ముందుమాటలో) అలాగే గుంటూరు శేషేంద్ర శర్మగారు– ''నా కన్నుల మీద వాలిన / సీతాకోకచిలుకలే కవితలు'' అన్నారు. కవిత్వ భాష సాధారణ వ్యవహార భాషకు భిన్నంగా ఉంటుంది. కవిత్వ భాషను సామాన్య భాష నుంచి వేరు చేసి చూడాలి. స్పానిష్ కవి, నోబెల్ పురస్కార గ్రహీత (1971) అయిన ప్లాబోనెరూడా (Pablo Neruda) కవిత్వాన్ని గురించి చెప్తూ–

''నా కవిత్వం గురించి నన్నడగకండి
కర్షకుణ్ణడగండి, కార్మికుణ్ణడగండి
అతని నుండొచ్చిందే నా కవిత్వం
అతడే నాకు మహాకవి'' –ప్లాబో నెరూడా

అంటూ పీడిత వర్గాల నుండి వచ్చిందే నా కవిత్వం అంటారు. ఇలాంటి అనిర్వచనీయమైన కవిత్వంపై కూడా గోపిగారు కవితలు రాయడం జరిగింది. వాటిలో–

''నా కవిత
నాలోనే కొట్టుమిట్టాడుతుంది
వెలికి రాదు
వెలిసి పోదు

అణచిపెట్టలేని అణుపరమాణువుల సంగ్రామం
ఏదైనా విస్ఫోటనంతోనే ముగుస్తుంది
... ...
ఇప్పుడిక ఒంటరితనం లేదు.''[70]

కవిత్వం తనలో కొట్టుమిట్టాడుతుందని, అది ఎప్పటికీ నశించదని, నిరంతరం చలనశలమై ఉబికి వస్తుందని, కవిత్వం తనకు అండగా ఉన్నంతవరకు తాను ఒంటరిని కానని చెబుతున్నాడు. కవిత్వం వెలువడే సంఘర్షణను కవి అణువిస్ఫోటనంతో పోలుస్తున్నాడు. కవిత్వం వల్లే కాగితానికి విలువ వస్తుందని చెబుతూ ''పురి విప్పిన ఊపిరి'' అనే కవితలో–

''అరచెయ్యంత కాగితం
కవిత్వం వల్ల
ఆకాశమంత విస్తీర్ణం పొందుతుంది''[71]

కవి రాసిన కవిత్వంవల్లే కాగితానికి, కవిత్వానికీ తద్వారా కవికీ గుర్తింపు వస్తుందని భావిస్తున్నాడు.

''ఖైదీలుగా ఉన్న భావాలు
ముక్తిని ప్రసాదించడమే కవిత్వం
కవిత్వానికి ప్రాణమే ప్రాతిపదిక
జీవితం దాని వేదిక''[72]

కవి హృదయంలోని భావాలకు అక్షరరూపాన్ని ఇవ్వడమే కవిత్వమని చెబుతూ, కవిత్వానికి చైతన్యం ఉంటుందని, అది జీవితానికి ప్రతిబింబం అని చెబుతూ కవిత్వంపై తనకు గల అభిప్రాయాలను వ్యక్తపరిచాడు.

కవిత్వం సామాన్యమైంది కాదని అది సంవేదనకు పర్యాయపదం అంటారు గోపి. ''కవిత్వం లేకుంటే/సూర్యోదయం లేనంత పాపం'' అంటూ కవిత్వం రాయలేకుండా ఉండలేనని అంటారు. మనస్సులో పట్టలేనంత ఒంటరితనం ఉంటే కవిత్వమే నన్ను

[70] పురి విప్పిన ఊపిరి – డా. ఎన్. గోపి –పేజి -60.

[71] పురి విప్పిన ఊపిరి – డా. ఎన్. గోపి –పేజి -108.

[72] మళ్ళీ విత్తనంలోకి – డా. ఎన్.గోపి – పేజి – 65.

కాపాడుతుందని, కవిత్వానికి ప్రాణం ప్రాతిపదిక. జీవితం దాని వేదిక అని నిర్వచించాడు. కవిత్వమంటే సారంలేని శబ్ద విహారం కాదని చెప్తూ–

''కవిత్వమంటే/ఎక్కి కూర్చునే/అహంకార సింహాసనం కాదు/ప్రేమ పూర్ణమై/వినమ్రమైన నమస్కారం''[73] అంటూ వినయాన్ని చూపారు.

''కవిత్వమంటే పువ్వుగా మారిన వజ్రం
కవిత్వం ధాటికి మలినాలన్నీ దగ్ధం''[74]

అనడంలో కవిత్వం పువ్వులా సుకుమారంగా, మెత్తగా ఉంటూనే, సమయాన్ని బట్టి వజ్రంలా కఠినంగా మారగలదని, కవిత్వం సమాజంలోని కుళ్లు, కుతంత్రం, అన్యాయం, ఈర్ష్య, స్వార్థం, ద్వేషం, అమానవీయత వంటి మలినాలను శుభ్రం చేస్తుందని కవిత్వానికి అంతటి శక్తి ఉందని వివరించారు. అయితే అలాంటి కవిత్వం రాయాలంటే స్వేచ్ఛ ఉండాలి. అందుకే ''స్వేచ్ఛను మించిన కవిత్వం ఏముంటుంది''? అంటారు. ''కవిత్వాన్ని చూస్తే/నదికి అసూయ కాబోలు/కవిత్వం సర్వదిశా ప్రవాహిని''[75] అంటూ కవిత్వం సమాజంలోని అన్ని వర్గాల వారిని, అన్ని మనస్తత్వాల వారిని ఆకట్టుకుంటుందని అందుకే కవిత్వాన్ని సర్వదిశా ప్రవాహిని అన్నారు. ''ప్రజలకన్నా/నా కవిత్వం గొప్పదేం కాదు/ వారి పాదాల కన్నా/నా కవిత్వ పాదాలు చురుకైనవేం కాదు''[76] ప్రజల్లో నుండే కవిత్వం వస్తుంది. వారే కవిత్వానికి ప్రేరణ కాబట్టి వారి నుండే పుట్టిన నా కవిత్వం వారి కన్నా గొప్పదేం కాదంటారు. కవి కన్నా కవిత గొప్పదని, అతడు మరణించినా అతడు రాసిన కవిత్వం ప్రజల్లో నిలిచే ఉంటుంది. అందుకే ''కవి మనిషవుతాడు/ మనిషి మరణిస్తాడు/ కవిత జీవిస్తుంది'' అంటాడు. మనం రాసిన కవిత్వం ఎవరినో కాదు ముందు నిన్ను కాపాడనీ, ఆ తర్వాత సమాజాన్ని కాపాడడానికి ప్రేరేపించు అని చెప్తూ ''దగ్ధమయ్యే అహంలోంచి/లేచే వెలుగురవ్వ కవిత్వం'' అంటూ ముందుగా మనలోని అహాన్ని పూర్తిగా తుడిచివెయ్యాలంటూ హితబోధ చేస్తారు.

---

[73] మళ్లీ విత్తనంలోకి – డా. ఎన్. గోపి – పేజి - 89

[74] మా ఊరు మహా కావ్యం – డా. ఎన్. గోపి – పేజి - 107

[75] మా ఊరు మహా కావ్యం – డా. ఎన్. గోపి – పేజి - 92

[76] మా ఊరు మహా కావ్యం – డా. ఎన్. గోపి – పేజి - 7

కవి దృష్టిలో కవిత్వ దృక్పథం ఎలా ఉండాలంటే– ''ముట్టుకుంటే తగలాలి కవిత్వం/ మనిషిలాగ/ నరాల్లో ప్రవహించే రక్త పుష్పాలు/ వెచ్చగా తాకిపోవాలి.''[77] అంటూ కవిత్వ నిర్వచనాన్ని ఇవ్వడం జరిగింది. కవిత్వానికి మనిషంతటి ఉన్నతమైన స్థానాన్ని ఆపాదించి, కవిత్వాన్ని అంతస్సంఘర్షణకు వాహికగా తీసుకున్నారు. కవితా రహస్యం ఎవరికీ తెలియదని కవి అన్నా, ఆ రహస్యం తెలిసినవారే ''కవిత్వం కన్నీళ్ళ నుండి తీసిన విద్యుత్తు'' అని నిర్వచించగలరు. ''జీవితం ఇరుకైనప్పుడు/ మైదానాలను మరింత విశాలం చేసేది కవిత్వం''[78] అనడంలో కవిత్వానికి సంకుచితత్వం ఉండదని, విశాల భావాలతో, వివిధ దృక్పథాలను కలిగిస్తుందని కాబట్టి కవిత్వం మైదానమంత విశాలమైందని పేర్కొన్నారు. ఈ విధంగా కవిత్వాన్ని నిర్వచిస్తూ, కవితీకరణ శక్తిని, కవితాత్మను తెలియజేస్తూ రాసిన కవితలు గోపి కవిత్వ సంపుటాల్లో చోటు చేసుకున్నాయి.

2.12 తెలంగాణ ప్రాంతీయ కవిత్వం:

ప్రాంతీయ చైతన్యం, అస్థిత్వం, ఉనికి, సంస్కృతి కేంద్ర బిందువులుగా తెలంగాణ ఉద్యమం మొలకెత్తింది. భూమి, నీరు, ఉద్యోగాలు అనేవి ముఖ్య భూమికలుగా ఉద్యమం ప్రారంభమైంది. ఇలాంటి నేపథ్యంలో ఎంతోమంది కవులు, కళాకారులు, రచయితలు తమ వాదాలను, అభిప్రాయాలను కవిత్వం, పాట, కథలు, నవలల రూపంలో పంచుకున్నారు. గోపి కూడా తెలంగాణ ప్రాంతం వాడే కావడంతో ఇక్కడి సమస్యలు, ఉద్యమ పరిస్థితిని, తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని తన కవిత్వంలో చెప్పడం జరిగింది. ముఖ్యంగా మానవత్వం ఉన్న కవిగా గోపి తెలంగాణ మాండలికంలో రాసిన 'మంచి తిండి' కవితను చెప్పవచ్చు. కవి మహబూబ్ నగర్ జిల్లాలో UNICEF ప్రాజెక్టు చేయడానికి వెళ్ళినప్పుడు అక్కడి ప్రజల దుస్థితిని చూసి చలించి రాసిన కవిత ఇది. తెలంగాణ వెనుకబడిన ప్రాంతం. అందులో మహబూబ్ నగర్ కరువు ప్రాంతంగా, వలసల ప్రాంతంగా పేరొందింది. అక్కడి ప్రజలకు సరైన తిండి లేక పోషకాహారలోపంతో బాధపడుతుంటారు. అలాంటి వారిని చూసి రాసిన కవిత –

''ముద్దొచ్చె నాకొడుకు
మొద్దు వారిండు దొరా
వద్దంటె దినెటోడు

[77] గోపి కవిత్వం – I (చిత్రదీపాలు) – పేజి - 148

[78] గోపి కవిత్వం – I(కాలాన్ని నిద్రపోనివ్వను) – పేజి - 294

బుక్కెడన్న దింటలేదు

జర కడుపు జూడంౘ్రి దొరా

నా కడుపు గాయింౘ్రి దొరా!''[79]

అని అడగడంలో ఉన్న దీనావస్థ తెలుస్తుంది. తెలంగాణ వ్యథార్థ జీవితగాథ ఈ కవితలో కన్పిస్తుంది. మట్టిమనుషులకు, శ్రమజీవులకు మంచితిండి ఎప్పుడూ ఉండదన్న సత్యం బోధపడుతుంది.

''పేదరాలి రోదన విని

తలపైకెత్తాడు డాక్టరు

మీవోనికి రోగమేం లేదు

Malnutrition

అంటే తిండి గావాలె

మంచి తిండి''[80]

Malnutrition (పోషకాహారలోపం) అంటే కూడా అర్థం తెలియని, మట్టి మనుషుల దీన వ్యవస్థను చూసి మనసున్న మనుషులెవ్వరికీ తిండి ఉన్నా తినాలనిపించదు. ఇదే మానవతగా కవి భావించారు.

అలాగే ''పచ్చిబతుకు శాంతమ్మ'' అనే మరో కవితలో వానలో పచ్చి బాలింత కట్టెలకోసం వెళ్ళి అనారోగ్యానికి గురై మరణించిన విధానాన్ని కవి వర్ణించిన తీరు హృదయ విదాయకరంగా ఉంది.

''గోలీలు గావలె దొరా

సూది మందియింౘ్రి దొరా!

... ...

ఏందినాలె?

రెక్కాడితే డొక్కాడుతుంది''[81]

---

[79] గోపి కవిత్వం – I (తంగెడుపూలు) డా. ఎన్. గోపి – పేజి - 48

[80] గోపి కవిత్వం – I (తంగెడుపూలు) డా. ఎన్. గోపి – పేజి - 48

[81] గోపి కవిత్వం – I (తంగెడుపూలు) డా. ఎన్. గోపి – పేజి - 62

అంటూ తెలంగాణలోని స్త్రీల జీవనగాథల్ని ఈ కవితలో చెప్పారు. రెక్కాడితే డొక్కాడని బ్రతుకులను, పని చేయనిదే పూటగడవని పేదరికాన్ని ఈ కవిత తెలుపుతుంది. 'ఎందుకు పోయినవు శాంతమ్మా' అని డాక్టరు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండానే ఆమె చనిపోయిందని కవి ఆవేదన చెందుతాడు. 'పల్లెల్లో మన పల్లెల్లో' అనే కవిత పూర్తి మాండలికంలో రాసింది. కరువు వాతావరణాన్ని చూసి చలించి రాసిన కవిత ఇది.

''మనిండ్లకాడ
తల్లి బాగలేదు
పిల్లలు బాగలేరు
కుండల్ల ఇత్తుల్లేవు''[82]

అని అందరూ అనారోగ్యం పాలై తినడానికి తిండిలేని పరిస్థితిని వివరించారు. ఇంకా ఈ కవితలో తెలంగాణ ప్రాంతంలో సర్వసాధారణమైన బానిస బ్రతుకును కళ్ళకు చూపించారు. గ్రామీణ విషాదాన్ని కళ్ళకు కట్టినట్టు చూపారు.

''గడ్డిగొయ్యే గౌరీ మోపుగట్టు
పటేలోల్ల కొత్త బర్రె యీనింది
కల్లుగియ్యిరా రాములూ బుడ్డినింపు
పటేలింట్ల పట్నం సుట్టాల్ దిగిండ్రు''[83]

అని బానిస బ్రతుకులు ఎలా ఉంటాయో చెప్తున్నాడు. దీనికి కారణం పేదరికం, నిరక్షరాస్యత, ప్రశ్నించేతత్వం ప్రజల్లో లేకపోవడమే. ఆ తర్వాత దొరల నిరంకుశత్వంపై తిరుగుబాటు జరిగింది. ప్రజలు చైతన్యవంతులయ్యి ప్రశ్నించడంతో ఈ వ్యవస్థ క్రమంగా కనుమరుగవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ పలుకుబడి, నుడికారానికి ఈ మూడు కవితలు మచ్చుతునకలు.

---

[82] గోపి కవిత్వం – I (మైలురాయి) డా. ఎన్. గోపి – పేజి - 86

[83] గోపి కవిత్వం – I (మైలురాయి) డా. ఎన్. గోపి – పేజి - 86

‘తెలంగాణ’ అనే మరో కవితలో తెలంగాణ ఉద్యమం జరిగిన తీరును వర్ణిస్తున్నాడు. ‘‘నిన్న హైదరాబాద్ రోడ్ల నిండా / లక్షలాది పదాలు’’[84] అంటూ అందరినోటా, ఒకటే మాట ‘‘దక్కులు పిక్కటిల్లేలా / ఒకే ఒక్క నినాదం’’ అది ‘తెలంగాణ’ అంటూ వివరించడం జరిగింది.

తెలంగాణ ప్రజల దుర్భర జీవితాలను చెప్పే మరో కవిత ఇది.

‘‘మెతుకును పట్టుకున్నట్టు
ఒక పల్లెను చూస్తే చాలు
తెలంగాణా తెలిసిపోతుంది
పెచ్చులు రాలే మట్టిగోడలు
మరింత వొంగిన చూర్లూ
అరుగుల మీద అవిటి బాల్యాలూ
కాళ్ళతో నడవలేని వృద్ధాప్యాలూ
వలసబోయిన ఊపిర్లూ’’[85]

తెలంగాణ దుస్థితిని వర్ణించడానికి ఆ ప్రాంతమంతా తిరగనక్కర్లేదని ఏ ఒక్క పల్లె చూసినా అర్థమవుతుందని, బ్రతుకు దెరువు కోసం వలస పోయిన వారి ఇళ్ళు శిథిలావస్థలో ఉంటాయని వివరించాడు. అవిటి బాల్యాలూ, నడవలేని వృద్ధాప్యాలూ అని చెప్పడంలో ఫ్లోరైడ్ బాధిత ప్రజల బాధను వివరించారు. కవి ఫ్లోరైడ్ బాధిత ప్రాంతం నుండి వచ్చినవాడే కాబట్టి ఈ విషయం గురించి పడ్డ వేదన కన్పిస్తుంది ఈ కవితలో.

‘మరో సంకల్పం’ అనే కవితలో రాష్ట్రం విడిపోవడం వల్ల కొంపలేమీ మునగవని, అన్నదమ్ముల కాపురాలు వేరయ్యాయని భావిద్దామని, ఎవరి విస్తరి వారిదే, ఎవరి అన్నం వారికే అంటూ రాష్ట్రాన్ని కుటుంబంగా భావించడం జరిగింది. భాష, యాస ఒకటి కానప్పుడు నిందించుకుంటూ ఉండడం కంటే విడిపోయి ప్రేమలను ఇచ్చిపుచ్చుకోవాలంటూ హితబోధ చేశాడు. ‘‘ఒకే కప్పుకింద/రపరపలు దుర్భేద్యం’’[86] అంటూ ఒకే ఒరలో రెండు కత్తులు ఇమడవని కలిసి ఉండి కలహించుకుంటూ ఉండే బదులు, రెండు రాష్ట్రాలుగా విడిపోయి,

---

[84] పురి విప్పిన ఊపిరి - డా. ఎన్. గోపి – పేజి - 27

[85] గోపి కవిత్వం – III (అక్షరాల్లో దగ్ధమై) డా. ఎన్. గోపి – పేజి - 110

[86] పురి విప్పిన ఊపిరి - డా. ఎన్. గోపి – పేజి - 44

రెండింటి మధ్య ద్వేషాన్ని పెంచుకోకుండా పూలకంచెను నిర్మించుకుందాం అంటూ హితబోధ చేశాడు. ''కోడి కూయకున్నా / ఉదయం రాక మానదు''[87] అని అనడంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడక తప్పదని భావిస్తున్నాడు. రాష్ట్రం ఏర్పడుతుందన్న విషయాన్ని ఊహిస్తూ పేపర్ వేసే పిల్లవాడు ఇవాళ రెండు రాష్ట్రాల వార్తలను మోసుకొస్తున్నాడు అంటూ ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు.

తెలంగాణ ఉద్యమం జరుగుతున్న కాలంలో వాటిపట్ల ప్రేరేపితుడై, ఆవేశంతో ప్రాణాలు తీసుకున్న తెలంగాణ బిడ్డలను ఉద్దేశించి 'వద్దు బిడ్డా! చావొద్దు' అనే కవిత రాశారు. ''యువత కోసమే కదా ఉద్యమాలు / మరి నువ్వే లేనప్పుడు / తెలంగాణ వచ్చి మాత్రం ఏంలాభం?''[88] అంటూ ఉద్యమాలలో యువతదే ముఖ్యపాత్ర ఉంటుందని, ఆ ఉద్యమ ఫలితాలు యువత కోసమే అని, మరి అలాంటి యువకులు ఆత్మహత్య చేసుకుంటుంటే హృదయం ద్రవించిపోయి వారిని తన సొంత బిడ్డల్లా భావించి మానవతా దృక్పథంతో ఈ కవితను రాశారు. కాబట్టి ఈ కవితను మానవతావాద కవిత్వంలో భాగంగా భావించి అందులో కూడా ఉదహరించడం జరిగింది. రాజకీయ నాయకుల ఉద్రేక పూరిత ప్రసంగాలకు, శుష్క వాగ్దానాలకు మోసపోయి, వారి మొసలి కన్నీళ్ళను చూసి అమాయకులైన ప్రజలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్తూ– ''రాజకీయాలు పన్నిన ఉచ్చులో / అభిమన్యుడిలా కూలిపొయ్యావా? / ఈ కుంపటిని ఆరనీయకుండా వాడుకుంటారు / నీ మరణం / వారికి మరో కిరణం''[89] అంటూ నీ మరణాన్ని సైతం వారు శవరాజకీయాల కోసం ఉపయోగించుకుంటారని, అలాంటి వాటికి ప్రభావితం కాకుండా బతికి ఉంటే నలుగురిని బతికిస్తావు అంటూ హితబోధ చేశారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు తంగెడుపూలు, కాబట్టి తంగెడుపూలు కవితను తెలంగాణ కవిత్వంలో భాగంగా చేర్చవచ్చు. అయినా ఈ తంగెడుపూలును వస్తువైవిధ్యం కలిగిన కవితగా చెప్పవచ్చు. పేదవారి గురించి చెప్పిన పూలుగా, మానవత్వం ఉన్న పూలుగా, పేదల ఆకలి, అజ్ఞానం, బానిసత్వం, కన్నీళ్ళు ఇవన్నీ ఇందులో ఉన్నాయి. అందుకే కవి వీటిని ''మనసున్న పూలు / మమతలున్న పూలు / వాసన లేకున్నా వలపు / బాసలు నేర్పిన

---

[87] పురి విప్పిన ఊపిరి - డా. ఎన్. గోపి – పేజి - 37

[88] మా ఊరు మహాకావ్యం - డా. ఎన్. గోపి – పేజి - 68

[89] మా ఊరు మహాకావ్యం - డా. ఎన్. గోపి – పేజి - 68

పూలు''[90] అంటారు. తెలంగాణ ఆడపడుచుల పండగైన బతుకమ్మలో వాడే తంగేడు పూలకు ఘనమైన చరిత్ర ఉంది. అడవిలో సహజసిద్ధంగా పెరిగే ఈ పువ్వు ప్రకృతికే అందాన్నిస్తుంది. కాబట్టి దీన్ని ప్రకృతి కవిత్వంలో భాగంగా కూడా చెప్పవచ్చు. తంగెడు పూలను ఆడవారు తమ సౌభాగ్యాన్ని కాపాడే విశిష్ట పుష్పంగా భావిస్తారు. తంగెడు పువ్వులేని బతుకమ్మ పండుగను మనం ఊహించలేము.

ఇలాంటి పూల గురించి తెలుగు సాహిత్యంలో పేర్కొనలేదు. ఎన్నో పూలను వర్ణించారు. కానీ ఈ తంగెడు పూల వర్ణన కన్పించదు. ఆ లోటును గోపి తీర్చారు. ఇది గోపి రాసిన మొట్టమొదటి వచన కవిత (1967) (తంగెడు పూవు పూచే చెట్టు తర్వార్ చెట్టు. ఇది అకేసియా జాతికి చెందింది. తంగెడు చెట్టు శాస్త్రీయనామం అకేసియా అరిక్యులేట). ఈ చెట్టు ఆకులు, పువ్వులు, బెరడు వివిధ రకాల వ్యాధులను తగ్గించడంలో ఔషధంగా పనిచేస్తుంది. ఇలాంటి పూలను కవి ''తంగెడు పూలు అంటే ఒప్పుకోను / బంగరుపూలు'' అంటూ సామాన్యుల పట్ల గల సానుభూతిని తెల్పుతున్నాడు. మహబూబ్ నగర్ జిల్లా వెల్దండ మండలం రాచూరు గ్రామ వాసి ఆచార్య రుక్నుద్దీన్ (02-05-1947 – 26-05-2013) ''మోదుగపూలు'' గురించి రాశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఇక్కడ స్మరించుకోవడం సముచితమని భావిస్తున్నాను.

తెలంగాణ పోరాట కాలంలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటూ కవి ''ఏ రోడ్డు మీద నడుస్తున్నా/మీరే గుర్తుకొస్తున్నారు'' అంటారు. తెలంగాణ రాష్ట్రం సాధించాక మేం చేసుకుంటున్న సంబరాలు మీదాకా చేరుతున్నాయో లేదో కాని మిమ్మల్ని మేం మర్చిపోలేదని మా గుండెలు నిరంతరం మీ కోసమే తపిస్తున్నాయని, మీరెప్పటికీ మీ హృదయాల్లో నిలిచిపోతారని మీ త్యాగం వృథా కాదని ''స్వతంత్ర తెలంగాణ/ఎప్పటికీ మీ జ్ఞాపకాల వాన''[91] అంటూ వారి త్యాగాన్ని ఉద్వేగ భరితంగా వర్ణించారు.

'పాట' అనే కవితలో పాట గొప్పతనాన్ని చెప్తూ కవిత్వంలోనుండే పాట పుడుతుందని, సామాన్య జనాలను ప్రభావితం చేయడంలో పాట తన పాత్ర పోషిస్తుంది. పాట జనాన్ని కదిపితే, కథలు, కవిత్వం మేధావుల్ని ఆలోచిపంజేస్తుంది. అందుకే పాట లేని తెలంగాణను

[90] గోపి కవిత్వం – I - డా. ఎన్. గోపి – పేజి - 19

[91] పురి విప్పిన ఊపిరి - డా. ఎన్. గోపి – పేజి - 55

ఊహించలేమని, తెలంగాణ ఉద్యమ సమయంలో పాట తన ముఖ్య పాత్ర పోషించిందని చెప్పాడు. తెలంగాణ ఉద్యమాల నేల, ఎప్పుడూ ఏదో ఒక పోరాటం చేసిందని, వాటిన్నింటికి ఆలంబన పాటే అంటూ ''నువ్వు తూటాల్తో కాలిస్తే / వాళ్ళు పాటల్ని పేలుస్తారు'' అంటూ పాటను తూటాతో పేల్చాడు. ఇది నిజమే. గద్దర్ పాట ఈటెల్లా ఉంటూనే తూటాను పేలుస్తుంది. ఇలాంటి ప్రజాగాయకులెందరో తమ పాటల ద్వారా ఉద్యమాల సమయంలో ప్రజల్ని చైతన్యపరిచారు. అందుకే మాటకు లేని ఆకర్షణ పాటకుంటుంది. బాధ, కోపం, ఉత్తేజం, ఉద్వేగం, చైతన్యం, ఆవేశం, ఆనందం ఇలా పాటలో పలికించలేని భావం లేదు. అందుకే కవి పాటను ''చేతులు ఎక్కుపెట్టిన ప్రశ్నలై / దేహమంతా ఒక పేరిణీ తాండవమై''[92] అంటారు. ఇక్కడ పేరిణీ తాండవం వీరనాట్యశైలికి చెందింది. వీరావేశంతో చేసే ఒక తెలంగాణ నాట్య విన్యాసం. పాట కూడా అలాంటి ఆవేశాన్ని కల్పిస్తుందంటూ చివరకు ''తెలంగాణ పాడిందే పాట / తెలంగాణను కాపాడిందే పాట''[93] అంటూ ముగించాడు.

లోక్ సభలో తెలంగాణా బిల్లు గెలిచిన సందర్భంలో (2014, ఫిబ్రవరి 26) రాసిన కవిత ఇది. ఇందులో తెలంగాణా ఉద్యమంలో భాగంగా నేలకొరిగిన అమరుల గురించి చెప్తూ ''మృతుల జ్ఞాపకాల్లో తడుస్తున్న విషాద నేత్రులు / గుర్తుకొస్తున్నారు''[94] అంటారు. అణచివేత, ఆధిపత్యం మనిషికే కాదు కీటకానిక్కూడా నచ్చదని, తమ అస్తిత్వానికి భంగం కలిగిస్తే పోరాటం తప్పదని ఫ్యూడలిస్టులు (భూస్వాములు), క్యాపిటలిస్టులకు (పెట్టుబడిదారులు) ఎదురు తిరిగిన తెలంగాణ పోరాటస్ఫూర్తిని ఈ కవిత్వంలో వర్ణించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఆ మట్టి మీద ఉన్న ప్రేమతో ప్రాణాలర్పించిన యోధులను, వీరులను గుర్తు చేసుకుంటూ ''కొత్త వెలుగులను ప్రసాదించిన / దీపధారులు'' అని వారిని కీర్తించారు. ఇక ఈ పోరాటాలు, ప్రాణత్యాగాలు ఆపమని ఈ తెలంగాణా మీది, మీ పిల్లలదని భవిష్యత్ తరాలను, యువతనుద్దేశించి చెప్పడం జరిగింది. అప్పటి పాలకులు అభివృద్ధి పేరుతో ప్రజలలో మమకారాలను చంపేశారని, మన తెలంగాణ ఆప్యాయతలు, అనురాగాలకు పుట్టినిల్లని అలాంటి వాటిని మనం మళ్ళీ బ్రతికించుకోవాలని ''ఎలుగెత్తి చాటే గళం మీది / దాని పరిమళం రేపటిది'' అంటూ తెలంగాణ యువతనుద్దేశించి సూచనలు చేశాడు. నేటి

---

92 గోపి కవిత్వం – III (అక్షరాల్లో దగ్ధమై) - డా. ఎన్. గోపి – పేజి - 108

93 గోపి కవిత్వం – III (అక్షరాల్లో దగ్ధమై) - డా. ఎన్. గోపి – పేజి - 109

94 పురి విప్పిన ఊపిరి – డా. ఎన్. గోపి – పేజి - 19

తెలంగాణ యువతరానిదే అని, యువతరం పోరాడి సాధించి తెచ్చుకున్న తెలంగాణ పునర్నిర్మాణం, అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని అప్పుడే ఉద్యమంలో అమరులైన వీరుల త్యాగాలకు అర్థం ఉంటుందని చెప్తూ ''బిడ్డలారా / ఇక తెలంగాణ మీది, మీ పిల్లలది / శిథిలాలను ఒక్కచోట చేర్చి అతికించుకోండి'' అంటాడు.

2.13 ప్రపంచీకరణ కవిత్వం (Globalization Poetry):

ప్రపంచీకరణ (Globalization) నిర్వచనం: ప్రపంచీకరణనే కొందరు 'విశ్వీకరణ' అంటున్నారు. ఇందులో ప్రపంచం అంతా ఒక్కటిగా మారిందనే అర్థం స్ఫురిస్తుంది. ప్రపంచీకరణ ఒక వర్తమాన విధ్వంసం. ''ప్రపంచీకరణమంటే ప్రపంచమంతా ఒకటి కావడం అని అర్థం. ఒకటి కావడం అంటే ప్రేమ, సహకారం, శాంతి మొదలైన అర్థాల్లో ఒకటి కావడం కాదు. ఏ దేశాల మధ్యనైనా ఎలాంటి ఆంక్షలు లేకుండా వ్యాపారం కొనసాగించవచ్చని అర్థం. దీన్నే స్వేచ్ఛా మార్కెట్ అని వ్యవహరిస్తారు. ఆర్థిక తృష్ణ ప్రధాన స్రవంతిగా మారి అన్ని విలువలను చిందరవందర చేస్తుంది. వస్తు వ్యామోహాన్ని పెంచి జీవితమే సరుకుల మీద ఆధారపడేట్టు చేస్తుంది.''[95] అంటారు అద్దేపల్లి రామ్మోహనరావుగారు. ప్రపంచీకరణ గురించి పాశ్చాత్యులు ఇచ్చిన నిర్వచనాలు కూడా చాలా ఉన్నాయి. ''ప్రపంచీకరణ అంటే పెట్టుబడి, టెక్నాలజీ, ప్రజలు, సంస్కృతీ, సంపద మొదలైనవన్నీ ఎల్లలు దాటి వ్యాపించడం లేదా ప్రవహించడం (పి. కుసుమకుమారి) ఉత్పత్తి కారకాలకు ప్రపంచవ్యాప్తంగా సంపూర్ణమైన గమనశీలతను ఏర్పరచడమే ప్రపంచీకరణ'' (డా. సాయిబాబు)''[96]

ప్రపంచంలో ఏ సమాజమూ, ఏ దేశమూ ఒంటరిగా మనుగడ సాగించలేదు. అందుకే దేశాలు, సమాజాల మధ్య సంబంధాలుంటాయి. సామాజిక అంశాల్ని పట్టించుకోని రచయిత ప్రపంచీకరణను అర్థం చేసుకోలేడు. సామ్రాజ్యవాద, ధనికదేశాలు పేద దేశాల్ని దోచుకోవడానికి, తమ ప్రయోజనాలకు అనుగుణంగా దేశాల సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థల్ని నిర్దేశించేందుకు ప్రపంచీకరణ ఉపయోగపడుతుంది. ఏ దేశాలమధ్య అయినా ఎలాంటి ఆంక్షలు లేకుండా వ్యాపారాన్ని కొనసాగించే స్వేచ్ఛ దీని ద్వారా వస్తుంది. కాబట్టి దీన్ని 'స్వేచ్ఛా వ్యాపారం', 'స్వేచ్ఛా వాణిజ్యం' అంటారు. ప్రపంచీకరణ ప్రపంచమంతటినీ ఒకే తాటిపైకి తెచ్చే ఒక సాధనం వంటిది. అభివృద్ధి పేరుతో సమాజాన్ని, దేశాన్ని అయోమయ

---

[95] ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు సాహిత్యవిమర్శ ఒక పరిశీలన (ఎం.ఫిల్) పసునూరి రవీందర్ – పేజి -7

[96] ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు సాహిత్యవిమర్శ ఒక పరిశీలన (ఎం.ఫిల్)– పేజి -8

అవస్థల్లోకి నెడుతుంది. ప్రపంచీకరణ ప్రభావం వల్ల సామాజిక వ్యవస్థ సాంస్కృతిక వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయి. 'మార్కెట్' అనే కవితలో ప్రపంచీకరణలో భాగంగా వచ్చిన కార్పోరేట్ సంస్కృతిని, సెజ్ లు, మాల్స్, అమెరికా డాలర్ వంటి వాటిని వివరించాడు. తాను ప్రపంచీకరణకు వ్యతిరేకం అంటూనే, నేడు అది మన సమాజంలో ఒక భాగమైంది కాబట్టి తప్పదంటాడు.

''నాకు కార్పోరేట్ సంస్కృతి అంటే
ఇష్టం ఉండదు
కానీ అది చల్లగా ఉండాలని కోరిక
ఆ ఛత్ర ఛాయల్లోనే
మా అబ్బాయి ఉద్యోగం కనుక''[97]

అంటూ నేడు దేశంలో ప్రభుత్వ సంస్థల కంటే ప్రయివేట్ కార్పోరేట్ సంస్థలే ఎక్కువగా ఉద్యోగాలను సృష్టిస్తున్నాయని, ప్రజా జీవనం ఆ సంస్కృతిలో భాగమైందంటూ తన అబ్బాయి ఉద్యోగాన్ని ప్రస్తావించాడు. కయ్యానికి కాలుదువ్వే అమెరికా అంటే తనకు నచ్చదని, కానీ మా బంధువులంతా అక్కడే ఉన్నారంటూ అది చల్లగా ఉండాలని గుర్తు చేసుకుంటారు. సెజ్జులన్నా, మాల్స్ అన్నా పేదవాళ్ళ భూముల్ని లాక్కునే దృశ్యమే కళ్ళల్లో మెదులుతుంది. కాబట్టి వాటికి వ్యతిరేకిని అంటూనే ''మొత్తానికి నేను ఇరుక్కుపోయాను'' అంటూ ప్రపంచీకరణ ప్రభావానికి గురైన విధానాన్ని వర్ణించారు.

ప్రపంచీకరణ ప్రభావంతో పల్లెల్ని శాశ్వతంగా మరిచిపోయిన తీరును వర్ణించాడు. చెరువులన్నీ ఆక్రమించి, కొండలను తవ్వి వాటి స్థానంలో బహుళ అంతస్థులను నిర్మిస్తున్నారంటూ ఆవేదన చెందుతాడు. వావి వరుసలను, అనుబంధాలను, ఆప్యాయతలను మరిచి తానే ఒక వస్తువుగా మారిపోయాడు ఈ వస్తు సమాజంలో. కానీ ఇవన్నీ మరిచి చివరకు మానవత్వాన్నే వదిలేశాడని బాధపడుతాడు.

''విలువలను సంపాదనకు చుక్కెదురు చేశాడు
అన్నింటిని కాస్త కాస్త వదిలేస్తూ
ఇవాళ

[97] హృదయరశ్మి - డా. ఎన్. గోపి – పేజి -150

సంపూర్ణంగా విముక్తుడయ్యాడు
అతడు చివరగా వదిలేసింది మాత్రం
మానవత్వాన్నే''[98]

నేడు మనీ కల్చర్ పెరిగి, డబ్బుకోసం పరుగులు తీస్తూ, విలువలకు తిలోదకాలిచ్చి మనిషి ఒక యంత్రంగా తయారయ్యాడు. మనిషి తన మనిషి తత్వాన్ని కోల్పోయి మానవత్వం లేని వస్తువుగా మిగిలిపోయాడని ప్రపంచీకరణ ప్రభావాన్ని దాని దుష్ఫలితాలను చెప్పడం జరిగింది.

టీ.వి సంస్కృతిని వ్యతిరేకిస్తూ ''దృశ్య సంస్కృతి'' కవితలో ''దృశ్య వైభవం గుడ్డితనానికి చిహ్నం/కాంతికుంజాల వెనక అశాంతి చీకట్లు''[99] అంటూ టీ.వీలు, సినిమాల నాగరికతను వ్యతిరేకించాడు. టీ.వీల వల్ల కలిగే అశాంతి, వాటివల్ల వచ్చే అనర్థాలను వివరించారు. ''బొమ్మ నీ నోట్లో దుమ్ముకొడుతుంది'' అంటూ దానివల్ల సమయం వృథా అవడమే కాకుండా అనారోగ్యానికి కారణమవుతుంది. అంతేగాక మనుషులు కలిసున్నా మనసుల మధ్య దూరాల్ని పెంచింది అంటూ టీ.వి సంస్కృతిని వ్యతిరేకించారు.

'మనీకల్చర్' అనే కవితలో మనుషుల మధ్య ప్రేమ సంబంధాలు తగ్గి, డబ్బు సంబంధాలే మిగిలిపోయాయని ఆవేదనతో ''అగ్నిసాక్షిగా వేసిన మూడు ముళ్ళు/నోటు వేటుతో తెగిపోతాయి''[100] అంటారు. మనుషుల మధ్య ఉండే అనుబంధాలు, ఆప్యాయతలు, నమ్మకాలు వంటివి రూపాయి చక్రాల క్రింద పడి నలిగిపోయాయంటూ బాధ పడుతారు. అందుకే ''నమ్మకానికి అమ్మకానికీ మధ్య/ఎవరు గెలిచారన్నది కాదు ప్రశ్న/ఏం మిగిలిందనేది ముఖ్యం'' అంటారు. ప్రపంచీకరణ ప్రభావంతో అనుబంధాలను మరిచిపోయి డబ్బే జీవితం అనుకునేవారు కొందరైతే, డబ్బే శాశ్వతం అనుకునే వారూ ఉన్నారు. అందుకే ''అనుబంధాల బీటల్లోంచి/మనీప్లాంట్లు పొడుచుకొస్తున్నాయి''[101] అంటూ డబ్బు జబ్బుతో మనిషి అంతరించి పోతున్నాడని ఆవేదన చెందుతాడు. అందుకే శ్రీశ్రీ

''మానవులను ఆడించే డబ్బు తెలుపో నలుపో జానేదేవ్
ఆ తేడాలిక్కడ లేనేలేవ్'' అంటారు.

---

[98] మళ్ళీ విత్తనంలోకి - డా. ఎన్. గోపి – పేజి - 30

[99] గోపి కవిత్వం – I (చిత్ర దీపాలు) - డా. ఎన్. గోపి – పేజి - 174

[100] గోపి కవిత్వం – I (చిత్ర దీపాలు) - డా. ఎన్. గోపి – పేజి - 171

[101] గోపి కవిత్వం – I (చిత్ర దీపాలు) డా. ఎన్. గోపి – పేజి - 171

సామాజిక సంబంధాలు, రక్త సంబంధాలు మనీకల్చర్ లో కొట్టుకుపోతున్నాయి. మరొక కవితలో ప్రపంచీకరణ ప్రభావం తినే తిండిని, పీల్చేగాలిని, త్రాగే నీటిని ఎలా కలుషితం చేసిందో వివరిస్తాడు. ''కాలుష్యాన్ని ఉత్పత్తి చేస్తూ/ఆరోగ్యాన్ని ప్రచారం చేస్తాడు'' అని ల్యాబరేటరీలు, వివిధ ఫ్యాక్టరీ యజమానులను నిందించాడు. కులం పేరుతో ప్రజల్లో విషాన్ని నింపి స్వార్థాన్ని పెంచుతారు. సామాన్య ప్రజలు ఎంతో కష్టపడి సంపాదించుకున్న సంపాదనను తన వస్తువులు కొనుక్కునేలా ప్రచారం చేస్తూ, వారి ''ఇల్లాలి చేటలో/పైకి లేచిన కూలి గింజలను/గాలిలోనే మాయం చేస్తాడు.''[102] అంటూ సామాన్య ప్రజల జీవన విధానాన్ని కూడా ప్రభావితం చేసే శక్తి ప్రపంచీకరణకు ఉందన్నాడు.

'యాడ్' అనే కవితలో కళ్ళు చెదిరే యాడ్ లు/ప్రకటనలతో సామాన్య ప్రజలను మభ్యపెట్టే సంస్కృతిపై దుమ్మెత్తిపోశారు. ప్రకటనల పేరుతో ఆడవాళ్ళను అర్థనగ్నంగా చూపించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తాడు. ''ఆడదాన్ని నగ్నంగా చూపి/కోకలమ్మడం'' బాగా లేదని హితవు చెప్పాడు. ఆ వస్తువుల ప్రకటనలకు సామాన్య జనం మోసపోయి సంపాదనంతా వాటికే ఖర్చుపెడతారని, వాటన్నింటిని నమ్మి నువ్వు మోసపోతే ''సందేహం లేదు/ నిన్నే కొంటారు'' జాగ్రత్త అంటూ హెచ్చరిస్తున్నాడు.

''టీవీని ద్వేషిస్తూనే
వద్దు వద్దంటూనే
బుల్లి తెరకు అతుక్కుపోయిన
బల్లివవుతావు''[103]

అంటూ టీవీని వదలలేకపోవడాన్ని చెప్పారు. దాని ప్రభావం అలాంటిదని మనకు తెలియకుండానే దానికి బానిసలమవుతామని అన్నాడు.

అభివృద్ధి పేరుతో మనిషి దిగజారుతున్న వైనాన్ని చెప్తూ ''సముద్రాల నుంచి / ఆకాశాలకెక్కానని గర్వమొద్దు / నీ పతనం భూమ్మీదే''[104] అంటూ హెచ్చరించాడు. స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో దేశంలో దేశీ సరుకులు తగ్గి, విదేశీ సరుకులు పెరిగాయి. ఇక్కడే సంస్కృతికి

---

[102] గోపి కవిత్వం – I (చిత్ర దీపాలు) డా. ఎన్. గోపి – పేజి - 150

[103] గోపి కవిత్వం – I (వంతెన) డా. ఎన్. గోపి – పేజి - 226

[104] గోపి కవిత్వం – II (ఎండపొడ) - డా. ఎన్. గోపి – పేజి - 207

ఆటంకం ఏర్పడుతుంది. మనుషులు ఎదురెదురుగా కూర్చొని పలుకరించుకునే పరిస్థితిపోయి ఇంటర్నెట్, ఫోన్లు, మెసేజ్ ల రూపంలో మాట్లాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడి మనుషుల మధ్య దూరం పెరిగింది. ఆత్మీయంగా పలుకరించుకునే పరిస్థితి అసలే ఉండదు. మన ఆహారపు అలవాట్లు కూడా మారిపోయాయని సంప్రదాయ ఆహారానికి బదులు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు వచ్చాయని చెప్తూ అయినా ''మనరోటిలోని తొక్కును / ఏ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లూ ఎత్తుకు పోలేవు''[105] అని ఆశాభావం వ్యక్తం చేస్తారు. మనుషులను, మనుషుల అలవాట్లను అభివృద్ధి పేరుతో మార్చేస్తున్న విదేశీ సంస్కృతిని ఈ కవితలో వర్ణించారు.

ప్రపంచీకరణ ప్రభావంతో ఉన్న పొలాలన్నీ కంపెనీలు ఆక్రమించుకుంటుంటే బతుకు తెరువు కోసం వలసలు వెళ్ళే పరిస్థితిని, నిరుద్యోగులు ఉపాధికోసం విదేశాలకు వెళ్ళడాన్ని వర్ణిస్తూ ''ఇక్కడ బతుకే బరువైతే / అక్కడ అడుగడుగునా పోరాటం''[106] అంటాడు. అలా వారు ఉపాధి కరువై ఉపాధి కోసం వెళ్తూ పల్లెల్లో వృద్ధులైన తమ తల్లిదండ్రులను ఒంటరిగా వదిలిపెడతారు. అందుకే ''పల్లె ముసలిదైందని కాదు / పల్లెల్లో ముసలోల్లే మిగిలారు'' అంటారు కవి. అందుకే ప్రపంచీకరణ మనుషుల్ని చిన్నాభిన్నం చేయడమే కాకుండా, అభివృద్ధి పేరుతో అనర్థాలు సృష్టిస్తూ ఉందంటారు. ఇక్కడ గోరటి వెంకన్న రాసిన ''పల్లే కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల'' పాట గుర్తుకొస్తుంది. ప్రపంచీకరణ ప్రభావంతో పల్లెల్లో కులవృత్తులు ఎలా నాశనమయ్యాయో ఈ పాటలో వివరించారు.

2.14 ప్రకృతి కవిత్వం (Nature Poetry):

ప్రపంచానికి మూలకారణం ప్రకృతి. మానవుడు ప్రకృతి అంశ. ప్రకృతిలో చూసినప్పుడే పరిపూర్ణంగా కన్పిస్తాడు. వెన్నెల, వర్షం, పూలు, తీగలు, చెట్లు, గుట్టలు, కోకిలలు, తుమ్మెదలు, నదులు, మెరుపు, ఉరుములు మొదలైన వాటి గురించి వర్ణించి రాయడం ప్రకృతి కవిత్వం క్రిందకి వస్తుంది. పంచభూతాలతో కూడిందే ప్రకృతి. ప్రకృతి మానవుని జీవనానికి అన్ని విధాలుగా సహకరిస్తుందని, కానీ మనిషే ప్రకృతిని నాశనం చేసే పనులను చేస్తున్నాడు. చెట్లను నరకడం, నీటి కాలుష్యం, వాయుకాలుష్యాన్ని పెంచి భూతాపాన్ని (గ్లోబల్ వార్మింగ్) పెంచుతున్నాడు. గోపి ప్రకృతి వర్ణనలు అందంగానే గాక దుఃఖం, భయం, భీభత్సం, బాధ

[105] గోపి కవిత్వం – II (ఎండపొడ) డా. ఎన్. గోపి – పేజి - 207

[106] గోపి కవిత్వం – III (దీపం ఒక ఏకాంతం) డా. ఎన్. గోపి – పేజి - 232

వంటి వాటిని కూడా ఆధారంగా చేసుకొని ఉన్నాయి. ఏదేని ఒక సామాజిక విషయాన్ని వర్ణించినా వెంటనే ప్రకృతిలోకి వెళ్ళి దానికి సమానమైన దృశ్యాన్ని వర్ణించాడు.

'తొలకరి' అనే కవితలో తొలకరి వర్షాన్ని గురించి అది మోసుకొచ్చే హాయిని వర్ణించడం జరిగింది. ఇందులో వర్షాన్ని ప్రతీకగా తీసుకోవడం జరిగింది. వర్షం పడేప్పుడు అందరూ ఇష్టంతో చేసే పని పకోడీలు తినడం అని చెప్పడానికి ''మర్మరాల్లో కారం తక్కువయింది / పకోడీలు చల్లరితే బాగుండవని''[107] సూచన చేస్తాడు. తొలకరి చినుకులకు వచ్చే మట్టి వాసనను ''గుప్పున లేచిన మట్టివాసనలు / ప్రియురాలి తొలినాటి శ్వాసలు'' అంటూ ప్రియురాలి శ్వాస, మట్టివాసనను ఇష్టపడని వారుండరని పోలిక చెప్పాడు.

'సూర్యుడు' కవితలో సూర్యున్ని ప్రతీకగా తీసుకొని చెప్పడం జరిగింది. వేడికి, ఆవేశానికి సూర్యుడు ప్రతీక. కాకపోతే అది ధర్మావేశం అంటారు. సూర్యుడి వెలుగు లేకపోతే ప్రపంచ మనుగడే లేదు. అందుకే ''అందరూ బాగుండాలనే / ఆలోచన / సూర్యోదయమంత కొత్తది''[108] అన్నారు. సూర్యుడిని విప్లవానికి, అభ్యుదయానికి ప్రతీకగా చెప్పవచ్చు. కాబట్టే ''కలంలో దూరి / అతడే వేడినీ వాడినీ / సమకూరుస్తాడు''[109] అంటూ కవిత్వం రాయడానికి సూర్యుడు ప్రేరణను ఇస్తాడంటారు. సూర్యోదయం, సూర్యాస్తమయాలను మించిన అందం సృష్టిలో లేదు అన్న విషయం ఈ కవిత్వంలో వ్యక్తమవుతుంది.

'దిగిరాను' అనే కవితలో మేఘాల్ని ఉద్దేశించి వర్షం కురవకుండా ఊరికే ఉరిమితే లాభం లేదని, 'మేఘసందేశం' కావ్యం రాసినందుకు కాళిదాసుని మేఘం మహాకవిని చేసిందని, వర్షం పడితేనే పంటలు బాగా పండి రైతు రాజు అవుతాడంటారు. మరి వర్షం పడకుండా రైతులకు కరువును చూపించి వారికి ఉరితాళ్ళు పేనుతున్నావు అంటూ మేఘాలను నిందించాడు. వాగులు, వంకలు, నదులు నీవు తెచ్చే వాన కోసం ఎదురు చూస్తున్నాయని/పిల్లలు కూడా వర్షంలో ఆడాలని ఎదురు చూస్తున్నారని, ''ఇకనైనా వర్షించు/ప్రాణికోటి శ్వాసరాగమై/మోగవే మేఘమా!''[110] అంటూ వర్షంగా కురవమని మేఘాన్ని ప్రార్థిస్తున్నాడు. ఈ కవిత అంతా మేఘం ప్రతీకగానే సాగుతుంది.

---

[107] గోపి కవిత్వం – I (చిత్రదీపాలు) డా. ఎన్. గోపి – పేజి - 141

[108] హృదయరశ్మి - డా. ఎన్. గోపి – పేజి - 41

[109] హృదయరశ్మి - డా. ఎన్. గోపి – పేజి - 42

[110] మా ఊరు మహాకావ్యం - డా. ఎన్. గోపి – పేజి - 24

'వర్షమా కురువు' కవితలో వడదెబ్బ చావులు ఆగాలన్నా పట్టణాలకు వలస వెళ్ళిన వారు తిరిగి పల్లెలకు రావాలన్న, పంటలు బాగా పండాలన్నా వర్షం చాలా ముఖ్యమని తెలుపుతూ వర్షాభావ పరిస్థితిని కళ్ళకు కట్టినట్టు వర్ణించాడు. వర్షం కురవక పోవడానికి సముద్రాన్ని నిందిస్తూ ''సముద్రానికెప్పుడూ ఆత్రమే/పైకి పంపటం తెలుసు కాని/మబ్బుల్ని లాక్కోవడం తెలియదు''[111] అంటారు. సముద్రంలోని నీరే ఆవిరిగా పైకి వెళ్ళి మళ్ళీ వర్షంగా కురుస్తుంది కాబట్టి. ఎండవేడిని తాళలేక సూర్యున్ని నిందిస్తూ ''భయంతో దేవుడంటున్నా/నిజంగా నువ్వు/ కిరణాలను విరబోసుకున్న రాక్షసుడివి'' అంటూనే వర్షాలు బాగా కురిసి పచ్చని పంటలు పండాలని ఆకాంక్షించాడు. జీవకోటికి ప్రాణాధారమైన గాలిని గురించి 'గాలిపాట' కవితలో వర్ణించాడు. ''అన్నీ గాలిలో కలిసిపోతాయి'' అనడంలో పాట, మాట, శ్వాస అనే భావన స్ఫురిస్తుంది. ఇక్కడ అద్వైత భావన కన్పిస్తుంది. ఈ కవితలో కవి గాలిని స్నేహితుడిగా, జుట్టు నిమురుతున్న ఆత్మీయుడిగా భావిస్తాడు. ఒక ప్రాణి జీవించడానికి గాలే ఆధారం, చనిపోయాక అతడు మరణించాడని చెప్పడానికి గాలే ఆధారం అంటూ ప్రాణవాయువు ప్రాధాన్యాన్ని చెప్పాడు. రూపం లేనందుకే గాలి అందమైందంటూ చెప్పడంలో తాను రూపానికి కాకుండా, దాని విలువకు గొప్పదనానికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పాడు. ''జీవితంలో నాకు/ఒంటరితనం లేదు/ గాలితోడు ఎప్పుడూ ఉంది కనుక''[112] అనడంలో ఈ ప్రపంచంలో ఎవరూ ఒంటరివాళ్ళు కాదని వారి శ్వాస, వారి నీడ వారికి ఎప్పుడూ తోడుగా ఉంటాయనే అంతరార్థాన్ని చెప్పకనే చెప్పారు.

'ఢిల్లీలో వర్షం' అనే కవిత ఢిల్లీలో వర్షం పడేటప్పుడు కన్పించిన అందాలను చూసి పరవశించి రాసింది. వర్షం ఎక్కడైనా వర్షమే కానీ కవి అక్కడున్నప్పుడు రాసిందై ఉండొచ్చు. ''చల్లని గాలి/చెవుల్లో గుసగుసలాడుతుంది'' అనడంలో కవి ప్రకృతిలోని ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పొందుతూ అనుభూతితో చెప్పాడు. అసంపూర్తిగా ఆగిపోయిన తన కవిత్వం వర్షం రాకతో తర్వాతి పాదాలు మొలకెత్తాయి అనడంలో ప్రకృతి ప్రభావం కవులపై బాగా ఉంటుందని, ప్రకృతి పరవశత్వం అలాంటిదని చెప్పడం జరిగింది. ''ముద్దగా తడిసిన మనస్సు/ప్రపంచ గీతానికి సమాయత్తమౌతుంది'' అంటూ ప్రకృతి కవి కాని వారినికూడా కవిత్వం రాయాలనిపించేంతగా ప్రేరణను, అనుభూతిని ఇస్తుందనే ప్రకృతి గొప్పతనం ఇందులో కన్పిస్తుంది.

[111] గోపి కవిత్వం III - డా. ఎన్. గోపి – పేజి - 192

[112] మళ్ళీ విత్తనంలోకి - డా. ఎన్. గోపి – పేజి - 42

2.15 దళిత చైతన్య కవిత్వం:

డా. ఎన్. గోపి కులాలు, మతాలు, కుతంత్రాలు తెలియని సమతావాది. దళితులను సృష్టించిన వ్యవస్థను, కులవ్యవస్థను వ్యతిరేకించాడు. అసలు లోకంలో మంచి, చెడు, అనేవి రెండే ఉన్నాయి. సమాజంలో పేద, ధనిక అనే తారతమ్యాలు ఉన్నాయి. కానీ ఈ కుల వ్యవస్థ సమాజాన్ని పట్టి పీడించే ఒక వ్యాధి లాంటిది. అందుకే కవి సమాజాన్ని చూసి ఆవేశపడి, బాధపడి సమాజంలో చైతన్యం తీసుకరావడానికి కృషిచేస్తూ రాసిన కవిత్వం మనకు కన్పిస్తుంది. నేడు దేశం అభివృద్ధిలో ఎంతో ముందంజలో ఉండి, అంతరిక్ష యాత్రలు చేసే కాలంలో ఉన్నాం. కానీ ఈ కాలంలో కూడా కులం పేరుతో మనుషుల్ని దూరం పెడుతున్న అనాగరిక సంస్కృతిని తన కవిత్వంలో వర్ణించారు.

'గోడ' అనే కవితలో కులం పేరుతో మనిషికీ మనిషికీ మధ్య, మనసుకీ, మనసుకీ మధ్య గోడలు కడుతారని అలాంటి మాయదారి గోడల్ని కూల్చిపారేయాలని పిలుపునిస్తాడు. ఈ కులం అనే గోడ చాలా పాతదని, పూర్వం నుండే కుల వ్యవస్థ ఉందనీ, ఆ పునాదులపై కులం అనే గోడలు లేస్తున్నాయని ఆవేదన చెందాడు. కొందరు సామాజికోద్యమకారులు కుల నిర్మూలనకు కృషి చేయాలని భావించినా అలాంటి వారి పనులకు కొంతమంది అడ్డుగోడల్లా మారుతారు. అందుకే కవి అలాంటి వారిని గురించి,

> ''పెచ్చులుండే భాగాల ముందు
> సిమెంటుతో సిద్ధంగా వుంటారు
> తాపీ శాస్త్రులు''[113] అంటారు.

'మోచి' అనే మరో కవితలో సమాజం దళితులను పట్టించుకోని, గుర్తించని వైనాన్ని తెలుపుతూ, వారి పేదరికాన్ని ఈ కవితలో వర్ణించారు. ఎక్కడో వీధి చివరలో ఒక పక్కగా తలొంచుకొని చెప్పులు కుట్టే పని చేసుకునే ఈ కర్మ జీవిని మనకు అవసరమున్నప్పుడే గుర్తిస్తాం కానీ మామూలుగా అతని గురించి ఆలోచించమనే వాస్తవాన్ని చెప్పారు. మనకున్న కాళ్ళ చెప్పులు తెగిపోయినప్పుడు వారి కోసం చూస్తామని, ''అతడు చెప్పులు కుడుతుంటే/ ఆగిపోయిన నడకకు/ ప్రాణం పోస్తున్నట్టుగా వుంది''[114] అంటాడు.

---

[113] గోపి కవిత్వం – I (తంగేడుపూలు) – పేజి - 58

[114] మళ్లీ విత్తనంలోకి – డా. ఎన్. గోపి – పేజి - 95

''అతడు వేసే/ఒకటి రెండు కుట్లు/చిరిగిన తన జీవితాన్ని/ బాగుచేసుకుంటున్నట్లుగా ఉంటుంది.'' అని అతని జీవనోపాధిని తెలియజేశాడు కానీ మనకు వారు చేసిన పనికి తగ్గట్టుగా డబ్బులివ్వడానికి మనసురాదంటూ నిందించారు. చెప్పులు కుట్టే వారికి మనమిచ్చేది ఐదు, పది రూపాయలే, కానీ అవివ్వడానిక్కూడా మనకు మనసురాదు. దీన్ని బట్టి వారి శ్రమను మనం గుర్తించకపోవడాన్ని విమర్శిస్తారు. అందుకే అతడు–

''జీవన గమనాన్ని
మరమ్మత్తు చేసే అపర సూర్యుడు
అందరికీ ఆప్తుడు
కులవృత్తిలో బందీ అయిన శప్తుడు''[115] అంటూ వారి శ్రమకు తగిన ఆదాయం రాకపోయినా వారు ఆ వృత్తిని విడిచిపెట్టరని అది వారి అస్తిత్వాన్ని తెలియజేస్తుందన్న విషయాన్ని తెలియజేశారు. ఈ విధంగా దళిత కవిత్వంలో అస్పృశ్యత, ఆవేదన, పేదరికం, దైన్యం వంటి మానసిక వేదనలను వర్ణించడం జరిగింది.

'కల్వర్టు' అనే కవితలో చాలా కాలం తర్వాత కవి నగరం నుండి తన పల్లెకుపోతూ దళిత మిత్రుల్ని స్మరించుకోవడం కన్పిస్తుంది.

''నాతో పాటు ఊరి పొలిమేరలు దాటలేని
నాకన్నా అద్భుతమైన నా సావాసగాళ్ళు
ఇప్పుడు ఏ వెట్టి చాకిరి పాలయ్యారో
తెలుసుకొని రోదించాలని వుంది.''[116]

అంటూ దళితుల్లో కూడా ఎంతోమంది ప్రతిభ కలిగి ఉండి కూడా పేదరికంతో, కులం భావన వల్లో గానీ ఆ ఊళ్ళోనే వెట్టిచాకిరి చేస్తూ వారి జీవితాల్ని కొనసాగిస్తారు గానీ ఊరు దాటిరారు. ఒకవేళ ఊరు దాటి వచ్చి ఏ పనిచేయాలన్నా కులం అడ్డుగా నిలుస్తుందని ఈ కవితలోని అంతరార్థం. నేడు గ్రామాలు కక్షలు, కులాలు, కుట్రలు, కార్పణ్యాలతో కలుషితమయ్యాయని ''నా చిన్ననాటి ఊరు లేదక్కడ'' అంటూ బాధపడుతారు.

---

[115] మళ్ళీ విత్తనంలోకి – డా. ఎన్. గోపి – పేజి - 95

[116] గోపి కవిత్వం – I (వంతెన)– పేజి - 195

'పునరాగమనం' అనే కవితలో దళితులపై జరుగుతున్న అన్యాయం, వివక్షత తగ్గడం లేదని, వారి జీవన పోరాటానికి అంతే లేకుండా పోయిందని చెప్పిన కవితా పంక్తులు ఇవి

''ఈ బాధ ఈ నాటిదా?!
గాయం నుంచి జనం రాలిపడుతుంటారు
అమీనాలు, చుండూరులు, చలకుర్తులు
గాయానికి కారం పూస్తుంటాయి''[117]

అని ఇప్పుడు జరిగే ప్రతి సంఘటనా పూర్వం జరిగిన సంఘటనలకు కొనసాగింపే కానీ అంతం కాదని చెప్పడం జరిగింది. అందుకు ఉదాహరణలు కారంచేడు, ముదిగొండ, చుండూరు వేంపెంట సంఘటనలను పేర్కొనవచ్చు.

సంపద, సంపదను సృష్టించే వనరులన్నీ అధికారులు, భూస్వాముల చేతుల్లో కేంద్రీకృతం కావడంతో, దళితులు పేదవారిగా మారి అణచివేతకు గురికాబడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో వీరు బ్రతకడానికి చేసే పోరాటానికి అంతే ఉండదని తెలుస్తుంది. దళిత కవిత్వమనగానే మనకు అగ్రవర్ణాల పట్ల ద్వేషం, ఆగ్రహం కలిగించే కవిత్వం అనుకుంటాంకానీ గోపి అగ్రవర్ణాల పట్ల ద్వేషం, వారిపై అగ్రహావేశాలకు లోను కాకుండా తన పరిధిలో, పరిమితిలో ఆవేదనగా, ఆలోచనాత్మకంగా దళితుల జనజీవనం గురించి కవిత్వం రాశారు. అలాంటి వాటిలో 'డప్పు' కవిత ఒకటి. కొమరయ్య డప్పు వాయిస్తుంటే అతడి కాలికింది రేణువులు లేచిలేచి ఆడాయి అంటారు కవి. నేటికీ గ్రామాలలో గ్రామ సమాచారం ఏదైనా ఉంటే డప్పుకొట్టి చాటింపు వేయడం జరుగుతుంది. ఆ డప్పు ధ్వనిలో న్యాయాన్యాయాలు ధ్వనిస్తాయి అంటూ కొమరయ్య డప్పు, కొమరయ్య చెప్పు ఇవే మా బాల్యం అని తన బాల్యాన్ని గుర్తు చేసుకున్నాడు. ఈ కవితలో కవి 'చిర్రా చిటికెన పుల్ల' అనే పదం ఉపయోగించడంలో దళిత జీవితం ఆవిష్కరింపబడింది.

'పెనుగులాట' అన్న కవితా శీర్షికలోనే దళితులు తమ పట్ల ఉన్న వివక్ష, అస్పృశ్యతల నుండి బయటపడాలనే తపన కన్పిస్తుంది.

[117] గోపి కవిత్వం – I (వంతెన)– పేజి - 233

''నిన్ను వదల్చుకొని
నన్ను మరల్చుకొని
ఉక్కుపిండంలో ఉదయించాలని
అనాదుల నుంచీ నా పెనుగులాట''[118]

అయినా ఈ వివక్ష నుండి బయట పడలేకపోతున్నాడు. తరతరాలుగా వేళ్ళూనుకుపోయిన ఈ అంతరం, ఈ అసమ వ్యవస్థ అంత సులభంగా తొలగిపోయేది కాదు. కానీ ఈ అసమానతలు తొలగిపోయి సమ సమాజ స్థాపన జరిగితేనే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుంది. 'విముక్త క్షణం' అనే కవితలో నెల్సన్ మండేలా గురించి రాశారు. భారతదేశంలో దళిత వివక్ష ఎలా ఉందో, దక్షిణాఫ్రికాలో ఉన్న వర్ణవివక్ష కూడా అలాంటిదే. దళిత కవిత్వం గురించి రాసినవారు నెల్సన్ మండేలా ను స్మరించుకోకుండా ఉండలేరు. గోపిగారు కూడా ఆయనపై ఒక కవిత రాశారు.

''అణచబడ్డ బంతి
గోడల్ని బద్దలు గొట్టిన
అనాది రక్త సంచలన సంగీతానివి
తెల్లవాడు నల్లబరచలేని
శుభ్రసుందర నీలినీలి వజ్రానివి''[119]

అంటూ ఆయన ఉద్యమాన్ని పేర్కొని ఆయన్ని వజ్రంతో పోల్చాడు. వర్ణవ్యవస్థ, వర్గవ్యవస్థను పారద్రోలడానికి నీవు వజ్ర సంకల్పాన్ని పూనావని చెప్పడం ఉద్దేశం. ఈ విధంగా దళిత సమస్యకు గల అంతర్జాతీయ స్వభావాన్ని నెల్సన్ మండేలాను స్మరించుకోవడం ద్వారా ఆవిష్కరింపచేశాడు. ''నీ బంధనం/ఉద్యమాలకు ఇంధనం/నీ విడుదల మానవత పెదవిపై వెన్నెల''[120] అని నెల్సన్ మండేలాను అరెస్ట్ చేసిన సందర్భంలో అంటారు. నెల్సన్ మండేలాను బంధించినప్పుడు, ఆయన్ని విడుదల చేయాలంటూ అనేక ఉద్యమాలు జరిగాయని, ప్రజలు ఆయన కోసం స్పందించిన తీరు మానవత్వాన్ని తెలుపుతుందన్నారు. దళితులు రాసే కవిత్వమే దళిత కవిత్వం కాదంటూ, దళితులపై, దళిత సమస్యలపై అవగాహన ఉన్న దళితేతరులు ఎవరైనా దళిత కవిత్వం రాయవచ్చని గోపి నిరూపించారు.

---

[118] గోపి కవిత్వం – I (మైలురాయి)– పేజి - 233

[119] గోపి కవిత్వం – I (వంతెన)– పేజి - 207

[120] గోపి కవిత్వం – I (వంతెన)– పేజి - 207

2.16 అనుభూతి కవిత్వం:

అనుభూతి కవిత్వంలో మనం చెప్పేదేదైనా మన అనుభవంలో నుంచి రావాలి. కవిత చదివిన తర్వాత ఒక దృక్పథం, సందేశం, భావన కాకుండా అనిర్దిష్టమైన అనుభూతి కలగాలి. అది పోలికల ద్వారా ఊహల ద్వారా, ఇంద్రియ సంవేదన కల్గించే వర్ణన ద్వారా గానీ, అందులో నవ్యత హృదయానికి హత్తుకునే అనిర్వచనీయమైన, అనిర్దిష్టమైన అనుభూతిగా మిగలాలి. అనుభూతి కవిత్వానికి మానవ అనుబంధంతో సంబంధం కలగాలి. అనుభవమంటే బాహ్య, అంతర ప్రపంచాల అనుసంధానం. వాస్తవ ప్రపంచం, కవి మనస్సు కలిసినప్పుడు కలిగేది అనుభవం. అనుభూతి కవిత్వంలో చెప్పేవారికి ఎంత ప్రాముఖ్యత ఉంటుందో, విషయానికీ అంతే ప్రాధాన్యత ఉంటుంది. భావకవిత్వం, అనుభూతి కవిత్వానికి దగ్గరి సంబంధం ఉన్నా భావకవిత్వం పూర్తిగా ఆత్మాశ్రయం. అనుభూతికి మానవునితో సంబంధం ఉంటుంది.

''జి.వి. సుబ్రహ్మణ్యంగారు అనుభూతిని ఆస్వాదయోగ్యంగా చెయ్యడానికి రచయితలు, కవులు పాటించే పద్ధతులను మూడు రకాలుగా పేర్కొన్నారు. 1. సాధారణీకరణం, 2. సామాజీకరణం, 3. స్వాత్మీయీకరణం. కవిత్వంలో సమగ్ర సామాజికానుభవాన్ని పండించాలన్న అత్యంత ఆధునిక సాహిత్య స్పృహతో చేస్తున్న ప్రయత్నమే అనుభూతి వాదం''[121] అని నిర్వచించారు.

ఆధునిక కవిత్వంలో అనుభూతికవిగా పేరు తెచ్చుకున్న మొదటి కవి తిలక్. గోపి రాసిన 'పొప్పడి చెట్టు' కవిత అనుభూతి కవిగా నిరూపిస్తుంది. ఇందులో పొప్పడి చెట్టు రూపాన్ని ఊహిస్తూ, పోలికలతో పోల్చి చెప్పడం జరిగింది.

''తాటి చెట్టులాగ బడాయి ఉండదు
ఎత్తులకెదగాలనే ఆకాంక్షా లేదు
వినమ్ర క్రమ ఫలభరిత ఈ వనిత
మధుర మధుర ప్రేమామృత స్వాదు చరిత''[122]

[121] తెలుగులో కవితోద్యమాలు – పేజి -305.

[122] పురి విప్పిన ఊపిరి – డా. ఎన్. గోపి –పేజి -56

పొప్పడి పండును 'వినమ్ర కమ్ర ఫల భరిత' అంటూ స్త్రీతో పోలుస్తారు. ఇక్కడ 'కమ్ర' అంటే 'ఇంపైన' అని అర్థం. పొప్పడి పండు అందమైన, మధురమైన ప్రేమ ఫలమని చెప్తూ ఆ పండు రుచిని అనుభూతి చెందుతూ చెప్పడం జరిగింది. ''పండును కోసినప్పుడు/కాషాయ కాంతుల సూర్యుడు/ భళ్ళున ఉదయిస్తాడు'' అని పండు రంగును వర్ణించాడు. ఉదయించే సూర్యుడును పొప్పాయి పండుతో పోల్చాడు. పొప్పాయి పండునే నారింజపండు అంటారని, ఆ పండులోని విత్తనాలను ''నల్లటి ముత్యాలతో'' పోల్చి అవి సిల్కుగింజల్లా ఉన్నాయని వాటి స్వభావాన్ని చెప్పాడు. ఈ పొప్పడి పండును తింటే శరీరచ్ఛాయ నిగారింపును సంతరించుకుంటుందనే సౌందర్య చిట్కాను చెప్పడం అనుభూతి కల్గించే విషయం. ఈ విధంగా పొప్పడి చెట్టును వివిధ పోలికలతో చెప్పిన తీరు చూస్తే గోపిగారిని అనుభూతి కవిగా కూడా గుర్తించవచ్చు.

'కొండ' అనే కవితలో కొండ స్వరూపాన్ని వర్ణిస్తాడు. కొండను ''అపురూప వస్తు కోశాగారం/ చరిత్రను కుప్పవోసిన మ్యూజియం''[123]గా వర్ణించడంలో దానిపై ఎన్నో రకాల చెట్లు, పుష్పాలు ఉంటాయని కవి భావన. కొండ కొండలా ఉండదు గుండెలాగా కొట్టుకుంటుందని చెప్పడంలో కొండకు లేని గుండెను ఆపాదించి అనుభూతి చెందారు. కొండ ఏ భావాలకూ స్పందించని ఒక పదార్థం. స్థిరత్వానికి చిహ్నం. మరి హృదయం స్పందించే గుణం కలది. ఈ రెండింటిని పోల్చడం కొత్త భావుకతను ఇచ్చింది.

''కొండ
నా కవిత్వానికి నేపథ్యం
నా జీవన యాత్రలో
నిశ్శబ్దంగా మోగే వాద్యం''[124]

కొండ నా కవిత్వానికి ప్రేరణగా నిలిచిందనడంలో కవి ప్రకృతి పట్ల గల ఆరాధనా భావం తెలుస్తుంది.

'పిల్లబాట' కవితలో మనం నడిచే సన్ననిదారిని వర్ణించారు.

---

[123] మళ్లీ విత్తనంలోకి – డా. ఎన్. గోపి –పేజి -72

[124] మళ్లీ విత్తనంలోకి – డా. ఎన్. గోపి –పేజి -73

''నడిచే పాదాలు రచించిన
దీర్ఘకావ్యంలాగా పిల్లబాట
ఎక్కడ పుట్టిందో తెలియదు
ఎక్కడ ముగుస్తుందో అర్థంకాదు''[125]

అంటూ పిల్లబాటను దీర్ఘకావ్యంతో పోల్చాడు. ''అడవికి భయపడదు/పట్టుకుందామంటే దానికే దొరకదు'' అనడంలో అడవిలో ఎన్నో పిల్ల దారులుంటాయని, వాటిని కనుక్కోవడం చాలా కష్టం అన్న విషయం స్పష్టమవుతుంది. ఒక గుట్టను ఎక్కాలన్నా, దిగాలన్న పిల్లబాటే ఉంటుందని, పిల్లబాటకు కాంట్రాక్టర్లు నాసిరకం రహదారులు వేయాల్సిన అవసరం రాదని చెప్పడంలో నేటి నాసిరకం రోడ్ల వ్యవస్థను మన దృష్టిలోకి తెచ్చే ప్రయత్నం చేశారు.

పిల్లబాట కొండ పక్కనుంచి పోతుంటే పక్క పాపిటలా ఉందని వర్ణించాడు.

''పిల్లబాట అనితర మార్గం
సాగిపోవటం దాని లక్షణం
ఆత్మయత దాని భావం
మానవత దాని స్వభావం''[126]

అంటూ పిల్ల బాటలో కూడా మానవత్వాన్ని చూడగల్గటం గోపికే సాధ్యమైంది. ఈ కవి చెప్పే ప్రతి కవితలో తీసుకున్న వస్తువులో మానవత్వాన్ని జొప్పించడం వీరి ప్రత్యేకత. 'అక్షరాలు' కవితలో వాటి గొప్పదనాన్ని చెప్పాడు. అక్షరాలను ఊహలు, కలలు, ఆలోచనలు, ఆకాంక్షల్ని మోసే కూలీగా భావించాడు. ''కానీ నా అక్షరాలెప్పుడూ/ నా హృదయ భారాన్నే మోశాయి'' అంటారు.

''ఒక విత్తనం నాటితే
పది కంకులనిస్తుంది
ఒక అక్షరాన్ని మీటితే
భావ సైన్యానికి
నాయకత్వం వహిస్తుంది''[127]

[125] మళ్లీ విత్తనంలోకి – డా. ఎన్. గోపి –పేజి -79

[126] మళ్లీ విత్తనంలోకి – డా. ఎన్. గోపి –పేజి -81

అనడంలో మనం రాసిన అక్షరాలే ప్రజల్లో ఆలోచనలు రేకెత్తించి చైతన్య పరుస్తాయని అలాంటి శక్తి అక్షరాలకు ఉందంటాడు. ఇక్కడ మనకు కాళోజీ పేర్కొన్న ''ఒక సిరాచుక్క లక్షమెదళ్ళకు కదలిక' అన్న మాటలు గుర్తుకొస్తాయి.

ఈ విధంగా గోపి సృష్టించిన అనుభూతి కవిత్వం చదువుతున్న మనల్ని కూడా అనుభూతికి గురి చేస్తుంది.

కవికి సముద్రం పట్ల ఉన్న ఇష్టం వల్లనేమోగానీ దాదాపు ప్రతి కవితా సంపుటిలో ఏదో ఒక కవితలో 'సముద్రం' పదం ఉపయోగించారు. అందుకే సముద్రానికీ నాకు, అనుబంధం/ నీళ్ళకీ రాళ్ళకీ ఉన్నదే అని చెప్పుకున్నారు ఒకచోట. ఒక్క తంగెడుపూలు, మైలు రాయిలు మినహా అన్ని కవితా సంపుటాల్లో సముద్రం కన్పిస్తుంది. చిత్ర దీపాలు కవితా సంపుటిలోని కడలిసంతకం, బిందుఘోష అనే కవితల్లో పదకొండు సార్లు పర్యాయపదాలు వాడకుండా 'సముద్రం' అనే పదాన్ని ప్రయోగించారు. ఈ విషయంలో మనకు స్పానిష్ కవి ప్లాబోనెరూడ గుర్తుకొస్తారు. ఆయన కవిత్వంలో కూడా సముద్రం అంతర్భాగం. అందుకే ఈయన్ని 'సముద్రకవి' అంటారు. గోపి అధికారిగా, కవిగా అనేక ప్రదేశాలకు వెళ్ళడం జరిగింది. ఆ ప్రాంతాల్లో తనను ప్రభావితం చేసిన వాటిని వస్తువుగా తీసుకొని కవిత్వం రాశారు. అలాంటి కవిత్వాన్ని 'పర్యటన కవిత్వం'గా చెప్పవచ్చు. అలాంటి కవితల్లో కన్యాకుమారి, హిమాలయ పంక్తులను చూసినప్పుడు రాసినకవిత హిమాలయ్ కి గోద్ మే, శ్రావణ బెలగొళ (ఇది కర్ణాటక రాష్ట్రం, హసన్ జిల్లా చెన్నరాయ పట్టణానికి సమీపంలో ఉంది. జైనులకు ప్రీతి పాత్రమైన బాహుబలి (గోమటేశ్వరుడి) ఎత్తైన విగ్రహం ఇక్కడ ఉంది. 2000 సంవత్సరాల పూర్వమే ఇక్కడ జైనమతం ఉన్నట్లు తెలుస్తుంది. దక్షిణ కాశీగా ఈ పట్టణాన్ని పిలుస్తారు) షిల్లాంగ్ లోని ఒక ప్రైవేట్ సీతాకోక చిలుకల మ్యూజియాన్ని చూసి రాసిన కవిత తిత్తిలీ ఉడీ, సైప్రస్ దేశ పర్యటనకు వెళ్ళినప్పుడు రాసిన సైప్రస్ కవిత, వీనస్ రాక్, అమెరికా పర్యటన సందర్భంలో రాసిన నయాగరా కవిత (న్యూయార్క్, కెనడాల మధ్య నయాగరా నదిపై ఉన్న జలపాతం ఇది. బ్రూస్ ట్రిగ్గర్ అనే శాస్త్రజ్ఞుడు 17వ శతాబ్దానికి చెందిన ఫ్రెంచి మ్యాప్ లో చూపించినట్లు ఈ ప్రాంతంలో నయాగరేగా అనే జాతి ప్రజలు నివసించేవారు. అందుకే ఆ పేరు వచ్చింది – వికీపీడియా). గోవా పర్యటన సందర్భంగా రాసిన 'గోవాలో సముద్రం' సంపుటిలో మొత్తం 19

---

[127] హృదయరశ్మి – డా. ఎన్. గోపి –పేజి -36

కవితలున్నాయి. అదేవిధంగా ఇంగ్లండ్ పర్యటన సందర్భంగా 'మరో ఆకాశం' పేరుతో 24 కవితలను రాశారు.

ఇంకా ఢిల్లీ పర్యటన సందర్భంగా వహ్ తాజ్ కవిత, మణిపురి కొండలు అనే కవిత, విశాఖపట్టణం, భీమ్ లీ, అరకు ప్రయాణం, షిల్లాంగ్ లో సూర్యోదయం, గౌహతీలో ట్రాఫిక్ జామ్, యహబొంబై వంటి కవితలను వివిధ పర్యటనల సందర్భంగా అక్కడి విశేషాలను వర్ణిస్తూ రాశారు.

గోపి 'తాత్వికత' గురించి రాసిన కవితలు కూడా వివిధ సంపుటాల్లో చోటు చేసుకున్నాయి. ప్రకృతి, మానవుని ఉనికి, జీవితం గురించి, ఆధ్యాత్మిక సంబంధమైన అంశాల గురించి రాసిన కవిత్వం తాత్విక కవిత్వం. అలాంటి వాటిలో 'మలుపు' అనే కవితలో జీవితం పట్ల ఆశ పుట్టడాన్ని గురించి వర్ణించారు. అయితే అది వ్యామోహం లాంటి ఆశ కాదు. శేష జీవితం స్నేహ జీవితమనీ, జీవితం పట్ల జిజ్ఞాస ఉండాలని అప్పుడే దాని పరమార్థం బోధపడుతుందని చెప్పారు. 'పూర్ణమిదం' అనే మరో కవితలో ''సగం సగమే ఏదయినా/ ముఖ్యంగా నువ్వు' అంటారు.

''ఒకే చూరును పట్టుకొని వేలాడితే
అది వాడిన తోరణమవుతుంది
ఒకే మాటను పట్టుకొని అంగలారిస్తే
అది అంతుపట్టని కారణమౌతుంది''[128]

కాబట్టి అలాంటి వాటిని విడిచి పెట్టాలంటారు. కవిత్వంలో కవితాత్మక దృక్పథం వస్తువులో భాగంగా ఉంటుంది. 'మీమాంస' అనే కవితలో ''నిజానికి/రెండు కళ్ళు అనేది ఆత్మీయత/తనువంతా నయనాలైతే/ అది తాత్వికత'' అంటూ తాత్వికతను నిర్వచించాడు.

శరీరమంతా కళ్ళు కావడం అసాధ్యమనీ, కానీ అలాంటి స్థితికి చేరుకోవడమే తాత్వికత అన్నారు. ప్రతి మనిషీ నేను అనే వాన్ని లేకుంటే ఏదీ లేదన్న విషయాన్ని గ్రహించాలని చెప్పాడు.

[128] హృదయరశ్మి – డా. ఎన్. గోపి –పేజి -73

'తాత్త్విక ఛాయ' అనే కవితలో ''జీవితం ఒక ప్రయోగం/ఎప్పుడే ఫలితమొస్తుందో/ ఎవరూ చెప్పలేరు'' అంటారు. జీవితం అనుకొని సంఘటనల కలయిక. ఎప్పుడు ఎవరి జీవితం ఎలా మలుపు తిరుగుతుందో ఎవరూ చెప్పలేరని ఇందులోని భావం.

''ఊపిరి
సమస్త సృష్టిచలనానికి
స్థబ్దతా గీతం వినిపించే
నిశ్శబ్ద గాంధర్వమౌతుంది
ఇప్పుడేమవుతుందో
ఎవరైనా చెప్పగలరు
బహుశా దాని పేరు మరణం''[129]

ఊపిరి ఉన్నంత వరకే మనిషికి జీవితం అని అది ఆగిపోతే మరణమే అని చెప్తూ ఊపిరిని గీతంతో పోల్చడం. ఆ గీతం ఆగిపోతే నిశ్శబ్ద గాంధర్వమవడం అనేది మరణం అని వర్ణించడం జరిగింది. ఈ విధంగా తాత్వికదృష్టితో కూడిన కవిత్వం కూడా రాశారు.

అపజయాలకు కుంగిపోయేవారిని, ప్రతి చిన్న విషయానికి బాధపడే వారిని, నిరాశావాదులను ఆశావాదులుగా మార్చి వారి జీవితాలను వెలిగించేలా, వారికి బ్రతుకుపై ఆశ కలిగేలా రాసిన కవితా పంక్తులు అనేకం మనకు గోపి కవిత్వంలో కనిపిస్తాయి. ఇవి చదువుతూ ఉంటే గోపిలో మనకు ఒక మానసిక విశ్లేషకుడు కన్పిస్తాడు.

''దుఃఖాన్నే జీవితంగా స్వీకరించినవాడికి
బరువును గురించి వర్ణించడమెందుకు?''

అంటూ ప్రశ్నిస్తూనే వారిలో ప్రేరణ నింపే పంక్తులను రాస్తాడు.

''రాత్రంటే భయం లేదు నాకు
రాత్రే లేకుంటే నేను వెలిగే వాణ్ణే కాదు'' అంటారు
''పడ్డవాడెప్పుడూ చెడ్డవాడు కాదు

[129] హృదయరశ్మి – డా. ఎన్. గోపి –పేజి -96

నలిగిన మరువం, దవనం

మరింత పరిమళం వెదజల్లుతాయి

ఇవాళ

నువ్వు ఆకాశంలో వెనకబడ్డ ఆఖరి పక్షివే

రేపు తప్పకుండా ముందుంటావు''[130] అంటూ అపజయాలకు క్రుంగిపోరాదని, అపజయాలే విజయానికి పునాదులంటూ హితబోధ చేశారు.

''దారి తెలిసినప్పుడు నిరాశలెందుకు

పోరాటాలు కొత్తా మనకు'' అని విజయానికి దారి తెలిసినప్పుడు ఇక భయపడాల్సిన అవసరం లేదని దానికోసం పోరాడాలంటారు.

ఇవే కాకుండా గోపి కవిత్వంలో అధివాస్తవికతావాద కవిత్వం, కాలాన్ని గురించి, పేదరికం, స్త్రీ వాద కవిత్వం గురించి వర్ణించిన కవిత్వం మనకు కన్పిస్తుంది. ఇలా ఎన్ని రకాలుగా కవిత్వాన్ని విభజించి చూసినా అంతిమంగా దాని లక్ష్యం సామాజిక ప్రయోజనమే. కవికి సమాజం పట్ల బాధ్యత ఉండాలి. ఆ బాధ్యతను మరిచిపోకుండా విధిగా ప్రజలలో సామాజిక చైతన్యానికి కృషి చేయాలి. భారతీయ ఆలంకారికులకు కవిత్వ ప్రయోజన విషయంలో ఎన్ని అభిప్రాయాలున్నప్పటికీ ఆనందం, ఉపదేశం దాని ప్రయోజనాలన్నారు. సామాజిక బాధ్యత కలిగిన కవి పేదరికం, ఆవేదన, ఆలోచన, దుర్మార్గం, దాతృత్వం, మంచి, చెడు, నీతి, మతం, కులం, విలువలు, ఆశ, నిరాశ, సుఖం, దుఃఖం, ప్రేమ, ద్వేషం, కోపం, ఈర్ష్య, భౌతిక, ఆధ్యాత్మిక, లౌకిక, అలౌకిక ఏ విషయం గురించి చెప్పినా సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని సామాజిక కోణంలో చూడాలి. గోపి కూడా ఏ అంశం గురించి చెప్పినా దాని లక్ష్యం సామాజికతే. సమాజ శ్రేయస్సే లక్ష్యంగా రాయడం జరిగింది. పల్లె నేపథ్యం నుండి వచ్చిన వాడు, మట్టి వాసన, మనుషుల అనుబంధాలు తెలిసిన వాడు కాబట్టే గోపి ఏ కవిత్వంలో చూసిన మానవత్వం పరిమళిస్తుంది. మంచి మనిషి కాలేనివాడు మంచి కవి కాలేడు అన్నది గోపి అభిప్రాయం. కాబట్టే గోపి మంచి మనిషి. మంచి కవి కూడా.

[130] గోపి కవిత్వం-I (కాలాన్ని నిద్రపోనివ్వను) డా. ఎన్. గోపి –పేజి -313

2.17 జలగీతం – దీర్ఘకావ్యం:

మానవజాతి మనుగడకు మూలం నీరు. అలాంటి నీటిని వస్తువుగా చేసుకొని గోపి రాసిన దీర్ఘకావ్యం ''జలగీతం''.

దీర్ఘకావ్యం – నిర్వచనాలు:

ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డిగారు దీర్ఘ కవిత గురించి పేర్కొంటూ ''దీర్ఘ కవిత దీర్ఘ కావ్యానికి పునాది. భూమిక ఒక ఉద్యమం, ఒక సమస్య, ఒక భావన, ఒక సంఘటనను తీసుకొని ఒక తాత్విక నేపథ్యంతో దాని పరిణామాన్ని వివరించి, కవి తీర్పునివ్వడమే దీర్ఘ కవిత''[131] అన్నారు.

''సమాజ జీవితంలో వివిధ రంగాలలో మానవుడు ఎదుర్కొనే సమస్యల వలనగాని, స్వీయమైన అంతర జీవితంలో తాను పొందే అనుభూతుల వలనగానీ, ఏర్పడే మానసిక ప్రవృత్తులను చిత్రించే వైవిధ్యంతో కూడిన భావ చిత్రాల సంపుటీకరణం దీర్ఘ కవిత''[132]

''ఒక కవితా రూపానికీ, కవి మనస్సులోని నేపథ్యానికీ అవినాభావ సంబంధం ఉంటుంది. భాష, భావమూ, భావాంశాలన్నింటినీ ఒక భావధారగా, మలుచుకునే కవి అనుభూతీ అన్నీ కలిసి ప్రత్యేక రూపానికి కారణమవుతాయి. ఒక కవితలో ఒక వస్తువుకు సంబంధించిన సమగ్ర రూపం ఉంటుంది. ఈ వస్తువును అనేక కోణాల్లో చెప్పాలన్న కవి తపన దీర్ఘ కవిత రూపాన్ని తీసుకుంటుంది.''[133]

దీర్ఘ కవిత లక్షణాలు:

1. దీర్ఘకవిత తన విస్తీర్ణంలోనే, పరిధిలోనే పాఠకునికి ఒక అవగాహను కలిగిస్తుంది.
2. దీర్ఘకవిత అధ్యాయాలు, ఖండికలు, భాగాలుగా చెప్పబడి ఎక్కడా ఆగకుండా సాగుతాయి.
3. కవితా పద్ధతితోనూ, వస్తువులోనూ ఆధునికతను కలిగి ఉంటుంది.
4. ఏదైనా ఒక సమస్య, ఒక భావన, ఒక సంఘటన తీసుకొని తాత్త్విక నేపథ్యంలో దాని పరిణామాన్ని, ఫలితాలను అందిస్తుంది.

---

[131] తెలుగులో కవిత్వోద్యమాలు. పేజి. 219.

[132] సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు – జి.వి. సుబ్రహ్మణ్యం పేజి. 592.

[133] మూల్యాంకనం.2003. పేజి. 100.

తెలుగులో వచ్చిన దీర్ఘకవితలు కొన్ని చూసినట్లయితే వాటిలో కొయ్యగుర్రం – నగ్నముని, విశ్వంభర – సినారె, మట్టి మనిషి ఆకాశం – సినారె, జీవనది – పెన్నా శివరామకృష్ణ, ఆసుపత్రి గీతం – ఎల్లూరి శివారెడ్డి, మలయమారుతాలు – బెజవాడ గోపాలరెడ్డి, నా దేశం నా ప్రజలు – గుంటూరు శేషేంద్రశర్మ మొదలైనవారు రాయడం జరిగింది.

గోపి రాసిన 'జలగీతం' వైజ్ఞానిక భూమికపై మొలిచిన తాత్విక, మానవీయ కవిత. విశ్వం నుండి నీటిరాక, జలచక్రం, పంచభూతాల్లో నీటి ప్రాధాన్యం, ప్రమేయం, నీటి రూపాలు, ధర్మాలు, నీటి విలువ, ప్రశస్తి, నీరూ సంస్కృతి, నీటితో మనిషికున్న సంబంధం, నీటి కరువు, నీటి పంపకాలు, నీటి కలహాలు, నదులు, జలపాతాలు, చెరువుల జల వ్యవస్థ, రవాణా జలం, జల కాలుష్యం, నీటిని వాణిజ్య వస్తువుగా మారుస్తున్న వైనం, నీటి కోసం ఉద్యమాలు, నీటి నిల్వల కోసం భగీరథ ప్రయత్నాలు మొదలైన సమస్త అంశాలకు కవితాత్మక రూపమే ''జల గీతం''.

మనిషి మనుగడకు కారణమైన నీటి ఇతివృత్తమే గోపి జలగీతం (గీతమంటే పాడబడినది – గేయమంటే పాడదగినది). 27 ఖండికలతో నిర్మించిన ఈ కావ్యంలో నిరంతర జల పరిణామం, భూమి సంరక్షణలో మనిషి నిర్లక్ష్యం, జల కాలుష్యం, నీటి కరువుకు కారణాలు, దాని ద్వారా సంభవించే వైపరీత్యాలు వంటి అంశాలను ఒక్కో ఖండికలో ఒక్కొక్క దాని గురించి రాయడం జరిగింది.

మొదటి ఖండికలో నీటిని గురించిన శాస్త్రీయ అంశాలను గురించి వివరించారు.
రెండవ ఖండికలో జలం పుట్టుక, నీటి అస్తిత్వం, విస్తృతి గురించి,
మూడవ ఖండికలో నీటి సహజ రూప, పరిణామం వ్యాప్తి,
నాల్గవ భాగంలో నీటి విశ్వజనీనత, ప్రాణికోటి మనుగడలో నీటి పాత్ర,
ఐదవ భాగంలో జలాన్వేషణలో మానవుడు గ్రహాలను చేరిన వైనం,
ఆరవ భాగంలో నీటి విస్తృతి ప్రాధాన్యం
ఏడవ ఖండికలో నీటి ప్రత్యేకత, పరిమితి,వినియోగం, ఉపయోగం,
ఎనిమిదవ ఖండికలో నీటి ఉనికిని గురించి
తొమ్మిదవ ఖండికలో జలరహస్యాన్ని ఛేదించే ప్రయత్నం,
పదవ ఖండికలో నీటికి, మనిషికి గల పరస్పర సంబంధం

పదకొండవ ఖండికలో నీటి ప్రాధాన్యత, కాలుష్య పరిరక్షణకు చర్యలు తీసుకోకపోతే వచ్చే సంక్షోభం,

పన్నెండవ ఖండికలో వర్షాభావం వల్ల ఏర్పడిన కరువు పరిస్థితులు,

పదమూడో ఖండికలో నీరు లేక ఎడారిగా మారిన పరిస్థితులను గురించి,

పద్నాలుగో ఖండికలో నీటి ఉధృతి, ఉగ్రరూపం

పదిహేనో ఖండికలో నీటి సార్వజనీనతను, నీటి యుద్ధాల గురించి,

పదహారో ఖండికలో నీటిని జీవకోటికి దైవంగా భావించమని చెప్తూ, మనిషి స్వార్థం గురించి చెప్పడం,

పదిహేడో ఖండికలో నీటి మరో రూపం మంచు, రూప, గుణ, విశిష్టతలను,

పద్దెనిమిదో ఖండికలో భారత నైసర్గిక స్వరూపం, నదుల ప్రస్తావనను,

పందొమ్మిదో ఖండికలో మనుషులకు నదుల వల్ల కలిగే ఉపయోగం, నదుల ఔన్నత్యం, నదుల కలుషితం గురించి,

ఇరవై ఖండికలో నేడు చెరువుల దయనీయస్థితి, కరువు కారణాలు, తక్షణ కర్తవ్యం గురించి,

ఇరవై ఒకటో ఖండికలో చైతన్యవంతమైన నీటి శైలిని గురించి,

ఇరవై రెండో ఖండికలో సముద్రజలాల్ని గంభీరంగా వర్ణించడం,

ఇరవై మూడో ఖండికలో కరువు పరిస్థితులు, ప్రపంచీకరణ ప్రభావం,

ఇరవై నాలుగో ఖండికలో నీటికాలుష్యం, ముఖ్యంగా ఫ్లోరైడ్ ముప్పుగురించి,

ఇరవై అయిదో ఖండిక అపర భగీరథుడు జలగీతాన్ని అంకితం తీసుకున్న రాజేంద్రసింగ్ గురించి,

ఇరవై ఆరు నీటి విశృంఖల వినియోగం గురించి,

ఇరవై ఏడు ఖండిక నీటి ఆత్మఘోషను, జలగీత ప్రబోధం, నీటి ప్రాముఖ్యాన్ని గురించి వివిధ అంశాలను వర్ణించడం జరిగింది.

కవి స్వయంగా పఠించిన జలగీతం 2009 ఆకాశవాణిలో 9 వారాల పాటు ధారవాహికగా వచ్చింది.

'జలగీతం' దీర్ఘకావ్యాన్ని హిందీలో (ప్రొ. మణి), ఇంగ్లీషు భాష లోకి (ప్రొ. అల్లాడి ఉమ, ప్రొ. ఎమ్. శ్రీధర్), మరాఠీలోకి (కీ.శే. నిరంజన్ ఉజ్ గరే), మళయాలంలో (ప్రొ.

రాజేంద్రబాబు), కన్నడలోకి (ప్రొ. మార్కండాపురం శ్రీనివాస్), పర్షియన్ (అజీజుద్దీన్ ఉస్మానీ), పంజాబీ (స్వరణ్ జిత్ సావీ), ఉర్దూ (ప్రొ.రహమత్ యూసఫ్ జాయ్), గుజరాతీలోకి (రమణిక్ సోమేశ్వర్) (ఈ అనువాదానికి 2009లో సాహిత్య అకాడమీ అవార్డు లభించింది) వంటివారు తొమ్మిది భాషల్లోకి అనువాదం చేశారు. అనువాదాల వల్ల భాషా సంపద పెరుగుతుంది.

''గుజరాత్ లో భుజ్ జిల్లా కచ్ యూనివర్సిటీలో ''జలగీత్''ను భారతీయ సాహిత్యం పేపర్ లో పాఠ్యపుస్తకంగా పెట్టడం''[134] జరిగింది. ''ఏ బ్రహ్మాండాల నుండి వొలికి పడ్డాయో నీళ్ళు'' అంటూ ప్రారంభమైన ఈ దీర్ఘకవిత ''ప్రపంచమంతా ప్రకటించండి జలం ఎలర్టు! అందించండి మీ చేయూత! అందుకే ఈ జలవద్గీత'' అనే సందేశంతో ముగుస్తుంది.

''ఏ బ్రహ్మాండాల నుంచి
వొలికి పడ్డాయో నీళ్ళు!
ఊహలో పట్టని
ఏ వైశాల్యాల గుండా
నీటి చిరంతన ప్రయాణమో!
ఏ విశ్వాంతరాల
ఆదిమ శబ్దాలను మోసుకొచ్చాయో!''[135]

అంటూ నీటి పుట్టుక, నీటితో మనిషికున్న అనుబంధాన్ని, ఆ నీటివెంట వికసించిన నాగరికతా పరిణామాల్ని వివరించడం జరిగింది.

''మూడు పరమాణువుల
ముచ్చటైన ముత్యం
ముంగిట్లో రాలిపడింది'', అని చెప్పడంలో నీటి పుట్టుకకు కారణమైన శాస్త్ర అంశాల్ని చెప్పడం జరిగింది. H_2O – 1 Oxygen and 2 hydrozen Atoms లు కలిసి నీరు ఏర్పడుతుందని Water Chemical Formula గురించి చెప్పారు.

134 వ్యాసకలశం – డా. ఎన్. గోపి – పేజి -27

135 జలగీతం (గోపి కవిత్వం – II) డా. ఎన్. గోపి – పేజి - 397

''మూడొంతుల జలావరణంలో/ భూఖండ శకలాలతో / జీవ గోళం తిరుగుతుంది'' అని చెప్తూ మనది ద్వీపకల్పదేశమని గుర్తు చేసుకుంటున్నారు. భూమ్మీద మొత్తం నీటిలో 97 శాతం సముద్రజలం. అందులో రెండు శాతం మంచురూపంలో ఉంటే, మిగిలిన ఒక్క శాతమే మనకు ఉపయోగంలో ఉంది. అలాంటి నీరు అధిక జనాభా, కాలుష్యం వంటి కారణాలతో నీటి ముప్పుగా ఏర్పడుతుంది. ఇక్కడ మనకు హిమజ్వాల రాసిన ఒక నానీ గుర్తుకొస్తుంది.

''మూడు దిక్కులా
ఈ భూమికి నీళ్ళే ఉన్నవంట
మరి మనిషికెట్లా వచ్చిందో
ఈ నీళ్ళ కటకట''[136]

కాబట్టే ప్రభుత్వాలు మార్చి 22ను ప్రపంచజల సంరక్షణదినోత్సవంగా గుర్తించి నీటి ప్రాధాన్యాన్ని చెప్పకనే చెప్పాయి. అలాగే ఐక్యరాజ్యసమితి (UNO) 2003 సంవత్సరాన్ని అంతర్జాతీయ తాగునీటి సంవత్సరంగా ప్రకటించారు.

''నీళ్ళు లేనప్పుడు / కన్నీళ్ళే తోడు / మరి కన్నీళ్ళు కూడా ఇంకిపోయినప్పుడు'' అంటూ మనిషికి ప్రాణాధారమైన నీటిని మనిషి తన చేష్టలవల్లే కన్నీరుగా మార్చుకొని కన్నీరు మున్నీరవుతున్నారని నీటి సమస్యను తెలిపాడు.

''జలమర్మాలను కనుక్కోవడానికి
జిజ్ఞాసువుగా ఎదిగిన మనిషి
జలస్తన్యాన్ని
క్రూరంగా కుమ్ముతున్నాడు
... ...
మితిమీరిన వాణిజ్య దాహం
నీటి ప్రాణాన్ని బలిగొంటుంది''[137]

[136] తెలంగాణ పల్లె (నానీలు) 2005 – హిమజ్వాల.

[137] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 428

పెరుగుతున్న జనాభాకు, పారిశ్రామిక అవసరాలకు, వ్యవసాయానికి ప్రధాన ఆధారం భూగర్భజలాలే. కాలుష్యం వల్ల వాతావరణ మార్పు జరిగి వర్షపాతం తగ్గి పరిస్థితి సంక్లిష్టం అయ్యింది. రోజురోజుకూ పెరుగుతున్న అవసరాలు, వర్షపాతం లోటు కారణంగా భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. విషపూరిత రసాయనాలు, లోహాలు, ఫ్లోరైడ్ పేరుకుపోయి నదీజలాలు విషతుల్యమవుతున్నాయి. పారిశ్రామిక రంగాల్లో జలాల్ని శుద్ధిచేసి పునర్వియోగించే పరిస్థితి లేదు. ప్రాజెక్టులపేరుతో రాజకీయం చేసే విధానాన్ని (Water Politics, Hydro Politics) గురించి చెప్తూ –

''జలభావనలకు
వివక్ష ఎందుకుంటుంది?
ఇక ముందు వెళ్ళొద్దు
ఇక్కడే ఆగిపో
మాకే ఉండిపో'' అంటాడొకడు
గుండెల్లో బళ్ళాలు నాటి
ఆనకట్టలు కడతాడు''[138]

''నీరు పల్లమెరుగు'' కానీ స్వేచ్ఛగా పరుగెత్తే నీటికి మనిషి ఆనకట్టలు కట్టి, లోతట్టు ప్రాంతాల వారికి నీరు అందకుండా అడ్డుకుంటున్నాడు. నీటి మీద హక్కుల కోసం రాజకీయాలు ప్రారంభిస్తారు.

''ఎవడిదిరా హక్కు / ఆకాశంలో లేని అవధులు / మీలోకంలోకి ఎలా వచ్చాయి?'' అంటూ మేఘాలు సైతం ఆశ్చర్యపోయి, ఆకాశంలో లేని హద్దులు, అవధులు మనుషులకే ఎందుకో అని ప్రశ్నిస్తాయంటారు. నీటికోసం యుద్ధాలు జరిగిన తీరును చెప్తూ, కొన్ని అంతర్జాతీయ సంఘటనలను వివరించడం కన్పిస్తుంది.

''శతాబ్దం కాలంగా కొలరాడో నది
కత్తుల మధ్య కదిలింది
అరిజోనా, కాలిఫోర్నియా రాష్ట్రాలు

[138] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 442

ఇజ్రాయెల్, పాలస్తీనాల్లో
ఉన్న కాస్త నీళ్ళలో
రక్తం స్రవిస్తుంది
జోర్డాన్ నదికి వొల్లంతా గాయాలే
లెబనాన్ జోర్డాన్ సిరియా దేశాలు
ఒక్కో చుక్కతో నాలుకలు తడుపుకుంటున్నాయి''[139]

అంటూ వివిధ రాష్ట్రాలు, దేశాల మధ్య నీటి యుద్ధాలను చెప్పాడు. అరిజోనా, కాలిఫోర్నియా రాష్ట్రాలు కొలరాడో (Colorado river) నదీ నీటికోసం జరిగిన యుద్ధాన్ని, ఇజ్రాయిల్, పాలస్తీనాల్లో జోర్డాన్ నది (Jordan River) గురించిన వివాదం, జోర్డాన్ మరియు సిరియా దేశాల మధ్య యుద్ధాలకు కారణం నీటి పంపకాలే అంటూ– ''జీవానికి నీరే ఆధారం ఎప్పుడూ / జీవహింసకు నీరే కారణం ఇప్పుడు''[140] అంటూ బాధ పడ్డాడు కవి.

గంగా, కావేరి, సోన్, నర్మద, బ్రహ్మపుత్ర, వంశధార, సబర్మతీ, యమున, కృష్ణా, గోదావరులు వంటి నదుల ప్రస్తావన చేస్తూ, అవి కాలుష్యానికి గురవుతున్నాయని ఆవేదన చెందుతాడు. నదుల అనుసంధానం గురించి చెప్తూ–

''కొండ కూతురైనా
గంగమ్మ గుండె మెత్తనిది
కావేరీ హృదయం పచ్చనిది
రెండు దిక్కులను ముడివేస్తే
అన్ని దిక్కులూ మనవే
కాలువల పూలహారాలతో
నదుల కంఠాలను అలంకరిద్దాం''[141]

అంతర్రాష్ట్ర నదుల అనుసంధానం కష్టమైందే. కానీ పెరిగిన జనాభాకనుగుణంగా నీటి సమస్యను అధిగమించాలంటే నీటి లభ్యత అధికంగా ఉన్న ప్రాంతాల నుండి తక్కువగా ఉన్న

[139] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 443
[140] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 443
[141] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 453

ప్రాంతాలకు నీటిని తరలించడం తప్పనిసరి. నదుల నీటి కోసం వివిధ రాష్ట్రాల మధ్య జలవివాదాలు సంభవించడం మనం చూస్తూనే ఉన్నాం. కాబట్టి నదుల అనుసంధానం వల్ల అందరికీ న్యాయం చేయవచ్చు.

చెరువుల ప్రాధాన్యాన్ని గురించి చెప్తూ– ''మెట్ట ప్రాంతాల / మట్టెల దరువులు కదా చెరువులు''[142] అంటాడు. అలా అనడంలో ''చెరువుల కింద దున్ని చెడినవాడు లేడనే'' సామెత గుర్తుకు వస్తుంది. సాంస్కృతిక జీవనానికి పట్టుకొమ్మలైన చెరువుల విధ్వంసంతో వ్యవసాయం కళ తప్పుతుంది. చెరువు నీటివల్ల భూగర్భ జలాలు పెరిగి వృక్షసంపద కూడా పెరుగుతుంది. వర్షాలకు చెరువులలో చేరేనీటి ద్వారా మట్టిరేణువులు వచ్చి చేరతాయి. ఈ మట్టి సారవంతమైంది కావడంతో చేలల్లో ఎరువుగా ఉపయోగిస్తారు. అలాంటి చెరువులు బాల్యస్మృతిగా మారటం ఎంతో విషాదం అంటూ–

ఒక మహాజల వ్యవస్థను
ఎవరు ధ్వంసం చేశారు?
చెరువుల వొంటినిండా కురుపుల్లా
భవనాలు ఎవరు కట్టారు?
అన్నింటికీ
ఆకాశాన్ని నిందించడం
అలవాటయ్యింది మనకు''[143]

ప్రజలకు ప్రాణాధారమైన చెరువులను ఎవరు ధ్వంసం చేశారంటూ బాధపడుతాడు. చెరువుల్లో నీళ్ళు లేకపోవడానికీ మనం ఆకాశాన్నే నిందిస్తాం కానీ స్వయంకృతాపరాధంగా భావించం అంటారు. ఇలాంటి ''చెరువుల వొంటినిండా కురుపుల్లా / భవనాలు ఎవరు కట్టారు?''[144] అంటూ ప్రశ్నిస్తాడు కవి. ఈ సందర్భంగా గోపి రాసిన నానీ గుర్తుకు వస్తుంది.

''చెరువులో
బంగళాలు మొలిచాయి

---

[142] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 457

[143] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 459

[144] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 459

నీటి తల్లికి
ఇన్ని సమాధులా?''[145]

చెరువులు ఆక్రమణల పాలై వాటి స్థానంలో భవనాలు లేస్తున్నాయి అంటూ బాధ పడుతాడు.

''కాకతీయుల జలవిధానంలో
నీటి పంపకమే ప్రధానం
విజయనగర రాయల్ చెరువులు
శ్రేయోగీతాల ఆదరువులు''[146]

కాబట్టి కాకతీయుల కాలం నుండి వచ్చిన జలసిరిని కాపాడుకునేందుకు తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ''మిషన్ కాకతీయ'' (2015 మార్చి 12) పేరుతో చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టింది. చెరువు ప్రతి ఒక్కరికి తల్లి ఒడిలాంటిదని, అలాంటి చెరువుల్లో జలం పొంగి పొర్లితేనే జన జీవనం బాగుంటుందని కవి చెబుతున్నాడు. ''పంచధాతు సమన్వితం ప్రపంచం / ఐదు వేళ్ళు పిడికిలిగా మారినట్టు''[147] అనడంలో పంచభూతాత్మకమైన ప్రకృతిలో నీటికి ఉన్న ప్రాధాన్యత తెలుస్తుంది. ఆకాశం నుండి గాలి, గాలి నుండి అగ్ని, అగ్ని నుండి నీరు, నీటినుండి భూమి, భూమి నుంచి ఓషధులు పుట్టినట్లు వేదాలు చెబుతున్నాయి. ''మనుషులు పెరిగినట్టు / నీళ్ళు పెరుగుతాయా / రేపటి చిత్రానికి / నీటి రంగులు దొరకవు''[148] అంటూ పెరుగిన జనాభాకనుగుణంగా నీటి సమస్యను అధిగమించడం సాధ్యం కాదు. కాబట్టి నీటి సమస్యను పరిశీలించి, నీటి ఆవశ్యకతను గుర్తించమంటూ ''వానకి కాదు / దాహానికి గొడుగులు పట్టండి'' అంటూ నీటి సంరక్షణకు పిలుపునిస్తున్నాడు.

ఫ్లోరైడ్ ప్రభావ ప్రాంతాల గురించి చెప్తూ ''జలం కాటేసిన ఊరది / జలం గరళమై / నమ్మి తాగిన వారిని / నిలువునా ముంచేసిన ఊరది''[149] – అని ఫ్లోరైడ్ బాధిత ప్రాంతం వాడైన కవి కాబట్టే ఆ తీవ్రతను కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు. ఈ ఫ్లోరైడ్ ను ''మనిషి కలిపిన

---

[145] గోపి కవిత్వం – II డా. ఎన్. గోపి – పేజి - 18

[146] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి – 458-459

[147] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 407

[148] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 466

[149] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 468

గరళం కాదు / నేలపొరలు పన్నిన కుట్ర ఇది / నీటిని నిందించి ఏం లాభం / జలమాత కూడా / ఫ్లోరిన్ పీడిత కదా''[150]– అంటూ భూమి లోపల విషపూరిత రసాయనాలు, లోహాలు ఫ్లోరైడ్ గా మార్పు చెంది నీరు విషంగా మారుతుందంటూ శాస్త్రీయ అవగాహనతో చెప్పడం జరిగింది. నీటిలో ''ఫ్లోర్ స్పార్, క్రియోలైట్, ఫ్లోర పటైట్ వంటి ఖనిజాలను కలిగిన నేలలు ఉండడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులకి వాడే ఆల్కలైన సమ్మేళనాలు భూమిలో ఉండటం నేలలోని రసాయనిక సంఘటనల్లో కలిగే మార్పుల వల్ల నీటిలో ఫ్లోరైడ్ ఏర్పడుతుందని చెప్పవచ్చు''[151] 1 గ్రాము ఫ్లోరైడ్ వల్ల ఎలాంటి హాని ఉండదని, ఒకగ్రాము మోతాదుకు మించి ఫ్లోరైడ్ ఉంటే ఆ నీరు మంచిది కాదని చెప్పారు. ఈ ఫ్లోరైడ్ బాధితుల గురించి 'అక్షరాల్లో దగ్ధమై' కవితాసంపుటిలో 'విషధారలు' పేరుతో కవిత రాశారు. అందులో ప్రభుత్వాలకు వ్యంగ్యంగా విమర్శిస్తూ

''ప్రభుత్వాల దయ వల్ల
పిల్లలకు చైతన్యం పెరిగిన్టటుంది
అంగీలను, లంగాలను
వడబోత గుడ్డలుగా మార్చుకొని
నీళ్లు తాగుతున్నారు''[152]

అంటూ ఫ్లోరైడ్ మరియు మురికి నీటిని మంచినీరుగా మార్చి త్రాగడానికి పిల్లలు, ప్రజలు పడే బాధను వ్యక్తం చేశారు.

''మీకేమీటి!
అవిటి చేతులు వేసినా
లెక్కకొచ్చే ఓట్లే కదా!''[153]

అంటూ ప్రజలు పడే బాధలు రాజకీయ నాయకులకు అవసరం లేదని వారెలా ఉన్నా, వేసే ఓట్లే వారికి కావాలని ప్రజల బాధలు వారికి కన్పించవని బాధపడుతాడు.

---

[150] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 469

[151] ఎన్. గోపి జలగీతం వైజ్ఞానిక, మానవీయ, తాత్త్విక దర్శనం – యం. ధనంజయ్ మలక్ పేట -130

[152] గోపి కవిత్వం – III డా. ఎన్. గోపి – పేజి - 152

[153] గోపి కవిత్వం – III డా. ఎన్. గోపి – పేజి - 152

కవి తీసుకున్న వస్తు ప్రాధాన్యత దృష్ట్యా ఈ ''జలగీతాన్ని'' ఆరావళీ పర్వతాల్లో అంతరించిపోయిన ఐదు నదులకు జీవం పోసిన అపర భగీరథుడుగా పిలువబడే రాజేంద్రసింగ్ కు అంకితమివ్వడం సముచితంగా ఉంది. రాజేంద్రసింగ్ కు రామన్ మెగసెసే అవార్డు వచ్చిన వార్తను చూసి గోపి తన ఎండపొడ (2001) కవితా సంపుటిలో ''జలబ్రహ్మ'' శీర్షికతో ఈ అపర భగీరథుని గురించి రాయడం జరిగింది. అప్పటికి కవి ''జలగీతం'' (2002) రాయలేదు. ఆ కావ్యాన్ని ఆయనకు అంకితం ఇస్తానని అనుకోలేదు.

> ''ఇక్కడో నది కళేబరం వుండేది
> ఇప్పుడు కొనఊపిరి కూడా సందేహమే
> దానికి డ్యాములు కట్టి
> ఆకాశాన్ని గద్దించి
> నీటిని కిందకి దించిన
> భగీరథునికి నమస్కారం''[154]

అంటూ నీటికరువు ఉన్న ప్రాంతాలను సస్యశ్యామలం చేయడానికి అతడు పడిన కృషికి నమస్కరిస్తున్నాడు. జలగీతం 25వ ఖండికలో "Water man of India" గా పిలువబడే రాజేంద్రసింగ్ గురించి, అతడు కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన తీరును వర్ణించడం జరిగింది. అలాంటి వ్యక్తి 1956 ఆగస్టు 6న దౌలా, భాగ్ పట్ లోని ఉత్తరప్రదేశ్ లో తుల్సాదేవి, సుఖ్వీర్ సింగ్ లకు జన్మించారు. రాజేంద్రసింగ్ ప్రస్తుతం ''తరుణ్ భారత్ సంఘ్'' అధినేతగా ఉన్నారు. ''నీళ్ళు లేవంటే / నీళ్ళు లేవని కాదు / వాన మోసుకొచ్చిన నీళ్ళు / వానపాలవుతున్నాయి''[155] అంటూ ప్రకృతి ప్రసాదించిన వాన నీటిని ఒడిసిపట్టి నీటిని రక్షించడానికి, నిల్వలు పెంచడానికి కృషి చేయాలని కంకణం కట్టుకున్నాడు. కాబట్టే భారత ప్రభుత్వం రాజేంద్రసింగ్ ను ఎన్నో పురస్కారాలతో సత్కరించింది. 1994లో అప్పటి రాష్ట్రపతి కె. ఆర్. నారాయణ్ చేతుల మీదుగా రోటరీ ఇండియా అవార్డు, 1994లోనే ఇందిరాగాంధీ పర్యావరణ పురస్కారం, 2001లో రామన్ మెగసెసే వంటి అవార్డులు వచ్చాయి.

[154] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 252

[155] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 474

‘‘పట్నంలో పుట్టడం లోపం కాదు / పల్లెల్ని మర్చిపోవడం పాపం / ఆ పాపం సోకని / ఆకుపచ్చని మనుషులు / అక్కడక్కడా కన్పిస్తారు’’[156] అని కవి అనడంలో రాజేంద్రసింగ్ కు ప్రకృతితో సహజీవనం ఆయన జీవసూత్రంగా కన్పిస్తుంది. వర్షం నీరు నిలవాలంటే ఎక్కడికక్కడ ఆనకట్టలు కట్టి, నీటిని ఇంకించాలని ప్రజలను చైతన్యం చేశాడు అపర భగీరథుడు రాజేంద్రసింగ్. అందుకే గోపిగారు ఆయన గురించి రాసిన పంక్తులు ఇవి–

‘‘పలుగూ పారా పట్టుకుంటే
అలుగులు దూకకేం చేస్తాయి
... ...
దేవుడు నీళ్ళిచ్చాడా
జలమందిరాలు కట్టిచూడు
దేవుడు కన్పిస్తాడు
ఆ దేవుడు ఇతడే’’[157]

అని కరువు ప్రాంతాలకు నీరిచ్చిన దేవుడిలా భావిస్తాడు. కాబట్టే 2008లో బ్రిటీష్ జాతీయ పత్రిక ది గార్డియన్ రాజేంద్రసింగ్ ను ఈ ధరిత్రిని కాపాడగలిగే అతి ముఖ్యమైన వ్యక్తుల్లో ఒకడిగా పేర్కొంటూ పర్యావరణ రక్షకుడు ‘‘ది గార్డియన్’’గా పేర్కొంది. 2009లో భారత ప్రభుత్వం పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘‘జాతీయ గంగా నది’’ పరివాహక ప్రాంత అధికార కమిటీలో ఆయన్ని సభ్యుడిగా నియమించింది.

‘‘నీటికి వెల ఎంత? / నీటికి విలువెంత?’’ అంటూ నీటిని ధనంతో లెక్కించడం అమానుషం అంటారు కవి. ‘‘ఒకవైపు కరువు రాపిడి / మరోవైపు వాణిజ్యం దోపిడి’’ [158] అంటూ కరువు కమ్మి, నీరు వ్యాపార వస్తువైన వైనాన్ని తెలియజేస్తున్నాడు. జనాభాను, వ్యవసాయాన్నీ, ఆర్థిక వ్యవస్థనూ ఇబ్బందుల పాలు చేస్తున్న నీటి సమస్యను పరిష్కరించడం చాలా వరకు ప్రజల మీద ఆధారపడి ఉంటుంది. ‘‘జలానికి గోడలు కడితే / జనం వేడెక్కుతుంది జాగ్రత్త’’[159] అంటూ నీటి రాజకీయాలను, నీటిని అమ్మి సొమ్ము

---

[156] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 472

[157] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 475

[158] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 476

[159] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 477

చేసుకోవాలనుకునే వారిని అలాంటివి మానకపోతే ప్రజాగ్రహాన్ని చవి చూస్తారని హెచ్చరిస్తున్నాడు.

చివరగా నీరు నేనీ జన్మ ఎత్తడానికి ఎంతో కష్టపడ్డానని, ఆకాశంలోకి విసిరేస్తే అనంతాల్లోకి ఎగబాకానని, కొండలకు తాకి పొలిమేరల్లో వడబోతకు గురయ్యానని చెప్తూ ''నేను జలాన్ని / తరిగిపోతున్న అమృతాన్ని''[160] అని తన పుట్టుక, జీవన ప్రయాణాన్ని కవి నీటి ఆత్మఘోషగా వర్ణించడం జరిగింది. అందుకే ''పొలాలకు క్షీరాన్నిచ్చి / గాయాలను మర్చిపోయాను'' అంటుంది నీరు. కాబట్టే సర్ ఆర్థర్ కాటన్ ''ఇండియాలో పొలాలకు జలాలను పంపించి సాగుచేయడం ద్వారా లభించే ఫలితాలను బంగారపు గనులు ఇవ్వలేక పోతున్నాయి''[161] అన్న మాటలను బట్టి చూస్తే సాగునీటి విలువ తెలుస్తుంది. భూగర్భాల్లో జల వనరులు అడుగంటుతున్న నేటి కాలంలో నీటిని పొదుపుగా వాడుకోవడం మనిషి కనీస ధర్మం. ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టి, అప్రమత్తతతో నీటి కరువును పారద్రోలాలి. వివిధ రూపాల్లో వృథాగా పోతున్న నీటిని సద్వినియోగ పరిచే జల చైతన్యాన్ని ప్రజల్లో కల్పించి, భావితరాలకు నీటి కొరత రాకుండా చేయాలి.

''జలగీతం'' దీర్ఘ కవితలో కవి ఒక్క ''జలం'' పదంతోనే ఎన్నో పదబంధాలను సృష్టించారు. దీన్నిబట్టే కవి విలక్షణత, ప్రతిభ తెలుస్తుంది. అందులో ''జలదర్పణం, జలచర్మధారిణి, జలక్షణం, జలానుబంధం, జలోన్మేషం, జలవిస్ఫోటనం, జలశూన్య నిశ్శబ్దం, జలదావృత, జలభావన, జలభేరి, జలాత్మ, జలచక్రం, జలానుభూతి, జలస్తన్యం, జలవీరం, జలాంతరంగాలు, జలమాత, జలదారి, జలశయ్య, జలప్రళయం, జలస్వామ్యం, జలరాజకీయం, జలగోళం, జలచరులు, జలజగత్తు, జలమర్మం, జలరాసులు, జాలాంకిత, జలాంగన, జల హృదయం, జలావరణం, జలమహానిధి'' వంటివి ఉన్నాయి. ఇంకా ఈ దీర్ఘకవితనిండా ఎన్నో సూక్తులు, హితోక్తులను మనసుకు ఆకట్టుకునేట్లు చెప్తూ జల రక్షణకోసం ''జలోపదేశం'' చేస్తూ ముగించడం జరిగింది.

★★★

---

[160] గోపి కవిత్వం – II (జలగీతం) డా. ఎన్. గోపి – పేజి - 478

[161] జలదీపిక – సంపాదకురాలు – ఎన్. అరుణ –పేజి - 50

మూడవ అధ్యాయం

నానీలు – వస్తువిశ్లేషణ, ఒక విశిష్ట ప్రయోగం

అధ్యాయం – 3

నానీలు వస్తు విశ్లేషణ, ఒక విశిష్ట ప్రయోగం

ఆధునికాంధ్ర కవిత్వంలో ఒక కొత్త ప్రయోగం నానీ. కవిత్వం ఎప్పుడూ కొత్త రూపాన్ని ఆహ్వానిస్తుంది. కవులు తమ భావవ్యక్తీకరణకు, భావజాలానికి, సమకాలీనతకి అనుగుణంగా రూపాన్ని ఎంచుకుంటారు. నానీల సృష్టికర్త ఆచార్య ఎన్. గోపి 1997లో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. హైకూల తర్వాత వెలువడిన ఆధునిక రూపం నానీలు. భాష మార్పుకు గురైనట్లే కవిత్వం కూడా రూపపరిణామం చెందుతుంది. మారుతున్న కాలంతో పాటే మనిషి మారాలి. అందుకనుగుణంగా కవిత్వం కూడా మార్పు చెందుతుంది. ఆధునిక ప్రపంచంలో మనిషి కాలంతో పాటే పరుగెత్తుతూ అనేక మానసిక సంఘర్షణలకు బలైపోతున్న సమయంలో తనకున్న కొద్ది సమయాన్ని మానసిక ఉల్లాసం పొందడానికి విజ్ఞాన, వినోద కార్యక్రమాలకు కేటాయిస్తున్నాడు. ఇలాంటి వారికి పెద్ద పెద్ద కథలు, నవలలు, కవితలు చదివే ఓపిక, తీరిక లేకపోవడం వల్ల కూడా వారు చిన్న కవిత్వాలను చదువడానికి ఆసక్తి చూపుతారు. కాబట్టే ఈ క్రమంలో వెలువడిన నానీలకు ఎంతో పేరు ప్రఖ్యాతులు వచ్చి సృష్టికర్త గోపి నానీల నాన్న, నానీల త్రివిక్రముడు, నానీల బ్రహ్మగా పేరొందారు. అల్పాక్షరాల్లో అనల్పార్థం నానీల లక్షణం.

3.1 నానీలు – ఆవిర్భావం:

ఆధునిక తెలుగు కవిత్వంలో వచ్చిన రూపపరమైన కవితా ప్రక్రియల్లో ''నానీ''లు ఒకటి. నానీలను ''తెలుగు కవిత్వంలో పూచిన వెలుగుపూలు, తెలుగు పూలు'' అని నారాయణ శర్మ ప్రశంసించారు. తెలుగు కవిత్వంలో స్వతంత్రంగా ఆవిర్భవించిన కవితా ప్రక్రియ నానీ. తెలుగు సాహిత్యంలోనే గాక మరే ఇతర సాహిత్యంలోనైనా ఒక ప్రక్రియ ఉద్భవించడానికి దారులు ప్రధానంగా మూడు రకాలుగా ఉంటాయి.

1. స్వతంత్రంగా ఆ సాహిత్యంలోనే పుట్టడం
2. ఇతర భాషా సాహిత్యాల నుండి తెచ్చుకొన్నవి
3. ఇతర భాషా సాహిత్యం నుండి దిగుమతి చేసుకొని కొన్ని మార్పులు చేర్పులతో అనుసరించబడేది.

1997లో వెలువడిన నానీలు మొదట 'వార్త' దినపత్రికలో ప్రచురింపబడ్డాయి.

నిర్వచనం:

గోపి నానీలను ''నావీ, నీవీ వెరసి మనవి'' అన్నారు. నానీలు చిట్టి పద్యాలు కావడంతో చిన్న పిల్లలని పోలిక చెప్పాడు. నావి అంటే నాకు సంబంధించిన విషయాలు, నీవి అంటే నీకు (పాఠకునికి) సంబంధించిన విషయాలు. నావీ నీవీ కలిసి మనవి అవుతున్నాయి. 'మనవి' అనడంతో నానీలు స్వార్థాన్ని విడిచి విశ్వజనీనతను చాటుతున్నాయి. అందరికీ సంబంధించిన నానీలను మనవి అనడం ద్వారా పాఠకులని కూడా భాగస్వాములని చేస్తున్నాడు. ''లు'' అనే దానికి ప్రత్యేక అర్థమేమీ లేదు. ఇది బహుత్వాన్ని సూచిస్తుంది. ఒకటి ఉంటే 'నానీ'. ఎక్కువ ఉంటే నానీలు.



3.2 నానీ – రూపం:

తెలుగులో రూపం అనే పదాన్ని ఇంగ్లీష్ లో Form (ఫామ్) అనే పదానికి సమానార్థకంలో వాడుతున్నాం.

''విషయాన్ని లేదా వస్తువును కళాత్మకంగా వ్యక్తం చేసే విధానమే రూపం''[1]

నానీల గురించి నానీల సృష్టికర్త ఎన్. గోపి చెప్పిన లక్షణాలు –
''నానీలకు 20 –25 అక్షరాలుండాలి. నాలుగు పాదాలుండాలి. అవి రెండు యూనిట్లుగా పరస్పర సంబంధం కలిగి ఉండాలి. అక్షర సంఖ్యకు హేతువుగా ఒక కుదిరిన పరిణామం. సాగదీయకుండా మరీ కుదించకుండా, భావం బలికాకుండా 5 అక్షరాల వెసులుబాటు ఉండాలి.''[2]

''వాడిదంతా
రిమోట్ కంట్రోల్

[1] సాహిత్య విమర్శ ఆలోచన ఆలోకన – ఎం. వీరభద్రయ్య., పేజి నెం. 11.

[2] గోపి నానీలు – సంవీక్షణం, పేజి. 10.

బెడిసి కొట్టిందంటే
అంతే గోల్ మాల్''[3]

పైన చెప్పిన లక్షణాలు పై నానీలో సమర్థవంతంగా నిర్వహించారు. పై నానీలో 23 అక్షరాలు ఉండి, అక్షరాల సంఖ్య 25కు మించలేదు.

3.3 నానీలు – పాద నియమం:

నానీలో నాలుగు పాదాలుండాలి. అవి రెండేసి పాదాలు ఒక భావశకలంగా ఉండాలి.

''కలలకు
మరణం లేదు
అలల్లా
మళ్లీ మళ్లీ పుట్టుకొస్తాయి''[4]

పై నానీలో మొదటి పాదం 'కలలకు' అనే ఒక్క పదంతోనే ముగిసింది. రెండవ పాదంలో 'మరణం లేదు' అనే పదంతో కలిసి అది ఒక భావశకలంగా ఏర్పడింది. రెండవ భాగం కూడా ఒక యూనిట్ గా ఉంది. ఈ విధంగా కవి చెప్పిన లక్షణాలన్నీ సరిపోయి కవిత్వంలో 'నానీ' ఒక కొత్త రూపంగా నిలిచింది. వేమన పద్యాల్లో కూడా మనం ఇలాంటి పోలికను చూడవచ్చు.

3.4 నానీలు – విశిష్టత:

నానీలు ఆవిర్భవించిన కొద్దికాలంలోనే విస్తృతంగా ప్రచారమై కవుల ఆదరణను పొందాయి. కవిత్వం రాయగల సామర్థ్యం, ఆసక్తి ఉన్న ఎందరో యువకులకు నానీలు ప్రేరణను ఇచ్చాయి. నానీలు ఇంతగా ప్రజల్లో ఆదరణ పొందడానికి ముఖ్య కారణాలు –

రాయడానికి సులభంగా ఉండడం, అన్ని వయసుల వారికి, ప్రాంతాల వారికి నచ్చడం, చిన్నవిగా ఉండడంతో చదవడానికి ఎక్కువమంది ఇష్టపడడం, అన్ని భావజాలాలకు అనుగుణంగా ఉండడం, తక్కువ పదాలతో ఎక్కువ భావాన్ని ప్రతిఫలింపచేయడం వంటివి

---

[3] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం. 274.

[4] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం. 280.

ముఖ్యకారణం అయ్యాయి. అందుకే ఇండియా టు డే నాలుగు వాక్యాలు దాటని కవితలు నలభై వాక్యాల అర్థాన్నిచ్చాయని ప్రశంసించింది. నానీలను అనుసరిస్తూ ''రానీ'' (రాజకీయ నీతులు), మున్నీలు, టుమ్రీలు, చమత్కారాలు, మిణుగురులు, చుక్కలు వంటి అనుకరణ పేర్లతో ఎన్నో వచ్చాయి. కానీ అవి నానీలంత ప్రాముఖ్యత పొందలేదు. నానీలను విజేత, ఆంధ్రజ్యోతి, సుప్రభాతం వంటి పత్రికలు ఆదరించాయి.

ఏ రూపమైనా, ఏ ఉద్యమమైనా ఒక్కరోజులో పుట్టేదికాదు. వచన రూపం ధరించడానికి భాషోద్యమాలు ఎన్నో జరిగాయి. ఎందరో రచయితలు సామాన్య ప్రజల అవసరాన్ని గుర్తించి వచనానికి ప్రాధాన్యం కల్పించారు. నవల, కథ. దీర్ఘకవిత, కవితగా, మినీ కవితగా, హైకూగా, నానీగా, రెక్కలు, చుక్కలు వంటి వివిధ రూపాలు వచ్చాయి. దేశీ ప్రక్రియగా రూపొందిన నానీ, తెలుగు కవి చేతిలో పురుడు పోసుకొని, ఎందరో పాఠకులను ఆకర్షించి మరెందరో కవులను తయారు చేసింది.

వ్యక్తివాదాల ప్రభావం, సిద్ధాంతాలు, ఉద్యమాల ప్రభావం కలిగిన వర్తమాన తెలుగు కవిత్వంలో నానీలు సామాన్యంగా ఎలాంటి హంగూ ఆర్భాటాలూ లేకుండా ఆవిర్భవించాయి. ''సామూహిక, సామాజిక, సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకగా నానీలు పరిణామం చెందాయి'' అంటారు డా. ఎస్. రఘు ''నానీలు – సంవీక్షణం'' అనే పుస్తకం ముందుమాటలో. కోస్తా జిల్లాలో హైకూ కవులు ఎక్కువగా ఉన్న కాలంలో కూడా ఎందరో కవులు నానీలకు ప్రభావితులై వాటిని రాసిన వారున్నారు. అమలాపురంలో నానీల శిక్షణా నిలయాన్ని (నల్లా నరసింహమూర్తి) స్థాపించారంటే వీటికి ఎంత ప్రచారం ఉందో తెలుస్తుంది.

ఇంత ప్రాముఖ్యత ఉన్న ఈ ప్రక్రియ కూడా కొంత విమర్శకు గురయ్యింది. ఇలాంటి ప్రక్రియల వల్ల కవి కష్టపడే తత్వాన్ని, అధ్యయనం చేసే స్వభావాన్ని కోల్పోతారని, లోతైన భావాలు చెప్పడం ఈ చిన్న కవితలో సాధ్యంకాదనీ కొందరు భావించారు. ఈ రూప నిర్మాణం గురించి డా. సంగన భట్ల నరసయ్య ఈ విధంగా పేర్కొన్నారు.

''నిజమైన కవిత్వాభిమానానికి రూపం మీద ద్వేషం ఉండదు. రూప సంక్లిష్టత లేని నానీల ప్రక్రియ చాలామంది సాహిత్యకారులను ఆకర్షించింది. ఈ ప్రక్రియ వల్ల వచన కవిత్వంలో ఒక క్రమశిక్షణ వచ్చింది. వర్తమాన కవులకు అభ్యాసపాఠాలు నేర్పుతుంది. అక్షరాల నియతిని పెట్టుకున్న నానీలు కవి స్వేచ్ఛకు పరిమితి ఏర్పరిచినా, ఆ పరిమితే నానీల

సాంద్రతకు, గాఢతకు, నిర్మాణ వైవిధ్యానికి తోడ్పడుతూ నానీల ప్రక్రియ బలమైన ఆకర్షణను తెచ్చిపెట్టింది''[5] అన్నారు. నానీలు ఆవిర్భావం, రూపం, నిర్మాణం గురించి తెలుసుకున్నాం. ఇందులో భాగంగా మినీ కవిత్వం, హైకూల గురించిన పరిచయం చూద్దాం.

3.5 మినీ కవిత్వం:

మినీ కవిత ప్రక్రియ గురించి దాని వికాస, ఆవిర్భావాల గురించి విపులంగా వివరించిన వారు అద్దేపల్లి రామ్మోహనరావు. వీరు మినీ కవితకి ఉచ్ఛ్వాసం క్లుప్తత. నిశ్వాసం ధ్వని అన్నారు. 1970 నుండే మినీ కవిత్వం కనిపిస్తున్నా, 1975 నుండి విరివిగా రావడం మొదలైంది. ఇది పత్రికల వల్ల ఎక్కువగా ప్రచారం పొందింది. ''అల్పాక్షరముల అనల్పార్థ రచన'' అనేది మినీ కవిత్వానికి చక్కగా సరిపోతుంది. మినీ కవితలో వస్తువు సమకాలీనమైనా పరిధిని దృష్టిలో ఉంచుకొని ఒకటి కంటే ఎక్కువ భావాలను చెప్పలేము. 2,3 పాదాలతో మొదలుకొని 12, 13 పాదాలకు మించకుండా ఉండేది మినీ కవిత్వం. అనవసరమైన మాటలు లేకుండా సూటిగా చెప్పే సంక్షిప్తత, వ్యంగ్యంగా ఉండి, ధ్వని ఉండి చదువగానే అర్థంకాకపోవడం మినీ కవిత లక్షణాలు. ''ఒక సమస్యను గానీ, ఒక అవస్థను గానీ ఒక భావ చిత్రం కేంద్రంగా అభివ్యక్తీకరించే ప్రత్యక్షర సార్థక శిల్పం మినీ కవిత.''[6] ''మినీ కవిత వ్యక్తీకరణలో బలంగా తోడ్పడేది భావచిత్రం. రచయిత చిత్రించదలుచుకున్న సమస్యను శక్తివంతంగా, సంగ్రహంగా, ధ్వనిమయంగా చెప్పడానికి తోడ్పడే శిల్ప సాధనం భావచిత్రం.''[7] మినీ కవిత్వంలో భాగంగా హైకూలు, నానీలు, రెక్కలు, చుక్కలు, మామీలు, చాంద్ తారలు వంటి లఘు కవితా ప్రక్రియలు ఎన్ని పుట్టుకొచ్చినా రూపంలో మార్పు వచ్చిందే కానీ వ్యక్తీకరణలో కాదు. అందుకే ఆరుద్ర ''ఎన్ని గజాలు రాసాడన్నది కాదు. ఎన్ని నిజాలు చెప్పాడన్నది ముఖ్యం'' అన్నాడు. అలాగే సినారె ''మినీ కవిత ఆయుస్సు/మెరుపంత/ కాని అది ప్రసరిస్తుంది/కాలమంత'' అని మినీ కవితను గురించి పేర్కొన్నాడు.

3.6 హైకూ:

హైకూ అనేది జపాన్ కవితా ప్రక్రియ. క్రీ.శ 14వ శతాబ్దంలో జెన్ బౌద్ధులు తమ సిద్ధాంతాలకు అనుగుణంగా హైకూని రూపొందించారు. 17వ శతాబ్ధంలో జీవించిన బషో

[5] నానీలు – సంవీక్షణం – సంపాదకుడు – డా. ఎస్. రఘు. పేజి -109.

[6] సాహిత్యంలో చర్చనీయాంశాలు – జి.వి. సుబ్రహ్మణ్యం – పేజి -592

[7] సాహిత్యంలో చర్చనీయాంశాలు – జి.వి. సుబ్రహ్మణ్యం – పేజి -590

హైకూ పితామహుడు. ధ్యానాన్ని జపాన్ వారు జెన్ అంటారు. హైకూలను 1990లో గాలి నాసరరెడ్డి తెలుగులోకి అనువాదం చేశారు. హైకూలో 3 పాదాలు ఉంటాయి. మొదటి పాదంలో 5 అక్షరాలు, రెండోపాదంలో 7 అక్షరాలు, మూడోపాదంలో 5 అక్షరాలు, మొత్తం 17 అక్షరాలు (5+7+5 = 17) ఉంటాయి. హైకూకు వస్తు విషయంలో పరిమితి లేదు. అనుభూతి, సరళత హైకూ లక్షణాలుగా చెప్పవచ్చు.

3.7 నానీల పరిశీలన:

కవిత్వ నిర్మాణంలో ఎన్ని ఎక్కువ రూపాలు వస్తే ఆ కవిత్వం అంత పరిపుష్టం అవుతుంది. నానీల పుట్టుక ఎప్పుడో జరిగిందన్న వారున్నారు. వాటికి ఉదాహరణలు ఉపనిషత్తులు చూపిస్తున్నారు. నానీలు అప్పుడే పుడితే వాటికి ప్రాచుర్యం కలగలేదు ఎందుకు? అనే దానికి జవాబు చెప్పరు.

గోపి నానీలను పరిశీలిస్తే వివిధ వస్తు వైవిధ్యం కన్పిస్తుంది. వందల సంఖ్యలో వచ్చిన నానీల సంపుటాలను చూస్తే కొన్నింటిలో ఒకే అంశానికి సంబంధించిన వస్తువు ఉండవచ్చు లేదా వివిధ అంశాలకు సంబంధించిన వస్తువు కూడా ఉండవచ్చు. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, ప్రకృతి, పల్లె జీవనం, జల రాజకీయాలు, మతం, టీ.వి, సినిమాల ప్రభావం, రైతు ఆత్మహత్యలు, ఉగ్రవాదం, మానవత్వం, ఆశ, నిరాశ, కులానికి, స్త్రీకి సంబంధించిన మొదలైన అంశాలెన్నో గోపి నానీల్లో మనం పరిశీలించవచ్చు. కవి స్పృశించని అంశమంటూ ఉండదేమో అన్నంతగా కవి అన్ని కోణాలను పరిశీలించారు. కవి రాసిన నానీలను కొన్ని అంశాలకు సంబంధించిన వాటిని పరిశీలిస్తే వివిధ కోణాలు మనకు కన్పిస్తాయి.

3.7.1 మానవ సంబంధాలు:

మానవ సంబంధాలంటే సమాజంలో మనుషుల మధ్య ఉండే పరస్పర అవగాహన, ఆత్మీయతలు. ఈ సంబంధాలు మనిషికి కుటుంబంలోని వ్యక్తులతో పాటు సమాజంలో కూడా ఉంటాయి.

> ‘‘ఎవరికీ చెందక
> ఏమిటీ జీవితం?
> ఎవరికీ పంచక
> ఎందుకీ గీతం??’’[8]

[88] గోపి కవిత్వం –II(నానీలు) – డా. ఎన్. గోపి -పేజి -57.

మానవీయ విలువలు పంచుకుంటేనే పెరుగతాయని, స్నేహం, ప్రేమ, ఆప్యాయతలను పరస్పరం ఇచ్చి పుచ్చుకోవాలని, అలాకాకుండా మానవీయ విలువల్ని మరిచిపోయి బ్రతకడం వ్యర్థం అని పై నానీలోని అంతరార్థం.

మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అని భావిస్తూ కవి చెప్పిన నానీ,

''మనుషుల మధ్య
రూపాయే వంతెనైతే
మానవత్వం పని
అంతేమరి''[9]

అంటూ రూపాయితో మనిషిని కొలవడం ప్రారంభిస్తే మానవత్వం చనిపోతుందని చెబుతున్నాడు. నేటి ఆధునిక యుగంలో మనిషి డబ్బుకే ప్రాధాన్యత ఇస్తున్నాడని, భావోద్వేగాలు, ఆత్మీయత, అనుబంధాలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని కవి ఆవేదన. అందుకే దాశరథి గారు ''పైసకింత విలువిచ్చే పాడు విధానం పోయి/మనిషికింత విలువిచ్చే మంచి రోజులు రావాలి'' అన్నారు.

''చెట్టుతనం
కట్టెతనమయ్యింది
చిగురు కలలేవి
చిటపటలు తప్ప''[10]

చెట్టు నుండి వచ్చే కట్టెకూడా మనిషికి ఉపయోగపడుతుంది. జీవితమంతా పరుల కోసమే త్యాగం చేస్తుంది. మనిషి కూడా చెట్టులా బ్రతికి మానవతతో ఇతరులకు సహాయపడాలని కవి భావన.

3.7.2 ప్రపంచీకరణ – నానీలు:

ఆధునిక జీవితంలో మనిషి తన అస్థిత్వాన్ని కోల్పోతూ, ఉరుకులు, పరుగుల జీవితంలో రూపాయి కోసం నిరంతరం తపనపడుతున్నాడు. అందులో అతడు విజయం సాధించినా,

---

[9] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం. 39.

[10] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం. 69.

తాత్కాలిక ఆనందం పొందుతున్నాడు. తన సర్వస్వాన్ని కోల్పోతూ ఎవరో 'కీ' ఇచ్చిన బొమ్మలా మారిపోతున్నాడు. ఇదంతా ప్రపంచీకరణ ప్రభావమే. దాని రూపం, అభివృద్ధి ఎలా ఉన్నా అంతిమంగా సహజత్వాన్ని ధ్వంసం చెయ్యడం, కృత్రిమతను నిలుపడం అది వస్తువులోనే కాదు. మనిషి ఆలోచనల్లో కూడా. ఇలాంటి ఎన్నో అంశాలను నానీల్లో పొందుపరిచారు కవి.

''రొయ్య మడుగుల కింద
భూమాత కళేబరం
వల వేస్తే
డాలర్లే పడ్డాయి''[11]

రొయ్యల చెరువుల వల్ల అనర్థాలను ఇక్కడ వస్తువుగా ఎంచుకున్నాడు కవి. ''రొయ్య మడుగుల కింద/భూమాత కళేబరం'' అనడంలో ఎంతో బాధ దాగి ఉంది. భూముల్ని గోతులుగా మార్చి పంట పొలాల్ని కబలిస్తున్న ఆక్వాకల్చర్ పై నిరసన తెలియజేస్తూ ''వలవేస్తే డాలర్లే పడ్డాయి'' అనడం డబ్బుకోసం ఆశపడి తాను నిల్చున్న కొమ్మను తాను నరుక్కుంటున్న రైతు దుస్థితికి నిదర్శనం.

''చెరువులో
బంగళాలు మొలిచాయి
నీటి తల్లికి
ఇన్ని సమాధులా''[12]

ప్రపంచీకరణలో భాగంగా పట్టణాల్లో జనాభా పెరిగి చెరువులు, కుంటలు ఆవాసాలుగా మారుతున్నాయి. దీనివల్ల సహజ వనరులకు ముప్పు వాటిల్లుతుంది. నీటి సమస్య ఏర్పడుతుంది. పల్లె సంస్కృతిని ప్రపంచీకరణ ఎలా నాశనం చేసిందో చెప్పిన నానీ.

''భావ కవిత్వం నాటి
పల్లెలేవి
మార్కెట్లు కాటేస్తే
మగతగా ఉన్నాయి''[13]

---

[11] గోపి కవిత్వం -II, పేజి నెం. 32.

[12] గోపి కవిత్వం. సంపుటి -II, పేజి నెం. 18.

పూర్వపు పల్లె వాతావరణం అనడానికి ''భావకవిత్వం నాటి'' అనే పదాన్ని ప్రయోగించడంలో కవి నేర్పు కన్పిస్తుంది. భావ కవిత్వం అనుభూతులకు, స్మృతులకు, ప్రేమ, ఆప్యాయతలకు, ప్రణయానికి, ప్రకృతి తత్త్వానికి, సమైక్యతకు ప్రతినిధిగా నిలిచింది. ఇలాంటి నిష్కపట భావాలే పల్లె ప్రజల్లో కన్పించేవి. అలాంటి పల్లెలు ఈనాడు సాంకేతిక పరిజ్ఞానం, అభివృద్ధి పేరుతో మార్కెట్లుగా మారి మత్తులో ఊగుతూ తమ సహజత్వాన్ని కోల్పోతున్నాయని చెప్పడానికి ''మగతగా ఉన్నాయి'' అంటాడు. ''మగతగా ఉన్నాయి'' అనే పద ప్రయోగం చేయడంలో పల్లెలు అభివృద్ధి పేరుతో మెలకువగా ఉన్నాయనుకుంటున్నాం. కానీ నిద్రావస్థలో ఉన్నాయని చెప్పడం జరిగింది.

మనిషి ప్రపంచీకరణలో భాగమై విపణిలో వస్తువుగా మారి తానే అమ్ముడవుతున్నాడని చెప్తూ –

''వస్తు సంస్కృతిలో
తప్పి పోయాడు
తానే
ఒక వస్తువై పోయాడు''[14]

ఈ పోటీ ప్రపంచంలో పరుగులు పెడుతూ మనిషి మాయమై ఒక వస్తువుగా మారి తన సహజ స్పందనల్ని మరిచిపోయాడని చెప్పడానికి ''తప్పిపోయాడు'' అనే బలమైన పదం ప్రయోగించాడు. అందుకే అందెశ్రీ ''మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు/మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు'' అని ఒక పాటలో ఆవేదన చెందారు. బంధుత్వాలు, ఆప్యాయతానురాగాలకు దూరమై, బ్రతుకు భారమై ''మెటీరియలిస్ట్''గా మారుతున్న తీరును పై నానీలో వివరించారు.

3.7.3 ఆశ – నిరాశ:

మనిషి జీవితంలో ఎన్ని కష్టాలెదురైనా బెదరక ముందుకు సాగిపోవాలని ఆ ప్రయాణంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎదురీదాలని, జీవితం కష్టసుఖాల కలబోతని

---

[13] గోపి కవిత్వం –II(నానీలు) – డా. ఎన్. గోపి -పేజి -79.

[14] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం. 341.

చెబుతూ గోపిగారు రాసిన నానీలు కొన్ని ఉన్నాయి. అవి షాక్ ట్రీట్ మెంట్ లా ఉండి పాజిటీవ్ ఎనర్జీని ఇచ్చి మనస్సును హత్తుకునేలా చేస్తాయి.

''కుండ ముక్కలైందా
కుమిలి పోకు
మట్టి మరో రూపం కోసం
ఎదురు చూస్తుంది''[15]

నువ్వు చేసే పనిలో విజయం సాధించకపోవచ్చు. కష్టానికి ఫలితం రాకపోవచ్చు. కానీ ఆ ప్రయత్నంలో నువ్వు చేసిన కృషి ఒక పాఠంగా మిగిలిపోతుంది. మరో ప్రయత్నానికి ఉత్సాహాన్ని ఇస్తుంది.

జీవితంలో ఓడిపోతామని, విజయం సాధించలేమనే అభద్రతా భావం వద్దంటూ కవి చెప్పిన నానీ–

''తడుస్తాయని
చేపలు భయపడవు
సముద్రాన్ని
చీలుస్తూ అతికిస్తాయి''[16]

ప్రతి మనిషి ఆశాజీవి అని, ఆ ఆశావాదమే అతన్ని విజయాలకు చేరువ చేస్తుంది, బ్రతకడానికి మార్గం చూపిస్తుంది.

''దారం పేరు ఆశ
కుట్టి వుంచకపోతే
గుండె ఎప్పుడో
పగిలి పొయ్యుండేది''[17]

---

[15] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం. 15.

[16] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం. 20.

[17] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం. 21.

పై నానీలో ఆశ, నిరాశల మధ్య వ్యత్యాసాన్ని మనం గమనించవచ్చు. ఆశ జీవించడానికి ప్రేరణను, ఉత్సాహాన్ని ఇస్తే, నిరాశ దాన్ని నిరుత్సాహ పరుస్తుంది. జీవితాన్ని అల్లకల్లోలం చేస్తుంది.

''మరణమంటే
శ్వాస తెగిపోవడం కాదు
ఆశ
విరిగిపోవడం''[18]

నిరాశావాదులకి జీవించాలనే ఆశ ఉండదని అది మరణంతో సమానమని కవి భావం. జీవితం ఆశ – నిరాశల మధ్య ఊగిసలాట వంటిది అంటారు.

జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా, ఎన్ని విమర్శలు వచ్చినా వాటిని తట్టుకొని మన లక్ష్యం వైపు అడుగెయ్యాలని, ఎదురు దెబ్బలు తగిలితేనే, ఎదురు గాలి వీస్తేనే మనిషి మనోధైర్యంతో ఉంటాడని చెప్పే నానీ

''ఎదురు గాలిలోనే
పతంగి పైకి లేస్తుంది
విమర్శల్లో
నువ్వూ అంతే''[19]

అన్నీ అనుకూలంగా ఉంటే విజయాలు ఎవరైనా సాధిస్తారు కానీ ప్రతికూలతల్లో సాధించే విజయమే మనకు ఎక్కువ సంతృప్తిని, ఆనందాన్ని ఇస్తుంది. మరో నానీలో చీకటిని నిందిస్తూ కూర్చునే కంటే చిరుదీపం వెలిగించడం మేలని చెప్తూ –

''వేలితో
చీకటిని పొడిచా
వేల నక్షత్రాలు
వెలిగాయి''[20]

---

[18] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం. 356.

[19] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం. 283.

జీవితం చీకటిమయం కాదని దాన్ని కాంతివంతం చేసుకునే శక్తి కూడా మనలోనే ఉందని దాన్ని మేల్కొల్పమంటాడు కవి.

3.7.4 ప్రాంతీయత:

సహజంగానే ఏ కవికైనా తమ ప్రాంతంపై మమకారం, అభిమానం ఉంటుంది. తన చుట్టూ ఉండే పరిసరాలు, పుట్టిన నేల, పెరిగిన వాతావరణం వంటి పరిస్థితుల ప్రభావాలకు లోనవుతారు. ఆ ప్రభావం తాను వ్యక్తీకరించే కవిత్వంలోనూ కనబడుతుంది. ఆ కవి ఉద్యమ నేపథ్యం ఉన్న వాడైతే ఆ ప్రభావం ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఆ ప్రభావం గోపిగారిపై కూడా ఉంది. పరాయి పాలనలో నిత్యం అవమానాలకు గురవుతూ భాష, సంస్కృతిని అవమానిస్తే తన ప్రాంతంలో తానే పరాయి వాడైన భావనతో, వేదనతో రాసిన నానీ ఇది –

''తన ఊళ్ళో
తానే పరాయిదైంది
తెలంగాణ పల్లె
గాయపడిన చెల్లె''[21]

అంటూ ఉద్యమ భాగస్వామిగా గొంతు కలిపారు. ఆనాడు దాశరథి తెలంగాణను ''కోటి రత్నాల వీణ'' గా వర్ణిస్తే, ఈనాడు గోపి ''తెలంగాణ పల్లెను గాయపడిన చెల్లె''గా అభివర్ణించాడు. ''గాయపడిన చెల్లె'' అనడంలో తెలంగాణ ఎంతటి నిరాదరణకు గురైందో తెలియచెప్పే చరిత్ర ఈ పాదంలో కన్పిస్తుంది.

తెలంగాణకు జరుగుతున్న దోపిడీకి, అన్యాయానికి కవి చూపిన నిదర్శనమే ఈ నానీ–

''భద్రాచలంలో
మాట్లాడిన గోదావరి
రాజమండ్రిలో
మొహం తిప్పుకుంది''[22]

---

[20] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం. 288.

[21] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం. 17.

[22] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం. 331

భద్రాచలం తెలంగాణలో అంతర్భాగం. రాజమండ్రి ఆంధ్రాప్రాంతమని మనకు తెలుసు. నది ఒక్కటే కానీ తన ప్రాంతంలో మాట్లాడిందని చెప్పడంలో ‘‘తనదనే’’ భావనను, రాజమండ్రిలో ఉన్న గోదావరి తనది కాదని చెప్పడానకి మొహం తిప్పుకుంది అనడంలో ‘‘పరాయి’’భావనను కవి నదితో పోల్చి చెప్పిన తీరు బావుంది.

తన ప్రాంతంలో జరిగే ఉద్యమాల గురించి, ఈ ప్రాంతపు ప్రజల చైతన్య, పోరాట, ఉద్యమ స్ఫూర్తి, తిరుగుబాటు తత్వాన్ని చెప్పడానికి

‘‘నడుస్తున్న కాళ్ళను
ఎదురు తంతుంది
ఇది
పోరాటాల నేల’’[23]

తెలంగాణ ఎన్నో పోరాటాలకు నెలవని భూమికోసం, భుక్తికోసం, విముక్తి కోసం నిరంతరం ఇక్కడి ప్రజలు ఏదో సందర్భంలో పోరాటాలు చేశారని అది ఈ మట్టి తమలో రగిలించిన ఉద్యమ స్ఫూర్తి అని కవి చెబుతున్నాడు. ఆ ఉద్యమాలకు తగినట్లే ఇక్కడ సాహిత్యం కూడా వెల్లువలా వచ్చింది. ప్రజలకు స్ఫూర్తి దాయకమైంది.

3.7.5 కులం:

నేటి సమాజంలో మనిషికి కూడు, గూడు, గుడ్డ ల్లాగే అవసరానికి కులం కూడా తన పాత్రను పోషిస్తుందనిపిస్తుంది. అయితే అది అగ్రకులమా? నిమ్నకులమా? అనేది ఎవరికి వారు గుర్తించాలి. మనిషి ఎంత అభివృద్ధి చెందినా కులం కంపునుండి బయటపడలేదనే భావం ఈ నానీలో ఉంది. కులాలు వర్గాలుగా వీడి కలహించుకునే బదులు మనిషిని మనిషిగా గుర్తించడానికి పోరాటం చేయాలంటారు కవి.

‘‘కులాన్ని చూసి
వర్గం భయపడింది
వర్గం లేక
కులం మలినమయ్యింది’’[24]

[23] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం. 60

సమైక్యంగా ఉంటూ సమాజాభివృద్ధికి తద్వారా దేశాభివృద్ధికి పాటుపడేలా కృషి చేయాలి.

చాతుర్వర్ణాలు బ్రహ్మ శరీరం నుండి ఉద్భవించాయని చెప్తూ, ఈనాడు అవే సమాజ తిరోగమనానికి కారణాలని చెప్పే నానీ –

''ఏం సృష్టించాడు
బ్రహ్మ
నాలుగు ముఖాలు
పట్టుకొని దులపాలి''[25]

సమాజంలోని మనుష్యుల మధ్య అంతరాలను సృష్టించిన వర్ణ వ్యవస్థ సృష్టికర్తయైన బ్రహ్మను ''నాలుగు ముఖాలు/పట్టుకొని దులపాలి'' అనడంలో కవి కులంపట్ల తన వ్యతిరేకతను, తిరుగుబాటును వ్యక్తం చేస్తున్నాడు.

3.7.6 రాజకీయ నానీలు:

సాహిత్యం ఒకప్పుడు కళగా ఉండేది. ప్రస్తుత కాలంలో సాహిత్యానికి బాధ్యత పెరిగింది. కవి సమాజానికి ప్రతినిధిగా మారి న్యాయాన్యాయ, మంచిచెడు, ధర్మాధర్మ విచక్షణలను పరిశీలించి సమాజ మార్పుల్ని నిత్యం కవిత్వీకరిస్తాడు. ఆ క్రమంలోనే రాజకీయ వ్యవస్థలోని మార్పుల్ని పేర్కొంటూ నాయకుల్ని ఉద్దేశించి కొన్ని నానీలు రాయడం జరిగింది. చలనశీలమైన రచయితలు మాత్రమే ఇటువంటి రచనలు చేయగలరు. గోపి రాజకీయ వ్యవస్థలోని లోపాలను వ్యంగ్యంగా సూత్రీకరిస్తూ రాసిన నానీలు కొన్ని పరిశీలిద్దాం

''నడుస్తున్నట్లు
మైమ్
అంగుళం ముందుకు సాగదు
రాజకీయమంటే అదే''[26]

---

[24] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం. 84.

[25] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం. 28.

[26] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం. 45

రాజకీయాల్లో నాయకులు హామీలతోనే కాలాన్ని వెళ్ళదీస్తారు కానీ కార్యాచరణ మాత్రం ఉండదు.

ప్రతి పక్షాలు అధికార పక్షాల్ని నిలదీసే ఎత్తుగడలో ప్రజల్ని కూడగట్టి సమ్మెలు, ర్యాలీలు, సభలు నిర్వహించి సామాన్యుల్ని పావులుగా వాడుకుంటారు. ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమంటారు. కానీ నిజాయితీగా ప్రజల పక్షం వహించరు. ర్యాలీలు నిర్వహించే సమయంలో పోలీసుల లాఠీచార్జీలు, కాల్పుల్లో సామాన్యులే గాయాలపాలై బలైపోతారు.

''నువ్వు గొప్పగా
ర్యాలీని నడిపిస్తావు
నేను గాయాలను
గంపల కెత్తాను''[27]

రాజకీయాల్లో నాయకుల అంతిమ లక్ష్యం అధికారాన్ని హస్తగతం చేసుకోవడం, దాన్ని రక్షించుకోవడమే. ప్రజాక్షేమంతో వారికి పనిలేదు.

''ఓట్లతో
ఇస్త్రీ చేస్తున్నారు
అందుకే
జాతి జీవనం ముడతలు ముడతలు''[28]

ఎలక్షన్ల సమయంలో ప్రజల్ని మభ్యపెట్టి గద్దెనెక్కాక వారిని విస్మరిస్తారని, వారి సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి చొరవ చూపరని అందుకే సమాజం అస్తవ్యస్తంగా ఎన్నో సమస్యలతో నిండి ఉంది అంటాడు కవి.

3.7.7 స్త్రీ నానీలు:

తెలుగు సాహిత్యంలో స్త్రీ వాద కవిత్వానికి ప్రత్యేక స్థానముంది. మేమూ మనుషులమే మాకూ మనసుందనీ, అనుభవాలు బాధలూ, ప్రేమలు, దుఃఖాలు ఉంటాయని గుర్తించమంటూ

[27] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం. 40

[28] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం. 360

మాకూ సమాన హక్కులు కావాలని నినదించడం స్త్రీ వాద లక్ష్యం. స్త్రీ లే కాకుండా పురుషులు కూడా ఈ కవిత్వాన్ని రాస్తున్నారు. గోపి స్త్రీలపై రాసిన కొన్ని నానీలు ఇవి–

''ఆమె లేచి
సూర్యుడిని లేపాలి
అతణ్ణి నిద్ర పుచ్చాకే
ఆమెకు విశ్రాంతి''[29]

స్త్రీ గృహిణిగా గొడ్డు చాకిరీ చేస్తూ శ్రమకు ప్రతిఫలం లేని బానిసగా బ్రతుకుతుంది. ఆమె ఎప్పుడో తెల్లవారుజామున నిద్రలేచి అందరూ నిద్రపోయాకే విశ్రమిస్తుందని, ఆమె శ్రమ జీవి అని చెపుతున్నాడు.

స్త్రీని శృంగార వస్తువుగా భావించి రాసిన వారున్నారు కాని శ్రమాపాదిత వస్తువుగా ఎవరూ చిత్రించలేదు. అందుకే చలం స్త్రీని జీతం లేని బానిస అన్నాడు.

''రుతు ధర్మం
కల్లోల జలధి
ఆడ పిల్లలను
ప్రేమగా చూడండి''[30]

ప్రకృతి పరంగా స్త్రీలకు కొన్ని సహజ ధర్మాలు ఉంటాయని చెప్తూ స్త్రీలను ప్రేమగా చూడండి. అబలగా కాకుండా సబలగా భావించమంటాడు.

''స్త్రీకి
రుణపడ్డారు గాడిదలు
ఉల్టా
అప్పు వసూలు చేస్తారు''[31]

---

[29] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.75

[30] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.127

[31] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.50

వివాహమాడడానికి స్త్రీల నుండి కట్నాలు వసూలు చేస్తూ కూడా వారిని బానిసలుగా మార్చి శ్రమను దోచుకుంటున్నారు. కానీ స్త్రీ జనాభా తగ్గడంతో ఆడపిల్లలు దొరక్క ఎదురు కట్నాలు ఇచ్చి పెళ్ళి చేసుకోవాల్సి వస్తుందని చెప్పడానికి ''ఉల్టా/అప్పు వసూలు చేస్తారు'' అని హెచ్చరిస్తున్నాడు.

3.7.8 వర్షం/నీటి నానీలు:

నీరు సకల జీవులకు ప్రాణాధారం. నీరు లేకపోతే నీటి మనుగడ కష్టం. నీరంటే వర్షమే. వర్షం భూమిలోకి ఇంకి నీరుగా మారుతుంది. కాబట్టి వర్షాన్ని నీటిగా భావించి ఈ నానీలను నీటి నానీలుగా కూడా పరిగణించవచ్చు.

''సముద్రానికి
మేఘాలకీ స్నేహం
అందుకే
ఇచ్చి పుచ్చుకోవడాలు''[32]

సముద్రాల్లోని నీరు ఆవిరిగా మారి మేఘాలుగా ఏర్పడి వర్షాలు కురుస్తాయి. ఈ చర్యని కవి స్నేహంగా భావిస్తూ, పరస్పరం సహాయం చేసుకోవడం స్నేహితుల లక్షణంగా భావించాడు. ''ఇచ్చి పుచ్చుకోవడం'' అనే పదబంధం ఈ నానీకి కొత్త అందాన్నిచ్చింది.

''చెరువులో
కొత్త నీరు చేరుతుంది
చేపలకు
ఆనందం''[33]

చెరువులు నిండాలంటే వర్షాలు పడాలి. వర్షపు నీరు చెరువులోకి ప్రవేశించడం వల్ల ఎండిన చెరువులకు జలకళ వచ్చి అందులోని చేపలకు ఆనందం కలుగుతుందని ఎవరికైనా ఇలాంటి ఆనందం సహజమని తెల్పిన నానీ.

---

[32] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం.380

[33] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి (నానీలు) నానీలు) పేజి నెం.381

''నీళ్ళు
ఎక్కడికైనా ప్రవహిస్తాయి
రాజకీయాలు
అడ్డుకోకపోతే''[34]

రాష్ట్రాల మధ్య నీటి గొడవలు సహజం. అంతరాష్ట్ర నదులపై ఎగువ రాష్ట్రాలు ఆనకట్టలు కట్టి నీటిని దిగువ రాష్ట్రాలకు రాకుండా చేస్తున్నాయి. దీన్ని రాజకీయంగా పార్టీలు వాడుకుంటాయి. ''నీరు పల్లమెరుగు'' అనే విషయం తెలిసి కూడా ఆనకట్టలు కట్టడం, వాటి ఎత్తులు పెంచడం వంటివి చేస్తూ రాజకీయాలు చేస్తారు.

''మేఘాల గుండెలు
పగిలితే తప్ప
మన బ్రతుకులు
చల్లారవు''[35]

అభివృద్ధి పేరుతో వాతావరణ కాలుష్యం పెరిగి, గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోయింది. దీనివల్ల వర్షపాతం తగ్గింది. ''మేఘాల గుండెలు పగలడం'' అంటే అవి కరిగి వర్షంగా కురిసి మన బ్రతుకులు చల్లబడాలని చెప్పడానికి కవి కొత్త ప్రయోగం చేయడం జరిగింది.

''చినుకే
ఆకాశం నుండి దిగివచ్చి
చిగురై
లేతగా నవ్వింది''[36]

ప్రకృతిలోని పచ్చదనానికి కారణం వర్షం. అప్పటి వరకు మోడు వారిన చెట్టు సైతం వర్షం పడగానే తమ సహజత్వాన్ని చూపుతూ చిగురు పెడుతాయి. ప్రకృతికైనా, జీవరాశులకైనా నీరే జీవనాధారం.

---

[34] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం.379

[35] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం.291

[36] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.117

‘‘చెరువు నీటిలో
చినుకు చినుక్కో పుష్పం
వర్షమా
నీకు నమస్కారం’’[37]

వర్షం పడేటప్పుడు చెరువులో పడే చినుకులు చిన్నచిన్న వలయాలుగా ఏర్పడే దృశ్యాన్ని కవి ‘‘పుష్పంగా’’ వర్ణించాడు. ఇది కవికి ప్రకృతిపై గల సునిశిత దృష్టిని తెల్పుతుంది.

‘‘కట్టమీద
నడుస్తుంటే
చెరువు నీళ్ళు
గుసగుస లాడుతున్నాయి’’[38]

గాలికి వచ్చే అలల శబ్దాలను గుసగుస లాడుకోవడంగా చిత్రించాడు. చెరువు కట్టపై నడుస్తున్న కవి నీటితో గల అనుబంధాన్ని తెల్పుతూ ‘‘చెరువు నీళ్ళు గుసగుస లాడటం’’ అని చెప్పడం గొప్ప భావుకత.

3.7.9 ప్రకృతి/పచ్చదనం నానీలు:

ప్రకృతి అనగానే మనకు గుర్తొచ్చేది పచ్చదనం. ప్రకృతిని రక్షిస్తేనే మనిషి జీవితం సుఖమయంగా, ఆరోగ్యంగా ఉంటుందని చెబుతూ రాసిన నానీలు –

‘‘చెట్లు
మన ఊపిరితిత్తులు
దూయకండి వాటిపై
కత్తులు’’[39]

చెట్లు ఎంత ఎక్కువగా ఉంటే గాలిలో ఆక్సిజన్ శాతం పెరిగి మానవుడు అంత ఆరోగ్యంగా ఉంటాడు. చెట్లను నరకడం వల్ల గాలిలో కార్బన్ డై ఆక్సైడ్ పెరిగి ఊపిరితిత్తులపై

---

[37] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.53

[38] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.97

[39] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.25

ప్రభావం చూపుతుంది కాబట్టి వృక్ష సంపదను కాపాడుకోవాలని వివరించాడు. దీనిలో ''తిత్తులు, కత్తులు'' అనే అంత్యప్రాస వాడడం బాగుంది. ఈ విధంగా కవి ప్రకృతి పట్ల ప్రేమను చాటుకున్నాడు.

''ఆకులు లేకుంటే
చెట్టునెలా గుర్తిస్తావ్
పచ్చదనమే
చెట్టు చిరునామా''[40]

పచ్చదనాన్ని కోల్పోయి మోడుగా ఉంటే దాన్ని చెట్టు అనలేమని, పచ్చదనమే చెట్టు చిరునామా, అదే చెట్టు గుర్తింపు అని చెప్పడం జరిగింది. ప్రతి మనిషీ తనకంటూ ఒక ''ఐడెంటిటీని'' కలిగి ఉండాలంటాడు. అప్పుడే సమాజంలో మనకంటూ ఒక గుర్తింపు ఉంటుంది.

''చెట్లు
పక్షుల్ని కప్పుకున్నాయి
ఆశ్రితుల్ని
వాడుకోవడమంటే ఇదే''[41]

చెట్లు ఎన్నో పక్షులకు ఆవాసాలు. కానీ ఇందులో పక్షుల వల్లే చెట్టుకు అందం వచ్చిందని చెప్తూ, ఆశ్రితుల్ని వాడుకోవడమంటే ఇదే అంటూ చెట్టుకు, పక్షులకు గల పరస్పర సంబంధాన్ని కవి వర్ణించాడు.

3.7.10 శాంతి నానీలు:

దేశ సమగ్రతకు, సౌభ్రాతృత్వానికి ''శాంతి'' చాలా ముఖ్యం. అపకారికి ఉపకారం అన్నట్లుగా ఎదుటి మనిషి తప్పు చేసినంత మాత్రాన మనం వాడిని నిందిస్తూ గొడవ పడకుండా శాంతియుతంగా ఉండాలని, అదే మన ఎదుగుదలకు సహాయపడుతుందని కవి ఉపదేశిస్తున్నాడు.

[40] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.15

[41] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.17

''ఇంటిపై రాళ్ళు విసిరి
దాక్కుంటాడు వాడు
నా దగ్గర
గులాబీలే ఉన్నాయి''[42]

ఇంటిపై రాళ్ళు విసిరి తప్పు చేసి, వారు మళ్ళీ మనపై దాడికి దిగుతారేమో అని భయపడి దాక్కుంటారు. కానీ తన దగ్గర విసరడానికి రాళ్ళు కాదు గులాబీలే ఉన్నాయని చెప్పడం గొప్ప భావన. ఇది కవి సంయమనానికి సంకేతం. గులాబీ స్నేహం, ప్రేమకు చిహ్నం. ప్రేమను పంచి ద్వేషాన్ని విడువాలని అప్పుడే ప్రపంచం శాంతిమయం అవుతుందన్న ఉపదేశం దీనిలో ఉంది.

''శాంతి అంటే
రాతి నిశ్శబ్ధం కాదు
సెలయేటి నడకలోని
ప్రశాంతత''[43]

శాంతి అంటే మౌనంగా ప్రతిస్పందనలు లేకుండా ఉండటం కాదని, చలనశీలంగా సెలయేటి నడకలా ప్రవహించడం ప్రశాంతత అంటూ చైతన్యవంతంగా ఉండాలంటాడు.

''మాటల్ని కాదు
మౌనాన్ని నేర్చుకొండి
తూటాల్ని కాదు
పువ్వుల్ని కూర్చుకోండి''[44]

''నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది''. కొన్నిసార్లు అనవసరమైన మాటలతో వివాదాలు వచ్చే అవకాశం ఉందని, కాబట్టి ఒక్కోసారి మౌనంగా ఉండడం మేలని అంటాడు.

[42] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం.319

[43] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం.333

[44] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం.304

అందుకే ''మౌనం ముని లక్షణం'' అంటారు. వారు ఎప్పుడు ప్రశాంతంగా శాంత వదనంతో ఉంటారు. ''తూటాల్ని కాదు/పువ్వుల్ని కూర్చుకోండి'' అనడంలో స్నేహ భావాన్ని పెంచుకోమని సలహా ఇస్తాడు. పువ్వులు శాంతికి, స్నేహ పరిమళాలకు ప్రతీక.

3.7.11 తాత్వికత నానీలు:

తాత్వికత తత్వసంబంధం. తత్వం అంటే యదార్థం. ''తత్వం అనే పదాన్ని విడదీస్తే తత్, త్వం అనే రెండు పదాలు కనిపిస్తాయి. 'తత్' అంటే అది, 'త్వం' అంటే నీవు. తత్వం అంటే అది నీవు. ఆ పరమాత్మ నీవు అనే అర్థాలు ఉపనిషత్ లో కన్పిస్తాయి. మనం దేని గురించైతే అన్వేషిస్తున్నామో, ఆలోచిస్తున్నామో దాని స్వభావం తత్వం అని అర్థం. కానీ ఆధ్యాత్మకంగా చూస్తే తత్వం అంటే జ్ఞానాసక్తి అని అర్థం''[45]

''జీవితంలో మునిగి
ఆల్చిప్పలు తెచ్చాను
కొన్ని ముత్యాలు
కొన్ని కన్నీళ్లు!''[46]

జీవితంలో మునగడమంటే సంసార సాగరంలో మునగడంగా భావించాలి. అలాంటి సాగరాల్లో (జీవితాల్లో) అన్నీ ఆణిముత్యాలే దొరకవు. కొన్నిసార్లు కన్నీళ్ళు తప్పవు. చీకటి వెనకే వెలుగు ఉన్నట్లు దుఃఖం వెనకే సంతోషం, బాధ వెనకే ఆనందం ఉంటాయి. అని చెప్పే నానీ ఇది. అందుకే ''కాళ్ళు తడవకుండా సముద్రాన్ని దాటవచ్చేమో కానీ, కళ్ళు తడవకుండా జీవితాన్ని దాటలేం'' అంటారు పెద్దలు.

''జీవితం మొత్తం
ఏ పద్యంలోనూ పట్టదు
పద్యానికి
అత్యాశకూడదు''[47]

---

[45] గోపినానీలు – వస్తురూపవివేచన (ఎం.ఫిల్) – సురేశ్ – పేజి - 51

[46] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.74

[47] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.15

కాలంతో పాటే జీవితం పరుగుతీస్తుంది. కాలం ఆగదు. కానీ జీవితం ఎక్కడో ఒకచోట చాలించక తప్పదు. ఆ జీవించిన జీవిత ప్రయాణాన్ని ఒక పద్యంలో చెప్పడం అత్యాశే అవుతుందని, కానీ జీవితం గురించి కవులు ఎన్నిసార్లు చెప్పినా ముగింపు ఉండదన్న తత్వాన్ని బోధిస్తున్నాడు.

3.7.12 కవిత్వంపై నానీలు:

కవికి కవిత్వ రచన అనేది ఒక వ్యసనం వంటిది. అది ఏ రూపంలో అనేది అతని మానసిక సంఘర్షణ, వస్తువు, భావాలపై ఆధారపడి ఉంటుంది. గోపికి కవిత్వంపై మక్కువ ఎక్కువ. కవిత్వమే ప్రాణంగా భావించే ఆయన నానీల్లో కూడా ''కవితాత్మకతకు'' పెద్ద పీట వేశారు. అందుకు నిదర్శనమే ఈ నానీలు –

''దహనంలో
కుడి చెయ్యి కాలలేదు
కారణం?
కలం పట్టిన చెయ్యి''[48]

కవి మరణం తర్వాత దహనంలో కుడి చెయ్యి కాలలేదు అనడంలో అది కవిత్వం రాసిన చెయ్యి అని చెప్తున్నారు. కానీ ఇక్కడ –

''దహనంలో
ఒక చెయ్యి'' అని ఉంటే కొంత ఔచిత్యంగా ఉండేది. ఎందుకంటే ఎడమ చేతిలో రాసేవారూ ఉంటారు కాబట్టి.

''మధుమేహం
తియ్యటి పేరు
కవిత్వం సేవించండి
తగ్గుతుంది''[49]

[48] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.24

[49] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.86

మానసిక ప్రశాంతతను పెంచడంలో కవిత్వానికి కూడా స్థానం ఉంది. కళలు ఏవైనా మనిషిని ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంచడానికి దోహదపడుతాయి. అలాగే అనారోగ్యంతో ఉన్నవారు కూడా కవిత్వాన్ని చదివితే వ్యాధి తగ్గుతుందనే చిట్కా చెబుతున్నాడు. కవిత్వం పట్ల కవికి అంత నమ్మకం.

జీవిత ప్రతిబింబమే కవిత్వమని చెబుతూ–

‘‘పరిణామమే
జీవితమంటే
పరావర్తనమే
కవిత్వమంటే’’[50]

జీవితం నిరంతరంగా మార్పులకు గురవుతూ చలనశీలంగా ఉండాలని, అలాకాక నిశ్చలంగా ఉంటే మరణంతో సమానమని చెబుతూ, సమాజంలోని మనుషుల మనస్తత్వాలే కవి కవిత్వంగా మారుస్తాడు. ఆ భావమే కవిత్వమవుతుంది.

‘‘కవిత్వం
ఒక పూలతోట
స్వేచ్ఛమీద చెయ్యి వేస్తే మాత్రం
కత్తుల్ని పూస్తుంది.’’[51]

కవిత్వం పూలతోట అని చెప్పడంలో అది సున్నితమైంది, అందమైంది అని చెబుతున్నాడు. ఆ కవిత్వమే ప్రజాజీవనానికి, స్వేచ్ఛకు ఆటంకం, అవరోధం కలిగిస్తే ప్రతిఘటిస్తుంది. ‘‘కత్తుల్ని పూస్తుంది’’ అనే చరుపును తిరుగుబాటుకు, నిరసనకు ప్రతీకగా చెప్తూ, సమాజం పట్ల బాధ్యతను, నిబద్ధతను చాటుతున్నాడు.

‘‘నానీల
జేబు రుమాళ్ళతో

[50] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం.290

[51] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం.309

నెత్తుటి మరకల్ని
తుడుచుకున్నాను''[52]

నానీలు రాయడం ద్వారా తనలోని మానసిక సంఘర్షణల్ని, బాధల్ని, వ్యథల్ని పోగొట్టుకోగలిగానని, కవిత్వం రాయడం వల్ల తన మనసు ప్రశాంతత పొందిందని చెప్తూ రచన పట్ల తన ఇష్టాన్ని తెలుపుతున్నాడు.

''భాషతో చెక్కితే
భావం ఏర్పడదు
భావమే
మాటల్ని వేధిస్తుంది''[53]

కవిత్వ నిర్మాణానికి భాష (పద సంపద) ఉంటే సరిపోదని, అది ఒక భావాన్ని ఇవ్వగలగాలి. భావం పుట్టుకొచ్చినపుడు ఆ భావానికి తగ్గ పదాల్ని కవిత్వమే పలికిస్తుందని చెబుతున్నాడు.

''రాసేంత వరకే
పద్యం నీది
తర్వాత కాలానికి
రాసిచ్చిన వీలునామా''[54]

కవిత్వమైనా, పద్యమైనా, కథ అయినా, నవల అయినా రాసేంత వరకే కవిది. తర్వాత ఆ సాహిత్య సృజన కాలానికి (పాఠకులకు) ఇచ్చిన ఆస్తి వంటిది. అది విలువైంది, అపురూపమైంది అయితే వారు దాచుకుంటారని, నిరర్థకమైన కవిత్వమైతే కాలగతిలో కలిసిపోతుందని పై నానీలో వివరించడం జరిగింది.

[52] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం.331

[53] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.52

[54] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.18

3.7.13 ఉద్యమ నానీలు:

ప్రకృతి ప్రేమికుడైనా, శాంతి కాముకుడైనా ప్రతి కవిలో కనిపించని కోణాలు ఎన్నో ఉంటాయి. సమాజంలో ఏ మూలనో చూసిన సంఘటనలు కవిత్వంగా రూపొందుతాయి. ఉద్యమ భావాలతో కవి రాసిన కొన్ని నానీలు ఇవి–

''నినాదాలు చదివి
గుండెలు వేడెక్కాయి
అక్షరాలు లేకుంటే
వొట్టి గోడే''[55]

విద్యార్థి ఉద్యమాలవో, విప్లవ పార్టీలవో నినాదాలు గోడలపై కన్పిస్తుంటాయి. అవి చదివిన వెంటనే మనం ఆలోచనలో పడతాం, ఆవేశానికి లోనవుతాం, ఆ సమస్య గురించి మదనపడతాం. అయితే అందరూ ఆ నినాదాల ప్రభావానికి లోనవుతారని చెప్పలేం. ఆ స్పృహ ఉన్నవారు మాత్రమే స్పందిస్తారని చెప్పే నానీ.

''ఉద్యమం
రగలకపోతే
ప్రతి ఉదయం
వృథా అవుతుంది''[56]

ప్రతిరోజు మనిషి జీవితం సంఘర్షణలకు గురవుతూనే ఉంటుంది. దోపిడీ, అన్యాయాలను సహిస్తూ భరించకుండా, తిరుగుబాటు, ప్రతిఘటన ద్వారా స్వేచ్ఛను పొంది హక్కులను కాపాడుకోవాలని ఉద్యమ గొప్పతనాన్ని చెప్తూ ''పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప'' అంటూ కార్ల్ మార్క్స్ ను గుర్తు చేస్తున్నాడు.

''నడిచే పాదాలకు
మేకులు కొట్టకు

[55] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.36

[56] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.40

శిలువ
క్రీస్తు విలువను పెంచింది''[57]

నడక దూరాన్ని అధిగమించి గమ్యాన్ని చేర్చే సంకేతం. మేకు గోడలో చతికిలబడి ఉన్న చోటనే ఉండే లక్షణం కలది. ఈ రెండింటిని తులనాత్మకంగా చెప్తూ అణచివేతపై తిరుగుబాటును ప్రకటిస్తున్నాడు. ప్రజాభిమానాన్ని, ప్రజాబలాన్ని పొందుతూ ప్రజాభివృద్ధిని, సంక్షేమాన్ని కోరే వారికి ఆటంకం కలిగించినా వారిని అణచివేయాలని చూసినా అది వారి విలువను మరింత పెంచుతుందని క్రీస్తు ఉదంతాన్ని ఉదహరిస్తున్నాడు.

3.7.14 అభ్యుదయ నానీలు:

అభ్యుదయం తిరుగుబాటుతో పాటు స్వేచ్ఛను కూడా కోరుకుంటుంది. స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడే తిరుగుబాట్లు, ఉద్యమాలు తలెత్తుతాయి.

''హద్దులు
మానవ కల్పితాలు
చెరిగిపోవటాలు
చైతన్య విలసితాలు''[58]

ఆధునిక సమాజం హద్దులు లేని స్వేచ్ఛను కోరుకుంటుంది. గిరిగీసుకొని జీవించే విధానాలకు స్వస్తి పలికి, స్వతంత్ర భావాలకు ఊపిరిలూదింది ఈ నానీ. హద్దులుండడం సహజం. వాటిని అధిగమించడమే చైతన్యం. అది పురోగతి వైపా? పతనం వైపా? అనేది మన విచక్షణతో కూడుకొని ఉంటుంది.

''ప్రగతికీ సంస్కృతికీ మధ్య
నీరధి
వారధి
కడదాం రండి''[59]

---

[57] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.43

[58] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం.276

[59] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం.294

ప్రగతి అంటే అభివృద్ధి. అభ్యుదయం అంటే మార్పు. కాలానుగుణంగా వచ్చే మార్పును సంప్రదాయం, సంస్కృతి పేరుతో అడ్డుకోవడాన్ని గురించి కవి చెప్తూ, ప్రగతి మార్గంలో సంస్కృతికి కొంత ఎదురు దెబ్బ సహజం. కానీ సంస్కృతి ప్రగతికి వారధిలా ఉపయోగపడాలని భావం. అభ్యుదయంలోనే శ్రమదోపిడీని గురించి చెప్పిన నానీలు కూడా ఉన్నాయి.

‘‘విత్తును
చులకన చేస్తే ఎలా
రేపటి చిగురు పాటకు
ఇదే పల్లవి’’[60]

శ్రామికులను, కర్షకులను చిన్నచూపు చూడరాదని వారి శ్రమ, కృషి ఫలితంగానే అభివృద్ధి జరుగుతుందని చెప్పడం జరిగింది. అనాథలకు, ఆగర్భ శ్రీమంతులకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చూపిస్తున్న నానీ–

‘‘ఇద్దరిదీ
ఆకలేనా
ఉండీ తిన్లేదొకడు
తినడానికి లేదొకరికి’’[61]

‘‘తిండిలేక ఒకడు తిన్నదరక్క ఇంకొకరు’’ అనే సామెత ఈ నానీలో ప్రతిఫలిస్తుంది.

3.7.15 అమ్మపై నానీలు:

‘‘అమ్మ అనేది ఒక కమ్మని మాట. ప్రతి ఒక్కరికి తన తల్లితో జ్ఞాపకాలు, అనుభూతులు, అనుభవాలు ఉంటాయి. అలాంటి వాటినే కవి తన నానీల్లో వ్యక్తపరిచారు.

‘‘నేను పుట్టిన
గదిలో పడుకున్నాను
అమ్మ వొడివెచ్చదనం
గుప్పుమంది’’[62]

---

[60] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.27

[61] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.55

[62] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం. 376

ప్రతి మనిషికి అమ్మ ఒడి వెచ్చదనం జ్ఞాపకం ఉండే ఉంటుంది. అమ్మ దూరమైనప్పుడు ఆమె ప్రసవించిన గదిలో నిద్రపోతున్న కవికి ఆమె ఒడిలోని వెచ్చదనం గుర్తుకొచ్చిందని అమ్మ ప్రేమను గుర్తుచేసే ''స్మృతినానీ''ని వెల్లడించారు.

''అమ్మను
రెండు ముక్కలు చేద్దామా?
వద్దొద్దు
మనమే కలుద్దాం''[63]

వృద్ధాప్యంలో ఆసరాగా ఉండాల్సిన కొడుకులు వారిని వంతుల వారీగా చూసుకోవడం కన్పిస్తుంది. ''అమ్మను ముక్కలు చేద్దామా?'' అనడంలో ఇది మన సంస్కృతి కాదనే భావాన్ని చెప్తూ, మనమే కలుద్దాం అనడంలో అమ్మను బ్రతికించుకుందాం అనే భావన ఉంది.

''అమ్మ
చేట ముందేసుకుంది
పిల్లాడి ఉద్యోగం కోసం
డేట్లు లెక్కిస్తుంది''[64]

కొడుకు పుట్టినప్పటి కంటే ప్రయోజకుడు అయితేనే తల్లికి ఎక్కువ ఆనందం. తన కొడుకు ప్రయోజకుడైతే తనను బాగా చూసుకుంటాడని భావిస్తూ, తన కొడుకు పడ్డ కష్టానికి ప్రతిఫలం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తుంది. ''చేట ముందేసుకుంది'' అని చెప్పడంలో అమ్మ ఏ పని చేస్తున్నా మనసంతా తన బిడ్డలపైనే ఉంటుందనే భావన పై నానీలో కన్పిస్తుంది. అందుకే ఆత్రేయగారు అమ్మగురించి చెప్తూ–

''అమ్మ వంటిది
అంత మంచిది
అమ్మ ఒక్కటే'' అంటారు.

---

[63] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం.374

[64] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.30

ప్రయాణంలో నిలువెల్లా కవిత్వాన్నవుతాను అంటూ చెప్పే నానీ–

''నాకొంచెం
ప్రయాణమివ్వు
నీకో అపురూపమైన
జీవన పద్యాన్నిస్తా''[65]

అంటూ ప్రయాణం నా కవిత్వానికి ప్రేరణగా ఉంటుందంటాడు. అలాగే కవికి చావెప్పుడంటే చేతిలోని కలాన్ని లాగేసినప్పుడు అంటూ రాయడం పట్ల తనకున్న ఇష్టాన్ని చాటే నానీ ఇది–

''చావును కోరుతున్నావా?
కుట్ర దేనికి?
నా చేతిలో కలం లాగేయ్
అదే చావు''[66]

అంటూ కవిత్వం రాయకుండా తాను ఉండలేనంటాడు. అది చావుతో సమానం అని కవి భావిస్తున్నాడు.

ఈ విధంగా గోపిగారికి సమాజం పట్ల ఉన్న ప్రేమ, బాధ్యత, స్పష్టత మొదలైన అంశాలు నానీల్లో ప్రతిఫలిస్తాయి. అందుకే మానవత్వం, ప్రపంచీకరణ, ఆశ, నిరాశ, ప్రకృతి, నీరు, స్త్రీలు, రాజకీయాలు, శాంతి, తాత్వికత, అమ్మ, కాలం వంటి ఎన్నో అంశాలను స్పృశిస్తూ నానీలు రాశారు. ఎన్ని కోణాల్లోంచి చూసినా ఇంకా ఏదో మనం స్పృశించని, గుర్తించని కోణం ఉందేమో అన్నట్లుగా నానీల్లో వస్తువు నిక్షిప్తమై ఉంది.

★★★

[65] గోపి కవిత్వం. సంపుటి -II, (నానీలు) పేజి నెం.129

[66] గోపి కవిత్వం. సంపుటి -II, (గోపి నానీలు) పేజి నెం.319

నాల్గవ అధ్యాయం

యాత్రా చరిత్రకారుడిగా గోపి

అధ్యాయం – 4

యాత్రా చరిత్రకారుడిగా గోపి

యాత్రాచరిత్రలు రాయడం ఒక కళ. రాయాలన్న ఓపిక, ఉత్సాహం కొంతమందికే ఉంటుంది. యాత్రాచరిత్రలు చరిత్ర నిర్మాణానికీ, సాహిత్య చరిత్ర రచనకూ తోడ్పడుతాయి. తెలుగు సాహిత్యం అంటే పద్యాలు, కావ్యాలు, నవలలు, కథలు, కథానికలు, కవిత్వం గుర్తుకొస్తాయి. వీటితో పాటు తెలుగులో చెప్పుకోదగ్గ యాత్రా సాహిత్యం కూడా ఉంది. కానీ యాత్రా రచనలకు అంత గుర్తింపు రాలేదు.

తెలుగులో యాత్రా చరిత్రలు 19వ శతాబ్దం ఆరంభం నుండే ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనవి ఏనుగుల వీరాస్వామయ్య కాశీ యాత్రాచరిత్ర (1830–31), కోలా శేషాచలకవి నీలగిరి యాత్ర (1846), వీరాస్వామయ్య కంటే ఎనిమిది సంవత్సరాల ముందే కాశీయాత్ర చేసినవారు వెన్నెలకంటి సుబ్బారావుగారు. ఈయన తెలుగువారే కానీ తన గ్రంథాన్ని ఇంగ్లీష్ లో రాశారు. ''A Life Journey'' అని ఇంగ్లీష్ లో రాసిన ఈ గ్రంథాన్ని డా. అక్కిరాజు రమాపతిరావు 1976లో ''వెన్నెలకంటి సుబ్బారావు జీవయాత్రా చరిత్ర'' అని తెలుగులోకి అనువాదం చేశారు. లభించిన సమాచారం, వాస్తవాలను బట్టి ఏనుగుల వీరాస్వామయ్య ''కాశీయాత్ర చరిత్ర''ను తెలుగులో మొట్టమొదటి యాత్రా గ్రంథంగా భావించారు.

4.1 యాత్ర నిర్వచనం:

యాత్రను ఇంగ్లీష్ లో ''Travel'' అంటారు. ట్రావెల్ కు పర్యాయపదాలుగా Journey, Voyage, Excursion, Trip, Tour, Expendition మొదలైన పదాలు నిఘంటువుల్లో కన్పిస్తాయి. ట్రావెల్ అనే పదానికి ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వెళ్ళడం, దూర దేశాలకు లేదా అపరిచిత ప్రదేశాలకు చేసే ప్రయాణం అనే అర్థం ఉంది. ట్రావెల్ అంటే దుఃఖం, శ్రమ అనే అర్థాలు కూడా ఉన్నాయి. ప్రయాణం అంటే దుఃఖంతో, శ్రమతో కూడిన యానం అనే అర్థం ఉంది.

యాత్రకు ''యాన్తి అస్యామ్ ఇతి యాత్రా యా ప్రాపణే'' అని సంస్కృతంలో వ్యుత్పత్తి. ఇది అకారాంత స్త్రీ లింగం. ''యా ప్రాపణే'' అంటే ''దీని యందు కదిలిపోవుదురు''[1] (గెలువ నిచ్ఛయించిన రాజు యొక్క పయనం) అని అర్థం.

జీవన గమనాన్ని జీవయాత్ర అంటారు. మరణించడాన్ని ''జీవయాత్ర'' చాలించడం అంటారు. యాత్రకు ''యానము, ప్రయాణము, పర్యటన'' అనే అర్థాలున్నాయి. యాత్రకు వివిధ నిఘంటువులు పలు అర్థాలను ఇచ్చాయి.

శబ్ధరత్నాకరం:

యాత్ర అంటే పోవుట, పుణ్యక్షేత్రములను గూర్చి పోవుట, కాలము పుచ్చుట, జాతర''[2] అనే అర్థాలు కన్పిస్తాయి. ''యానము'' అనే పదానికి పోవుట, దండెత్తి పోవుట.

''యానము పంచవిధాలు అని శబ్ధరత్నాకరం చెబుతుంది.

1. సంధాయ యానము (దుర్గాదులను గ్రహింపవలయునని కదిలిపోవుట)
2. ప్రసంగయానము (ఒక దిక్కునకు కదలపోయి పొసగుడు పడినచో మఱియొక దిక్కుకు గదిలిపోవుట)
3. విగృహ్యా యానము (శత్రువును సంహరింప వలయునని గదిలిపోవుట)
4. సంభూయ యానము (శత్రువును గెలువ శక్యము గానిచో సరి రాజులను గూర్చుకొని కదలిపోవుట)
5. ఉపేక్ష్యయానము (నేనే శత్రువులను సంహరింపగలను అనే తలపుతో దేశ కాలాదులను పరికింప కదలిపోవుట)''[3]

''పర్యటనము'' భిక్షలోనగు వానికొరకు తిరుగుట అని, ''ప్రయాణము'' అంటే బయలుదేరుట అనే అర్థాల్ని శబ్ధరత్నాకరంలో చూడవచ్చు.

[1] యాత్రా చరిత్రలు – డా. మచ్చ హరిదాసు – పేజి -3.

[2] శబ్ధరత్నాకరం – బహుజనపల్లి సీతారామాచార్యులు పేజి -775.

[3] శబ్ధరత్నాకరం – బహుజనపల్లి సీతారామాచార్యులు పేజి – 776.

బ్రౌణ్య తెలుగు – ఇంగ్లీష్ నిఘంటువు:

ఇందులో యాత్ర అంటే Travelling, Moving, Proceeding, Marching, A Pilgrimage, Sacred Procession or Festival అని ఆంగ్లంలో వివిధ అర్థాలున్నాయి. అదేవిధంగా తరలిపోవడం, దేవోత్సవం, గత్యాం, యాపనే, భోగాదివర్తనే, దివ్య దేశాలకు పోవడం అనే అర్థాలు తెలుగులో ఉన్నాయి.

దేహయాత్ర అనే అర్థానికి భిక్షమెత్తి పరితోషమునం భుజియించి దేహయాత్ర కుశలంబు గైకొనుట ధర్మము భిక్షునకున్ అనే అర్థాన్నిచ్చింది. నీ చేతి మాత్ర వైకుంఠయాత్ర – A pill from you is a pass to heaven అనే అర్థం ఉంది. ''యానము'' అనే పదానికి going, marching, A vehicle or conveyance అనీ, రాజషాడ్గుణ్య భేద ప్రయాణే, దండెత్తిపోవడం, వాహన సామాన్యే అనే అర్థాన్ని చెప్పింది బ్రౌణ్య నిఘంటువు''[4] ప్రయాణము అంటే Journey, departure అనే అర్థాలున్నాయి. ప్రయాణం అంటే బయలుదేరటం అనే అర్థాన్ని బ్రౌన్ సంగ్రహించాడు. యాత్రా ప్రారంభాన్ని ప్రయాణం, తరలిపోవడం అనే అర్థంలో వాడాడు.

సూర్యరాయాంధ్ర నిఘంటువు:

''యానము'' అనే పదానికి 1. గమనము, ప్రయాణము 2. శత్రువుల మీదకు వెళ్ళుట, దాడి వెడలుట (రాజతంత్రంలోని ఆరు గుణాలలో ఒకటి) 3. వాహనము (బండి, రథం, పల్లకి, అశ్వము, గజము) అనే అర్థాలున్నాయి. ''యాత్రకు వెళ్ళుట'' అనే అర్థంతో పాటు సేన వెడలుట, తీర్థమునకు పోవుట అనే ప్రత్యేక గమనాన్ని సూచించే అర్థాన్ని ఈ నిఘంటువు పేర్కొంది.

యానము పంచవిధాలు: 1. సంధాన 2. ప్రసంగ 3. విగృహ్య 4. సంభూయ 5. ఉపేక్ష్య యానములు''[5] శబ్దరత్నాకరం, సూర్యరాయాంధ్ర నిఘంటువులు యానం పంచవిధాలు అనే ఒకే అర్థాన్ని చెప్పాయి.

ప్రయాణం అంటే ''పయనము, ప్రస్థానము'' అనే అర్థాలున్నాయి. సంతోషం కోసం చేసే యానం ప్రయాణం. బయల్దేరడం అనే సామన్య అర్థంలో ప్రయాణం అనే మాట క్రియా

---

[4] బ్రౌణ్య తెలుగు – ఇంగ్లీష్ నిఘంటువు – పేజి -860.

[5] సూర్యరాయాంధ్ర నిఘంటువు (ఆరవ సంపుటం) – పేజి -613

రూపంలో వాడబడింది. ''పర్యటనం'' అనే పదం వెళ్ళి వచ్చే అర్థంలోగాక ''దిమ్మరుట'' అని, అంటే ''పునః పునర్భ్రమణం'' అనే అర్థంలో వాడబడింది.

ప్రాచీనకాలంలో కాలినడకన వెళ్ళడాన్ని ప్రయాణం అనేవారు. ఆధునిక కాలంలో వాహనాల ద్వారా వెళ్ళడాన్ని ప్రయాణంగా భావిస్తున్నారు. మనవారు తీర్థయాత్రను కూడా యాత్రగానే భావిస్తారు. కానీ పాశ్చాత్యుల దృష్టిలో యాత్ర అంటే తీర్థయాత్ర కాదు. ఉల్లాస, వినోద, విహార యాత్ర.

యాత్రా చరిత్రలు సాధారణంగా వచనంలోనే ఉంటాయి. వ్యవహారిక భాషలోనే ఉంటాయి. ఒకప్పుడు ప్రయాణమంటే యువత, సంఘంలో హోదా, గుర్తింపుకోసం చేసేవిగా భావించేవారు. కాలక్రమంలో వినోదం, విజ్ఞానం కోసం చేసేవి యాత్రలుగా భావిస్తున్నారు. ఏదో ఒక పనికోసం, ఒక లక్ష్యంతో యాత్రలకు వెళ్ళివచ్చిన వారు తమ అనుభవాలను ఒకచోట చేరుస్తూ రాసే రచనే యాత్రా చరిత్ర. తేదీలు, చూసిన స్థలాల వివరాలే కాకుండా, వాటిని చూసినప్పుడు కల్గిన అనుభూతినీ, ఎదుర్కొన్న అనుభవాలను పాఠకులతో పంచుకునే విధంగా యాత్రా చరిత్రలు ఉండాలి.

4.2 యాత్ర – ప్రేరణ:

''నాలుగూళ్ళయినా చూడు – నాలుగు పుస్తకాలయినా చదువు'' అన్నారు పెద్దలు. భ్రమణకాంక్ష జీవనోత్సాహాన్ని ఇస్తుంది. కొందరికి ''బావిలో కప్పలా'' ఉన్నచోటే ఉండాలనిపించదు. కొత్త ప్రదేశాలు చూడాలని, అక్కడి విశేషాలు తెలుసుకోవాలని ఉంటుంది. చలనశీలంగా ఉండడం వల్ల మానవుడి బుద్ధి వికసిస్తుంది. మానవ సంబంధాలు, సమాజాన్ని అర్థం చేసుకునే శక్తి వస్తుంది. పుస్తకాలు చదవడం ద్వారా ఒక రకమైన జ్ఞానం వస్తే దేశాలు చూడడం వల్ల ఒకరకమైన జ్ఞానం వస్తుంది. దేనికదే ప్రత్యేకంగా ఉంటుంది. అందుకే ''దేశమైనా చూడు – కోశమైనా చూడు'' అనే నానుడి వచ్చింది.

4.3 యాత్రా ప్రయోజనం:

''వేయి మాటలు వినడం కన్నా ఒక వాక్యం చదవడం మేలు. వేయి వాక్యాలు చదవడం కన్నా ఒకసారి చూడడం మంచిది'' అన్నది లోకోక్తి. పరోక్షానుభూతి కంటే ప్రత్యక్షానుభూతి గొప్పది. అందునే నేడు యాత్రలు చేసేవారు ఎక్కువయ్యారు. విజ్ఞానం, వినోదం, ఉల్లాసాల కోసం వివిధ ప్రాంతాలను దర్శించి అక్కడి విశేషాలు తెలుసుకుంటున్నారు. కాళ్ళకు చక్రాలు

కట్టుకొని కాలంతోపాటు పరిగెత్తే మనుషులున్న ఈ కాలంలో ఒత్తిడి నుండి బయటపడడానికి, ఆరోగ్య సమస్యలనుండి తప్పించుకోవడానికి స్థలమార్పిడి, గాలి మార్పుకోసం యాత్రలు చేసేవారు ఎక్కువయ్యారు. మనిషి ఆదిమకాలం నుండే ఆహారాన్వేషణ కోసం కొత్త ప్రదేశాలకు ప్రయాణించేవాడు. యాత్ర కవులకు రచనలు చేయడానికి ఉత్సాహాన్ని కలిగిస్తే, సామాన్యులకు తెలివిని పెంపొందిస్తుంది. ''ఇచ్చి పుచ్చుకుంటే వ్యవహారం, వచ్చిపోతుంటే బంధుత్వం'' అన్నట్లుగా స్నేహాలు, బంధుత్వాలు పెంచుకోవడానికి యాత్రలు తోడ్పడుతాయి. అందుకే దేశ నాయకులు అంతర్జాతీయ సంబంధాలు మెరుగుపడడానికి యాత్రలు చేస్తారు.

ప్రతి ప్రాంతంలో, దేశంలో ఆచార్యవ్యవహారాలు, భాష, పంటలు, విభిన్న సంస్కృతులు, ప్రకృతిలో భిన్నత్వం ఉంటాయి. అలాంటి వాటిని చరిత్రకారుడైతే చారిత్రక దృష్టితో, భక్తుడైతే ఆధ్యాత్మిక దృష్టితో, శాస్త్రవేత్త శాస్త్రీయంగా, కవి అయితే కవి హృదయంతో చూసి అక్కడి అనుభూతులు, విశేషాలను మనకు అక్షర రూపంలో అందిస్తారు.

4.4 యాత్రికుని లక్షణాలు:

యాత్ర అనేది ఒక అనుభవం. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, నిరంతరం కొత్త విషయాల కోసం ప్రయత్నించాలి. యాత్ర సమయంలో కవుల దృష్టికి, సామాన్య వ్యక్తుల దృష్టిలో చాలా తేడా ఉంటుంది. మామూలు వ్యక్తి ఎన్ని ప్రదేశాలు చూసినా వాటి దూరాన్ని, కష్టాల్ని మాత్రమే చూస్తాడు. సాహిత్యకారుడిలా స్పందించలేడు. యాత్రికులకు ఆసక్తి, నేర్పు, ఓర్పు చాలా అవసరం. నేడు వివిధ ప్రదేశాలకు వెళ్ళివచ్చిన వారు తమ అనుభూతులను ఇతరులతో పంచుకోవాలనే ఉత్సాహంతో వ్యాసాలు రాసి పత్రికలకు పంపించడం ఎక్కువైంది. పత్రికలు కూడా ఇలాంటి యాత్రా సాహిత్యాన్ని ప్రచురించడానికి ఆసక్తి చూపుతున్నాయి.

4.5 యాత్రల వర్గీకరణ:

''యాత్రా చరిత్రలు'' అనే గ్రంథలో డా. మచ్చ హరిదాసు గారు యాత్రలను లక్ష్యాన్ని బట్టి, గమన విధానాన్ని బట్టి, విషయాన్ని లేదా సమాచారాన్ని బట్టి కాలక్రమాన్ని బట్టి నాలుగు రకాలుగా విభజించడం జరిగింది.

1. లక్ష్యాన్ని బట్టి యాత్రల వర్గీకరణ:
   a) ధర్మ ప్రచార యాత్రలు
   b) తీర్థ యాత్రలు

c) వ్యాపార యాత్రలు

d) అన్వేషణ లేదా పరిశోధక యాత్రలు

e) సాహస యాత్రలు

f) విజ్ఞాన, వినోద, విహార యాత్రలు

g) సాహితీ, సాంస్కృతిక యాత్రలు

h) పరిశీలక యాత్రలు

i) కిసాన్ యాత్రలు

2. గమన విధానాన్ని బట్టి యాత్రల వర్గీకరణ:

a) పాద యాత్రలు

b) జల యాత్రల లేదా నౌకా యాత్రలు

c) వాహన యాత్రలు

d) ఆకాశ యాత్రలు

e) రోదసీ లేద గ్రహాంతర యాత్రలు

3. విషయాన్ని బట్టి యాత్రలు:

a) విషయ ప్రధానం (Infermative)

b) వర్ణనా ప్రధానం (Aesthetic)

4. కాలక్రమాన్ని బట్టి యాత్రలు:

a) వాహన పూర్వ యుగం

b) వాహన యుగం

లక్ష్యాన్ని బట్టి చేసే యాత్రల్లోనే ''చారిత్రక యాత్రలు'' అనే విభజనను చేర్చవచ్చు. ఈ యాత్ర గురించి హరిదాసు గారు వివరించలేదు. చారిత్రక యాత్రలు ఎక్కువగా పురావస్తుశాఖ వారు చేస్తారు.

డా. ఎన్. గోపి తెలుగు అధ్యాపకుడిగా, వైస్ ఛాన్సలర్ గా, సాహితీ వేత్తగా వివిధ దేశాలు సందర్శించారు. అక్కడి విషయాలు, విశేషాలు, అనుభూతులను సాహిత్యాభిమానులకు అందించాలనే ఉద్దేశంతో యాత్రా చరిత్రలను (ట్రావెలోగ్స్) రాయడం జరిగింది. వీరు ఏ ప్రాంతాన్ని సందర్శించినా ఆసక్తితో అక్కడి విశేషాలు, చరిత్ర గురించి అడిగి తెలుసుకొని నోట్ చేసుకునే అలవాటు ఉంది. కాబట్టే అవన్నీ అక్షరబద్ధం చేసి యాత్రా చరిత్రలుగా వెలవరించారు.

4.6 నేను చూసిన మారిషస్ (1996):

మారిషస్ పై తెలుగులో వచ్చిన మొదటి యాత్రా చరిత్ర ఇది. రచయితకు ఇదే తొలి విదేశీ ప్రయాణ యాత్ర. యాత్ర చరిత్రల వర్గీకరణలో దీనిని ''విద్యా వినోద యాత్ర''గా చెప్పవచ్చు. ఈ యాత్రా చరిత్ర ఏప్రిల్ 14, 1996 నుండి మే 19, 1996 వరకు ఆరు వారాల పాటు ''వార్త'' ఆదివారం సంచికల్లో రావడం జరిగింది.

''పదిమందితో కలిసి ప్రయాణించడం వల్ల యాత్రికుడు ఆయా సందర్భాల్లో తన లౌకిక స్థాయినీ, అధికారాన్నీ, కలిమి లేముల్ని మరిచిపోయి కలుపుగోలుతనాన్ని సాధించుకుంటాడు'' అని ఈ పుస్తకానికి రాసినముందు మాటలో అంటారు గోపి.

మారిషస్ లో నవంబర్ 25,26,27 (1996) తేదీల్లో జరిగే మొదటి అంతర్జాతీయ తెలుగు ఉపాధ్యాయుల సదస్సులో ''డిగ్రీ స్థాయిలో తెలుగు కవిత బోధన – క్రమబద్ధీకరణ'' అనే అంశంపై పత్ర సమర్పణ చేయడానికి వెళ్ళారు గోపి.

4.6.1 భౌగోళిక స్వరూపం:

మారిషస్ ఆఫ్రికా ఖండం తూర్పు సమీపంలోని మెడగాస్కర్ దీవికి దగ్గరలో ఉంది. మారిషస్ అనేది కార్ గం డోస్, కారాజోస్, రోడ్రిగస్, అజెలిగా, మారిషస్ అనే అయిదు ద్వీపాల సమూహం. మారిషస్ రాజధాని పోర్టులూయిస్. ఇది ఒకప్పుడు ఫ్రెంచి వారి పాలనలో ఉండేది. 1968లో మారిషస్ కు స్వాతంత్ర్యం లభించింది. ప్రస్తుతం మారిషస్ రాజకీయంగా ఆఫ్రికాతో ముడిపడి ఉంది. ''మారిషస్ దీవిని 9వ శతాబ్దంలో ముందుగా అరబ్ నావికులు గుర్తించారు. తర్వాత 1505లో డిగో ఫెర్నాండెజ్ పెరీరా అనే పోర్చుగీసు నావికుడు దీన్ని గుర్తించి సెర్నె అనే పేరు పెట్టినా, పోర్చుగీసు వారెవరూ ఈ దీవిలో నివాసం ఏర్పరుచుకోలేదు. 1598లో డచ్ వారు మొదటగా కాలనీని ఏర్పాటు చేసుకున్నారు. వారే హాలెండ్ (హాలెండ్ దేశ ప్రజలను డచ్ వారంటారు. నేడు దాని అధికారిక నామం నెదర్లాండ్) ప్రిన్స్ మార్టిజ్ డె నాసో పేరున మారిషస్ అని పేరు పెట్టారు.''[6]

స్వాతంత్ర్యం రాకముందు (1968 కి ముందు) ఈ దేశానికి వెళ్ళాలంటే ఆఫ్రికా మీదుగా వెళ్ళాల్సి వచ్చేది. బొంబాయి నుండి ఈడెన్ (సౌదీ) నైరోబీల మీదుగా ఆఫ్రికా చేరి అక్కడి నుండి మారిషస్ వెళ్ళాలి. ఆ రోజుల్లో ఆఫ్రికాలో ''Yellow Fever'' ఉండేది. కాబట్టి ముందే

[6] డా. మన్నం కృష్ణమూర్తి (31, ఆగస్టు, 2014) ఈనాడు వ్యాసంలో.

Inoculation (Vaccination) టీకా తీసుకుంటేనే అనుమతి దొరికేది. కానీ 1968లో మారిషస్ స్వాతంత్ర్యం పొందాక "Special Common Wealth Africa Assistance Plan" (SCAAP) కింద కొత్త మార్గాలు ఏర్పడ్డాయి. దీన్నే కొలంబో ప్లాన్"[7] అంటారు. మారిషస్ కాలమానానికీ, మనకీ గంటన్నర తేడా ఉంటుంది.

4.6.2 భాష:

మారిషస్ వ్యవహార భాష "క్రియోల్", అన్ని జాతులవారు ఈ భాష మాట్లాడుతారు. మారిషస్ 90 ఏళ్ల పాటు (1721–1810) ఫ్రెంచి వారి పాలనలో ఉంది. ఫ్రెంచి తర్వాత ఇంగ్లీష్ వారు పాలించడం వల్ల ఇంగ్లీష్ అధికార భాషగా ఉంది.

భారతీయ సంతతి వారిలో హిందీ వారు ఎక్కువ. తర్వాత తమిళం, తెలుగు వారు ఉన్నారు. అక్కడ తమిళాధిపత్యం ఉండేది. దాన్ని తగ్గించుకోవాలనే ఆరాటం తెలుగువాళ్ళలో మొదలైంది. ఈ తరం వారి భాష క్రియోల్ అయినప్పటికీ తాతముత్తాతల భాష అయిన తెలుగును కాపాడుకోవాలనే తపన వారిలో కన్పిస్తుంది. ఇక్కడ తెలుగు ద్వితీయ భాషగా (Second Language) 1958 నుండి బోధన జరుగుతుంది. అక్కడి వారికి వ్యాకరణం తెలుసు. తెలుగు చదువుతారు. కానీ యాస వేరుగా ఉంటుంది. అక్కడి వృద్ధులు తెలుగును శ్రీకాకుళం, విజయనగరం మాండలిక యాసలో మాట్లాడుతారు. ఇదంతా గమనిస్తే అక్కడి వారికి తెలుగు పట్ల ఉన్న మమకారం, గౌరవాన్ని ప్రశంసించకుండా ఉండలేము.

4.6.3 ఆచార వ్యవహారాలు:

మారిషస్ లో తెలుగువారి పెళ్ళిళ్ళు శుక్ర, శని, ఆది వారాల్లో మూడు రోజులు జరుగుతాయి. మొదటి రోజును 'పసుపు' అంటారు. పెళ్లి తప్పని సరిగా ఆదివారమే జరుగుతుంది. ఆర్య సమాజ ప్రభావం ఎక్కువగా ఉండడంతో సప్తపది, హవనం (హూమము) ఉంటాయి. మన దేశంలో లాగా మూడు ముళ్ళ పద్ధతి లేదు. తాళిబొట్టు వేస్తారు కానీ కట్టరు. జీలకర్ర, బెల్లం లాంటి సంప్రదాయాలు లేవు. కట్నం మాట అసలే లేదు. వారి పెళ్లిలో ఉండే మంత్రాలు మన దగ్గర వ్యవహారంలో ఉండే మంత్రాలు వేరుగా ఉంటాయి. మన మంత్రాల్లో "నాతి చరామి" ఉంటుంది. వారికి ఉండదు. వారి దృష్టిలో పురోహితుడంటే పుస్తకం చదివి చెప్పే పంతులు అని అర్థం. భాషాంతర వివాహాల్ని ఒప్పుకోరు. బహుశా తమ అస్తిత్వాన్ని

---

[7] డా. ఎన్. గోపి – నేను చూసిన మారిషస్ – పేజి -24.

కాపాడుకోవాలనే ఉద్దేశ్యం కావచ్చు. మహిళలు తెలుగు పండుగలు, గుళ్లకు వెళ్ళినప్పుడు, పెళ్ళిల్లో చీరలు కట్టుకొని, బొట్టు పెట్టుకొని సంప్రదాయంగా తయారవుతారు. సాధారణ రోజుల్లో మినీలు ధరించి, బొట్టు పెట్టుకోరు. ఉగాది పండగ రోజును జాతీయ సెలవు దినంగా ప్రకటిస్తారు. ఇక్కడ భారతీయులు ఎక్కువగా ఉండడం వల్ల అక్కడి సంప్రదాయాలు మనకు దగ్గరగా ఉండి అందులో భారతీయాత్మ కన్పిస్తుంది.

4.6.4 ఆహారపు అలవాట్లు:

సముద్ర తీర ప్రాంతం కావడం వల్ల సీ ఫుడ్ వాడకం ఎక్కువ. శాకాహారులు తక్కువగా ఉంటారు. కీర, క్యారెట్, క్యాబేజీ ఆకుల్లాంటివి ఎక్కువగా తింటారు. వారు కూరలలో మిరప్పొడిని వాడరు. పచ్చిమిరపకాయలే వాడుతారు. భోజనం మధ్యలో నీళ్ళు తాగకుండా కోక్ తాగుతారు. పాకిస్తాన్ నుండి బియ్యాన్ని దిగిమతి చేసుకుంటారు. బాస్మతి బియ్యాన్ని వాడుతారు.

4.6.5 వింతలు – విశేషాలు:

మారిషస్ వింతల్లో రంగుల నేల ఒకటి. షామాలెల్ (చామరెల్) అనే ప్రాంతంలో అగ్నిపర్వతం కోతకు గురవ్వడంతో ఏర్పడ్డ బూడిద కారణంగా అక్కడి భూభాగం ఏడు రంగుల్లో కన్పిస్తుంది. ఆకుపచ్చ, నీలం, పసుపు, నారింజ రంగులు స్పష్టంగా కన్పిస్తాయి. పాలిచ్చే జంతువులు లేవు. పాములు, ఎలుకలు, విష కీటకాలు, క్రూర జంతువులు ఉండవు. వందేళ్లు బ్రతికే నల్లటి తాబేళ్లు ఇక్కడ వింతల్లో ఒకటి. తాటి చెట్టు జాతికి చెందిన నూరేళ్లకోసారి పువ్వులు పూచే 'TALIPO TREE'[8] మరో వింత. ఈ చెట్టుకు పూసిన పువ్వులు రెండు, మూడు నెలలదాకా ఉంటాయి. మారిషస్ కి శత్రు దేశం లేకపోవడమనేది విశేషమే.

4.6.6 అంతర్జాతీయ సదస్సు విశేషాలు:

మారిషస్ రాజధాని పోర్టులూయిస్ లో నవంబర్ లో సాంస్కృతిక వారోత్సవాల సందర్భంగా 25 నుండి 27 వరకు మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఇందులో 40 పత్రాలు సమర్పించారు. ఈ ఉత్సవాల కోసం సినారె ప్రత్యేకంగా రాసిన ''కదలి అంచులు దాటి కదిలింది తెలుగు'' అనే గీతాన్ని ఆలపించారు. ఈ గీతాన్నే తిరుపతిలో జరిగిన నాలుగో

[8] నేను చూసిన మారిషస్ – డా. ఎన్. గోపి – పేజి - 65

ప్రపంచ తెలుగు మహాసభల్లో గాయకులు ఎస్పీ. బాలసుబ్రహ్మణ్యం, పి. సుశీల గారు ఆలపించారు.

ఈ సదస్సులో "విదేశాల్లో భారతీయ భాషా బోధనలో నవీకరణ, మారిషస్ లో తెలుగు పాఠ్య ప్రణాళిక నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలు, బోధన సామాగ్రి తయారీలో తులనాత్మక పద్ధతి, సెకండరీ స్థాయిలో బోధన సమస్యలు, ద్వితీయ భాషగా తెలుగు, దక్షిణాఫ్రికాలో తెలుగు చైతన్యం, దక్షిణాఫ్రికాలో పూర్వుల భాషా సంస్కృతుల పరిరక్షణలో స్వచ్ఛంద సంస్థల పాత్ర, కుటుంబ వ్యవస్థ ద్వారా భాషా సంస్కృతుల వ్యాప్తి, మలేషియా, మారిషస్, దక్షిణాఫ్రికాల్లోని తెలుగు పాఠ్య పుస్తకాల సమీక్ష, తెలుగు వికాసానికి ప్రసార సాధనాల కృషి"[9] వంటి అంశాలపై పత్రాలు సమర్పించారు. గోపి గారు "కళాశాల స్థాయిలో కవిత్వ బోధన – క్రమబద్ధీకరణ" అనే అంశంపై ప్రసంగించారు. సర్ సీవూ సాగుర్ రాంగులామ్ మారిషస్ కు తొలి ప్రధాని. మారిషస్ కు స్వాతంత్ర్యం సాధించడానికి కృషి చేసినందుకు అక్కడి ప్రజలు ఆయన్ను జాతిపితగా భావిస్తారు.

4.7 నా సైప్రస్ యాత్ర (2001):

ఇది అధికారిక యాత్ర. మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే కామన్ వెల్త్ వైస్ ఛాన్సలర్స్ కాన్ఫరెన్స్ లో (2001 ఏప్రిల్ 22-26 వరకు) పాల్గొనడానికి వెళ్ళారు. ACU (Conference of Executive Heads, Cyprus) లో కామన్ వెల్త్ దేశాల విశ్వవిద్యాలయాలన్నింటికి సభ్యత్వం ఉంటుంది. ఈ సైప్రస్ యాత్ర గురించి ఆంధ్ర ప్రభ వార పత్రికలో ఐదు వారాలు ధారావాహికగా వచ్చింది.

హైదరాబాద్ నుండి ముంబాయి, ముంబాయి నుండి దుబాయ్, దుబాయ్ నుండి సైప్రస్ కు వెళ్ళాలి. దుబాయ్ లో ఒకరోజు ఉండాల్సి రావడంతో రచయిత దాన్ని గురించిన చరిత్ర విశేషాలను చెప్పడం జరిగింది.

4.7.1 దుబాయ్ విశేషాలు:

1971లో UAE (United Arub Emirates) యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అబూదబి, షార్జా, అమ్మాద్, ఉమ్మల్, రస్ అల్ ఖైమా, ఖైవాన్ ఫుజైరా, దుబాయ్ అని ఏడు దేశాలు ఒక కూటమిగా ఏర్పడ్డాయి.

---

[9] నేను చూసిన మారిషస్ – డా. ఎన్. గోపి – పేజి -35.

దుబాయ్ నేలలో నీళ్ళు లేవు. సముద్రపు నీటినే శుద్ధి చేసి వాడుకుంటారు. అందుకే రచయిత ఎడారిలో మొలిచిన నగరంగా దుబాయ్ ని వర్ణించారు. వర్షపాతం తక్కువైనా నీటికి కొదవలేదు. ఎక్కడ చూసినా పచ్చదనమే కన్పిస్తుంది. సాంకేతిక పరిజ్ఞానంతో నీటిని మొక్కల వేళ్లు మాత్రమే పీల్చుకునేలా ఏర్పాట్లు చేశారు. దీన్ని ''Root Feeding'' అంటారు. దుబాయ్ వాసులు ఒకప్పుడు పేదవారే. నూనె వల్ల వారు ధనవంతులయ్యారు. నూనె పడ్డప్పుడు ఇంగ్లాండ్ వారు సాంకేతిక సహాయం అందించారు. కాబట్టి వీరు దుబాయ్ కి వెళ్ళాలంటే వీసా అవసరం ఉండదు. దుబాయ్ కి వలస వెళ్ళిన వారు ఎంతైనా సంపాదించుకోవచ్చు కానీ అక్కడ ఇళ్ళు కట్టుకోవడానికి వీలులేదు. భారతదేశ వలస కూలీల పరిస్థితి గురించి కూడా రచయిత వివరించారు. దుబాయ్ కి ముంబాయి నుండి మూడు గంటల దూరం. అందుకే చాలా మంది భారతీయులు ఇక్కడికి వలస వెళ్తుంటారు.

4.7.2 సైప్రస్ భౌగోళిక స్వరూపం:

మధ్యధరా సముద్రంలో సైప్రస్, మాల్టా అనే రెండు ద్వీపాలున్నాయి. సైప్రస్ టర్కీకి దగ్గర. మాల్టా స్పెయిన్ కి దగ్గరగా ఉంటుంది. సైప్రస్ 9251చ.కి.మీ వైశాల్యంతో ఉన్న పెద్ద ద్వీపం. మధ్యధరా సముద్రం ఉత్తర ఈజిప్టుకి 384 కి.మీ, సిరియా పశ్చిమ ప్రాంతానికి 102 కి.మీ, గ్రీసు తూర్పు భాగానికి 800 కిలోమీటర్లు, టర్కీ దక్షిణ భాగానికి 70 కి.మీ దూరంలో సైప్రస్ ఉంది. సైప్రస్ ప్రధానంగా గ్రీకు ద్వీపం. సైప్రస్ ను తనలో కలుపుకోవాలని గ్రీసు కోరిక. కానీ టర్కీ దగ్గరగా ఉండడంతో 1974లో సైప్రస్ పై దాడి చేసి మూడింట ఒక వంతు భాగాన్ని ఆక్రమించింది. ప్రపంచ దేశాలు టర్కీ ఆక్రమణను ఖండించాయి. 1925 లో బ్రిటీష్ వారి చేతిలో ఉన్న సైప్రస్ కోసం ఉద్యమాలు జరిగాయి. 1960లో బ్రిటన్ నుండి సైప్రస్ కు స్వాతంత్ర్యం లభించింది. ఈ ఉద్యమంలోనే గ్రీకు, టర్కీయులకు మధ్య విభజన జరిగింది. సైప్రస్ గ్రీకులు గ్రీసుతో ఐక్యాన్ని కోరుకున్నారు. టర్కీయులకు ఇది నచ్చలేదు. దీన్ని ''Enosis'' ఉద్యమం అంటారు.

Enosis Means – "The Political union of Cyprus and Greece, as an aim or ideal of certain Greeks and Cyprus". (Enosis – Union) – Wikipedia.org.

సైప్రస్ కు, ఆక్రమిత సైప్రస్ కు మధ్య ''గ్రీన్ లైన్'' (Green Line) పేరుతో 5 కిలో మీటర్ల గోడను కట్టారు.

Green Line – "Any similar demarcation line between two hostile communities, as between greek and Turkish Cypriots in Nicosia"

(Dictionary.infoplease.com)

సైప్రస్ రాజధాని నికోషియా(Nicosia). 1000 సంవత్సారాల నుండే ఇది రాజధానిగా ఉంది. Green Line కట్టడం వల్ల నికోషియా రెండుగా చీలిపోయింది. సైప్రస్ లో అధ్యక్ష తరహా ప్రభుత్వం ఉంది. ''మకారియోస్'' సైప్రస్ ప్రజల జాతిపిత. తాను బతికున్నప్పుడే సమాధిని నిర్మింప చేసుకున్నాడు. సైప్రస్ కు యూరోపియన్ దేశాలతో మంచి సంబంధాలున్నాయి. సైప్రస్ కాపర్ కి ప్రసిద్ధి. కాపర్ వల్ల కాప్రస్ – సైప్రస్ గా మారింది. రోజుకి 100 టన్నుల రాగిని ఇది ప్రపంచానికి ఎగుమతి చేస్తుంది.

4.7.3 సైప్రస్ లో సందర్శనా స్థలాలు:

ఇక్కడ ఉన్న ప్రతీ పట్టణానికి, నగరానికి ఏదో ఒక ప్రత్యేకత ఉండటం విశేషం. సైప్రస్ లోని పాపోస్ దేవతల క్రీడా స్థలంగా ప్రసిద్ధి చెందింది. అలాగే సాలమిస్ సైప్రస్ లో అతి ప్రాచీనమైన క్రైస్తవ నగరం. ఫమగుప్త (Famagupta) ఒకప్పటి ప్రపంచంలోని సంపన్న నగరాల్లో ఒకటి. షేక్ స్పియర్ ఒథెల్లో నాటకానికి సెట్టింగ్ ఈ పట్టణం. ఇది ఇప్పుడు శిథిల నగరంగా మారింది. త్రిమిక్లిణి పట్టణంలో 18వ శతాబ్ధం చర్చి ఉంది. ఇక్కడ చెర్రీ పండ్లు ఎక్కువ. పాత్రోమోస్ సైప్రస్ లో ఎత్తయిన ప్రదేశంలో ఉన్న గ్రామం. KYKKOS (కిక్కస్) లో 4వ శతాబ్ధపు చర్చి, మేరీమాత బంగారు విగ్రహం ఉంటుంది. లెఫ్కోషియా అనే తెల్లని చెట్టు ఇక్కడి వింతల్లో ఒకటి. లాన్యా అనే ప్రాంతం వైన్ (wine) ఉత్పత్తికి ప్రసిద్ధి. మోఫూ, లిమసోలా, బెదులాస్, సనాయ ఇలా ప్రతీ నగరానికి ఒక ప్రత్యేకత, చరిత్ర ఉన్నాయి.

సైప్రస్ లో చూడదగిన వింతలలో ఒకటి వీనస్ ప్రతిమ. ఆల్చిప్పలో అవతరించిందని చెప్పుకునే గ్రీకుల ప్రణయ సౌందర్య దేవత వీనస్. వీనస్ ను అఫ్రొడైట్ దేవత (Aphrodeite diety) అంటారు. దీన్నుండే సైప్రస్ కు అఫ్రొడైట్ ద్వీపం అనే పేరు వచ్చింది.

(Aphrodite Means – The Ancient Greek Goddess of Love and Beauty, Identified by the Romans with Venus).

వీనస్ దేవత ఆల్చిప్పలో పుట్టిందని వినడంతో మనకూ మన పురాణాల్లో లక్ష్మి పద్మంలో పుట్టడం, సీత పెట్టెలో, మండోదరి కప్పలో పుట్టడం వంటి గాథలు గుర్తుకు వస్తాయని రచయిత చెప్పడం జరిగింది.

ఇక్కడి మరో ప్రత్యేకత వీనస్ రాక్. దీనినే ప్రణయశిల (పెత్రోతో రోమియో) అంటారు. రోమియో, జూలియట్ ల కథ గ్రీకులదే. రోమియో అంటే ప్రేమ. ఇక్కడికి వచ్చే యాత్రికులు, ప్రేమికులు తమ కోరికలు తీరాలని సముద్రంలో స్నానాలు చేయడం, చెట్లకు ముడుపులు కట్టడం, రాళ్లమీద జంటల పేర్లు చెక్కడం వంటివి చేస్తుంటారు. ఇలాంటి నమ్మకాలు మనదేశంలో కూడా ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే మానవులంతా ఎక్కడున్నా ఒక్కటే అనిపిస్తుంది. నమ్మకాలు కూడా ఎవరికి తగ్గట్టు వారికి ఉంటాయి.

మనలాగే గ్రీకులకు కూడా సూర్యుడు దైవం. అక్కడ సూర్యున్ని "Appolo"[10] అంటారు. (The Greek and Roman god of Poetry, Medicine and light).

సైప్రస్ లో ఉన్న వివిధ రకాల చెట్లు, పండ్ల తోటలను గురించి చెప్పారు రచయిత. అందులో యాసెమి (Yaisemi) అనే పువ్వు (ఇది గ్రీకు పేరు) ఒకటి. దీన్ని పర్ ఫ్యూమ్ తయారీకి వాడుతారు. యాసమి నుండే జాస్మిన్ (Jasmine) అనే ఇంగ్లీష్ పదం పుట్టింది. కరూప్ పండ్ల నుండి తేనె తీస్తారు. Silver oak చెట్లు, ఆలివ్ చెట్లు, ద్రాక్షతోటలు, చెర్రీ పండ్ల తోటలు, క్రినోస్ నిక్రా (Pine trees), మిస్సల్ అనే రేగు పండ్ల లాంటి తోటలూ మొదలైనవి ఎన్నో ఉన్నాయి. ట్రూ డోస్ పర్వత శ్రేణి గురించి, Moufflon (A small wild sheep with chestnut – brown wool, found in mountainous country) అనే గొర్రెల గురించి చెప్పడం జరిగింది. పది సంవత్సరాలు కూడా నిల్వ చేసుకునే సైప్రస్ స్పెషల్ కమెండేరియో వైన్ (wine) ఇక్కడ ప్రత్యేకమైనది. ఇలాంటి ఎన్నో విశేషాలు సైప్రస్ యాత్రలో వివరించడం జరిగింది.

[10] నా సైప్రస్ యాత్ర – డా. ఎన్. గోపి – పేజి - 30

4.7.4 కాన్ఫరెన్స్ విశేషాలు:

సైప్రస్ లో యూనివర్సిటీ వి.సి ని "రెక్టార్"[11] (Rector) అంటారు. (Rector – The Head of certain universities, Colleges and Schools). ఈ వైస్ ఛాన్సలర్ సమావేశంలో ప్రధానంగా ప్రపంచీకరణ గురించి చర్చించడం ఇంకా యూనివర్సిటీలకు కొత్త బడ్జెట్ ను రూపొందించుకోవలసిన అవసరం, యూనివర్సిటీల మధ్య పెరుగుతున్న పోటీ, మెరుగైన విశ్వవిద్యాలయ నిర్మాణం గురించి, యూనివర్సిటీలకూ, సమాజానికీ మధ్య ఉండాల్సిన సంబంధాల గురించి చర్చించడం జరిగింది.

సైప్రస్ యూనివర్సిటీలో 4 పీఠాలు, 13 శాఖలున్నాయి. లలిత కళా పీఠాన్ని ఏర్పాటు చేయడం గురించి వారు ఆ సదస్సులో చర్చించారు. మనం లలితకళల వల్ల ప్రయోజనం ఏమిటని ఆలోచిస్తూ ఉంటే, అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం లలిత కళలను ఎంతో ప్రోత్సహిస్తున్నాయి.

ప్రపంచీకరణ వల్ల కొత్త ఆలోచనలు, స్వేచ్ఛా వాతావరణం, ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీలకు అవకాశం ఏర్పడినా ప్రపంచీకరణ వల్ల బలవంతులు మరింత బలవంతులైతే, బలహీనులు మరింత బలహీనులవుతారు. ప్రపంచీకరణ వల్ల స్వేచ్ఛా వ్యాపారం పెరిగి ఎగుమతుల కంటే దిగుమతులే ఎక్కువయ్యాయి. ఫలితంగా దేశి సరకులకు బదులు విదేశీ సరకులు ఎక్కువయ్యాయి. అందుకే గోపి ఒక నానీలో ఈ విధంగా అంటారు –

"అప్పుడు శతఘ్నులతో
ఇప్పుడు సరుకుల్తో
చైనా
చరిత్రకో నమస్కారం"[12]

చైనా వస్తువులు రాజ్యమేలి, వ్యాపారస్తులకు పెనుభూతంగా తయారయ్యాయి అంటారు. ఈ సదస్సులో భారతీయులుగా మనం గర్వించదగిన వ్యక్తి ప్రొ. సి.ఆర్. రావు గారికి గౌరవ డాక్టరేట్ ఇవ్వడం జరిగింది. పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీ (USA) లో భారతీయ గణాంక శాస్త్రవేత్త (Statistician) గా పనిచేశారు. ఈయనకు 23 డాక్టరేట్లు వచ్చాయి.

[11] నా సైప్రస్ యాత్ర – డా. ఎన్. గోపి – పేజి - 35

[12] గోపి కవిత్వం-II- (గోపి నానీలు) పేజి-361

400 పబ్లికేషన్స్, 14 గ్రంథాలు, 50 మంది డాక్టరేట్లకు పర్యవేక్షకుడిగా ఉన్నారు. భారతదేశం పద్మభూషణ్, పద్మవిభూషణ్ ఇవ్వడం జరిగింది. "Rao's Theroem"ను కనిపెట్టి Mathematical Statistics లో పేరుపొందిన ఈయన పేరు మీదుగా గౌరవార్థం ఒక రోడ్డుకు C.R. Rao Road పేరు పెట్టడం జరిగింది.

4.7.5 కవి హృదయం:

''రవి కాంచనిచో కవి గాంచున్'' అన్నట్లుగా కవి హృదయ నేత్రాలతో చూడని ప్రదేశమంటూ ఉండదు. దుబాయ్ ని రాత్రిపూట లైట్ల కాంతులతో చూసి వజ్రాల నవాబు సానిగా వర్ణించడం బాగుంది. ప్రయాణంలో అలసిపోయిన తనకు నిద్రొస్తుంది అని చెప్పడానికి నిద్ర రెప్పల్ని పట్టుకొని కిందికి లాగుతున్నట్లుగా కళ్లు బరువెక్కాయనీ, సన్నగా చినుకులు పడుతూ ఉంటే ''సిల్కు జేబు రుమాలుతో తుడుచుకున్నంత మృదువుగా వైపర్లు కదులుతున్నాయని వర్ణించడం కవి హృదయానికి నిదర్శనం. సముద్రంలోని అపురూప శిలలు సాల గ్రామాలను చూసి జీవిత సత్యాన్ని ఈ విధంగా చెప్పారు. ''జీవన ప్రవాహంలో దొర్లుతూ, దానికి ఒదుగుతూ ఎదురు తిరుగుతూ, తీర్చిదిద్దుకున్న సార్థక జీవితం నునుపెక్కిన జీవితానికి మరింత చలనశీలం''[13] కలుగుతుంది అంటారు. నీటి ప్రవాహంలో దొర్లుతూ ఒత్తిళ్లకు లోనవుతూ, రాళ్ల దెబ్బలు తింటూ, ఎత్తుల నుండి దూకుతూ లోయల్లో పాకుతూ దూరాన్నీ, కాలాన్నీ అనుభవించిన శిలలు సాల గ్రామాలు. ఎంతో కష్టాన్ని భరిస్తే గాని అంత నునుపుదనం రాదు. జీవితం కూడా అలాంటిదే.

సైప్రస్ విభజనలో భాగమైన గ్రీన్ లైన్ గోడను చూసి ''కూలిపోవాలి, కూలిపోవాలి'' అని మనసులో అనుకోవడం మానవత్వం ఉన్న కవిగా, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని కాంక్షించే కవి హృదయానికి నిదర్శనం. ప్రపంచంలో మిగిలి ఉన్న గోడలలో ఇదే చివరి గోడ కావాలి అనుకోవడంలో మనుషుల మధ్య, మనసుల మధ్య ఉన్న గోడల్ని కూలదోయాలనడం కూడా కవి దయా హృదయానికి నిదర్శనమే.

కవి తాను చూసిన వీనస్ స్థలాన్ని గూర్చి చెప్పిన కవిత ఇది –

''సముద్రం లోంచి
వీనస్ ను వింటున్నా

[13] నా సైప్రస్ యాత్ర – డా. ఎన్. గోపి – పేజి -32

అనంతాకాశం కింద
ఆ బండరాయి
తరాలుగా నిరీక్షిస్తున్నది
....
....
నీకో నమస్కారం!''[14]

చివరగా ఇంత గొప్ప ఆనందాల్ని, అనుభవాల్ని, అనుభూతుల్ని, మిగిల్చిన సైప్రస్ పై రాసిన కవితతో ఈ యాత్రను ముగించడం జరిగింది.

''ఆకాశం నుంచి
మధ్యధరా సముద్రంలో రాలిపడ్డ
స్వప్న బిందువులా వుంది సైప్రస్
....
....
సైప్రస్
సీకరి దీరియా
కరిస్తా''[15]

అని సైప్రస్ కు కృతజ్ఞతలు చెప్పడం జరిగింది. సైప్రస్ భాషలో సీకరిదీరియా అంటే అభినందనలు. కరిస్తా అంటే కృతజ్ఞతలు. ఇందులో రచయిత అక్కడి చారిత్రక ప్రదేశాలు, పండ్ల తోటలు, వీనస్ రాక్, వీనస్ దేవత వంటి విషయాలను గురించి ఎక్కువగా చెప్పారు. అక్కడి ఆహార అలవాట్లు, ఆచార వ్యవహారాలు, భాష, సంస్కృతి గురించి చెప్పి ఉంటే బాగుండేది. అయినా తాను చెప్పిన విషయాలతో పాటు పొందుపరిచిన ఛాయాచిత్రాలు (ఫోటో) లను చూస్తే ఈ యాత్ర గైడ్ లా, రెఫరెన్స్ బుక్ లా ఉండి చదువుతుంటే మనం చూసి వచ్చిన అనుభూతిని పొందుతాం.

[14] నా సైప్రస్ యాత్ర – డా. ఎన్. గోపి – పేజి -34

[15] నా సైప్రస్ యాత్ర – డా. ఎన్. గోపి – పేజి -71

4.8 అమెరికాలో తెలుగు యాత్ర:

సంస్కృతి (Society for Indian Perferming Arts) వారు మూడు రోజులు నిర్వహించే ప్రథమ ఉత్తర అమెరికా అంతర్జాతీయ నాటక సదస్సు (సెప్టెంబర్ 1,2,3 తేదీలు – 2002) మరియు ''సప్న'' (Sree Annamacharya Project of North America) వారు ఆహ్వానించడంతో అక్కడి తెలుగువారికి కూచిపూడిని గురించి వివరించడానికి రచయిత వెళ్ళడం జరిగింది. తెలుగు విశ్వవిద్యాలయం వి.సిగా ఉన్నప్పుడు కూచిపూడి నృత్యం అభివృద్ధికి చేసిన కృషికి గుర్తింపు ఇది. హైదరాబాద్ నుండి ముంబాయి, ముంబాయి నుండి లండన్, లండన్ నుండి చికాగోకు 8 గంటల ప్రయాణం.

అమెరికా పెట్టబడిదారీ మరియు సంపన్న దేశం. అమెరికాను ముందుగా ''అమెరిగో విస్పూచి'' (Amerigo Vespucci) అనే స్పానిష్ దేశస్థుడు కనుగొన్నాడు. ఇతని పేరు మీదే అమెరికా అనే పేరు వచ్చింది. అమెరికాకు రెండు రాజధానులు ఉన్నాయి. న్యూయార్క్ ఆర్థిక రాజధాని. వాషింగ్టన్ రాజకీయ రాజధాని. మన ఢిల్లీ, ముంబాయి ల్లాగా. వాషింగ్టన్ 1814 ఫోటో మ్యాక్ నదీ తీరంలో నిర్మించబడింది. న్యూయార్క్ ఐదు బరోల సమూహం. బరోస్ అంటే శకలాలు అని అర్థం. Bronx, Brooklyn, Queens, Stalen Island, Manhattan అనే ఐదు ప్రాంతాల సమూహం న్యూయార్క్. ఈ అయిదు ప్రాంతాలకు అయిదుగురు మేయర్లు ఉంటారు. అమెరికాలో తొలి తెలుగు మేయర్ చివుకుల ఉపేంద్ర.

4.8.1 అమెరికన్ల మనస్తత్వం:

పోటీ తత్వం ఎక్కువ. ఏదైనా సాధించి తీరుతాం అనే ఆత్మవిశ్వాసం, గెలుపు కోసం శ్రమించే మనస్తత్వం, స్వీయ వ్యక్తిత్వంతో పాటు ధైర్యం ఎక్కువ. వేగంగా పరిగెత్తి ప్రపంచాన్నంతా జయించాలనే ఆరాటం వీరిది. ఫలితాలను ఆశించి పనులు చేస్తారు. వీరు మతవాదులు కారు. కానీ దేవుడిపై నమ్మకం ఎక్కువ. ఇక్కడ 200 కుటుంబాలకు ఒక చర్చి ఉంటుంది. ఇక్కడ పిల్లల్ని కొట్టడం నేరం. క్రమశిక్షణతో కూడిన జీవితం వీరిది. ఇంటి ముందు ఉండే గార్డెన్ ను రోజూ ట్రిమ్ చేయకపోతే పొరుగువారు తమ ఆవరణ అందవిహీనంగా కన్పిస్తుందని మున్సిపాలిటీ వారి దృష్టికి తెచ్చి జరిమానా విధింపచేస్తారు. స్వతంత్రంగా జీవించాలనే మనస్తత్వం కలవారు కాబట్టే ఒక వయసు రాగానే పిల్లలు తల్లిదండ్రులతో ఉండడానికి ఇష్టపడరు. తండ్రి దగ్గర అప్పు తీసుకున్నాసరే వడ్డీతో తిరిగి ఇచ్చేస్తారు.

ఆహారపు అలవాట్లు:

బాగా ఒళ్లు చేసే పాల పదార్థాలు, చీజ్, బట్టర్ వంటివి ఎక్కువగా తీసుకుంటారు. నీళ్లలో మంచుగడ్డలు వేసి తాగుతారు.

4.8.2 అమెరికా విశేషాలు:

అమెరికన్ల జీవనవిధానంలోనే కాక మాటలలో కూడా ప్రత్యేకత ఉంటుంది. Petrol ను Gas అనీ, Lift ను Elevator అనీ, Toilets ను Restrooms అనీ అంటారు. అమెరికన్లలో ఇండియన్లను వ్యతిరేకించేవారు కూడా ఉన్నారు. ఇక్కడ జాతి వివక్ష ఎక్కువే. ఈ విధంగా వ్యతిరేకించే వారిని "హిస్పాక్స్" (Hispasics) Asian Americans అంటారు. అక్కడ స్పానిష్ వాళ్ళు, పుర్టోరికో ద్వీపం (Purtorico Island) వారు, క్యూబన్లు, నీగ్రోలు ఇండియన్లను ద్వేషిస్తారు. అక్కడి తెల్లవారు "White is right, White is might" అని తమకు తాము భావించుకుంటారు. (Might – The Power, Authority). కాబట్టే మనవారు వాళ్ళని చర్మంతో గాక మేధస్సుతో గెలుచుకున్నారంటారు రచయిత. అమెరికా, రష్యా, చైనా అర్థికంగా బలమైన దేశాలు. ఇవి ప్రపంచగమనాన్నీ, గమ్యాన్నీ నిర్దేశించే స్థాయిలో ఉన్నాయి. అమెరికా చరిత్ర తక్కువే. కానీ ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగింది. అమెరికా ధనహంకార దేశం కానీ ఇక్కడ నైపుణ్యం లేనివారైనా బ్రతకడానికి ఎలాంటి లోటూ ఉండదు. ఇక్కడ భిక్షమడుక్కోవడం నేరం, నిషేధం. అమెరికన్లకు వ్యాపార సంపదతో పాటు, ప్రకృతి సంపద కూడా పుష్కలంగా ఉంది. ప్రకృతి బీభత్సాలు ఎక్కువే. కానీ జననష్టం తక్కువగా ఉంటుంది. వాతావరణం వేడికీ, చలికీ ఒకేలా ఉండడానికి ఇక్కడ ఇళ్ళను చెక్కతో కడుతారు. అమెరికాలోని St. Lukas Hospitals సముదాయం ప్రపంచంలోనే అతిపెద్ద మెడికల్ సెంటర్. దీనిలో 1 లక్షా 18,000 మంది ఉద్యోగులు ఉన్నారు. ఎన్.టి.రామారావు, మాజీ ప్రధానులైన పి.వి. నరసింహారావు, ఐ.కె. గుజ్రాల్ లకు బైపాస్ ఆపరేషన్ లు ఇక్కడే జరిగాయి.

ఉద్యోగాల గురించి చెప్పాలంటే అక్కడ ప్రొఫెసర్లకూ, సుప్రీం కోర్టు జడ్జీలకు పదవి విరమణ ఉండదు. ఓపిక ఉన్నన్నాళ్లు పని చేసుకోవచ్చు. అమెరికా అధ్యక్షులు పదవీ విరమణ తర్వాత కూడా వారి పేర్లతో సెంటర్లను ఏర్పాటు చేసి వారు చేసిన సేవకు గౌరవాన్ని ఇస్తారు. జిమ్మీ కార్టర్ సెంటర్, కెన్నెడీ సెంటర్, నిక్సన్ సెంటర్లు అలా ఏర్పాటు చేసినవే.

4.8.3 అమెరికా – రోడ్డు వ్యవస్థ:

అమెరికా టాక్స్ ల దేశం. పక్కా వాణిజ్యదేశం. కార్లు కూడా ఎక్కువగా ఉంటాయి. కార్లలో ఎక్కువ దూరం ప్రయాణించేటప్పుడు మధ్య మధ్య విశ్రాంతి భవనాలుంటాయి. కొన్ని మైళ్ళకోసారి ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర డబ్బులు వేస్తేనే దారి తెరుచుకుంటుంది. ఇది రోడ్డు పన్ను. ఇండియాలో ఉన్న టోల్ గేట్లలాంటివే ఇవి. ఇలా వచ్చిన డబ్బుతో రోడ్లను బాగు చేస్తారు. అందుకే రోడ్లు అంత అందంగా ఉంటాయి.

4.8.4 అమెరికా – సందర్శన స్థలాలు:

అమెరికాలో జాతుల వైరాన్ని తగ్గించి ప్రపంచాన్ని శాసించే స్థితికి చేర్చిన అబ్రహం లింకన్ పుట్టిన రాష్ట్రం ఇల్లినాయిస్, నవ దంపతుల రాజధాని నయాగరా పట్టణం. (Honeymoon Capital of the world) గా ప్రసిద్ధి చెందింది. నయాగరా జలపాతానికి ఒకవైపు అమెరికా మరొక వైపు కెనడా ఉంటాయి. ఈ రెండింటి మధ్య రెయిన్ బో బ్రిడ్జ్ (Rainbow Bridge) ఉంటుంది. కెనడా నుండి నయాగరాను మొత్తంగా చూడవచ్చు. కానీ వీసా తీసుకోవాల్సి ఉంటుంది. నయాగరా జలపాతం దూకే కొండ ''గుర్రపు డెక్క'' ఆకారంలో ఉంటుంది. దీన్ని Horse Shoe అంటారు. ఈ విషయాన్నే డా. దాశరథిగారు 1978లో తాను రాసిన ''అమెరికా సందర్శనం''లో కూడా ప్రస్తావించారు. 1905లో సాపేక్ష సిద్ధాంతాన్ని కనిపెట్టి, 1930లో నోబెల్ ప్రైజ్ పొందిన ఐన్ స్టీన్ పని చేసిన ప్రిన్స్ టన్ యూనివర్సిటీ చూడదగ్గ ప్రదేశాల్లో ఒకటి.

న్యూయార్క్ లోని ఐక్యరాజ్య సమితి (UNO) ఆవరణలో సుత్తెతో కత్తిని విరగ్గొడుతున్న కార్మికుడి విగ్రహం ఉంటుంది. ఆ విగ్రహం కింద ఈ విధంగా రాసి ఉంటుంది.

> "We shall beat our Swords
> Into ploro sttares''[16]

అమెరికన్లకు ప్రతిష్ఠాత్మకమైన వాటిలో 110 అంతస్తుల వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఒకటి. దీనిలో ఎన్నో ప్రముఖ కంపెనీలున్నాయి. ప్రపంచ ప్రసిద్ధ బ్యాంకింగ్ ప్రధాన కార్యాలయాలన్నీ ఉన్న Wall Street Centre, న్యూయార్క్ స్టాక్ ఎక్స్చేంజ్ (Economic Power of America) ప్రముఖమైనవి. అమెరికా గడ్డపై భారతీయులు గర్వించేట్లుగా ముద్ర వేసిన వారు

[16] అమెరికాలో తెలుగుయాత్ర డా. ఎన్. గోపి – పేజి-91

గాంధీజీ, వివేకానందుడు. ఇందుకు నిదర్శనం అక్కడ వారి పేర్లపై రహదారులు ఉండడమే. దీవాన్ ఎవెన్యూ (Devon Avenue) లో గాంధీమార్గ్ ఉంటుంది. ఈ దారిలో అన్నీ భారతీయ దుకాణాలు, హోటళ్లూ ఉంటాయి. ప్రపంచ తాత్వికులందరినీ ఆకర్షించే ఉపన్యాసాలు చేసినందుకు చికాగోలో వివేకానందుడి పేరుతో రహదారిని ఏర్పరిచారు.

1969 లో మొదటిసారిగా చంద్రుడిపై అడుగిడిన నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ వెళ్లిన రాకెట్ అపోలో –II నిజమైన దాన్నే మనం స్పేస్ మ్యూజియంలో చూడవచ్చు. అమెరికాలో మొత్తం 50 రాష్ట్రాలు ఉంటే, ఈ యాత్రలో రచయిత వివిధ సందర్భాలలో 12 రాష్ట్రాల ప్రస్తావన చేశారు.

4.8.5 అమెరికాలో తెలుగు అభివృద్ధి – తెలుగువారి కృషి:

1957 లో అమెరికా వచ్చిన తొలి ప్రవాసి ప్రొఫెసర్ దువ్వూరి అనంత అచ్యుత సత్యనారాయణ రావు. రోడ్డు ప్రమాదంలో మరణించిన తన భార్య పేరుతో దువ్వూరి శారదాంబ స్మారక కథల పోటీలను నిర్వహిస్తూ కొన్ని తెలుగు పత్రికలను నడిపారు. ప్రొ. పెమ్మరాజు వేణుగోపాలరావు 1970లో ''తెలుగు భాషా పత్రిక'' అనే త్రైమాసిక పత్రికను నిర్వహించారు. 1970లోనే న్యూయార్క్ లో తెలుగు సంఘాలు ప్రారంభమయ్యాయి. 1974లో ప్రవాసాంధ్రులు తెలుగు స్కూలును ఏర్పాటు చేసి తెలుగు అభివృద్ధికి కృషి చేశారు. 1978లో తెలుగు సాహితీ సాంస్కృతిక సంస్థ ''తెలుగు వెలుగు'' పత్రికను న్యూయార్క్ నుండి వెలువరించింది. 1984లో ''తెలుగు జ్యోతి'' పత్రిక కిడాంబి రఘునాథ్ సంపాదకత్వంలో వెలువడింది. అక్కడ 80శాతం తెలుగు కుటుంబం పిల్లలు నాట్యం నేర్చుకుంటున్నారు. తెలుగు భాష, సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవడానికి అక్కడి తెలుగు వారు బాగా కృషి చేస్తున్నారు అన్న సంతృప్తితో తన దేశం మీద మమకారంతో తిరుగు ప్రయాణమయ్యారు ఆ సందర్భంలో–

''అమెరికాలో నన్ను/ఎక్కువగా ఆకర్షించినవి/ఎగ్జిట్ బోర్డులే! వాటిని చూసినప్పుడల్లా/ ఇండియా పిలుస్తున్నట్టుగా ఉంటుంది.''[17] అంటారు.

4.9 ఇంగ్లండులో ఇరవై ఐదు రోజులు:

ఇది గోపి గారి నాలుగవ యాత్రా చరిత్ర. ఇంగ్లండు చూడాలనేది వీరి చిరకాల స్వప్నం. కాబట్టే మిగతా వాటికన్నా ఈ రచన చేయడం ఎక్కువ సంతృప్తినిచ్చింది అంటారు రచయిత.

---

[17] రాతి కెరటాలు – డా. ఎన్. గోపి – పేజి -80.

ప్రపంచం మొత్తం మీద ఏదో ఒకరకంగా తన ముద్ర వేసిన దేశం ఇంగ్లండ్. దీనికి ఎంతో చరిత్ర ఉంది. ఈటా (European Telugu Association) వారు ఆహ్వానించడంతో 2003, సెప్టెంబర్ 27, 28 లలో జరిగే ఈటా దశాబ్ది ఉత్సవాలకు కవిగా, సాహితీవేత్తగా గోపిగారు వెళ్ళడం జరిగింది. లండన్ లోని నెహ్రూ సెంటర్ లో "The European Perspective of Vemana; The renowned of Telugu Poet" అనే అంశంపై రచయిత ఉపన్యసించారు.

ఇంగ్లండ్ లో లండన్ పెద్ద నగరం. రెండోది బర్మింగ్ హ్యాం, మూడోది మాంచెస్టర్, ఇంగ్లండ్ లో జిల్లాలను కౌంటీ, షైర్ అంటారు. ఇంగ్లండ్ అభివృద్ధిలో జలరవాణా ఎంతో ఉపయోగపడింది. బర్మింగ్ హ్యాం ఊరినిండా కాలువలతో పల్లెటూరులా ఉంటుంది. ఇక్కడ ఇళ్ళన్నీ ఒకే రకంగా పింక్ కలర్ గోడలు, పెంకులతో మన జయపూర్ (పింక్ సిటీ)లా ఉంటుంది.

4.9.1 ఇంగ్లండ్ – రోడ్డు వ్యవస్థ:

ప్రపంచంలోనే అతిపెద్ద రింగురోడ్డు ఇంగ్లండ్ లోని Long Orbital Road 125 మైళ్ళ పొడవుంటుంది. రోడ్లు ఏ క్లాస్ అనీ, బిక్లాస్ అనీ విభజించి ఉంటాయి. ఏ క్లాస్ లో ట్రాఫిక్ లైట్లు వేరుగా ఉండి 30, 40 మైళ్ల కంటే వేగంగా వెళ్లకూడదు. బి క్లాస్ రోడ్లు పల్లెల మీదుగా వెళ్తాయి. నీలిరంగు సూచికలుంటే అవి మోటారు దారులుగా వేరు చేయడం జరిగింది. ఇంగ్లండ్ లో జాతీయ వేగపరిమితి 70 మైళ్ళు. కార్లు ఎక్కువగా ఉండడంతో పార్కింగ్ కు స్థలం దొరకడం కష్టం. కారులో పెట్రోల్ ను ఎవరికి వారే పోసుకోవాలి. స్లిప్పు వస్తే డబ్బు కట్టే విధానం ఉంది. లీటరు పెట్రోలు 80 పెన్నీలు. అక్కడ రోడ్ల మరమ్మత్తు విషయంలో, ట్రాఫిక్ విషయాల్లో చాలా ఖచ్చితంగా ఉండి జాగ్రత్తలు పాటిస్తారు. కాబట్టి అక్కడ రోడ్డు ప్రమాదాలు తక్కువ.

4.9.2 ఇంగ్లండ్ ప్రజల మనస్తత్వం:

ఇంగ్లీష్ వారికి, అమెరికన్లకి ప్రవర్తనలో భేదం ఉంటుంది. మర్యాద, వినయం ఇంగ్లీష్ వారిలో కన్పిస్తాయి. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం వీరిది. అమెరికా వారు ప్రతి

దానికి మేం గ్రేట్ అంటారు. అందుకే బెర్నార్డ్ షా "If I cant play drums, why others should play it"[18] అన్నాడు వ్యంగ్యంగా.

క్రీడ:

రగ్బీ ఆటను ఇంగ్లండ్ వారే కనిపెట్టారు. అక్కడ రగ్ బీ పేరుతో పబ్లిక్ స్కూలు కూడా ఉంది. ఈ స్కూల్ వారే 1845లో రగ్బీ ఆట చట్టాలను తయారు చేశారు. 19వ శతాబ్దం ప్రారంభంలో ఈ ఆటను కనుగొన్నారు. 1871లో రగ్బీ ఫుట్ బాల్ అంతర్జాతీయ ఆట మొదటిసారి మార్చి 27, 1871లో స్కాట్లాండ్ మరియు ఇంగ్లండ్ దేశాల మధ్య జరిగింది. ఇందులో స్కాట్లాండ్ గెలిచింది.

4.9.3 ఇంగ్లండ్ రచయతలు:

పాశ్చాత్యులలో పేరుపొందిన ప్రముఖ కవులు చాలామంది ఇంగ్లాండ్ వారే. వారు పుట్టిన ప్రదేశాలను చూస్తూ, వారు రాసిన రచనలను నెమరువేస్తూ, వారి మనస్తత్వాలను రచయిత ఈ యాత్రలో మనకు అందించారు. ఇంగ్లండ్ ప్రజలకు, పాలకులకు అక్కడి కవుల పట్ల అపారమైన ప్రేమ, గౌరవం ఉంది అని చెప్పడానికి నిదర్శనం, వారి పేర్లనే ఊరు పేర్లుగా పెట్టడం. షేక్ స్పియర్ పుట్టిన ఊరు అపాన్ ఏవన్ నదీతీర పట్టణం వ్యారిక్ షైర్ (Warwick Shire). దీనికి షేక్స్పియర్ జిల్లా అని పేరు పెట్టారు. వేల్స్ లోని స్వాన్ సీ (Swan Sea) అనే పట్టణంలో డిలాన్ థామస్ అక్టోబరు 12, 1914లో జన్మించి 1953లో చనిపోయాడు. థామస్ పుట్టిన ఊరులో అతని గురించి ఒక మ్యూజియాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. మానవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన 18వ శతాబ్దానికి చెందిన డార్విన్ 500 ఏళ్ళనాటి శ్ర్యూస్ బరీ (Shrews Burry) అనే ఊరిలో జన్మించాడు. డార్విన్ చదివిన స్కూలుకు ఆయన పేరు పెట్టి, దానిలో ఇప్పుడు లైబ్రరీని నిర్వహిస్తున్నారు. మాడర్న్ పెయింటర్స్, ది సెవెన్ ల్యాంప్స్ ఆఫ్ ఆర్కిటెక్చర్ లాంటి గ్రంథాలు రచించిన రస్కిన్ 1819 లండన్ లో జన్మించాడు. ఈయన ''జీవం కంటే పెద్ద సంపద లేదు (There is no wealth but life) మనం దేన్నైనా ఉత్పత్తి చేయొచ్చు, మనిషిని తప్ప''[19] (We manufacture everything except man) అని పెట్టుబడిదారీ వ్యవస్థను వ్యతిరేకించాడు.

[18] ఇంగ్లండ్ లో ఇరవై ఐదు రోజులు – డా. ఎన్. గోపి – పేజి – 100.

[19] ఇంగ్లండ్ లో ఇరవై ఐదు రోజులు – డా. ఎన్. గోపి – పేజి – 77.

విలియం వర్డ్స్ వర్త్ లేక్ జిల్లా కాకర్ మత్ (Cockermouth) అనే ఊరిలో 1770లో పుట్టి 1850లో చనిపోయాడు. వర్డ్స్ వర్త్, కాలరిడ్జ్ ఇద్దరు కవులు స్నేహితులు. వీరిద్దరూ లేక్ జిల్లాలోనే నివసించారు. ఇద్దరూ కలిసి లిరికల్ బ్యాలెడ్స్ (Lyrical Ballads) సంకలనం వేసి, ముందుమాట (Preface) కలిసే రాశారు. ఇది రొమాంటిక్ కవిత్వోద్యమానికి మానిఫెస్టో లాంటిది. కీట్స్ లండన్ లోని హ్యామ్ స్టెడ్ (Hamstead) లో జన్మించాడు. ఇలాంటి ఎందరో గొప్ప కవులను అందించిన దేశంగా ఇంగ్లండ్ ఖ్యాతి చరిత్రలో నిలిచిపోతుంది.

4.9.4 ఇంగ్లండ్ వింతలు – విశేషాలు:

ఇంగ్లండ్ లో కొండలు ఉండవు. అందుకే అక్కడ రాతి విగ్రహాలుండవు. అన్నీ కాంస్య విగ్రహాలే. తుమ్మచెట్లు, వేపచెట్ల జాతి లేదు. ఇక్కడ ఉద్యావనాలు ఎక్కువగా ఉంటాయి. ఈ విషయాన్ని రచయిత తన కవి హృదయంతో "ఇక్కడ ఎవరినైనా రాళ్ళతో కొట్టాలంటే కష్టమే. పూలతో కొట్టొచ్చు"[20] అంటారు. అక్కడి పచ్చదనాన్ని చూసి హైదరాబాద్ ను గుర్తు చేసుకుంటూ "ఊపిరితిత్తులు లేకుండా బతుకుతున్న మనిషిలా ఉంది హైదారాబాద్"[21] అంటారు రచయిత. జనారణ్యమైన నగరం పచ్చదనాన్ని కోల్పోయి ఎక్కడ చూసినా భవనాలే కన్పిస్తాయన్నారు.

ఇంగ్లండ్ వారికి చారిత్రక స్పృహ ఎక్కువ అనడానికి సాక్ష్యంగా అక్కడి షాపులపై, ఇళ్ళపై ప్రారంభించిన కట్టిన తేదీలుండటమే. ఇక్కడ సుప్రీంకోర్టు ఉండదు. సివిల్ కోర్టులే హైకోర్టులు. వీటిని రాయల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ అంటారు. వీటిలో ఓడిపోతే హౌజ్ ఆఫ్ లార్డ్స్ కు అప్పీలు చేసుకోవాలి. అదే అన్నింటికంటే పెద్దకోర్టు. సర్దార్ పటేల్, గాంధీజీ ఈ కోర్టుల్లోనే తర్ఫీదు పొందారు. ఇక్కడ హాస్పిటల్ ను 'ఇన్ ఫర్మనీ' అంటారు. ఇక్కడ లేక్ జిల్లాలో రెండు పక్కల రాళ్లతో కట్టిన ఇల్లులే ఉంటాయి. ఈ ఇళ్ళను చూసి రచయితకు తాండూరు గుర్తుకు వచ్చింది. రంగారెడ్డి జిల్లాలోని తాండూరు బండల పరిశ్రమకు ప్రసిద్ధి. ఇక్కడ బండలతో కట్టిన ఇళ్ళు ఎక్కువ. ఎక్కడో పరాయి దేశంలో ఉండికూడా తన దేశాన్ని గుర్తుకు తెచ్చుకోవడంలో రచయితకు స్వదేశంపై ఉన్న మమకారం తెలుస్తుంది. ఇంగ్లండ్ ప్రభుత్వం వృద్ధులకు వారానికి 20 పౌండ్లు సాంఘిక భద్రతలో భాగంగా ఇస్తుంది. వలస పౌరులనుండి 45శాతం పన్ను వసూలు చేసి ఆ డబ్బును ఈ విధంగా ఉపయోగిస్తారు. రస్సెల్ స్క్వేర్ ప్రదేశంలో ఉన్న లండన్

---

[20] ఇంగ్లండ్ లో ఇరవై ఐదు రోజులు – డా. ఎన్. గోపి – పేజి – 38.

[21] ఇంగ్లండ్ లో ఇరవై ఐదు రోజులు – డా. ఎన్. గోపి – పేజి – 103.

యూనివర్సిటీలో బ్రిటీష్ లైబ్రరీలో బ్రౌన్ అనువాదం చేసిన వేమన పద్యాల మొదటి ముద్రణ గోపిగారికి ఇక్కడే దొరికింది.

ఇంగ్లండ్ లో షాపులు అందంగా, ఆకర్షణీయంగా అమర్చి ఉంటాయి. అందుకే ఇంగ్లండ్ ను గురించి నెపోలియన్ "Nation of Shopkeepers"[22] అన్నాడు. లండన్ ను బ్యాండ్ ఆఫ్ థియేటర్స్ (Band of Theatres) అంటారు. ఇక్కడ 100కు పైగా నాటక శాలలున్నాయి. ఇప్పటికీ అక్కడ వీధి నాటకాలు (Street Play) ఆడుతారు. ప్రపంచంలోనే అతి పెద్ద పాత పుస్తకాల ఊరు "హే ఆన్ వై" (Hay on wye) ఇంగ్లండ్ లో ఉంది. ఇలా థేమ్స్ నది, విక్టోరియా, ఆల్బర్ట్ మ్యూజియాలు, బకింగ్ హాం ప్యాలెస్ మొదలైనవి ఎన్నో ఇంగ్లండ్ లో చూడదగ్గ ప్రదేశాలున్నాయి.

4.9.5 ఆక్స్ ఫర్డ్ – ఆణిముత్యాలు:

ఇంగ్లండ్ లో ప్రసిద్ధి చెందిన యూనివర్సిటీ ఆక్స్ ఫర్డ్. థేమ్స్ నదికి ఉపనది అయిన ఓక్స్ అనే నదిపై వెలసిన పోర్ట్ (రేవు) ఆక్స్ ఫర్డ్. దీన్ని క్రీ.శ. 1240లో స్థాపించారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీ కూడా క్యామ్ అనే నదిపై నిర్మించిన బ్రిడ్జి ప్రాంతం. కింగ్స్ జేమ్స్ –I "నేను రాజును కాకుండా ఆక్స్ ఫర్డ్ వాడిని"[23] అనిపించుకోవడానికి ఇష్టపడుతాను అనడంతోనే ఈ యూనివర్సిటీ గొప్పతనం తెలుస్తుంది.

కీట్స్, షెల్లీ, రిచర్డ్, బర్డన్, సామ్యూల్ జాన్సన్ (నిఘంటుకారుడు), అలెగ్జాండర్ పోప్, షేక్స్ స్పియర్, వర్డ్స్ వర్త్ కేంబ్రిడ్జి వాడైనా ఆక్స్ ఫర్డ్ పై ఓ పద్యం రాశాడు. జాన్ డన్, స్విన్ బర్న్, జాన్ మాస్ ఫీల్డ్, ఆడెన్, స్టీఫెన్ స్పెండర్, టి.ఎస్. ఇలియట్, డిలాన్ థామస్ వంటి గొప్ప మేధావులు ఆక్సోనియన్లే. ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలో చదివిన వారిని ఆక్సోనియన్లు అంటారు.

ఇందిరాగాంధీ, జుల్ఫీకర్ అలీ భుట్టో, ఈయన కూతురు బేనజీర్ భుట్టో ఇక్కడే చదివి స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్ గా ఎన్నికైంది. 47 మంది బ్రిటీష్ ప్రధానమంత్రుల్లో 27 మంది, 20 మంది వైస్రాయిల్లో పనిచేసిన 10 మంది ఆక్స్ ఫర్డ్ వారే. ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీకి ఛాన్సలర్ గా పనిచేయడాన్ని ఎంతో గౌరవంగా భావిస్తారు. బ్రిటిష్ ప్రధానమంత్రి హెరాల్డ్ మ్యాక్ మిలన్ పదవీ విరమణ తర్వాత ఆక్స్ ఫర్డ్ ఛాన్సులర్ అయ్యాడు. బ్రిటన్ ఆర్థికమంత్రి

---

[22] ఇంగ్లండ్ లో ఇరవై ఐదు రోజులు – డా. ఎన్. గోపి – పేజి – 36

[23] ఇంగ్లండ్ లో ఇరవై ఐదు రోజులు – డా. ఎన్. గోపి – పేజి – 60.

రాయ్ జెన్ కీన్స్ కూడా ఛాన్సలర్ గా చేశారు. భారత సంతతి వాడైన నైపాల్ (ది లాస్ట్ స్టేట్) రచయిత, నోబెల్ ప్రైజ్ విజేత ఆక్స్ ఫర్డ్ వాడే. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఇక్కడ తత్వశాస్త్రం బోధించాడు. ఆక్స్ ఫర్డ్ డిగ్రీకి ఎంత గౌరవం అంటే ఎం.ఏ అని బ్రాకెట్లో ఆక్సన్ అని రాసుకుంటారు.

ఒత్తిళ్ళకు లొంగకుండా స్వతంత్రంగా వ్యవహరించడంలో కూడా ఆక్స్ ఫర్డ్ దే పైచేయి అని చెప్పడానికి ఉదాహరణ– బ్రిటీష్ మాజీ ప్రధాని మార్గరెట్ థాచర్ ఆక్స్ ఫర్డ్ లో చదివింది. కాబట్టి ఆమెకు గౌరవ డాక్టరేట్ ఇవ్వాలనే ప్రకటన వచ్చింది. కానీ థాచర్ ప్రధానిగా ఉన్నప్పుడు ''పోల్ ట్యాక్స్''[24] (ఇంట్లో వ్యక్తుల సంఖ్యను బట్టి ట్యాక్స్) విధించడం అనేది యూనివర్సిటీ మేధావులకు నచ్చక డాక్టరేట్ ఇవ్వడానికి నిరాకరించారు. ఇలా స్వతంత్రంగా, నిజాయితీగా విధి నిర్వహణ చేయడం వల్లే ప్రపంచంలోనే మొదటిస్థానంలో నిలిచింది ఈ యూనివర్సిటీ. ఇంగ్లండ్ లోని విశేషాలు, ప్రసిద్ధ ప్రాంతాలు, అక్కడి రచయితలు, అక్కడి ప్రజల మనస్తత్వాల గురించి చెప్పిన రచయిత భారతదేశం పట్ల అక్కడి వారి అభిప్రాయాలు కూడా చెప్పి ఉంటే బాగుండేది. ఇంగ్లండ్ ప్రజల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు వంటి విషయాలను కూడా ప్రస్తావించి ఉంటే ఈ యాత్ర సంపూర్ణంగా ఉండేది. కవి ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా రాసిన కవితలన్నింటినీ ''మరో ఆకాశం'' పేరుతో పుస్తకంగా తేవడం జరిగింది. దీన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు జి.కె. సుబ్బారాయుడు, సి. విజయశ్రీ 'Another Sky' పేరుతో ఇంగ్లీషులోకి అనువదించారు.

ఈ విధంగానే ఆవంత్స సోమసుందర్ గారు కూడా తన ఇంగ్లండ్ యాత్రను గురించి ''ఆంగ్లసీమలో ఆమని వీణలు'' అని కవితల రూపంలోకి తెచ్చారు. ఈ విధంగా గ్రంథకర్తకు కవి హృదయం, కళాహృదయం ఉండడం ఈ రచనకు బాగా ఉపయోగపడింది.

4.10 జర్మనీలో కవితాయాత్ర:

మారిషస్, సైప్రస్, అమెరికా, ఇంగ్లండ్ దేశాల్లో పర్యటించిన గోపిగారు జర్మనీ యాత్ర కూడా చేసి అక్కడి విశేషాలను పాఠకులకు అందించడం జరిగింది. ఎన్ని దేశాలు తిరిగినా స్వదేశంపై తనకున్న అభిమానాన్ని ప్రేమను చెప్తూ–

---

[24] ఇంగ్లండ్ లో ఇరవై ఐదు రోజులు – డా. ఎన్. గోపి – పేజి – 62.

''ఖండాంతరాలు
ప్రయాణించాను
గాలిలోనే మార్పు
ఆత్మలో తేడా లేదు''[25]

అంటూ గాలిలో మార్పు వస్తుందే కానీ తన ఆత్మ భారతీయతను మరిచిపోదు. నేడు ప్రపంచం ఎంతో మారిపోయింది. దాంతోపాటు వేగమూ, ఆగమూ పెరిగాయంటారు కవి. ఈ యాత్రను కవి ''ఇక్కడి మేఘాలు కొత్తవి / నేలమీది నీడలకు మొలిచిన / గొడుగుల్లా వున్నాయి'' అంటూ ''కొత్తమేఘాలు'' కవితతో ప్రారంభిస్తారు.

డిల్లీ నుంచి వియన్నా, వియన్నా నుంచి ఫ్రాంక్ ఫర్ట్, ఫ్రాంక్ ఫర్ట్ నుండి హ్యాంబర్గ్ వరకు మూడు విమానాలలో 16 గంటలు ప్రయాణం చేసి జర్మనీ చేరుకున్నారు.

4.10.1 జర్మనీ రాజధాని బెర్లిన్:

జర్మనీలో అన్ని నగరాలకన్నా పెద్దది బెర్లిన్. ఐరోపా సమాఖ్యలో ఎక్కువ జనాభా కలిగిన ఏడో నగరం బెర్లిన్. స్ప్రీ (Spree) నదీ తీరాన నిర్మించబడింది. 1701 నుండి 1918 వరకు ప్రష్యా రాజ్యానికి ముఖ్యపట్టణం బెర్లిన్. ఇక్కడ నాజీల ఆధిపత్యం 1933, 1945ల వరకు సాగింది. బెర్లిన్ లో నాస్తికుల సంఖ్య ఎక్కువే. అయినా చర్చిలు, మసీదులు ఎక్కువగా ఉన్నాయి. భారతీయుల సంఖ్య తక్కువ. కాబట్టి దేవాలయాలు కన్పించవు. అక్కడి పాఠశాలల్లో జర్మన్ భాషా మాధ్యమంలోనే చదువు చెప్తారు. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో దినపత్రికలు వెలువడే ప్రదేశం బెర్లిన్. ఇక్కడ గే-లెస్బియన్ క్లబ్బులుండడం వింత. ఇక్కడ సామాజికపరంగా గానీ, చట్టపరంగాగానీ స్వలింగసంపర్కం నేరం కాదు. 153 మ్యూజియాలతో ఉన్న బెర్లిన్ ను మ్యూజియాల నగరంగా పిలుస్తారు. బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ లు 1949లో జర్మనీని ఆక్రమించుకొని పశ్చిమ భాగాన్నీ, సోవియట్ యూనియన్ తూర్పుభాగాన్ని పంచుకున్నాయి. ఈ రెండు దేశాల మధ్య 1961లో బెర్లిన్ గోడ కట్టారు. ఎన్నో సంఘర్షణల తర్వాత 1989లో దాన్ని కూల్చివేయడం జరిగింది. దీన్ని గురించి కవి–

[25] గోపి కవిత్వం – II - డా. ఎన్. గోపి – పేజి - 307

''ఇది మనుష్యుల మధ్య కసితో లేపిన
యెడబాటు నీడ
కన్నీళ్ళతో తడిపి నింపిన
పునాది జాడ''[26]

అంటూ బాధపడ్డారు కవి.

బెర్లిన్ లో 150 నాటకశాలలున్నాయి. ఇక్కడ రోజూ ప్రదర్శనలుంటాయి. ఇవి రెండో ప్రపంచ యుద్ధకాలంలో ఒక సంవత్సరం పాటు మూసివేయబడ్డాయి. ఇది చదివిన తర్వాత మనకు లండన్ నగరం గుర్తుకు వస్తుంది. లండన్ లో కూడా 100 కు పైగా నాటకశాలలున్నాయని కవి ఇంగ్లండ్ లో ఇరవై ఐదు రోజులు (పేజి–108)యాత్రలో చెప్పడం జరిగింది. జర్మనీ చిత్ర నిర్మాణానికి ముఖ్యకేంద్రం బెర్లిన్. ఇక్కడ 1000 పైగా ఫిల్మ్ ప్రొడక్షన్ కంపెనీలున్నాయి. ప్రతి సంవత్సరం 300 జాతీయ, అంతర్జాతీయ చిత్రాల నిర్మాణం జరుగుతుంది. ఇక్కడ 270 సినిమా హాళ్ళు ఉన్నాయి. జర్మనీకి మాయని మచ్చగా మిగిలిన హిట్లర్ గురించి చెప్తూ ''ఇక్కడి గాలి హిట్లర్ జ్ఞాపకాలను తిరస్కరిస్తుంది'' అంటారు. హిట్లర్ గురించి మాట్లాడడం జర్మనులకు ఇష్టముండదు. అలాంటి నియంత దుర్మరణానికి బెర్లిన్ నగరమే వేదికగా మారింది. బెర్లిన్ లోని ఫూరల్ బంకర్ లో హిట్లర్, ఆయన భార్య ఇవాబ్రౌన్ తుపాకితో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ కథనం 1945 మే 2న అమెరికా డిఫెన్స్ వార్తాపత్రికలో వచ్చింది. మరికొంతమంది సైనైడ్ క్యాప్సూల్స్ మింగి చనిపోయాడని చెప్తారు. ఏది ఏమైనా హిట్లర్ మరణం ఇప్పటికీ ప్రశ్నగానే మిగిలిపోయిందని, హిట్లర్ అయినా, నెపోలియన్ అయినా నియంతల మరణాలు దుర్మరణాలుగానే మిగిలిపోయాయని అన్నారు. జర్మనీ మొదటి ప్రపంచ యుద్ధంలో ఓడిపోయినా హిట్లర్ దాన్నుంచి ఏమీ నేర్చుకోలేదు. పైగా నాజీలను పెంచి పోషించాడు. ''జాతీయ సామ్రాజ్యవాదం (National Socializm)కు సంక్షిప్తరూపం నాజీ.''[27] ఈ విధంగా బెర్లిన్ లో హిట్లర్ మరణానికి సంబంధించిన విషయాలు, బెర్లిన్ నగరం గురించిన విశేషాలు దాదాపు పదిపేజీలలో చెప్పడం జరిగింది.

[26] జర్మనీలో కవితా యాత్ర – డా. ఎన్. గోపి. – పేజి - 61

[27] జర్మనీలో కవితా యాత్ర – డా. ఎన్. గోపి. – పేజి - 66

4.10.2 హ్యాంబర్గ్ నగరం:

హ్యాంబర్గ్ అనేది అలస్టర్, ఎల్బా నదుల మధ్య ఉండే ఖిల్లా పేరు. బర్గ్ అంటే ఖిల్లా. హ్యాంబర్గ్ జర్మనీలో ముఖ్యమైన రేవుపట్టణం. హ్యాంబర్గ్ లో యూనివర్సిటీని 1919లో స్థాపించారు. ఇందులో తత్త్వశాస్త్రంనుండి విజ్ఞానశాస్త్రాల దాకా ఇక్కడ లేని బోధనాంశం లేదన్నట్లుగా 180 విభాగాలున్నాయి. 1933 మే 1న జర్మనీ నేత అడాల్ఫ్ హిట్లర్ ను ఇక్కడ సన్మానించారు. ఆ రోజు నుండి ఆ యూనివర్సిటీలో నాజీల జోక్యం మొదలైంది. నాజీలు అక్కడి గ్రంథాలయాలలో వారి అభిప్రాయాలకు విరుద్ధమైన గ్రంథాలను కాల్చేశారు. దీంతో అక్కడ హింసకు తెరలేసింది. హ్యాంబర్గ్ లోని ఎల్బానది వంతెనకున్న వేలాది తాళాలను గురించి చదువుతుంటే మనకు పుణ్యక్షేత్రాల్లో చెట్లకు కట్టే ముడుపులు గుర్తుకు వస్తాయి. ప్రేమికుల జంటలు, కొత్తగా పెళ్లయిన భార్యాభర్తలు తమ జ్ఞాపకాలను ఇక్కడి తాళాల్లో బంధిస్తారు. ఇది వీరి నమ్మకం. ఇక్కడి హోటళ్లలో ధూమపానం నిషిద్ధం. కానీ రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పొగతాగుతారు. సిగరెట్లు మహిళలు కూడా తాగుతారు.

హ్యాంబర్గ్ నగరం ఎన్నో విలయాలను, విపత్తులను ఎదుర్కొంది. వాటిలో 1842లో అగ్నిప్రమాదం జరిగి, పునర్నిర్మాణానికి 40 సంవత్సరాలు పట్టింది. 1892లో కలరా వ్యాధి సోకి 8600 మంది బలయ్యారు. రెండో ప్రపంచయుద్ధకాలంలో హ్యాంబర్గ్ లో విమానాలతో జరిగిన బాంబుదాడిలో 42 వేలమంది చనిపోయారు. 1962లో ఎల్బానది పొంగి 300 మంది ప్రాణాలు కోల్పోయారు. ఎన్ని ఆపదలు వచ్చినా ధైర్యంగా నిలబడి నేడు ఎంతో శక్తివంతంగా, అందంగా మారిందీ నగరం అని పేర్కొనడం జరిగింది.

హాలే, విట్టన్ బర్గ్ జంట నగరాల్లో ''మార్టిన్–లూథర్ యూనివర్సిటీ ఆఫ్ హాలే – విట్టన్ బర్గ్''[28] 1502లో స్థాపించారు. హైడల్ బర్గ్ లోని సౌత్ ఏషియా ఇన్ స్టిట్యూట్ లో జరిగిన కవితాగోష్ఠిలో కవుల కవిత్వాలను మొదట ఇంగ్లీషులోకి అనువాదం చేసి తర్వాత జర్మన్ భాషలోకి అనువాదం చేసి విన్న అక్కడి ప్రజలకు అర్థమయ్యేలా చేయడంలో వారి భాష పట్ల వారికున్న బాధ్యత తెలుస్తుంది.

హ్యాలే నగరం గురించి వర్ణిస్తూ–

[28] జర్మనీలో కవితా యాత్ర – డా. ఎన్. గోపి. – పేజి - 45

''చెక్కు చెదరని
వందల సంవత్సరాల భవనాలు
చరిత్ర పూలదండలో
పరిమళించే మరువ దవనాలు''[29]

అంటూ అక్కడి పురాతన భవనాల గురించి, ఆ నగర చరిత్రను చెప్పడం జరిగింది. మరోచోట ''దూరదేశంలో / భాషగాని భాషల మధ్య / ప్రపంచమంత / ఒంటరితనం బాధిస్తుంది''[30] అంటూనే ''నేనొక తప్పిపోయిన మేఘాన్ని / జర్మనీలో ఇండియాని'' అనడంలో భారతీయత కన్పించి జర్మనీలో ఇండియాను చూసే కవికి ఇక ఏ బాధా ఉండదు అని తృప్తి పడాలి.

జర్మనీలో సైకిళ్ళను ఎక్కువ ఉపయోగిస్తారు. వీరికి కార్ల పట్ల మోజు తక్కువ. జర్మనీలోని ప్రజలందరూ జర్మన్ భాషలోనే మాట్లాడతారు. వీరి ఇంగ్లీష్ తొందరగా అర్థం కాదు. ఇక్కడ నీళ్ళు, కోక్ ధర రెండూ సమానంగా ఉంటాయి. ఆ రోజుల్లో జర్మనీలో యువకులందరికీ నిర్బంధ సైనిక శిక్షణ ఉండేది.

''ప్రపంచ కార్మికులారా ఏకం కండి'' అని కార్మికులందరినీ ఏకం చేసిన కార్ల్ మార్క్స్ జర్మనీ వాడే. జర్మనీలో రైన్ నదీతీరంలో మే 5, 1818లో జన్మించాడు. తొమ్మిది మంది సంతానంలో కార్ల్ మూడోవాడు. 1843లో మార్క్స్ జర్నలిజంలో చేరి ఫ్రెంచిభాషలో ఒక పత్రికకు సంపాదకుడిగా చేశారు. 1849లో లండన్ కు వెళ్ళిపోయి అక్కడే జీవితాంతం గడిపాడు మార్క్స్. 1883 మార్చి 14న మరణించారు. లండన్ కు 50 మైళ్ళదూరంలో మార్క్స్ సమాధి ఉంది. ఆ సమాధిపై ''ప్రపంచకార్మికులారా ఏకం కండి'' (Workers of all lands unite –Karl Marx) అని రాయించారు. 2003లో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్ళినప్పుడు ఈ సమాధిని దర్శించారు కవి. ఈ విషయాన్ని ఇంగ్లండ్ లో ఇరవై ఐదు రోజులు (పేజి–127)లో చూడవచ్చు.

మార్టిన్ లూథర్ ను జర్మన్ భాషకు పితామహుడిగా భావిస్తారు. ఇతడు మత సాహిత్యమంతా జర్మన్ భాషలో రచించేలా కృషి చేశాడు. బైబిల్ ను జర్మన్ భాషలోకి అనువదించాడు. ఈ విధంగా కవి ఈ యాత్రలో మార్టిన్ లూథర్, అడాల్ఫ హిట్లర్, కార్ల్

[29] జర్మనీలో కవితా యాత్ర – డా. ఎన్. గోపి. – పేజి - 51

[30] జర్మనీలో కవితా యాత్ర – డా. ఎన్. గోపి. – పేజి - 45

మార్క్స్ ల గురించి పేర్కొనడం జరిగింది. అలాగే జర్మనీలోని బెర్లిన్, హ్యాంబర్గ్, హ్యాలే, విట్టన్ బర్గ్, హైడల్ బర్గ్ వంటి నగరాలను వర్ణిస్తూ మధ్య మధ్యన కవితలతో అలరించడం జరిగింది. ''జర్మనీలో కవితాయాత్ర' అన్న శీర్షికతోనే మనకు జర్మనీ విశేషాలతో పాటు కవిత్వం కూడా ఉందన్న విషయం అర్ధమవుతుంది. కానీ ఈ యాత్రలో జర్మన్ల ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలు, అక్కడి ప్రజల మనస్తత్వం, ఆహారపు అలవాట్లు, హిట్లర్ పుట్టిన జర్మనీ గురించిన చరిత్రను ఇంకొంత చెప్పి ఉంటే బాగుండేది. ఏది ఏమైనా కవితలతో కూడిన ఈ యాత్ర విశేషాలను చదువుతుంటే రచయిత ఆయా స్థలాలకు మనల్ని తీసుకువెళ్ళి తిప్పి చూపించిన అనుభూతి కలుగుతుంది.

★★★

ఐదవ అధ్యాయం

విమర్శకుడిగా గోపి

అధ్యాయం –5

విమర్శకుడిగా గోపి

5.1 విమర్శ – నిర్వచనం:

‘‘‘విమర్శ’ అనగా పరామర్శ, విచారణము అనే అర్థాలను నిఘంటువులు సూచిస్తున్నాయి. ‘విమర్శ’ శబ్దము ‘మృశ్’ ధాతువుకు ‘వి’ అను ఉపసర్గ చేరి విమర్శ ఏర్పడింది. ఒక వస్తువు యొక్క స్వరూప స్వభావాలను బాగా పరిశీలించి, దాని మంచి, చెడులను వివరించుటయే విమర్శ. కాబట్టి విమర్శ అనగా వస్తుతత్త్వ నిరూపణమని’’[1] స్పష్టమవుతుంది. వస్తుతత్త్వాన్ని పరిశీలించడం విమర్శ అయితే సాహిత్య తత్త్వాన్ని వివేచించేది కాబట్టి సాహిత్య విమర్శగా పరిగణింపబడుతుంది. ఏదో ఒక సాహిత్య వస్తువును ఆసరాగా చేసుకొని విమర్శ ఉంటుంది. అంతేగానీ విమర్శ ప్రాతిపదికగా కావ్యాలు పుట్టవు. కావ్యమే ‘విమర్శ’ కు మూలం. సాహిత్యం జీవితాన్ని ఉన్నతీకరిస్తే విమర్శ సాహిత్యాన్ని ఉన్నతీకరిస్తుంది.

సాహిత్య విమర్శకుడు చేసేపని సాహిత్యం అంతస్సూత్రాన్ని గమనించి అందులోని మంచి చెడులను తెలియపర్చాలి. ఈ విధంగా మంచి చెడులను చెప్పేవాడు ‘కవి’ అయితే, అతడిలో విమర్శకుడి గొప్ప లక్షణం ఉన్నట్లుగా భావించవచ్చు. అందుకే ‘‘కప్పి చెప్పేవాడు కవి, విప్పి చెప్పేవాడు విమర్శకుడు’’ అన్నారు. గోపి అలాంటి విమర్శకుడే.

5.2 విమర్శకుడి లక్షణాలు:

1. వ్యాఖ్యానం, కథ, పాత్ర, సన్నివేశ రసంలో విమర్శకుడి అనుభూతి ఉంటుంది.
2. వ్యాఖ్యానించడానికి రచన పుట్టిన కాలం, ప్రాంతం, అక్కడి మత, సంస్కృతులు తెలిసి ఉండాలి.
3. మనం ఎత్తి చూపించకపోతే పాఠకుడికి దొరకకపోయేవి అనిపించే వాస్తవాలను అందించడం విమర్శకుడి లక్షణంగా చెప్పవచ్చు.

కావ్యం హృదయ స్పందనలకు చెందిన ప్రక్రియ. ‘‘విమర్శ’’ మేథస్సు, విశ్లేషణ, ఆలోచనలు, వ్యక్తీకరణకు సంబంధించింది. కవి తనకు నచ్చిన వస్తువు గురించి కవితాత్మకంగా స్పందించవచ్చు. కానీ విమర్శకుడు ఆ స్పందనల మూల కారణాలను, స్పందించిన తీరును,

---

[1] తెలుగు సాహిత్య విమర్శ – ఎస్వీరామారావు – పేజి -1

వ్యక్తీకరణ విధానాన్ని అంచనా వేయగలగాలి. కవిని హెచ్చరిస్తూ, పెడత్రోవ పట్టకుండా ప్రోత్సహిస్తూ ముందుకు నడిపించగలగాలి. 'గోపి' విశిష్ట అధ్యయనం వల్ల కవిగానే గాక, విమర్శకుడిగా కూడా రూపుదిద్దుకున్నారు. గోపి రాసిన విమర్శక వ్యాస సంపుటాలు అయిదు:- 1. నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం, 2. గవాక్షం, 3. సాలోచన, 4. వ్యాసకలశం.

5.3 నిలువెత్తు తెలుగు సంతకం – సినారె వ్యక్తిత్వం:

గోపి రాసిన మొదటి విమర్శ వ్యాసాల సంపుటి ఇది. సినారె శిష్యుడైన గోపి గురువు షష్టి పూర్తిని పురస్కరించుకొని ఇచ్చిన ప్రేమపూర్వక కానుక. అంతేగాక హృదయభారతి అనే సాహితీ సాంస్కృతిక వేదిక ప్రారంభించి ఈ పుస్తకాన్ని తొలి ప్రచురణగా తీసుకొచ్చి సి. నారాయణరెడ్డిగారికే అంకితమివ్వడం జరిగింది.

ఈ వ్యాస సంపుటిలో మొత్తం తొమ్మిది వ్యాసాలున్నాయి. దీనిలోని మొదటి వ్యాసం 'సమన్వయ దృక్పథం – సినారె'. ఇది 'గోపి'కి సినారె కవిత్వంపైనా, తెలుగు ఆధునిక సాహిత్య పరిణామ వికాసాలపైన గల అభిప్రాయాలకు వ్యాసరూపంగా భావించాలి. ఈ వ్యాసంలో సినారె సాధించిన సమన్వయ దృక్పథాన్ని వివరణాత్మకంగా విశ్లేషించాడు. తెలుగు కవిత్వంలో 'సమన్వయ మార్గం' అనేమాటను డా. సి. నారాయణరెడ్డి 'ఆదునికాంధ్ర కవిత్వము , సంప్రదాయములు : ప్రయోగములు' అనే సిద్ధాంతవ్యాసంలో 1950-60 మధ్య వెలువడ్డ ఒక దశాబ్ద కవిత్వాన్ని సమీక్షిస్తూ ఆయన ఈ మాటను ప్రయోగించారని చెప్పారు. ''స్థూలంగా చూస్తే ఈ దశాబ్ది కవిత్వం సమన్వయధోరణితో నడిచినట్టనిపించును. సంప్రదాయమును నిరసించుటగాని, అతి నవ్యతా ప్రయోగములు చేయుటగాని, క్రొత్త పాతల మేలి కలయిక నవలంబించినట్లు తోచును.''[2] అని గోపి నిర్ధారించారు. దీనికి ఋజువులుగా 1950-60 మధ్య కవులు పద్యం, గేయం, వచనగేయం అనే మూడు ప్రక్రియల్లో రచనలు చేశారని ప్రణయ కవిత్వాన్ని, ప్రళయకవిత్వాన్ని సమభావంతో చూసారని తెల్పారు.

సి. నారాయణరెడ్డి గారు ''సమన్వయమార్గం''కు ముందు చూపు కోల్పోయిన గత దృష్టిగానీ, వెనుక చూపును నిరసించిన భవిష్యదృష్టిగాని మానవపురోభివృద్ధికి దోహదకారులు కాలేవన్న అభిప్రాయం బలపడింది. అంతర్జాతీయ రంగంలోని సహజీవనము, జాతీయ క్షేత్రమున నెహ్రూగారు చూపిన సమన్వయమార్గం ఈ తరం కవులను ప్రబలంగా ఆకర్షించాయి.

[2] నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం – డా. ఎన్.గోపి. – పేజి – 1.

తత్ఫలితంగా ఈ కాలం నవకవులు పల్వురు సాహిత్య రంగమున విభిన్న దృక్పథముల సమన్వయ ధోరణిని కాంక్షించిరి.''[3] అని నిర్వచనాన్ని ఇచ్చారని తెలిపారు.

తెలుగు సాహిత్యంలో ఈ సమన్వయ ధోరణి పుట్టడానికి కారణం ఆనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల్లో వెనుకబాటుతనం ఇటు బ్రిటీష్ ఆంధ్రాలో ఆధునిక, నవ్య, అభ్యుదయ, దిగంబర, పైగంబర, విప్లవ కవిత్వోద్యమాలు క్రమంగా రావడం జరిగింది. వెనుకబాటుతనం వల్ల, చారిత్రకకారణాల వల్ల ఇలాంటి కవిత్వోద్యమాలు తెలంగాణలో రావడానికి ఆస్కారం లేకపోయిందని అందుకు రెండు ప్రాంతాల్లో జరిగిన చారిత్రక సంఘటనలను విశ్లేషించారు. ఈ సందర్భంలో గోపి చేసిన, బ్రిటీష్, ఆంధ్ర, తెలంగాణ అనే ప్రాంతీయ విభజనలు కవితా వస్తు ప్రయోగాలకు సంబంధించినది మాత్రమే అని ఈ వ్యాసం చదివేటప్పటికి పాఠకుడకి అర్థమవుతుంది.

ఈ దశాబ్దం ప్రారంభంలో కోస్తా జిల్లాల్లో 'పాట' పుట్టి ప్రచారంలో ఉందని, తెలంగాణలో మాత్రం అప్పటికీ పద్యంలోనే రచనలు సాగుతున్నాయని, అయితే గేయం తెలంగాణలో ఆధునిక రూపంగా పుట్టుకొచ్చిందని, గేయానికి ప్రాచుర్యం కల్పించింది సినారె అని తెలిపారు.

సినారె మొత్తం ఆంధ్రప్రాంతాన్ని పర్యటించినా ఆయన ఏ ఉద్యమంతోనూ మమేకం కాకుండా తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ అటువామపక్ష భావ కవిత్వాన్ని, ఇటు శాంతి, సమత, చారిత్రక కవిత్వాన్ని రాశారని తెలిపారు గోపి. ఈ వ్యాసంలో కొన్ని సినారె కవితా పంక్తుల్ని అవసరాన్ని బట్టి ఉదహరించారు. ''జలపాతం'' కవితా సంపుటిలో సి. నారాయణరెడ్డి గారు విభిన్న మానసిక ప్రవృత్తులను (Lyrical Moods) చిత్రించే రచనలు చేశారు.

చారిత్రక వస్తువులలో సినారె ప్రగతిశీలమైన కావ్యాలు ''కర్పూర వసంతరాయలు'', ''విశ్వనాథనాయడు'' అనే రెండు కావ్యాలు రాశారు. ఇందులో వ్యక్తికన్నా ప్రజ్ఞ ముఖ్యమని, బంధుత్వం కన్నా విధి నిర్వహణ బాధ్యత ఎక్కువని నిరూపించారు.

'సమన్వయ ధోరణి' తెలంగాణ ప్రాంతంనుండి గొప్ప కవులైన దాశరథి, సి. నారాయణరెడ్డిలను ప్రసాదించింది. ఈ ధోరణి 1950లో ప్రారంభమై 1960 నాటికి

[3] నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం – డా. ఎన్.గోపి. – పేజి – 1-2.

సద్దుమణిగినట్లు కన్పించినా సినారె మాత్రం దాన్ని ఒక విశిష్టతగా భావించుకొని తనకంటూ ఒక స్థానాన్ని సాహిత్యంలో ఏర్పరచుకోగలిగారని ఈ వ్యాసంలో నిరూపించడానికి 'గోపి'గారు తెలంగాణ ఉద్యమం, పోలీస్ చర్య, ఉస్మానియా విద్యార్థుల తిరుగుబాటును, అటు ఆంధ్రాలో జరిగిన ప్రధాన సంఘటనలను కవిత్వ రూపంలో వివరణాత్మకంగా విశ్లేషించడానికి సాధికారికంగా ప్రయత్నించారు. ఇది గోపి కవి స్థాయి నుండి విమర్శకుడి స్థాయికి చేరిన వైనాన్ని చూపుతుంది. ఆంధ్ర, తెలంగాణల్లో సాహిత్య, రాజకీయాల్లో వచ్చిన మార్పులు వివిధ పరిణామాలను, పరిశీలించిన తీరును చూస్తే గోపి అవగాహన తెలుస్తుంది.

''విశ్వంభర''. ఈ సంపుటిలోని రెండో వ్యాసం. 'గోపి' ఈ వ్యాసాన్ని సారస్వత వేదిక తరపున నెలనెలా నిర్వహించబడే ''ఆధునిక కావ్యాలు'' వరుసలో ఏప్రిల్ 13, 1991న చదివారు. ఈ వ్యాసంలో విశ్వంభర అంటే ఏమిటో చెప్పి ఆ కావ్య వస్తువు వివరిస్తూ ''ఇది కేవలం భూగోళం అనబడే మట్టిముద్ద గురించిన కావ్యం కాదు. ఆ మట్టిలో పుట్టిన మనిషి అనబడే ప్రాణి పొందిన వికారాన్ని గురించి, వికాసాన్ని గురించి, ఆ వికాస క్రమంలో ఆ మనిషి చైతన్యస్థాయి గురించి, ఈ చైతన్యానికి మూలమైన మట్టితో అతని సంబంధాన్ని గురించి, మట్టే విశ్వంభర, విశ్వంభరే మానవుడు. విశ్వంభరను మానవునికి పర్యాయ పదాలుగా వాడుకున్నాడు కవి. ఈ కావ్యానికి ''మనిషి'' అని పేరు పెట్టినా అదే అర్థం''[4] అని వివరణాత్మకంగా తెలిపాడు.

విశ్వంభర కావ్యంలోని విషయం గురించి, ఈ కావ్యం సినారె సాహిత్య జీవితంలో ఒక మైలురాయిగా నిలిచిన ఘట్టాన్ని తెలిపాడు. ఈ కావ్యంలోని విషయాన్ని, వస్తువును విశ్లేషించిన తీరును చూస్తే 'గోపి' లోని విమర్శకుడు కనపడుతాడు. ఈ కావ్యాన్ని గోపి అయిదు భాగాలుగా విభజించుకున్నాడు. మొదటి భాగంలో ప్రకృతికి, మానవునికి గల పరస్పర సంబంధాన్ని తెలిపాడు. రెండవ భాగంలో విశ్వంభరకవి సినారె కళ పుట్టుకను కవితాత్మకంగా చెప్పారు. మూడో భాగంలో మనస్సు ప్రాముఖ్యాన్ని వివరించారు. నాలుగో భాగంలో మనిషి జీవితంలోని వివిధ దశలైన బాల్య, యౌవన, వృద్ధాప్యాలను తాత్త్విక చింతనతో, భౌతిక విషయాలకు లొంగి, మళ్ళీ అతడు పురోగమించి వైజ్ఞానిక ప్రగతిపేరుతో సహజ సంపదను ధ్వంసం చేస్తున్న తీరును

[4] నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం – డా. ఎన్.గోపి. – పేజి – 12-13.

వివరించారు. ఐదో భాగంలో వర్ణాహంకారం, సామ్రాజ్యవాదాలను తొలగించి శాంతి మార్గాలు ఏర్పరచడానికి ప్రపంచంలో జరిగిన కృషిని గురించి వివరించడం జరిగింది.

మనిషికి నిరాశ ఉండరాదని, చైతన్యంతో పురోగమించాలని సినారె భావిస్తాడు. విశ్వంభర కావ్యంలో సినారె ఎంచుకున్న వస్తువు దగ్గర నుండి, క్రమంగా ఆ వస్తువును విస్తరింప చేయడం వరకు అతని కవితాభివ్యక్తి, శ్రద్ధ, నిబద్ధత తెలుస్తుంది. ''చాలా మందికి మొదట్లో ఈ కావ్యం అర్థం కాలేదు. కొందరు బరువుగా ఉందన్నారు. కొందరు బాగుంది అన్నారు కానీ అది చదివి చెప్పిన మాటగా అన్పించలేదు''[5] అని చెప్పిన గోపి తన వ్యాసం ద్వారా ఈ కావ్యంలోని వస్తువును వివరించిన తీరును చూస్తే పాఠకుడు కావ్యం చదివిన అనుభూతి పొందేవిధంగా రాశారు. ఇది గోపిలోని విమర్శనాత్మక దృష్టికి, విశ్లేషణా నైపుణ్యానికి మచ్చుతునకలుగా చెప్పవచ్చు.

''తెలుగు గజళ్ళు'' మూడో వ్యాసం. ఇది 'వివేచన' అనే పరిశోధన పత్రికలో 1988–89లో వెలువడింది. తెలుగు సాహిత్యంలో గజళ్ళకు విశిష్టస్థానం ఉంది. వీటిని ఒక ప్రక్రియగా స్వీకరించి రచనలు చేసినవారు డా. సి. నారాయణరెడ్డిగారు. తెలుగులో ఈయన 35 గజళ్ళతో 1984లో ఒక పుస్తకాన్ని వెలువరించారు. కవి వీటికి స్వయంబాణీలు సమకూర్చి క్యాసెట్లుగా రూపొందించారని, ''కవే గాయకుడుగా రవళించడం తెలుగులో ఇదే ప్రథమం''[6] అని సినారె మొదటగా చేసిన ప్రయోగాల్ని తెలిపారు. గజల్ కు సినారె ''ప్రియురాలితో సల్లాపం'' అనే అర్థాన్ని స్వీకరించినట్లు చెప్పారు.

గజల్ నిర్మాణాన్ని గురించి చెప్తూ, గజల్ అంటే ఆడవాళ్ళతో మాట్లాడటమని, ప్రియురాలితో సల్లాపం అనే అర్థాలు ఉన్నాయని, గజల్ పల్లవిని ''మత్లా'' అని చరణాన్ని ''మక్తా'' అంటారని, చరణం చివర రెండు రకాల ప్రాసలుంటాయని, వాటిని ''రధీవ్, కాఫియా''[7] అంటారని, రధీవ్ అంటే అంత్యప్రాస, కాఫియా అంటే అంత్యప్రాసకు ముందు పూర్వపదం అని తెల్పాడు. రధీవ్ ను ఏకపద పునరుక్తిగా పొరపడుతుంటారు. తెలుగు చందః ప్రమాణాలు గజల్ కు కుదరవు. ఉర్దూలో ''దీవార్, కిర్దార్ హత్యార్, బాకార్''[8] అనేవి

---

[5] నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం – డా. ఎన్.గోపి. – పేజి – 12.

[6] నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం – డా. ఎన్.గోపి. – పేజి – 27.

[7] నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం – డా. ఎన్.గోపి. – పేజి – 28.

[8] నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం – డా. ఎన్.గోపి. – పేజి – 28.

రధీవ్ లు. ఇక్కడ ''ఆర్'' అంత్యప్రాసగా కన్పిస్తుంది. అంత్యప్రాసలోని ముఖ్యమైన స్వరం ''ఆర్'' అంత్యప్రాసను ఏర్పరచడానికి సహాయపడిన గొప్పధ్వనివంతమైన యూనిట్ అని గోపి గజల్ నిర్మాణాన్ని విశ్లేషించారు. గజల్ ప్రాస గురించి తెలుసుకోవాలంటే వారికి ఉర్దూ పరిజ్ఞానం ఉండాలని లేకపోతే అంత్యప్రాస విషయంలో అపోహపడే అవకాశం ఉందని చెప్పడం జరిగింది. ప్రణయానికి ప్రాధాన్యత ఉన్న గజల్ ను మానవీయ దృక్పథానికీ, ప్రగతిశీల భావాలకు, సున్నితమైన అధిక్షేపాన్ని చెప్పడానికి మార్గంగా స్వీకరించడం గజల్ లోని విశిష్టత అని తెలిపారు. ''ప్రణయం గజల్ మూలతత్త్వం కాదు. అది ప్రక్రియ. గజల్ లో ప్రణయేతరాలను తీసుకోవడం సరికొత్త ప్రయోగం''[9] ఇలాంటి మార్పులు చేసిన ఉర్దూ కవులను గురించి తెలిపాడు.

సినారె సాహిత్యాన్ని ఔపోసన పట్టిన కవి గోపి. ఆయన రచనలో తాత్త్వికతను చర్చిస్తూ, సినారె కవిత్వంలో విశ్వంభరకు ముందునుండే కవిత్వ ఛాయలు కనబడుతున్నా విశ్వంభరలో అవి మరీ ఎక్కువగా ఉన్నాయన్నారు. ఆ భావనను గజల్స్ లో చూపుతూ సినారె రాసిన

''మరణం నన్ను వరించి ఇస్తే ఏమంటాను నేనేమంటాను
పాలు పట్టి జోలపాడి పడుకోమంటాను'' అనే గజల్లో కవి చావుకు భయపడనని, మరణంలో ప్రేయసి తత్వాన్ని, సహచరీత్యాన్ని దర్శించాడు. సూఫీ కవుల్లో, రవీంద్రుడిలో ఈ తాత్త్విక ధోరణి కన్పిస్తుందని తెలిపాడు. గజల్ చివర ''తఖల్లుస్'' (కవినామముద్ర) అంటేగీతం చివర కవి తనను తాను సంబోధించుకుటాడని ''సినారె'' అనేది ఈ గీతాల్లో తఖల్లుస్ అని శతక కవులు తమ ముద్రలను ఆయా శతకాల్లో వాడినట్లే 'గజల్' లో కూడా కవి ముద్ర ఉంటుందని పేర్కొన్నాడు.

గజల్ అనేది ఉర్దూ పేరైనా తెలుగులో మార్చకుండా అదే పేరును ''తెలుగు గజళ్ళు''గా పెట్టడం సముచితంగా ఉందని ప్రశంసించారు.

'ప్ర'పంచపదులు – విశ్లేషణ – నాలుగో వ్యాసం: ఈ వ్యాసం పేరులోనే విశ్లేషణ అని చెప్పుకున్నారు. ఇది ప్రపంచపదుల పుస్తకానికి రాసిన పీఠిక. సినారె గారి తన నలభై ఏళ్ళ

[9] నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం – డా. ఎన్.గోపి. – పేజి – 29.

కవితా ప్రయాణానికి మైలురాయిగా ప్రపంచపదులను పేర్కొనవచ్చు. తెలుగు సాహిత్యంలో ఎన్నో విశిష్ట ప్రయోగాలు చేసి భావ వ్యక్తీకరణలో, ఛందో ప్రయోగంలో నైపుణ్యాన్ని సాధించారు.

గోపి 'ప్ర'పంచపదులు గూర్చి చెబుతూ 'ప్ర'పంచ పదులు కేవలం ఒక ఛందస్సు పేరు కాదు. శబ్దం, లయ, భావస్పందనలు కలిసిన ఓ అభివ్యక్తి రూపం. ప్రపంచపదులు అన్న కూర్పులో అనేకార్థాలున్నాయి. 'ప్ర' అన్న ఉపసర్గకు విశేషం అని అర్థం. మామూలు పంచపదులు కాదు విశేషమైన పంచపదులు అని అర్థం. 'ప్రపంచం' అని కలుపుకుంటే లోకతత్వాన్ని బట్టి చెప్పిన పదాలని అర్థం. ఛందస్సు పంచపదీయం, వస్తువేమో ప్రపంచపదీయం అన్నమాట''[10] అని గోపి గారు వివరించారు.

పార్శీ, ఉర్దూ సాహిత్యాల్లో రుబాయీ ప్రసిద్ధి చెందిన ఛందోరూపం. ''రుబ్'' అనే అరబ్బీ పదం నుండి ఈ పదం పుట్టిందని, ''రుబ్'' అంటే రసం, సారం అనే అర్థాలున్నాయి. రుబాయీ స్త్రీలింగ శబ్ధమని తెలిపాడు. రుబాయి నిర్మాణం గురించి తెల్పుతూ రు''బాయీ''లో నాలుగు పాదాలుంటాయని, 1,2,4 పాదాలకు అంత్య ప్రాసయతి ఉంటుందని మూడో పాదానికి ఈ నియమం వర్తించదన్నాడు. మూడో పాదం పై రెండు పాదాలకు అనుసంధానంగా ఉంటుంది. మొదటి రెండు పాదాల్లో భావాన్ని ఆధారం చేసుకొని చివరి పంక్తికి మెరుపునిస్తుంది. చివరిపాదంలో సూక్తో, అధిక్షేపమో, చమత్కారమో ఏదో ఒకటి ఉండాలి అని చెప్పి ఈ లక్షణాలు సినారె ప్రపంచ పదుల్లో ఏవిధంగా పరివర్తించాయో సమర్థవంతంగా ఉదాహరణలతో చూపారు. తెలుగులో రుబాయీలకు ఐదో పాదాన్ని చేర్చారని వివరించారు గోపి. సినారె ప్రపంచ పదుల్లో ప్రకటించిన విశ్వజనీన, ప్రగతిశీల భావాలను బేరీజు వేశాడు.

గోపి వేమనపై పరిశోధన చేయడం వల్ల సినారెను వేమనతో పోలుస్తూ ''గొప్ప కవులను కాలావదులు వేరు చెయ్యలేవు. అయితే సినారెను ఆధునిక జీవిత సన్నివేశంలోనే చూడాలి. వేమనలో తీవ్రమైన కోపం ఉంది. సినారెకు అంత కోపం రాదు. తూకం ఆయన జీవ గుణం''[11] అని సి. నారాయణ రెడ్డి కవిత్వాన్ని విశ్లేషించారు కవి, విమర్శకుడు గోపి.

---

[10] నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం – డా. ఎన్.గోపి. – పేజి – 32.

[11] నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం – డా. ఎన్.గోపి. – పేజి – 47.

''సమగ్ర పరిశోధకుడు'' అనేది దీనిలోని ఐదో వ్యాసం. తెలుగులో ఆధునిక కవిత్వం గూర్చి విపులంగా పరిశీలించి, సత్ఫలితాలను ప్రకటించిన గ్రంథాల్లో ''ఆధునికాంధ్ర కవిత్వం; సంప్రదాయములు ప్రయోగములు'' ఇప్పటికీ మొదటి స్థానంలోనే ఉందని సినారె పరిశోధన గ్రంథం యొక్క స్థానాన్ని అంచనా వేశాడు గోపి.

ఆయన పరిశోధనా విధానం గూర్చి చెబుతూ ''ఎనిమిది దశాబ్దాల పాటు వెలువడిన సుసంపన్నమైన పరిణామశీలమైన, వైవిధ్యభరితమైన తెలుగు కవిత్వాన్ని ఒక్క చేత్తో ఏకబిగిన సేకరించి, క్రోడీకరించి, వ్యాఖ్యానించి, విశ్లేషించి సూత్రీకరించారని''[12] తెలిపాడు. ఈ బృహత్ పరిశోధన ఒక్కరోజులో జరిగింది కాదని, ఎం.ఏ చదివే రోజుల నుండే వివిధ పత్రికల్లో ఆయన రాసిన వ్యాసాల పరంపరను వైవిధ్యభరితమైన అతడి సాహితీ కృషిని వివరించారు గోపి. సినారె వైఖరి గురించి చెబుతూ ''సినారె సంప్రదాయ భూమిక నుండి వచ్చిన రొమాంటిస్టు. కాలాన్ని బట్టీ, Attitude ని బట్టీ, అభ్యుదయ భావజాలాన్ని బాగా వొంట బట్టించుకున్నారు. నిష్కర్షగా, యాంత్రికంగా నిలువుగీత గీసి తెగ్గొట్టినట్టు చెప్పడం ఆయన ప్రవృత్తికాదు. నిర్ణయం చేసేటప్పుడు ఇతర సాక్ష్యాలతో పాటు ఆయన తన అభిరుచిని కూడా లెక్కలోకి తీసుకుంటారు. ఈ రకంగా సమన్వయవాదాన్ని కవిత్వంలోనే గాక విమర్శకు కూడా విస్తరింపచేశారు. విమర్శరీతిలో కట్టమంచి వారి కర్కశత్వాన్నీ, రాళ్ళపల్లి వారి కంటక గర్భిత మార్దవాన్నీ పరిహరించి సుకుమార రీతిని ఎన్నుకున్నారు''[13]

సినారె తన పరిశోధన గ్రంథంలో ప్రబంధ లక్షణాలను, మనుచరిత్ర, వీరేశలింగం పంతులు, నవ్యకవిత్వం, యుగకర్తల లక్షణాలను చర్చించిన తీరు తెలిపాడు గోపి. నవ్యకవిత్వంలో వస్తువు విప్లవాత్మకమైందని కాపువారు, పడవనడిపేవారు, గొల్లవారు, అస్పృశ్యులు కావ్య పాత్రలుగా ఉండటంవల్ల, వారి జీవితాలకు కావ్య గౌరవం కల్గిందని, అంతకు మించిన వస్తునవ్యత ఏముంటుందంటూ కవిత్వ వస్తు పరిణామాన్ని పరిశీలించారు.

ఈ పరిశోధనా గ్రంథాన్ని గురించి ఇది వ్యవహారికమా, గ్రాంథికమా అనే స్పృహ కలుగదని నవలలాగా హాయిగా చదువుకోవచ్చని, అంతటి సులభమైన విశ్లేషణ ఉందని

[12] నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం – డా. ఎన్.గోపి. – పేజి – 50.

[13] నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం – డా. ఎన్.గోపి. – పేజి – 58.

తెలిపారు. ఈ పరిశోధనా గ్రంథాన్ని చదవలేనివారు గోపి వ్యాసాన్ని చదివితే సినారె పరిశోధనాంశాలు, తీర్పులు తెలుస్తాయి.

ఉత్తమ అధ్యాపకుడు – కొన్ని జ్ఞాపకాలు: ఇది ఆరో వ్యాసం. ఒక విద్యార్థి జీవితంలో ఎందరో అధ్యాపకులు ఎదురౌతారు. వారిలో కొందరు మాత్రమే జీవితాంతం గుర్తుండి పోతారు. అలా గుర్తుండి పోయిన ఆదర్శ అధ్యాపకుడు డా. సినారె గురించిన జ్ఞాపకాలను స్మరించుకోవడం ఈ వ్యాసం ఉద్దేశం.

1954 నిజాం కాలేజీలో పార్ట్ టైం లెక్చరర్ గా ప్రవేశించిన సినారె ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మూడు దశాబ్దాలు పాఠాలు చెప్పారని ఆయన ఉద్యోగ జీవితాన్ని చెప్పడం జరిగింది. గోపికి బి.ఏ, ఎం.ఏ కలిపి 5 సంవత్సరాలు పాఠాలు బోధించారు.

ఆయన బోధన గురించి చెప్తూ చాలా పేరున్న అధ్యాపకుడని ''అరవయిల్లో డిగ్రీ విద్యార్థులు తండోపతండాలుగా ఆయన క్లాస్ రూమ్ లో కిక్కిరిసి పోయేవారు. తెలుగు సెకండ్ లాంగ్వేజ్ కానివారు కూడా ఆయన పాఠాలు వినడానికి వచ్చేవారని, తెలుగు పీరియడ్ కోసం సైన్సు కాలేజీ నుండి ఆర్ట్స్ కాలేజీ వైపు పరుగులు తీసే గుంపుల వల్ల తెలిసిపోయేది ఆ రోజు సినారె క్లాసుందని''[14] అంటూ చెప్పడంలో అతిశయోక్తి లేదని ఆయనతో చదివిన సమకాలికులని అడిగితే తెలుస్తుంది. ఒక అధ్యాపకుడికి ఇంతకంటే గౌరవం ఉండదు. అలాంటి గొప్ప వ్యక్తుల దగ్గర చదువుకున్నానని చెప్పడం, వారిని గుర్తుంచుకోవడం గోపిలోని నిత్యవిద్యార్థి లక్షణాన్ని, వినమ్రతను తెలుపుతున్నాయి.

సినారె గారి అధ్యాపక జీవితాన్ని గోపి 1. విశిష్ట బోధన 2. విలక్షణ వ్యక్తిత్వం అని రెండు విధాలుగా విభజించారు. మొదటి విభాగమైన విశిష్ట బోధనలో సినారె క్లాసుకు ప్రిపేర్ డ్ గా వచ్చేవారని, ఆయన నిరంతరం చదువుతూ కనిపించేవారని, పద్యాన్ని ఆయన పఠించేవారని, పాడితే విషయం మీద ఉండాల్సిన దృష్టి సంగీతం మీదకు మళ్ళుతుందని భావించేవారు అని చెప్పడం జరిగింది. ఆయన బోధనలో ''రిసైటేషన్'' (Recitation) అంటే పఠన పద్ధతిని అవలంభించారని చెప్పారు. ఆయనకు భాషపై, సాహిత్యంపై ఉన్న పట్టును వివరించారు.

[14] నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం – డా. ఎన్.గోపి. – పేజి 64-65.

విలక్షణ వ్యక్తిత్వం అనే భాగంలో ఏ పనైనా సమయానికి చేయడం, గురువుల వద్ద అణకువగా ఉండడం, శిష్యులను ఆత్మీయంగా చేరదీయడం, అందరినీ కలుపుకు పోవడం, పరిపాలనా వ్యవహారాల్లో చాకచక్యంగా వ్యవహరించడంలాంటి విశిష్ట లక్షణాలు కలిగిన వ్యక్తి వద్ద చదువుకోవడం తనకు గర్వంగా, గౌరవంగా ఉందంటూ నమస్కరిస్తూ ఈ వ్యాసాన్ని ముగించారు.

'సినారెతో రెండు రోజులు – అనే వ్యాసం'లో, సినారెకు జ్ఞాన పీఠ పురస్కారం వచ్చిన సందర్భంగా, తమ ఊరి ప్రజలు సన్మానిస్తామంటే హనుమాజీపేటకు వెళ్ళడానికి తనను కూడా రమ్మన్నారని ఎన్నో సంవత్సరాలుగా వెళ్ళాలనుకుంటున్న ఊరు సినారెతో కలిసి వెళ్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు గోపి. ఊరు చేరే లోపు ఆ ఊరు స్థితిని అక్కడి వాతావరణాన్ని కళ్ళకు కట్టినట్టు చూపారు. ఇంత చిన్న మారుమూల ప్రాంతం నుండి వచ్చిన మహావ్యక్తా అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు గోపి. సినారెలో చిన్నతనం నుండి స్వతహాగా ఉండే పట్టుదల, కార్యదీక్ష గురించి ఆ ఊరి ప్రజలద్వారా విని ఆనందించాడు. సన్మానం చేసిన విధానాన్ని చెబుతూ మొదటి శాలువా కప్పింది ''గొర్రె ఎల్లవ్వ'' అనే హరిజన స్త్రీ అని తెల్పారు.

ఆ ఊరి అభివృద్ధి కార్యక్రమాలన్నింటిలో సినారె గారి కృషి ఉన్నట్లు తెలుసుకొని సంతోషపడ్డారు. ''సినారె ఇంత గొప్ప వాడవ్వడానికి గల కారణాన్ని, మూలాల్ని కనుగొన్నానని, ఏటి ఒడ్డున పూచిన పువ్వన్నమాట ఇది''[15] అని సినారెలోని సాహిత్య సుగంధ పరిమళాన్ని అన్వేషించిన సహృదయుడు గోపి.

సభలో తన చిన్ననాటి స్నేహితుల్ని, ప్రస్తుత మిత్రుల్ని, కాలం మింగేసిన వారిని చెమ్మగిల్లిన కళ్ళతో తలచుకున్నారని చెప్పారు. సినారె చిన్నతనంలోనే అస్పృశ్యతా నివారణపై కవిత్వం రాశాడని, నాటకాలు వేసేవారని తెలుస్తుంది. సినారె బాల్య స్నేహితుడు ఆదిరెడ్డి సినారె గారితో తనకు గల అనుబంధాన్ని, బాల్య జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారని తెలిపారు. చివరగా గోపి ''దేశమంత గీతానికి పునాదులైన మట్టి స్పందనలు వినివచ్చాను''[16] అని చెప్పటంలో సినారె గారిని దేశానికి పరిచయం చేసిన ఆ ఊరి జనం చెప్పిన గతాన్ని విన్నానని, వారి గురించి తెలుసుకోగలిగాననే నమ్మకం కల్గిందన్నారు.

---

[15] నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం – డా. ఎన్.గోపి. – పేజి – 73.

[16] నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం – డా. ఎన్.గోపి. – పేజి – 79

'పల్లెపాటనిచ్చింది పట్నం మాటనిచ్చింది' అనే వ్యాసంలో తెలుగు సాంస్కృతిక రంగాల్లో సుమారు నాలుగు దశాబ్దాలుగా ఉజ్జ్వలంగా రాణిస్తున్న డా. సి. నారాయణ రెడ్డి కవిగా, గేయ రచయితగా, పరిశోధకుడిగా, అధ్యాపకుడిగా, పరిపాలకుడిగా బహుముఖ ప్రజ్ఞ కలిగి ఉన్నారు. ఎన్నో సభల్లో ప్రసంగించినా ఎక్కడా పునరుక్తి రానీయని ప్రతిభా దురందరుడు. ఆయనతో గోపి 1990, జనవరి 14 న జరిపిన ఇంటర్వ్యూ రేడియోలో ప్రసారమైంది. దీన్ని ఆంధ్రభూమి దినపత్రిక ఫిబ్రవరి 4,11, 1991 ఆదివారం సంచికల్లో ప్రచురించింది. ఈ ముఖాముఖిలో సినారె కవిగా మారడానికి గల కారణాలు, ఆయన రాసిన సినిమా పాటల గురించి, అధ్యాపకుడిగా బోధనానుభవాలను, విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడిగా ఎదురైన అనుభవాలు, గజల్స్ రాసి పాడినవారిగా అనుభవాలు, సిద్ధాంత గ్రంథం విశిష్టత వంటి మొదలైన అంశాలపై ఈ ఇంటర్వ్యూ సాగింది.

'నిరంతర కవి' ఇది చివరి వ్యాసం. ఈ వ్యాసాన్ని సినారెకు జ్ఞానపీఠ అవార్డు వచ్చిన సందర్భంలో రాసారు. ఇందులో ఆయన పుట్టిన గ్రామం, బాల్యం, కుటుంబ, ఆర్థిక నేపథ్యాలు, చదువు, ఆయన ఉద్యమ స్ఫూర్తులను, కవిగా, అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా, రచయితగా ఆయన ప్రస్థానాలను రేఖామాత్రంగా ఈ వ్యాసంలో పొందుపరిచారు.

నారాయణ రెడ్డి గారి కవిత్వ కృషిని గురించి గోపి ''నారాయణరెడ్డి ఇప్పుడు వీస్తున్న గాలి కాదు నలభై యేళ్ళుగా ప్రసరిస్తున్న కవితామధూళి, చెట్టు ఆకుల్ని కదిలించినట్లు ఆయన కవితల్ని కురిపిస్తారు. కవిత రాయనిదే రోజు గడవని నిరంతర వింత స్వాప్నికుడు'' అని అనడంలో ఎలాంటి సందేహం లేదు.

5.4 గవాక్షం:

డా. ఎన్. గోపి ఈ వ్యాసాలను 1991 నుండి వివిధ సందర్భాల్లో విభిన్న సాహిత్యాంశాలపై రాసిన ఎనిమిది వ్యాసాల సంపుటి 'గవాక్షం'. ఈ వ్యాసాలన్నీ వివిధ పత్రికలలో, ఆయా సంచికల్లో ప్రచురింపబడినవే. కవిగా, పరిశోధకుడిగా ఉన్న గోపి విమర్శకుడిగా దర్శనమిస్తారు ఈ 'గవాక్షం'లో.

ఈ వ్యాస సంపుటికి ముందు మాట రాసిన రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు ఈ పుస్తకం గురించి ''ఇవాళ తెలుగు సాహిత్యం, సాహిత్య చరిత్ర, పునర్విశ్లేషణకు లోనవుతున్నాయి.

సాహిత్య యుగాల మీద, యుగ కర్తల మీద పునరాలోచన జరుగుతుంది. అటు సాధారణ సాహిత్యమూ, ఇటు ఉద్యమ సాహిత్యమూ మరో చూపుకు గురవుతున్నాయి. పాక్షిక బుద్ధితో తెలుగు సాహిత్య చరిత్రను వక్రీకరిస్తూ నిజమైన ఉద్యమాలను ఉద్యమాలే కావనీ, ఉద్యమాలు కాని వాటిని మహోద్యమాలని ప్రచారం చేయడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఒక స్పష్టమైన సాంఘిక, రాజకీయ, సాహిత్య దృక్పథంతో సాహిత్యాన్ని పునర్విశ్లేషించే ప్రయత్నాలే ముందుకు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పుస్తకం మన చేతికొచ్చింది. కవిగా, పరిశోధకుడిగా, ఉపాధ్యాయుడిగా ప్రసిద్ధుడైన గోపి విమర్శకుడిగా కూడా తన అధ్యయనశీలాన్ని, లోతునూ నిరూపించుకున్న గ్రంథం ఇది''[17] అన్నారు.

ఈ వ్యాసాల రచనా సందర్భాన్ని తెల్పుతూ స్త్రీ వాద, దళితవాదాలు ఉధృతమవుతున్న సమయంలో చలం, విశ్వనాథ, గుర్రం జాషువా శతజయంతులొచ్చి ఆ వాదాల ప్రచారానికి ఒక ప్రత్యేక సందర్భాన్ని కల్పించాయి. ''జాషువా ప్రతిఘటన చైతన్యం'' అన్నది ఈ సంపుటిలో మొదటివ్యాసం. దీన్ని ఫిబ్రవరి 14, 1994లో రాశారు. జాషువా తన ఆర్తిని కవిత్వీకరించిన కవి. గొప్ప శైలి, గుండెలను పిండే ఆర్తితో రాయడం వల్ల జాషువా అగ్రశ్రేణిలో నిలిచాడని, కాబట్టే జాషువా ప్రతిభావంతుడైన కవి అని చెప్పడంలో గోపి ప్రత్యేకత ఏమీ కన్పించదు. కానీ అవమానాలను లెక్క చేయకుండా వాటిని దిక్కరించిన అతని కవిత్వం, జీవితం రెండూ ఒకటే అని చెప్పడంలో కొత్తదనం కన్పిస్తుంది.

జాషువా పుట్టుక, విద్యాభ్యాసం, వర్ణవ్యవస్థ, క్రైస్తవ మత సంఘ బహిష్కరణ, అవమానాలను వివరించారు గోపి. జాషువా అనగానే గుర్తుకు వచ్చే విలువైన పద్యాన్ని 1943 కాకినాడ సాహిత్య సభలో పిఠాపురం రాజావారి ముందు చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఎక్కువ మందికి ఆ పద్యం యొక్క నేపథ్యం తెలియదు. కవిని, కులాన్ని కూడా గౌరవించలేని హీన సంస్కారం ఉందన్న విషయాన్ని ఈ సంఘటన చెబుతుందని గుర్తు చేయడానికే గోపి గారు ఈ సందర్భాన్ని చెప్పారు.

జాషువా దృక్పథాన్ని, ఆలోచనల్ని, అభిప్రాయాలను ఈ వ్యాసంలో వివరించారు. గబ్బిలం కావ్యం గురించి చెబుతూ ''జాషువా ప్రతిఘటన చైతన్యానికీ, కరుణ రసార్ధ్రతకీ మానవీయ భావాల జాగృతి కోసం జరిగిన ప్రయత్నాలకీ గబ్బిలం కావ్యం ప్రాతినిధ్యం

[17] గవాక్షం ముందుమాట (కొత్త గవాక్షం) – రాచపాళెం చంద్రశేఖర రెడ్డి – పేజి - VII

వహిస్తుందని''[18] సూత్రీకరించారు. గబ్బిలం కావ్యంలో జాషువా హేతువాదిగా కనిపిస్తాడని దీన్ని మేఘ సందేశానికి అనుకరణగా రాసినా అది తెలుగు సాహిత్యంలో విశేష ఆదరణ పొందడానికి గల కారణాలను వివరించాడు. జాషువా గాంధేయవాదని హేతువాదం కొంత ఉన్నా అది శాశ్వతంగా లేదని, మూఢ నమ్మకాలను నిరసించాడని, వామపక్ష భావాలు అతడిని ఆకట్టుకోలేక పోయాయని, అతని స్వీయ అనుభవాల నుండే కవిత్వం రాసాడని, జాషువాకి కులద్వేషం లేదని ఈ వ్యాసంలో చెప్పడం జరిగింది. జాషువా ప్రతిఘటన చైతన్యం అక్కడితో ఆగిపోకుండా విస్తరించి ఒక బాధ్యతాయుతమైన మార్పును పొందిందని పేర్కొనడం జరిగింది.

ఈ సంపుటిలో రెండవ వ్యాసం ''చలం కవిత్వం''. ఈ వ్యాస శీర్షికను చూస్తే రచయిత, కథకుడు, నవలాకారుడు అయిన చలం కవిత్వం ఎప్పుడు రాశాడు? అని ఆలోచించేలోగానే చలం కవిత్వం రాయకపోయినా ఈయన రచనల్లో కవిత్వ భావావేశాన్ని, సౌందర్య దృష్టిని చూసి వజీర్ రెహమాన్ 'కవిగా చలం' అనే పేరుతో 1956లో పుస్తకం రాశాడని గోపి చెప్పడం జరిగింది. ''చలం తాను తీసుకున్న సంఘ సమస్యల పట్లా, స్త్రీ సమస్యల పట్ల ఉన్న గాఢానుబంధం వల్ల, మమేకం వల్ల కవి అయ్యాడు. ఈ మమేకం అనేది కవిత్వానికి మౌలిక లక్షణం.''[19] అంటూ 'చలం కవిత్వం' శీర్షికకు వివరణగా చెప్పడం జరిగింది. చలం వచనాన్ని పట్టుకొని వజీర్ రహమాన్ కవిత్వం అనడం, వజీర్ రహమాన్ ల లేఖల్లోని వాక్యాలు చలం రాసినవి వచన కవిత్వ పంక్తులేనని చెప్పడానికి ఋజువులను గోపి చూపించారు. వజీర్ రహమాన్ చలం రాసిన రచనల్లో నుండి కొన్ని వాక్యాలను తీసుకొని 'కవిగా చెలం' పేరుతో 18 కవితల్ని తయారుచేశాడని, ఈ వాక్యాలు మ్యూజింగ్స్, వానరాత్రి, నువ్వూనేనూ, ప్రేమలేఖలు, అమీనా నవల వంటి రచనల్లోని వాక్యాలతో కవితను నిర్మించిన విధానాన్ని వివరించడం జరిగింది. చలం 'ఓ పువ్వు పూసింది' పేరుకే కథని అందులో ఉన్నదంతా కవిత్వం అని తెలిపాడు. చలం కవితా పరిణామాన్ని బట్టి గోపి కాంక్షమాత్రకవి, అస్పృహనీయ కవి, స్పృహనీయ కవి లేదా వికసిత కవి అని మూడు రకాలుగా విభజించడంలో ఎవరికీ ఎలాంటి అభ్యంతరాలు ఉండకపోవచ్చు కానీ ''చలం ఏ రకమైన కవి అని ప్రశ్నిస్తే స్థూలమైన అర్థంలో భావకవి అని చెప్పవచ్చు''[20] అనడంలో గోపి తన నిర్ణయాన్ని చెప్పారు. ఆయన మాటకు

[18] గవాక్షం - డా. ఎన్. గోపి - పేజి - 4

[19] గవాక్షం - డా. ఎన్. గోపి - పేజి - 8

[20] గవాక్షం - డా. ఎన్. గోపి - పేజి – 16.

బలాన్ని కూర్చుకోవడానికి అవి భావ కవిత్వపు రోజులని కాలాన్ని, సాహిత్యాన్ని ఒకటిగా భావించడంలో పొరబడ్డారనిపిస్తుంది. వచనంలో నుంచి తీసుకున్న కవితాత్మక పంక్తులను బట్టి కవిని అంచనా వేయడం కష్టమని నా భావన.

''చలాన్ని ఒక భావకవిగా గుర్తిస్తూ వారి కవితా పరిణామాన్ని మూడు దశలుగా అంచనా వేసిందీ వ్యాసం. అందుకు తగిన ఆధారాలు చూపింది. ఇది సాహసమే. ఎందుకంటే ఒక గొప్ప సామాజిక తత్వవేత్త. సాహిత్య – సాంస్కృతికోద్యమశీలిగానే లోకమంతా భావిస్తున్నప్పుడు అతనిలోని కవిని, భావుక ప్రపంచాన్ని తెరిచి చూపడం బహుళం''[21] అని వేణు సంకోజు అభిప్రాయపడ్డారు.

''భావకవిగా విశ్వనాథ'' అనే మూడో వ్యాసంలో గోపి ఈ శీర్షికపై తనకున్న అనుమానాలను వ్యక్తపరుస్తూ ''రూఢ్యార్థంలో విశ్వనాథ భావ కవేనా, మిగతాకవులకు లేని ప్రత్యేకత విశ్వనాథకేమైనా ఉందా? భావ కవితా యుగంలో విశ్వనాథ స్థానం ఏమిటి? అనే ప్రశ్నలు వేసుకొని సమాధానాలు అన్వేషిస్తూ చేసిన ప్రయత్నమే ఈ వ్యాసం''[22] ఈ వ్యాసంలో భావకవిత్వం అంటే ఏమిటో అది ఎలా ఉంటుందో తెలిపే ప్రయత్నం చేసి, మనదేశంలో అది ఏర్పడడానికి కారణాలను అన్వేషించాడు. విశ్వనాథ భావకవిత్వాన్ని ఈ విధంగా నిర్వచించారు. ''కవి యొక్క అంతర్నిగూఢతాపము, అవిస్పష్ట వాంఛాంకురము ఒక చిన్న కావ్యంలో ఊదబడినచో అది భావ కవిత్వము'' నీ హృదయంలో ఏదో తారాడుతుంది. అది బాధగా ఉంటుంది. బాధలో ఒక సుఖము ఉంటుంది. అది జీవున్ని కదిలిస్తుంది. ఇదే భావ కవిత్వమని''[23] నిర్వచించారు. ఈయన రాసిన భావకవిత్వానికి ఈ నిర్వచనం సరిపోలేదని గోపి గారు అభిప్రాయపడ్డారు.

విశ్వనాథను భావకవిత్వ వరసలో నిలబెట్టడానికి, ఆయన కవిత్వంలో భావ కవుల కవిత్వానుకరణలున్నాయని ఉదాహరణలు చూపారు. అందులో కృష్ణశాస్త్రి ''పక్షినయ్యెద'' లాంటి కవితే రాశారని చూపారు. విశ్వనాథ 'మల్లిక' అనే ఖండికలో, ''వీరేశలింగంపై స్మృతి'' పేరుతో రాసిన కవితలో, ''నడుచుచున్నది కొత్త నాగరికత'' అనే మకుటంతో రాసిన తొమ్మిది

[21] గోపి సాహిత్య వివేచన – సంపాదకుడు – డా. ఎస్. రఘు –పేజి – 79.

[22] గవాక్షం - డా. ఎన్. గోపి - పేజి – 17.

[23] గవాక్షం - డా. ఎన్. గోపి - పేజి – 21.

పద్యాల ఖండికలో భావ కవిత్వ లక్షణాలున్నాయని ఆయనకు తెలియకుండానే భావకవిత్వ ప్రభావాలకు లోనయ్యాడని చూపడానికి గోపి చేసిన ప్రయత్నం అభినందనీయం.

కొత్త పోకడల వల్లే సాంప్రదాయాలు పాడవుతున్నాయనే అభిప్రాయం, గత వైభవం గురించిన స్మృతులు విశ్వనాథలో బలంగా ఉన్నాయని చెప్పడం జరిగింది. విశ్వనాథ కవిత్వంలో ఊహా ప్రేయసిలు లేరని, భార్యనే ప్రేమించాడని, వరలక్ష్మి త్రిశతి స్మృతి కావ్యమైనా సెంటిమెంటు అందులో తక్కువగా ఉందని దాంపత్య ధర్మం గురించి ఎక్కువగా ఉందని చెప్పారు. విశ్వనాథ గిరికుమారుని ప్రేమ గీతాల్లో మాత్రమే భావకవితావేశం, వినూత్న సంవిధానాలున్నాయని ఇందులో విశ్వనాథ పూర్తిగా భావకవిగా కన్పిస్తున్నారని చెప్పారు. విశ్వనాథ లఘుకావ్యాల్లో కూడా ఈ పోకడ కనిపిస్తుందని, ఆయనే స్వయంగా 'భావకవి' అనే ఖండికను రాశారని వివరించారు.

విశ్వానాథలాంటి బహుముఖ ప్రజ్ఞ కలిగిన రచయితను, కవిని ఏవో కొన్ని ఉదాహరణలతో భావకవిత్వమూసలో చూపడం సాహసమే అయినా ఆ పనిని సశాస్త్రీయంగా చూపడానికి ప్రయత్నించారు. చివరగా తానే తన వాదనను వెనక్కు తీసుకునే ప్రయత్నం చేయడం ద్వారా గోపి లోని ఉత్తమ విమర్శకుడి లక్షణాలు కన్పిస్తున్నాయి. చివరగా విశ్వనాథను భావకవిగా మాత్రమే చూడకుండా, అందులో కూడా తన ప్రతిభను చూపించారని నిర్ధారణ చేయడం బాగుంది.

''తెలుగులో ఆధునిక కవితాత్మక వచనం'' అనే నాలుగో వ్యాసంలో వచన శైలి గురించి చర్చ చేసి, వచనం కవితాత్మకంగా ఉండొచ్చా? అలంకారికంగా ఉండవచ్చా? అనే ప్రశ్నలకు సమాధానంగా రాసినట్లు తెలుస్తుంది. అయితే వచనం అంటే పద్యం కాదనే భావనను చెప్పారు. అయితే పద్యంలో కూడా వచనముందని నన్నయ, పోతన, శ్రీనాథుడు రాసిందంతా ప్రౌఢ వచనమన్నారు. వారు వచనాన్ని వేరు చేసి చూడలేదని తెలిపారు.

సాహిత్య గ్రంథాలు మినహా 1820 నుండి వచ్చిన సాహిత్యేతర గ్రంథాలన్నీ చాలావరకు వాడుక భాషలోనే వచ్చాయని, వ్యవహారం అనే మాట లేదని, కానీ పాఠ్య పుస్తకాల్లో గ్రాంథికం ఉండటాన్ని గుర్తు చేశారు. ఆధునిక విమర్శకులు, సాహిత్య చరిత్రకారులు, గ్రాంథిక వచనం రాసినా చెప్పే విషయంలో లోటు లేదని ఉదాహరణ పూర్వకంగా చూపారు. శాస్త్ర గ్రంథ రచనలో కవితాత్మకత ఉండరాదని, రాసే అంశంపై, చెప్పే దానిపై స్పష్టత లేనప్పుడు

కవితాత్మకత, అలంకారాలు ప్రయోగిస్తారని విమర్శించారు. మార్క్సిస్టు విమర్శకుడిగా పేరొందిన కె.వి. రమణారెడ్డి గురజాడపై రాసిన వచనాన్ని అందుకు ఉదాహరణగా చూపడం జరిగింది. చివరగా తేలిందేమిటంటే సాహిత్యేతర రచనల్లో కవితాత్మకత, అలంకారికశైలి తగదని, నిబద్ధతతో కూడిన స్పష్టమైన భావ వ్యక్తీకరణ ఉన్నప్పుడే రచయితకు వస్తువు పట్ల స్పష్టత ఉంటుందని స్నేహపూర్వకంగా హెచ్చరిక చేయడం జరిగింది. విశ్వనాథ, శ్రీశ్రీ, సినారెలు చిత్తశుద్ధితో నిరహంకారంతో అలాంటి రచనలు చేశారని చెప్పారు.

''భారతీయ భక్తి ఉద్యమ నేపథ్యంలో తెలుగు శతకాలు'' (క్రీ.శ. 12-18 శతాబ్దాలు) అనే వ్యాసం ఐదోది. ఈ వ్యాసంలో భారతదేశంలో భక్తి ఉద్యమ ప్రభావంతో వచ్చిన శతకాలను విశ్లేషించారు. 'భక్తి' అనే మాట పుట్టుకను, వివిధ భాషా నిఘంటువుల్లో గల అర్థాలను, భక్తిని నిర్వచించారు. భక్తి అంటే భగవంతుడిని అర్థించడమనే పరిమితమైన అర్థంకాక ప్రేమ స్వరూపమైన భగవంతునిలో సంలీనమవ్వడమే భక్తి అనే అర్థం ఉంది. ''భగవంతున్ని నిరంతరం ధ్యానిస్తూ అతనిలో మమేకం కావడం కోసం ప్రయత్నించడం భక్తి అని సాధారణ అర్థం''[24] భక్తి ఉద్యమం క్రీ.శ 6వ శతాబ్దంలో తమిళనాడులో మొదటగా ప్రారంభమైందని, అళ్వార్లు (విష్ణుభక్తులు – 12 మంది), నయనార్లు (శైవభక్తులు – 63 మంది) భక్తి మార్గంలో ప్రథములని చెప్పడం జరిగింది. తెలుగులో భక్తి మార్గానికి చెందిన వారిలో మల్లిఖార్జున పండితారాధ్యుడు, పాల్కురికిసోమనాథుడు, యధావాక్కులఅన్నమయ్య, తాళ్ళపాక అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగయ్య, రామదాసులు ఈ జాబితాలోకి పూర్తిగా రారు. ఎందుకంటే వీరు స్వీయ భక్తులు.

దేశం మొత్తంగా చూస్తే భక్తి కవుల్లో చాలామంది కింది కులాలవారు కావడం వల్ల వారికి కుల వ్యవస్థపై వ్యతిరేకతలున్నాయని తెలిపారు. మానవతావాదం నుండే ఈ భక్తి ఉద్యమం పుట్టిందని చెప్పారు. ఆళ్వార్లు, నయనార్లలో అగ్రకులాల వారి నుండి దిగువ కులాల వారి వరకు ఉన్నారని చెప్తూ వారిని ఉదహరించారు.

భక్తి ఉద్యమంలో కవులు సామాజిక అన్వేషణ, ఆర్తి, కుల వ్యవస్థపైన ప్రత్యక్షయుద్ధం ప్రకటించి కర్మకాండలను నిరసించారు. భక్తి కవులందరూ అద్వైతులే (జీవేశ్వరుల ఐక్యం) కానీ

[24] తెలుగులో భక్తి కవిత్వం సామాజిక విశ్లేషణ – డా. పిల్లలమర్రి రాములు.

అద్వైతుల్లో గురు సాంప్రదాయం ఉందని చెప్పడం జరిగింది. దీన్నిబట్టి అద్వైతసిద్ధిని పొందడం సామాన్యులకు సాధ్యం కాదని తెలుస్తుంది.

వేమనను భక్తి కవుల్లో చేర్చడానికి ప్రయత్నించారు గోపి. సాధారణంగా భక్తి కవులు పుస్తకాల్లోని విషయాలను మాత్రమే చెప్పకుండా స్వీయ సాధనపై ఆధారపడతారని ప్రశంసించారు. నిరంతర సాధన, నిరంతర చింతన వల్ల చేతనం వస్తుందని చెప్పడం బాగుంది. వేమన కుల భేదాలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయనకు స్త్రీల పట్ల ఉదార భావంలేదని, వేమన కబీరు లాంటి వాడని, శ్రమ ప్రాధాన్యాన్ని గురించి, వేమన గుర్తించారని వేమన గురించి చెప్పడం జరిగింది. గోపి వేమనను, వీరబ్రహ్మంను ఒకటిగానే చూశారు. ఎందుకంటే వేమన పద్యాల్లో కూడా అక్కడక్కడా కాలజ్ఞాన స్పృహ ఉందని తేల్చడమేగాక వేమనగారి పద్యాలకు, బ్రహ్మంగారి సంప్రదాయానికి ఏదో సంబంధం ఉందనడానికి వేమన పద్యాల్లో నందన సంవత్సరంలో వీరభోగ వసంతరాయలు అవతరిస్తాడని చెప్పే పద్యంను ఉదహరించారు.

''నందన సంవత్సర మా
నందత కార్తీక శుద్ధ పున్నమినాడే
వింధ్యాద్రి సేతు బంధన
నందున నొక వీరుడేలు చాటర వేమా''[25]

ఈ పద్యంలో వీరుడు బ్రహ్మంగారు అయ్యే అవకాశం ఉంది. వీరిని సామాజిక తత్త్వవేత్తలుగానే గోపి భావించారు. మానవీయ మూల్యాలకోసం, భక్తి ఉద్యమకారులు చేసిన ప్రతిఘటనను వారి తాత్విక రచన ద్వారా, భావజాలాల ద్వారా చూపించారు.

''అమలిన శృంగార సిద్ధాంతం – ఒక అనురాగ సమస్య'' అనే ఆరో వ్యాసంలో రాయప్రోలు సుబ్బారావు గారు లేవనెత్తిన అమలిన శృంగార సిద్ధాంతం గురించి చెప్పడం జరిగింది. రమ్యాలోకంలో సంభోగ, వియోగ శృంగారాలు, వాత్సల్యం, సౌందర్యారాధన వంటి అంశాలున్నాయని చెప్పారు. మాధురీ దర్శనంలో ''రతి, మీమాంస, స్త్రీ పుం సంయోగ'' చర్చ ఉందని, ఇవన్నీ వారి ప్రేమ సిద్ధాంతానికి శాఖలన్నారు. రాయప్రోలు అభిప్రాయంలో శృంగారంకు సంభోగం అవధికాక, వియోగమే శ్రేష్ఠమైందని భావించారని తెలిపారు. దీనికి

[25] గవాక్షం - డా. ఎన్. గోపి - పేజి – 51.

కారణాలు ఆనాటి సమాజంలోని కులవ్యవస్థ, ఆర్థిక అసమానతలే అన్నారు. స్త్రీ పురుషులు కలిసి తిరిగితే ఆకర్షణ సహజమని, వివాహం వరకు వెళ్తే వర్ణభేదాలు, ఆర్థిక వ్యత్యాసాలు అడ్డువస్తాయని, ఆ కాలంలో ఒకే కులంలోని శాఖా భేదాలు కూడా సమస్యే అని అప్పటి పరిస్థితులను వివరించారు. ఇన్ని అంతరాలున్నప్పుడు స్త్రీ, పురుషులు కలిసి తిరిగినా వారి మధ్య ప్రేమ చిగురించినా అవి ఫలించే అవకాశం తక్కువ. అందువల్ల వారు వివిధ మార్గాలను వెతికారు. ప్రేమ వల్ల, నిరాశ వల్ల జీవితం చితికి పోతుందని భావించారు. కులాంతర వివాహాలు చేసుకునే సాహసం లేదు. అప్పుడే స్త్రీలు విద్య కోసం అడుగులు వేస్తున్న కాలం, ఇవన్నీ అప్పటి పెద్దలకు విచిత్ర పరిస్థితులుగా కన్పించి వారిలో అభద్రతా భావం ఏర్పడింది. ఈ కారణం వల్లనే కావ్యాల్లో ప్రేమ ఫలించకపోతే అనే దానికి సిద్ధాంతాన్ని కల్పించాడు రాయప్రోలు.

అమలిన శృంగార సిద్ధాంతం వల్ల ఒక గొప్ప మేలు జరిగింది. అది స్త్రీని కేవలం భోగ వస్తువుగా భావించే వైఖరి పట్ల నిరసన అంటారు గోపి. రాయప్రోలు 'అమలినం' అనే ఒక ఆదర్శంతో స్త్రీకి గౌరవ ప్రదమైన సిద్ధాంత నిర్మాణ ప్రయత్నం చేశారని వివరించారు. నిజానికి దీనికి సిద్ధాంతబలం లేదని చారిత్రక అవసరాన్ని పూడ్చడానికే దీన్ని సిద్ధాంతంగా అవతరింప చేశారని, ఏది ఏమైనా స్త్రీ, పురుష ప్రణయానికి సిద్ధాంత స్థాయి కల్పించడం జరిగింది. విడిపోయిన వారి ప్రేమ 'అమలినం' అని కొందరు కవులకు ఇది ఇష్టం లేక దీని గురించి రచనలు చేయలేదని చెప్పారు.

స్త్రీ పట్ల ఒక ఆరోగ్య దృష్టి కలిగి ఉండడం అనేది కలకాలం ఆదరించదగిన మానవీయ సిద్ధాంతంగా చెప్పడం ఆయన విమర్శన దృష్టికి, సాహిత్య సహృదయతకు మచ్చుతునక.

''తెలుగు కవిత – గాంధీయ ప్రభావం'' అనే ఏడవ వ్యాసంలో గాంధీజీ ఉద్యమ ఆదర్శాలకు ప్రభావితులై తెలుగు కవులు రాసిన కవిత్వాన్ని, వారి సామాజిక స్పృహను తెల్పడం జరిగింది. తెలుగు కవులపై గల గాంధీ ప్రభావాన్ని చూపారు. గాంధీ జీవితకాలంలో అతడి వ్యక్తిత్వానికి, ప్రబోధాలకు యావద్భారత ప్రజలు, కవులు, సామాజిక కార్యకర్తలు ప్రభావితులయ్యారు. అలాగే తెలుగు కవిత్వం గాంధీ వ్యక్తిత్వం, ఉద్యమ జీవితానికి ప్రభావితం అయ్యింది.

గాంధీపై తెలుగులో వచ్చిన కవిత్వాన్ని మూడు భాగాలుగా విభజించారు. 1. గాంధీజీ స్తుతి 2. గాంధీజీ స్మృతి 3. కస్తూరిబాస్మృతి. అలాగే గాంధీజీ ఉద్యమ జీవితాన్ని 1. గాంధీజీ

తత్త్వ ప్రభావం 2. నిర్మాణ కార్యక్రమాలు 3. ఉద్యమరూపాలు అనీ గాంధీజీ తత్త్వ ప్రభావాన్ని 1. అహింస 2. శాంతి ప్రబోధం 3. గ్రామ స్వరాజ్యం 4. హిందూ ముస్లిం ఐక్యత అని గాంధీ పై కవిత్వాన్ని ఈ విధంగా విభజించి తన ప్రత్యేకతను చాటుకున్నారు గోపి.

తెలుగు సాహిత్యంలో గాంధీ కవిత్వం అనగానే తుమ్మల సీతారామమూర్తి చౌదరి గుర్తుకొస్తారు. కట్టమంచి వారన్నట్లు ''తుమ్మల సీతారామమూర్తి మహాత్ముని ఆస్థాన కవిగా పేరొందారని, ఈయన గాంధీ ఆశయాలకు అంకితమై బాపూజీ ఆత్మకథ, మహాత్మకథ, గాంధీగానము వంటి మొదలైన గ్రంథాలు రచించారు. పోతన అనుకరణగా గాంధీపై చెప్పిన ''పలికెడిది గాంధి కథయట''[26] అనే పద్యాన్ని తుమ్మల రాశారని ఉదహరించారు. అంబటి సుబ్బరాయగుప్త ''శ్రీ గాంధీ మహాత్మ్యము'', మద్దూరి పాపారావు ''శ్రీ మహాత్మాగాంధీ భజన కీర్తనలు'', శ్రీ మరింగంటి శేషాచార్యులు ''గాంధీ భారతం'', వర్తమాన కవియైన కసిరెడ్డి వెంకటరెడ్డి గాంధీ తాత మకుటంతో గాంధీ జీవితాన్ని శతకంగా రాశారని గాంధీపై రాసిన గ్రంథాలను ఉదాహరించారు.

జాషువా ''బాపూజీ'' ఖండ కావ్య పీఠికలో గాంధీకి నివాళిగా హృద్యమైన పద్యాలు రాశారు. లండన్ నగరంలో గాంధీజీని తక్కువగా అంచనా వేసిన ఘట్టాన్ని తలుచుకుంటూ జాషువా రాసిన పద్యం –

''ఎవడీ యర్ధ దిగంబరేశ్వరుడు మా యిండ్లం ప్రవేశింప నం
చవమానంబుగ చర్చిలాడగ బకింగ్ హాం సౌధమున్ ద్రొక్క హైం
దవ జాతీయత లీను మేల్పలక నాట్యంబాడు, శ్రీ జార్జి భూ
ధవు నింటన్ ఫలహారముల్ సలుపు తాతన్ గాంధి నర్చించెదన్''[27]

అంటూ జాషువా గాంధీపై గల అభిమానాన్ని ఈ పద్యం ద్వారా చాటారు.

గాంధీ ప్రభావం, స్వాతంత్ర్యేచ్ఛ, ''సౌందరనందము, రాణా ప్రతాపసింహ చరిత్రము, అమరసింహ చరిత్ర, శివభారతం, శాంతి విజయం'' వంటి కావ్యాల్లో పరోక్షంగా ఉందని తెలిపారు.

---

[26] గవాక్షం - డా. ఎన్. గోపి - పేజి - 64

[27] గవాక్షం - డా. ఎన్. గోపి - పేజి - 65

1930లో వామపక్ష, మార్క్సిస్టు భావజాలాలున్న కాలంలో ''గాంధీయిజం'' అనే తాత్విక భావజాలం దేశంలో వ్యాపించిందని, రెండవ ప్రపంచయుద్ధానంతరం ప్రపంచ వ్యాప్తంగా శాంతికోసం ఆరాటపడిందని, గాంధీజీ శాంతికాముకతను, సాత్వికతను సి. నారాయణరెడ్డి 'సమదర్శనం' కావ్యంలో చెప్పారని ''గ్రామ స్వరాజ్యం'' వంటి నినాదాలతో కవులు రచనలు చేశారని వివరించడం జరిగింది. గాంధీజీ చేసిన పోరాటాల్లో ''అస్పృశ్య నివారణ'' అనే అంశంపై స్పందించి చాలా మంది రచనలు చేశారని వారిలో జ్వాలారంగస్వామి 'అంటరాని వారెవరు'?, జాషువా ''గబ్బిలం'', గరిమెళ్ళ ''హరిజనుల పాటలు'' నక్కా చిన వెంకయ్య ''హరిజన కీర్తనలు'', బసవరాజు అప్పారావు ''మాలమాదిగల మొర'' వంటి కావ్యాలలోని విషయాలను విశ్లేషించిన తీరు బాగుంది.

సమాజ వెనుకబాటు తనానికి అంటరాని తనం, మద్యపానం కారణాలని గాంధీ గుర్తించి మద్యపాన నిషేధాన్ని తెచ్చారని, దీన్ని తెలుగుకవులు అంది పుచ్చుకొని రచనలు చేశారు. ఇంకా ఖద్దరుధారణ, ఉప్పు సత్యాగ్రహం వంటి అంశాలపై వెలువడ్డ కావ్యాలను ఇందులో పరిచయం చేశారు.

గాంధీ ప్రభావం ఆనాడే కాదు నేడు కూడా ఉందని చెప్పడం అక్షరసత్యం. వ్యాసకర్త పేర్కొన్నట్లు ''ఒక జాతి జీవితాన్ని తద్వారా ఆ జాతి యొక్క సకల కళా సాంస్కృతిక రూపాలను మనదేశంలో గాంధీలాగా ప్రభావితం చేసిన నాయకులు అరుదు''[28]

గవాక్షం వ్యాస సంపుటిలో చివరి వ్యాసం ''కవిత -92 – వస్తు వైవిధ్యం''. ఒక సంవత్సరంలో వచ్చిన కవిత్వాన్నంతా విశ్లేషించడం సాహసమే. ఆ సాహసాన్ని చేసి కవిత్వాన్ని విహంగ వీక్షణం చేసి సమీక్షించారు గోపి. ఒక సంవత్సర కాలంలో వచ్చిన కవిత్వం ఆ ఒక్క సంవత్సరమే ఉండదు. గత దశాబ్దమంతా ఉండవచ్చు. 1992 ను ఒక పరిమితిగా తీసుకొని కవిత్వాన్ని విశ్లేషించడానికి ప్రయత్నించారు గోపి. వ్యాసకర్త తాను కవిత్వాన్ని ఎక్కడ నుండి చదివారో చెబుతూ, ఆ సంవత్సరంలో వచ్చిన కవితా సంపుటులు, ఆంధ్రజ్యోతి వీక్లీ, ఆదివారం, సోమవారం సంచికలు, ఆంధ్ర ప్రభ ఆదివారం, సోమవారం సంచికలు ఇతర పత్రికల్లో వచ్చిన కవితలు పరిశీలించానని చెప్పారు. తన వ్యాస రచనా ప్రణాళికను చెప్తూ ఎన్నో రకాల వస్తువులతో ఈనాడు కవిత్వం వెలువడుతుందని, వాటికి, హేతువుల్ని పరిశీలిస్తానని, వందకు

---

[28] గవాక్షం - డా. ఎన్. గోపి - పేజి - 62

పైగా ఉన్న కవులు రాసిన కవితల్లో గట్టి వాటితోనే ఈనాటి ధోరణుల్ని అంచనావేస్తానని, నాకు నచ్చని కవితలున్నాయే తప్ప, వ్యక్తులు లేరని చాలా జాగ్రత్తగా చెప్పుకున్నారు.

ఇంకా కొన్ని కవితా సంపుటాలను కూడా తీసుకున్నానని వాటిలో తాను గుర్తించిన కొన్ని ధోరణుల్ని ముందుగా అంచాన వేస్తానంటూ చెప్పుకున్నారు. అందులో –

1. ''విప్లవ కవిత్వం (విరసంలో వారు, బయటి వారు)
2. స్త్రీ వాదం
3. సామాజిక వేదన
4. పరాయీకరణ (ఒంటరితనం, మృత్యుకాంక్ష, మృత్యుభయం, బతుకుపై నిరసన, బాల్యస్మరణ, అమ్మ, గతస్మరణ, నగర జీవన వైముఖ్యం, వ్యాపార సంస్కృతి మొదలైనవి)
5. ప్రముఖ సంఘటనల ప్రతిస్పందన
6. సీనియర్ కవుల నిరంతర యాత్ర
7. తిట్టు కవిత్వం
8. పద్య కవిత్వం''[29]

అని ఎనిమిది విభాగాలుగా చెప్పారు. ఈ సంవత్సరంలో ఎంచుకున్న ధోరణుల్లో ''దళిత కవిత్వం'' లేకపోవడం కొంత లోటుగా కన్పిస్తుంది. పల్లెల్లోని చేనేత కార్మికులు, రైతుల దుస్థితిని వివరించారు విప్లవకవులు. తెలంగాణా ప్రత్యేక పరిస్థితులను గుర్తించని విమర్శకులపై ఆరోపణలు ధ్వనింపచేశారు. స్త్రీ వాదం గురించి చెప్తూ స్త్రీ వాదం రాశి పరంగా గత సంవత్సరం ఎక్కువ వచ్చినా, ఈ సంవత్సరం బాగా చర్చ జరిగిందని అది తిట్టు కవిత్వం వరకూ వెళ్ళిందని వివరించారు. స్త్రీలు తమ అనుభవంతో చెప్పగలగడం అంటే ఏమిటో బాగా తెలిసొచ్చింది, అంటారు. స్త్రీ వివక్ష ఆర్థిక, సాంప్రదాయ, లైంగిక పరంగా ఉన్న కేవలం లైంగిక పరమైన అంశాలతో కూడిన కవితలకే వారు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. పై మూడు అంశాలపై రాస్తే గాఢమైన కవిత్వం వచ్చి ఉండేదని ఆశాభావం వ్యక్తం చేశారు.

[29] గవాక్షం - డా. ఎన్. గోపి - పేజి – 79-80.

''తెలుగు కవిత్వంలో ప్రేమ కవిత్వం రాదేమిటి? దేశంలో ప్రేమ ఇంకిపోయిందా అని దిగులు పడుతున్న వారిలో నేనొకణ్ణి''[30] అని అనుకుంటున్న తరుణంలో జయప్రభ, మహజబీన్ రాసిన ప్రేమగీతాలు కన్పించాయని, కానీ అవి స్త్రీ దృష్టి కోణంతో రాసినవని అభిప్రాయపడ్డారు.

స్త్రీలు రాసిన కవితలన్నీ స్త్రీ వాద కవితలు కావన్నారు వ్యాసకర్త. స్త్రీ వాదాన్ని మార్క్సిస్టు దృష్టితో రాయడాన్ని గుర్తు చేసుకొని, అందుకు ఉదాహరణలుగా విమల రాసిన 'సూర్య స్వప్నం', కె. గీత ''నేను ఋతువైన వేళ'' కవితలను చూపారు.

స్త్రీ వాద దృష్టితో పురుషులు రాసిన కవితల్లో విలక్షణ వస్తువుతో ఎండ్లూరి సుధాకర్ రాసిన 'ఏకాకి రుతువు', యాకుబ్ 'చీకటి పక్షి'ని ప్రశంసించారు.

సమాజంలో తమకుండే స్థానాన్ని బట్టి, అస్తిత్వాన్ని బట్టి, అనుభవించే వేదనని సామాజిక వేదన అంటారు. ఇవి రాజకీయ, స్వీయానుభూతి కంటే భిన్నమైంది. దళిత వేదన ధ్వనించే కవితల్ని దీనిలో చేర్చవచ్చనడం గమనించాల్సిన విషయం. ఎండ్లూరి సుధాకర్ రాసిన 'మైసమ్మ మరణం' కవితలో దళిత స్పృహ, ఆర్తి, స్మృతి ఉన్నాయి. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా 'శంబూకుని ఊరేగింపు' అన్న కవితను రాసిన నారాయణస్వామి, మొదలైనవారి కవితల్ని విశ్లేషించారు.

92లో బాగా వినిపించిన మాట 'పరాయీకరణ'. దీన్ని ''వ్యాపారసంస్కృతి నుండి పుట్టిన మానసిక స్థితి''[31]గా వ్యాఖ్యానించారు. ఈ పరాయీకరణ కవిత్వం అందరికీ అర్థమయ్యేది కాదనీ, ''జుగుప్సాత్మక పదాలూ, కామైక పరమైన లైంగిక ప్రతీకలు వాడుతూ జీవితం వికార పార్శ్వాన్ని మాత్రమే దర్శిస్తుంటారు.''[32] ఆధునిక కవిత్వంలో అస్పష్టత అనే వాదం ఇలాంటి కవిత్వం వల్లే వచ్చిందని అభిప్రాయపడ్డారు. గతంలో ఇలాంటి కవిత్వం చాలా వచ్చినా 92లో కొంత తగ్గింది అని తృప్తి పడ్డాడు.

92లో జరిగిన ప్రముఖ సంఘటనలకు స్పందించిన కవులు మంచి కవితలు రాశారని పలువురు కవులను ప్రశంసించారు. సీనియర్ కవుల నిరంతర యాత్రను చూపించిన తీరు బాగుంది. ఇందులో ఆరుద్రగారు అనారోగ్యం నుండి బయటపడిన తర్వాత రాసిన కవితల్ని,

[30] గవాక్షం - డా. ఎన్. గోపి - పేజి – 85.

[31] గవాక్షం - డా. ఎన్. గోపి - పేజి – 89.

[32] గవాక్షం - డా. ఎన్. గోపి - పేజి – 89.

సినారె కుర్రాళ్ళతో పోటీపడి రాసిన కవిత్వాన్ని, వరవరరావు, మాదిరాజు, శీలావీర్రాజు వంటి కవులు రాసిన కవిత్వాన్ని విశ్లేషించారు.

కవులలో సహనం లోపించడం, ఇతర కారణాల వల్ల, విమర్శ, వ్యంగ్య బాణాల దశను దాటినప్పుడు తిట్టు కవిత్వం వస్తుంది. ఇందులో భాగంగా జ్వాలాముఖికి, జయప్రభకు మధ్య జరిగిన కవిత్వపు వాదోపవాదాలు తీవ్రస్థాయికి వెళ్ళడాన్ని చూపెట్టారు. ఈ వాదం జరుగుతున్నప్పుడు తమాషా చూసేవాళ్ళు, పైకి ఒక పక్షంలో ఉండి, రహస్యంగా ఆనందించే వారూ ఉంటారు. వీటి వల్ల సాహిత్యానికి ప్రయోజనం ఉండదు. అందుకే సుమనశ్రీ ''ఇలాంటి వాటిని కవిత్వంగా రాయడం ఎంత అనవసరమో, వాటిని నేను ఇప్పుడు ఉటంకించడం కూడా అంతే అనవసరం''[33] అంటారు.

పద్యకవిత్వం గురించి చెప్తూ ఇది ఒక దశాబ్దం ముందు వచ్చినంతగా రావడం లేదు అంటూనే పద్య రచన మరీ నిరాశాజనకంగా ఏమీ లేదనడం ఆయన అవగాహనను పట్టిస్తుంది. గోపి కవిత్వం లాగానే ఈయన వ్యాసాల భాష, శైలి, విరుపులు సరళంగా ఉన్నాయి.

ఒక రచయిత సాహిత్యాన్ని, ఒక ఉద్యమ సాహిత్యాన్ని, సాహిత్య సిద్ధాంతాల్ని, ఒక సంవత్సర కవిత్వాన్ని వ్యాస పరిధిలో చేర్చి, చర్చించి, తీర్పుల్ని ఇవ్వడంలో గోపి విజయం సాధించారు. అందుకే సాహిత్య విమర్శలో కొత్త 'గవాక్షం'గా చెబుతూ, సాహిత్య విమర్శకు ఈ వ్యాస సంకలనం ఒక చేర్పు అని నిర్ధారించవచ్చు. ఈ విమర్శ గ్రంథాన్ని గురువు, మిత్రుడు అయిన చే.రా.కు అంకితమివ్వడం అభినందనీయం.

5.5 సాలోచన (గోపి పీఠికలు):

పీఠిక (Preface):

ఒక గ్రంథ నేపథ్యాన్ని, లక్ష్యాలను పరిచయం చేస్తూ ఆ గ్రంథ రచయితగానీ, మరొకరుగానీ, విమర్శకుడు గానీ రాసే విశ్లేషణాత్మక పరిచయ వాక్యాలను 'పీఠిక' అంటారు. ఇందులో రచయిత రచన చేయడంలో తన ఉద్దేశాన్ని, రచనలో సహాయపడ్డవారి వివరాలు, కృతజ్ఞతలు, రచన చేసే సమయంలో తాను పడిన ఇబ్బందులు, సమగ్రంగా లేదు అనిపించే సందర్భంలో దానికి కారణాలనూ, ఆ విషయాల వివరణను, ఆ పుస్తకానికి సంబంధించి పాఠకులు తెలుసుకోవాల్సిన అన్ని విషయాలు, వివరణలూ ఇందులో ఉంటాయి. పీఠికకే

[33] గవాక్షం - డా. ఎన్. గోపి - పేజి – 100.

ముందుమాట, భూమిక, మున్నుడి, ఆముఖం, తొలిపలుకు, ప్రస్తావన అనే మొదలైన పేర్లున్నాయి.

ఈ గ్రంథం ముందుమాటలో డా. ఎండ్లూరి సుధాకర్ గారు ''గోపిగారికి యాభైఏళ్ళు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన శిష్యులు, పరిశోధకులమైన మేము గురువుగారి రుణం కొంతైనా తీర్చుకోవాలని సంకల్పించాం. ఆ ప్రయత్నమే సాలోచనగా రూపు దాల్చింది.''[34] అని ఈ గ్రంథాన్ని తీసుకువచ్చిన సందర్భాన్ని ఆత్మీయంగా చెప్పారు.

ఈ 'సాలోచన' పుస్తకంలో మొత్తం 50 పీఠికలున్నాయి. ఇందులో కవిత్వంపై 23 పీఠికలు, పరిశోధనపై 23 పీఠికలు, ఇతరాలపై 4 పీఠికలు ఉన్నాయి. ఈ పుస్తకానికి సంపాదకుడు డా. ఎండ్లూరి సుధాకర్ 1998లో దీన్ని ప్రచురించారు.

''తంగేడుపూలు''కు రాసిన 'నామాట' అనే పీఠికలో గోపి తనకు తాను స్వవిమర్శ చేసుకోవడం కన్పిస్తుంది. ప్రజలకోసం కవిత్వం అనే భావన బలపడిందని, కవిత్వ ప్రయోజనం చైతన్యమై ఉండాలని ఇదే ప్రజాస్వామ్య భావన అని తెలిపారు. తాను, పదేళ్ళ క్రితం రాసిన కవిత్వంలో కొంత పేలవమైన కవిత్వం ఉందని చెప్పుకోగలిగిన ధైర్యశాలి. తొలి సంపుటి కావడం వల్ల రాసిందంతా అందులో చేర్చానని చెప్పుకున్నారు.

పుస్తకం రాయడం కంటే ప్రచురించడం కష్టమని మిత్రుల సహాయం వల్ల 'తంగేడు పూలు' పుస్తకరూపం దాల్చిందని స్నేహితులను స్మరించుకున్నారు. తనపై కుందుర్తి ప్రభావం ఉందంటూనే, నిరంతరం ప్రోత్సహించే గురువు సినారెకు కృతజ్ఞతలు తెల్పిన ఈ పీఠికను 1976లో రాశారు.

దీవి సుబ్బారావు రాసిన 'వైశాఖ సముద్రం' కవితాసంపుటికి 'పారదర్శకత' పేరుతో పీఠిక రాశారు. సుబ్బారావుగారితో ఉన్న స్నేహ సంబంధాన్ని నెమరు వేసుకున్న విధానం బాగుంది. సుబ్బారావుగారు ''ఆప్యాయపు ముద్ద, మ్యూజికల్ చిరునవ్వు'' కవిత్వ చర్చ చేసేటప్పుడు బ్యాలెన్స్ తప్పదని చెప్పారు. ''సుబ్బారావుగారి కవితల్లో నైరాశ్యం ఎంత తక్కువో అస్తిమితం అంత ఎక్కువ. అనుభూతి ఎంత గాఢమో ఆవేశం అంత గూఢం'' అంటూ

[34] సాలోచన – డా. ఎన్. గోపి – పేజి - V

సంక్షిప్తంగా ఆయన కవిత్వ వ్యక్తిత్వాన్ని చెప్పారు. సుబ్బారావుగారికి ఊహల్లో తేలడం ఇష్టమైనా ముందుగా గమ్యం చేరే మార్గాల్ని అన్వేషించాలని సున్నితంగా హెచ్చరించాడు.

'వేమన్న బాటలో – కేశన్న సూక్తులు' అనే శీర్షికతో యం.డి. కేశవకుమార్ 'చెన్నకేశవ ముక్తావళి' ద్విశతిపై రాసిన పీఠికలో సార్వకాలిక నీతుల్ని చెప్పినా సమకాలీన సమాజాన్ని విస్మరించడం ఎవరికీ సాధ్యంకాదని తీర్పునిచ్చాడు. ఛందస్సులపై విశేష చర్చలు చేయడం వీరిలోని సాంప్రదాయక విమర్శకున్ని మనకు పట్టిస్తుంది.

డా. సి. నారాయణరెడ్డిగారి ''ప్రపంచపదులు''కు 'పంచపదుల్లో ప్రపంచం' అనే పీఠికనందించారు. ఇందులో రుబాయి నిర్మాణం, తెలుగులో ఐదో పంక్తిని జోడించి సినారె ప్రపంచపదులు రాశారని, విశ్లేషిస్తూ సుదీర్ఘమైన పీఠిక రాశారు. ఇందులో ఉర్దూ, తెలుగు లక్షణాలను బేరీజు వేసి కావల్సిన సమాచారాన్ని విమర్శనాత్మకంగా అందించారు.

'ఆకాంక్ష' డా. మోహన్ సింగ్ గారి 'ఆశాలయం' కవితా సంపుటికి రాసిన పీఠిక. మోహన్ హృదయంలో వెల్లివిరిసిన మానవతాతరంగాలు ఆయన సామాజిక స్పృహకు, ప్రగతిశీల భావాలకు అద్దం పడుతాయని, శిల్పంపై శ్రద్ధవహిస్తూ ఇంకా మంచి కవితలు రాయాలని ఆకాంక్షించారు. జి. రామశేషయ్య గారి 'అక్షరపతాకం'కు 'శబ్ధారాధకుడు' పేరుతో పీఠిక రాశారు. లోకమంతా అలజడితో ఉంటే గుండె నిండా మాధుర్యం పూసుకొని కవిత్వం రాస్తున్న భావుకుడిగా ఆయనను పేర్కొన్నారు. రామశేషయ్య తన రచనలో పాత పోకడలను వదులుకొని ఆధునిక జీవితాన్ని సమకాలీన దృష్టితో చూసి, కవిత్వాన్ని ఆధునికం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ఎండ్లూరి సుధాకర్ 'వర్తమానం' కవితా సంపుటికి 'జీవితానికి పూచిన పువ్వు' శీర్షికతో పీఠిక రాశారు. డియర్ సుధాకర్ అని ప్రారంభించడంతో శిష్యుడిపై గల మమకారాన్ని చూపారు. కవిత్వాన్ని సమీక్షిస్తూ గోదావరి భూస్వాములది కాదు భూమి పుత్రులది అని అనడంతోనే ఓ బలమైన రాయి విసిరాడని ఎండ్లూరి కవిత్వ దృక్పథాన్ని అంచనావేశారు. ఎండ్లూరి సుధాకర్ తన జీవితంలో ఆకాశమంత నిరాశను పడాల్సివచ్చినా తన కవితల్లో ఆశను నటించకుండా ఆశను సాధించాడని చెప్పడం జరిగింది. కవిత్వం చీపురుపుల్లతో కుళ్లు మేఘాల కళ్లు పొడిచి, మృత్యువును అసహ్యించి చావును చావగొట్టడానికి నేను పుట్టానని అన్నందుకు నీకు నా జోహార్లు అని ఎండ్లూరి కవిత్వాన్ని ప్రశంసించారు.

ఏలేశ్వరం నాగభూషణం గారి ''నేల తడవని వాన' కవితా సంపుటికి రాసిన పీఠిక 'గుండె తడిసిన కవిత'. తెలంగాణా గుర్తింపుతో వచ్చిన ఈ కవిత్వం కొంత సంతృప్తిని కలిగించిందన్నారు. ఈ కవితా సంపుటిలో వర్తమాన పల్లె జీవిత చిత్రణను, అతి సూక్ష్మ భావావేశంతో ప్రజా ఉద్యమ పరిస్థితులు, గ్రామీణుల స్థితిగతులను రికార్డు చేశారని పేర్కొన్నారు. ఇందులోని కవితలు వస్తు భావపరంగా ప్రతిభను కనబరుస్తున్నాయని చెప్పారు. డా. చిట్టిమల్లె శంకరయ్యగారి 'రూపాయి ఆత్మకథ' అనే ఆధునిక కావ్యంపై 'మారకం' పేరుతో తన అభిప్రాయలను వెల్లడిస్తూ మనిషిని శాసించే రూపాయి ఎన్నిరకాల మార్పులకు కారణమవుతుందో చెప్పి, దాని ప్రభావాలను తెలిపారు. రూపాయిని సృష్టించిన మనిషిని ఆవిష్కరించిన తీరు గొప్పగా ఉందన్నారు.

డా. ఎన్. ఆర్. వెంకటేశం 'రాగాభిషేకం' కవితా సంపుటికి 'రాగరాగిణి' అనే పీఠికలో ప్రేమ విశ్వజనీనమైన భావాన్నైనా, అది వ్యక్తుల సంస్కారాన్ని అనుసరించి ప్రతిఫలిస్తుందని చెప్తూ, వ్యాపార సంస్కృతిలో చిధ్రమౌతున్న మానవ సంబంధాల్ని, మనుషుల్ని బ్రతికించేది ప్రేమే అనే సందేశాన్నిచ్చారు గోపి.

షేక్ ఖాసిం 'కోడి కూసింది' కవితా సంపుటిపై రాసిన పీఠిక 'స్వచ్ఛజలం'. కవి స్వచ్ఛమైన హృదయం అమాయకంగా ఉందని, అస్పష్టత లేని పారదర్శక శైలి ఈయన కవితల్లో ఉందని పేర్కొన్నారు.

ముకుంద రామారావు రాసిన 'వలసపోయిన మందహాసం' కవితా సంపుటి గురించి చెప్తూ, ఇప్పుడొస్తున్న కవిత్వంలో ఇది భిన్నమైందని, కానీ ఇతనిపై ఏ ప్రభావం లేదన్నారు. ఈయన కవిత్వం చదివితే స్వచ్ఛమైన కవిత్వం చదివినట్లుంటుందని, మనకు కన్పించే భావి చిత్రాలు ఇతడి కవిత్వంలో కనిపించవంటారు. కానీ రవీంద్ర సంగీతంలోని సున్నితత్వం ఈ కవిత్వంలో కనిపిస్తుందని చెప్పడం జరిగింది.

కాంచనపల్లి 'చేదబావి' కవితా సంపుటికి పీఠిక రాస్తూ తననీ, లోకాన్ని పట్టించుకొని రెండింటి మధ్య సంబంధాన్ని నిలదీసిన, ప్రశ్నించిన, కలలు గన్న కవిత్వం దీనిలో ఉందని పేర్కొన్నారు. ఈయన కవిత్వంలో అంతర్ముఖీనత, ప్రగతిశీలం, స్త్రీ చైతన్యం, దళితస్పృహ, సమకాలీన సంఘటనల ప్రతిబింబమైన కవితలున్నాయని చెప్పడం జరిగింది. ఏనుగు నరసింహారెడ్డి గారి 'సమాంతర స్వప్నం' కవితా సంపుటికి ''సామూహిక ఆచేతనలలోంచి'' అనే

పీఠిక రాశారు. ఇందులో కవిత్వం ఎలా ఉండాలో చెబుతూ ''జీవితంలోంచి రాని, జీవితానికి విధేయం కాని కవిత్వాన్ని నేను ఊహించలేనని''[35] అన్నారు.

'తొలకరి చిత్రాలు' కవితా సంకలనంకు రాసిన 'వాగ్దాన పుష్పాలు' పీఠికలో రాసిన కవులందరినీ పేరుపేరునా పరామర్శించి అందరినీ ప్రోత్సహించారు. వీరిని శిల్పం పట్ల మరింత శ్రద్ధ వహించమని సూచన చేశారు. చెప్పేది ఎంత ముఖ్యమో చెప్పే విధానం కూడా అంతే ముఖ్యమని సున్నితంగా విమర్శించారు.

బత్తిని శ్రీశైలం గారు రాసిన ఈ 'దేశంనాది' అనే పీఠికలో 'గేయం నడక'లో శ్రీశైలం గారు మరికొంత శ్రద్ధ వహిస్తే నాలాంటి గేయాభిమానులకు తృప్తిగా ఉండేదని తెలిపారు. 'ద్వానా కవితలు' సంపుటి గురించి చెప్తూ ''ద్వానా కవితలన్నింటిలో ఆర్తి ఉంది. అస్పష్టత ప్రశ్నే లేదు. అతిస్పష్టత తప్ప'' అని చెప్పడం జరిగింది. భావ చిత్రాల వల్ల అస్పష్టత కాదు అందం వస్తుందని, దీనివల్ల కవిత్వం సుసంపన్నమవుతుందనే అభిప్రాయాన్ని వెల్లడించారు.

గోపి రాసిన నానీలు, ప్రజాకవి వేమన, వేమన్న వాదం, వ్యాసనవమి, వేమన పద్యాలు, నేను చూసిన మారిషస్ మొదలగు గ్రంథాలపై రాసిన స్వీయ పీఠికలు విజ్ఞాన దాయకంగా ఉన్నాయి.

ఇంకా ఫైజుల్ హసన్ ఖియాల్-కంద్-హె-హింద్ కవితా సంపుటికి రాసిన పీఠిక, జింకా సుబ్రహ్మణ్యం, భార్గవీరావు, ననుమాసస్వామి, జి. వెంకటేశ్వర్లు మొదలైన వారి కవితా సంపుటాలకు, పరిశోధనాత్మక వ్యాసాలు రాసి ఆలోచనాత్మకమైన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ విధంగా గోపి ఆయా రచనలకు, గ్రంథాలకు సరిపోయే విధంగా శీర్షికలను సూచిస్తూ వాటిలోని విషయాన్ని విశ్లేషించి సహేతుకమైన తీర్పులు, మార్పులను ఆయా కవులకు, పరిశోధకులకు ఇవ్వడం జరిగింది.

5.6 వ్యాసకలశం:

సుదీర్ఘకాలం నుండి కవిత్వాన్ని రాస్తూ, అధ్యాపక వృత్తిలో బోధనను ఒక వైపు, మరోపక్క పరిశోధనను చేస్తూ, వ్యాసరచనలో తనకంటూ ప్రత్యేకతను ఏర్పర్చుకున్నారు గోపి. వ్యాసకలశం అనే వ్యాస సంపుటిని 2012లో ప్రచురించి సాహిత్యలోకానికి అందించారు.

[35] సాలోచన - డా. ఎన్. గోపి - పేజి – 64.

సాధారణంగా కవి విమర్శకుడైతే కలిగే వెసులుబాటు, ప్రయోజనాల్ని గోపి ఒంట పట్టించుకున్నట్లు అర్థమవుతుంది. ఈ వ్యాస సంపుటిలో 15 వ్యాసాలున్నాయి.

ఇందులో మొదటి వ్యాసం గురువైన డా. సి. నారాయణరెడ్డి గారి 80వ జన్మదిన సందర్భంగా రాసింది. ''పుట్టిన ఊరును మాట్లాడించిన మట్టి బిడ్డ సినారె'' ఈ వ్యాస శీర్షిక. సినారె గారు నలభై సంవత్సరాల క్రితం రాసిన 'మావూరు మాట్లాడింది' అనే వ్యాసంలో భాషా పరిణామ విషయాలు చెప్పారని, భాషాశాస్త్రంలో పెద్దగా అభినివేశంలేని ఈయనకు లోకాన్ని పరిశీలించడం వల్ల ఆ పరిజ్ఞానం కలిగిందని పేర్కొన్నారు. పల్లెల్లో మాట్లాడే మాటలను మనం వింటాం కానీ సినారె ఆ మాటల వెనకున్న ప్రాచీన రూపాలను పట్టుకుంటారని చెబుతూ తెలంగాణాలోని కరీంనగర్ మాండలికాలను తీసుకొని 12 వ్యాసాలను (6 వ్యాసాలు ఒక పుస్తకంగా) రెండు పుస్తకాలుగా 'తొలినుడుగు', 'మలినుడుగు' పేర్లతో ప్రచురించారని చెప్పడం జరిగింది. ఇందులో మొదటి ఆరు వ్యాసాల్లో 'పసుల పోశమ్మ' నోటిలోంచి వచ్చిన మాటల చర్చే ఉంటుంది కాబట్టి ఈ పుస్తకం ఆమెకే అంకితమిచ్చారు సినారె. ఆ పాత్ర యదార్థ కల్పనల రూపమని సినారె స్పష్టం చేశారు. సినారె ను పోశమ్మ ''పట్నం నుంచి ఎప్పుడస్తిరి బాంచను'' అని అడిగితే గొంతు మింగుడు పడదని, 'బాంచను' పదం ఆనాటి విషవృక్షమైన నిజాం నవాబు ఫ్యూడల్ వ్యవస్థకు పూచిన పిచ్చిపూలని ఆవేశాన్ని ప్రకటించాడు. ''పైకి గ్రామ్యరూపాలుగా మారిన ప్రాచీన పదాల గుట్టురట్టు చెయ్యడం సినారె నైజం''[36] అని ప్రకటించారు గోపి.

గోపి సినారె 'తొలినుడుగు' పుస్తకంపై తన అభిప్రాయాన్ని చెప్తూ బాగా ఆలోచిస్తే పల్లె రూపాలే కాలక్రమంలో సంస్కృతీకరణం చెందాయా? లేక శిష్టరూపాలు విశిష్ట జానపదాలుగా స్థిరపడ్డాయా అనేది పెద్ద చర్చ అని, ఇది అంత సులభంగా తేలేది కాదనే అభిప్రాయాన్ని వ్యక్తపర్చారు.

'మా వూరు మాట్లాడింది' మలినుడుగులో ఆరు పల్లె పాటలు వాటి వివరణలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ పల్లె పదాలను పల్లవులుగా, చరణాలుగా సినిమాల్లో ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే అని, ఆంధ్ర సన్నివేశంలో అదంత సులభమైన పని కాదని దీనికి కారణం సినారె బలమైన వ్యక్తిత్వం అనే విషయాన్ని స్పష్టం చేశారు.

---

[36] వ్యాసకలశం - డా. ఎన్. గోపి - పేజి – 7

''బతుకమ్మలో జీవిస్తున్న నక్క ఆండాళమ్మ'' అనే రెండవ వ్యాసంలో 60 సంవత్సరాల క్రితం దుండగుల చేతిలో మరణించిన ఎన్. గోపి అక్కగారిపై వ్యాసం రాయమని బతుకమ్మ ఇంచార్జ్ కందుకూరి రమేశ్ బాబు అడిగితే ఈ వ్యాసం రాశానని ఈ వ్యాస ఆవిర్భావం గురించి చెప్పుకున్నారు.

రచయిత 14 నెలల పసివాడుగా ఉన్నప్పుడు తన కుటుంబంలో జరిగిన దుర్ఘటన గురించి చెప్తూ తన అక్క దుర్మార్గుల చేత చిక్కి అత్యాచారానికి గురై హత్యగావింపబడిందని బాధపడ్డారు. ఈ సంఘటనను బల్ల గౌతమయ్య అనే కవి ''నక్క ఆండాళమ్మ ఉయ్యాలపాట'' అనే పేరుతో పాట రాశాడని తెలిపాడు. ఈ పాటను తెలంగాణాలో దసరా చివరి రోజైన సద్దుల బతుకమ్మనాడు పాడుకుంటారని పేర్కొన్నారు.

ఇంత దుర్మార్గం చేసిన దుండగులకు శిక్ష పడలేదని, ఈ అకృత్యానికి సాయంచేసిన ఆకుల లక్ష్మి అనే ఆమెకు కరెంటు కుర్చీ ద్వారా మరణశిక్ష విధించారని ఈ ఉయ్యాల పాటలో విశ్లేషించారు. ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యంలో నక్క ఆండాళమ్మ వృత్తాంతంను వివరించాడు. అలాగే తెలంగాణ యక్షగాన కవి చెర్విరాల భాగయ్య కూడా ఈ వృత్తాంతం గురించి రాశారు.

'అన్యాయమైన ఒక యువతి దీన గాథను తెలంగాణ స్త్రీలు 60 యేళ్ళుగా పాడుకుంటున్నారు. శోకపూరిత నేత్రాలతో ఏటా సద్దుల బతుకమ్మ నాడు యాది జేసుకుంటున్నారు. బతుకమ్మలో ఆమెను చూసుకుంటున్నారు. ఆండాళమ్మ ఇప్పుడు బతికిలేకున్నా బతుకమ్మలో జీవించే ఉంది. కారణం ఉయ్యాలపాటకు అంత శక్తి ఉంది''[37] అంటూ ఈ వ్యాసాన్ని ముగించారు.

''జీవితాన్ని ఉన్నతీకరించిన కవి పాపినేని శివశంకర్'' అనే మూడో వ్యాసంలో సమకాలీన కవుల్లో శివశంకర్ విలక్షణ కవని, ప్రగతిశీల భావాలున్న కవిగా, మేధావిగా, ప్రణయకవిగా, అత్యంత భావుకత కల్గిన కవిగా కీర్తించడం జరిగింది. మూడు దశాబ్దాల క్రితం రాసిన కవితలను చూస్తే కాలంనాడిని గుర్తిస్తూ జీవితాన్ని ఉన్నతీకరించుకున్న వ్యక్తిగా కన్పిస్తాడని చెప్పారు. ఈయన అంతర్ముఖుడిలా కన్పిస్తున్నా, వ్యవస్థను ఆసాంతం పరిశీలించే శాస్త్రకారుడిగా కన్పిస్తారు. ఈయన ''స్తబ్ధత–చలనం'' గురించి ఓ సంపుటిని 84లోనే ప్రచురించారని తెలిపారు. ఇందులో సంప్రదాయ కవులపై వెటకారంతో (కవిని నేను),

[37] వ్యాసకలశం - డా. ఎన్. గోపి - పేజి – 17

శ్మశానాలను ప్రేమించే వాళ్ళను ఉద్దేశించి వ్యంగ్యాత్మకంగా (శ్మశానం వర్ధిల్లాలి), చైతన్య రాహిత్యాన్ని ఎండగడుతూ (నత్తగుల్ల) వంటి కవితలను రాశారని పేర్కొన్నారు.

'ఒక సారాంశంకోసం' అనే కవిత్వ సంపుటిలో బలమైన కవితలు రాశారని, పరాయీకరణ ఒక తాత్విక భావన అంటూ శ్రామిక సంబంధాలు, ధనం, సామాజిక సంబంధాలు దీనిలోకి వస్తాయని, మానవ సంబంధాల వక్రీకరణ కూడా పరాయీకరణకు దోహదం చేస్తుందని చెప్పడం జరిగింది. నాస్టాల్జియా పరాయీకరణలో ఒక భాగమే అని పాపినేని, 'పసిపాట' కవితను ఉదాహరించారు. నాస్టాల్జియాలో నిరాశకు దారితీసే ప్రమాదం ఉన్నా పాపినేని దాన్ని ఒక మధుర స్మృతిగా దాచుకున్నారని వెల్లడించారు.

చివరగా పాపినేని శివశంకర్ గురించి చెపూ "ఒక పరిపూర్ణ కవి. జీవితాన్నీ, సమాజాన్నీ వాటి ఆంతరిక సంబంధాలతో సహా దర్శించగల్గినవాడు"[38] అని చెప్పడం పాపినేని స్థానాన్ని సాహిత్యంలో అంచనా వేయడమే.

'గుజరాత్ లో తెలుగు సాహితీ యాత్ర" అనే వ్యాసంలో గోపి గుజరాత్ రాష్ట్రంలోని కవులతో గల పరిచయాన్ని, అనుబంధాన్ని, ఆ ప్రయాణంలో వారితో గడిపిన అనుభవాల్ని సాహిత్యంతో ముడిపెట్టి చెప్పారు.

2001, జనవరి 18న భోపాల్ లో ఆల్ ఇండియా రేడియో నిర్వహించిన సర్వభాషా కవి సమ్మేళనం జరిగిన సందర్భంలో గుజరాత్ కవి రమణిక్ సోమేశ్వర్ తో స్నేహం ఏర్పడిందని చెప్పడం జరిగింది. ఈ స్నేహంతో ఆయన 'జలగీతం'ను గుజరాతీ భాషలోకి 'జళగీత్'గా అనువదించారని, ఈ అనువాదానికి 2009 సంవత్సరంలో సాహిత్య అకాడమి అవార్డు వచ్చిందని, ఆ అవార్డు వచ్చిన సందర్భంలో ఆయన్ను అభినందించడానికి గుజరాత్ వెళ్ళానని చెప్పడం జరిగింది.

రమణిక్ సోమేశ్వర్ జళగీత్ ను హిందీ అనువాదం ఆధారంగా రాశారు. గుజరాతీ సాహిత్య పత్రికల్లో జళగీత్ ప్రచురింపబడి ప్రాచుర్యం పొందింది. జళగీత్ ప్రాముఖ్యాన్ని చెపూ కచ్ యూనివర్సిటీలో దీన్ని భారతీయ సాహిత్య పేపర్ లో పాఠ్యాంశంగా చేర్చారని చెప్పాడు. కచ్ నుండి జునాగడ్ వెళ్ళి లక్ష్మణ్ దూబేను కలిశారు. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు

[38] వ్యాసకలశం - డా. ఎన్. గోపి - పేజి – 23

పొందిన ''కాలాన్ని నిద్రపోనివ్వను'' కవితా సంపుటిని సింధీ భాషలోకి అనువదించిన చంద్ దూబే జునాగడ్ లోనే ఉన్నారని గుర్తు చేసుకున్నారు. వేమన లాంటి కవి నరసింహ మెహతా జన్మించిన స్థలం కూడా జునాగడే. ఈయన గుజరాతీ ఆదికవి. గాంధీజీకి ఇష్టమైన భజన ''వైష్ణవజనతో'' రాసింది ఈయనే అని వివరించారు.

లక్ష్మణ్ దూబే ఇంట్లో ఏర్పాటు చేసిన సాహిత్య సభకు దాదాపు వందమంది సాహిత్యకారులు, సంగీత విద్వాంసులు వచ్చారన్నారు. ఈ సందర్భంగా గోపి ''ఇక్కడ బంగాళా ఖాతం, అరేబియా సముద్రాల సంగమం జరిగింది''[39] అని పేర్కొన్నారు.

ఈ విధంగా అక్కడి సాహిత్య వాతావరణం గురించి చెప్తూ, రాజకీయవాదులు దేశాన్ని విడదీస్తే, రచయితలు కలిపే పని చెయ్యాలన్నారు. ఎన్నో రాష్ట్రాలకు వెళ్ళిన తాను గమనించిన విషయాన్ని చెప్తూ ఆ భాషా రచయితలకు వారి భాషపై అభిమానముంటుందని, ఆ కవులు స్నేహ భావంతో ఉంటారని, తమ రచయితల గురించి మంచి అభిప్రాయాలు చెప్తారని ఇలాంటి వాతావరణం తెలుగులో ఉన్నట్లుగా తనకు కన్పించలేదంటూ అసంతృప్తిని వ్యక్తపరిచారు. అసూయలు ఉన్నా మనం ఇతర భాషా సందర్భాల్లో అయినా కలిసి ఉండాలన్న ఆకాంక్షను వ్యక్తపరిచారు. 'ఓల్గా ఒక మగ్న' అనే వ్యాసంలో ఓల్గా గురించి చెబుతూ స్త్రీవాదం పట్ల తనకు కొన్ని భేదాభిప్రాయాలున్నప్పటికీ కవయిత్రిగా ఓల్గా పట్ల ప్రత్యేక దృష్టి ఉందని చెప్పారు.

1993లో 'నీలిమేఘాలు' కవితా సంకలనానికి సంపాదకత్వం వహించిందని, అది స్త్రీ వాదానికి 'అప్లైడ్ మేనిఫెస్టో' అని, కవితలు ఎంపికతో పాటు దానికి రాసిన పీఠిక ఎంతో విలువైందని ఓల్గాను ప్రశంసించారు. ఓల్గా కవితాశక్తి, భావుకతలపై ఆసక్తితో ఆమె కవితలు చదవడం మొదలు పెట్టానని, స్త్రీ లేకుండా ఆమె కవిత్వం ఉండదని గ్రహించానంటారు. ఆమె ఏ కవితలో చెప్పినా స్త్రీని స్త్రీగా చూడమని గౌరవించమనే చెప్తారు.

ఓల్గా ఏది రాసినా స్త్రీ వాద ఉద్యమాన్ని బలపర్చడానికే రాసింది. ఆమె వామపక్ష భావజాల ఉద్యమాల్లోంచి వచ్చిందని చెప్పడానికి 'పంచాది నిర్మల వారసురాలిని', 'ఆకలే మిగిలింది' వంటి కవితల్ని చూపారు. ఆమె రాసిన కవితా సంపుటిలో 37 సంవత్సరాలు రాసిన 48 కవితలున్నాయని, అందులో ఎక్కువగా రాత్రి గురించి రాసిన కవితలే ఉన్నాయని చెప్పడం

[39] వ్యాసకలశం - డా. ఎన్. గోపి - పేజి – 29

జరిగింది. అయితే ఇవి దీర్ఘ కవితలోని అధ్యాయాల్లా ఉన్న ఒక ప్రణాళికతో రాయలేదని విమర్శించారు.

పెద్ద పెద్ద మాటలకంటే చిన్న చిన్న ఆచరణలు మేలనిపించిందని, ఓల్గా కవిత్వాన్ని పరిశీలించిన తర్వాత తనలోని భావాల్ని వ్యక్తం చేశాడు గోపి. కవిత్వానికి ఇంతకంటే సార్థకమైన ప్రయోజనం లేదంటారు. 'సహృదయుడంటే ఎవరు?' అనే వ్యాసం ఆంధ్రభూమి సాహితిలో జులై 23, 2012న ప్రచురించబడింది. లోకంలో సహృదయుడంటే మంచి మనస్సు గలవాడు. విద్వాంసుడు, మంచి అభిరుచి గలవాడు అనే అర్థాలున్నాయి. సాహితీ పరంగా చూస్తే పాఠకుడని, నాటకరంగం ప్రకారమైతే ప్రేక్షకుడు, సామాజికుడనే అర్థాలు చెప్పారు.

సహృదయతను అలంకారికులు నిర్వచించిన తీరును వివరిస్తూ, రాజశేఖరుడు భావయిత్రి, కారయిత్రి అని ప్రతిభను రెండు రకాలుగా విభజించాడు. ఇందులో కారయిత్రి సహృదయునికి చెందింది. ఆనంద వర్ధనుడు ధ్వన్యాలోకంలో చెప్పిన నిర్వచనాన్ని పాఠకుడికి పరిచయం చేశారు ఈ వ్యాసంలో. ఈ నిర్వచనంలో 'విశదీ భూతే' అంటే బాగా చూడగలిగిన, తేటతెల్లం చేసిన అని అర్థం. మనస్సును అద్దంతో పోల్చాడు ఆనందవర్ధనుడు.

సహృదయుడు కావడానికి గల దశలను చెప్పారు ఈ వ్యాసంలో. అధ్యాపకుడి బోధనలు విన్న విద్యార్థి ఆ విషయం గురించి ఆలోచించి, తర్వాత కాలంలో వాటి నుండి అధ్యయనం మొదలెట్టి, కొన్ని విషయాలను తన సొంత అభిప్రాయంతో సరిచేసుకునే ప్రయత్నం చేస్తాడు. తనపై ఉన్న ప్రభావాన్ని పక్కన పెట్టి సొంతగొంతుతో అభిప్రాయాలు వ్యక్తం చేయడానికి ప్రయత్నిస్తాడు. 'విశదీభూత' దశలో కవి ఎంత బాగా వర్ణించాడో గుర్తించే దశకు చేరుకొని సహృదయుడు అవుతాడు.

''లోకంలో భిన్నరుచులు ఉండవని కాదు గానీ'' వాటికి అతీతమైన స్థాయిలో కరిగిపోయే హృదయం కలవాడే సహృదయుడు''[40] అట్లా సహృదయత లోపించిన గ్రంథాలుగా వేదం వెంకటరాయశాస్త్రి 'గ్రామ్య భాషా ప్రయోగ నిబంధనము', అక్కిరాజు ఉమాకాంతం విద్యాశేఖరుల 'నేటికాలపు కవిత్వం' లాంటి వాటిని పేర్కొన్నారు. 'జీవితాన్ని ఆర్ద్రీకరించిన కవయిత్రి దివాకర్ల రాజేశ్వరి' అనే వ్యాసంలో ఈమె గురించిన విషయాలు వ్యక్తంచేశారు. ఈమె దివాకర్ల వేంకటావధాని కూతురు. ఇంతకు ముందే ఈమె రెండు కవితా సంపుటాలను

[40] వ్యాసకలశం - డా. ఎన్. గోపి - పేజి – 43

వెలువరించింది. ఈమె మూడు దశాబ్దాలుగా కవిత్వం రాస్తున్నప్పటికీ పేరు పొందడానికి ప్రయత్నించలేదు.

ఈమె అమ్మ గురించి రాసిన కవిత ''ఆమె భూమి తడిపిన ఆకాశం''. నిజానికి ఆకాశమే భూమిని తడుపుతుందని, కానీ ఈమె భూమి ఆకాశాన్ని తడుపుతుందని చెప్పడం కొత్త భావన. కవిత్వం వాస్తవాన్ని తారుమారు చేసి ఒక కొత్త సత్యాన్ని వెలికి తీస్తుందని దీన్ని బట్టి తెలుస్తుంది. భూమిని అమ్మగా భావించిందని, అమ్మ ఆకాశమంత ఎత్తు ఎదిగినా పిల్లలపై మమతను కురిపిస్తుందని, భూమి ఆకాశాన్ని తడపడమంటే ఇదేనని విశ్లేషించడం జరిగింది.

'పూలమ్మే సంపంగి' వంటి వస్తు కవితను, 'అతడు–ఆమె' వంటి మృదువైన స్త్రీవాద కవితను రాయడం జరిగింది. ఆమె ఇప్పటి అర్థంలో ఫెమినిస్టుకాదని, కానీ స్త్రీ చైతన్యానికి ఆమె కవిత్వంలో లోటులేదని, అది ఆమె ఆధీనంలో ఉంటుందని చెప్పడం జరిగింది. చివరగా ఈ విలక్షణ కవయిత్రి ఉన్నతమైన కవిత్వం రాశారని నిర్ధారించడం జరిగింది ఈ వ్యాసంలో.

'సామాజిక కవి యోగి వేమన' అనే వ్యాసంలో ఆవేశపరుడైన కవి, స్థిత ప్రజ్ఞుడైన యోగి కలిసి ఒకచోట ఉండడానికి సాధ్యంకాదని, అయితే అది వేమన విషయంలో సాధ్యమైంది. ఇలాంటి కలయిక భారతదేశంలో ఇతర భక్తి ఉద్యమ కవుల్లో కన్పిస్తుంది. దీనికి వ్యక్తిలోని విశిష్టగుణాలే కాక కాల పరిస్థితులు కూడా అనుకూలించాలి. ఉద్యమం సామూహిక ప్రయత్నం. వ్యక్తిగత సాధన ద్వారా ఆచరించేది యోగం. ఇది ఆధ్యాత్మిక కార్యకలాపం, ఈ రెండింటి మధ్యగల గీతను భక్తి ఉద్యమం తుడిపేసి సమన్వయాన్ని సాధించింది.

ఉత్తర భారతంలో కబీర్, సమర్థ రామదాసు, మహారాష్ట్రలో నామ్ దేవ్, గోరా కుంబార్, తుకారాం వంటి వారిపై ఉద్యమ ప్రభావం ఉంది. ఆంధ్రదేశంలో పోతులూరి వీరబ్రహ్మం, రామదాసు లాంటి వారిని వేమనతో పోల్చవచ్చని, తాత్త్విక చింతన తీసేస్తే సామాజిక, రాజకీయ కోణంలో మన కాళోజిని కూడా వేమన వంటి వాడిగా భావించవచ్చు. ఉద్యమ కవుల్లో చాలావరకు కుల వ్యవస్థను ఖండించిన వారే ఉన్నారు. కవికంటే కూడా పండిత లోకంలో 'వేమన యోగి' అనే పేరు ఎక్కువగా వాడుకలో ఉంది. కాబట్టి యోగిని గురించి మాట్లాడినా ఆయనలోని కవిత్వం గురించి మాట్లాడకుండా ఉండలేము.

ఇతడు కర్మకాండలను విమర్శించారు. దీనివల్ల ఆయన అర్థం అయ్యేలోపే అపార్థానికి గురయ్యాడు. వేమన విమర్శ వ్యంగ్యంగా, ఎగతాళిగా ఉంటుంది. వేమనపై ఉత్తమ గ్రంథం

రాసిన రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారే తట్టుకోలేక ''ఇతని తీట నాలుక మిగుల చెరిచినది''[41] అంటూ నిట్టూర్చాడు. అందువల్ల వేమన ఒక ప్రధాన మతానికి వ్యతిరేకమన్న అపకీర్తి వచ్చిపడింది. వేమన్నపై వ్యాసంగం చేసిన బ్రౌన్ కూ ఈ వ్యతిరేకత తప్పలేదని పేర్కొన్నారు. వేమన్న తాత్త్విక పద్యాలు భారతీయ ఋషి ధర్మాలకు వ్యతిరేకమైనవి కావని పద్యాలను ఉదహరించి విశ్లేషించారు. వేమన మీద ఐదు సంవత్సరాలు పరిశోధన చేసిన గోపి తన 'మైలు రాయి' కవితా సంపుటిలో 'వేమన్న' అనే కవితను రాశారు. ఇందులో ఆయన వ్యక్తిత్వాన్ని దర్శిస్తూ ఆయనపై సమాజంలో వచ్చిన కొంత వ్యతిరేకతను చెప్పడం జరిగింది. సూటిగా విమర్శించే నైజం, నిజాలను నిర్భయంగా చెప్పే ధైర్యం వల్ల చాలా సమస్యలు ఎదుర్కొన్నారు వేమన. అందుకే గోపి వేమన గురించి చెప్తూ–

''వెళ్ళిన చోటల్లా
వేపకాయలు చల్లుతున్నాడు
వేపచెట్లు నడుస్తున్నాయి
జిల్లేల్ల కళ్ళు చిట్లి
కో 'పాలు' కారుతున్నాయి''[42]

అంటూ చేదు నిజాలను చెప్పారు. నిజాలెప్పుడు చేదుగానే ఉంటాయి. కాబట్టే నిజాలను వేపకాయలతో పోల్చాడు. మరోచోట–

''అడిగినవారికి లేదనకుండా
గుప్పెడన్ని నిప్పులు చేతపెడ్తున్నాడు
ఎన్నడూ వినని ఆయుధాలు
హేతువు పేరుతో ఇస్తున్నాడు''[43]

అని అనడంలో వేమన సమాజంలోని అన్యాయాలను ప్రశ్నిస్తూనే దానికి దృష్టాంతంగా పోలికను చెప్తాడు. మూఢనమ్మకాలు, కులం, మతం, వర్గం, ధనిక, పేద ఇలా వేమన స్పృశించని అంశమంటూ ఉండదు. వాటిని పేర్కొంటూ వాటికి కారణాలను కూడా చెప్పడం జరుగుతుంది.

---

[41] వ్యాసకలశం - డా. ఎన్. గోపి – పేజి -51

[42] గోపి కవిత్వం - I (మైలురాయి) డా. ఎన్. గోపి – పేజి -96

[43] గోపి కవిత్వం - I (మైలురాయి) డా. ఎన్. గోపి – పేజి -97

యోగిగా కూడా వేమన కొన్ని విషయాలను చెప్పారు. భౌతిక వాసనా రహితమైన ఆత్మే మిగిలి ఉంటుందని, మరణించిన వారు జీవన్ముక్తి పొందుతారనే సత్యాన్ని యోగి దృష్టితో చెప్పారు. వేమన పద్యాలన్ని ఆటవెలది లో ఉంటాయి. పద్యాన్ని పరుగెత్తించడంలో దిట్ట, వేమన పద్యాలు పండిత, పామరులందరికీ నోటికి రావడానికి ధారణానుకూలమైన శిల్పం కారణమైంది. 'కామిగాని వాడు' అనే పద్యాన్ని ఉదహరించి కోరికలు తీరితేనే కోరికలు నశిస్తాయని అప్పుడు మాత్రమే మోక్ష సాధనకు వీలౌతుందని వేమన అభిప్రాయం.

లౌకికంగా వేమన మానవతావాదని, అతడి విమర్శలు అందులో భాగాలంటారు గోపి. ''ఆయన భావాలు వామన రూపంలో ఉన్న త్రివిక్రమ దీపాలు. వేమన శతక కవి కాదు. సహస్రాధిక కవి''[44] అని నిర్ధారణ చేశారు ఈ వ్యాసంలో.

''పాత్రికేయుని విద్యారంగ విహారం'' అనే వ్యాసం ఆంధ్రభూమి సంపాదకులు ఎం.వి.ఆర్. శాస్త్రి గారి షష్టి పూర్తిని పురస్కరించుకొని రాసిన వ్యాసం. శాస్త్రిగారు రాసిన 'మన చదువులు' అనే పుస్తకంపై ఈ వ్యాసం రాశారు. 'మన చదువులు' లోని వ్యాసాలు 2000 సంవత్సరంలో ''భారతీయ విద్య'' అనే శీర్షిక కింద ఆంధ్రభూమి ఆదివారం అనుబంధంలో ప్రచురించబడ్డాయి.

శాస్త్రిగారు దీనిలో విద్యవ్యవస్థను గురించి 14 వ్యాసాలు ఆవేదనతో రాశారు. ఈ వ్యాసాలు ''ఒక ఉద్వేగంతో, తనను కలవరపరుస్తున్న అనేకానేక ప్రశ్నలను ఎదుర్కొని ఒక చైతన్య పరిధిని విస్తృత పరుచుకుంటూ అన్వేషణాశీలిగా రాశారు.''[45] నిర్మొహమాటంగా, పాఠకులకు స్ఫూర్తి కలిగేలా రాశారు. మొదటి వ్యాసంలో విద్యపై ప్రభుత్వ జోక్యం వల్ల జాతీయ విద్యావ్యవస్థకు ఎలాంటి రూపు ఏర్పడలేదన్నారు.

ఈ వ్యాసంలో జాకీర్ హుస్సేన్ కమిటీ, అధికార భాషా సంఘం వంటి వాటిని దుయ్యబట్టారు. ఇప్పుడు వర్సిటీల పరిస్థితి బాగా లేదు. ప్రమాణాలు ఎవరికీ పట్టవు. రాజకీయాలతో నిండిపోయాయి.''[46] అంటూ విమర్శించారు. ఈ గ్రంథం విద్యారంగ చరిత్రల్లో

[44] వ్యాసకలశం - డా. ఎన్. గోపి – పేజి -58

[45] వ్యాసకలశం - డా. ఎన్. గోపి – పేజి -59

[46] వ్యాసకలశం - డా. ఎన్. గోపి – పేజి -63

ఓ మణిపూస అంటూ దాని ప్రాముఖ్యతను చెబుతూ ఇప్పటికే ఐదు ముద్రణలు పొందిందంటూ అభినందించారు.

''ప్రజాయోగులు వేమన – శ్రీ నారాయణ గురు' అనే వ్యాసంలో భారతదేశం ఖండ భారతమే. యోగులు, సన్యాసులు సృష్టించిన ఆధ్యాత్మికత కలగలిసిన సామాజిక చింతన వల్ల అది అఖండ భారతంగా వెలుగొందింది. దీన్ని యోగులు, సంస్కరణవాదులు ఖండిస్తూ వస్తున్నా ఇది భిన్న మార్గాల్లో విస్తరించింది. తెలుగు సాహిత్యంలో మధ్య యుగ కవుల్లో కుల వ్యవస్థను వేమన ఖండించినంతగా మరెవ్వరూ ఖండించలేదు. ఆ తర్వాత కాలంలో యోగానుభవం వరకు వెళ్ళి మానవీయ స్పృహతో సమానత్వాన్ని ప్రభోదిస్తూ గొప్ప జీవన ప్రస్థానాన్ని సాగించాడు వేమన. కవిగా, ఆవేశపరుడిగా, హేతువాదిగా, సంఘంలోని దురాచారాలకు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాడు.

పై విషయాల్లో వేమనతో పోల్చదగినవారు అక్కడక్కడా కన్పిస్తారు. 19వ శతాబ్దానికి చెందిన కేరళలోని సామాజిక తత్వవేత్త నారాయణ గురును వేమనతో పోలుస్తూ భావజాలాలకు కాలం అడ్డురాదని విశ్లేషించారు. నారాయణ గురు 1856లో త్రివేండ్రం సమీపంలో 'చెంపారుంతి' అనే గ్రామంలో ఈళవకులంలో జన్మించాడు. ఈళవ అంటే మన 'గౌడ్' లాంటి కులం అని వివరణ ఇచ్చారు గోపి. కేరళలో గౌడ్ లు నిమ్నకులస్థులు. వారిని అంటరాని వారిగా చూడడాన్ని వ్యతిరేకిస్తూ హేతువాదిగా మారిన వైనాన్ని ఈ వ్యాసంలో చూపారు. ఈయన నిర్మించిన గుళ్ళలో విద్యావ్యాప్తి జరిగేదని, ధర్మశాస్త్రాలను, వేదాలను నిమ్న కులాలకు నేర్పించేవారని చెప్పడం జరిగింది. ఇది ఒక సాంస్కృతిక వ్యూహంగా మారడమే గాక కేరళలో అక్షరాస్యతను పెంచడానికి, వామపక్ష భావజాలాన్ని పెంచిందని వివరించడం జరిగింది. నారాయణ సామాజిక పోరాటంతో పాటు దానికి ఆధ్యాత్మికతను కలిపి ఎన్నో గ్రంథాలు రాసి, వివక్షతకు వ్యతిరేకంగా, మానవత్వానికి అనుకూలమైన పునాదిని ఏర్పరిచారు. దేశమంతటా పర్యటించిన ఈయన బైబిల్ లోని ప్రేమతత్వంకు ఆకర్షితుడైనాడని, ఖురాన్ లో సర్వమానవ సమానత్వాన్ని ఇష్టపడ్డాడని వ్యాసకర్త నారాయణ గురు తత్వాన్ని వివరించడం జరిగింది. ఇదే దృష్టితో వేమన కూడా ''దర్శనములు వేరు దైవంబు ఒక్కటే''[47] అనే పద్య పాదంలో భగవంతుడు ఒక్కడే అనే భావాన్ని వ్యక్తపరిచాడు. వీరిద్దరూ ఆస్తిక దర్శనాలను

[47] వ్యాసకలశం - డా. ఎన్. గోపి – పేజి -67

అంగీకరించారని, మనుషులంతా ఒకే జాతి అని నారాయణ గురు ప్రవచిస్తే, వేమన ''కులము హెచ్చుతగ్గు గొడవలు పనిలేదు'' అనే పద్యంలో నాది ఎగువకులం, నీది దిగువకులం అనే గొడవల వల్ల ఫలితం లేదని అన్ని కులాలు ఒకే కులం నుంచి పుట్టాయని అదే మానవకులమని. హెచ్చుతగ్గులు చచ్చుమాటలన్నాడు వేమన.

నారాయణ గురు లాగానే వేమన కూడా అద్వైత భావనను కలిగి ఉన్నాడని అద్వైతం గురించి రాసిన పద్యాన్ని ఉదహరించారు.

''శ్రీ నారాయణ గురు లాగానే వేమన కూడా ఎంతో కష్టమైన విషయాలను కూడా అలవోకగా చెప్పారు. ఇలాంటివి చెప్పడానికి కేవలం శాస్త్ర పాండిత్యం సరిపోదు. లోపలకు వెళ్ళిన అనుభవ యోగులకే సాధ్యం. అందుకే వీరిద్దరూ విశిష్టమైన యోగులు, ప్రజా యోగులుగా అవతరించారు''[48] వీరిద్దరి పైనా తులనాత్మక వ్యాసం రాయాలనే ఆకాంక్షతో ఈ వ్యాసం రాశారు. ''సాహిత్యమూ సందర్భమూ'' అనే వ్యాసంలో ఒక రచనను చేసేటప్పుడు దాని తారీఖును నమోదు చెయ్యడం మంచిది, ఓ పదేళ్ళ తర్వాత చూస్తే మన దృక్కోణంలో కొంత మార్పు వచ్చినట్టు గమనించవచ్చు. దీనికంతా కారణం కాలం, సందర్భం, సాహిత్యానికి సంబంధించిన వస్తువులోగాని, రూపంలోగానీ పరిణామం అనివార్యం.''[49] లోకంలో శాశ్వత మూల్యాలు, మౌలిక భావనలు ఉన్నా అవి నిరంతర కాల ప్రభావానికి గురవుతుంటాయి.

సందర్భమంటే సమయం. ప్రాచీనాలంకారికుల అభిప్రాయంలో సాహిత్యమంటే సహితములైన శబ్దార్థాల కలయిక అని అర్థం. శబ్దార్థాల సంబంధం వల్ల భావం ఏర్పడుతుంది. శబ్దాన్ని విడిచి అర్థం, అర్థాన్ని విడిచి శబ్దం ఉండలేవు. రెండింటిదీ భావ సంబంధమే. ప్రకృతిలోని ఏ విషయమైనా వస్తువు కావచ్చు. వస్తు రూపాల సమ్మేళనం వస్తువు అని, విశాల దృక్పథంలో తీసుకుంటే మనిషే ఒక బృహద్వస్తువు. అతడి సంవేదన, మానవ సంబంధాలు, సామాజిక జీవితంలోని ఆటుపోట్లు, వ్యక్తిగత, సాంఘిక వైరుధ్యాలు అన్నీ సాహిత్య వస్తువులే. ఉనికి కలిగి ఉండేది వస్తువని, కావ్యానికైనా, కథకైనా వస్తువు మూలం. దేన్నైనా వస్తువుగా భావించవచ్చు. దీన్నిబట్టి చూస్తే వస్తువు అనంతత్వాన్ని సూచిస్తుంది.

---

[48] వ్యాసకలశం - డా. ఎన్. గోపి – పేజి -70

[49] వ్యాసకలశం - డా. ఎన్. గోపి – పేజి -73

‘‘కాలం అనే మహానదిలో అప్పుడప్పుడూ ఒక్కొక్క నీడ ప్రత్యక్షమైనట్టు వస్తురూపాలు ప్రయాణం సాగిస్తుంటాయి. కొత్త ప్రయాణికులుగా సరికొత్త అభిరుచి ప్రవీణులు, సహృదయులుగా, భావుకులుగా అవతారమెత్తుతుంటారు. సందర్భాన్నిబట్టే ఏదైనా రాణింపుకొస్తుంది.’’[50] ఇందులో కవిత్వ విమర్శకుడిగా గోపి ఇచ్చిన వివరణలు ఆలోచింపచేస్తాయి. ‘రాళ్ళబండి కవిత్వంలో రత్నాలు’ అనే వ్యాసంలో అవధాని అయిన రాళ్ళబండి కవితా ప్రసాద్ ప్రతిభను విశ్లేషించడం జరిగింది. అవధానం ఒక సాహిత్య క్రీడ. దీనికి కవితా శక్తితో పాటు నిర్వహణ సామర్థ్యం కూడా ఉండాలి. ఈయన అష్టావధానాలు, శతావధానాలే కాక, నవరస నవావధానం, అపూర్వ దశావధానం, సాహిత్య ప్రక్రియావధానం, విచిత్ర అష్టావధానం (24 నిమిషాల్లో అష్టావధానం), అలంకార అష్టావధానం గంటకు 300 కంద పద్యాలతో ఆశుకవితా నిర్వహణం, శతలేఖినీ పద్య సంధానం, ద్విశతావధానం వంటి అవధానాలలో దిట్ట అని ఆయన విద్వత్తును వివరించారు.

కవితా ప్రసాద్ బందర్ లో చేసిన ద్విశతావధానంలో చెప్పిన పద్యంలో ‘‘సుందరమైన సంధ్యరుచి శోభితమైనది శాద్వలంబు’’[51] అనే రెండవ పాదంలో ఉన్నదంతా కవిత్వమే. ఏ కవిత్వంలో అయినా ‘నాస్టాల్జియా’ (Longing for a happier or better time in the past) కాల్పనిక సృజనకు దోహదపడుతుంది. ఇలాంటి వాతావరణం ‘దోసిట్లో భూ మండలం’ అనే కవితా సంపుటిలో పుష్కలంగా కన్పిస్తుంది. ‘అగ్నిహంస’ అనే వచన కవితా సంపుటి గురించి రాస్తూ అగ్నిహంస అనేది ప్రాణ స్పందనకు ప్రతీక అని, ఇందులో జీవుని వేదన, తాత్విక జీర స్పష్టంగా కన్పిస్తుంది.

‘‘ఉన్నతోద్యోగాలు, బహుకార్య వ్యగ్రత కవిత్వ రచనకు అడ్డుకానేరవు. అతి బహుర్ముఖత్వం వల్ల మౌనాన్ని పోగొట్టుకోని వారికి, తోటి మనుషుల్ని ప్రేమించేవారికి ఇటువంటి అనార్ద్రకరమైన ప్రమాదాలు రావు. కవితా ప్రసాద్ లాంటి నిత్యచైతన్య శీలి, మరింతలోతైన, విస్తృతమైన భావనా ప్రపంచాన్ని సృష్టిస్తూ ముందుకు సాగుతాడని నా నమ్మకం’’[52] అంటూ చిన్న సూచన చేశాడు. గోపి విమర్శకుడిగా ఉన్నా ముందు కవే, కాబట్టి గొప్ప కవిత్వం రావాలంటే ఇలాంటి సూచనలు చేయక తప్పదు. ‘హిందీ అనువాద

[50] వ్యాసకలశం - డా. ఎన్. గోపి – పేజి -73

[51] వ్యాసకలశం - డా. ఎన్. గోపి – పేజి -75

[52] వ్యాసకలశం - డా. ఎన్. గోపి – పేజి -81

పితామహుడు బాలశౌరిరెడ్డి' అనే వ్యాసంలో తెలుగు సాహిత్య సౌరభాల్ని భారతదేశమంతా వ్యాపింపచేస్తున్న హిందీ సాహితీవేత్త, తెలుగు బిడ్డ వై. బాల శౌరిరెడ్డి గారి కృషిని వివరించడం జరిగింది. ఈయన హిందీలో దాదాపు 13 నవలలు రాశారు. మాతృభాష తెలుగు నుండి హిందీలోకి ఎన్నో అనువాదాలు చేశారు. రెండు భాషల తులనాత్మక పరిశీలన చేయడం వల్ల ఆయన 'ద్వివాగీశ్' అనే బిరుదు మరియు 'హిందీ రత్న' అనే బిరుదులు పొందారు.

ఈయన కడప జిల్లా గొల్ల కోడూరు గ్రామంలో జన్మించారు. గాంధీగారి ప్రేరణతో, హిందీ భాషపై ఉన్న ఇష్టంతో ఉత్తర భారతంలోని అలహాబాద్, బెనారస్ లలో ఉన్నత విద్య అభ్యసించారు. బాలశౌరిని చూస్తే తెలుగువారికి గర్వంగానూ, హిందీ వారికి ఇష్టంగా ఉంటుంది. కాబట్టే సినారె ఈయనను 'సవ్యసాచి' అని ప్రశంసించారు.

తెలుగు రచనల గొప్పదనాన్ని తెలియజేసే గ్రంథాలను హిందీలోకి అనువదించారు. వాటిలో రావిశాస్త్రి అల్పజీవి, బీనాదేవి కాలాతీత వ్యక్తి, రావూరి భరద్వాజ కౌముది, వీరేశలింగం పంతులు గారి రాజశేఖర చరిత్ర వంటి ఎన్నో గ్రంథాలను హిందీలోకి అనువాదం చేశారు.

అనువాదకుడికి ఎలాంటి ఉత్తమ రచనలు కావాలో, అవి ఇతర భాషల్లో మన ప్రాధాన్యాన్ని ఏ స్థాయిలో నిరూపిస్తాయో తెలిసుండాలి. అనువాదాల వల్ల భాషా సంపద పెరుగుతుంది. ఇలాంటి విషయాలను బాగా గుర్తెరిగిన వ్యక్తి బాలశౌరి. 225 తెలుగు కథానికల్ని హిందీలోకి తీసుకెళ్ళారు. హిందీ బాల పత్రిక 'చందమామ'కు సంపాదకుడిగా, 'చమక్ తా సితారా' హిందీ పత్రికకు కూడా ప్రధాన సంపాదకులుగా ఉన్నారు. కథానికలు, ఏకాంకికలు 300 లకు పైగా ప్రచురించారు. అందుకే విమర్శకులు సైతం ఈయనకు 'వాఙ్మయ రత్నాకరుడు' బిరుదు సరిగ్గా సరిపోతుందన్నారు. 'తెలుగు వాఙ్మయ నిర్మాతలు', 'హిందీ ప్రతినిధి కథానికలు', 'వేశ్య' అనే కావ్యం, 'బల్లే సుర్ బకరియా' అనే రచనలు మాత్రమే కాకుండా ''తెలుగు సాహిత్య చరిత్రను'' హిందీలో రచించి మన సారస్వతాన్ని దేశానికి తెలియజేసిన ఘనత బాలశౌరిరెడ్డిగారిదే. అందుకే గోపిగారు ''మంచివ్యక్తి నుండే మంచి సాహిత్యం పుడుతుంది అనడానికి ఆయన ఒక సజీవ ఉదాహరణ''[53] అటూ బాలశౌరిరెడ్డి గారిని ప్రశంసించడం జరిగింది.

[53] వ్యాసకలశం - డా. ఎన్. గోపి – పేజి -86

‘‘రచయితలకు రచయిత సి. రామచంద్రరావు’’ అనే వ్యాసంలో ఈ తరం వారికి తెలియని గొప్ప కథకుడిని పరిచయం చేయడం జరిగింది. రాసింది పది కథలైనా, అవి గొప్పగా ఉన్నాయని ఈ వ్యాసం రాసేవరకు తనకు తెలియదని వ్యాసకర్త చెప్పడం జరిగింది.

సి. రామచంద్రరావు తమిళనాడులో ‘టీ–ఎస్టేట్స్’లో అధికారిగా పనిచేశారని, ఈ కథలు 50–60 సంవత్సరాల క్రితంవని, బ్రిటీష్ కాలంలో తెల్లదొరల మధ్య నల్లదొరలా బ్రతికిన అనుభవాల్ని గురించి రాసినవని పరిచయం చేయడం జరిగింది. ‘వేలుపిళ్ళై’ కథ గురించి చెప్తూ నవలకు కావల్సినంత ఇతివృత్తమున్నా కథలోనే ఇమిడ్చి రాయడం, మనకు తెలియని వాతావరణంలో ఉన్నా మనకు అలవాటున్నట్లే కథను చదువుతామని, దీనికి కారణం ‘‘రచయిత కథను ఒక జీవితంలా పూర్తిగా అనుభవిస్తూ చెప్పడం కారణం కావచ్చు’’[54] అంటూ కథకుడి ప్రతిభను చెప్పడం విశేషంగా ఉంది.

‘‘కంపెనీ లీజ్’’ అనే కథలో తప్పును క్షమించవచ్చుగానీ, తెలిసిచేసే తప్పును క్షమించలేమంటారు. ఈ కథల గురించి వ్యాసకర్త ‘‘అసలు ఏ కథకైనా స్థాయిని ఎలా నిర్ణయిస్తారు? ఇవి సమస్యల కథలు కావు. సమస్య తీరగానే వాటిని మరిచిపోయే అవకాశముంది. కాని, సి. రామచంద్రరావు కథలు ఒక కాలంలో జరిగినా ఆ కాలంలోనే ఆగిపోవు. ఆ కాలంలో ఉన్న వాటిలోని పాత్రల పేర్లు, హోదాలు తొలిగిపోయి రక్తమాంసాలు గల మనుష్యులుగా మిగిలిపోతాయి. అక్కడ అవి మానవ కథలుగా సాక్షాత్కరిస్తాయి. అవి ఏ దేశంలో ఏ భాషల వారు చదివినా ఇటువంటి అనుభూతే పొందుతారు.’’[55] అంటూ కథల ప్రాముఖ్యతను వివరిస్తూ, రచయిత ప్రజ్ఞను ప్రశంసించారు విమర్శకుడు గోపి.

‘‘మనిషిని ప్రేమించే మంచికవి రామచంద్రమౌళి’’. ఈ సంపుటిలోని చివరి వ్యాసం ఇది. చంద్రమౌళి వరంగల్ లో 1950లో జన్మించారు. చదివింది ఇంజనీరింగ్ అయినా కవిత్వాన్ని మరిచిపోకుండా వివిధ రచనలు చేశారు. వాటిలో స్మృతిధార, శిలలువికసిస్తున్నాయి, ఎటు, అంతర్దహనం, ఒక దేహం అనేక మరణాలు వంటి చక్కని కవితా సంపుటిలు వెలువరించారు.

---

[54] వ్యాసకలశం - డా. ఎన్. గోపి – పేజి -89

[55] వ్యాసకలశం - డా. ఎన్. గోపి – పేజి -93

'అంతర్దహనం' శీర్షికతో ఉన్న కవిత భీభత్సరస ప్రధానమైన చిన్న కావ్యం అని తెలిపారు. రామాచంద్రమౌళిది వకృత్వశైలి. ఒక భావాన్ని విస్తరిస్తూ పోయే పద్ధతి తెలిసిన వ్యక్తని, ఆటంకం లేని వాక్య విన్యాసం వంటివి ఆయన రచనా పద్ధతులని తెలిపారు. ''వర్తమాన కవిత్వంలో నిరంతరం జీవితాన్ని అన్వేషిస్తూ సాగే కవి యాత్రికుడు రామాచంద్రమౌళి. బాధను, వేదనను, ఆర్తిని, ఆందోళనను, ధిక్కారాన్ని వస్తువులుగా స్వీకరించి ప్రతి సందర్భాన్ని వెలిగించే సూర్యవంశీకుడితడు. అంతర్ బహిర్ లోకాల పెనుతుఫానులో తెరచాపను శాసించే నావికుడు. ఒక్క మాటలో చెప్పాలంటే మనిషిని ప్రేమించే మంచి కవి''[56] అని అతనిలోని మానవీయ కోణాన్ని వ్యక్తపరిచాడు. వ్యాసకర్త గోపి ఈ 15 వ్యాసాల్లో భిన్నమైన వ్యక్తులు, వస్తువులతో చెప్పబడిన వ్యాసాలు రాశారు. అందులోని విషయాలు సునిశితంగా పరిశీలించి సాధికారికమైన తీర్పునిచ్చారు. విమర్శకుడిగా 'గోపి' పరిణితి విశ్లేషించిన తీరు ఈ వ్యాస సంపుటిలో కన్పిస్తుంది. విమర్శలో విచక్షణను కోల్పోని తత్వం మానవతా విలువలతో బేరీజు వేయడం ప్రశంసనీయం.

★★★

[56] వ్యాసకలశం - డా. ఎన్. గోపి – పేజి -100

ఆరవ అధ్యాయం

పరిశోధకుడిగా గోపి

అధ్యాయం – 6

పరిశోధకుడిగా గోపి

6.1 పరిశోధన వివరణ:

'Research' అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా 'పరిశోధన' అనే పదాన్ని తెలుగులో వాడుతున్నాం. కన్నడ వారు దీన్ని 'సంశోధన' అంటారు. శోధనమంటే వెతకటం, వడగట్టడం, పరిశీలించడం, సారాన్ని వెలికితీయడం, శాస్త్రీయ దృక్పథంతో సత్యాన్వేషణ చేయడం, సప్రమానంగా, సత్యప్రతిపాదన చేయడం పరిశోధన. పరిశోధనకు అన్వేషణ, ప్రమాణ నిర్ణయాలు ప్రాతిపదికలుగా నిలుస్తాయి.

సాహిత్య పరిశోధన సాహిత్య సిద్ధాంత దర్శన ప్రాతిపదిక రూపంగా ఫలిస్తుంది. పరిశోధన ఒక విషయంపై అవగాహనను, జ్ఞానాన్ని పెంచేదిగా ఉండాలి. సిద్ధాంతాన్ని ప్రతిపాదించేదిగా ఉండాలి. అందుకు తగిన సామాగ్రిని సేకరించుకోవాల్సి ఉంటుంది. పూర్వ సిద్ధాంతాలను పునర్మించాల్సి రావచ్చు కూడా. సత్యాన్వేషణ దృష్టితో, సమన్వయవైఖరితో తదేక దీక్షతో, నిరహంకారంగా, నిర్భయంగా, నిస్సంకోచంగా చేసేది గొప్ప పరిశోధనగా నిలబడుతుంది.

పరిశోధకుడు నిశితంగా ఆలోచించుకొని నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ధైర్యంగా వాస్తవాన్ని చెప్పగలగడం పరిశోధకుడికి కావలసిన ముఖ్య గుణాలలో ఒకటి. పరిశోధకుడి అభిప్రాయాల్ని ఆధారాలతో ఎవరైనా విమర్శిస్తే అంగీకరించాలి. పరిశ్రమ పరిశోధకుడికి కావల్సిన ఉత్తమగుణం. సాహిత్య పరిశోధనలో ఆరు రకాలను జి.వి. సుబ్రహ్మణ్యం గారు గుర్తించారు. 1. సాహిత్య సిద్ధాంత ప్రాతిపదికం 2. అనుశీలనాత్మకం 3. సమన్వయాత్మకం 4. వివేచనాత్మకం 5. విశ్లేషణాత్మకం 6. వర్ణనాత్మకం. వీటిలో సాహిత్య సిద్ధాంత ప్రాతిపదికం అత్యుత్తమమైంది. సిద్ధాంత దర్శన ప్రాతిపదికగా విలువలను నిగ్గుతేలిస్తే అనుశీలనాత్మక పరిశోధనగా గుర్తించడం జరుగుతుంది. లక్ష్యలక్షణ, అంగాంగ, బహిర్, అంతర్ అంశాల సమన్వయాన్ని సమన్వయాత్మక పరిశోధనగా, కార్యకారణ సంబంధాన్ని ఆవిష్కరణ పద్ధతిని అనుసరించి వివేచిస్తే వివేచనాత్మక పరిశోధనగా, విషయాంశాలను విశ్లేషించి చూపే పద్ధతి

విశ్లేషణాత్మకం, విషయ వివరణే ప్రధానంగా ఉండేది వర్ణనాత్మక పరిశోధన గ్రంథంగా పరిగణించారు.

సి. నారాయణరెడ్డి పరిశోధన మూడు రకాలు అన్నారు. 1. పరిశోధన 2. ఉపరిశోధన 3. గిరిశోధన. మొదటిదేమో నూతనాంశాలతో మౌలికంగా రూపొందేది. రెండోది పైపైన పరామర్శించేది. మూడోది కొండను తవ్వి ఎలుకను పట్టడం అంటూ పరిశోధన రకాలను పేర్కొన్నారు.

సాహిత్యంలో పరిశోధన ఒక ప్రక్రియగా చెప్పవచ్చు. ఇప్పటివరకు తెలుగు సాహిత్యంలో కట్టమంచి రామలింగారెడ్డి నుండి నేటి వరకూ ఎందరో పరిశోధకులు వివిధాంశాలపై విలువైన పరిశోధనలు చేశారు. అయితే ఇప్పటికి పరిశోధించాల్సిన విషయాలు తెలుగు సాహిత్యంలో మిగిలే ఉన్నాయి. వర్తమాన కాలంలో సమాజంలో జరిగే విషయాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ, జాతిని జాగృతం చేశారు కొందరు. అయితే చరిత్ర గర్భంలో జీర్ణించుకుపోయిన విషయాలను, మరుగున పడిన విషయాలను మనకు అందించిన వారు కొందరు. తమ కార్యకలాపాల్లో నిరంతరం శ్రమిస్తూ కూడా కవిత్వ కళతో పాటు 'పరిశోధక' కళనూ సుసంపన్నం చేస్తున్న వ్యక్తులు కొందరు ఉన్నారు. అలాంటి వారిలో ఒకరు డా. ఎన్. గోపి. ఇందుకు వారి పరిశోధన, విమర్శ గ్రంథాలే నిదర్శనాలు. ఈయన చేసిన పరిశోధన కృషిని తెలిపే గ్రంథాలు:

1. ప్రజాకవి వేమన (సిద్ధాంత గ్రంథం) – 1980
2. వ్యాస నవమి (వ్యాస సంపుటి) – 1987
3. వేమన పద్యాలు (పారిస్ (ప్రతి – సముద్ధరణ) – 1990

6.2 ప్రజాకవి వేమన:

డా. ఎన్. గోపి ఉస్మానియా యూనివర్సిటీ నుండి 1979లో డాక్టరేట్ డిగ్రీ పొందిన సిద్ధాంత గ్రంథం 'ప్రజాకవి వేమన'. పరిశోధన అనంతరం ఆయనను 'వేమన గోపి' అని పిలిచారంటే ఆ సిద్ధాంత గ్రంథ రచనకు ఆయన చేసిన కృషి తెలుస్తుంది. ''ఆంధ్ర సాహిత్య ప్రపంచంలోకి వేమనను అడుగుపెట్టడానికి అనుమతిస్తూ అందునా ఆ విషయాన్ని ప్రజాకవిగా అంగీకరిస్తూ ఆయన మీద పరిశోధనకి ప్రథమంగా ఒక విశ్వవిద్యాలయం డాక్టరేట్ ఇచ్చింది.

ఇది వేమన కీర్తి ప్రతిష్టలకేమీ కిరీటం కాదు గానీ, మన విశ్వవిద్యాలయాల్లోని తెలుగు శాఖ పరిణామ చరిత్రలో ఒక సువర్ణఘట్టం'' – జ్యోతి మాసపత్రిక, జూన్, 1981, వ్యాసకర్త – సి. ధర్మారావు.

ఎనిమిదిన్నర దశాబ్దాల ప్రాచీన తెలుగు సాహిత్య చరిత్రలో నన్నయ నుండి ఎక్కువమంది రాజాస్థాన కవులు కాగా, వేమన వంటి వాళ్ళు ఆస్థానేతరకవులు. వేమనను 1929లో తెలుగు సాహిత్యానికి పరిచయం చేసింది సి.పి. బ్రౌన్. ఇది మొదలుకొని సాంప్రదాయవాదులు, ఆధునికవాదులు వేమన పద్యాలు ఆయనే రాశాడా అనే అనుమానం వ్యక్తపరిచారు. వేమన తెలుగు సాహిత్యానికి పరిచయమైనప్పటి నుండి ఎన్నో వాదాలకు, చర్చలకు స్థానం కల్పించాడు. అయినా దానిలోనూ పరిశోధనాంశాలున్నాయి. అకడమిక్ పరంగా వ్యాసాల రూపంలో కొందరు దీనిపై చర్చ చేశారు. అయితే పరిశోధనకు మొదటగా పూనుకుంది డా. ఎన్. గోపి. వేమన పద్యానికి ఏ కవికీ రానంత ప్రాచుర్యం లభించింది. వేమన పద్యాల్లో కనిపించిన మత, ఆర్థిక పరమైన భావాలు సంప్రదాయవాదులను ఆకట్టుకుంటే, అతడి పద్య నిర్ణయం, కాలం, ప్రాంతం, కవిత్వం మొదలైన అంశాలు పరిశోధకులను ఆకట్టుకున్నాయి. అలాంటి వారిలో గోపి ఉన్నారు. డా. ఎన్. గోపి ప్రజాకవి పరిశోధన గురించి చెప్పాలంటే ముందుగా ఆయన పరిశోధనకు అవసరమైన విషయ సేకరణ చేసి, పరిష్కరణ చేసుకున్నాడు. ఇందులో వేమన పద్యాల సంఖ్యానిర్ణయం, పాఠ నిర్ణయం, పరస్పర వైరుధ్యాలు ఎదురైన పట్టుదలను, వేమన కాలం గురించి, ప్రాంతం గురించి చర్చను ఆనాటి సామాజిక పరిస్థితులను విపులంగా విశ్లేషించారు.

ఈ సిద్ధాంత గ్రంథం ఇప్పటివరకు 6 పునర్ముద్రణలు పొందింది. ప్రజాకవి వేమన సిద్ధాంత గ్రంథం రెండవ ముద్రణ 494 పేజీలతో ఉంది. ఈ గ్రంథం ప్రారంభంలో రెండు ముందు మాటలు అందించారు. ఈ సిద్ధాంత గ్రంథాన్ని 6 అధ్యాయాలుగా విభజించారు.

1. వేమన పద్య నిర్ణయం

2. వేమన కాలం, ప్రాంతం

3. వేమన పద్యాల నేపథ్యం

4. వేమన్న వేదాంతం

5. వేమన్న కవిత్వం

6. ప్రజా కవిత్వ సంప్రదాయంలో మరికొన్ని మణులు

ఇంకా అనుబంధంలో వేమన్న చిత్రం, వేమన సమాధి, ఆధార గ్రంథాలు, ఫోటోలు, చిత్రాలను పొందుపరిచారు. ''ఇవాళ ఆంధ్ర దేశంలో వేమనగారిపై సాధికార పరిశోధనలు చేసిన ఇద్దరు ముగ్గురు అనుభవజ్ఞులలో ఈయన ఒకడు''[1] అని ఆరుద్ర గోపిని ప్రశంసించారు.

డా. ఎన్. గోపి తర్కం, సహనం, నేర్పు, నైశిత్యంతో ఈ గ్రంథాన్ని రాశారని కేతు విశ్వనాథరెడ్డి వివరించారు. వేమనను 'ప్రజాకవి'గా మొదటగా సాహిత్యంలో పేర్కొంది గోపిగారే అయి ఉండొచ్చు. గ్రామాల్లోని ప్రజలకు కూడా వేమన సుపరిచితుడు కావడంతోనే గోపి ఈ సిద్ధాంత గ్రంథానికి 'ప్రజాకవి వేమన' అని నామకరణం చేసి వేమనను సాధ్యమైనన్ని కోణాల్లో నుంచి పరిశీలించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించారు. పరిశోధకుడిగా గోపి చేసిన కృషిని చెప్పాలంటే వేమన సామాన్య ప్రజానికానికి ఎంత దగ్గరగా ఉన్నాడో, పరిశోధనకు మాత్రం ఎన్నో అనుమానాలను, అపోహలను కల్పిస్తూ అంచనాలకు అంతు చిక్కనంత దూరంలో ఉన్నాడని, అతడి కాలం, ప్రాంతం, పద్యాల సంఖ్య వంటి విషయాల్లో అన్నీ సమస్యలే అని చెప్పారు. ఈ సమస్యలన్నింటినీ గోపి గారు ఈ సిద్ధాంత గ్రంథంలో పూర్తిగా పరిష్కరించలేకపోయినా వేమనపై ముందు చెప్పిన వారి కంటే ఒక అడుగు ముందుకు వేశాడని చెప్పుకోవచ్చు. ఏ పరిశోధకుడైనా తనకు పూర్వం జరిపిన పరిశోధకుల పరిశోధనలను సరిగ్గా అర్థం చేసుకొని వాటిని జాగ్రత్తగా పరిశీలించి సరైన విలువను పెంచుకోవాలని చూస్తారు. గోపి ఈ విషయంలో చూపిన ప్రతిభను ప్రశంసించకుండా ఉండలేము.

మొదటి అధ్యాయం అయిన వేమన పద్య నిర్ణయం చాలా ముఖ్యమైన అంశం. గోపి ఈ అధ్యాయంలో పరిశోధకుడిగా క్షేత్రస్థాయిలో చేసిన కృషిని తెలయజేస్తుంది. గోపి తన పద్యాల సేకరణలో సి.పి. బ్రౌన్ గురించి చెబుతూ ''వేమన పద్యాల ప్రతులను గురించి ముచ్చటించేటప్పుడు ఆంధ్ర వాఙ్మయోద్ధారకుడూ, మహనీయుడు అయిన సి.పి. బ్రౌన్ కు

[1] ప్రజాకవి వేమన – డా. ఎన్. గోపి – పేజి -493

చేయెత్తి నమస్కరించక తప్పదు. తాళపత్ర ప్రతులను సేకరించి వాటి కాపీలు వ్రాయించి, పాఠభేదాలను పోల్చి చూసి శుద్ధ పాఠాలను నిర్ణయించడం ద్వారా ఆయన చేసిన కృషి అనితర సాధ్యమైనది."[2] అన్నాడు.

వేమన పద్య సంపుటాల గురించి తెలుపుతూ మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో 54 సంపుటాల వరకు ఉన్నాయి. వీటిలో 38 ప్రతులు తాటాకు ప్రతులు, 16 కాగితం ప్రతులు ఉన్నాయి. ఈ 38 తాళపత్ర ప్రతులను ఇంచుమించు బ్రౌన్ సేకరించాడని, ఇవికాక తంజావూరు సరస్వతీ మహల్ లైబ్రరీలో 5 ప్రతులు, కాకినాడ సాహిత్య పరిషత్తులో 7 ప్రతులున్నాయని, వాటన్నింటిని సేకరించారు. వాటన్నింటి వివరాలను క్రమంగా బ్రౌన్ ప్రతులు, తంజావూరు ప్రతులు, కాకినాడ ప్రతులు, హైదరాబాద్ ప్రతులు, బ్రౌన్ రాయించిన కాగితపు ప్రతులు వాటి వివరాలన్నీ వరసగా లైబ్రరీసంఖ్య, పద్య సంఖ్య, ప్రతిపేరు, రిమార్కులుగా పేర్కొన్నారు.

బ్రౌన్ సేకరించిన 38 తాళపత్ర ప్రతుల్లో పద్యాలన్నీ కాగితాల మీద రాయించాడు. ఆ విధంగా రాయించి అవి 16 కాగితపు ప్రతులున్నాయన్నారు గోపి. వీటిలో 16061 పద్యాల సంఖ్య ఉందని, ఇవి మొత్తం వేమన పద్యాల సంఖ్య కాదని 38 ప్రతుల్లో పద్యాల్ని కలిపితే వచ్చిందని, కాగితపు ప్రతుల్లో రాశిసంఖ్య 15852. వీటిలో బ్రౌన్ వదిలేసిన పద్యాలు తక్కువే అన్న విషయాన్ని తెలిపారు.

బ్రౌన్ 16 కాగితపు ప్రతులలోని పద్యాలనే పరిశోధనకు తీసుకున్నాడు గోపి. దీనికి కారణం ఈ 16 కాగితపు ప్రతులను చూస్తే 38 ప్రతులు చూసినట్టే అవుతుంది. కాబట్టి తన పరిశోధనకు ఎక్కువగా వీటిపైనే ఆధారపడ్డారని ఈ పరిశోధనను పరిశీలిస్తే తెలుస్తుంది. పాఠాంతరాలు, విభేదాలు వచ్చినప్పుడు అదనపు సమాచారం కోసం, తంజావూరు, కాకినాడ ప్రతులను సంప్రదించారు.

[2] ప్రజాకవి వేమన – డా. ఎన్. గోపి – పేజి -1

బ్రౌన్ సేకరించిన వేమన పద్య ప్రతుల్ని ‘‘భౌగోళిక దృష్టితో రెండు భాగాలుగా విభజించారు. 1. ఒక ప్రాంతంలో పుట్టి ఆ దరిదాపుల్లో సేకరింపబడ్డవి. ఉదాహరణకు గూడూరు ప్రతి, గూడూరులో పుట్టి నెల్లూరులో దొరికింది.

2. రెండో తరగతి ప్రతి పుట్టిన దేశానికి సుదూర ప్రాంతాల్లో సేకరించబడ్డాయి. ఉదాహరణకు – బెండమూరి లంక (తూర్పుగోదావరి జిల్లా) కు చెందిన ప్రతి డి. 1735), బ్రౌన్ కు పెనుగొండ (అనంతపురం జిల్లాలో) దొరికింది.’’[3] ఈ విధంగా బ్రౌన్ అనేక చోట్ల ఇతర రాష్ట్రాల్లో కూడా వేమన పద్యాలు సేకరించిన సందర్భాలను గోపి వివరించారు. ఈ ప్రతుల్లో అత్యధిక పద్యాలున్న ప్రతి డి. 1744. దానిలో 1083 పద్యాలున్నాయి. తక్కువ పద్యాలున్నది డి. 1768. దీనిలో 91 పద్యాలు ఉన్నాయని పేర్కొన్నాడు.

గోపి పరిశోధనకు స్వీకరించిన కాగితపు ప్రతులు బ్రౌన్ రాయించినవే. వాటిలో అత్యధిక పద్యాలున్న ప్రతి డి. 1773. దీనిలో పద్య సంఖ్య 3238. తక్కువ పద్యాలున్న ప్రతి డి. 1724. దీనిలో 306 పద్యాలున్నాయి. సి.పి.బ్రౌన్ వేమన పద్యాలను తాళపత్రాల నుండి కాగితాలపై రాయించిన విధానాన్ని మూడు భాగాలుగా విభజించాడు.

1. అకారాది క్రమంలో రాయబడ్డ పద్యాలు (డి. 1723, డి. 1724, డి. 1727)
2. విషయాన్ని బట్టి విభాగాలు చేయబడ్డవి (4 భాగాలు డి. 1721, డి. 1722, 3 భాగాలు – డి. 1737).
3. ఉన్నది ఉన్నట్టుగా (యథామాతృకగా) రాయబడినవి.

ఈ మొదటి అధ్యాయం రాయాలంటే ఎంతో ఓర్పు, దానికి మించిన నేర్పు ఉండాలి. వీరు వేమన గురించి ప్రజల్లో ప్రచారంలో ఉన్న విషయాన్ని సేకరించారు. ఆ విషయాల మధ్య భేదాలను, సాదృశ్యాలను, పాఠాంతరాలను గుర్తించారు. ప్రాచీన ప్రతి నిర్ణయం చేసే సూత్రాన్ని పేర్కొన్నారు. వేమన పద్యంగా నిర్ణయించడానికి స్పష్టమైన ఆధారాలను వెతికారు. వేమన పద్యాలు నిర్ణయించడంలో పండితులు అనుసరించిన మార్గాలను సమీక్షించి రాళ్ళపల్లి ప్రదర్శించిన మౌలికతను కొనియాడారు. వేమన గురించి వెలువడిన గ్రంథాల్లో ఇంతటి

[3] ప్రజాకవి వేమన – డా. ఎన్. గోపి – పేజి -18

మౌలికమైంది, విపులమైంది మరొకటి లేదని వేమన పద్యాల గురించి హేతుబద్ధంగా చర్చ చేసిన వారిలో రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారు మొదటివారు. రాళ్ళపల్లి వారి విశిష్టతను చెబుతూ ఆయన పరిమితుల్ని కూడా వివరించి, ఆ పరిమితుల్ని అధిగమించడానికి ప్రయత్నించారు గోపి. సి.పి. బ్రౌన్ వేమన పద్యాల సేకరణలో చేసిన కృషిని తెలిపారు. వేమన పద్యాల్లో ప్రక్షిప్తాలకు, దోషాలకు, పాఠ భేదాలకు కారణాలను గుర్తించారు. 1829 నాటి బ్రౌన్ ప్రతికి 1913 బందరు ప్రతికీ మధ్య ఉన్న బేధాలను ఆ తర్వాత వచ్చిన ప్రతుల్లోని పద్య సంఖ్యల్లో తేడాలను గుర్తించి చర్చించారు. చివరగా బ్రౌన్ ముద్రణ ప్రతి ఒక్కటే శరణ్యమని అదే విశిష్టమైందని నిర్ణయించారు. ఏప్రిల్ 23, 1691 (డి. 1733) నాటి ప్రతి ప్రాచీన ప్రతి అని నిర్ధారించారు. వేమన పద్య ఛందస్సు 'ఆటవెలద'ని ఆధారాలతో నిరూపించారు. వేమన ప్రాచీన కవుల్లో ఆశుకవిగా పేరొందారన్న విషయాన్ని తెలియజేశారు.

రెండవ అధ్యాయంలో వేమన కాలం, ప్రాంతం గురించిన చర్చ ఉంది. వేమన కాలం, ప్రాంతం నిర్ణయించే సందర్భంలో అనేక కథనాలను ఉదాహరించాడు. అవి:

1. కోమటి వేమన్న కథ, 2. గొల్లడు, గోసాయి కథ, 3. వేమన్న వేశ్యాలోలత్వం, 4. అభిరామయ్య కథ, ఇవేగాక వేమన్న మహిమలు అంటూ ప్రచారంలో ఉన్న కట్టు కథల్ని గూడా ఉదహరించాడు.

1. కాశీకి బోయినా కాసురాగే 2. పుచ్చకాయ పొలంలో పుత్తడి పంట 3. అల్లరి పని అంతరార్థం, 4. వేమన్న వింత స్నానం. ఈ కథలన్నీ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు కూడా తమ ''శ్రీ వేమన యోగి జీవితము'' లో నమోదు చేశారు. అదేవిధంగా వేమన్న జీవిత చరిత్రము ఇంగ్లీష్ లో రాసిన సి. రామకృష్ణారావు రెడ్డి రాజుల వంశవృక్షంతో సహా పూర్ణయాచారి ప్రకటించిన పై కథలన్నింటినీ యథాతథంగా దిగుమతి చేసుకున్నారు.

కానీ 'వేమన యోగీంద్ర చరిత్ర'ను రాసిన పూర్ణయాచారి ఏ ఆధారాలతో తన రచన జరిగిందో పేర్కొనలేదు. కానీ ''కోమటి వేమన్న కథ'', గొల్లడు గోసాయి కథ, కొండవీటి

క్షైఫియత్ లో కన్పిస్తున్నాయి.''[4] అని పేర్కొన్నారు. అవి చదివేటప్పుడు ఆసక్తిని కల్గించినా చారిత్రక సత్యాలుగా నిలబడలేదు. శాస్త్రీయ పద్ధతిలో ఆ కథనాలను పూర్వ పక్షం చేశారు గోపి.

వేమన కాలం గురించి పాశ్చాత్య పండితుల అభిప్రాయాన్ని చెబుతూ ఫ్రెంచి మత గురువైన ఆబెదుబాయ్ వేమన 17వ శతాబ్ధం చివరిలో మరణించాడని విన్నానన్నాడు. దీన్నిబట్టి వేమన 1650 ప్రాంతానికి బ్రతికే ఉన్నాడు. సి.పి. బ్రౌన్ అభిప్రాయం ప్రకారం వేమన 17వ శతాబ్ది పూర్వార్థానికి చెందినవాడు. మ్యాక్ డోనాల్డ్ బ్రౌన్ చెప్పిన కాలాన్ని అంగీకరించి వేమన 1650 ప్రాంతానికి చెందిన వాడని పేర్కొన్నారు.

దేశీయుల వాదోపవాదాల్లో 'కొండవీటి వాదం' ఒకటి. ఇందులో ''వేమన యోగీంద్ర చరిత్రము'' రాసిన పూర్ణయాచారి యోగివేమన ఎ.డి. 1912వ సంవత్సరానికి 530 సంవత్సరాల క్రిందటి వాడని అతని కాలాన్ని తేల్చి చెప్పాడు. కొమర్రాజు లక్ష్మణరావు గారు ఈ వాదాన్ని ఖండించారు. వేమన కులంను గురించి సి.పి. బ్రౌన్ కాపు లేక రైతు అని 1824లో రాశాడు. వేమన కాపు అని చెప్పడానికి వంగూరి వారు ఒక పద్యాన్ని ఉదహరించారు.

''కలియుగమున నున్న కాపు కులానకు
వేమన తన కీర్తి విక్రయించె
ఉన్న ధర్మమెల్ల ఉర్విలో నరులకు
కోరి బెట్టెపరము గోరి వేమా''[5]

గోపి చివరగా 'బండారు తమ్మయ్య' గారు భావించినట్లు రైతు కుటుంబానికి చెందినవాడని అంగీకరిస్తున్నానన్నారు.

వేమన పేరుపై బండారు తమ్మయ్య గారు చేసిన, చర్చను, వంగోలు వేంకట సుబ్బయ్యగారు కూడా చర్చ చేశారని, ఆ చర్చను పొందు పరిచారు. వేమన ఊరు, ప్రాంతం గురించి వివిధ పద్యాల్లో కన్పిస్తున్న పాఠాంతరాలపై రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు, బండారు

[4] ప్రజాకవి వేమన – డా. ఎన్. గోపి – పేజి -91

[5] ప్రజాకవి వేమన – డా. ఎన్. గోపి – పేజి -105

తమ్మయ్య గారి వాదాలను పొందుపర్చారు. చివరగా బండారు తమ్మయ్య గారి అభిప్రాయంను స్వీకరించి ''మూగ చింతపల్లి'' వేమన పుట్టిన స్థలమని, నివసించడానికి ''కొండవీడు'' వచ్చాడని చెప్పాడు. వేమన అసలు పేరు పుల్లారెడ్డని నిర్ధారించారు. అవతారిక పద్యాల్లో వేమన ప్రస్థానాలను చూపాడు గోపి.

గోపి వేమన ఒక్కడు కాదని అనేకమంది వేమనలు ఉన్నారని మన వేమనకు కటారిపల్లె వేమనకు సంబంధం లేదని ఏమైనప్పటికీ మన వేమన రాయలసీమ ప్రాంత వాసి అని నిర్దిష్టంగా చెప్పడం జరిగింది.

మూడవ అధ్యాయం ''వేమన పద్యాల నేపథ్యం'' లో గోపి చేసిన చర్చ వేమన సాహిత్య వస్తు చర్చ. ఇంకోరకంగా అది సమాజానికీ, సాహిత్యానికీ, సామాజిక శాస్త్రాలకు, సాహిత్యాధ్యయనానికి మధ్య ఉండే పేగు సంబంధాన్ని నిరూపిస్తుంది. ఈ సందర్భంలో గోపి పాశ్చాత్య పండితుల కన్నా ముందుకెళ్ళి ఇప్పుడు లభిస్తున్న చరిత్ర నేపథ్యంలోంచి వేమన సాహిత్యంలోని ఆర్థిక, సాంఘిక, రాజకీయ తాత్వికాంశాల్ని విశ్లేషించారు. మతాల్లో శైవ, వైష్ణవాల్లోని లోపాలను ఎత్తిచూపారు. ఇంకా ముందుకు వెళ్ళి వేమన చెప్పిన పద్యం –

''లింగమతములోన దొంగలుగా బుట్టి
యొకరి నొకరు నింద నొనర జేసి
తురక జాతి చేత ధూళియై పోదురు''[6]

అని ముస్లిం మతం వారి చేతిలో హత్యగావించబడుతారని, వేరే మతాల్లోకి ప్రజలు వెళుతారని చెప్పిన పద్యాన్ని ఉదహరించారు గోపి. వర్ణవ్యవస్థ, అస్పృశ్యత, బసివిరాండ్రు, రసవాదం వంటి అంశాలతో రాసిన పద్యాలను ఉదహరించి విశ్లేషించారు.

వేమన అగ్రవర్ణాల వారికి వ్యతిరేకి కాదు. ఆ తత్వానికి వ్యతిరేకి. మనిషిని మనిషి నుండి వేరు చేసే సిద్ధాంతాలను ఆయన వ్యతిరేకించాడు. కవిగా సమాజాన్ని అర్థం చేసుకొని పీడితుల పక్షం వహించాడు. వేమన సాహిత్య వస్తు చర్చను సామాజిక వస్తు చర్చగా

[6] ప్రజాకవి వేమన – డా. ఎన్. గోపి – పేజి -183

కొనసాగించాడు. 'వేమన ఆలోచనలు, భావాలు అతని కాలమే పునాదిగా లేచిన గోపురాలు, స్వానుభవం వేమన్న కవిత్వానికి జీవ ధాతువు' అనే పరికల్పనతో వేమన సాహిత్య వస్తువును విశ్లేషించారు. సామాజిక చరిత్రకు, సాహిత్య చరిత్ర ఎంత శక్తివంతమైన వాహికగా మారిందో గోపి ఋజువు చేశాడు. వేమన పద్యాలు అప్పటి సామాజిక వాస్తవికతకు ప్రతిబింబాలుగానే కాక, వేమన ఆత్మ చరిత్ర శకలాలుగా కూడా నిర్వచించడం గోపిలోని నిశితమైన పరిశోధకుడిని చూపెడుతుంది.

నాలుగో అధ్యాయం 'వేమన్న వేదాంతం' లో సాహిత్యంలో వేమన్న ప్రతిపాదించిన తాత్విక దృక్పథం మీద చాలా వాదాలు బయలుదేరాయి. ఈ వైవిధ్యానికి కారణం ప్రక్షిప్తాలే. వేమన ఒక్కడే అనేక తాత్విక దృక్పథాలను ప్రతిపాదించడం అసాధ్యం. అశాస్త్రీయం కూడా. మహాభారతంలో లాగా వేమన పద్యాలలో కూడా విభిన్న వాదాలు ప్రవేశించి గందరగోళం సృష్టించాయి. అయితే గోపి వాటన్నింటిని పరిశీలించి ''మానవత్వం వేమనవాదం'' అని తీర్పునిచ్చారు. మానవత్వం ఒక మతం కాదు. ఒక దృక్పథం అని, అది మతంకన్నా విశాలమైందని వివరించారు.

చెడిపోయిన వ్యవస్థలో జీవిస్తూ, దానితో సంబంధం లేని పురాణానువాదాలకు పూనుకోకుండా దాన్ని తీవ్రమైన కంఠస్వరంతో అధిక్షేపించి సాధ్యమైనంత వరకు వేమన మనిషికి పట్టం కట్టిన తీరు, మనిషిని మనిషిగా నిలపడానికి వేమన ప్రబోధించిన తీరును గోపి వివరించి సూత్రీకరించారు. వేమన ప్రదర్శించింది ధర్మాగ్రహం అనీ అది అతన్ని వ్యక్తి నుండి సమాజంలోకి విస్తరించిన ప్రతిఘటన రూపం అన్నారు గోపి. సమాజంలో సిద్ధాంతానికీ, ఆచరణకీ సమన్వయం లోపించడంతో దానిమీద అధిక్షేపయుద్ధం చేశారు. అప్పటికీ ప్రజల్లో అనేకరకాల రుగ్మతలు పెరిగాయి. వాటిపై వేమన పదునైన విమర్శ చేయడాన్ని గోపి చారిత్రక ఆధారాలతో వివరించారు.

''ఇంటియాలి విడిచి ఇల జార కాంతల
వెంట దిరుగువాడు వెర్రివాడు''[7]

[7] ప్రజాకవి వేమన – డా. ఎన్. గోపి – పేజి -256

అంటూ మగవారు వేశ్యల వలలో చిక్కి భార్యను అన్యాయం, అశ్రద్ధ చేయడం మంచిదికాదంటాడు.

అనేక కోణాల నుండి వేమన కవిత్వాన్ని ఎంతో శ్రద్ధతో విశ్లేషించిన గోపి వాస్తవ పరిశోధకుడిగా, ప్రగతిశీల కవిలో కన్పించే ప్రగతి నిరోధక లక్షణాల్ని ఎత్తి చూపకుండా మాత్రం ఉండలేకపోయారు. వేమన ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, తాత్విక అంశాలపై తిరుగుబాటుతో పద్యం చెప్పినా స్త్రీ విషయంలో ఆయన ద్వేషాన్ని ప్రదర్శించారనేది ప్రచారంలో ఉన్నమాట. దీన్ని గోపి కూడా అంగీకరించాడు. ఇంత ప్రగతిశీల దృక్పథం ప్రదర్శించిన వేమనలో కొన్ని ప్రగతి నిరోధక, మానవత్వ వ్యతిరేక భావాలు మిగిలి ఉన్నాయని చెప్తూ ''ఆర్థిక కారణాల వల్ల భార్యలు భర్తలను లక్ష్యపెట్టరని అది మంచి పద్ధతి కాదంటాడు. అందుకు ఉదాహరణే ఈ పద్యం.

''కలిమినాడు మగని కాముగా చూచును
లేమి జిక్కునాడు లేవకుండు
మగువ మగనినైన మడియంగ జూచును''[8] అని పేర్కొన్నారు.

వేమన స్త్రీలను చులకన చేసి చెప్పిన పద్యాల్లో రెండు రకాలున్నాయి.

1. యోగ సాధనకు ఆటంకం కాబట్టి మోహ హేతువులైన స్త్రీ శరీర నిరసన చేసేవి.
2. సామాజికంగా స్త్రీని చిన్నచూపు చూసేవి. మానవత్వంలో ముఖ్యభాగమైన 'స్త్రీ గౌరవం' వేమన నిర్లక్ష్యానికి గురయ్యింది. వేమన ప్రగతిశీల వ్యక్తిత్వానికి ఇది లోటే, అయినప్పటికీ ఆయన కీర్తిలో ఇది ఒక చిన్న నలక వంటిది మాత్రమే అంటారు గోపి.

'వేమన కవిత్వం' అనే అధ్యాయంలో వేమన కవిత్వాన్ని విశ్లేషించారు గోపి. ఇందులో మొదట కవిగా వేమనను తిరస్కరించడానికి గల కారణాలను చర్చించారు. అబెదుబాయ్ హిందూ మతాలను విమర్శిస్తూ రాసిన వారిలో వేమన పేరును ప్రస్తావించాడు. బ్రాహ్మణేతర కవుల పట్ల, బ్రాహ్మణ కవులకు మంచి అభిప్రాయం లేదని ఆధారాలు చూపాడు గోపి. చివరికి

[8] ప్రజాకవి వేమన – డా. ఎన్. గోపి – పేజి -261

కావలి రామస్వామి రాసిన 'దక్కనుకవుల చరిత్ర'లో 47 మంది తెలుగు కవులను ప్రస్తావించినా అందులో వేమన పేరు లేదన్నారు. ఇది పెద్దలోపంగా గోపి భావించారు. కందుకూరి వీరేశలింగం పంతులు రాసిన ''కవుల చరిత్రము''లో వేమనకు స్థానమివ్వలేదంటే కారణాలు చెప్పలేం అంటూనే, ఈ నిరాధారణకు కారణం వేమన బ్రాహ్మణీయ భావజాలాన్ని, బ్రాహ్మణ కర్మకాండలను అధిక్షేపించడమే అన్నారు. సి.పి. బ్రౌన్ మొదట 500 ప్రతులు అచ్చువేయించి 50 తాను ఉంచుకొని 450 ప్రతులను పండితులకు ఇస్తే అవి శిథిలమైపోయాయంటే ఒక్క ప్రతి కూడా బయటకు ఇవ్వలేదంటే బాధ్యత పురోహిత వర్గానిదే అయి ఉంటుందని పేర్కొన్నారు.

'కీర్తి విస్తృతి' అనే అంతర్భాగంలో అబేదుబాయ్ కాలం నాటికే వేమనపై గ్రంథాలు పొరుగు భాషల్లోకి వచ్చాయని అందుకు ఉదాహరణగా తమిళ గ్రంథాలను చూపారు. అందులో

1. వేమన పద్దియమ్ – 315 పేజీలు గల ఈ గ్రంథంలో 1000 వేమన పద్యాలకు తమిళానువాదం, వ్యాఖ్యానం ఉన్నాయి.

2. వేమన పద్దియమ్ – వేమన్న చెప్పిన 100 పద్యాలకు అనువాద సహిత వ్యాఖ్యానం ఉంది.

3. వేమణ్ణా – ఇది 10 పేజీల వ్యాసం.

అలాగే సంస్కృతంలో 'వేచు గీత' 1000 పద్యాల సంస్కృతానువాదం ఇది. ఇంకా ఇంగ్లీష్ లో సి.పి. బ్రౌన్ రాసిన ''The Verses of Vemana'', జి.ఆర్. సుబ్బయ్య పంతులుగారు 'The Age of Vemana' అనే వ్యాసం రాశారు. ఇంకా వేమన పద్యాలకు హిందీ, ఉర్దూ అనువాదాలు కూడా జరిగాయని ఆధారాలు చూపించారు. ఇన్ని భాషల వారికి తెలిసిన వేమన తెలుగు ప్రాంత సాహిత్య చరిత్రకారుల నిర్లక్ష్యానికి గురికావడం బాధపడాల్సిన విషయం. వేమన పద్యాలు నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురికావడానికి బ్రాహ్మణులు ఒక కారణమైతే, వేమన పద్యాల్లో ఉన్న గ్రామ్యశైలి, కవితాగుణం లేకపోవడం, కొన్నింటిలో ఉన్న అశ్లీలత్వం, పద్యాలు సులభంగా ఉండడం వంటి కారణాలను చెప్పారు.

''వేమన ఏ లోపాలనైతే ఎత్తి చూపారో అలాంటి లోపభూయిష్ఠులే వేమన్నను నిరసించారు. భ్రష్టులైన బ్రాహ్మణులే వేమన్నను వ్యతిరేకించారు. కానీ ఈ వ్యతిరేక గుణాన్ని బ్రాహ్మణులందరికీ ఆపాదించడం తొందరపాటే అవుతుంది'',[9] అని గోపి నిర్ధారించారు. మెకంజీ కైఫియత్తులు సేకరించడంలో తోడ్పడిన కావలి వెంకటరామస్వామి 1829లో దక్కను కవుల చరిత్రలో సంస్కృతం, తెలుగు, తమిళం, మహారాష్ట్ర కవులను కలిపి మొత్తం 108 మంది జీవిత చరిత్రలను రాశాడు. కానీ వీరిలో వేమనకు స్థానం ఇవ్వకపోవడం చర్చించదగ్గ విషయం. సాహిత్య చరిత్రలో వర్గ, కుల ప్రయోజనాల పాత్రను అర్థం చేసుకోవడానికి ఇలాంటి సంఘటనలు పనికొస్తాయి. కానీ పండితులతో సంబంధం లేకుండా వేమన పద్యాలు ప్రజల నాలుకలపై ఆడుతున్నాయి. 17వ శతాబ్దం నాటి తెలుగు సమాజంలోని మత, సాంఘిక పరిస్థితుల్ని విస్మరిస్తే వేమన పద్యాలు అర్థం చేసుకోలేమని అనడంలో పరిశోధకుడి చారిత్రక దృక్పథం, ప్రజాస్వభావం అర్థమవుతుంది.

వేమన కవిత్వంలోని పద, పదబంధ, అలంకార, పద్య నిర్మాణ సౌందర్యాన్ని విపులంగా చర్చించారు. వేమన కవిత్వ చర్చలో సి.పి.బ్రౌన్, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, శ్రీశ్రీల పట్ల గౌరవాన్ని ప్రదర్శిస్తూ వారి అభిప్రాయాలను తిరిగి పరిశీలించి సవరించే ప్రయత్నం చేశారు. వేమన సిద్ధాంతాలు అర్థంకాకపోవడం వల్ల ఆయన నిరాదరణకు గురయ్యారన్న రాళ్ళపల్లి వారి అభిప్రాయాన్ని, వేమన వాడిన పదాలు కొన్నిసార్లు కఠినంగా ఉంటాయన్న బ్రౌన్ అభిప్రాయాన్ని, వేమన్న ఆటవెలది నిర్మాణంలో థీసిస్, యాంటీ థీసిస్, సింథీసిస్ సూత్రముందని చెప్పిన శ్రీశ్రీ అభిప్రాయాలను గోపి సున్నితంగా తిరస్కరించారు. ఎవరెన్ని చెప్పినా కవి వేమన ప్రజాకవి వేమనగా రూపాంతరం చెందాదన్న విషయాన్ని చెప్పడం జరిగింది.

'ప్రజాకవిత్వం సంప్రదాయంలో మరికొన్ని మణులు' అనే చివరి అధ్యాయంలో టావో మతస్థాపకుడు (లావోట్జు), తిరువళ్ళువరు, కబీరు, గురునానక్, అరుణగిరినాథుడు, పోతులూరి వీరబ్రహ్మం, ఏగంటి లక్ష్మప్ప, భక్తతుకారాం, త్యాగయ్య, రామదాసు, సర్వజ్ఞుడు దూదేకుల సిద్ధప్ప, గురజాడ, కాళోజీ వంటి పూర్వ కవులు, సమకాలీన కవులు, దేశవిదేశీ రచయితలతో వేమనకు గల భావ సాదృశ్యాన్ని గోపి ఎంతో లోతుగా అధ్యయనం చేశారు.

[9] ప్రజాకవి వేమన – డా. ఎన్. గోపి – పేజి -276

వేమన గురించి ‘‘ఒక్కమాటలో చెప్పాలంటే వేమన లాంటి కవి వేమనే. అనితర సాధ్యమైన విచిత్ర మార్గంలో నడిచిన అపూర్వకవి వేమన. తెలుగు సాహిత్యానికి సంబంధించినంత వరకు సంఘవ్యవస్థలోని కుళ్ళును బయటపెట్టిన ప్రజాకవుల్లో వేమన ప్రథముడు.’’[10] అని నిర్ధారించారు గోపి.

ఎల్లలు దాటిన వేమనకు ఎల్లలు లేని గుణాన్ని గోపి ఆవిష్కరించారు. వేమన పద్యంలోని మకుటం గురించి చెప్పాల్సి వస్తే ఇంత వినసొంపైన మకుటం తెలుగులో మరొకటి లేదు. ‘‘విశ్వదాభిరామ వినుర వేమ’’ అనే మకుటంలో ‘‘విశ్వదుడనగా విశ్వమునిచ్చు ఈశ్వరుడు. అతని అభిరాముడు ఈశ్వరునికిష్టమైనవాడా వేమా, వినుమా అనే అర్థం.’’[11] ఉంది. వేమన పద్యాలను పరిశీలిస్తే అతనికతడే దీనికి అర్థం చెప్పుకున్నట్లుగా తెలుస్తుంది.

‘‘విశ్వముగనేమొ వివరించి చూడుడీ విశ్వమైదుచేత వెలయుచుండు’’[12] అని వేమనయే ప్రశ్నించుకొని వేమనయే సమధానమిచ్చినట్లుగా ఉంది. తొలిరోజుల్లో వేమన పద్యాలకు ‘వేమా’ అనే మకుటమే ఉండేదని, ఆ తర్వాత విశ్వదాభిరామ వినుర వేమ అనే మకుటాన్ని వేమన ఉపయోగించారని గోపి పేర్కొన్నారు. ‘‘‘విశ్వద’ అనేది ఒక వేశ్య పేరని కూడా ప్రచారం జరిగింది. కానీ దీన్ని ఎవరూ ఆమోదించలేదు.’’[13]

మొత్తంగా వేమనపై పరిశోధన చేసి ‘ప్రజాకవి వేమన’ సిద్ధాంత గ్రంథాన్ని రాసిన ‘గోపి’గారు వేమన గురించి తన మాటల్లో ‘‘వేమనకు సమాజమంటే స్పష్టమైన అవగాహన ఉంది. సమాజంలో ఏదో ఒక వర్గానికి కట్టుబడిపోయి, మిగిలిన సంఘ వ్యక్తులను పట్టించుకోని తత్వం వేమనకు లేదు.’’[14] అంటారు.

వేమన జనంలోనుండే భాషను తీసుకొని రాస్తాడు కాబట్టే ఆయన ఉపయోగించిన భాష, సామెతలు, పదబంధాలు సామాన్య జనం నోళ్ళలో నానుతూనే ఉంటాయి. ఆయన జనం మధ్య బ్రతికాడు. కాబట్టే ‘ప్రజాకవి’ అయ్యారు.

---

[10] ప్రజాకవి వేమన – డా. ఎన్. గోపి – పేజి -351

[11] విశ్వదాభిరామ వినురవేమ –త్రిపురనేని వెంకటేశ్వరరావు – పేజి – 101

[12] విశ్వదాభిరామ వినురవేమ –త్రిపురనేని వెంకటేశ్వరరావు – పేజి – 102

[13] ప్రజాకవి వేమన – డా. ఎన్. గోపి – పేజి -336

[14] వాఙ్మయి (Jan-June-2009)- సంపాదకుడు –అనుమాండ్ల భూమయ్య – పేజి – 29.

6.3 వ్యాసనవమి:

''గోపిని బాల్యం నుండి ఎరిగిన నేను పరిశోధక, విమర్శకుడిగా ఇంత ఎదుగుతాడని అనుకోలేదు. వస్తుతః అతడు కళ్లలో గుండెలో మానవతను నిలుపుకున్న కారణికుడు'' అని 'వ్యాసనవమి' ముందుమాటలో డా. సి. నారాయణరెడ్డి గారు ప్రశంసించారు.

బి.ఎస్. రాములుగారు ''ఆచార్య ఎన్. గోపి ఒక మహాకవి అన్నారు. ఉత్తమ పరిశోధకుడు. చాలామంచి కవిత్వం రాస్తారు. కవిత్వం సాహిత్య ప్రక్రియల్లో మౌలిక దశ, తొలిదశ. కొందరు తొలిదశలోనే ఆగిపోతారు. కొందరు పరిశోధకులుగా, విమర్శకులుగా, కథకులుగా, నవలాకారులుగా, సినీకవులుగా విస్తరిస్తారు. గోపి రెండవ కోవకు చెందుతారని''[15] పేర్కొన్నారు. ఇది గోపి సాహిత్యకృషిని తెల్పుతుంది.

డా. ఎన్. గోపి ''వ్యాసనవమి'' అనే పరిశీలన, పరిశోధనాత్మక వ్యాససంపుటిని 1986లో వెలువరించారు. ఇందులో వ్యాసాలు 1980 నుండి రాస్తూ వచ్చినవి. ఇది తొమ్మిది వ్యాసాల సంకలనం.

'వ్యాసనవమి'లో మొదటివ్యాసం ''వేమనగారి 7 కొత్త పద్యాలు పారిస్ ప్రతిలో లభ్యం''లో మొట్టమొదటే పాఠనిర్ణయం చర్చ చేశారు. ''పాఠ నిర్ణయాలు చేసి కావ్యాలు పరిష్కరించేటప్పుడు ప్రాచీన గ్రంథాలకు ప్రాధాన్యముంటుంది. ఆధునిక కాలంలో వెలసిన అచ్చు పుస్తకాల్లో ఎందరో చేయీ నోరూ చేసుకోవడం వల్ల ప్రక్షిపాలు ఏర్పడడానికి అవకాశం ఉంది. తాటాకు ప్రతులకు, వ్రాత ప్రతులకు ఆ అవకాశం తక్కువ. వాటిలో అతి ప్రాచీనమైందేదో కవి స్వహస్త లిఖితం కావచ్చు. లేక సమీపమైంది కావచ్చు. కాబట్టి పరిశోధకులు ప్రాచీన ప్రతులకోసం అన్వేషణ చేస్తారు.''[16] అన్న విషయాన్ని తెలిపారు. మొట్టమొదట వేమన పద్యాలను పరిష్కరించి పాఠనిర్ణయాలు చేయించింది సి.పి. బ్రౌన్. రెండు పుస్తకాలు అచ్చు వేసినా, పద్దెనిమిదేళ్ళు వేమన పద్యాల్లో తలమునకలయినా బ్రౌన్ కు సంతృప్తి కలుగలేదని, తర్వాత కాలంలో చాలా పద్య సంపుటాలు వెలువడినా అవి పరిష్కరించి వేసినవి కావని అన్నారు. వేమన రాసిన పద్యాల పాత ప్రతులకోసం వెతుకుతుంటే పారిస్ లైబ్రరీలో

---

[15] గోపి సాహిత్య వివేచన – సంపాదకుడు –డా. ఎస్. రఘు – పేజి – 42.

[16] వ్యాసనవమి –డా. ఎన్. గోపి – పేజి -1

వేమన పద్యాల ప్రతి ఒకటుందని తెలిసిందని, 1977లో శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ తెలుగుశాఖవారు ప్రకటించిన 'బ్రౌన్ లేఖలు'లో దీని ప్రస్తావన ఉందని పేర్కొన్నారు. అయితే ఇవి బ్రౌన్ కు వందేళ్ళ ముందు 1731లో ''ఫాదర్ లీగ్యాక్' అనే ఫ్రెంచి మిషనరీ వేమన పద్యాలు సేకరించి ఫ్రాన్స్ కు పంపారని తెలిపారు.

విషయసేకరణకు ముందు అది ఎక్కడ దొరుకుతుందో తెలుసుకునే పరిజ్ఞానం పరిశోధకుడిలో ఆసక్తిని పంచుతుంది. వేమనపై పరిశోధన పూర్తయ్యాక కూడా గోపి వేమన పద్యాన్వేషణలో నిరంతరం కృషి చేసాడని తెలుస్తుంది. పారిస్ ప్రతిలోని వేమన పద్యాల్లో ఏముందో తెలుసుకోవాలన్న కుతూహలమే గోపికి పారిస్ ప్రతి సంపాదించడానికి ప్రధాన కారణం అని చెప్పవచ్చు.

యునెస్కో వారి కోసం వేమన పద్యాలను ఇంగ్లీషులోకి అనువాదం చేస్తున్న జె.ఎస్.ఆర్.ఎల్. నారాయణమూర్తి 1980లో కాలిఫోర్నియా నుండి ఇండియాకు వచ్చారు. గోపి అభ్యర్ధనతో ఆయన పారిస్ మీదుగా అమెరికా వెళ్తూ ఒక మిత్రునికి ఆ పనిని అప్పగించారని, గోపి తన కృషి ఫలితంగా పారిస్ ప్రతి ఫోటోస్టాట్ కాపీని పొందగలిగారు. ఇది ఆయన పరిశోధనా దృక్పథానికి నిదర్శనం.

ఈ పారిస్ ప్రతిలో 368 పద్యాలున్నాయి. వీటిని పరిష్కరించి 364 పద్యాలుగా గోపి అచ్చువేశారు. బ్రౌన్ సేకరించిన పద్యాల ప్రతుల్లో, ఫుట్ పాత్ మీద దొరికే ప్రతులతో పోలిస్తే ఇందులో లేని వేమన 7 పద్యాలు కొత్తవి పారిస్ ప్రతిలో ఉన్నట్లు తెలిసింది. ఈ ఏడు పద్యాల మొదటి పంక్తులు వేరేచోట్ల రెండవ, మూడవ పంక్తులుగా కనబడవచ్చని తెలిపాడు. దీంట్లో 294 ఆటవెలదుల్లో ''విశ్వదాభిరామ వినురవేమ'' అనే మకుటంలోనే గాక 12 పద్యాలు 'వేమా' అనే చిన్న మకుటంతో ఉన్నాయని మరో నాలుగు పద్యాలకు మకుటం లేదన్న విషయాన్ని తెలిపారు.

ఈ పద్యాల గురించి కొంతమంది ''చాలాచోట్ల, ఛందస్సు తప్పిందని, ఛందస్సు తప్పినా నడక బాగున్న పద్యాలున్నాయని పేర్కొన్నారు. ''మక్కాకు బోనేల మగుడతా రానేల''[17]

[17] వ్యాసనవమి –డా. ఎన్. గోపి – పేజి -5

ఇలాంటి పద్యాలలో దరువు మర్యాదను గమనించాలంటారు బ్రౌన్. వేమన పద్యాలకు పాఠ నిర్ణయం చేస్తూ పారిస్ ప్రతిలో ఒకటి రెండు అశ్లీల పద్యాలున్నా అవి ఇహంపై రోత పుట్టించేవి కావన్నాడు.

పారిస్ ప్రతిలో గోపి తాను గుర్తించిన కొత్త పద్యాలు ఏడింటిని పేర్కొనడం జరిగింది.

1. వరుసమతములంట వర్ణాశ్రమములంట
2. జీవరాసులెల్ల చిత్తర్వు ప్రతిమెలు
3. దేహసంబంధులు తెగకాలి సంకెళ్ళు
4. వృక్షమొకటి బుట్టి విపరీత ఫలమందె
5. తాళకంబుదెచ్చి తాళకంబున వండి
6. మాయచేత బ్రహ్మమాలంటు పడిపోయె
7. లోని చూపు చూపులో చూడ చూడంగ

ఇవి 7 కొత్త పద్యాల మొదటి పంక్తులు. అయితే ఈ ప్రతిలో రాత తప్పుల తడకగా ఉందని, ఒక ఛందస్సులో మరో ఛందస్సు ఇరుక్కుపోయిన పిచ్చిపద్యాలున్నాయని, అన్వయం కుదరని పద్యాలు కూడా ఉన్నాయని చెప్పారు. 'ఫ్రాన్సుకు వెళ్ళిన తెలుగు పుస్తకాలు' వ్యాసంలో 17-18 శతాబ్దాలలో క్రైస్తవమత ప్రచారం కోసం వచ్చిన మిషనరీ ఫాదరీలు కొన్ని తెలుగు పుస్తకాలను ఫ్రాన్సుకు పంపారు. ఈ వివరాలను వ్యాసకర్త జర్నల్ ఆఫ్ బాంబే హిస్టారికల్ సొసైటీలో హెచ్. హాస్టన్ రాసిన ''15వ లూయీ లైబ్రరీ కోసం జెసూట్ మిషనరీలు ఫ్రాన్సుకు తీసుకువెళ్ళిన పుస్తకాలు''[18] అనే వ్యాసం వల్లా, ''హిస్టరీ ఆఫ్ ది తెలుగు క్రిష్టియన్'' అనే లేఖల వల్ల తెలుసుకున్నారు.

వేమన పద్యాలను ఫ్రాన్సుకు పంపింది 'లీగ్యాక్' అనే మత ప్రచారకుడు. మత ప్రచారం కోసం 35 సంవత్సరాలు తెలుగు ప్రాంతంలో తిరిగాడు లీగ్యాక్. అనంతపురం జిల్లాలో క్రైస్తవ మతం తీసుకున్న మొదటి వ్యక్తి 'కృష్ణారెడ్డి' అని పింగళి ఎల్లనార్యుని 'తోభ్యచరిత్రం' అనే

[18] వ్యాసనవమి –డా. ఎస్. గోపి – పేజి -11

పుస్తకంలో ఈ ప్రసక్తి ఉందని తెలుపుతూ, గ్యాక్ 'సంజీవనాథస్వామి'గా ప్రసిద్ధి చెందాడని చెప్పడం జరిగింది.

ఫ్రాన్సులోని కింగ్స్ లైబ్రేరియన్ పంపిన ఉత్తర్వుల ప్రకారం భారతదేశంలో పుస్తకాల సేకరణ ప్రారంభమైందన్నారు. ఈ సందర్భంగా ఈ దేశంలో వారు ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రస్తావించారు. కాల్ మెట్ అనే క్రైస్తవమత గురువు 'కలియుగ ప్రసక్తి'ని అనువదించి ఫ్రాన్సుకు పంపారని చెప్పడం జరిగింది. క్రైస్తవ ఫాదరీలు తెలుగును 'బదుగు' భాషగా అభివర్ణించారని, 'జెంటైల్ భాష' అని కూడా వ్యవహరించారని వివరించారు.

ఈ వ్యాసంలో ఫ్రాన్సు లైబ్రరీలో ఉన్న తెలుగు ప్రతుల పుస్తకాల పట్టికను పొందుపరిచారు. ఇందులో 39 ప్రాచీన ప్రతులున్నాయి. అయితే కింగ్స్ లైబ్రరీలో ప్రాచీన ప్రతులను జాగ్రత్తగా కాపాడుతారని చెప్పారు. ఈ విషయం ద్వారా పరిశోధకుడికి కావలసిన విషయ పరిజ్ఞానం గోపి గారిలో మెండుగా ఉందన్న సంగతి తెలుస్తుంది.

'కర్మయోగి వీరబ్రహ్మం' అనే వ్యాసం ఈ సంపుటిలో పెద్దవ్యాసం. ఇందులో వీరబ్రహ్మం పుట్టుక, జీవితం, కాలజ్ఞానం, ఆయన శిష్యులు, మహిమలను గురించి చెప్పడం జరిగింది. అప్పటి మైసూరు రాష్ట్రంలోని నందికొండ గ్రామస్థులైన వీరభోజాచార్యులు, వీర పాపమాంబలకు దత్తపుత్రుడు వీర బ్రహ్మం. ఈయన తల్లిదండ్రులు పరిపూర్ణయాచార్యులు, ప్రకృతాంబలు. పెదకొమెర్ల గ్రామం వాసి అయిన శివకోటయ్య కూతురు గోవిందమ్మను బ్రహ్మంగారు వివాహం చేసుకున్నారు. వీరికి అయిదుగురు కుమారులు, ఒక కుమార్తె. వారు గోవిందయ్య, సిద్ధలింగయ్య, శివరామయ్య, పోతులూరయ్య, వీర నారాయణమ్మ కుమార్తె.

బ్రహ్మంగారి శిష్యుడు మహ్మదీయ కులస్థుడు అయిన దూదేకుల సిద్ధయ్య. అందుకే ''బ్రహ్మంలాంటి గురువు లేడు సిద్ధయ్య లాంటి శిష్యుడు లేడు'' అనే సామెత వీరిని చూసి వచ్చింది. వీరబ్రహ్మంకు బ్రాహ్మణుల దగ్గర నుండి చండాలుర వరకు అన్ని కులాల్లో శిష్యులున్నారు. బ్రహ్మంగారి పేరుతో ప్రజల్లో ఉన్న తత్వాలన్నీ ఆయనవి కావనీ వాటిలో కొన్ని ఆయన శిష్యులలో, భక్తులలో చేరి కలగాపులగం అయ్యాయని సాంప్రదాయవాదులు అంటున్నారని చెబుతూ బాలాంత్రపు రజనీకాంతరావు పన్నెండు పేర్ల జాబితా ఇచ్చారు.

వీరబ్రహ్మం శిష్యులకోసం రాసిన 'సిద్ధబోధము' అనే గ్రంథం శిథిలావస్థలో దొరికిందన్నారు గోపి. బ్రహ్మం గారి మార్గంలో ఉన్న ''ఏగంటి వచనాలు'' మద్రాసు ఓరియంటల్ లైబ్రరీలో ఉన్నాయన్న విషయాన్ని తెలిపారు. వీరబ్రహ్మం కాలజ్ఞానం గురించి, జననం గురించి చెప్తూ వేమన వారి జన్మ తేదీ చెప్పినట్టున్న పద్యంను ఉదహరించారు.

> ''నందత సంవత్సరమా
> నందత కార్తీక శుద్ధ పున్నమినాడే
> వింధ్యాద్రి సేతుబంధన
> సందున నొక వీరుడేలు చాటరవేమా''[19]

ఈ పద్యంలోని 'వీరుడు' బ్రహ్మంగారే అవడానికి అవకాశం ఉంది. అయితే కాలజ్ఞానం వీరబ్రహ్మంతోనే పుట్టలేదని విశ్వజోస్యం అనదగ్గ భవిష్యత్ కథనం వంటిది కొత్తేమీ కాదని, అంతకుముందూ ఉందని కాలజ్ఞానం గురించి చర్చించారు. వీరబ్రహ్మం జీవితం గురించి పుక్కిట పురాణాలు వ్యాప్తిలో ఉన్నాయని, వీరబ్రహ్మం కాలం గురించి వివిధ వ్యక్తులు చేసిన ప్రకటనలను ఈ వ్యాసంలో వివరించారు. ఈ వ్యాసంలో కాలజ్ఞానం గురించి, వీరబ్రహ్మం గురించి ప్రచారంలో ఉన్న కథలు, అభిప్రాయాలను గోపి తనదైన శైలిలో విశ్లేషించారు.

''తెలుగు పత్రికల పుట్టు పూర్వోత్తరాలు – రేఖామాత్ర పరిశీలన'' అనే వ్యాసంలో భారతదేశంలో పత్రికలను స్థాపించిన ఘనత క్రైస్తవ మిషనరీలదేనని, తెలుగులో వెలువడిన మొట్టమొదటి దినపత్రిక 'సత్యదూత'ను 1835లో బళ్ళారి క్రైస్తవ మత ప్రచారకులు దీన్ని వెలువరించారని పేర్కొన్నారు. దీనికి ఎ.డి. కాంబెల్ సహకరించారని, అయితే దీని ప్రతులు లభించడం లేదని చెప్పారు. 'వృత్తాంతి' అనే పత్రిక దేశీయులు ప్రకటించిన తొలి పత్రికగా భావించవచ్చన్నారు. వృత్తాంతి పత్రిక ఘాటైన విమర్శలు చేయడం వల్ల ప్రజాదరణ పొందిందన్నారు. అయితే ఇది ప్రభుత్వం నిర్బంధంతో మూడేళ్ళలోనే ఆగిపోయింది.

ఇంకా 1874 అక్టోబర్ లో కందుకూరి వీరేశలింగం పంతులుగారి సంపాదకత్వంలో వెలువడిన 'వివేకవర్థిని', విశ్వనాథ వారి 'జయంతి', గిడుగువారి 'తెలుగు', శ్రీపాద

[19] వ్యాసనవమి –డా. ఎన్. గోపి – పేజి -24.

కృష్ణమూర్తిగారి 'గౌతమి' 'వజ్రాయుధం', 'ఆంధ్ర సాహిత్య పరిష్పత్రిక', గోరాశాస్త్రి 'తెలుగు స్వతంత్ర, చిలకమర్తి లక్ష్మీనరసింహం 'మనోరమ', చిలుకూరి వీరభద్రరావు 'ఆంధ్రకేసరి', 'భరతమాత', కొండా వెంకటప్పయ్య 'కృష్ణాపత్రిక', దేవులపల్లి రామానుజరావు గారి 'శోభ', అడవి బాపిరాజు 'మీజాన్' వంటి మొదలైన పత్రికల వివరాలను, వాటి సంపాదకుల వివరాలను, అవి చేసిన సేవలను పొందుపర్చడం జరిగింది.

'వేమన పద్యాలు – బ్రౌన్ అవగాహన' అనే వ్యాసంలో బ్రౌన్ వేమన పద్యాల అనువాద ప్రతిలో రాసుకున్న 'Preface'లో వేమన పద్యాల గురించి చెప్తూ సరళత, విషయ బాహుళ్యంతో వేమన పద్యాలు చాలా ప్రత్యేకమైనవి. కొత్తగా తెలుగు నేర్చుకుంటున్న వారికి ఈ పద్యాలు బాగా పనికొస్తాయి కానీ కొన్ని పద్యాల్లో అన్నీ తెలిసిన మాటలే ఉండి కూడా అర్థం కాకుండా అయోమయంలో పడేస్తాయి. తత్త్వం దృష్టితో చూస్తే వేమన వ్యాసుని కోవకు వస్తాడని అన్నారు.

బ్రౌన్ వేమన పద్యాలను నీతి, అధిక్షేప, మార్మిక అని విభజించాడని చెప్పడం జరిగింది. అనువాదాలకు లొంగని తాత్త్విక పద్యాలను అయోమయ పద్యాలని బ్రౌన్ చిరాకును వ్యక్తం చేశారని వివరించడం జర్గింది. వేమన జంగమ కులస్థుడని తేల్చి మరో పదేళ్ళకు తన అభిప్రాయం మార్చుకున్నాడని పరిశీలించారు. బ్రౌన్ వేమనను గ్రీకు కవి 'లూషియన్' తో పోల్చి ఇద్దరూ కొత్తగా భాష నేర్చుకుంటున్న వారికి ఉపయోగపడతారని చెప్పారు.

వేమన పద్యాలను "Neither Poetical nor classical"[20] అన్న విషయంపై వ్యాఖ్యానించి, ఇక్కడ 'Poetical' అంటే 'గ్రాంథికం' అనీ చెప్పడం జరిగింది. వేమన పద్యాల్లో ఎక్కువగా సంస్కృత భాషలోని సూక్తులకు అనువాదాలనే అభిప్రాయాన్ని బ్రౌన్ వ్యక్తం చేశారు. ఈ విధంగా వేమన పద్యాల్లోని బ్రౌన్ అవగాహనను గోపి తనకున్న పరిశోధనా ప్రతిభతో పరిశీలించడం జరిగింది.

'వేమన పద్యాల్లో నాటి పాలకులు' అనే వ్యాసంలో పాలకుల మీద విమర్శలు కురిపించిన వేమన పద్యాలను విశ్లేషించారు. కేవలం పాలకుల వక్రతను చూపడమే లక్ష్యం కాకుండా విమర్శించారు. ఆనాటి రాజ్యవ్యవస్థ, సాంఘిక జీవితం, సంక్షోభం మొదలైన పరిస్థితులను

---

[20] వ్యాసనవమి –డా. ఎన్. గోపి – పేజి -74.

అవగాహన చేసుకోవడానికి సహకరించిన వేమన పద్యాలను చూపారు. వేమన కాలానికే గ్రామీణ వ్యవస్థలో సంక్షోభం ప్రారంభమైంది. ప్రజలు ఆకలితో అల్లాడుతూ ఉన్నా, భూస్వాముల దోపిడీకి అడ్డు అదుపులేకుండా పోయింది. ఇలాంటి సమకాలీన రాజకీయ, సాంఘిక ప్రభావం కవులపై ఉంటుంది. సాంఘిక చైతన్యం ఉన్న కవి వేమన కాబట్టే ఆనాటి పరిస్థితులకు స్పందించి నాటి రాజకీయ, పాలకుల వ్యవస్థలను వారి దుర్మార్గాలను కళ్ళకు కట్టినట్టుగా చూపాడు.

'బాఫోయ్ భీమన్న' అనే వ్యాసంలో డా. బోయి భీమన్న కవితాధార, రచనాశిల్పం, వారి ప్రగతిశీల భావాలు, దృక్పథాలు, ఆదర్శాలు, పీడిత జన పక్షపాతాన్ని, కుల, మత వ్యవస్థలను వ్యతిరేకించిన తీరును ఈ వ్యాసంలో చర్చించారు. జాషువా కవిత్వాన్ని ఆసాంతం చదివి రసానందాన్ని, ఆర్తిని పొందిన పాఠకులు జాషువా హృదయాన్ని ఆవేదనను అర్థం చేసుకొని సామాజికంగా, మానసికంగా పరివర్తన చెందలేకపోయారన్న సంగతి తెలిసినవాడు బోయి భీమన్న అని అభిప్రాయపడ్డారు. జాషువా సాంస్కృతిక నేపథ్యం నుండి మేల్కొని ప్రతిఘటన చైతన్యంతో సంప్రదాయమూలాల్ని తాకేటట్టు రాస్తే, భీమన్న తెలివితో అవి తాకవలసిన చోటనే తాకేటట్టు రాస్తారు.

భీమన్న 'గుడిసెల్ని కాల్చెయ్' అంటూ భయపెడుతాడు. అలా అని సంఘ వ్యతిరేకికాదు. గుడిసెల్లో తరతరాల అజ్ఞానాన్ని, అంధకారాన్ని కాల్చెయ్యమంటాడు. కాలిన గుడిసెల స్థానంలో మళ్ళీ గుడిసెలు కడదామంటూ ప్రజల్ని చైతన్యపరుస్తాడు.

''కాలిపోతున్న గుడిసెల్ని కాలిపోనీ
వాటి సమాధులే పునాదులుగా
లేచే భవనాలకు రూపం కల్పించుకో,,[21]

అని ప్రజలను ఉత్సాహపరుస్తారు. బోయి భీమన్న కవిత్వం ఆర్తితో ప్రాణం పోసి జీవకళను అందిస్తుంది. అసమానతలున్నంత కాలం బోయి భీమన్న కవిత్వం నిలిచే ఉంటుందన్న ఆశాభావాన్ని వ్యాసకర్త వ్యక్తపరిచాడు.

[21] వ్యాసనవమి –డా. ఎన్. గోపి – పేజి -91.

'వేమన – ఆరుద్ర' అనే వ్యాసంలో ఆరుద్రగారు వేమన గురించి పరిశోధించిన తీరు వివరించారు. పరిశోధకుడు తాను చేస్తున్న విషయంపై అంతకుముందే ఉన్న సమాచారం సేకరించాలి. తనకంటే ముందు కృషి చేసినవారిని స్మరించాలి. తను చెప్పిన విషయాలు పాతవారి ప్రతిపాదనలతో విభేదించినట్లయితే, అది కేవలం విద్యా సంబంధమైన వివాదంగా గుర్తించి ఎలాంటి ఆవేశాలకు లోను కాకుండా తమ అభిప్రాయాలను సున్నితంగా చెప్పగలగాలి. ఈ విషయాలన్నింటినీ జాగ్రత్తగా గమనించి తన పరిశోధనను సాగించిన గోపి ఉత్తమ పరిశోధకుడు అనడానికి నిదర్శనమే ఈ వేమన – ఆరుద్ర వ్యాసం.

బ్రౌన్ తర్వాత వేమనను ఓ శతాబ్దం వరకు ఎవరూ పట్టించుకోలేదంటూ కొనసాగించిన ఆరుద్ర ''కొమర్రాజు లక్ష్మణరావు గారు ఇల్లలికారు, కట్టమంచి రామలింగారెడ్డిగారు ముగ్గుపెట్టారు, వంగూరువారు పీటవేశారు. వేటూరి వారు, బండారు వారు శేషాద్రి రమణ కవులు మొదలైనవారు ప్రస్తుతించారు. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు మహాకవిగా ప్రతిష్ఠించారు.''[22] అంటూ వేమనపై కృషి చేసిన పరిశోధకులను స్మరించుకున్నారు. వేమన గురించి ఆరుద్ర ఎప్పటినుండి రాస్తున్నారో తెలియదుకానీ 1968లో సమగ్రాంధ్ర సాహిత్యం పన్నెండవ సంపుటిలో 'వేమన – కడప సుబాకవులు' పేరుతో ఒక వ్యాసం రాశారు. అప్పటినుండి ఆరుద్ర వేమనపై 1973,1974,1978,1981ల్లో వరుసగా వ్యాసాలు రాశారు అని వేమనపై ఆరుద్రగారి కృషిని తెలియజేశారు. వేమనపై ఆరుద్ర అభిప్రాయాలకు గోపిగారి స్పందనలు–

''వేమనగారి తాత్త్విక దృక్పథం పట్ల ఆరుద్రగారిలో 'Loud Thinking' లాంటి వైఖరి కన్పిస్తుంది''[23]

''ఆరుద్రగారి సూత్రీకరణలు తిరుగులేనివని వారు కూడా భావిస్తున్నారని నేననుకోను''[24] వంటి వాక్యాల ద్వారా తోటి పరిశోధకుని అభిప్రాయాలతో ఎంత సున్నితంగా విభేదించవచ్చో ఈ వ్యాసంలో చూపడం జరిగింది.

[22] వ్యాసనవమి – డా. ఎన్. గోపి – పేజి -98.

[23] వ్యాసనవమి – డా. ఎన్. గోపి – పేజి -100.

[24] వ్యాసనవమి – డా. ఎన్. గోపి – పేజి -101.

'బ్రహ్మంగారి సంప్రదాయంలో – వేమన' అనే చివరి వ్యాసంలో వేమనలో గల కాలజ్ఞాన స్పృహను తెలిపే పద్యాలను ఉదహరించారు. ఇందులో వీరబ్రహ్మం జననం గురించి చెప్పిన పద్యాలపై చర్చచేసి వాటిలో కన్పించే పాఠాంతరాలను వివరించారు. వేమనలో కన్పిస్తున్న విశ్వ బ్రాహ్మణ ఉద్యమాల ప్రమేయాన్ని చూపే పద్యాలను కూడా వివరించారు. వీరిని ఆశ్రయించి బతికే ఉపకులాలైన రుంజలు, పవసలు అనే వారి ప్రస్థావనా వేమన పద్యాల్లో కన్పిస్తుంది. పాశం సోమశేఖరం అనే 'రుంజ' కథకుడు వేమన గురించి చెప్పిన పద్యాలను ఉదహరించారు.

''మొదట మనువు (ముగంట) మయుడు
మూటత్వష్టశిల్ప మొనయ నాల్గు
విశ్వకర్మగలడు విశ్వమందయిదింట
విశ్వదాభిరామ వినురవేమ''[25]

విశ్వకర్మ పంచమంత్రాలనుపయోగించి లోకచక్రాన్ని నిర్మించి రౌంజకాసురుడనే రాక్షసున్ని చంపాడని చెప్పబడిన కథకు, పైన చెప్పిన వేమన పద్యానికి పోలికలు ఉన్నాయని నిరూపించారు.

ఈ వ్యాసంలో అనేకాంశాలను చర్చించిన గోపి ''విశ్వ బ్రాహ్మణుల ఉద్యమానికీ, వీరబ్రహ్మానికీ, వీరబ్రహ్మం సంప్రదాయానికీ, వేమనకూ ఏదో ఒక విధమైన సంబంధం ఉన్నది''[26] అని నిర్ధారించారు. వేమనపై పరిశోధన చేసిన 'గోపి' తన పరిశోధనను నిరంతరం సాగిస్తూ చేసిన కృషి ఫలితమే ఈ 'వ్యాసనవమి'. తన పరిశోధనకు సంబంధించిన వివిధ పార్శ్వాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పునర్విశ్లేషిస్తున్న తీరు అభినందనీయం.

6.4 వేమన పద్యాలు – పారిస్ ప్రతి సముద్ధరణ (క్రీ.శ. 1730):

పారిస్ ప్రతి గోపిగారి 'ప్రజాకవి వేమన' పరిశోధనకు అనుబంధ పరిశోధన గ్రంథంగానే భావించాలి. పి.హెచ్ డి డిగ్రీ పొందాక ఇక ఆ అంశం గురించి మరిచిపోకుండా వేమన పద్యాలు వెతకడంలో తలమునకలై మరింత శ్రమించి ఉత్తమ పరిశోధకుడికి ఉండాల్సిన

---

[25] వ్యాసనవమి –డా. ఎన్. గోపి – పేజి -109.

[26] వ్యాసనవమి –డా. ఎన్. గోపి – పేజి -112.

లక్షణాలను ఆచరణలో చూపించిన డా. ఎన్. గోపి కృషి ఫలితమే ఈ ''వేమన పద్యాలు పారిస్ ప్రతి.''

గోపి పారిస్ ప్రతిని గురించి బంగోరె గారితో ముచ్చటిస్తున్నప్పుడు తెలుసుకున్నారు. తన పరిశోధన అనంతరం పట్టువిడవకుండా యునెస్కోవారి కోసం వేమన పద్యాలను ఇంగ్లీష్ లోకి అనువాదం చేస్తున్న కాలిఫోర్నియా నివాసి డా. జె.ఎస్.ఆర్.ఎల్ నారాయణమూర్తిగారి సహాయంతో వారి మిత్రుల ద్వారా ఈ పారిస్ ప్రతిని ఫ్రాన్స్ లోని 'కింగ్స్ లైబ్రరీ' నుండి 1980లో ఫోటోస్టాట్ కాపీని సంపాదించారు. క్రీ.శ 1731లో అంతకు ముందు రాసి పెట్టుకున్న ఈ కాగితపు ప్రతిని ఫాదర్ లీగ్యాక్ అనే ఫ్రెంచి మిషనరీ ప్రచారకుడు ఓడలో ఫ్రాన్సుకు వేమన పద్యాలను పంపించారు. అవి సంవత్సరం పాటు ప్రయాణించి జులై 30, 1731లో ఫ్రాన్స్ కు చేరి కింగ్స్ లైబ్రరీలో భద్రపరుచబడ్డాయి. బ్రౌన్ కు వందేళ్ళ ముందు ఈ ప్రతి తెలుగునేలకు దూరంగా ఉంది. గోపి కృషి వల్ల తిరిగి మళ్ళీ మన దగ్గరకు వచ్చింది. బ్రౌన్, కట్టమంచి, రాళ్ళపల్లి, బంగోరే, దిగవల్లి, ఆరుద్ర వంటి వేమన్న పద్య పరిశోధకులకు అందనిది గోపి చేతికి వచ్చింది. ఇది ప్రశంసనీయం. మనకు దొరుకుతున్న ప్రాచీన ప్రతుల్లో ఇది రెండోది.

పారిస్ ప్రతి ఎంత గొప్పదైనా దాన్ని రాసింది మనిషే కాబట్టి, ఇందులో పాఠభేదాలు, ఛందఃదోషాలున్నాయి అని నిశితంగా పరిశీలించారు. వేమన కాలానికి సబంధించినవీ ఇంతకు ముందు ఎక్కడా దొరకనివి ఏడు కొత్త పద్యాలను గోపి వెతికి పట్టుకున్నారు. పారిస్ ప్రతిలో 368 పద్యాలుంటే వాటిని పరిష్కరించి 364 పద్యాలుగా గోపి అచ్చువేశారు. అసలు ప్రతిని ఆరుద్ర, వేటూరి ఆనందమూర్తి గార్లకు అందించారు. వారి అభిప్రాయాలను కూడా పీఠికల రూపంలో ఈ పుస్తకంలో చేర్చాడు. వేమన పద్యాల లేఖకులు చాలామంది పండితులు కారు అంటూనే తాము రాస్తున్న వాటిలో తప్పులు వస్తున్నాయన్న స్పృహ కలవారు కూడా వీరిలో ఉన్నారన్నారు.

''వ్రాలా శత్రభలు తప్పులు
చాలంగా గలవు శబ్ద సంగతులెరుగం
గేలింబెట్టక తిట్టక

పోలంగా దిద్దరయ్య బుధజనులారా''[27] (డి. 1750)

''వ్రాత తప్పు వలన వాచకులలగ
తప్పుగల్గెనేని తగిన యెడల
వలయు నక్షరములు వర్ణించి వ్రాయుడీ
సుకవులైన వారు సురు చిరముగ''[28] డి. (1728)

పై పద్యాలను చూస్తే తప్పులుంటే నరిదిద్దమనడం కన్పిస్తుంది. అని గ్రంథ ప్రారంభంలో, చివరలో రాసుకున్న దాన్ని బట్టి దర్శి సుబ్బయ్య (డి.1750), నాదెండ్ల గోపాలయ (డి. 1728), బిచాబసప్ప (డి.1733), మాజేటి సర్వేశలింగం (డి. 1734, డి. 17475, డి. 2950), గోపాలుని శేషయ్య (డి. 1750), రౌంగోలు సుబ్బయ్య (డి. 1755), యద్దనపూడి చిన్నంరాజు (డి. 1763), కంఠమహంతి వెంకయ్య (డి. 2949) వంటి వారు వేమన పద్యాలు రాశాని వారి వివరాలు తెలిపారు. ప్రతి ప్రారంభంలో వారు రాసుకున్న దైవ వాక్యాలను బట్టి వారిలో అగ్రహారికులు, బడి చదువుల అయ్యవార్లు ఉన్నారు. లేఖకుడు తన గుర్తులను నమోదు చేసే పద్ధతిని పారిస్ ప్రతిలో ఆరుద్రగారు గుర్తించారు. ఇలాంటివి చాలా జాగ్రత్తగా వెతికితే గానీ దొరకవు. లేఖకుడు శిలువ గుర్తువేస్తే అతన్ని క్రైస్తవుడిగా గుర్తించారు.

గోపి తాను సంపాదించిన అనేక ప్రతుల నుండి విలువైన పాఠాలను దాదాపు ప్రతిపద్యం నిండా ఇచ్చారు. ముఖ్యంగా రాతప్రతుల సముద్ధరణ నాలుగు దశల్లో జరుగుతుంది.

1. లిపి దోషాలను పరిహరించడం
2. ప్రాచీన లేఖన పద్ధతులను ఆధునిక లిపికి మార్చడం
3. ఛందస్సు తప్పిన పద్యాలను వాటి విలక్షణత అర్థం చెప్పకుండా గణాల్లో బిగించడం
4. యాస రూపాలను ప్రామాణిక మాండలికంలోకి మార్చడం.

మౌఖిక సంప్రదాయానికి చెందిన వేమన పద్యాలు కాలక్రమంలో పొందిన మార్పులు అధికంగా ఉన్నాయి. అందుకు ఉదాహరణగా పద్యాన్ని చూపారు.

---

27 పారిస్ ప్రతి ముందుమాటలో - XXXi

28 పారిస్ ప్రతి ముందుమాట – డా. ఎన్. గోపి - XXXi

''నీళ్ళ మీద జూడు నెరయ ఓడల పర్వు
బయట బయట జూడు బండిపర్వు
ఆడదాని మాట ఆడనే చెల్లురా''[29]

అనే పద్యంలో మూడోపాదంలోని 'ఆడదాని మాట' లేఖకుడి మాండలికోచ్చారణ రూపాన్ని అర్థం చేసుకోకపోవడం వల్ల అపపాఠాలు పుట్టి ప్రచారమవుతాయనడానికి ఉదాహరణ 'యాడదాని మాట'ను 'ఆడదానిగా' భ్రమించటం వల్ల ఇదే ప్రామాణికమని తలుస్తారు. కానీ తాటాకు పత్రాల్లోంచి ఎత్తి రాస్తున్నప్పుడు ఇలాంటి ప్రమాదాలు ఎన్నో జరుగుతాయి.

పారిస్ ప్రతిలోని పాఠాలకు విరుద్ధార్థాలు కొన్ని కన్పిస్తున్నాయి. భేదా భేదము లెరుగడు (పారిస్ ప్రతి – 56 పద్యం), భేదా భేదము లెరిగియు (బందరు – 1039), లోను చూడ చూడ లోకాభిరామంబు (పారిస్ ప్రతి – 5 పద్యం) లోకాంధకారంబు (డి. 1769 –62) వంటి వాటిని గోపి చూపాడు.

తాత్త్విక సంప్రదాయాల్లోని ఛాయలను చూపిస్తూ – 'స్త్రీల జూచినప్పుడు చిత్తంబు రంజిల్ల' (బ్రౌన్ 1–64) అని బ్రౌన్ స్వీకరించిన పాఠంకంటే స్త్రీల జూచినప్పుడు చిత్తంబు వదులురా అన్న పారిస్ ప్రతి పాఠమే (67 పద్యం) సమంజసంగా ఉంది. 'చిత్తం వదుల్తుంది' అంటే మనసు స్వాధీనంలో ఉండదనే అర్థంలో హేతువు కన్పిస్తుందంటారు గోపి. ''కోతినొకడు దెచ్చి కొత్త పట్టము గట్టి/కొండముచ్చు లెల్ల గొలిచినట్లు''[30] పద్యంలో కొత్త పట్టమే సరైనదని, కొన్ని ప్రతుల్లో ఉన్నట్లు 'కొత్త పుట్టము' కాదంటారు. అయితే పారిస్ ప్రతిలో కంటే మెరుగైన పాఠాలు కూడా ఇతర ప్రతుల్లో కనిపిస్తున్నాయి. దీనికి ఉదాహరణగా చూపిన పద్యం ఇది.

''చచ్చెచచ్చెననుచు చావుక వెరచెడి
కలుషమతుల వెర్రిదెలుపరాదు''[31]

---

[29] పారిస్ ప్రతి - డా. ఎన్. గోపి -45

[30] పారిస్ ప్రతి - డా. ఎన్. గోపి -47

[31] పారిస్ ప్రతి - డా. ఎన్. గోపి -9

దీనికి 'దీనమతుల వెఱ్ఱి తెలుపరాదు' (డి. 1723, 1042) అన్న పాఠమే సరైనదని గోపి నిర్ణయించారు.

వేమన పద్యాలు రాసిన వారి యాసలు కూడా వీటిలో కనబడుతున్నాయి. వాటిని సంస్కరించేటప్పుడు గోపి అపురూప శబ్దాలను ప్రామాణీకరించుకోవడంలో తప్పులేదనే భావనతో వ్యవహరించారు. కొన్ని ఉచ్చారణలో రూపాలు మారిన తీరును చూపించారు. ''సేతురు (12) సేయు, యాల (14) యేల, తెలుసువాడు (15) తెలియువాడు, తోలుతోలున రాచ (33) తోలుతోలున రామ'' వీటిని గోపి ముందు మాటలో చెప్పడం జర్గింది. రామ ప్రతిమ దెచ్చి....(12) అనే పద్యంలోని రెండవ పాదంలో 'సేతురు' అనే పదాన్ని 'సేయు' అనే ప్రామాణిక మాండలికంలోకి మార్చారు.

పారిస్ ప్రతిలోని 49 పద్యంలోని 'చరసార' అనే పదాన్ని 'చెరసాల' గాను, 'మధ్యాముున' (54) అనే పదాన్ని 'మధ్యమున' అని పారిస్ ప్రతుల్లో ఉన్న దోషాలను గుర్తించి ప్రామాణిక రూపాలుగా మార్చారు. అయితే ఆ రూపాలు దోషాలు కాకపోవచ్చు. అవి కావ్యభాషలోకి ఎక్కి ఉండకపోవచ్చు. అందువల్ల ప్రామాణిక మాండలికాలను గ్రహించడం జరిగింది అని చెప్పారు. ఏఏ మాండలికాలను ప్రామాణిక మాండలికంలోకి మార్చారో తెలుసుకునే అవకాశం కల్పించారు. ఇది పరిశోధకుడికి ఉండవలసిన గొప్ప లక్షణాలుగా భావించాలి. లేదంటే సముద్ధరణలోని రూపాలే అసలైన రూపాలని భావించే ప్రమాదముంది. పాఠ సంస్కరణలో తప్పులను గుర్తించి మార్చే ప్రయత్నం చేయాలి. అది చెయ్యకపోతే సంస్కరణే ఉండదు. సున్నాలు, ద్విత్వాలు రాసే పద్ధతి ఇప్పటి పద్ధతిలోకి మార్చకపోతే అచ్చువెయ్యడం, చదవడం రెండూ కష్టమే. అయితే 'యాస' రూపాలను ప్రామాణీకరించడం కొంచెం కష్టమే. అయితే ఈ ప్రామాణీకరణం వల్ల రూపాంతరాలను యాస రూపాలుగా భావించే ప్రమాదముంది. ఇటువంటి వాటిని చాలా సునిశిత దృష్టితో మార్పులు చేసి పరిష్కరించారు గోపి.

పారిస్ ప్రతిలోని 104 వ పద్యంలో

''రతిలేక ముదియునంగన
 రతిగల్గిన ముదియు నశ్వరత్నము మిగులన్

రతికేళి ముదియు పురుషుడు
రతిలేకను ముదియు గజము రయమున వేమా''[32]

చివరి పాదాన్ని కొన్ని ప్రతుల్లో ఉన్న 'గతివిరహితయైన' పదాన్ని 'రతిలేకను ముదియు' అని మార్చడాన్ని ఆనందమూర్తిగారు సమర్థించారు. వ్రాత ప్రతుల్లోని పాఠం కన్నా అచ్చులోని పాఠాంతరమే మేలని గోపి గుర్తించారు. మొదటి మూడు పాదాల్లో 'రతి' ఉండి నాలుగో పాదంలో 'గతి' ఉండడం పద్య నిర్మాణంలో లోపంగా భావించారు గోపి.

పారిస్ ప్రతి వచ్చిన తర్వాత వేమన చేసిన ఛందో ప్రయోగాలపై కొన్ని కొత్త విషయాలు తెలిసివచ్చాయి. 'వ్యాసనవమి' లో ''మక్కాకు పోనేల మగుడు తారానేల'' వంటి పాదాలు ఆటవెలదిలో మూడు సూర్య గణాలుండాల్సిన చోట, రెండు ఇంద్రగణాలు వచ్చాయనీ, తర్వాత ఉన్న ఇందగణాల ప్రభావం వల్ల ఈ సూర్యగణాలు కూడా ఇంద్రగణాలుగా మారాయనీ, దీన్ని 'ఛందస్సమీకరణం' అనవచ్చని గోపి, చేరా అభిప్రాయపడ్డారు. అయితే ఈ పారిస్ ప్రతివల్ల ఈ రకం మార్పు అతి విస్తృతంగా కనపడడమే కాక ఇది బేసి పాదాలకే పరిమితం కాలేదని అర్థమవుతుంది. సరిపాదాల్లో కూడా 5 సూర్యగణాల్లో మొదటి మూడు సూర్యగణాలు, రెండు ఇంద్రగణాలుగా మారడం గమనిస్తాం. బేసి పాదాల్లో మార్పును సమీకరణం అనగలం కానీ సరిపాదాల్లో మార్పును సమీకరణం అనలేము. 5 సూర్యగణాల్లో 3 సూర్యగణాలు, 2 ఇంద్రగణాలుగా మారాయి కాబట్టి.

''ఇంద్రుడు కాముడై హీనంబునొందడె
మారుడు కాముడై నీరుగాడె
బ్రహ్మయు కాముడై భంగంబు నొందడా?
విశ్వదాభిరామ వినురవేమ.''[33]

ఇక్కడ మకుట పాదం తప్ప మిగితావి సీస పద పాదాలతో సమానం. అంటూ వేమన పద్యాల్లో ఛందో ప్రయోగాల మీద ప్రత్యేకంగా పరిశోధించదగ్గ విషయమే ఉంది.

---

[32] పారిస్ ప్రతి - డా. ఎన్. గోపి -32

[33] పారిస్ ప్రతి - డా. ఎన్. గోపి -61.

పై విధంగా గోపి పారిస్ ప్రతిలో పద పాఠాంతరాల్ని, యాసలను, దోషాలను, ఛందోవిషయాలను కూలంకషంగా చర్చించి, పరిశీలించి, పరిష్కరించి తెలుగు జాతికి ఒక గొప్ప కానుకను ఇవ్వగలిగారని, పరిశోధకుడిగా ఎంత కృషి చేయాలో శక్తివంచన లేకుండా చేశారని, నేటి పరిశోధకులకు డా. ఎన్. గోపి ఆదర్శప్రాయుడని భావించవచ్చు. అయితే సాహిత్య శైలి వేరేగా ఉంటుంది. పరిశోధనా శైలి వేరేగా ఉంటుంది. పరిశోధనలో రచన శైలి సరళంగా, స్పష్టంగా ఉండాలి. గోపి పరిశోధనలో ప్రారంభం, కొనసాగింపు, విశ్లేషణ, సలహాలివ్వడం, పరిశోధన పరిమితులను తెలపడం వంటివన్నీ అలంకారిక శైలిలో కాకుండా స్పష్టంగా, సరళంగా చెప్పి వర్తమాన పరిశోధకులలో విలక్షణమైన, విశిష్టమైన స్థానాన్ని సంపాదించారు.

6.5 ఇతరాలు:

గోపి రాసిన కాలమ్స్, అనువాదాలు, వ్యాఖ్యానాలను ఇతరాలుగా చెప్పడం జరిగింది.

6.5.1 అక్షరయానం(కాలమ్స్): (విద్యా, సాహిత్య, సంస్కృతి సంబంధి వ్యాసాలు):

ఇండియాటుడే పక్ష పత్రికలో 'అక్షరయానం' శీర్షికతో 'కాలమ్'గా వచ్చిన వ్యాసాలే ఈ అక్షరయానం. 'కాలమ్' (Column) అంటే సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంకేతిక, విద్య, వైజ్ఞానిక, సాహిత్యం మొదలైన రంగాలలో సుప్రసిద్ధులైన వ్యక్తులు ఒక పత్రికకు ఒక నిర్ణీత కాల వ్యవధిలో రాసే వ్యాసం 'కాలమ్'. సమాజంలోని పాఠకులందరికీ ఈ 'కాలమ్స్' మార్గదర్శకత్వం వహిస్తాయి. రచయిత తాను చెప్పదలచుకొన్న విషయాలకు సంబంధించిన సమాచారానికి వాస్తవ విషయాలు చెబుతూ చమత్కారంగా, తార్కికంగానూ కాలమ్ వ్యాసాలు రాయబడుతాయి.

అక్షరయానంలో మొత్తం 38 వ్యాసాలున్నాయి. అందులో తెలుగు భాషకు సంబంధించి తొమ్మిది వ్యాసాలున్నాయి. ఏడు వ్యాసాలు కళలకు సంబంధించినవి. మిగిలినవి ఇతర విషయాలకు సంబంధించినవి ఉన్నాయి. ముందుగా తెలుగుభాషకు సంబంధించిన వ్యాసాలను విశ్లేషిద్దాం. ''తెలుగు చిరునామా ఎక్కడ?'' అనే వ్యాసంలో తెలుగును కూడా ఆంగ్లంలో నేర్చుకుంటున్న కొత్త ప్రపంచంలో రేపటి తెలుగు భాషా చిత్రాన్ని ఊహిస్తూ తెలుగు చిరునామాను ప్రశ్నిస్తున్నాడు రచయిత. మన అస్తిత్వం, వ్యక్తిత్వమే తెలుగు అని అలాంటి తెలుగంటే మనకు చిన్నచూపు ఎందుకని ప్రశ్నించారు. తెలుగంటే ఇష్టమని, తెలుగు భాష

గురించి ప్రసంగాలు చేసేవారెవరూ తమ పిల్లలను తెలుగు స్కూళ్ళల్లో చదివించరు. కాన్వెంట్లలోనే చదివిస్తారు. తెలుగు అంతరించి పోవడానికి రచయిత చెప్పిన కారణాలివి. స్కూళ్ళు, కాలేజీలలో తెలుగు మాయమవుతుందని, తేలిగ్గా మార్కులు పొందవచ్చనే ఉద్దేశంతో కాలేజీల్లో సంస్కృతాన్ని పెట్టడం, ప్రభుత్వాలు ఇతర రాష్ట్రాల వారిలా మాతృభాష పట్ల శ్రద్ధ తీసుకోకపోవడం వంటి కారణాలనుచూపారు. కానీ మన పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకల పరిస్థితివేరని, ''గోకాక్ కమిటీ''[34] 1981–82 విద్యాసంవత్సరం నుండి తప్పనిసరిగా కన్నడ భాషను ప్రథమ భాషగా చేయాలని సూచించింది. దీనికి 150 మార్కులుంటాయి. కాబట్టి మన తెలుగు ప్రభుత్వం కళ్ళు తెరిచి విద్యాసంస్థల్లో తెలుగు పరిస్థితిని అధ్యయనం చేయకుంటే రచయిత అన్నట్లు తెలుగుకు ఉపాధి మాత్రమే కాదు పునాది కూడా ఉండదు.

'ప్రపంచ తెలుగు ఉద్యమం ఏమైంది?' అనే వ్యాసంలో ఇప్పటి వరకు జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల గురించి చెప్తూ మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు 1975లో, రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు 1981 మలేషియాలోని కౌలాలంపూర్ లో, మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు 1990వ సంవత్సరంలో మారిషస్ లో, నాల్గవ ప్రపంచ తెలుగుమహాసభలు 2012లో తిరుపతిలో జరిగాయి. అయితే ఇలాంటి సభలకు ప్రజాస్వభావం ఉండదని, దీనివల్ల తెలుగుకు జరిగిన మేలు ఏమీ లేదని, తెలుగు భాషాభివృద్ధికి, వ్యాప్తికి ఎలాంటి లాభం జరుగలేదని, ప్రపంచ తెలుగు మహాసభలు ఘనంగా జరిగిన తీరును దుయ్యబట్టారు. దీనికంతటికీ కారణం ప్రభుత్వానికి సరైన పద్ధతిలో చెప్పేవాళ్ళు కరువయ్యారేమో అని చిన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు ఈ వ్యాసంలో.

'తెలుగుకు శుభపరిణామం' అనే వ్యాసంలో తెలుగు భాష అభివృద్ధికి, తెలుగు చదివిన వారికి కావల్సిన ఉపాధి అవకాశాల గురించి చర్చించారు. మాతృభాషాదినోత్సవాలు ఏడాది కోసారి జరుపుకునే పండుగల్లా కాకుండా తెలుగు భాషకు ప్రాధాన్యం పెరగాలంటే ముందు ఉపాధి అవకాశాలు ఉండాలి. ఆ అవకాశాలు రావాలంటే పాఠశాలలు, కళాశాలల్లో తెలుగును తప్పనిసరి చేసి విద్యారంగంలో తెలుగు ప్రాధాన్యాన్ని పెంచాలి. తెలుగంటే వట్టి భాష కాదని– ''తెలుగు భాష, తెలుగుసాహిత్యం, తెలుగు సంస్కృతి''[35] ఇవన్నీ కలిసిన తెలుగుదనమే తెలుగు.

[34] అక్షరయానం – డా. ఎన్.గోపి – పేజి - 2

[35] అక్షరయానం – డా. ఎన్.గోపి – పేజి -38

చివరగా ఈ వ్యాసంలో అంతర్జాతీయ భాషా దినోత్సవం సందర్భంగా అప్పటి రాజ్యసభ సభ్యుడైన డా. సి. నారాయణరెడ్డిగారు మాతృభాష నిర్బంధ బోధన బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టిన విషయాన్ని స్మరించుకున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తేనే తెలుగు విషయంలో కొంతైనా స్పష్టత వస్తుందని చెప్పడం జరిగింది. కానీ, ప్రభుత్వం కదలిక నెమ్మదిగా ఉంటుందంటూ చెప్పిన నానీని ఈ సందర్భంగా ఉదహరించారు.

''సచివాలయం
వెయ్యి కాళ్లజెర్రి
కాళ్లన్నీ కదుల్తాయి
అడుగు సాగదు''[36]

''గోరంతదీపం కొండంత వెలుగు'' వ్యాసంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ స్కూళ్ళలో తెలుగును తప్పనిసరి చేస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ఆ జీవో ప్రకారం తెలుగు మీడియం పాఠశాలల్లో ఒకటి నుండి పదో తరగతి వరకు తెలుగును ప్రథమభాషగా చదవాలి. ఆరు నుండి పది దాకా ద్వితీయ భాషగా హిందీ, తృతీయ భాషగా అయిదు నుండి పది వరకు ఇంగ్లీష్ ఉంటాయి. ఇంగ్లీష్ మీడియం స్కూళ్ళలో తెలుగు లేదా ఇంగ్లీష్ మాతృభాషగా ఉన్న విద్యార్థులకు తెలుగు ప్రథమ భాషగా ఉంటుంది. తెలుగు లేదా ఇంగ్లీష్ మాతృభాష కాని వారి విషయంలో తెలుగు లేదా వారి మాతృభాష ఉంటుంది. ఉర్దూ, మరాఠీ స్కూళ్ళలో ఆరో తరగతి నుండి ద్వితీయభాషగా తెలుగు ఉంటుందని స్కూళ్ళలో తెలుగు ఏ స్థానంలో ఉందో అన్న విషయాన్ని మీడియాల వారీగా వివరించడం జరిగింది. తెలుగులో తక్కువ మార్కుల వస్తాయనే అపోహను తొలగించి, పిల్లలకు తెలుగంటే భయం లేకుండా చేయాలని, మాతృభాషలో ప్రావీణ్యం ఉన్నవారు ఏ భాషనైనా సులభంగా నేర్చుకుంటారనే నమ్మకాన్ని కల్గించాలని చెప్పారు. ఇంటర్ లో బలవంతంగా సంస్కృతాన్ని రుద్దకుండా తెలుగును తప్పనిసరి చేయడంవల్ల తెలుగుకు అనుకూల వాతావరణం ఏర్పడుతుంది.

'తెలుగు సమస్యలపై వెలుగు' అనే వ్యాసంలో ఇతర రాష్ట్రాలలో చాలాచోట్ల తెలుగు బోధన జరుగుతుందని వారి భాషాభిమానం అలాంటిదని, ఒరిస్సా రాష్ట్రంలో ఉపాధ్యాయుడు ఒరియా భాషలో ఉన్న పుస్తకాన్ని తెలుగులో చెప్తాడని, తెలుగులో విన్న విద్యార్థి పరీక్షలో

[36] అక్షరయానం – డా. ఎన్.గోపి – పేజి -37

ఇంగ్లీషులో వచ్చే ప్రశ్నాపత్రానికి తెలుగులో జవాబు రాస్తాదని, ఇలాంటి విచిత్ర పరిస్థితి ఎక్కడా లేదంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. మన మాతృభాషా సంస్కృతులను కాపాడుకుంటూనే ఇతరుల భాషా సంస్కృతులను గౌరవించాలని చెప్తూ కర్ణాటక ప్రభుత్వాన్ని ఉదహరించాడు. అక్కడి ప్రభుత్వం కొంతమంది తెలుగువారున్నా వారి అవసరాల కోసం తెలుగు పాఠశాలలను నడుపుతుందని ప్రశంసించారు. ఈ వ్యాసంలో మారిషస్ గురించిన ప్రస్తావన చేశాడు. మారిషస్ ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగుబోధన జరుగుతుందని, అక్కడి యువత ఆంధ్రకు వచ్చి స్పెషల్ తెలుగులో డిగ్రీలు చేసి వెళ్ళి అక్కడ తెలుగు బోధిస్తున్నారని, దేశం చిన్నదైనా వారి అభినివేశం పెద్దదని అభినందించాడు.

'పాలనకు మాతృభాష ముఖ్యం' అనే వ్యాసంలో మొన్నటి దాకా ఇంగ్లీషులో చదివినా తెలుగు మీడియంలో పరీక్షలు రాసుకునే అవకాశం ఉండేదని, ఇప్పుడా అవకాశాన్ని తీసివేశారని బాధపడ్డారు. మనది భాషా ప్రాతిపదికన ఏర్పాటైన రాష్ట్రమని, కానీ చదువులో, పరిపాలనా రంగంలో తెలుగుకు తగిన ప్రాధాన్యం కల్పించకపోవడం శోచనీయం. అధికార భాష అమలు కావాలంటే తెలుగు మీడియంలో చదివిన వాడే ప్రభుత్వోద్యోగాల్లోకి వస్తే ప్రభుత్వ రంగంలో అధికార భాష అమలుకు ఎక్కువ అవకాశం ఉంటుంది. పూర్వం తెలుగు మీడియం విద్యార్థులకు పోటీ పరీక్షల్లో 5శాతం వెయిటేజి ఇచ్చేవారని, కానీ కొందరికి ఇది నచ్చక కోర్టుకెళ్ళడంతో వెయిటేజి వల్ల ప్రతిభావంతులైన విద్యార్థులు అసంతృప్తికి గురవుతారని కోర్టు ఆ అవకాశాన్ని రద్దు చేసింది. ఈ వ్యాసంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుకు తెలుగు పట్ల ఉన్న చిత్తశుద్ధిని ప్రశంసించారు. ఆయన ఫైలు ఇంగ్లీషులో వస్తే సంతకం పెట్టననేవాడని, సంతకం కూడా తెలుగులోనే పెట్టేవాడని గుర్తుచేస్తూ నేటి పాలకులకు కూడా అలాంటి చిత్తశుద్ధి అవసరమన్న విషయాన్ని వివరించారు. చివరగా ఈ వ్యాసంలో ''ఇంగ్లీష్ తాత్కాలికం, ఉర్దూ పరిమితం, తెలుగు మన వెన్నెముక. వెన్నెముక విరుచుకొని మరింత వంగిపోదామా?''[37] అంటూ ప్రశ్నించారు.

'అందమైన భాషకు కృషి చేద్దాం' అనే వ్యాసంలో ఒక పుస్తకంలో వందేమాతరం గీతానికి చెప్పిన అర్థాన్ని వివరిస్తూ, ఇంతకంటే సులభంగా, అందంగా కూడా అర్థాన్ని చెప్పవచ్చని నిరూపించారు. నిత్యజీవితంలో మనకు తరుచుగా ఎదురయ్యే ఇలాంటి గీతాల

[37] అక్షరయానం – డా. ఎన్.గోపి – పేజి -75

పట్ల, వాటిని వివరించేటప్పుడు జాగ్రత్తపడాలని హెచ్చరించారు. ఈ వ్యాసంలో శ్రీశ్రీ చెప్పిన చమత్కారాన్ని ఒకదాన్ని ఉదహరించాడు. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన జాతీయగీతం మొదటి ప్రతిలో ద్రావిడాంధ్రోత్కల వంగా అని రాశాడని, అందులో 'ఆంధ్ర' శబ్దం ఉండేదట ఇప్పుడు లేదేంటని శ్రీశ్రీని ఎవరో ప్రశ్నిస్తే, దాని పక్కనే 'ఉచ్చల జలధి' ఉంది కదా దానిలో కలిసిపోయిందేమో చూడండి అని చమత్కరించారని పేర్కొనడం జరిగింది.

'తెలుగు తేనె కాదు తెలుగు భృతికావాలి' అనే వ్యాసంలో ''తీయ తేనియ తెలుగు తీపియే తీపియని'' లాంటి మాటలు కాదు కావాల్సింది, తెలుగు చదివిన వారికి జీవనోపాధి కావాలని అప్పుడే వారి జీవితాల్లోని చేదు పోయి తీపి మిగులుతుందని ఈ వ్యాసం చదివితే అర్థమవుతుంది. తెలుగు తన అస్తిత్వాన్ని కోల్పోవడానికి కొందరు చెప్తున్న కారణాలు ఏంటంటే, అన్యభాషల జడివానలో తెలుగు కొట్టుకుపోతుందని, పరభాషా వ్యామోహం వల్లనే తెలుగుకు నష్టమని, ప్రపంచీకరణ ప్రభావాలను కారణాలుగా చెప్పారు. కానీ ఇవన్నీ కారణాలు కావంటూ ప్రపంచంలో అందరి నిత్యజీవితాల్లో పరభాష ప్రభావాలుంటాయని అయినా వారు తమ మాతృభాషలను కాపాడుకుంటున్నారని, ఇక ప్రపంచీకరణ ప్రభావం నిన్న మొన్నటిదని, కాని భాష కొన్ని సంవత్సరాలనాటిదని చెప్తూ, ఇవన్నీకాదు అని తెలుగు చదివిన వారికి జీవనోపాధి కరువైందని కాబట్టే తల్లిదండ్రులు మారుతున్న కాలానికి అనుగుణంగా తమ పిల్లలను ఇంగ్లీషు మీడియాల్లో చదివిస్తున్నారనే కారణం చూపారు. మన తరం వారు తెలుగు మీడియం పాఠశాలలు, కాలేజీల్లో చదువుకున్నాం కాబట్టి తెలుగంటే అభిమానం ఉందని, ఇప్పుడా పరిస్థితి లేదని ఇంగ్లీషు మీడియం స్కూళ్ళ ప్రభావంతో ప్రథమభాష హిందీ, ద్వితీయ భాష ఇంగ్లీషులతో పరిస్థితులు తారుమారయ్యాయని విశ్లేసించారు. ఈ విషయంలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదంటూ ''సచివాలయం శిలారణ్యంలో తెలుగు మొక్కలు మొలవవని''[38] విమర్శించారు. తెలుగు చదివిన వారికి ఉద్యోగాలొస్తే తప్ప తెలుగు భాష బ్రతకదని, అప్పటి వరకు ఎన్ని మాతృభాషా దినోత్సవాలు చేసినా వృథాయే అన్న విషయాన్ని స్పష్టం చేశారు.

'తెలుగుకు నిండు వెలుగు ఎప్పుడో' అనే వ్యాసంలో తెలుగును బ్రతికించుకోవడానికి కొన్ని తీర్మానాలు చేయడం జరిగింది. అందులో–

[38] అక్షరయానం – డా. ఎన్.గోపి – పేజి -90

1. రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 5వ తరగతి వరకు విద్యాబోధన విధిగా మాతృభాషలో జరగాలని చెప్పడం జరిగింది.
2. ఇంగ్లీషు, హిందీ భాషలకున్నట్లుగా తెలుగు బోధనలో, పాఠ్యాంశాల రచనలో శిక్షణ, పరిశోధనలు జరిపే సంస్థ ఒకటి ఉండాలి.
3. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు తెలుగు మాట్లాడితే శిక్షించే అవమానకర విధానాన్ని నిషేధించాలి. దీని వల్ల పిల్లల్లో తెలుగు భాష పట్ల భయం, అయిష్టత ఏర్పడుతుంది.
4. తమిళ రాష్ట్రంలో లాగా మనరాష్ట్రంలో కూడా తెలుగు అభివృద్ధికి ఒక మంత్రిత్వ శాఖ ఉండాలి.

ముఖ్యంగా సచివాలయస్థాయిలో మార్పు రావాలి. అప్పటి వరకు అధికారులు కూడా లేని అధికారభాషాసంఘం అలంకార భాషా సంఘంగానే మిగిలిపోతుంది.

'అమ్మ కంటే కమ్మని పదం లేదు. మాతృభాష కంటే మధురపథం లేదు కానీ కొత్త తరం వారిలో తెలుగు చదివే వారి సంఖ్య తగ్గిపోయింది. తెలుగు సాహిత్యం, పద్యం, కథలు, కవిత్వం మొదలైన అంశాలకు సంబంధించిన పరిజ్ఞానం తగ్గిపోయింది. తెలుగులో మాట్లాడడానికి జంకుతున్నారు. నామోషీగా భావిస్తున్నారు. అందుకే కాళోజీ ''అన్యభాషలు నేర్చి / ఆంధ్రంబు రాదంటు / సకిలించు ఆంధ్రుడా / చావవెందుకురా?'' అంటూ చివాట్లు పెడుతాడు. మన సొంత భాషను మరిచిపోయి పరభాషావ్యామోహంతో పిల్లల్ని కూడా తెలుగుకు దూరం చేస్తూ వారిని తెలుగులో మాట్లాడనీయకుండా చేస్తున్నాం. అందుకే సి. నారాయణరెడ్డిగారు ''తెలుగు బాస జుంటితేనియని పొగడి / పొరుగింటి పులుసుపై మరులు పెంచినాడు / దేశభాషలోన తెలుగు లెస్సయని చాటి / మల్లెలకు బదులు లిల్లీలు వలచినాడు!'' అంటూ పరిహసించారు.

ఇటలీకి చెందిన నికొలోకోంటి తెలుగును ''ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్'' అని ప్రశంసించాడు. విదేశీయుడైన సి.పి.బ్రౌన్ తెలుగుభాష అభివృద్ధికి కృషి చేశాడు. అలాంటిది మరి మన తెలుగు వారిలో ఎందుకు అంత నిరాసక్తత ఉందో అర్థం కాదు. మాతృభాష మన కళ్ళలాంటిదైతే పరభాష కళ్ళజోడు లాంటిది కళ్ళు లేకుండా కళ్ళజోడు పనికిరాదు. తన కళ్ళను తానే పొడిచేసుకుని, కళ్ళజోడుకోసం వెంపర్లాడడం అంటే ఇదే. కాబట్టి తెలుగును ప్రతికించుకోవాలంటే, తెలుగు చదివిన వారికి జీవనోపాధి ఉండాలంటే ముఖ్యంగా చేయవలసిన

కర్తవ్యం ఏంటనేది ఈ వ్యాసాలు చదివిన వారికి అర్థమవుతుంది. స్కూళ్ళు, కాలేజీల్లో తెలుగును తప్పనిసరి చేయాలి. ప్రభుత్వ కార్యకలాపాల్లో కార్యాలయాల్లో తెలుగు అమలు జరిగేలా చేయడం, తెలుగు అభివృద్ధికి ఒక మంత్రిత్వశాఖను ఏర్పాటుచేయడం, తెలుగు చదివిన వారికి తప్పనిసరిగా జీవనోపాధిని కల్పించడం, కంప్యూటర్ల ద్వారా తెలుగు అభివృద్ధి చేయాలి. తమ పిల్లల్ని తెలుగుమీడియాల్లోనే చదివించాలని తల్లిదండ్రుల్లో కూడా మానసికంగా మార్పు రావాలి. అప్పుడే తెలుగు వెలుగుతుంది.

కళలు, సంస్కృతికి సంబంధించిన వ్యాసాల్లో కూచిపూడి గురించి చెప్తూ గ్రామం పేరూ, నృత్యం పేరూ రెండూ కూచిపూడే అన్న సందేహాన్ని తీరుస్తూ సిద్ధేంద్రయోగి ఈ ప్రక్రియకు నాటకీయతను తెచ్చారు అన్న విషయాన్ని చెప్పారు. భామాకలాపం ఆయన ప్రవేశపెట్టిందే అన్న విషయాన్ని తెలియజేశాడు. రచయిత తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సులర్ గా ఉన్నప్పుడు కూచిపూడి నృత్య అభివృద్ధికి, అభ్యున్నతికి కృషి చేశారు. ఆ అనుభవంతో ఈ వ్యాసం రాశాడు. కూచిపూడిలో సిద్ధేంద్ర కళాక్షేత్రం ఉందని, అది ఇప్పుడు తెలుగు యూనివర్సిటీ ఆధీనంలో ఉందంటూ, కోరాడ నరసింహారావు, వెంపటి చినసత్యం వంటివారు కూచిపూడి నాట్యానికి అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చారని కీర్తించారు. కూచిపూడిని తీర్చిదిద్దడానికి ప్రభుత్వాలకు సలహాను అందించారు. ఈ వ్యాసంలో సిద్దేంద్ర కళక్షేత్ర ప్రాంగణాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి పర్చాలని, అక్కడ ఒక పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, కూచిపూడికి సంబంధించిన సమస్త గ్రంథాలతో ఒక లైబ్రరీని ఏర్పాటు చేయాలి. సందర్శకుల కోసం ఒక అతిథి గృహాన్ని సకల సదుపాయాలతో నిర్మించాలని, ఉపాధ్యాయులకోసం క్వార్టర్స్ నిర్మిస్తే ప్రతిభావంతులైన వారు అక్కడికి వచ్చి ఉండడానికి ఇష్టపడుతారని వివరించడం జరిగింది.

ఇందుకు 17వ శతాబ్దంలో అబుల్ హసన్ తానీషా కూచిపూడి నృత్యపోషణ కోసం కళాకారులకు 600 ఎకరాల భూమిని కానుకగా ఇచ్చిన విషయాన్ని ఉదహరించాడు. పోషణ లేకుంటే లలిత కళలు బతుకవు అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చివరగా రుక్మిణీ ఆరండేల్ కళాక్షేత్రను చెన్నైలో స్థాపించిన విషయాన్ని చెప్తూ, ప్రతి తెలుగు కళాభిమాని దాన్ని సందర్శించాలని సలహా ఇచ్చారు.

లలిత సంగీతం గురించి చెప్తూ కొన్ని సంవత్సరాల చరిత్ర ఉన్న లలితసంగీతానికి సంబంధించిన గొప్పతనాన్ని చెప్పారు. జిల్లాకొక సంగీత, నృత్య పాఠశాల స్థాపించాలని,

స్కూళ్ళలో వీటిని పాఠ్యాంశంగా పెట్టాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా హృదయాలు మెత్తబడి లోకంలో మానవత్వం పెరుగుతుందంటూ ఆశాభావం వ్యక్తం చేశారు. జానపద గీతాలు కూడా లలితగీతాలే అని నిర్ధారిస్తూ ఒకనాటి భక్తి ఉద్యమం నుండి, నిన్నటి స్వాతంత్ర్యోద్యమం, ఇవాళటి విప్లవాల దాకా పాటశక్తిని తెలయజేస్తూ కబీరు, శైవ, వైష్ణవ భక్తులు తిరుప్పావై, ఆళ్వారు, నందనార్, అప్పాల్, వెల్లాల్ నుండి సుద్దాల హన్మంతు, గద్దర్ దాకా ప్రజా గాయకుల పేర్లను ప్రస్తావిస్తూ పాట గొప్పతనాన్ని తెలియజేశారు.

ప్లేటో విద్యావిధానంలో రెండు ముఖ్యమైన అంశాలుండాలంటాడు. ఒకటి సంగీతం, రెండు వ్యాయామం. మొదటిది మనసుకీ, రెండోది శరీరానికి శిక్షణనిస్తాయి. గ్రీకుల కాలంలో పాఠశాలలను సంగీత పాఠశాలలు అనేవారనే విషయాన్ని ప్రస్తావిస్తూ ''నాకు దేవుడు ప్రత్యక్షమై ఏం కావాలో కోరుకొమ్మంటే నాకు ఇప్పటి వరకిచ్చిందంతా వాపసు తీసుకొని నన్ను పాటగాణ్ణి చెయ్యి''[39] అంటానని పాటపై తనకున్న అభిమానాన్ని తెలియజేశాడు.

జానపద కళలను ప్రస్తావిస్తూ జానపద కళాకారులు నిరక్షరాస్యులని పేర్కొంటూ, అయినా తెలంగాణలో ఉద్యమాలకు ఊపిరులూదిందిి జానపద కళాకారులే అన్న విషయాన్ని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో 78 కళారూపాలున్నాయని కొన్నింటిని ఈ వ్యాసంలో పేర్కొన్నారు. జానపద కళాకారులు ప్రదర్శనలు లేనికాలంలో వేరే ప్రాంతాలకు వలసపోయి కూలి పనులు చేసుకుంటున్నారని, వారి పిల్లలు చదువుకోవడంతో, వారు ఆ కళారూపాలు ప్రదర్శించడానికి సుముఖంగా లేరని, కాబట్టే నేడు కొన్ని కళారూపాలు అంతరించిపోయాయని నిరాశను వ్యక్తం చేశారు. ఈ కళలను బ్రతికించాలంటే ప్రభుత్వాల కృషి అవసరమని వారికి ప్రదర్శనలకోసం తిరగడానికి ఉచిత బస్ పాస్ లు ఇవ్వాలని, వారి పిల్లల చదువులకు సహాయం చేయాలని, వారికి జీవనోపాధిని కల్పించాలని, కళాకారులకు పించనులు ఇవ్వాలని సూచించడం జరిగింది. అప్పుడే కళలను బ్రతికించుకుంటాం అన్నారు.

హరికథ అనేది సమాహారకళని, ఇందులో వచనం, పద్యం, పాట ఉంటాయని, ఆదిభట్ల నారాయణదాసు వంటి వారు నాట్యాన్ని జోడించి కొత్తరూపాన్ని తీసుకువచ్చారు. అందుకే ఆయన హరికథాపితామహుడయ్యాడు. తాను కవిగా మారడానికి హరికథే ప్రేరణగా నిలిచిందని గుర్తు చేసుకున్నారు. జ్ఞాన పీఠ్ అవార్డు గ్రహీత సినారె కూడా తాను వేములవాడ

[39] అక్షరయానం – డా. ఎన్.గోపి – పేజి -24

నరసయ్య పంతులు హరికథలవల్లే కవిత్వం రాయగలిగానన్నారని గుర్తు చేశారు. ఇలాంటి హరికథ నేడు అంతరించిపోయే దశలో ఉందంటూ, దాన్ని కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు.

సురభి నాటక సమాజ పరిస్థితి గురించి ప్రస్తావిస్తూ దీన్ని పనారస గోవిందరావు స్థాపించారని, శతాబ్దం పైగా చరిత్ర కల్గిన అపురూప కళారూపం సురభి అనీ, సురభి అనే పదానికి వివిధ అర్థాలను చెప్పడం జరిగింది. సురభి అంటే కామధేనువు, భూమి, వసంతం, తూర్పుదిక్కు అనే వివిధ అర్థాలను చెప్తూ ఇవన్నీ ఇచ్చే అర్థంలో ఉన్నాయని, కానీ అంతా తీసుకునే వారే కాని ఆదుకునే వారు లేరని బాధపడ్డారు. దేని విలువైనా పోయినప్పుడే తెలుస్తుందని, సురభి నాటక సమాజాల సంఖ్య క్రమంగా తగ్గిపోతుందని ఆదరణ, ఆదాయం లేకపోవడం వల్ల వారి పిల్లలు కూడా చదువుకొని ఉద్యోగాల్లో చేరుతున్నారని, ఆదరణ లేని కళల వైపు వారు ఎందుకు మొగ్గు చూపుతారంటూ వారిని సమర్థించడం జరిగింది.

'తోలుబొమ్మలాట' గురించి చెప్పే వ్యాసం ఇది. దారాలు కట్టి వేళ్ళ కదలికలతో ఆడించే ఆట ఇప్పుడు అంతరించిపోతుందని చెప్పారు. సూత్రధారుడనే మాట ఇక్కడి నుండే వచ్చిందని, ప్రపంచవ్యాప్తంగా ఈ కళకు వేల సంవత్సరాల చరిత్ర ఉందని, సంప్రదాయ కళాకారులు మన తోలుబొమ్మలను జింక చర్మంతో చేసేవారని ప్రస్తావించడం జరిగింది.

మదనపల్లిలోని రుషీవ్యాలీ విద్యాసంస్థలో తోలుబొమ్మలాటను విద్యాబోధన సామగ్రిగా గుర్తించి విజయవంతంగా అమలు చేస్తున్న విషయాన్ని వెల్లడించి, విద్యావ్యవస్థల్లో ఈ కళారూపాన్ని ప్రవేశపెట్టాలనే ఆశాభావాన్ని తెలియజేశాడు. మానసిక శాస్త్రవేత్తలు కూడా ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ బెత్తం పట్టుకొని చెప్పే చదువులకంటే ఇలాంటి బొమ్మలద్వారా చెప్పే పాఠాలు పిల్లలకు బాగా గుర్తుంటాయని చెప్పారు. అమెరికాలోని అనేక విశ్వవిద్యాలయాల్లో ఎడ్యుకేషనల్ థియేటర్ లో ఈ తోలుబొమ్మలాటను బోధనాంశంగా చేర్చారు. 1980లో వాషింగ్టన్ లో ప్రపంచ పప్పెట్ ఫెస్టివల్ జరిగిందన్న విషయాన్ని గుర్తుచేసుకుంటూ ఈ కళలను బ్రతికించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నాటకం గురించి చెప్తూ నాటకం అంటే వేషాలు, మాటలూ కాదు సన్నివేశాలన్న విషయాన్ని చెప్పడం జరిగింది. విద్యాలయాల్లో సాహిత్యదృష్టితో నాటకాన్ని బోధిస్తున్నాం. కానీ కొత్త ప్రమాణాలతో నాటక రచయిత జీవితాన్ని ఎట్లా దర్శించాడో గుర్తించగలగాలంటూ సలహా

ఇవ్వడం విశేషం. అహంకారంతో, అతిగా నటించడం వల్లగానీ ఆ నటనకు తేజస్సు రాదని, పౌరాణిక నాటకాలు ఆడే నటుడికి ఆ పద్యాల అర్థం తెలిసుండాలని అప్పుడే హావభావాలు, అభినయాల ద్వారా నటనకు పరిపూర్ణత లభిస్తుందని సూచనలు చేశారు. ఒకప్పుడు నటుడికి నటన మీదే దృష్టి ఉండేది. కాలక్రమంలో ఆహార్యం, మేకప్, సాంకేతిక విభాగాలపై దృష్టి పెరిగిందంటూ నాటకంలో వచ్చిన చిన్న మార్పు గురించి చెప్పారు.

ఈ విధంగా అంతరించిపోవడానికి సిద్ధంగా ఉన్న కొన్ని కళలను ప్రస్తావిస్తూ వాటి విషయాలను చర్చిస్తూ వాటిని కాపాడుకొని రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్న విషయాలను ఈ 'కాలమ్స్' లో వివరించారు.

ఇంకా ఇతర కాలమ్స్ లలో పాఠ్యాంశంగా నీటి భద్రతను గురించి ప్రస్తావించడం, 'అయోమయ విధానాలు' అనే వ్యాసంలో గ్లోబలైజేషన్ వల్ల వచ్చిన పరిణామాలను చెప్పడం జరిగింది. ''న్యాయమూర్తి కవి అయితే'' అనే వ్యాసంలో మంగారి రాజేందర్ గురించి (ఈయన్నే జింబో కవి అంటారు) చెప్తూ వృత్తిరీత్యా న్యాయమూర్తి (సీనియర్ సివిల్ జడ్జి) అనీ కానీ ప్రవృత్తిగా కవిత్వాన్ని రాస్తారని, ఆ కవిత్వాన్ని విశ్లేషించడం జరిగింది. కవి వైద్యుడైతే ఎలా ఉంటుందో ''వైద్యో నారయణో కవిః'' అనే వ్యాసంలో డా. ధేనువకొండ శ్రీరామమూర్తి గురించి, ఆయన కవిత్వం గురించి చెప్పారు. శ్రీరామమూర్తి మూడు కవిత్వ పుస్తకాలను వెలువరించారని, అవి ఆశల సముద్రం, వల్మీకం, అమ్మఒడి అనే దీర్ఘకవిత. వీటిని గురించిన ప్రస్తావన చేశారు. 'కొరడా ఝుళిపించిన అక్షరయోధుడు'' అనే వ్యాసంలో గ్లోబలైజేషన్ (ప్రపంచీకరణ) స్పృహతో, అవగాహనతో కవిత్వం రాస్తున్న జూకంటి జగన్నాథం కవి గురించి వివరిస్తూ ఆయన రాసిన కవిత్వ సంపుటాలను, ఆయన కవిత్వాన్ని విశ్లేషించారు. జగన్నాథం రాసిన కవితా సంపుటాలలో పాతాళగరిగె, ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గంగడోలు, వాస్కోడిగామా, కామ్, బొడ్డుతాడు లాంటి సంపుటాలను పేర్కొన్నారు.

ఇంకా ఇంగ్లండ్ పర్యటన ఏర్పడిన వల్ల అవగాహనతో అక్కడి విద్యావిధానం గురించి, 'ఆక్స్ ఫర్డ్ ఆణిముత్యాలు'' అనే వ్యాసం (ఈ విషయాన్ని గురించి యాత్ర చరిత్రల్లో ఇంగ్లండ్ యాత్రలో ప్రస్తావించాను), 'ఆక్స్ ఫర్డ్ – అలనాటి జ్ఞాపకాలు' అనే వ్యాసాన్ని, 'మనిషికొక్క చెట్టు నాటాలి' అనే వ్యాసం రచయితకు ప్రకృతిపట్ల ఉన్న బాధ్యతను, అవగాహనను, ఇష్టాన్ని తెలుపుతుంది. చేతిరాతకు సంబంధించి రాసిన వ్యాసాన్ని కూడా ఇందులో పొందుపర్చారు.

ఇందులో చేతిరాతను బట్టి మనస్తత్వాన్ని విశ్లేషించడం 20వ శతాబ్దం ఉత్తరార్ధంలో ప్రారంభమైందని, క్యామిలో బాల్డో అనే మనోవైజ్ఞానిక శాస్త్రవేత్త దీన్ని తొలిసారిగా ప్రతిపాదించారన్న విషయాన్ని ప్రస్తావించారు. చేతిరాతకు సంబంధించిన విషయాన్ని 'గ్రాఫాలజీ' అంటారు. ఇక్కడ మనకు యండమూరి వీరేంద్రనాథ్ చేతిరాతపై రాసిన 'గ్రాఫాలజీ' పుస్తకం గుర్తుకొస్తుంది.

ఈ వ్యాసంలో గ్రాఫాలజీపై పరిశోధన చేసిన వై. మల్లిఖార్జునరావు అనే గ్రాఫాలజిస్టును పరిచయం చేశారు. ఈయన అమెరికాలో గ్రాఫాలజీ, గ్రాఫో థెరపిని అభ్యసించారు. స్వభావాన్ని బట్టి రాత ఉన్నప్పుడు రాతను సరిచేయడం ద్వారా స్వభావాన్ని మార్చడం సాధ్యమే అంటారు ఈయన. ఈ వ్యాసంలో చేతిరాతను బట్టి వ్యక్తుల మనస్తత్వాన్ని అంచనా వేసే ప్రయత్నాలను వివరించడం జరిగింది. ఎడమ చేతితో రాసేవారి గురించిన ప్రస్తావన చేశారు. పేరెంట్స్, టీచర్స్ సమస్యగా ఉంటారుగానీ ప్రాబ్లమ్ లేని చైల్డ్ ఉండరంటారు రచయిత. అందుకు ఉదాహరణగా ''నువ్వు చెప్పినట్లు నేను నేర్చుకోలేకపోతే, నేను నేర్చుకునేటట్లు నువ్వెందుకు చెప్పకూడదూ''[40] అని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నను మన ముందుంచారు.

ఇప్పటి వరకు హిందీ సాహిత్య చరిత్ర తెలుగులోకి వెలువడలేదని, దాన్ని యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మొదటిసారిగా తెలుగులోకి తీసుకువస్తున్నారని, హిందీ సాహిత్య చరిత్ర అన్ని సాహిత్య చరిత్రల్లాంటిది కాదని, దాని నేపథ్యాన్ని వివరించడం జరిగింది. అయితే మనవాళ్ళు కూడా హిందీని తెలుగులోకి తెచ్చినంతగా, తెలుగును హిందీలోకి తీసుకెళ్ళలేదంటూ అసంతృప్తిని వ్యక్తం చేసినా హిందీవారెలాగూ మన భాషను నేర్చుకోరు. మనమే ఆపని చెయ్యాలంటూ తృప్తి పడుతారు. హిందీ భాషావేత్త యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గురించిన విషయాలను ఈ వ్యాసంలో సందర్భానుసారంగా వివరించారు.

ఇంగ్లీషు భాష గురించి చెప్తూ ఇంగ్లీషు సాహిత్యాన్ని కాకుండా, భాషా నైపుణ్యాలు పెంచేలా సిలబస్ లు తయారుచేయాలంటూ సలహా ఇవ్వడం జరిగింది. ఏ భాషైనా నేర్చుకోవడానికి నాలుగు రకాల భాషానైపుణ్యాలుంటాయని, అవి 1.వినడం, 2. చదవడం, 3. రాయడం, 4. మాట్లాడడం. వీటిని L.R.S.W. అంటారని భాషను సులభంగా నేర్చుకునే విధానాన్ని సూచించారు.

[40] అక్షరయానం – డా.ఎన్. గోపి – పేజి -93

ఈ విధంగా ఈ 'అక్షరయానం' వ్యాస సంపుటిలో భాష, లలితకళలు, ఇతర అంశాలపై రాసిన వ్యాసాలు ఆలోచింపజేసేవిధంగా, ఆచరణాత్మకంగా, చర్చించేవిధంగా ఉన్నాయి. ఈ వ్యాసాలు ఎంతగా ప్రాచుర్యం పొందాయంటే రచయిత ఎక్కడకెళ్ళినా 'ఇండియాటుడేగోపి'గా చూసేవారని చెప్పుకున్నారు.

అనువాదాలు:

డా. ఎన్.గోపి కవిగా, పరిశోధకుడిగా, యాత్రాచరిత్రకారుడిగా, విమర్శకుడిగా, వ్యాఖ్యాతగా, నానీల సృష్టికర్తగానే కాక అనువాదకుడిగా కూడా తనదైన ముద్రను వేశాడు. గోపి చేసిన అనువాదాలలో 'జ్ఞానదేవుడు, తన్మయ ధూళి,' లను పేర్కొనవచ్చు. కానీ తన్మయ ధూళి అందుబాటులో లేదు. కాబట్టి నా పరిశోధనలో 'జ్ఞానదేవుడు' గురించి వివరించడం జరిగింది. తన్మయధూళిని ఒరియా నుండి తెలుగులోకి అనువాదం చేశారు. జ్ఞానదేవుడును ఇంగ్లీషు నుండి తెలుగులోకి అనువాదం చేయడం జరిగింది.

''మూలభాషలోని వస్తువును లక్ష్యభాషలోకి మార్చడం అనువాదం'' అని 'అనువాద సమస్యలు' అనే గ్రంథంలో రాచమల్లు రామచంద్రారెడ్డిగారు పేర్కొన్నారు. అనువదించవలసిన భాషని మూలభాష అని, ఏ భాషలోకి అనువదించాలనుకున్నామో దాన్ని లక్ష్యభాష అంటారు. అనువాదం రెండు భిన్న భాషల మధ్య జరుగుతుంది. అనువాదాలు ప్రధానంగా స్వేచ్ఛానువాదం, యథాతథానువాదం అని రెండు రకాలు. మూలంలోని భావం చెడిపోకుండా అనువదించేది స్వేచ్ఛానువాదం. యథాతథానువాదం ఉన్నదాన్ని ఉన్నట్లుగా అనువదించడం.

6.5.2 జ్ఞానదేవుడు (అనువాదం):

జ్ఞానదేవుడు (క్రీ.శ 1275-1296) ఒక మరాఠీ కవి యోగి. చిన్నవయస్సులోనే 9000ల ఓవీలు (మరాఠీ పద్యాలు) గల జ్ఞానేశ్వరి అనే గీతా భాష్యాన్ని రచించాడు. ఇంకా అమృతానుభవం, చాంగదేవ ప్రశస్తి అనే రెండు ఆధ్యాత్మిక గ్రంథాలను హరిపథం అనే మరో గ్రంథాన్ని రచించారు. జ్ఞానదేవ్ తండ్రి విఠలపంత్ కులకర్ణి బ్రాహ్మణ సంఘం నుండి బహిష్కరింపబడ్డాడు. ఇదీ జ్ఞానదేవుని గురించిన పరిచయం.

'జ్ఞానదేవుడు' పుస్తకాన్ని రాసింది సుప్రసిద్ధ మరాఠీ నవలా రచయిత అయిన పురుషోత్తమ్ యశ్వంత్ దేశ్ పాండే. వీరు 1926లో మరాఠీలో సాహిత్య అకాడమీ బహుమతి

పొందారు. వీరు పత్రికా రచయితగా పనిచేశారు. వారణాసిలోని జిడ్డు కృష్ణమూర్తి ఫౌండేషన్ లో కూడా పని చేశారు.

దేశ్ పాండే రాసిన ఈ పుస్తకాన్ని గోపి తెలుగులోకి అనువాదం చేశారు. దీన్ని పన్నెండు అధ్యాయాలుగా విభజించడం జరిగింది. అవి 1. కాలాతీత వైచిత్రి 2. పరదేశి 3. ఆవహమూ – ఆనందము 4. జ్ఞానేశ్వరి 5. గీతాజ్ఞానం 6. నిత్యానుభవం 7. మనిషి – అనుభవం – వాస్తవం 8. శబ్దం 9. అవిద్య 10. జ్ఞానం – అజ్ఞానం – వాస్తవం 11. యోగం – భక్తి – వాస్తవం 12. జీవితం – మృత్యువు – అమృతత్వం అనే అధ్యాయాలుగా విభజించి రాశారు. ఇందులో జ్ఞానదేవుడు అనే కవి జీవితం, రచనలు, అతని ఆధ్యాత్మిక బోధనలు, అద్వైత భావనలను, సిద్ధాంతాలను చెప్పడం జరిగింది. 'కాలాతీత వైచిత్రి'లో జ్ఞానదేవుని పేరు వింటే మరాఠీ ప్రజల హృదయాలు చైతన్య వికసితాలవుతాయి. జ్ఞానదేవుని సాహిత్యం అంటే మరాఠీయులకు ఆత్మీయత ఎక్కువ. ఈ లోకాన్ని గురించి నాకు వ్యాఖ్యానించి చెప్పేది నా జీవితమే అంటారు. జ్ఞానదేవుని కృతుల్లో శబ్దం, మౌనం, కాలం, కాలాతీత స్థితి కన్పిస్తాయి. జ్ఞానదేవుడు ఒకచోట తనను గురించి ఇలా పేర్కొన్నాడు. ''నా భాష మరాఠీ. సామాన్యుల భాష. కానీ ఈ సరళ మరాఠీ శబ్దజాల మాధుర్యం స్వర్గాన్నించి ఊడిపడిన అమరవాగ్ఝరికంటే మధురమైందనీ సావధానచిత్తులైన వారు గ్రహిస్తారు''[41] అంటూ మరాఠీ భాష పట్ల తనకున్న అభిమానాన్ని, ప్రేమను చాటుకున్నాడు.

'పరదేశి' అనే భాగంలో పరదేశి గురించి చెప్తూ సాంఘిక సాంప్రదాయ జీవనానికి అవతల జీవించే ధైర్యం కావాలి. పరదేశి బతుకు సంప్రదాయ అవనిర్మాణాన్ని, జీవిత తత్త్వాన్ని, ప్రవాహగతిని అర్థం చేసుకొని వ్యవహరించాలని చెపుతుంది. జ్ఞానదేవుని జీవిత కథ కూడా అలాంటిదే. అసలు జీవితం అంటే ఏమిటి అనే ప్రశ్నలు వేసుకోకుండానే చాలా మంది బతుకుతారు. ఇలా బతకడం సహజమైందే గాక సులభమైంది కూడా అని భావిస్తారు. నరు (అర్జున), నర రూప నారాయణ (శ్రీకృష్ణుడు) ల మధ్య జరిగిన సంవాదమే జ్ఞానదేవుని గీతా భాష్యం. తొమ్మిది వేల ఓవీ (పద్యాల) రూపంలో ఉంది. ఓవీ ఛందస్సు లయాన్వితమైన సరళ గేయ ఛందస్సు, వచన సొంపు, గేయ మాధుర్యం రెండూ కలిసి ఓవీలుగా జాలువారాయి. కాబట్టే ఈ గీతా భాష్యం ప్రత్యేకమైంది.

[41] జ్ఞానదేవుడు – డా. ఎన్.గోపి – పేజి -8

జ్ఞానేశ్వరి తర్వాత పరిమాణంలో చిన్నదైన 'అనుభవామృత' రచన చేశాడు. స్వానుభవంతో దాని అంతఃసౌందర్యం, తాత్త్విక గాంభీర్యం, సృజనాత్మకతతో దీన్ని రాయడం జరిగింది. ఈ పరదేశి విభాగంలో జ్ఞానదేవుని కుటుంబ నేపథ్యాన్ని చెప్పడం జరిగింది. జ్ఞానదేవుని తండ్రి విఠల్ పంత్ ఆ జన్మ వైరాగిగా ఉండేవాడని, కాశీలో శ్రీ పాద స్వామి అనే సన్యాసి విఠల్ పంత్ ని శిష్యుడిగా స్వీకరించాడని పేర్కొన్నారు. విఠల్ పంత్ త్రికరణ శుద్ధిని పాటించాడనడానికి తన పిల్లలకు పెట్టిన పేర్లే నిదర్శనాలుగా చెప్పవచ్చు. విఠల్ పంత్ కు ముగ్గురు కుమారులు, ఒక కూతురు. కూతురు పేరు ముక్తి. జ్ఞానదేవ, సోపాన, నివృత్తి అనేవి కుమారుల పేర్లు. ఈ అధ్యాయంలో 'దీక్ష' అంటే ఏమిటో చెప్తూ ''ఒకరిలో నిహితమై ఉన్న మంగళకర శక్తిని వేరొకరిలో జొప్పించడమే దీక్షా ప్రసాదం''[42] అన్నారు. ఒకరిలో నిద్రాణమై ఉన్న జీవశక్తిని మేల్కొలిపి దాన్నే జీవన జ్యోతిగా చెయ్యడం దీక్ష.

'ఆవహము – ఆనందము' అనే అధ్యాయం జ్ఞానదేవుని తండ్రి అయిన విఠల్ పంత్ వృత్తాంతాన్ని తెలుపుతుంది.

'జ్ఞానేశ్వరి'లో జ్ఞానేశ్వరి రచన గురించిన విషయాలున్నాయి. జ్ఞానదేవుడు ప్రతిష్ఠానపురంలో (పైఠాన్) ఉన్నప్పుడు ఈ రచన చేశాడు. ఆదిశంకరులు రాసిన గీతాభాష్యం తర్వాత జ్ఞానేశ్వరుని వ్యాఖ్యానమే వైదిక ధర్మానికి మార్గదర్శకంగా ఉందంటారు రచయిత. ఇందులో ధర్మం అనే పదానికి నిర్వచనాన్ని ఇవ్వడానికి ప్రయత్నించారు. ధర్మం అనే పదం పాశ్చాత్యులు అనుకునే 'మతం' కాదని, ధర్మమంటే విశ్వజనీనమైన జీవన సూత్రం అన్నారు. మనిషికీ, విశ్వానికి గల నిత్య సంబంధాన్ని ధర్మం వివరిస్తుంది. వైదిక జీవన విధానంలో ప్రధానమైనవి రెండే అని ధర్మం, కర్మ లను చెప్పడం జరిగింది. యోగమార్గం ద్వారా ధర్మాన్ని ఎలా ఆచరించాలో చూపించింది గీత. అలాగే ధర్మం ద్వారా కర్మలను ఆచరింపచేయడం లక్ష్యం అంటూ గీతా రహస్యం తెలియాలంటే మొదటి అధ్యాయమే ఆధారమని, మొదటి అధ్యాయం లేకపోతే మిగిలిన అధ్యాయాలన్నీ శుష్క వేదాలని వివరించడం జరిగింది. వేదాలను అనుసరించి ధర్మాన్ని కర్మను చెప్పేది భగవద్గీత. గీతను అర్థం చేసుకోవాలంటే అలాంటి మహా ఆవేదన అవసరమంటారు. ఈ విధంగా భగవద్గీతను, (జ్ఞానేశ్వరి) గీతా భాష్యానికి మధ్య

[42] జ్ఞానదేవుడు – డా. ఎన్.గోపి – పేజి -16

భేదాలను చెప్పారు. ఈ అవగాహనతో రాసిన గీతాభాష్యాన్ని జ్ఞానదేవుడు 'భావర్థగీతిక' అని పిలవడం సముచితంగా ఉంది.

'గీతాజ్ఞానం' అనే అధ్యాయంలో భగవద్గీతలో ప్రతి అధ్యాయం చివర వ్యాసుడు వర్ణించిన గీతాతత్త్వాన్నే జ్ఞానదేవుడు అనుసరించాడని పేర్కొన్నారు. జ్ఞానదేవుడు తన గీతాభాష్యాన్ని 'సమాధిధనం' అన్నాడు. ధ్యానానికి పరాకాష్ఠ సమాధి. గీతాసారాన్ని 'సమాధి ధనం' అని వర్ణించడం యోగభాషను అవలంబించడమన్న విషయాన్ని ఈ అధ్యాయంలో పేర్కొనడం జరిగింది. అహంకారంతో చేసే పనులంటే జ్ఞానదేవుడికి నచ్చదని, మతం పేరుతో, ఆచారం పేరుతో, పూజలు, యోగసాధనల పేరుతో జరిపే ఇలాంటి చర్యలు సామాజికమైనవైనా అలాంటి చర్యలను ఖండించాడు. ఇందులో వ్యాసుని భగవద్గీతకు సజీవమైన వ్యాఖ్యను జ్ఞానదేవుడు ఎలా అందించాడో వర్ణించడం జరిగింది.

'నిత్యానుభవం' అనే అధ్యాయంలో గీతాభాష్యాన్ని సృజనాత్మకంగా, మహోన్నతంగా రచించినా కూడా తృప్తి కలుగలేదు. ఈ విషయాన్నే తన గురువు నివృత్తినాథుడుతో చెప్పుకున్నాడు. ఈ అధ్యాయంలో ప్రేమతత్త్వాన్ని చెపుతూ ప్రేమికుల గురించి, వారి మనస్తత్వాన్ని గురించి చెప్పడం జరిగింది.

'మనిషి – అనుభవం – వాస్తవం'లో మనస్సు రూపొందించిన మానవ వ్యక్తిత్వాన్ని నశింపచెయ్యాలనేది జ్ఞానదేవుని మతం. ఇలాంటి వ్యక్తిత్వానికి సమాజంలో ఎంత హోదా, ప్రయోజనం ఉన్నా ఆమోదించనన్నాడు. ప్రశ్న అనేది సమస్య కాదని, ప్రశ్నవేసేవాడే అసలు సమస్యలను కల్పించేవాడని కాబట్టి ప్రధాన సమస్య మనిషే, మనిషంటే మరెవరో కాదు తనలో ఉండే 'నేను' అన్న నిజాల్ని చెప్పడం జరిగింది. 'శబ్దం' అనే అధ్యాయంలో మనిషి మాట్లాడే జంతువు అని, ఇతర జీవరాశులనుండి మనిషిని వేరుచేసేది అతని మాటలేనని, శబ్దం అంటే పదం, మాట అనే అర్థాలను చెప్పారు. భాష రెండు రకాలని, ఒకటి తెలియజేసేది, రెండోది ఊహలు పెంచేది. 'నేను' అని గుర్తింపచేసేది భాషే. 'నేను' నేను మాత్రమే కాక అధనంగా అనేకం అని ఊహకు తోడ్పడేది భాషే అంటూ భాష రకాలు చెప్పారు. అయితే 'నేను' అనేది జీవితంలో ఎన్ని మార్పులు జరిగినా చెదిరిపోదు. ఇందులో అద్దానికి, శబ్దానికి వ్యత్యాసాన్ని చెప్తూ అద్దం ఉన్నదున్నట్లు చూపిస్తే, శబ్దం తారుమారు చేసి చూపిస్తుంది. శబ్దం గురించిన అర్థం, అంతరార్థాన్ని ఈ అధ్యాయంలో చర్చించడం జరిగింది.

‘అవిద్య’ను నిర్వచిస్తూ శబ్దాలకు పరిమితమైన చైతన్యమే అవిద్య అంటాడు. అవిద్య అంటే అజ్ఞానం కాదు. ఎరుక తలకిందులై అవిద్య అవుతుందంటారు. ఇందులో ‘అవిద్య’ అనే భావనను వివరించడం జరిగింది.

‘జ్ఞానం – అజ్ఞానం – వాస్తవం’ లో జ్ఞానం అంటే మనిషికి ఎదురైన ఒక విశేషం. ఇది అజ్ఞానం కానిది. ‘‘జ్ఞానాన్ని ప్రకోపింపచేస్తేనేకాని అజ్ఞానం ఉనికి మనకు తెలియదంటారు’’[43] జ్ఞానదేవుడు. ఆత్మజ్ఞానక్షేత్రంలోకి అనుకోకుండా వచ్చేది అజ్ఞానమని, వాస్తవం అంటే దృశ్యం కాదని, చూసినా, చూడకపోయినా వాస్తవమే ప్రధానం అని వివరించారు. ఇందులో జ్ఞానం – అజ్ఞానం – వాస్తవాలను చర్చించడం, వీటి మధ్య ఉన్న భేదాలను చెప్పడం జరిగింది.

‘యోగం – భక్తి – వాస్తవం’ అనే అధ్యాయంలో జ్ఞానేశ్వరుని గొప్పతనం టిబెట్ వరకు వ్యాపించిందని శ్రీమతి బ్లవత్ స్కీ (బ్లావట్ స్కీ) తన ‘నిశ్శబ్దనాదం’ అనే గ్రంథంలో వివరించడం జరిగింది. వేదకాలం, పురాణకాలాలనాటివి యోగమార్గం, భక్తిమార్గం అని వాటికొక సంప్రదాయం ఉందని చెప్పడం జరిగింది. ఈ అధ్యాయంలో మహాపండితులు, యోగులు అయిన మహాయోగి చాంగదేవుడు, నామదేవుడు, వినోబాఖేచర్ అనే యోగులు, వారి సిద్ధాంతాలు, తత్త్వాలను చెప్పడం జరిగింది.

చివరి అధ్యాయం ‘జీవితం – మృత్యువు – అమృతత్వం’లో అనుభవమూ, అనుభవించేవాడు అనే భేదాలుండవని అన్నీ ఒకటే అదే అద్వైతమని భావించారు. మృత్యువంటే అహంభావం (అహంత) నశించడం, మానవునికి వికాసం కలగడమే అమృతత్వసిద్ధి అంటాడు జ్ఞానదేవుడు. ఇలాంటి ఆధ్యాత్మిక పరిమళాలు, అద్వైతభావాలు కల్గిన కవియోగి సజీవ సమాధి పొందాడు. ఈ విషయాన్ని నామదేవుడు అనే యోగి చెప్పడం జరిగింది. అక్టోబర్ 25, 1296న జ్ఞానదేవుడు ఆలంది వద్ద గల సిద్ధేశ్వర గుహ సమీపంలో ఒక గుహలోకి ప్రవేశించి పద్మాసనం వేసుకొని సమాధిలోకి ప్రవేశించాడు. ఈ సందర్భంలో మనకు వీరబ్రహ్మంగారు కూడా సజీవ సమాధి పొందిన విషయం గుర్తుకొస్తుంది. అయితే జ్ఞానదేవుడు ఇది ముందే ఊహించింది. ఈ విషయాన్ని అనుభవామృతంలో ‘‘కూర్చున్న కొమ్మనుంచి ఎగిరిపోయే పక్షిలాగా తాను తన

[43] జ్ఞానదేవుడు – డా. ఎన్. గోపి – పేజి - 57

దేహం నుండి ఎగిరిపోవ సంకల్పించుకున్నానని''[44] ప్రకటించుకున్నాడు. దీన్నే అమృతత్వం అన్నాడు.

ఈ విధంగా 'జ్ఞానదేవుడు' అనువాద గ్రంథంలో జ్ఞానదేవుని రచనలే కాకుండా అలౌకిక సంబంధమైన విషయాలైన జ్ఞానం, యోగం, వాస్తవం, భక్తి, జీవితం, మృత్యువు, అనుభవం, అమృతత్వం వంటి విషయాలను యోగదృష్టితో, జ్ఞానవిశ్లేషణా విధానంతో, తార్కిక దృష్టితో, అద్వైత భావనతో చెప్పడం జరిగింది.

6.5.3 వ్యాఖ్యానం (Inter pretation):

వ్యాఖ్యానం అంటే వివరించి చెప్పడం. ''వ్యాఖ్యాయతే అనేన ఇతి వ్యాఖ్యానమ్'' అన్న వ్యుత్పత్తిని బట్టి ఏది మరోదాన్ని వివరించి చెపుతుందో అది వ్యాఖ్యానం.

వ్యాఖ్యాన కారుడి లక్షణాలు:

1. వ్యాఖ్యానకారుడు ప్రతి పద్యానికీ, వచన భాగానికీ అర్థ తాత్పర్యమివ్వాలి.
2. విశిష్ట పదాలకు అర్థాలను చెప్పాలి.
3. పద ప్రయోగ ఔచిత్యం, పద్య రచనా శిల్పం, విశేషార్థ సూచనలు, ధ్వని విశేషాలకు వ్యాఖ్యానం చెప్పాలి.
4. చిన్నచిన్న వాక్యాల్లో వ్యాఖ్యానం ఉంటే పాఠకుడికి చదువుకోవడానికి సులభమవుతుంది.

వ్యాఖ్యాత లక్షణాలు:

వ్యాఖ్యాత పండితుడై, నిఘంటు, వ్యాకరణ పరిజ్ఞానం, మహాకవి ప్రయోగాలు తెలిసుండాలి. వ్యాఖ్యాత సందర్భంలో ఎదురైన పాఠాలను, పాఠాంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి అనువైన పాఠం ఏరుకునే హక్కు వ్యాఖ్యాతలకు ఉంది. అయితే అదే సందర్భంలో తన భావనకు అనుకూలం కాని పాఠాంతరాలను ఇవ్వడం, వాటిని ఎందుకు తాను స్వీకరించలేదో చెప్పి, తాను స్వీకరించిన పాఠంలోని ఔచిత్యాన్ని చెప్పి వివరించాలి. అందుకే వ్యాఖ్యాతకు గ్రంథ పరిష్కర్తకు ఉండాల్సిన లక్షణాలు ఉండాలి.''[45]

[44] జ్ఞానదేవుడు – డా. ఎన్. గోపి – పేజి - 77

[45] తెలుగులో వ్యాఖ్యాన సంప్రదాయం – ఉత్పత్తి వికాసాలు (పిహెచ్.డి) – పేజి -42

6.5.3 వ్యాఖ్యాత:

వేమన మీద పరిశోధన చేసి 'వేమనగోపి'గా ప్రసిద్ధిచెందాడు డా. ఎన్. గోపి. గోపిని వేమన గోపిగా మొదటిసారిగా పిలిచినవారు దేవిప్రియ. వేమనపై ఐదు సంవత్సరాల కృషి ఫలితం ప్రజాకవి వేమన. ఈ పరిశోధనానంతరం వేమన గురించి తెలుసుకోవడం ఆపకుండా కృషి చేశారు గోపి. ఆ కృషి ఫలితంగా పారిస్ ప్రతి, వ్యాసనవమి అనే సంపుటులు వెలువడ్డాయి. ఇందులో వేమనపై రాసిన వ్యాసాలే ఉన్నాయి. 'వేమన్నవాదం' గోపిని పరిశోధకుడిగానే గాక వ్యాఖ్యాతగా కూడా నిరూపించింది. వేమన పద్యాలు సులభంగా ఉంటాయి. వాటికి వ్యాఖ్యానం అవసరం లేదు. కానీ కొన్ని పద్యాల్లో బాగా ఆలోచిస్తే గానీ అర్థంకాని పదాలెన్నో ఉంటాయి. వేమన పద్యాల మీద చాలా వ్యాఖ్యానాలు వచ్చినా వాటిలో వేమన వేదన, భావోద్వేగం, కోపం, ఆర్థిక, రాజకీయ, మత, సాంఘిక అసమానతలు వంటి అంశాలను చెప్పకుండా కేవలం నీతిపద్యాలు గానే చూస్తున్నారు. అప్పటి కాలపరిస్థితులకు తగినట్లుగా వేమన పద్యాలను పరిశీలిస్తే అందులో ఎన్నో కొత్త అంశాలు కనిపిస్తాయి. అలాంటి ప్రయత్నఫలితమే గోపి 'వేమన్నవాదం'. ఇందులో 126 పద్యాలను తీసుకొని వాటిని ఐదు భాగాలుగా విభజించి పరిశీలించారు. అందులో 1. రాచరికాలు, 2. ఆర్థిక భావాలు, 3. మతభావాలు, 4. సాంఘిక భావాలు, 5. వివిధ విలువలు. ఈ విభజన కొత్తగా అనిపిస్తుంది. ఈ పద్యాలలో కొన్ని మనం అప్పుడప్పుడు చదివినవి, విన్నవీ ఉన్నాయి. మరికొన్ని పద్యాలు అరుదైనవి, విననివి ఉన్నాయి. వేమన్నవాదం గ్రంథానికి గోపి రెండు పీఠికలు రాశారు. 'వేమన్న పద్యాల నేపథ్యం' పేరుతో 1980లో ఒక పీఠికను, 'అంచనాల అంచుల్లో వేమన' అనే మలి ముద్రణాపీఠికను 1981లో రాశారు. సంవత్సరం తిరగకుండానే ఈ పుస్తకం రెండో ముద్రణకు నోచుకోవడంలో వేమనమీద తెలుగు ప్రజలకున్న అభిమానం అర్థమవుతుంది.

''రాతి బొమ్మలకేల రంగైన వలువలు
గుళ్ళు గోపురములు కుంభములును
కూడు గుడ్డ తాను కోరునా దేవుడు
విశ్వదాభిరామ వినుర వేమ''[46]

---

[46] వేమన్నవాదం – డా. ఎన్. గోపి – పేజి - 52

వేమన విగ్రహపూజను వ్యతిరేకిస్తూ రంగురంగుల బట్టలు రాతి బొమ్మలకెందుకు? గుడ్డలు కావల్సింది మనుషులకు కదా. ఉండడానికి గుళ్లుగోపురాలెందుకు? తినడానికి కుండల్లో అన్నాలెందుకు? మనుషుల కష్టాలను తీర్చే నిజమైన దేవుడికి మనమిచ్చే కూడు గుడ్డల మీద ఆశ ఉంటుందా అని ప్రశ్నిస్తున్నాడు వేమన. పై పద్యంలో 'కుంభము' అంటే ''దేవుడి కోసం అన్నం వండే కుండ అని అర్థం''[47] శబ్దరత్నాకరము కుంభము అనే పదానికి కుండ, ఏనుగు కుంభస్థలము అనే అర్థాన్నిచ్చింది.

'కన్యాశుల్కం' అనే దురాచారం ఉన్నట్లు చెప్పే పద్యం ఇది.

పేదవాడు ఐన పెంటినిచ్చెదనని
పైక మడుగరాదు పరుసమునను
పైడి గొనుట పెంటి బట్టిన యట్లయా
విశ్వదాభిరామ వినుర వేమ'' [48]

'పెంటి' అంటే ఆడపక్షి అని అర్థం. అమ్మాయి అని మరో అర్థం. డబ్బున్నవాడికి ఇచ్చినా, పేదవారికిచ్చినా వారికి ధనదృష్టి ఉంటే అది దుర్మార్గం అంటారు వేమన. 'పరుసమునకు' అంటే నిలబెట్టి డబ్బు వసూలు చేసేవాడనే అర్థం ఉన్నట్లు తెలుస్తుంది. పైడికి అంటే బంగారం అనే అర్థం. డబ్బు తీసుకొని పిల్లనిస్తే చెరబట్టినంత పాపం అంటూ కన్యాశుల్క దురాచారాన్ని వ్యతిరేకించాడు. ''విత్త హీనుడెంత రిత్తయై పోవును'' పద్యపాదంలో రిత్త, రిక్తకు రూపాంతరం అని, అంటే శూన్యం అని అర్థం ఉందని వ్యాఖ్యానించారు. అలాగే ''కొంచబోడు వెంట గుల్లా కాసైనను'' అనే పద్యపాదంలో కొంచబోడు అంటే తీసుకపోడు అని అర్థం. కొంచబోవు అనేది కొనుచుపోవు, కొంటబోవు, కొండబోవు అనే రూపాలు ఉన్నాయని తెల్పడం జరిగింది. ఇంకా గుల్లకాసు అంటే గవ్వ అని అర్థం.

''తవిటికైన తమిటి కుడుముకైన
కావ్యములను చెప్పు గంద్యాలు ఘనమైరి''[49]

---

[47] వేమన్నవాదం – డా. ఎన్. గోపి – పేజి - 52

[48] వేమన్నవాదం – డా. ఎన్. గోపి – పేజి - 45

[49] వేమన్నవాదం – డా. ఎన్. గోపి – పేజి - 34

ఈ పద్యంలో 'తవిటి' పదం రెండు సార్లు వచ్చింది. మొదటి 'తవిటి' అంటే తవుడు అని అర్థం. రెండోది తవిద అని అర్థం. దీన్నే 'తమిదలు' అని కూడా అంటారు. తమిద అంటే రాగులు. కొన్ని ప్రాంతాల్లో 'తైదలు' అని కూడా అంటారు. 'గండ్యాలు' అన్న పదానికి నిఘంటువులు అర్థాన్ని చెప్పవని కొన్నింటిని ప్రజల్లో వెతకాలని చెప్పాడు వ్యాఖ్యాత. సందర్భాన్ని బట్టి నీచమైన గొప్పలు చెప్పుకునేవారిని గండ్యాలుగా పిలుస్తారని చెప్తూ, ''తవుడుకైన తాలు తప్పకైన'', ''తమిద పిండికైన తవిటికైన'' అని పై పద్యానికి పాఠాంతరాలను (డి. 1723-579) చూపించారు. గోపి రాచరికం భాగంలో రాజ్యాధికారానికి సంబంధించిన విషయాలు, ఆర్థిక విభాగంలో ఆర్థికపరమైన అంశాలు, మతభావాలు, సామాజిక అంశాలను, అలాగే వివిధ విలువలు విభాగంలో కలిమి, ఆశ, కోపం, ఈర్ష్య, ద్వేషం, అధికారం వంటి విషయాలను చెప్పడం జరిగింది. వేమన అరుదైన పద్యాలను చేర్చి వేమన భావాజాలాన్ని, ఆనాటి సామాజిక పరిస్థితులను చక్కగా వ్యాఖ్యానించడం జరిగింది. కొన్ని పద్యాలకు పాఠాంతరాలను కూడా సూచించడం జరిగింది. ఈ విషయంలో గోపి వ్యాఖ్యాతగా తన ప్రతిభను నిరూపించుకున్నాడు.

సాక్షి ఫన్ డేలో ఆగస్టు 10, 2008న ప్రారంభమైన 'వేమన్న వెలుగులు' శీర్షికతో కొనసాగిన ఈ వ్యాఖ్యానం 28 ఆగస్టు 2011లో ముగిసింది. దాదాపు మూడు సంవత్సరాలు ఈ వ్యాసంగం జరిగింది. వాటిలో ఎంపిక చేసిన 428 పద్యాలతో 'వేమన్న వెలుగులు' అనే పేరుతో వ్యాఖ్యానం రాశారు గోపి. వేమన పద్యాలను మొదటిసారిగా ''వేమన జ్ఞానమార్గపద్యములు, చిల్లర పద్యములు'' అని విభజించినది సి.పి.బ్రౌనే అని గోపి వేమన్న వెలుగులు గ్రంథం ముందుమాటలో చెప్పడం జరిగింది. గోపి తాను సేకరించిన దాదాపు వంద అచ్చు పుస్తకాల్లో ఇలాంటి వర్గీకరణే ఉందని పేర్కొన్నారు. వేమన తెలుగు ప్రాంతాల్లోనే కాకుండా తమిళ, కర్ణాటక ప్రాంతాల్లో కూడా పర్యటించాడని ఆయన పద్యాల్లోని కొన్ని పదాలను బట్టి తెలుస్తుంది. అందుకే వేమన ఉపయోగించిన కొన్ని తెలుగు మాటలకు అర్థాలు చెప్పే సందర్భంలో వాటికి సమానార్థకాలైన ఇతర ద్రావిడ భాషా పదాల ప్రసక్తిని తేవడం జరిగిందని వ్యాఖ్యాత చెప్పుకొన్నారు.

వేమన పద్యాలలోని పదాలు, పదబంధాలు, సౌందర్యం, భావుకతకు భంగం కలుగకుండా అందులోని ఆర్థిక, సామాజిక, రాజకీయ, ఆధ్యాత్మిక, నీతి, వైరాగ్యం వంటి అంశాలకు సంబంధించిన పద్యాలకు వ్యాఖ్యానాలు రాసి వేమన పద్యాల్ని ఇష్టపడే అభిమానులకు, బహుమతిగా ఇవ్వడం జరిగింది. వేమనపై ఉన్న ఇష్టంతో 'వేమనగోపి'గా

మారి, తన ఇంటికి 'వేమన నిలయం' అనే పేరు పెట్టడమే కాకుండా, తన ఇంట్లో పన్నెండువేల పుస్తకాలతో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి 'వేమన విజ్ఞాన మందిరం' అనే పేరు పెట్టుకోవడం జరిగింది. ఆ లైబ్రరీలో పెట్టుకోవడానికి శీలా వీర్రాజు వేసిన వేమన పెయింటింగ్ ప్రత్యేకంగా నిలిచిందని చెప్పవచ్చు. ఈ విధంగా వేమనపై ఉన్న ఆసక్తి, ఇష్టంతో వేమనపై పరిశోధన చేయడమే కాకుండా, ఆ తర్వాత కూడా తన పరిశోధనను కొనసాగిస్తూనే వేమన పద్యాలకు వ్యాఖ్యానాలను రాయడం విశేషం.

★★★

ముగింపు

పరిశోధన ప్రధాన ఆకరాలు

అనుబంధం

ఉపయుక్త గ్రంథసూచి

ముగింపు

శ్రీశ్రీ అన్నట్లు గొప్ప కవిత్వం అంటే సైజూ, బరువూ క్రైటీరియా కావు, తిలక్ చెప్పినట్టు అంతరాంతర జ్యోతి స్సీమల్ని వెలిగించాలి. చలం చెప్పినట్లు రాసేటప్పుడు మన శ్వాస ఇబ్బంది పడాలి, శక్తి పొంగాలి. అంతేగాని గంటూరు శేషేంద్రశర్మ అన్నట్లు ''కాగితమూ కలమూ పుచ్చుకొని పోలీస్ కేసుల్లా బనాయించి చేసిన రచనలు చేస్తే కవితలు కాలేవు''. (పేజి –32, కవిసేవ మేనిఫెస్టో) ఇలాంటి వాటికి అతీతంగా గోపి కవిత్వం మనకు కన్పిస్తుంది. గోపి దృష్టిలో కవిత్వమంటే అర్థమయినట్టే అనిపించి బోధపడని బాధాతప్త రహస్య సృష్టి సంగీతం. ఆర్ధ్రత లేకుండా ఉంటే అది కవిత్వం కానట్టేనని, జీవగతికీ మనసిక స్థితికీ మధ్య రహస్యతీరం చేరడమే కవిత్వం అనీ, కవిత్వం దేనికీ నిర్ధారణ కాదు, అదొక నిరంతరస్వప్నం అన్నా, చివరకు ప్రజలకన్నా నా కవిత్వం గొప్పదేం కాదంటారు గోపి. ఇది నిజం.

సమాజ ప్రతిబింబమే కవిత్వమైనప్పుడు సమాజానికీ, సాహిత్యానికీ అవినాభావ సంబంధం ఉన్నప్పుడు, సామాజిక చైతన్యాన్ని కలిగించడమే కవిత్వ లక్ష్యం. కవులు తమకు కావలసిన వస్తువును సమాజంలోనుండే తీసుకుంటారు. తిరిగి ఆ సమాజాన్నే చైతన్య పరుస్తారు. ప్రతి కవికీ తనకంటూ ఒక దృక్పథం ఉంటుంది. అది ఏర్పడడానికి ఏదో ఒక బలమైన కారనం ఉండి తీరుతుంది.

డా. ఎన్. గోపి కూడా వెనుకబడ్డ తెలంగాణ ప్రాంతం నుండి వచ్చినవాడే కాబట్టి, ఇక్కడి ప్రజల ఆర్తి, ఆవేదన, ఆక్రోశం, సంఘర్షణ, వ్యథలు, కష్టాలు, కన్నీళ్లు, బాధలు, పల్లెవాసనలు, మట్టిమనుషులపై ఉన్న ప్రేమ, వారి అమాయకత్వం, మనుషుల మీద ఉన్న నమ్మకం మొదలైన వాటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని అర్ధ్రతతో, ఆవేదనతో రాసిన కవిత్వం మనకు కనిపిస్తుంది. ఇలా ఏ అంశాన్ని గురించి వర్ణించినా చివరగా మానవత్వమే ఆయన మతంగా నిలిచింది. మనిషిపట్ల ప్రేమ, సమాజం పట్ల బాధ్యతతో భవిష్యత్ ప్రపంచాన్ని మర్చుకోవడమే కవిత్వ

లక్షణం. కాబట్టే ఇలాంటి వైవిధ్యమున్న గోపి సాహిత్యాన్ని నా పరిశోధనాంశంగా తీసుకోవడం జరిగింది.

''ఎన్. గోపి సాహిత్యం వస్తురూప వివేచన'' అనే నా పరిశోధనాంశాన్ని మొత్తం ఆరు అధ్యాయాలుగా విభజించాను. మొదటి అధ్యాయం 'ఎన్. గోపి – జీవిత రేఖలు' లో గోపి కుటుంబ నేపథ్యం, ఆయన విద్యాభ్యాసం, వివాహ జీవితం, ఉద్యోగ జీవితం, ఆయనను కవిగా ప్రభావితం చేసిన వ్యక్తులు, అంశాలను, ఆయన రచనలను, ఆయన రచనలు వివిధ భాషల్లోకి వెళ్ళిన అనువాదాలను, వీరు పొందిన అవార్డులు, పురస్కారాలను గురించి పేర్కొనడం జరిగింది.

రెండవ అధ్యాయం ''గోపి కవిత్వం వస్తు రూప వైవిధ్య పరిణామం''. ఇందులో వస్తువు అంటే ఏమిటి, వస్తు లక్షణాలు, రూపం, రూప లక్షణాలు, శిల్పం, శైలి, ప్రతీక, భావచిత్రం వంటి వాటి వివరాలను పరిచయం చేస్తూ, ఆధునిక తెలుగు కవిత్వ పరిణామ వికాసాలను తెలియజేశాను. ఇందులో భాగంగా భావ, అభ్యుదయ, దిగంబర, స్త్రీ వాద, విప్లవ, దళిత కవిత్వాలను చర్చించడం జరిగింది. ఈ అధ్యాయంలో అంతర్భాగంగా గోపి కవిత్వాన్ని విభజించి చూపాను. అందులో మానవతావాద కవిత్వం, స్మృతి కవిత్వం, వస్తు కవిత్వం, కవిత్వంపై కవిత్వం, తెలంగాణ ప్రాంతీయ కవిత్వం, ప్రకృతి కవిత్వం, ప్రపంచీకరణ కవిత్వం, అనుభూతి కవిత్వాలుగా విభజించాను. ఇంకా ఎన్నో రకాలుగా విభజనను చెప్పవచ్చు. కానీ స్థల, కాల ప్రభావం కారణంగా మినహాయింపునిచ్చాను. ఈ అధ్యాయంలో చివరగా జలగీతం దీర్ఘకావ్యాన్ని గురించి వివరించడం జరిగింది.

మూడవ అధ్యాయం ''నానీలు – వస్తు విశ్లేషణ ఒక విశిష్ట ప్రయోగం''. ఇందులో నానీల ఆవిర్భావం, నానీ రూపం, నానీల పాద నియమం, నానీల విశిష్టతను చెప్తూనే మినీ, హైకూల పరిచయం చేశాను. నానీల పరిశీలనలో భాగంగా మానవ సంబంధాలు, ప్రపంచీకరణ, ఆశ, నిరాశ, ప్రాంతీయత, కులం, రాజకీయం, స్త్రీ ల గురించి, వర్షపు నానీలు,

ప్రకృతి/పచ్చదనం గురించి, శాంతి, తాత్వికత, కవిత్వంపై చెప్పిన నానీలు, ఉద్యమ, అభ్యుదయ నానీలు, అమ్మపై చెప్పిన నానీలు వంటి విభజన చేశాను. ఈ నానీలు రెండు సంపుటాలుగా వెలువడ్డాయి. ఈ సంపుటాలలో కవి స్పృశించని అంశమంటూ లేదు అని చెప్పవచ్చు.

నాలుగవ అధ్యాయం ''యాత్రా చరిత్ర కారుడిగా గోపి'' లో మొదటగా శబ్దరత్నాకరం, బ్రౌణ్య నిఘంటువు, సూర్య రాయంధ్ర నిఘంటువులు యాత్రకు చెప్పిన అర్థాలను చెప్పడం జరిగింది. యాత్రలకు ప్రేరణ, యాత్ర ప్రయోజనం, యాత్రకుని లక్షణాలు, యాత్రల వర్గీకరణను చెప్తూ లక్ష్యాన్ని బట్టి చేసే యాత్రలు, గమన విధానాన్ని బట్టి, కాల క్రమాన్ని బట్టి యాత్రలను వర్గీకరించిన విషయాన్ని చెప్పడం జరిగింది. రచయిత చేసిన యాత్రల్లో భాగంగా నేను చూసిన మారిషస్, నాసైప్రస్ యాత్ర, అమెరికాలో తెలుగు యాత్ర, ఇంగ్లండ్ లో ఇరవై ఐదురోజులు, జర్మనీలో కవితా యాత్ర వంటి యాత్రలలోని విశేషాలను వాటి భౌగోళిక స్వరూపాలను, ఆయా దేశాల వారి ఆచార వ్యవహారాలు, వారి ఆహారపు అలవాట్లు అక్కడి సందర్శనా స్థలాలు వంటి మొదలైన విషయాలను పేర్కొనడం జరిగింది. యాత్రల వల్ల వివిధ దేశాల చరిత్రలు, వారి సంస్కృతీ సంప్రదాయాలు మొదలైన విషయాలు తెలుస్తాయి.

అయిదో అధ్యాయం 'విమర్శకుడిగా గోపి'లో విమర్శ అంటే ఏమిటి, విమర్శకుడి లక్షణాలను చెప్పి గోపి రాసిన విమర్శ గ్రంథాలు గవాక్షం, నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం, సాలోచన (పీఠికలు), వ్యాసకలశం వంటి గ్రంథాలను, వాటిలోని విషయాలను సవిమర్శకంగా పరిశీలించడం జరిగింది. ఇందులో సాలోచనలు (పీఠికలలో) వివిధ కవులు రాసిన కవితా సంపుటి పుస్తకాలకు, పరిశోధనా గ్రంథాలకు రాసిన పీఠికలలో గోపి ఆయా కవులు, రచయితలకు సహృదయంతో చేసిన సలహాలు, సూచనలు ఎన్నో మనకు కనిపిస్తాయి.

ఆరవ అధ్యాయం 'పరిశోధకుడిగా గోపి'. ఇందులో భాగంగా పరిశోధన అంటే ఏమిటనే విషయాన్ని చెప్తూ, గోపి రాసిన పరిశోధన గ్రంథాలు ప్రజాకవి వేమన సిద్ధాంత గ్రంథం, వ్యాసనవమి, వేమన పద్యాల పారిస్ ప్రతిని గురించి పరిశీలించడం జరిగింది.

చివరగా ఇతరాలు అన్న విభజనలో వ్యాఖ్యాతగా గోపి చేసిన వేమన్నవాదం, వేమన్న వెలుగులు గ్రంథం వ్యాఖ్యానాల విషయాలను సూక్ష్మంగా చెప్పడం జరిగింది. గోపి అనువాదాలలో ఒకటైన జ్ఞానదేవుడు గురించి చర్చించడం జరిగింది. అక్షరయానం పేరుతో రాసిన కాలమ్స్ లోని విషయాల గురించి అందులో భాగంగా తెలుగు భాష గురించి రాసిన దాదాపు పది వ్యాసాలలో ప్రస్తుత కాలంలో తెలుగు భాషకు తగ్గుతున్న ప్రాధాన్యతను, తెలుగు చదివిన వారికి ఉపాధి అవకాశాలు లేని పరిస్థితులను, తెలుగు భాషను మెరుగు పరచడానికి చేసిన సూచనలను పేర్కొనడం జరిగింది. కూచిపూడి, హరికథ, సురభి నాటక సమాజం, తోలుబొమ్మలు, లలిత సంగీతం, జానపద కళలపై రాసిన వ్యాసాలలో ఆయా కళల ప్రధాన్యతను, అవి అంతరించిపోతున్న వైనాన్ని, వాటిని బ్రతికించుకోవాల్సిన అవసరాలను ఈ సమాజానికి అవి ఎంతో అవసరముందన్న విషయాలను విశ్లేషించాను. చివరగా అనుబంధంలో రచయితతో వివిధ అంశాలపై జరిపిన ముఖాముఖిని పొందుపరిచాను.

గోపి కవిత్వంలో కలలూ, కన్నీళ్ళూ, బాధలు, ఆర్తి, ఆవేదనలు ఎన్నో ఉంటాయి. అందుకే ''కలలూ కన్నీళ్ళూ / సకల సంవేదనలు / అన్నిటినీ దోసిలి పట్టిన / మట్టిగిన్నె నా కలం'' (మా వూరు మహాకావ్యం, పేజి-28) అంటారు. ఇలా అనడంలో కవికి గల సామాజిక బాధ్యత అర్థం అవుతుంది. సమాజంలోని పీడిత వర్గాలు, బాధిత ప్రజల గురించి రాసే కవికి సామాజిక బాధ్యత ఉంటుంది. అంతేగాని ''కవిత్వమంటే / పురాణేతిహాసాల నుండి పిండిన / పుక్కిటి పురాణాలు కాదు / మేథోమథనం కాదు / సారం లేని శబ్ద విహారం కాదు.'' (మళ్లీ విత్తనంలోకి, పేజి-88) అంటారు. గోపి కవిత్వంలో వస్తువు సామాన్యుడే. సగటు మనిషి కష్టనష్టాలు, బాధలు, దుఃఖాలు, వారి ఆకలి బాధలనే కవిత్వంలో వస్తువులుగా తీసుకున్నారు. జీవితంలోని వైవిధ్యాన్నంతా కవితా వస్తువులుగా చేసుకొని రాసిన కవిత్వమే కనిపిస్తుంది. సామాజిక వస్తువు, ఆధునిక ప్రక్రియ, రచనలో నిజాయితీ, పీడితుల పక్షాన ఉండే కవిత్వం, సామాన్యులకు కూడా అర్థమయ్యే పదాలను కవిత్వంలో ప్రయోగించడం వంటివన్నీ ఉన్న కవిత్వం ఉత్తమ కవిత్వమవుతుంది. ఇలాంటి కవిత్వం ఛాయలు మనకు గోపిగారిలో

కనిపిస్తాయి. నేటి ఉరుకులు పరుగుల జీవితంలో కవిత్వాన్ని ఆస్వాదించేవారు తక్కువయ్యారు. కథలు, నవలలు చదివే ఓపిక తీరిక ప్రజలకు లేదు. ఇలాంటి సందర్భంలో గోపి నానీలు వెలువడ్డాయి. అవి పరిమాణంలో చిన్నగా ఉండడంతో పాఠకులు కూడా చదవడానికి ఇష్టపడ్డారు. కాబట్టే అవి అంతగా జనాల్లోకి వెళ్లాయి. ఏది ఏమైన కవిత్వం సమాజ ప్రతిబింబం. సమాజంలోని మనుష్యులు, వారి వ్యక్తిత్వాలే కవిత్వంలో ప్రతిఫలిస్తాయి. కాబట్టి సమాజాన్ని ప్రభావితం చేయడంలో, చైతన్య పరచడంలో, ప్రజలలో మార్పు తీసుకురావడానికి, సమాజ శ్రేయస్సుకు కవిత్వం తోడ్పడుతుందనడంలో సందేహం లేదు.

ఈ విధంగా కవిగా, యాత్రా చరిత్రకారుడిగా, నానీల సృష్టికర్తగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా, వ్యాఖ్యాతగా, కాలమ్స్ రచయితగా, అనువాదకుడిగా గోపిలోని విభిన్న కోణాలను దర్శించే అవకాశం ఈ పరిశోధన ద్వారా కలిగింది. నిరంతర కృషి, తపనతో అధ్యాపకుడిగా, పరిపాలకుడిగా ఉంటూనే ఆయన ఎన్నో రచనలు చేయడం అనుసరణీయం. అభినందనీయం.

★★★

అనుబంధం

(కవి, రచయిత ఆచార్య ఎన్. గోపి గారితో ఇంటర్వ్యూ)

1. విభిన్న ప్రక్రియలురాసిన మీకు బాగా సంతృప్తినిచ్చిన ప్రక్రియ?

   కవిత్వమే. కవిత్వం ఒక కళగా అబ్బిన విద్య. అది నా ప్రవృత్తి. అయితే పరిశోధన నా ప్రవృత్తికి ఆటంకం కాలేదు. యాత్రాచరిత్రలు గానీ, వ్యాసాలుగానీ నేను కవితా హృదయంతోనే దర్శించాను.

2. మీరు రాసిన యాత్రా చరిత్రల్లో మీకు సంతృప్తినిచ్చిన యాత్ర ఏది? ఎందుకు?

   అన్నీ సంతృప్తినిచ్చినవే. యాత్రా చరిత్ర అనేది యాత్రాదర్శనం కాదు. యాత్రికుని స్పందనల సమాహారంతో రూపొందేదే నిజమైన యాత్రా చరిత్ర.

3. మీరు రాసిన కవితల్లో మీకు నచ్చిన కవిత ఏది? ఎందుకు?

   మీ పిల్లల్లో మీకు ఎవరు ఎక్కువ ఇష్టం అని అడిగినట్లుగా ఉంది. సహజంగానే నాకు అన్ని కవితలు నచ్చుతాయి. రాసిన సందర్భాలను బట్టి కొన్ని ఎక్కువగా నచ్చుతాయి. కాలాన్ని నిద్రపోనివ్వను సంపుటిలోని రొట్టె, బొంత, చచ్చిపోతున్న ఉత్తరంలాంటి కవితలు నాకే గాక ఎందరికో నచ్చాయి. అట్లాగే ఫ్రీడమ్ ఫైటర్ కవిత కూడా ప్రసిద్ధమైనది.

4. స్మృతి కవిత్వం ఎక్కువగా రాశారు. ఇవన్నీ ఇక సంపుటిగా తేవాల్సింది. దీనిపై మీ అభిప్రాయం?

   అవును నిజమే. నా ప్రతి సంపుటిలోనూ స్మృతి కవితలు కొన్ని కనిపిస్తాయి. నేను మనిషినే. మనుషుల్నే ఎక్కువగా ప్రేమిస్తాను. వారు చనిపోతే నేను కలతపడనా? అవే నా స్మృతి కవితలు. నీ సూచన బాగుంది. ఆ స్మృతి కవితలను ఒక సంపుటిగా చేయవచ్చు. మనుషుల మధ్య అనుబంధాలు తగ్గుతున్న కాలంలో అవి కొందరికైనా ఉపయోగపడొచ్చు.

5. దాదాపు ప్రతి కవితా సంపుటిలో ఏదో ఒక కవితలో సముద్ర పదం వాడారు. (ఒక్క తంగెడుపూలు, మైలురాయిలో తప్ప) ఇది సముద్రంపై మీకున్న ఇష్టమా?

తెలంగాణలో మనకు సముద్రం లేదు. కానీ సముద్రాన్ని చూడగానే ఉద్వేగం పొందని వారెవరుండరు. నిజానికి సముద్రం అంటే అపారమైనది అనే అర్థంలోనే ఎక్కువగా వాడాను.

6. చిత్రదీపాలు కవితా సంపుటిలో కడలి సంతకం, బిందుఘోష కవితల్లో సముద్ర పదాన్ని 11 సార్లు పునరుక్తి చేశారు? పర్యాయపదాలు వాడకపోవడానికి కారణం?

అవి ఒక కవితా ప్రవాహంలో వచ్చి చేరినవే. ఒక్కోసారి సముద్రానికున్న స్ఫూర్తి దాని పర్యాయపదాలకు ఉండకపోవచ్చు.

7. ఒకే శీర్షికతో రాసిన కొన్ని కవితలున్నాయి. అలా రాయడానికి ప్రత్యేక కారణం ఏమైనా ఉందా?

అసంఖ్యాకంగా కవితలు రాస్తున్నప్పుడు ఇట్లాంటివి సహజమే.

8. పూర్తి తెలంగాణ మాండలికంలో రాసిన కవితలు నాలుగే ఉన్నాయి. (తంగెడు పూలు సంపుటిలోని పచ్చి బతుకు శాంతమ్మ, మంచితిండి మరియు మైలురాయి సంపుటిలోని పల్లెల్లో మన పల్లెల్లో, కాళోజీ స్మృతి) ఎక్కువగా రాయకపోవడానికి కారణం?

అవును నిజమే. పూర్తి మాండలికంలో రాయడం అంత సులభం కాదు. శిష్ట వ్యావహారికంలో ఆలోచించి మాండలికంలో రాస్తే అవి నిసర్గరమ్యంగా రూపొందవు. నేను పల్లీయ భాషలో ఆలోచించి అదే భాషలో అల్లిన కవితలు ఇవి. ఈ కవితలను నేను సారస్వత పరిషత్తు కవి సమ్మేళనాల్లో వినిపించినవే. పరిషత్ కార్యదర్శి స్వర్గీయ దేవులపల్లి రామానుజరావు గారు ''మీరు ఒక ముప్పై కవితలు రాస్తే పరిషత్తు పక్షాన పుస్తకంగా వేస్తాం'' అన్నారు. కానీ అది జరుగలేదు.

9. కొన్ని కవితలు తెలంగాణ మాండలికపదంతో శీర్షికలుగా ఉన్న కవిత ఆసాంతం అందులో సాగదు, కారణం?

మాండలికాలకి వైశాల్యం ఉండదు. కవి పరిధి పెరుగుతున్నకొద్దీ అన్ని రకాల యాసలు అందులో వచ్చి చేరుతుంటాయి. అయితే వాటిపై ప్రధానంగా తెలంగాణ ముద్ర ఉండి తీరుతుంది.

10. *నానీల సృష్టికర్తగా మీ అనుభూతి ఏమిటి?*

దీనికి సమాధానం చెప్పాలంటే ఓ గ్రంథమే అవుతుంది. 1997లో ఓ సంవేదనాత్మక మానసిక పరిస్థితిలో నేను నానీ కవితా రూపాన్ని సృష్టించాను. దాదాపు 700లకు పైగా నానీలు రాశాను. వాటిని నానీసప్తశతి అనవచ్చు. దానిని రెండు రాష్ట్రాలలో, రాష్ట్రాల బయటా దాదాపు 1000 మంది దాకా అనుసరించారు. ఈ మార్గంలో ఇప్పటి వరకు దాదాపు 300 నానీల సంపుటాలు వెలువడ్డాయి. వచన కవిత్వంలో కాక మైక్రోలెవల్లో పోలి ఉన్న అనేక వస్తువులు నానీలను సుసంపన్నం చేశాయి. కొత్త వారెందరో నానీల సింహద్వారం గుండా ప్రవేశించి కవితారంగంలో లబ్ధప్రతిష్ఠులైనారు. సీనియర్లు కూడా నానీలపై మక్కువ పడ్డారు. నేటి యువకులు క్రమంగా తెలుగుకు దూరమవుతున్న సన్నివేశంలో నానీల వల్ల సూత్రచ్యుతి జరుగకుండా ఉంటారని నా విశ్వాసం. నానీల దీప్తి ద్వారా, వ్యాప్తి ద్వారా నేను పొందిన అనుభూతి ఎంతో ప్రత్యేకమైనది.

11. మీకు నానీల సృష్టికర్తగా, కవిగా గుర్తింపు రావడం ఆనందాన్నిచ్చిందా? వేమన గోపిగా పేరు రావడం ఆనందాన్నిచ్చిందా?

నేను ఏ పుస్తకం రాసినా కొన్నాళ్ళపాటు ఆ పుస్తకం పేరుతో వ్యవహరించడం జరుగుతూ వచ్చింది. తంగెడుపూలు, మైలురాయిలతోటి, వేమనగోపి ఇట్లా. వేమనపై పరిశోధన నా ప్రాపంచిక దృక్పథంలో అనేక మార్పులు తీసుకొచ్చింది. అది పరిశోధకుడిగా మంచి గుర్తింపును తెచ్చింది. అది నాకెంతో ఆనందాన్నిచ్చింది. అయితే వేమనపై పరిశోధన ఇంతటితో ఆగరాదు. ఆణిముత్యాల్లాంటి నూతన సత్యాలు వెలికి రావాల్సి ఉంది.

12. కాలమ్స్ రచయితగా మీ అనుభవం, అక్షరయానంలో తెలుగు భాషపై దాదాపు పది వ్యాసాలు రాశారు. ప్రస్తుత తెలుగు భాష స్థితిగతులపై మీ అభిప్రాయం?

దీనికి సమాధానం చాలా పెద్దదవుతుంది. అయితే స్థూలంగా చెప్పాలంటే పాఠశాల, కళాశాలల సిలబసుల్లో తెలుగుకు అనివార్యమైన చోటు లభిస్తే తప్ప తెలుగు వైభవం నిలవదు. మూలాన్ని ముట్టకుండా అందమైన మాటలతో తెలుగు వైభవాన్ని కీర్తిస్తే ఏంలాభం?

13. తెలుగు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ గా మరియు కాకతీయ, ద్రవిడ విశ్వవిద్యాలయాల ఇన్ చార్జ్ వైస్ ఛాన్సలర్ గా పని చేశారు. పరిపాలకుడుగా మీ అనుభవం?

నాలో అంతటి పరిపాలనాదక్షత ఉందని నాకే తెలియదు. అయితే నేను ఏ పనిచేసినా నిరంతర కృషితో, ఇష్టంతో చేస్తాను. దానివలన వైస్ ఛాన్సలర్ గా మంచి ఫలితాలను సాధించాననే వినమ్ర భావన నాకుంది.

14. మీరు నవలలు, కథలు రాయకపోవడానికి కారణం?

ఎందుకో రాయలేదు. కథ రాయాలని ఒకసారి ప్రయత్నించినా కొద్ది దూరం వెళ్ళిన తర్వాత అది వ్యాసంగా మారడం మొదలుపెట్టింది. కవికి కథ చెప్పే ఓపిక తక్కువ. అయితే రెంటినీ సాధించిన తిలక్ లాంటి కవులు లేకపోలేదు.

15. ప్రస్తుతం వస్తున్న కవిత్వంపై మీ అభిప్రాయం?

ప్రతియుగంలో లాగే ఇప్పుడు మంచి కవిత్వం వస్తుంది. అయితే ఉన్నత విద్యల వల్ల ప్రతివారూ తమ అస్తిత్వాన్ని వెతుక్కుంటున్నారు. వెతుక్కోవడమే కాక దానిని తమ రచనల్లో బలంగా స్థాపిస్తున్నారు.

16. ఇతరుల కవిత్వంలో మీకు బాగా నచ్చిన, మిమ్మల్ని ప్రభావితం చేసిన కవితలు ఎవరివి? ఎందుకు?

ఒక్కరని కాదు. ఎందరో ఉన్నారు. స్థల, కాల, విస్తరణ భీతి వల్ల ప్రస్తుతానికి దీన్నిక్కడ ఆపేద్దాం.

17. మీ భవిష్యత్ ప్రణాళిక ఏమిటి?

నిరంతరం కవిత్వం రాయడమే. కవిత్వం నా శ్వాస. నేనెప్పుడైనా ఒక కొత్త కవిత రాస్తే ఏదో ఒక కొత్త సంతృప్తిలో ఉండిపోతాను.

18. ఒక సాహిత్య సృజనకారుడిగా మీకు రావలసినంత గుర్తింపు వచ్చిందని భావిస్తున్నారా?

తప్పకుండా. దానికి నీలాంటి వాళ్ళు పరిశోధన చేయడమే నిదర్శనం.

19. పుస్తకాలు చదివే అలవాటు క్రమంగా తగ్గుతున్న కాలంలో సమాజంపై కవిత్వం ప్రభావం ఉంటుందనుకుంటున్నారా?

కొంత తగ్గుతున్న మాట నిజమే. కానీ కవిత్వం అనేది కాలానుగుణంగా ఎప్పుడూ రూపాన్ని మార్చుకుంటుంది. మన జీవితాల్లోనే కవిత్వం ఉన్నప్పుడు కవిత్వం ఎక్కడికి పోతుంది.

20. చివరగా యువకవులకు మీరిచ్చే సందేశం?

ఒకరిచ్చే సందేశం ఏముంటుంది కానీ సూచన మాత్రం చేస్తాను. యువకులు బాగా అధ్యయనం చేయాలి. ఎంతో నలిగితేగానీ, అవగాహన కలిగితేగానీ కలాన్ని కాగితంపై పెట్టకూడదు. పెట్టినా కొన్నాళ్ళు మాగబెట్టి మళ్ళీ మళ్ళీ సవరణలు చేసుకుంటే మంచి కవిత్వం ఊపిరి పోసుకుంటుంది.

– *జూన్ 19, 2016*

★★★

పరిశోధన ప్రధాన ఆకరాలు

1. డా॥ గోపి, ఎన్ – 1980, వేమన్నవాదం, హైదరాబాద్ బుక్ టస్ట్.
2. డా॥ గోపి, ఎన్ – 1983, జ్ఞానదేవుడు (అనువాదం), సాహిత్య అకాడమి.
3. డా॥ గోపి, ఎన్ – 1986, వ్యాసనవమి, చైతన్య పబ్లికేషన్స్, హైదరాబాద్.
4. డా॥ గోపి, ఎన్ – 1990, వేమనపద్యాల పారిస్ ప్రతి, చైతన్య ప్రచురణలు, హైదరాబాద్
5. డా॥ గోపి, ఎన్ – 1991, ప్రజాకవి వేమన
6. డా॥ గోపి, ఎన్ – 1991, నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం, హృదయ భారతి ప్రచురణలు, హైదరాబాద్.
7. డా॥ గోపి, ఎన్ – 1995, గవాక్షం, చైతన్య ప్రచురణలు, హైదరాబాద్.
8. డా॥ గోపి, ఎన్ – 1996, నేను చూసిన మారిషస్, రచన ప్రచురణలు, హైదరాబాద్
9. డా॥ గోపి, ఎన్ – 1998, సాలోచన, చైతన్య ప్రచురణలు, హైదరాబాద్
10. డా॥ గోపి, ఎన్ – 2001, నా సైప్రస్ యాత్ర, చైతన్య ప్రచురణలు, హైదరాబాద్
11. డా॥ గోపి, ఎన్ – 2002, అమెరికాలో తెలుగు యాత్ర, చైతన్య ప్రచురణలు, హైదరాబాద్
12. డా॥ గోపి, ఎన్ – 2004, ఇంగ్లండ్ లో ఇరవై ఐదు రోజులు, జిష్ణు ప్రచురణలు, హైదరాబాద్
13. డా॥ గోపి, ఎన్ – 2005, అక్షరయానం, తేజ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్
14. డా॥ గోపి, ఎన్ – 2010, గోపి కవిత్వం–I, , అభవ్ ప్రచురణలు, హైదరాబాద్
15. డా॥ గోపి, ఎన్ – 2010, గోపి కవిత్వం–II, , అభవ్ ప్రచురణలు, హైదరాబాద్
16. డా॥ గోపి, ఎన్ – 2010, గోపి కవిత్వం–III, , అభవ్ ప్రచురణలు, హైదరాబాద్
17. డా॥ గోపి, ఎన్ – 2010, మా ఊరు మహాకావ్యం, అభవ్ ప్రచురణలు, హైదరాబాద్
18. డా॥ గోపి, ఎన్ – 2011, రాతికెరటాలు, అభవ్ ప్రచురణలు, హైదరాబాద్
19. డా॥ గోపి, ఎన్ – 2012, వేమన్న వెలుగులు, శాంతా వసంతా ట్రస్ట్ ప్రచురణలు, హైదరాబాద్
20. డా॥ గోపి, ఎన్ – 2012, వ్యాస కలశం, అభవ్ ప్రచురణలు, హైదరాబాద్

21. డా॥ గోపి, ఎన్ – 2013, హృదయ రశ్మి, అభవ్ ప్రచురణలు, హైదరాబాద్
22. డా॥ గోపి, ఎన్ – 2014, మళ్ళీ విత్తనంలోకి, అభవ్ ప్రచురణలు, హైదరాబాద్
23. డా॥ గోపి, ఎన్ – 2015, జర్మనీలో కవితా యాత్ర, అభవ్ ప్రచురణలు, హైదరాబాద్
24. డా॥ గోపి, ఎన్ – 2015, పురి విప్పిన ఊపిరి, అభవ్ ప్రచురణలు, హైదరాబాద్

★★★

ఉపయుక్త గ్రంథసూచి

1. అరుణ కుమారి, జి–1989, ఆధునిక తెలుగు కవిత్వంలో మాతనవతావాదం – విభిన్న ధోరణులు, ఎ.వి. ప్రింటర్స్, హైదరాబాద్.
2. అరుణ, ఎన్. సంపాదకురాలు–2008, జలదీపిక, జిష్ణు ప్రచురణలు, హైదరాబాద్.
3. ఆరుద్ర–2004, సమగ్రాంధ్ర సాహిత్యం(నాలుగవ సంపుటి) తెలుగు అకాడమి, హైదరాబాద్.
4. చంద్రశేఖరరెడ్డి, డి. 2001, సంహిత (సాహిత్య వ్యాసాలు), మీడియా హౌస్ పబ్లికేషన్స్.
5. చంద్రిక, ఎం.–1987, మినీ కవిత్వ నిర్మాణ శిల్పం–భావాభివ్యక్తి, రాజేశ్వరి ప్రింటర్స్, హైదరాబాద్.
6. జగన్నాథం, పేర్వారం, సంపాదకులు–1987, అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు, సాహితి ప్రచురణ, హన్మకొండ.
7. తెలుగులో వ్యాఖ్యాన సంప్రదాయం ఉత్పత్తి వికాసాలు (పిహెచ్.డి.)–1998, హైదారాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
8. ధనంజయ్, యం.–2005, ఎన్.గోపి, జలగీతం. వైజ్ఞానిక, మానవీయ, తాత్త్విక దర్శనం, శీతల్ పబ్లిషర్స్, హైదరాబాద్.
9. నరసింహమూర్తి, యు.ఎ.–2014, తెలుగు వచన శైలి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ప్రచురణ.
10. నారాయణరావు, వేల్చేరు–2008, తెలుగులో కవితా విప్లవాల స్వరూపం, తానా ప్రచురణలు.
11. నారాయణరెడ్డి, సి.–2007, ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయములు – ప్రయోగములు, శ్రీ కళాంజలి గ్రాఫిక్స్, హైదరాబాద్.
12. మధుసూధనరావు, త్రిపురనేని–1997, సాహిత్యంలో వస్తు శిల్పాలు, పరస్పెక్టివ్ పబ్లిషర్స్, హైదరాబాద్.

13. మూల్యాంకనం-(గత శతాబ్ది సాహిత్యావలోకనం)-2003.
14. యాదగిరి, కె. సంపాదకులు-2003, తెలుగులో కవిత్వోద్యమాలు, తెలుగు అకాడమి, హైదరాబాద్.
15. రంగనాథాచార్యులు, కె.కె.- సంపాదకుడు-1982, ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, పద్మావతీ ఆర్ట్ క్రియేషన్స్, హైదరాబాద్.
16. రఘు, ఎస్. సంపాదకులు-2006, గోపి నానీలు-సంవీక్షణం, మనస్వి ప్రచురణలు, ఖమ్మం.
17. రఘురామ్, మద్దాళి, సంపాదకులు-2009, తెలుగు భాషా వైభవం, కిన్నెర పబ్లిషర్స్, హైదరాబాద్.
18. రఘురామ్, మద్దాళి, సంపాదకులు-2010, (గోపి షష్ఠిపూర్తి అభినందన సంచిక), కిన్నెర ఆర్ట్ థియేటర్స్, హైదరాబాద్.
19. రవికుమార్, గట్ల-2011, గోపి కవిత – మానవత, అన్నపూర్ణ ప్రచురణలు, హైదరాబాద్.
20. రవీందర్, పసునూరి-2006, ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు సాహిత్య విమర్శ – ఒక పరిశీలన (ఎం.ఫిల్) హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
21. రామమోహనరావు, అద్దేపల్లి-1998, అద్దేపల్లి సాహిత్య వ్యాసాలు-1, పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ-2.
22. రామమోహనరావు, అద్దేపల్లి-2000, అభ్యుదయ విప్లవ కవిత్వాలు సిద్ధాంతాలు – శిల్పరీతులు, రాంషా శిరిష పబ్లికేషన్స్, సామర్లకోట.
23. రామారావు, ఎస్వీ-2007, తెలుగు సాహిత్య విమర్శ, కళా ప్రింటర్స్, హైదరాబాద్.
24. రామారావు, చేకూరి-2002, సాహిత్య కిర్మీరం (వ్యాస సంకలనం) చరిత్ర గ్రాఫిక్స్, చిక్కడపల్లి, హైదరాబాద్.

25. రాములు, పిల్లలమర్రి–1999, తెలుగులో భక్తి కవిత్వం – సామాజిక విశ్లేషణ, హైదరాబాద్.
26. వసునందన్, రావికంటి–1990, ఆధునికాంధ్ర కవిత్వంలో మానవతావాదం, విశ్వంభర విలక్షణత, మాస్టర్ ప్రింట్స్, హైదరాబాద్.
27. వీరభద్రయ్య, ఎం–1998, ఆధునిక సాహిత్యం, వస్తు రూప వివేచన, హైదరాబాద్.
28. వీరభద్రయ్య, ఎం – సాహిత్య విమర్శ ఆలోచన, ఆలోకన.
29. వీరభద్రయ్య, ముదిగొండ–1998, సాహితీ విమర్శ సూత్రం–అన్వయం, పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ–2.
30. వెంకటేశ్వర్లు, లంకా–2005, సమకాలీన కవిత్వంలో ప్రతీకలు–భావచిత్రాలు, విప్ల కంప్యూటర్ సర్వీసెస్, హైదరాబాద్.
31. శరత్ జ్యోత్స్నారాణి, ఎస్–2003, స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత వస్తువు, రూపం, శిల్పం, జ్యోత్స్న కళాపీఠ ప్రచురణలు, హైదరబాద్.
32. శేషేంద్రశర్మ, గుంటూరు –2009, కవిసేన మేనిఫెస్టో (ఆధునిక కావ్య శాస్త్రము). ఆకృతి ఆఫ్ సెట్ ప్రింటర్స్.
33. సిధారెడ్డి, నందిని – 1988, ఆధునిక తెలుగు కవిత్వం – వాస్తవికత – ఆదివాస్తవికత, తెలుగు పరిశోధన ప్రచురణలు, హైదరాబాద్.
34. సుజాత శేఖర్, బండారు –2005, తెలంగాణా బతుకమ్మ పాటలు, పౌరాణిక, సామాజిక, సాంస్కృతిక భాషా పరిశీలన పరిశోధనావ్యాసం, తిరుమల గ్రాఫిక్స్, హైదరాబాద్.
35. సుబ్రహ్మణ్యం, జి.వి. –2002, సాహిత్యంలో చర్చనీయాంశాలు, తెలుగు అకాడమి, హైదరాబాద్.
36. సురేష్ –2005, గోపినానీలు వస్తురూప వివేచన (ఎం.ఫిల్) హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

37. హిమజ్వాల –2005, తెలంగాణా పల్లె (నానీలు).

నిఘంటువులు:

1. బ్రౌణ్య తెలుగు – ఇంగ్లీష్ నిఘంటువు.
2. శబ్దరత్నాకరం – బహుజనపల్లి సీతారామాచార్యులు.
3. సూర్యరాయాంధ్ర నిఘంటువు (ఆరవ సంపుటి)

వివిధ పత్రికా వ్యాసాలు:

1. మన్నం కృష్ణమూర్తి ఈనాడు వ్యాసం (31, ఆగస్టు, 2014).
2. సాహిత్య ప్రస్థానం (మాస పత్రిక) జులై, 2012 , సంపాదకుడు – తెలక పల్లి రవి.

★★★

Synopsis of

N. GOPI SAHITHYAM – VASTHU RUPA VIVECHANA

A Thesis submitted to the UNIVERSITY OF HYDERABAD in partial fulfillment of the Degree of

Doctor of Philosophy

in

Telugu

by

Sri Latha

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad–500 046
Telangana State

December -2016

ఎన్. గోపి సాహిత్యం – వస్తు రూప వివేచన

పిహెచ్.డి. పట్టాకోసం
హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధనా వ్యాస సార సంగ్రహం

పరిశోధన

శ్రీ లత

పర్యవేక్షణ

ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నా రాణి

తెలుగు శాఖ
మానవీయ శాస్త్రాల విభాగం
హైదరాబాదు విశ్వవిద్యాలయం
హైదరాబాదు – 500 046
తెలంగాణ రాష్ట్రం

జూన్ – 2016

విషయసూచిక

కృతజ్ఞతలు vi

ముందుమాట viii

అధ్యాయం – 1

ఆచార్య ఎన్.గోపి – జీవిత రేఖలు 1–14

1.1 కుటుంబ నేపథ్యం

1.2 విద్యాభ్యాసం

1.3 వివాహం

1.4 ఉద్యోగ జీవితం

1.5 గోపిని ప్రభావితం చేసిన వ్యక్తులు, అంశాలు

1.6 రచనా వ్యాసంగం

1.7 గోపి రచనలు – వివిధ భాషల్లోకి పొందిన అనువాదాలు

1.8 అవార్డులు

అధ్యాయం – 2

గోపి కవిత్వం వస్తు, రూప వైవిధ్య పరిణామం 15–89

2.1 వస్తువు

2.2 రూపం

2.3 శిల్పం

2.4 శైలి

2.5 ప్రతీక

2.6 భావచిత్రం

2.7 ఆధునిక తెలుగు కవిత్వ వికాస పరిణామం

2.7.1 భావకవిత్వం

2.7.2 అభ్యుదయ కవిత్వం

2.7.3 దిగంబర కవిత్వం

2.7.4 విప్లవ కవిత్వం

2.7.5 దళిత కవిత్వం

2.7.6 స్త్రీవాద కవిత్వం

2.8 మానవతావాద కవిత్వం

2.9 స్మృతి కవిత్వం

2.10 వస్తు కవిత్వం

2.11 కవిత్వంపై కవిత్వం

2.12 తెలంగాణ ప్రాంతీయ కవిత్వం

2.13 ప్రపంచీకరణ కవిత్వం

2.14 ప్రకృతి కవిత్వం

2.15 దళిత చైతన్య కవిత్వం

2.16 అనుభూతి కవిత్వం

2.17 జలగీతం – దీర్ఘకావ్యం

అధ్యాయం – 3

నానీలు వస్తు విశ్లేషణ, ఒక విశిష్ట ప్రయోగం 90–119

3.1 నానీలు ఆవిర్భావం

3.2 నానీ రూపం

3.3 నానీలు పాదనియమం

3.4 నానీలు విశిష్టత

3.5 మినీ కవిత్వం

3.6 హైకూ

3.7 నానీలు పరిశీలన

3.7.1 మానవ సంబంధాలు

3.7.2 ప్రపంచీకరణ నానీలు

3.7.3 ఆశ – నిరాశ

3.7.4 ప్రాంతీయత

3.7.5 కులం

3.7.6 రాజకీయ నానీలు

3.7.7 స్త్రీ నానీలు

3.7.8 వర్షం/ నీటి నానీలు

3.7.9 ప్రకృతి/పచ్చదన నానీలు

3.7.10 శాంతి నానీలు

3.7.11 తాత్వికత నానీలు

3.7.12 కవిత్వంపై నానీలు

3.7.13 ఉద్యమనానీలు

3.7.14 అభ్యుదయ నానీలు

3.7.15 అమ్మపై నానీలు

అధ్యాయం – 4

యాత్రా చరిత్రకారుడిగా గోపి 120–149

4.1 యాత్ర నిర్వచనం

4.2 యాత్ర ప్రేరణ

4.3 యాత్రా ప్రయోజనం

4.4 యాత్రికుని లక్షణాలు

4.5 యాత్రల వర్గీకరణ

4.6 నేను చూసిన మారిషస్

4.6.1 భౌగోళిక స్వరూపం

4.6.2 భాష

4.6.3 ఆచార వ్యవహారాలు

4.6.4 ఆహారపు అలవాట్లు

4.6.5 వింతలు విశేషాలు

4.6.6 అంతర్జాతీయ సదస్సు విశేషాలు

4.7 నా సైప్రస్ యాత్ర

4.7.1 దుబాయ్ విశేషాలు

4.7.2 సైప్రస్ భౌగోళిక స్వరూపం

4.7.3 సైప్రస్ – సందర్శనా స్థలాలు

4.7.4 కాన్ఫరెన్స్ విశేషాలు

4.7.5 కవి హృదయం

4.8 అమెరికాలో తెలుగు యాత్ర

4.8.1 అమెరికన్ల మనస్తత్వం

4.8.2 అమెరికా విశేషాలు

4.8.3 అమెరికా రోడ్డు వ్యవస్థ

4.8.4 అమెరికా సందర్శన స్థలాలు

4.8.5 అమెరికాలో తెలుగు అభివృద్ధి – తెలుగు వారి కృషి

4.9 ఇంగ్లండ్ లో ఇరవై ఐదు రోజులు

4.9.1 రోడ్డు వ్యవస్థ

4.9.2 ఇంగ్లండ్ ప్రజల మనస్తత్వం

4.9.3 ఇంగ్లండ్ రచయితలు

4.9.4 వింతలు విశేషాలు

4.9.5 ఆక్స్ ఫర్డ్ – ఆణిముత్యాలు

4.10 జర్మనీలో కవితా యాత్ర

4.10.1 బెర్లిన్ నగర విశేషాలు

4.10.2 హ్యాంబర్గ్ నగర విశేషాలు

అధ్యాయం – 5

విమర్శకుడిగా గోపి 150–190

5.1 విమర్శ – నిర్వచనం

5.2 విమర్శకుడి లక్షణాలు

5.3 నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం

5.4 గవాక్షం

5.5 సాలోచన

5.6 వ్యాస కలశం

అధ్యాయం – 6

పరిశోధకుడిగా గోపి 191–239

6.1 పరిశోధన – వివరణ

6.2 ప్రజాకవి వేమన

6.3 వ్యాస నవమి

6.4 వేమన పద్యాలు పారిస్ ప్రతి

6.5 ఇతరాలు

6.5.1 అక్షరయానం (కాలమ్స్)

6.5.2 జ్ఞానదేవుడు (అనువాదం)

6.5.3 వ్యాఖ్యాత

ముగింపు 240–244

అనుబంధం 245–249

పరిశోధన ప్రధాన ఆకరాలు 250–251

ఉపయుక్త గ్రంథసూచి 252–255

పరిశోధన పరిధి:

డా. ఎన్. గోపి 1967 నుండి 2009 వరకు రాసిన కవిత్వాన్ని మూడు సంపుటాలుగా వేశారు. గోపి కవిత్వం – I (తంగెడుపూలు, మైలురాయి, చిత్రదీపాలు, వంతెన, కాలాన్ని నిద్రపోనివ్వను), గోపి కవిత్వం – II (నానీలు, చుట్టకుదురు, ఎండిపోద, గోపినానీలు, జలగీతం), గోపి కవిత్వం – III (మరో ఆకాశం, అక్షరాల్లో దగ్ధమై, దీపం ఒక ఏకాంతం, గోవాలో సముద్రం, వాన కడిగిన చీకటి) ఇవే కాకుండా మా ఊరు మహాకావ్యం (2010), రాతికెరటాలు (2011), హృదయరశ్మి (2013), మళ్లీ విత్తనంలోకి (2014), పురి విప్పిన ఊపిరి (2015), మొత్తం 20 కవిత్వ సంపుటాల నుండి కొన్ని కవితలను తీసుకొని వస్తు వైవిధ్యాన్ని పరిశీలించాను. అట్లాగే వారు రాసిన విమర్శ, పరిశోధన గ్రంథాలను పరిశీలించాను. ఆయన రాసిన కాలమ్స్, వ్యాఖ్యానాలు, అనువాదాలను గురించి విశ్లేషణ చేసి పరిశీలించాను.

పరిశోధన లక్ష్యం:

ఈ పరిశోధనలో గోపి కవిత్వాన్ని వివిధ కోణాలలో పరిశీలించి, పాఠకులకు సమాజం పట్ల అవగాహనను పెంచే విధంగా విభజనను చేయడం జరిగింది. మనిషి యంత్రంగా మారిన నేటి ఆధునిక సమాజానికి కావలసిన మానవతా విలువలను పరిశీలించడం జరిగింది. మనుషుల మధ్య, మనసుల మధ్య దూరాలు తగ్గిపోయి ప్రేమ, ఆప్యాయతలు, అనుబంధాలు వెల్లివిరియాలన్న ఆకాంక్ష ఈయన కవిత్వంలో కనిపించింది. కవి ఏ వస్తువును తీసుకున్నా చివరకు దానిలో మానవత్వ కోణాన్నే ఆవిష్కరించారు. ప్రపంచీకరణ నేటి సమాజాన్ని ఏ విధంగా చిన్నాభిన్నం చేసిందో కొన్ని కవితలలో విశ్లేషించడం జరిగింది. మొత్తంగా మానవీయ దృక్పథం గల ఈయన పోకడ చైతన్యవంతమైన సమాజాన్ని నిర్మించాలనే ఆరాటం, మానవ జీవితాల్లోని సంఘర్షణలు, జీవన వాస్తవికతను ప్రతిబింబించే ఎన్నో విషయాలను ఈయన కవిత్వంలో విశ్లేషించిన తీరును వివరించాను. అలాగే వేమనపై చేసిన పరిశోధన వల్ల వేమనను ఎవరూ దర్శించని వివిధ కోణాలను తెలుసుకునే అవకాశం కలిగింది. గోపి రాసిన కాలమ్స్, వేమనపై రాసిన

వివిధ వ్యాసాలు, వేమన పద్యాల వ్యాఖ్యానాలు నేటి సమాజానికి ఎంతో ఉపయోగపడుతాయనడంలో సందేహం లేదు.

సిద్ధాంత సార సంగ్రహం:

శ్రీశ్రీ అన్నట్లు గొప్ప కవిత్వం అంటే సైజూ, బరువూ క్రైటీరియా కావు, తిలక్ చెప్పినట్టు అంతరాంతర జ్యోతి స్సీమల్ని వెలిగించాలి. చలం చెప్పినట్లు రాసేటప్పుడు మన శ్వాస ఇబ్బంది పడాలి, శక్తం పొంగాలి. అంతేగాని గంటూరు శేషేంద్రశర్మ అన్నట్లు ''కాగితమూ కలమూ పుచ్చుకొని పోలీస్ కేసుల్లా బనాయించి చేసిన రచనలు చేస్తే కవితలు కాలేవు''. (పేజి –32, కవిసేవ మేనిఫెస్టో) ఇలాంటి వాటికి అతీతంగా గోపి కవిత్వం మనకు కన్పిస్తుంది. గోపి దృష్టిలో కవిత్వమంటే అర్థమయినట్టే అనిపించి బోధపడని బాధాతప్త రహస్య సృష్టి సంగీతం. ఆర్ద్రత లేకుండా ఉంటే అది కవిత్వం కానట్టేనని, జీవగతికీ మనసిక స్థితికీ మధ్య రహస్యతీరం చేరడమే కవిత్వం అనీ, కవిత్వం దేనికీ నిర్ధారణ కాదు, అదొక నిరంతరస్వప్నం అన్నా, చివరకు ప్రజలకన్నా నా కవిత్వం గొప్పదేం కాదంటారు గోపి. ఇది నిజం.

సమాజ ప్రతిబింబమే కవిత్వమైనప్పుడు సమాజానికీ, సాహిత్యానికీ అవినాభావ సంబంధం ఉన్నప్పుడు, సామాజిక చైతన్యాన్ని కలిగించడమే కవిత్వ లక్ష్యం. కవులు తమకు కావలసిన వస్తువును తీసుకుంటారు. తిరిగి ఆ సమాజాన్నే చైతన్య పరుస్తారు. ప్రతి కవికీ తనకంటూ ఒక దృక్పథం ఉంటుంది. అది ఏర్పడడానికి ఏదో ఒక బలమైన కారనం ఉండి తీరుతుంది.

డా. ఎన్. గోపి కూడా వెనుకబడ్డ తెలంగాణ ప్రాంతం నుండి వచ్చినవాడే కాబట్టి, ఇక్కడి ప్రజల ఆర్తి, ఆవేదన, ఆక్రోశం, సంఘర్షణ, వ్యథలు, కష్టాలు, కన్నీళ్లు, బాధలు, పల్లెవాసనలు, మట్టిమనుషులపై ఉన్న ప్రేమ, వారి అమాయకత్వం, మనుషుల మీద ఉన్న నమ్మకం మొదలైన వాటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని అర్ద్రతతో, ఆవేదనతో రాసిన కవిత్వం మనకు కనిపిస్తుంది. ఇలా ఏ అంశాన్ని గురించి వర్ణించినా చివరగా మానవత్వమే ఆయన

మతంగా నిలిచింది. మనిషిపట్ల ప్రేమ, సమాజం పట్ల బాధ్యతతో భవిష్యత్ ప్రపంచాన్ని మర్చుకోవడమే కవిత్వ లక్షణం. కాబట్టే ఇలాంటి వైవిధ్యమున్న గోపి సాహిత్యాన్ని నా పరిశోధనాంశంగా తీసుకోవడం జరిగింది.

''ఎన్. గోపి సాహిత్యం వస్తురూప వివేచన'' అనే నా పరిశోధనాంశాన్ని మొత్తం ఆరు అధ్యాయాలుగా విభజించాను. మొదటి అధ్యాయం 'ఎన్. గోపి – జీవిత రేఖలు' లో గోపి కుటుంబ నేపథ్యం, ఆయన విద్యాభ్యాసం, వివాహ జీవితం, ఉద్యోగ జీవితం, ఆయనను కవిగా ప్రభావితం చేసిన వ్యక్తులు, అంశాలను, ఆయన రచనలను, ఆయన రచనలు వివిధ భాషల్లోకి వెళ్ళిన అనువాదాలను, వీరు పొందిన అవార్డులు, పురస్కారాలను గురించి పేర్కొనడం జరిగింది.

రెండవ అధ్యాయం ''గోపి కవిత్వం వస్తు రూప వైవిధ్య పరిణామం''. ఇందులో వస్తువు అంటే ఏమిటి, వస్తు లక్షణాలు, రూపం, రూప లక్షణాలు, శిల్పం, శైలి, ప్రతీక, భావచిత్రం వంటి వాటి వివరాలను పరిచయం చేస్తూ, ఆధునిక తెలుగు కవిత్వ పరిణామ వికాసాలను తెలియజేశాను. ఇందులో భాగంగా భావ, అభ్యుదయ, దిగంబర, స్త్రీ వాద, విప్లవ, దళిత కవిత్వాలను చర్చించడం జరిగింది. ఈ అధ్యాయంలో అంతర్భాగంగా గోపి కవిత్వాన్ని విభజించి చూపాను. అందులో మానవతావాద కవిత్వం, స్మృతి కవిత్వం, వస్తు కవిత్వం, కవిత్వంపై కవిత్వం, తెలంగాణ ప్రాంతీయ కవిత్వం, ప్రకృతి కవిత్వం, ప్రపంచీకరణ కవిత్వం, అనుభూతి కవిత్వాలుగా విభజించాను. ఇంకా ఎన్నో రకాలుగా విభజనను చెప్పవచ్చు. కానీ స్థల, కాల ప్రభావం కారణంగా మినహాయింపునిచ్చాను. ఈ అధ్యాయంలో చివరగా జలగీతం దీర్ఘకావ్యాన్ని గురించి వివరించడం జరిగింది.

మూడవ అధ్యాయం ''నానీలు – వస్తు విశ్లేషణ ఒక విశిష్ట ప్రయోగం''. ఇందులో నానీల ఆవిర్భావం, నానీ రూపం, నానీల పాద నియమం, నానీల విశిష్టతను చెప్తూనే మినీ, హైకూల పరిచయం చేశాను. నానీల పరిశీలనలో భాగంగా మానవ సంబంధాలు, ప్రపంచీకరణ, ఆశ, నిరాశ, ప్రాంతీయత, కులం, రాజకీయం, స్త్రీ ల గురించి, వర్షపు

నానీలు, ప్రకృతి/పచ్చదనం గురించి, శాంతి, తాత్వికత, కవిత్వంపై చెప్పిన నానీలు, ఉద్యమ, అభ్యుదయ నానీలు, అమ్మపై చెప్పిన నానీలు వంటి విభజన చేశాను. ఈ నానీలు రెండు సంపుటాలుగా వెలువడ్డాయి. ఈ సంపుటాలలో కవి స్పృశించని అంశమంటూ లేదు అని చెప్పవచ్చు.

నాలుగవ అధ్యాయం ''యాత్రా చరిత్ర కారుడిగా గోపి'' లో మొదటగా శబ్దరత్నాకరం, బ్రౌణ్య నిఘంటువు, సూర్య రాయంధ్ర నిఘంటువులు యాత్రకు చెప్పిన అర్థాలను చెప్పడం జరిగింది. యాత్రలకు ప్రేరణ, యాత్ర ప్రయోజనం, యాత్రకుని లక్షణాలు, యాత్రల వర్గీకరణను చెప్తూ లక్ష్యాన్ని బట్టి చేసే యాత్రలు, గమన విధానాన్ని బట్టి, కాల క్రమాన్ని బట్టి యాత్రలను వర్గీకరించిన విషయాన్ని చెప్పడం జరిగింది. రచయిత చేసిన యాత్రల్లో భాగంగా నేను చూసిన మారిషస్, నాసైప్రస్ యాత్ర, అమెరికాలో తెలుగు యాత్ర, ఇంగ్లండ్ లో ఇరవై ఐదురోజులు, జర్మనీలో కవితా యాత్ర వంటి యాత్రలలోని విశేషాలను వాటి భౌగోళిక స్వరూపాలను, ఆయా దేశాల వారి ఆచార వ్యవహారాలు, వారి ఆహారపు అలవాట్లు అక్కడి సందర్శనా స్థలాలు వంటి మొదలైన విషయాలను పేర్కొనడం జరిగింది. యాత్రల వల్ల వివిధ దేశాల చరిత్రలు, వారి సంస్కృతీ సంప్రదాయాలు మొదలైన విషయాలు తెలుస్తాయి.

అయిదో అధ్యాయం 'విమర్శకుడిగా గోపి'లో విమర్శ అంటే ఏమిటి, విమర్శకుడి లక్షణాలను చెప్పి గోపి రాసిన విమర్శ గ్రంథాలు గవాక్షం, నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం, సాలోచన (పీఠికలు), వ్యాసకలశం వంటి గ్రంథాలను, వాటిలోని విషయాలను సవిమర్శకంగా పరిశీలించడం జరిగింది. ఇందులో సాలోచనలు (పీఠికలలో) వివిధ కవులు రాసిన కవితా సంపుటి పుస్తకాలకు, పరిశోధనా గ్రంథాలకు రాసిన పీఠికలలో గోపి ఆయా కవులు, రచయితలకు సహృదయంతో చేసిన సలహాలు, సూచనలు ఎన్నో మనకు కనిపిస్తాయి.

ఆరవ అధ్యాయం 'పరిశోధకుడిగా గోపి'. ఇందులో భాగంగా పరిశోధన అంటే ఏమిటనే విషయాన్ని చెప్తూ, గోపి రాసిన పరిశోధన గ్రంథాలు ప్రజాకవి వేమన సిద్ధాంత గ్రంథం, వ్యాసనవమి, వేమన పద్యాల పారిస్ ప్రతిని గురించి పరిశీలించడం జరిగింది.

చివరగా ఇతరాలు అన్న విభజనలో వ్యాఖ్యాతగా గోపి చేసిన వేమన్నవాదం, వేమన్న వెలుగులు గ్రంథం వ్యాఖ్యానాల విషయాలను సూక్ష్మంగా చెప్పడం జరిగింది. గోపి అనువాదాలలో ఒకటైన జ్ఞానదేవుడు గురించి చర్చించడం జరిగింది. అక్షరయానం పేరుతో రాసిన కాలమ్స్ లోని విషయాల గురించి అందులో భాగంగా తెలుగు భాష గురించి రాసిన దాదాపు పది వ్యాసాలలో ప్రస్తుత కాలంలో తెలుగు భాషకు తగ్గుతున్న ప్రాధాన్యతను, తెలుగు చదివిన వారికి ఉపాధి అవకాశాలు లేని పరిస్థితులను, తెలుగు భాషను మెరుగు పరచడానికి చేసిన సూచనలను పేర్కొనడం జరిగింది. కూచిపూడి, హరికథ, సురభి నాటక సమాజం, తోలుబొమ్మలు, లలిత సంగీతం, జానపద కళలపై రాసిన వ్యాసాలలో ఆయా కళల ప్రధాన్యతను, అవి అంతరించిపోతున్న వైనాన్ని, వాటిని బ్రతికించుకోవాల్సిన అవసరాలను ఈ సమాజానికి అవి ఎంతో అవసరముందన్న విషయాలను విశ్లేషించాను. చివరగా అనుబంధంలో రచయితతో వివిధ అంశాలపై జరిపిన ముఖాముఖిని పొందుపరిచాను.

గోపి కవిత్వంలో కలలూ, కన్నీళ్ళూ, బాధలు, ఆర్తి, ఆవేదనలు ఎన్నో ఉంటాయి. అందుకే ''కలలూ కన్నీళ్ళూ / సకల సంవేదనలు / అన్నిటినీ దోసిలి పట్టిన / మట్టిగిన్నె నా కలం'' (మా వూరు మహాకావ్యం, పేజి–28) అంటారు. ఇలా అనడంలో కవికి గల సామాజిక బాధ్యత అర్థం అవుతుంది. సమాజంలోని పీడిత వర్గాలు, బాధిత ప్రజల గురించి రాసే కవికి సామాజిక బాధ్యత ఉంటుంది. అంతేగాని ''కవిత్వమంటే / పురాణేతిహాసాల నుండి పిండిన / పుక్కిటి పురాణాలు కాదు / మేథోమథనం కాదు / సారం లేని శబ్ద విహారం కాదు.'' (మళ్లీ విత్తనంలోకి, పేజి–88) అంటారు. గోపి కవిత్వంలో వస్తువు సామాన్యుడే. సగటు మనిషి కష్టనష్టాలు, బాధలు, దుఃఖాలు, వారి ఆకలి బాధలనే కవిత్వంలో వస్తువులుగా తీసుకున్నారు. జీవితంలోని వైవిధ్యాన్నంతా కవితా వస్తువులుగా

చేసుకొని రాసిన కవిత్వమే కనిపిస్తుంది. సామాజిక వస్తువు, ఆధునిక ప్రక్రియ, రచనలో నిజాయితీ, పీడితుల పక్షాన ఉండే కవిత్వం, సామాన్యులకు కూడా అర్థమయ్యే పదాలను కవిత్వంలో ప్రయోగించడం వంటివన్నీ ఉన్న కవిత్వం ఉత్తమ కవిత్వమవుతుంది. ఇలాంటి కవిత్వం ఛాయలు మనకు గోపిగారిలో కనిపిస్తాయి. నేటి ఉరుకులు పరుగుల జీవితంలో కవిత్వాన్ని ఆస్వాదించేవారు తక్కువయ్యారు. కథలు, నవలలు చదివే ఓపిక తీరిక ప్రజలకు లేదు. ఇలాంటి సందర్భంలో గోపి నానీలు వెలువడ్డాయి. అవి పరిమాణంలో చిన్నగా ఉండడంతో పాఠకులు కూడా చదవడానికి ఇష్టపడ్డారు. కాబట్టే అవి అంతగా జనాల్లోకి వెళ్లాయి. ఏది ఏమైన కవిత్వం సమాజ ప్రతిబింబం. సమాజంలోని మనుష్యులు, వారి వ్యక్తిత్వాలే కవిత్వంలో ప్రతిఫలిస్తాయి. కాబట్టి సమాజాన్ని ప్రభావితం చేయడంలో, చైతన్య పరచడంలో, ప్రజలలో మార్పు తీసుకురావడానికి, సమాజ శ్రేయస్సుకు కవిత్వం తోడ్పడుతుందనడంలో సందేహం లేదు.

ఈ విధంగా కవిగా, యాత్రా చరిత్రాకారుడిగా, నానీల సృష్టికర్తగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా, వ్యాఖ్యాతగా, కాలమ్స్ రచయితగా, అనువాదకుడిగా గోపిలోని విభిన్న కోణాలను దర్శించే అవకాశం ఈ పరిశోధన ద్వారా కలిగింది. నిరంతర కృషి, తపనతో అధ్యాపకుడిగా, పరిపాలకుడిగా ఉంటూనే ఆయన ఎన్నో రచనలు చేయడం అనుసరణీయం. అభినందనీయం.

పరిశోధన ప్రధాన ఆకరాలు

1. డా|| గోపి, ఎన్ – 1980, వేమన్నవాదం, హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
2. డా|| గోపి, ఎన్ – 1983, జ్ఞానదేవుడు (అనువాదం), సాహిత్య అకాడమి.
3. డా|| గోపి, ఎన్ – 1986, వ్యాసనవమి, చైతన్య పబ్లికేషన్స్, హైదరాబాద్.
4. డా|| గోపి, ఎన్ – 1990, వేమనపద్యాల పారిస్ ప్రతి, చైతన్య ప్రచురణలు, హైదరాబాద్
5. డా|| గోపి, ఎన్ – 1991, ప్రజాకవి వేమన
6. డా|| గోపి, ఎన్ – 1991, నిలువెత్తు తెలుగు సంతకం సినారె వ్యక్తిత్వం, హృదయ భారతి ప్రచురణలు, హైదరాబాద్.
7. డా|| గోపి, ఎన్ – 1995, గవాక్షం, చైతన్య ప్రచురణలు, హైదరాబాద్.
8. డా|| గోపి, ఎన్ – 1996, నేను చూసిన మారిషస్, రచన ప్రచురణలు, హైదరాబాద్
9. డా|| గోపి, ఎన్ – 1998, సాలోచన, చైతన్య ప్రచురణలు, హైదరాబాద్
10. డా|| గోపి, ఎన్ – 2001, నా సైప్రస్ యాత్ర, చైతన్య ప్రచురణలు, హైదరాబాద్
11. డా|| గోపి, ఎన్ – 2002, అమెరికాలో తెలుగు యాత్ర, చైతన్య ప్రచురణలు, హైదరాబాద్
12. డా|| గోపి, ఎన్ – 2004, ఇంగ్లండ్ లో ఇరవై ఐదు రోజులు, జిష్ణు ప్రచురణలు, హైదరాబాద్
13. డా|| గోపి, ఎన్ – 2005, అక్షరయానం, తేజ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్
14. డా|| గోపి, ఎన్ – 2010, గోపి కవిత్వం–I, , అభవ్ ప్రచురణలు, హైదరాబాద్
15. డా|| గోపి, ఎన్ – 2010, గోపి కవిత్వం–II, , అభవ్ ప్రచురణలు, హైదరాబాద్
16. డా|| గోపి, ఎన్ – 2010, గోపి కవిత్వం–III, , అభవ్ ప్రచురణలు, హైదరాబాద్

17. డా|| గోపి, ఎన్ – 2010, మా ఊరు మహాకావ్యం, అభవ్ ప్రచురణలు, హైదరాబాద్

18. డా|| గోపి, ఎన్ – 2011, రాతికెరటాలు, అభవ్ ప్రచురణలు, హైదరాబాద్

19. డా|| గోపి, ఎన్ – 2012, వేమన్న వెలుగులు, శాంతా వసంతా ట్రస్ట్ ప్రచురణలు, హైదరాబాద్

20. డా|| గోపి, ఎన్ – 2012, వ్యాస కలశం, అభవ్ ప్రచురణలు, హైదరాబాద్

21. డా|| గోపి, ఎన్ – 2013, హృదయ రశ్మి, అభవ్ ప్రచురణలు, హైదరాబాద్

22. డా|| గోపి, ఎన్ – 2014, మళ్ళీ విత్తనంలోకి, అభవ్ ప్రచురణలు, హైదరాబాద్

23. డా|| గోపి, ఎన్ – 2015, జర్మనీలో కవితా యాత్ర, అభవ్ ప్రచురణలు, హైదరాబాద్

24. డా|| గోపి, ఎన్ – 2015, పురి విప్పిన ఊపిరి, అభవ్ ప్రచురణలు, హైదరాబాద్

★★★

ఉపయుక్త గ్రంథసూచి

1. అరుణ కుమారి, జి–1989, ఆధునిక తెలుగు కవిత్వంలో మాతనవతావాదం – విభిన్న ధోరణులు, ఎ.వి. ప్రింటర్స్, హైదరాబాద్.
2. అరుణ, ఎస్. సంపాదకురాలు–2008, జలదీపిక, జిష్ణు ప్రచురణలు, హైదరాబాద్.
3. ఆరుద్ర–2004, సమగ్రాంధ్ర సాహిత్యం(నాలుగవ సంపుటి) తెలుగు అకాడమి, హైదరాబాద్.
4. చంద్రశేఖరరెడ్డి, డి. 2001, సంహిత (సాహిత్య వ్యాసాలు), మీడియా హౌస్ పబ్లికేషన్స్.
5. చంద్రిక, ఎం.–1987, మినీ కవిత్వ నిర్మాణ శిల్పం–భావాభివ్యక్తి, రాజేశ్వరి ప్రింటర్స్, హైదరాబాద్.
6. జగన్నాథం, పేర్వారం, సంపాదకులు–1987, అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు, సాహితి ప్రచురణ, హన్మకొండ.
7. తెలుగులో వ్యాఖ్యాన సంప్రదాయం ఉత్పత్తి వికాసాలు (పిహెచ్.డి.)–1998, హైదారాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
8. ధనంజయ్, యం.–2005, ఎన్.గోపి, జలగీతం. వైజ్ఞానిక, మానవీయ, తాత్విక దర్శనం, శీతల్ పబ్లిషర్స్, హైదరాబాద్.
9. నరసింహమూర్తి, యు.ఎ.–2014, తెలుగు వచన శైలి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ప్రచురణ.
10. నారాయణరావు, వేల్చేరు–2008, తెలుగులో కవితా విప్లవాల స్వరూపం, తానా ప్రచురణలు.
11. నారాయణరెడ్డి, సి.–2007, ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయములు – ప్రయోగములు, శ్రీ కళాంజలి గ్రాఫిక్స్, హైదరాబాద్.
12. మధుసూధనరావు, త్రిపురనేని–1997, సాహిత్యంలో వస్తు శిల్పాలు, పరస్పెక్టివ్ పబ్లిషర్స్, హైదరాబాద్.

13. మూల్యాంకనం–(గత శతాబ్ది సాహిత్యావలోకనం)–2003.
14. యాదగిరి, కె. సంపాదకులు–2003, తెలుగులో కవిత్వోద్యమాలు, తెలుగు అకాడమి, హైదరాబాద్.
15. రంగనాథాచార్యులు, కె.కె.– సంపాదకుడు–1982, ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, పద్మావతీ ఆర్ట్ క్రియేషన్స్, హైదరాబాద్.
16. రఘు, ఎస్. సంపాదకులు–2006, గోపి నానీలు–సంవీక్షణం, మనస్వి ప్రచురణలు, ఖమ్మం.
17. రఘురామ్, మద్దాళి, సంపాదకులు–2009, తెలుగు భాషా వైభవం, కిన్నెర పబ్లిషర్స్, హైదరాబాద్.
18. రఘురామ్, మద్దాళి, సంపాదకులు–2010, (గోపి షష్ఠిపూర్తి అభినందన సంచిక), కిన్నెర ఆర్ట్ థియేటర్స్, హైదరాబాద్.
19. రవికుమార్, గట్ల–2011, గోపి కవిత – మానవత, అన్నపూర్ణ ప్రచురణలు, హైదరాబాద్.
20. రవీందర్, పసునూరి–2006, ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు సాహిత్య విమర్శ – ఒక పరిశీలన (ఎం.ఫిల్) హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
21. రామమోహనరావు, అద్దేపల్లి–1998, అద్దేపల్లి సాహిత్య వ్యాసాలు–1, పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ–2.
22. రామమోహనరావు, అద్దేపల్లి–2000, అభ్యుదయ విప్లవ కవిత్వాలు సిద్ధాంతాలు – శిల్పరీతులు, రాంషా శిరిష పబ్లికేషన్స్, సామర్లకోట.
23. రామారావు, ఎస్వీ–2007, తెలుగు సాహిత్య విమర్శ, కళా ప్రింటర్స్, హైదరాబాద్.
24. రామారావు, చేకూరి–2002, సాహిత్య కిర్మీరం (వ్యాస సంకలనం) చరిత్ర గ్రాఫిక్స్, చిక్కడపల్లి, హైదరాబాద్.
25. రాములు, పిల్లలమర్రి–1999, తెలుగులో భక్తి కవిత్వం – సామాజిక విశ్లేషణ, హైదరాబాద్.

26. వసునందన్, రావికంటి-1990, ఆధునికాంధ్ర కవిత్వంలో మానవతావాదం, విశ్వంభర విలక్షణత, మాస్టర్ ప్రింట్స్, హైదరాబాద్.

27. వీరభద్రయ్య, ఎం-1998, ఆధునిక సాహిత్యం, వస్తు రూప వివేచన, హైదరాబాద్.

28. వీరభద్రయ్య, ఎం – సాహిత్య విమర్శ ఆలోచన, ఆలోకన.

29. వీరభద్రయ్య, ముదిగొండ-1998, సాహితీ విమర్శ సూత్రం-అన్వయం, పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ-2.

30. వెంకటేశ్వర్లు, లంకా-2005, సమకాలీన కవిత్వంలో ప్రతీకలు-భావచిత్రాలు, విప్ల కంప్యూటర్ సర్వీసెస్, హైదరాబాద్.

31. శరత్ జ్యోత్స్నారాణి, ఎస్-2003, స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత వస్తువు, రూపం, శిల్పం, జ్యోత్స్న కళాపీఠ ప్రచురణలు, హైదరబాద్.

32. శేషేంద్రశర్మ, గుంటూరు -2009, కవిసేన మేనిఫెస్టో (ఆధునిక కావ్య శాస్త్రము). ఆకృతి ఆఫ్ సెట్ ప్రింటర్స్.

33. సిధారెడ్డి, నందిని – 1988, ఆధునిక తెలుగు కవిత్వం – వాస్తవికత – అధివాస్తవికత, తెలుగు పరిశోధన ప్రచురణలు, హైదరాబాద్.

34. సుజాత శేఖర్, బండారు -2005, తెలంగాణా బతుకమ్మ పాటలు, పౌరాణిక, సామాజిక, సాంస్కృతిక భాషా పరిశీలన పరిశోధనావ్యాసం, తిరుమల గ్రాఫిక్స్, హైదరాబాద్.

35. సుబ్రహ్మణ్యం, జి.వి. -2002, సాహిత్యంలో చర్చనీయాంశాలు, తెలుగు అకాడమి, హైదరాబాద్.

36. సురేష్ -2005, గోపినానీలు వస్తురూప వివేచన (ఎం.ఫిల్) హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

37. హిమజ్వాల -2005, తెలంగాణా పల్లె (నానీలు).

నిఘంటువులు:

1. బ్రౌణ్య తెలుగు – ఇంగ్లీష్ నిఘంటువు.
2. శబ్దరత్నాకరం – బహుజనపల్లి సీతారామాచార్యులు.
3. సూర్యరాయాంధ్ర నిఘంటువు (ఆరవ సంపుటి)

వివిధ పత్రికా వ్యాసాలు:

1. మన్నం కృష్ణమూర్తి ఈనాడు వ్యాసం (31, ఆగస్టు, 2014).
2. సాహిత్య ప్రస్థానం (మాస పత్రిక) జులై, 2012 , సంపాదకుడు – తెలక పల్లి రవి.

★★★

Signature of the Researcher
Sri Latha

Signature of the Supervisor
Prof. S. Saratjyothsna Rani

★★★